
MSP01A143



# శిలాక్షరం

## బి.ఎన్. శాస్త్రి సాహిత్యం - సమాలోచన

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

C1


# SISTER NIVEDITA SCHOOL

Estd:1989

CBSE - New Generation School

THE PLAY SCHOOL®

Kindergarten Wing of SNS

(CBSE Affiliation Code:3630040)

D.K.Road, AMEERPET, Hyderabad-500 016. Ph.: 040-2373 1518, 2375 1518, 80967 38855
E-mail: contact@snschool.com, snschoolamp@gmail.com

## BELIEVE IN MAN-MAKING



**Sister Nivedita School** focuses on all round development of students by balancing scholastic and co-scholastic domains. In pursuit of academic excellence, the school does not negate the lateral talents of students thereby emphasizing on

- Rightly directed opportunities beyond curriculum
- Strong sense of community service
- Distinctive values and morals that the school fosters
- Promoting leadership skills
- Character development is vital to good education







### Pre-Primary, Primary Classes

- Optimum class strength
- Colourful classrooms - a world of their own
- Child - friendly teaching by skilled teachers
- Safe educational toys to stimulate learning
- Activities include vocabulary enrichment, life skills, story telling and acting
- One-to-one attention
- Physical exercises, dance, singing, aerobics and field trips
- Regular Parent - Teacher interaction.

### Middle & High School Classes

- Optimum class strength
- Well-trained teachers
- State-of-the-art AV hall, Computer lab, Maths lab and Language labs
- Well stacked Library
- Monthly Parent-Teacher interaction
- A good ground of teaching for preparation of common entrance tests & competitive exams like JEE, NEET, NTSE etc.
- Yoga and Meditation for Physical, Mental & Intellectual growth
- Students motivated for extra-curricular activities










*For your Child's Bright Future..*

MSP01 A143

# శిలాక్షరం

## బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన



సంపాదకులు

**డా. భిన్నూరి మనోహరి**

సహ సంపాదకులు

**అట్టెం దత్తయ్య**

మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
హైదరాబాదు. డిసెంబర్ 2019

**SHILAKSHARAM**

***Essays on B.N.Sastry's books***


| | | |
|---|---|---|
| Editor | : | **Dr. Bhinnuri Manohari** |
| Associate Editor | : | **Attem Dattaiah** |
| First Published | : | December, 2019 |
| Copy Rights | : | Editor |
| Layout, Composing | : | ***Kavyasree Graphics***<br>Bathukamma kunta. |
| Cover Designing | : | **Dr. Pathipaka Mohan** |
| Cover Make-up | : | **Gopi Puranik**<br>Anand Printers, Kachiguda<br>Hyderabad. Ph. 9848577673 |
| For Copies | : | **Musi Monthly Magazine**<br>2-2-1109 / BK - LIG 10,<br>Bathukamma Kunta, Bagh Amberpet<br>Hyderabad - 500 013.<br>Ph : 934 797 1177 |
| ISBN | : | |
| Price | : | Rs. 300 /- |
| Printed at | : | **Sri Sai Process**<br>Narayanguda, Hyderbad.<br>Ph : 040 - 2756 3075 |

## దర్శనం

పరిశోధనే ఊపిరిగా శ్వాసించి – పరిశోధనలోనే జీవించిన యశ:కాముల పరంపరలో గణనీయులైనవారు భిన్నూరి నరసింహ శాస్త్రి గారు. తన జీవిత కాలాన్ని ప్రతిక్షణం విద్య, పరిశోధనలకే అర్పణం చేసి క్రొవ్వొత్తి వంటి జీవితాన్ని గడిపిన అబాల్య పరిశోధక మూర్తి – ఉన్నత విద్యా రంగంలో తన గురువులు – చరిత్ర – సాహిత్య – పరిశోధనల్లో మార్గదర్శకులైన ఆచార్య ఖండవల్లి వారు. ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి మహనీయుల కృపాపాత్రుడై – ఆత్మీయునిగా కాలం గడిపిన రోజులే కాదు – అనంతర కాలంలోనూ నిరంతరం వారిని గుర్తు చేస్తూ – 'మాస్టార్లు' అని ఎంతో ఉద్విగ్న భావనాలహరిలో తేలియాడుతూ తన విద్యార్థి నాటి విషయ పరంపరలను ఎంతో గొప్పగా చెబుతూ – **'గురువంటే మా లక్ష్మీరంజనం సారే'** తరువాతనే మిగతా వాళ్ళు అని సభల్లో కూడా ధైర్యంగా తెలిపే మనీషావంతుడు మన శాస్త్రిగారు. చరిత్ర – శాసన – పరిశోధనా రంగాల్లో మౌలిక పరిశోధనలు సల్పి మన దేశానికి గొప్ప సాహిత్య సంపదనిచ్చి పోయిన కొమర్రాజు వంటి ప్రాత:స్మరణీయులను అనుక్షణం స్మరించు కుంటూ వారిని గూర్చిన ఎన్నో విషయాలను సహచరులకు, సన్నిహితులకు ఎంత గొప్పగా చెప్పేవారో! అవన్నీ మననం చేసుకుంటే శరీరం జలదరిస్తుంది.

పాఠశాల విద్య పూర్తి కాగానే రజాకార్ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొని అలుపెరుగని జీవనంలో రహస్య జీవిత గమనంలో ఆనాడు ఆయన పడిన బాధల ప్రతిరూపం కొంత చిత్రణ చేసిందే వీరి 'విప్లవజ్వాల' నవల. అనంతర కాలంలో అధ్యాపకుడై, ఉన్నత విద్యాభ్యాసనం చేస్తూ – కుటుంబ పోషణ కొరకు 'నౌకరీ' ముఖ్యంగా భావించిన శాస్త్రిగారి ధిషణ అంతా మన తెలంగాణ చరిత్ర – సంస్కృతి – శాసనాలు –దేవాలయాది విషయాల గూర్చి మననం చేసుకోవడం వల్ల – దాని ఫలంగా ఇంత చరిత్ర – ఇన్ని శాసనాలు – ఈ సర్వస్వాలు – ఇతర సాహిత్యం – మన దేశానికి లభించిందనటంలో అతిశయోక్తి లేదు.

బి.ఎన్.శాస్త్రిగారు డాక్టర్ కాని డాక్టర్. ఎందరెందరి డాక్టరేట్‌లకో ఆమెతగా నిల్చినాడు, యథార్థంగా – మన తెలంగాణయే కాదు – యావదాంధ్ర దేశంలోని ప్రతీ గ్రామం – ప్రతీ పల్లె – దాని ప్రాధాన్యాలతో పాటు అక్కడ ఆ ప్రాంతంలో ఉన్న ఎందరెందరి పేర్లో ఆయన మస్తిష్కంలో స్థిర నివాసం ఏర్పరచుకోవడం ఆశ్చర్యమనిపిస్తుంది. ఈ విధంగా ఏర్పడ్డ సంబంధ – స్నేహ పరంపరల ఫలమే కావచ్చు వారి శాసన పరిశోధన – సర్వస్వ రచనలకొక ప్రోత్సాహం కలిగించింది. లేకుంటే మారుమూలల్లో ఉన్న ఎన్నో విషయాలను తెలుసుకోగలుగుతారు. **'కోశమైనా చూడు – దేశమైనా చూడు'** అనేది మన పెద్దల సూక్తి. మా శాస్త్రిగారు ఈ రెండూ అనుభవించినారు. అంతేకాదు,

**"ఉద్యమ: సాహసం ధైర్యం బుద్ధి శ్శక్తి: పరాక్రమ:**

**షడేతే యత్ర వర్తంతే తత్ర దైవ సహాయకృత్"** అనే ప్రాచీన పద్ధతి శాస్త్రిగారిలో

నిండుకున్నది. ఆయన కేవలం ధిషణామూర్తియే కాక, **'ఇదం బ్రాహ్మ్యం ఇదం క్షాత్రం'** పద్ధతి గలవాడు, **'గుప్తదాన శౌండుడు'** – సహృదయ కృతిభర్తలు కలవాడే కాక – సహృదయుల కృతుల కెన్నింటికో భర్తృత్వం వహించినవాడు, తన పరిశోధనా ధృక్పథానికి – **'మనకొక పత్రిక అవసరం'** అనే ధృఢ ప్రతిజ్ఞతో 'మూసీ' పత్రికను స్థాపించి నిర్వహించిన సహస్ర బాహువు. ఇది ఆయన మరొక పుత్రిక, పరిణత వయః పరీపాకంలో బహువిధ రచనా వ్యాసంగంలో మునిగి తేలిన శాస్త్రిగారు, విద్యార్థి దశలోనే (ఎమ్.ఏ చదువులో) ఖండవల్లి వారు – రామరాజు గారి ప్రోత్సాహంతో 'మన సంస్కృతి – చరిత్ర (1960)', 'శ్రీనాథ భారతం (1961)', 'అష్ట దిగ్గజములు (1960)', వంటి అద్భుత రచనలను ఆనాడే శ్రమించి, ముద్రణ చేయించి గురు ప్రశంసాపాత్రుడైన శాస్త్రిగారిని ఖండవల్లివారు, రామరాజు గారు వారివారి జీవన చరమాంకంలోనూ మననం చేసుకున్నారంటే శాస్త్రిగారి అక్షర చిరంజీవత్వం ఎంతదో తెలుస్తుంది. ఇవే కాక – రావి నారాయణ రెడ్డిగారి గొప్ప రచన 'నా జీవన పథంలో (1992)' రావి భారతి తోడ్పాటుతో వెలుగులోకి తెచ్చిన అభిమాన ధనుడు.

ఇట్లా ఓతప్రోత సాహిత్య జీవనుడైన శాస్త్రిగారు యశఃకాయులైన తర్వాత వారిని గూర్చి ప్రత్యేక సంచికల ద్వారా అనేకానేక విషయాలను తెలియజేసిన 'మూసీ' పత్రిక వారు చేసిన మరో ధైర్య, విశేష కార్యక్రమం – ప్రస్తుతం జరుప తలపెట్టిన **'బి.ఎన్.శాస్త్రిగారి బహుముఖీన సాహితీ యోజన'** కార్యక్రమం విశేషమైంది. దీంట్లో శాస్త్రిగారి నవలలు, శాసన సంపుటాలు, సర్వస్వాలు, చరిత్రలు, జీవిత చరిత్రలు, పత్రికా సంపాదకీయాలు, మూసీ పత్రికా విషయాలు – ఇట్లా బహు విషయ పరివ్యాప్త సాహిత్య సదస్సులను తెలంగాణ సాహిత్య అకాడమీ వారి సాహాయ్యంతో స్వశక్తి ప్రచోదితంగా 'మూసీ' పత్రికా యాజమాన్యం నిర్వహించే ఈ సదస్సులో పత్ర సమర్పకులు – ప్రాసంగికులైన పెద్దలు – పరిశోధకులు – పరిశోధక విద్యార్థులు, పరిశోధనా రంగ ప్రవరణులు – ఇట్లా అనేక విశేష శేముషీభూషణు లున్నారు. వీరంతా మనలను శాస్త్రిగారి సాహితీ యజనావభృథ స్నాన పవిత్రీకృత వపుషుల చేస్తారనటంలో సందేహం లేదు, స్వర్గలోక వారసులైన శాస్త్రిగారి గురువులు, తమయందే వాసి కీర్తి యశశ్చంద్రికా ధవళరుక్తతి దిశాతరుణి కైశిక పుష్పదామంగా మారిన వైనాన్ని గమనించి ఎంత ఆనందిస్తారో గదా!

ఇంతకాలానికి మనం మన శాస్త్రిగారికి సంపూర్ణ అక్షర, అక్షరోపాయనాన్ని సమర్పించుకునే భాగ్యం కల్పించిన 'మూసీ' నిర్వాహకులను అభినందిస్తూ కైవల్య పదంలో ఉన్న శాస్త్రిగారు వీరిని **'సమానానాముత్తమ శ్లోకో అస్తు'** అని మంగళా శాసనం చేస్తారని ఆశిస్తూ......

– శ్రీరంగాచార్య

# ఉదాత్త చరిత్ర

**"యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః।
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥"**

కొందరు మహానుభావులు కొన్ని పనుల కోసమే జన్మిస్తారు. వారికి నియోగించిన పని పూర్తిచేసి వెళ్ళిపోతారు. ఆ కృషి భవిష్యత్తులో కొన్ని తరాల వరకు మార్గదర్శకంగా, ఆదర్శంగా, ఆధారభూతంగా నిలుస్తుంది. అట్టి కృషీవలులు తెలుగునేల మీద వేళ్ళమీద మాత్రమే లెక్కించేటంతగా ఉన్నారు. వారిలో శ్రీ బి.ఎన్.శాస్త్రి గారు ఒకరు.

సాహిత్య పరిశోధకుడుగా, చరిత్రకారుడుగా, శాసన పరిశోధకుడిగా, సృజనాత్మక రచయితగా, పత్రికా సంపాదకుడుగా బహుముఖీన పరిశ్రమ చేసిన శాస్త్రిగారి సాహిత్యం ఒక వ్యక్తి జీవితకాలంలో ఒంటిగా నిర్వహించలేడు. కాని శాస్త్రిగారు అలుపెరుగకుండా చరిత్ర, శాసనాలకు సంబంధించి వేల పుటలు రచించి భవిష్యత్తరాలకు వారికి తెలియని వారి చరిత్రను పరిచయం చేసినారు. వీరు ప్రచురించని సిద్ధాంత గ్రంథం, ఆత్మకథ అనే రెండు గ్రంథాలు వందల పేజీలలో రాసి ఉంచారు. ఇంకా మూసీ సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక మాస పత్రిక స్థాపన, ఆరు పుస్తకాలకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు.

సాహిత్యం, చరిత్ర, శాసనాలు, పరిశోధనా రంగంలో వీరు జరిపిన కృషి, వెలువరించిన గ్రంథాలు ఆయా రంగాల వారికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. స్వంత రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలో వస్తున్న చరిత్ర గ్రంథాలకు మూల ఆధారం శాస్త్రిగారి గ్రంథాలే అని ఘంటాపథంగా చెప్పవచ్చు. **తెలంగాణలో శాసన, చరిత్ర పరిశోధకులకు శాస్త్రిగారే స్ఫూర్తి.** అటువంటి వారి గ్రంథాలన్నీ సుమారు 70 వరకు ఉన్నాయి. వాటన్నిటిని మనం అధ్యయనం చేయడం కష్టసాధ్యం. ఆ పుస్తకాలను తిరిగి ప్రచురించే అవసరం ఎంతైనా ఉంది. కానీ ఆర్థిక పరిపుష్టి అంతగా లేదు. కాబట్టి వారి అన్ని పుస్తకాల సారాంశాన్ని ఆయా వ్యక్తులతో రాయించి ఒక గ్రంథంగా వెలువరిస్తే బాగుంటుందనే ఆలోచనకు కార్యరూపమే ఈ **"శిలాక్షరం".**

ఇందులోని వివిధ వ్యాసాలు చదివిన తర్వాత అవసరానుకూలంగా మూల గ్రంథాలను చూడాలన్న ఆసక్తి కలుగుతుంది. ఇప్పటి పాఠకుల దృష్టితో వీలైనంత గ్రంథ పిండితార్థాన్ని కొండను అద్దంలో చూపినంత సులువుగా అందించే ప్రయత్నం జరిగింది. ముఖ్యంగా వారి సిద్ధాంత పరిశోధనాగ్రంథంపై వచ్చిన వ్యాసం ఇప్పటికి చాలా తక్కువమందికి చదివే అవకాశం దొరికింది. ఈ గ్రంథంపై వచ్చిన సమీక్షా వ్యాసం గ్రంథ సారాంశ పరిమళాలు అందరికీ అందుతాయి. అదేవిధంగా శాస్త్రిగారు వ్రాసుకొన్న ఆత్మకథ. కేవలం అది శాస్త్రిగారికి మాత్రమే తెలుసు. ఇప్పుడు ఆ వ్యాసం ద్వారా మనం తెలుసుకునే అవకాశం కొంతమేరకు కలుగుతుంది.

శాస్త్రిగారి జయంతిని పురస్కరించుకొని మూసీ సాహిత్య పత్రిక ప్రతి సంవత్సరం ఒక కార్యక్రమం నిర్వహిస్తుంది. వారి సమగ్ర సాహిత్యాన్ని అందరికీ పరిచయం చేయాలన్న ఆలోచన రెండు సంవత్సరాల క్రితమే జరిగింది. కారణాంతరాల వల్ల అది నేటికి సాధ్యమైంది. పుస్తక రూపంలో శాస్త్రిగారి రచనలనన్నిటినీ పరిచయం చేయించి, వారి రచనల విశిష్టతను

అందించడం ఈ 'శిలాక్షరం' ముఖ్య లక్ష్యం. ఇందులో రచయితలు శాస్త్రిగారి రచనలను క్షుణ్ణంగా పరిశీలించి వ్యాసాలను అందించినారు. కొన్ని అసమగ్రంగా ఉన్నా ఒక చిన్న ప్రయత్నం వైపు అడుగులు పడ్డాయని చెప్పవచ్చు.

ఈ సాహితీ ప్రస్థానంలో మాకు అండగా తెలంగాణ సాహిత్య అకాడమీ నిలిచింది. మేము అడిగిన వెంటనే వారు రెండురోజుల సాహిత్య సదస్సుకు తమ ఆర్థిక, హార్దిక సహకారం అందించారు. మూసీ సాహిత్యధారతో సంయుక్తంగా సదస్సు నిర్వహణలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా అకాడమీ అధ్యక్షులు డా. నందినీ సిధారెడ్డిగారికి, కార్యదర్శి డా. ఏనుగు నరసింహారెడ్డిగారికి ప్రత్యేక ధన్యవాదాలు.

శాస్త్రిగారి చిరకాల మిత్రులు, మూసీ పత్రిక నిర్వహించే ప్రతి కార్యక్రమానికి వెన్నంటి ఉండి, దిశానిర్దేశం చేస్తున్న డా. శ్రీరంగాచార్యగారికి ధన్యవాద శతం. డా. డి.సూర్యకుమార్, డా. ఈమని శివనాగిరెడ్డి, కుర్రా జితేంద్రబాబు గార్లకు నమస్సులు.

ఈ శిలాక్షరం గ్రంథరూపం రావడానికి ముఖ్యులు ఆయా గ్రంథాలను పరిచయం చేసిన రచయితలు. 37 మంది రచయితలు తమ వ్యాసాలను సకాలంలో అందించి సహకరించారు.వారందరికీ మూసీ సాహిత్య పత్రిక పరివారం నుండి పేరు పేరునా ధన్యవాదాలు.

'శిలాక్షరం' వెల్వడాలంటే అక్షరాల కూర్పు, అచ్చు తప్పులు లేకుండా ఉండే ప్రయత్నంలో సహకరించిన శ్రీ గురిజాల రామశేషయ్య గారికి, శ్రీమతి జె.ఎల్.అనూరాధగారికి ప్రత్యేక ధన్యవాదాలు. కార్యనిర్వహణలో ఆద్యంతం సహకరించిన ఆత్మీయులు ఏ. శ్రీనాథ్, వర్ధ వేణు, వడ్లాపురం క్రిష్ణ, టి. లక్ష్మీనారాయణ, మంత్రి శ్రీనివాస్, యడవల్లి సైదులు, కె. వినోద్, రాజ్‌కుమార్, పంచాగ్నుల రమాదేవి, సాగర్ల పద్మ, పి.హంసమ్మ, సాగి కావ్యశ్రీ, సాగి దీక్షిత, సాగి తేజశ్రీలకు....

ముఖచిత్ర రూపకల్పకులు డా. పత్తిపాక మోహన్, గోపి పురాణిక్ గార్లకు...అతి తక్కువ వ్యవధిలో పుస్తకాన్ని అచ్చువేసి ఇచ్చిన శ్రీసాయి ప్రాసెస్ అధిపతి రాజశేఖర్‌రెడ్డి గారికి, ప్రధాన కార్యనిర్వాహకుడు మూర్తిగారికి .....

పుస్తక ప్రచురణకు ప్రకటనల రూపంలో ఆర్థిక సహకారం అందించిన తెలంగాణ ప్రభుత్వ టూరిజం శాఖవారికి, సిస్టర్ నివేదిత పాఠశాల యాజమాన్యంవారికి....

తాతయ్యగారి రచనల మీద వస్తున్న ఈ శిలాక్షరం గ్రంథానికి తమవంతు ఆర్థిక సహాయం చేసిన శాస్త్రిగారి మనుమలు పవన్‌కుమార్, విష్ణుకుండినశర్మ, సర్వేశ్వరశర్మ, లలిత, రాధిక, సురేఖ, దీపిక, కవిత కీర్తి, కావ్యశ్రీ, తేజశ్రీలకు ఆశీస్సులు.

ఈ శిలాక్షరం అక్షరరూపం దాల్చడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన శాస్త్రిగారి సాహిత్య, చరిత్ర, శాసన అభిమానులందరికీ పేరు పేరునా శతాధిక ధన్యవాదాలు.

అన్నీ తానై ఈ బృహత్తర కార్యాన్ని మా పేరుతో నడిపించిన డా. సాగి కమలాకర శర్మ గారికి శతకోటి నమస్సులు.

**– సంపాదకులు**

# శిలాక్షరానుక్రమం

**సర్వస్వాలు**

1. నల్లగొండ మండల సర్వస్వము ... డా. ఇడికోజు శ్రీనివాసాచారి 1
2. ఆదిలాబాదు జిల్లా సర్వస్వము ... శ్రీ మడిపల్లి భద్రయ్య 16
3. మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వము ... డా. శ్రీరంగాచార్య 29
4. రెడ్డిరాజ్య సర్వస్వము ... ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి 36
5. బ్రాహ్మణరాజ్య సర్వస్వము ... డా. గంగాపురం హరిహరనాథ్ 50

**శాసన సంపుటాలు**

1. శాసన సంపుటి ... డా. ఉమామహేశ్వర శాస్త్రి 77
2. త్రిపురాంతక దేవాలయ శాసనములు ... శ్రీ కొండా శ్రీనివాస్ 84
3. కందూరి చోడుల శాసనములు – చరిత్ర – సంస్కృతి ...శ్రీ లీలా సుబ్రహ్మణ్యం 108
4. బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసనములు ... శ్రీ జయంతి చక్రవర్తి 114
5. ముఖలింగ దేవాలయ చరిత్ర – శాసనములు ... శ్రీ కొల్లూరు సూర్యనారాయణ 120
6. చెఱకురెడ్డి వంశ చరిత్ర – శాసనములు ... ఆచార్య ఆర్. చంద్రశేఖర రెడ్డి 124
7. గోలకొండ చరిత్ర – సంస్కృతి – శాసనములు ... డా. ఈమని శివనాగిరెడ్డి 135
8. రేచర్ల రెడ్డివంశ చరిత్ర – శాసనములు ... శ్రీ రామోజు హరగోపాల్ 142
9. రేచర్ల పద్మనాయకులు ... శ్రీ కుర్రా జితేంద్రబాబు 153
10. కాయస్థరాజులు ... డా. డి. సూర్యకుమార్ 162
11. వేములవాడ చరిత్ర – శాసనములు ... డా. సంగనభట్ల నరసయ్య 172
12. మల్యాల వంశ చరిత్ర – శాసనములు ... డా. నాగోలు కృష్ణారెడ్డి 180

**చరిత్ర గ్రంథాలు**

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర ... శ్రీ బి. రామచంద్రారెడ్డి 183
2. ఆంధ్రదేశ చరిత్ర – సంస్కృతి (1–3 భాగాలు) ... డా. పి. మురళి 192
3. భారతదేశ చరిత్ర – సంస్కృతి (1–21 భాగాలు) ... డా. జి. అంజయ్య 201

**విమర్శ గ్రంథాలు**

1. కాశీఖండం – దాని ప్రాశస్త్యము ... డా. కాకునూరి సూర్యనారాయణమూర్తి 235
2. శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... ఆచార్య వై. రెడ్డి శ్యామల 243
3. పత్రికల్లో ప్రచురిత వ్యాసాలు ... శ్రీ వడ్లాపురం క్రిష్ణ 268

### సృజనాత్మక సాహిత్యం

**నవలలు**


1. రాధ ... శ్రీ మ్యాతరి ఆనంద్ 273
2. తీరిన కోరిక ... శ్రీ వర్ధ వేణు 278
3. విప్లవజ్వాల ... డా. పి. వారిజారాణి 286
3. తుక్కాదేవి ... ఆచార్య సూర్యా ధనంజయ్ 295
4. వాకాటక మహాదేవి ... డా. జె. ఉభయభారతి 305

**నాటకాలు**

1. సహకారం 2. గ్రామజీవనం 3. కిరాయిదారు 4. రెండునాటికలు, అపోహ ... డా. ఎస్. రఘు 312

**జీవితచరిత్ర**

1. శ్రీపులిజాల రంగారావుగారి సంక్షిప్త చరిత్ర ... బోళ్ళ ప్రవీణ్‌కుమార్ 318

**గేయ కావ్యములు**

1. తపోభంగం ... శ్రీ అట్టెం దత్తయ్య 323
2. పాపాయి పతకం (బాల సాహిత్యం) ... డా. పత్తిపాక మోహన్ 331

**సంపాదకత్వం**

1. మూసీపత్రిక వ్యవస్థాపన, నిర్వహణ – అనుశీలన ... డా. ఆర్. అనురాధ 338
2. శ్రీనాథ భారతం ... శ్రీ మంత్రి శ్రీనివాస్ 345
3. అష్టదిగ్గజములు, నా జీవనపథం ... శ్రీ యదవల్లి సైదులు 352
4. మూసీ పత్రిక సంపాదకీయాలు ... డా. సాగి కమలాకర శర్మ 357

**అముద్రిత ఆత్మకథ**

1. అనుశాసనం ... డా. భిన్నూరి మనోహరి 365


స్వస్తి



# నల్లగొండ మండల సర్వస్వము

తెలంగాణ ప్రాంతానికి చరిత్ర కారులు ఇవ్వాల్సినంత ప్రాముఖ్యం ఇవ్వలేదని ఎలుగెత్తి చాటి తెలంగాణ చరిత్ర నిర్మాణానికి కృషి చేసిన ప్రముఖ చరిత్ర కారుడు, పరిశోధకుడు, సాహితీ వేత్త బి.ఎన్.శాస్త్రి. శేషాద్రి రమణ కవులు తెలంగాణ సాహిత్యం, ఆదిరాజు వీరభద్రరావు తెలంగాణ చరిత్ర భౌగోళిక రాజకీయ చిత్రణ. సురవరం ప్రతాప రెడ్డి తెలంగాణ చరిత్ర రచనలు చేస్తే బి.ఎన్.శాస్త్రి చరిత్ర, సంస్కృతి, సాహిత్యాల సమ్మేళనంతో నల్లగొండ మండల సర్వస్వానికి శ్రీకారం చుట్టాడు.

సర్వస్వాల చరిత్రను పరిశీలించి చూసినట్లయితే ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా విజ్ఞాన సర్వస్వాలతో పోలినది. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం పేరిట శ్రీ కొమర్రాజు లక్ష్మణ రావు గారు 3 సంపుటాలను ప్రకటించారు. నాల్గవ సంపుటం సమయంలో లక్ష్మణరావు మరణించడంతో విజ్ఞాన సర్వస్వ ప్రచురణ ఆగిపోయింది. తర్వాత శ్రీ కాశీనాథుని నాగేశ్వర రావు గారు విజ్ఞాన సర్వస్వం ప్రకటించుటకు పూనుకుని, రెండు సంపుటాలను వెలువరించారు. పంతులు గారు మరణించిన తర్వాత విజ్ఞానసర్వస్వ ప్రచురణకు ఆటంకం కలిగినది. తెలుగు విజ్ఞాన సర్వస్వ సంపుటాలను, సమగ్రంగా ముద్రించి తెలుగు భాషా సమితి ఆంధ్ర దేశమునకు ఎంతో సేవ చేసింది. ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనము గారు సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం 8 సంపుటాలను, ఆంధ్రదేశ చరిత్ర – భూగోళ సర్వస్వాలను 3 సంపుటాలుగా ప్రకటించారు.

ఈ సర్వస్వ రచనలను సర్వంకషములు, విషయికములు అని 2 రకాలుగా విభజించ వచ్చును. సకల విజ్ఞాన శాస్త్రాలు, కళలను వివరించేవి సర్వంకషములు, ఏ విజ్ఞాన

శాస్త్రాన్నో, కళనో ప్రాదేశిక విభాగమునో ధ్యేయంగా గ్రహించి దానిని గురించిన సమాచారము నంతటిని చక్కని అమరింపుతో అందించేది ఐక విషయము. ఈ ఐక విషయికపు కోవకు చెందిన సర్వస్వాలు తెలుగులో రాలేదు. మండల సర్వస్వాలు ఈ కోవకు చెందినవిగానే చెప్పవచ్చు.

ఆంధ్ర దేశంలో మొదటగా వచ్చిన మండల సర్వస్వం గుంటూరు మండల సర్వస్వం. తర్వాత నెల్లూరు, కడప మండల సర్వస్వాలు వెలువడ్డాయి. ఈ 3 సర్వస్వాల తర్వాత వెలువడ్డది నల్లగొండ మండల సర్వస్వం. దీనిని వెలువరించి తెలంగాణలో మండల సర్వస్వాలకు శ్రీకారం చుట్టినవారు బి.ఎన్.శాస్త్రి గారు. ఇక్కడ మండలం అంటే ప్రాదేశిక పరిధిగా జిల్లా అని భావం. 1975 సం॥లో నల్లగొండ మండల సర్వస్వ రచనకు పూనుకున్నారు.

ఆంధ్రదేశ చరిత్రలో నల్లగొండ మండలానికి ఒక విశిష్టమైన స్థానముంది. చరిత్ర పూర్వ యుగం నాటి సిస్ట్, డాల్మెన్ సమాధులు, ఆది మానవుకు నిలయాలైన కొండ గుహలు, నివాస చిహ్నాలు, ప్రాచీన మానవుడు ఉపయోగించిన వస్తువులు ఈ మండలంలో లభించినవి. గణతంత్ర రాజ్యాలు ఇక్కడ వెలిశాయి. శాతవాహనులు ఈ ప్రాంతాన్ని తమ పలుకుబడిలోకి తెచ్చుకుని పాలించారు. ఇక్ష్వాకులకు ఈ నేలతో మంచి సంబంధముంది. సువిశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించిన విష్ణుకుండిన వంశీయుల జన్మభూమి నల్లగొండ మండలం. బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, కళ్యాణీ చాళుక్యులు, కందూరి చోడులు, కాయస్థులు, కాకతీయులు, ముసునూరి వంశీయులు, పద్మ నాయకులు, బహమనీ సుల్తానులు, గోలకొండ నవాబులు, మొఘల్ చక్రవర్తులు, అసఫ్‌జాహీలు క్రమంగా ఈ మండలాన్ని తమ సామ్రాజ్య అంతర్భాగంగా పరిపాలించారు.

ఇంద్రపురి, భువనగిరి, రాచకొండ, ఉంద్రుగొండ, ఉర్లుగొండ, దేవరకొండ, అనంతగిరి, వాడపల్లి, పొడిచేడు, సిరికొండ, ఆర్వపల్లి, చిట్యాల, మొ॥ దుర్గములు, కృష్ణా, మూసీ, బిక్కేరు, ఆలేరు, పాలేరు, అహల్యా, పెద్దవాగు, డిండి, చిన్నయేరు వంటి నదులు ఈ మండలంలో ప్రవహిస్తూ ఉన్నవి.

కొలనుపాక, ఇంద్రపాల నగరం, పెరూరు, పానగల్లు, వాడపల్లి, అనుముల, పరడ, పిల్లలమఱ్ఱి, యాదగిరిగుట్ట, ఆర్వపల్లి, బుజిలాపురము, మట్టపల్లి, ఆరూరు, వేములకొండ, జాన్‌పాడు, బూరుగుగడ్డ, నాగులపాడు, సోమవరము, ఏలేశ్వరము, మేళ్ళచెరువు, చిలుకూరు మొ॥ చారిత్రక, పుణ్య క్షేత్రాలు కలవు.

విష్ణుకుండినుల కాలం నుండి గోలకొండ కుతుబ్‌షాహీల పాలనా కాలం వరకు

వివిధ రాజ వంశీయులు, వారి సామంత మాండలిక, దండ నాయకులు, అమాత్యులు వేయించిన వందల కొలది సంస్కృతం, ఆంధ్ర, కర్ణాటక, ఫారసీ భాషలలో ఉన్న శాసనాలు ఈ మండలమున లభిస్తున్నవి.

నల్లగొండ మండల సర్వస్వం రచన అంకురార్పణ 1975లో జరిగినా, అప్పటి నుంచి శాస్త్రిగారు జిల్లాలోని శాసనాలను సేకరించుట, దుర్గముల, దేవాలయాల, ఛాయా చిత్రములను తీసుకొనుట, వివిధ విషయములకు సంబంధించిన సమాచారం సేకరించుట, పుణ్య స్థలాలను సందర్శించి, స్థానిక చరిత్రలను, స్థల పురాణాలను తెలుసుకొనుట జరిగినది. పది సంవత్సరాల పాటు చరిత్ర – సంస్కృతి – సాహిత్యాలకు సంబంధించిన అనేక విషయాలను సేకరించి 1985 సంవత్సరంలో పూర్తి కాలము వెచ్చించి 1986లో మండల సర్వస్వాన్ని వెలువరించారు. ఇది తెలంగాణలో మొట్టమొదటి సర్వస్వం.

నల్లగొండ మండలానికి సంబంధించిన చరిత్ర, పూర్వపు ఇతిహాస యుగము మొదలుకొని ఆధునిక యుగం వరకు ప్రామాణికంగా ఈ సర్వస్వంతో ఈయబడింది. 812 పేజీలతో, 8 అధ్యాయాలతో, 1986 సం॥లో 1250 ప్రతులతో శాస్త్రి గారు చాలా చక్కగా వెలువరించారు.

ఈ గ్రంథానికి చీమకుర్తి శేషగిరి రావు గారు ముందుమాట రాస్తూ "ప్రామాణికతకు ప్రయోజనమును, విపుల విషయ సంకలనమును, విశద కథన నిపుణత్వము సరి కుదిరి మేళన మందిన రీతిలో నల్లగొండ మండల సర్వస్వం రూపొందినది" అని అన్నారు.

బి.ఎన్.శాస్త్రి గారి ఈ గ్రంథం గురించి చెబుతూ క్రింది విధంగా పేర్కొన్నారు. "ఉన్నత చరిత్ర – సంస్కృతికి నిలయమైన నల్లగొండ మండల సర్వస్వంను అభిమానధనులు, అపురూప శిల్పకళా స్రష్టలు, దేశాభిమానులు, మహోన్నత చరిత్ర కలవారు, కళాభిమానులు, ఉద్యమ నిర్మాతలు, ఉన్నతాశయములు కలవారైన ఆంధ్ర ప్రజలకు అందిస్తున్నారు. అదే విధంగా "అభిమాన ధనులు, అపురూప శిల్పకళా స్రష్టలు, ఉద్యమ నిర్మాతలు, మహోన్నత చరిత్ర కలవారు, అన్యాయమును, దౌర్జన్యమును సహింపని నల్లగొండ ప్రజలకు 'అంకితం' చేస్తున్నా"నని పేర్కొన్నారు. గ్రంథం మొదట్లో అప్పటి భారత ప్రధాని శ్రీ రాజీవ్ గాంధి, ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు, రోడ్డు రవాణా శాఖామాత్యులు శ్రీ కుందూరి జానారెడ్డి, జెడ్.పి.చైర్మన్ శ్రీ.సి. మల్లారెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీ ఎ.కె.గోయల్ గార్ల ఛాయా చిత్రాలను పెట్టడం బట్టి చూస్తే నాయకుల పట్ల, అధికారుల పట్ల శాస్త్రి గారికున్న గౌరవం తెలుస్తుంది.

నల్లగొండ మండల సర్వస్వం మొత్తం 8 అధ్యాయాలుగా విభజించబడింది. వీటితో పాటు ఛాయా చిత్రముల, శాసన ప్రతిబింబముల వివరణము గ్రంథం చివర్లో పెట్టడం జరిగింది. అధ్యాయాల పరంగా చూసినట్లయితే

1. ప్రశస్తి
2. నల్లగొండ మండల చరిత్ర - సంస్కృతి
3. నల్లగొండ మండలం - సాహిత్యం
4. వివిధ శాఖలు - పంచాయితీ సమితులు
5. జిల్లా పరిషత్తు - ఇతర శాఖలు
6. శాసనాలు
7. వివిధ శాఖలు
8. అనుబంధములు

**1. ప్రశస్తి:**

'శ్రీ నీలశైల:' అనే శీర్షికతో డా. లక్ష్మణ మూర్తి గారు నల్లగొండ జిల్లాను పాలించిన వివిధ రాజ వంశాలను, వారి పరిపాలనలో నల్లగొండ ఏ విధంగా అభివృద్ధి చెందిందో, వారి గొప్పతనాన్ని వివరించారు. 'నీలగిరి' అనే శీర్షికతో మహాకవి శ్రీ గింజల నరసింహా రెడ్డి గారు నల్లగొండ మండలానికి సంబంధించి చక్కటి పద్యాలను అందించారు. "నాటి నైజాం క్రూర పాలన - నెదిర్చినది ప్రజోద్యమముకై గుండె నెత్తురు లొలికిన ఎర్రని - చెందురా నల్లగొండ జిల్లా" అంటూ నల్లగొండను ఎర్ర భూమిగా కీర్తించాడు. అదే విధంగా శ్రీపాటి దశరథరెడ్డి గారు "నల్లగొండ" అనే శీర్షికతో మండలంలోని నేలల గురించి, ఖనిజాలు, నదులు, చెట్లు, జంతువులు, పంటలు, పాడి పరిశ్రమలు, ప్రాజెక్టులు, డ్యామ్‌లు, జాతీయ రహదారులు, రాజ వంశాలు, కోటలు, దుర్గాలు, భౌగోళిక చిత్రణ వంటి వాటిని మంచిగా కవిత్వ రూపంలో అందించాడు.

**"బసవ పురాణము పస మీద పలికిన**
**సోమన్న మసలిన సీమ యెచట?**
**సంగీత సాహిత్య సరస సర్వజ్ఞుడు**
**సింగ భూపాలుని రంగ మెచట?**
**తన రాణిగా వాణి దలచి మెప్పించిన**
**పిన వీరభద్రుని జనన మెచట?**

**భక్తి సుధలు చిల్కి భాగవతమును**
**వ్రాసిన పోతన గ్రామ మెచట?**
**సూరి వరులు మరిగంటి సుకవు లెల్ల**
**రెచట సాగించి రాంధ్ర సాహిత్య సేవ?**
**అది తెలంగాణ చరితలో మొదట నిలుచు.**

**'నల్లగొండ' యశస్సుతో 'తెల్లకొండ"** అంటూ నల్లగొండ నేలను కీర్తిస్తూ శ్రీ వేదాటి రఘుపతి గారు చక్కటి పద్యాలను అందించారు. ప్రశస్తిలో భాగంగా ఆనాడు నల్లగొండ మండలమును కీర్తించిన విజ్ఞులందరికి నల్లగొండ ప్రజల తరపున ధన్యవాదాలు.

## 2. నల్లగొండ మండలము : చరిత్ర – సంస్కృతి

నల్లగొండ మండల చరిత్ర సంస్కృతి రెండవ అధ్యాయంలో భాగంగా శాస్త్రి గారు మొదటగా నల్లగొండ మండలానికి సంబంధించిన భౌగోళిక చరిత్రను వివరించారు. దీనిలో భాగంగా నల్లగొండ మండలం $16^{0}25$ - $17^{0}23$ ఉత్తర అక్షాంశాల మధ్య మరియు $78^{0}$ - 40 - 805 తూర్పు రేఖాంశాల మధ్యనున్నదని 14242 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉన్నదని, ఉత్తరాన వరంగల్, మెదక్ మండలాలు, దక్షిణాన గుంటూరు, మహబూబ్ నగర్ జిల్లాలు, తూర్పున కృష్ణా, ఖమ్మం జిల్లాలు, పడమరన మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాలు సరిహద్దులుగా నున్నవని నైసర్గిక స్థితిని చాలా చక్కగా వివరించారు. ఈ మండలంలో నల్లమల కొండలు, దురాజ్‌పల్లి గుట్టలు, రాచకొండ గుట్టలు, అర్వపల్లి గుట్టలు, భువనగిరి, రాయగిరి కొండలు గలవని, కృష్ణా, మూసీ, డిండి, పెద్దవాగు, ఆలేరు నది, అహల్య, పాలేరు మొ॥ నదులు ఈ నేల మీద ప్రవహిస్తున్నాయని, అవి ఎన్నెన్ని కిలోమీటర్లు ప్రవహిస్తున్నాయో పేర్కొన్నాడు. అదే విధంగా నల్లగొండ మండలం ఉష్ణ మండలంలో ఉన్నదనీ, వర్షచ్ఛాయలో ఉన్నదని, ఉష్ణోగ్రతను, గాలిలో తేమను, వాయువును, గుట్టలు – రాళ్ళను, ధార్వార్ శిలల గురించి, ఒంద్రు ప్రాంతముల గురించి, మెత్తటి రాయి, కోరండం, కంకర, భవన నిర్మాణపు రాళ్ళు, అడవులు – చెట్లు చేమలు, మృగ సంపద, పక్షి సంతతి, పాములు మొ॥ వాటిని పేర్కొని, నల్లగొండ మండల మందు వృక్ష, జంతు, మృగ, జలచర సంఖ్య అధికముగా ఉండటానికి అవకాశమున్నదన్నారు.

నల్లగొండ మండలము, ప్రజలు –వ్యవహారాల గురించి తెలుపుతూ ఆంధ్ర ప్రాంతం నుండి వలస వచ్చిన వారు ఇక్కడ నల్లరేగడి భూములను కొనుక్కుని స్థిర పడ్డారని, వీరిలో క్రైస్తవులు ఎక్కువని, వీరే కాకుండా కమ్మవారు, రెడ్డికులస్థులు, ముస్లింలు, చేతి వృత్తుల

కులస్థులు అధికంగా కలరని చెప్పారు. నల్లగొండ మండలంలో భువనగిరి, నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ మొ॥ ప్రాంతాలలో జన సాంద్రత ఎక్కువగా కలదని పేర్కొన్నారు. నల్లగొండ ప్రజల భాష నూటికి 90 మంది మాతృభాష తెలుగు. ఈ మండలం ముస్లింల పరిపాలనలో కొంత కాలముండుట చేత ఉర్దూ పద సమ్మిళితములు, ఇంగ్లీషు పదములు ఈ భాషలో కన్పిస్తున్నాయని అవి కీస (జేబు), జరంత (కొద్దిగంత), కాఫీ, టీ, పాన్, రోడ్డు, బంగ్లా, ఆఫీసు, ట్రెజరీ, ఎచ్చులు (గొప్పలు), పొంకణాలు (గొప్పలు), బాంచను (బానిసను), ముల్లె (మూట), అచ్చిందు (వచ్చినాడు), గట్లె (అలాగే), బాట్లు (తూనికలు), కుర్చి, మేజ్, పటేల్, పోలీస్, మాలీ, ఖజానా, సడక్ మొ॥వి. ఈ మండలంలో అనేక కులముల వారు, అనేక మతస్థులు, వివిధ వృత్తులను అవలభించే ప్రజలున్నారని పేర్కొన్నారు. అదే విధంగా హిందువులు, లంబాడీలు, ఎరుకలు, హరిజనులు, మహమ్మదీయులు, క్రైస్తవులు వారి వారి మతాచారాలను, ఆచార వ్యవహారాలను సవివరంగా పేర్కొన్నారు.

నల్లగొండ మండల చరిత్ర ప్రాచీన యుగములో భాగంగా చరిత్ర పూర్వ యుగం నుండి ఆనాటి వరకు ఆంధ్రుల జీవన విధానమునకు సంబంధించిన సమాచారమును వివరించారు. పాతరాతి యుగం, కొత్తరాతి యుగం, లోహ యగం, ఆర్య నాగరికతలలో మానవ జీవన విధానం, వారు వాడిన పనిముట్లను వివరించాడు. శాతవాహన రాజ్య నిర్మాణానికి పూర్వమే నల్లగొండ మండలంలో జైన, బౌద్ధ మతాలు వ్యాపించాయని, ప్రజలు గణతంత్ర్య రాజ్యాములు ఏర్పరచుకొని, స్థిర నివాసులై వ్యవసాయమే ముఖ్య వృత్తిగా స్వీకరించారని పేర్కొన్నారు. మట్టి పాత్రలు, బంగారు ఆభరణాలను వాడారని, ఆర్య నాగరికతను అలవరచుకొని క్రమంగా బౌద్ధ, జైన మతాలను ఆదరించారని వివరించారు.

నల్లగొండ మండల ప్రాంతాన్ని పాలించిన శాతవాహన రాజులైన శ్రీముఖుడు, కృష్ణుడు, మొదటి శాతకర్ణి, పూర్ణోత్సంగుడు, రెండవ శాతకర్ణి, గౌతమీ పుత్ర శాతకర్ణి, రెండవ పులోమావి, శివశ్రీ శాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి, విజయ శాతకర్ణి మొ॥ వారి గురించి, వారి పాలనను, ఆ కాలం నాటి సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులు, నాణెములు, విదేశీ వ్యాపారం గూర్చి వివరించారు. బౌద్ధ, జైన మతాల వ్యాప్తి గురించి, గాథాసప్తశతి, బృహత్కథ, లీలావతి కావ్యం, వాత్సాయనీయము మొ॥ కావ్యాలను, బౌద్ధ స్థూపాలను విస్తృతంగా వివరించారు.

శాతవాహన సామ్రాజ్య పతనానంతరం పాలించిన ఇక్ష్వాకు రాజులైన శాంతమూలుడు, వీర పురుషదత్తుడు, ఎహువల శాంతమూలుడు, రుళు పురుషదత్తుల

పరిపాలనా విధానం గురించి ఈ కాలం నాటి ఆర్థిక పరిస్థితులు, మత, సాంఘిక పరిస్థితులు, ఈ రాజన్యుల పాలనలో వైదిక, బౌద్ధ మతాలు పోషింపబడిన విధం గురించి తెలిపారు.

ఆంధ్ర దేశ చరిత్రలో మహోజ్జ్వలముగా రాణించిన రాజ వంశాలలో విష్ణు కుండిన వంశమొకటి. వీరి జన్మభూమి నల్లగొండ మండలం. విష్ణుకుండిన వంశములు మొత్తం 12 మంది రాజులలో 9 మంది క్రీ.శ.388 నుండి క్రీ.శ.624 వరకు సుమారు 235 సంవత్సరాలు ఆంధ్ర దేశాన్ని పాలించారని, వారి పాలనను, మత, సాంఘిక పరిస్థితును, జనాశ్రయ ఛందో విఛితి, స్థల మహాత్మ్యాలను, వ్యాపార వాణిజ్యాలను, శిల్పాన్ని ఉండవల్లి, భైరవ కొండ, మొగల్రాజపురం, ఇంద్రకీల పర్వతముల గురించి వివరణాత్మకంగా పేర్కొన్నారు. తర్వాత పాలించిన బాదామి చాళుక్యుల పరిపాలనా విధానాన్ని, ఆంధ్ర రాష్ట్రంతో గల సంబంధాన్ని వివరించారు. పిమ్మట రాష్ట్రకూట రాజులైన దంతిదుర్గుడు, మొదటి అకాల వర్షుడు, ధ్రువుడు, కృష్ణుడు మొ॥ వారి పాలన, బాదామి చాళుక్యుల సామంతులుగా ఉన్న వీరు బాదామి చాళుక్య సామ్రాజ్యాన్ని ఏ విధంగా ఆక్రమించుకున్నారో, రాజ వంశాలతో గల సంబంధాన్ని వివరించారు. రాష్ట్రకూటుల అనంతరం, నల్లగొండ మండలాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది కళ్యాణీ చాళుక్యులు. వీరి కాలంలో నల్లగొండ మండలం వారి సామంతుల, దండ నాయకుల, మహా మండలేశ్వరుల ఆధీనంలో ఉండినవి. తర్వాత నల్లగొండ మండలంతో అత్యంత సన్నిహితం సంబంధం కలిగి ఉన్నవారు కందూరి చోడులు. ఈ వంశపు రాజుల పరిపాలన, రాజు-పాలక మండలి, ద్వాదశ వృత్తుల గురించి, సైనిక వ్యవస్థ, యుద్ధ తంత్రం, మత పరిస్థితులు, జైన మతం, శైవ, వైష్ణవ మతాలు, వైదుష్యం, సాంఘిక పరిస్థితులు, ఆర్థిక వ్యవస్థ, శిల్ప సంపదలను వివరించారు. కందూరి చోడులు పాలించు కాలమున నల్లగొండ మండలం సుభిక్షముగా ఉండెనని, రాజులు ప్రజానురంజకముగ పాలించారని పేర్కొన్నారు.

నల్లగొండ మండలాన్ని పరిపాలించిన కాకతీయ రాజుల గురించి, పరిపాలన విధానం, ఆర్థిక స్థితి, మత, సాంఘిక పరిస్థితులు, శాసనాలు, శిల్ప సంపదలను వివరించారు. తర్వాత కాయస్థులు, ముసునూరి వంశీయులు పరిపాలించారు.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన రాజ వంశీయులలో పద్మనాయక వంశం పేర్కొనదగినది. వీరి కాలం నాటి శాసనాలు, స్థానిక చరిత్రలు, గ్రంథములు, దుర్గములు, దేవాలయములు, ఇతర నిర్మాణాలు, పరిపాలనా విధానం, ఆర్థిక స్థితి, శైవ, వైష్ణవ, మతాలు, సాంఘిక పరిస్థితులు, వైదుష్యం గురించి

వివరించారు. తర్వాత బహమనీ వంశం, కుతుబ్షాహీ వంశం, మొగలు వంశం, అసఫ్ జాహీ వంశం పరిపాలన గురించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణను పేర్కొన్నారు.

నల్లగొండ మండల సర్వస్వంలో ఈయబడిన చారిత్రక విషయముల నిర్ణయములు అన్నింటితో పండితులందరును అంగీకరింపక పోవచ్చునని చీమకుర్తి శేషగిరి రావు గారు పేర్కొన్నారు. అప్పుడు ఆయనకు ఆ విధంగా తోచిందని చెప్పవచ్చు. కాని తర్వాతి పరిశోధకులు శ్రీరంగాచార్య, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, కుర్రా జితేందర్ బాబు, ఇడికోజు శ్రీనివాసాచారి మొ॥ వారికి ఇది ఒక మూల గ్రంథంగా తోడ్పడినదని చెప్పవచ్చు. ఈ మండల సర్వస్వం ఆధారంగానే తెలంగాణను పరిపాలించిన రాజవంశాల కాల నిర్ణయం జరిగిందంటే ఎంత గొప్ప ప్రామాణిక గ్రంథమో అర్థం చేసుకోవాలి. తెలంగాణ చరిత్రలో మరుగున పడిన, పండితుల దృష్టికి రాని ఎన్నో చారిత్రక విషయాలను, గ్రంథాలను, శాసనాలను బి.ఎన్.శాస్త్రి గారు ఈ గ్రంథంలో పొందుపరిచారు.

## 3. నల్లగొండ మండలము - సాహిత్యము

నల్లగొండ జిల్లాకు ఘనమైన చరిత్ర ఉంది. సుసంపన్నమైన పురాతనమైన చరిత్ర గల నల్లగొండ మండలంలో పౌరుషానికి ప్రతీకగా నిలిచిన రాజులతో పాటు, గొప్ప సాహిత్యాన్ని తెలుగులో సృష్టించిన మహనీయులు ఎందరో ఉన్నారు. సాహిత్య వ్యాసాలకు సహకారము అందించిన శ్రీరంగాచార్య గారికి, కపిలవాయి లింగమూర్తి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ విభాగంలో మొదట ఈ జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన యాదగిరి గుట్ట - భక్తి రచనలు శీర్షికతో శ్రీ యన్. యాదగిరి శర్మ గారు చక్కటి వ్యాసం వ్రాశారు. యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామిపై చేసిన భక్తి రచనలను నృసింహ శతకములు, భజన కీర్తనలు, మంగళ హారతులు, మేలుకొలుపులు, స్త్రీల పాటలు, భావ గీతికలుగా విభజించి వాటిని సంక్షిప్తంగా వివరించారు.

తర్వాత శ్రీ బి.లక్ష్మీకాంతరావు నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ గురించి వ్యాసం రాశాడు. 1960లో గ్రంథాలయ సంస్థ ఏర్పడినప్పటి నుండి 1986 వరకు చేసిన సేవను, జిల్లాలోని గ్రంథాలయాల గురించి, గ్రంథాల గురించి, సంస్థ సభ్యుల పేర్లు, ఎంతమంది గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్నారు మొ॥ వాటిని పట్టికల రూపంలో వివరించారు.

గోలకొండ కవుల సంచికలో నల్లగొండ జిల్లా కవులు ఎంత మంది ఉన్నారో, వారి

వివరాలను శ్రీరంగాచార్య గారు వివరించారు. 1934లో సిద్ధము చేసిన 'గోలకొండ కవుల సంచిక'లో పూర్వ కవులు 183, ఆధునికులు 354, మొత్తం 537 మంది కవులున్నారు. వీరిలో నల్లగొండ మండలానికి సంబంధించిన పూర్వ కవులు 21, ఆధునికులు 45, మొత్తం 66 మంది కవులున్నారు. ఆనాడు తెలంగాణలో ప్రసిద్ధమైన 'గోలకొండ కవుల సంచిక'లో స్థానం సంపాదించిన నల్లగొండ మండల కవులను ఈ వ్యాసంలో పొందు పరచడం జరిగింది. భావి పరిశోధకుల శ్రమను సులభతరం చేయడం కొరకు ప్రాంతాల వారిగా రాసి ఎంతో మేలు చేశారు. 'సాహిత్య వ్యవసాయంలో నల్లగొండ జిల్లా కృషి' అనే పేరుతో శ్రీ కాంచన పల్లి చిన వేంకట రామారావు గారు చక్కని వ్యాసాన్ని రాశాడు. ఈ మండలం ప్రాచీన కవులలో తెలుగులో స్వతంత్ర గ్రంథ రచనకు ఆద్యుడైన పాల్కురికి సోమనాథుని మొదటగా ప్రస్తావించినారు. తర్వాత ఉదయాదిత్యుని గోకర్ణ ఛందస్సు లక్షణ గ్రంథం వివరించారు. పద్మనాయక యుగం సాహిత్య చరిత్రలో ఒక స్వర్ణ యుగం. శ్రీకృష్ణదేవరాయల వలె సాహిత్యాన్ని, రాజ్యపాలనను సమర్థవంతంగా నిర్వహించిన వాడు సర్వజ్ఞ సింగ భూపాలుడు. ఇమ్మనుజేశ్వరాధములకు, కర్ణాట కిరాత కీచకులకు కావ్యాన్ని అంకితం చేయనని, అమ్మనని కంకణం కట్టుకున్న ఆత్మాభిమాని, కలాన్ని, హలాన్ని ఏకధాటిగా నడిపించిన బమ్మెర పోతన గురించి, మూడవ సింగ భూపాలుని గురించి, పిల్లల మర్రి పిన వీరభద్రుడు, మరిగంటి కవుల సాహిత్యాన్ని చాలా చక్కగా వివరించారు. ఆధునిక కవులలో షబ్నవీసు వెంకట నరసింహారావు గారు మొదలుకొని శేషు, చిన్నూరి నాగరాజు, జి.వి.బి.రాజు, సుదర్శన్, కోలాహలం లక్ష్మణ రాజు, వసంతరాయ్, గురిజాల రామశేషయ్య, దేవులపల్లి ప్రభాకర రావు, కె.ఎల్.ఎన్.రావు, కోదాటి నారాయణ రావు, నీలా జంగయ్య, బి.ఎన్.శాస్త్రి మొ॥ సాహితీ వేత్తల సేవలను ప్రస్తావించారు.

శ్రీరంగాచార్య గారు నల్లగొండ జిల్లాలోని కవులు – పండితులు – రచయితల సమాచారం అందజేశారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కవులు, పండితులు గ్రంథానికి ముందు జరగబోయే ప్రయత్నానికి ఈ రచన ఒక పాథేయంగా ఉపకరిస్తుందని పేర్కొంటూ ఈ మండలంలోని కవుల, రచయితల సమాచారాన్ని సంక్షిప్తంగా, సరళంగా విశదీకరించారు.

శ్రీపెరుంబుదూరు రాఘవాచార్యులు దేవరకొండ తాలూకాలో ఉన్న నాంపల్లి, దామెర, నడికుడ, పెద్దాపురం, సరంపేట, తాటికోలు మొ॥ 196 గ్రామాలతో కూడిన గ్రామ నామ సీసమాలికను, మిర్యాలగూడెం తాలూకా గ్రామ నామ సీసమాలికను, శ్రీమాన్ గోవర్ధనం వేంకట నరసింహాచార్యులు, నల్లగొండ తాలూకా గ్రామ నామ సీసమాలికను శ్రీపెరుంబుదూరు

రాఘవాచార్యులు, ఈయనే జమాబంది సీసమాలికను రాశారు.

నల్లగొండ - పాలమూరు మండలాలు సంబంధ - సాదృశ్య విశేషాలు అనే శీర్షికన కపిలవాయి లింగమూర్తి గారు ఈ రెండు మండలాల ప్రజా సంస్కృతిలో పెద్ద మార్పు లేదని, దాదాపు ఒకే తీరుగా బ్రతుకుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యక్రమాలలో నల్లగొండ మండలము పాత్రను, కృషిని, ఆంధ్ర సారస్వత పరిషత్తు కేంద్రాల గురించిన సమాచారంను, నిర్వహించిన పాఠశాలల గురించి తర్వాతి వ్యాసంలో శాస్త్రి గారు పేర్కొన్నారు.

నల్లగొండ మండలంలో జానపద కళలైన దాసరి, బుడిగె జంగాలు, శారద గాండ్లు, బాలసంతులు, బహురూపులు, భాగవతాలవారు, కాటికాపరులు, బుర్రకథల వారు, మందుల వారు, తోలు బొమ్మల వారు, యాదవుల కుల యాచకులు, పిచ్చుకకుంట్లు, వీరముష్టివారు, చిందులు, డెక్కలి, బైండ్ల, జెట్టీ, కూనెపులి, గంజికూటివారు, అద్దం సింగ్‌లు, సాతాని జియ్యర్‌లు, రుంజలు, పనసలు మొ॥ వాటి గురించి ఈ రంగంలో విశేష పరిశోధన చేసిన యన్.యాదగిరి శర్మ గారు వివరించారు. జానపద కళలకు తగిన ప్రోత్సాహమునిచ్చి కళాకారులను ఆదరించాలని, సంవత్సరానికి ఒకసారి కళాకారులను కొందరినైన సత్కరించుకోవాలని సూచించడం జరిగింది.

నల్లగొండ మండలంలోని సాహిత్య వికాసం ఏ విధంగా జరిగింది అనేది నీలా జంగయ్య గారు వివరించారు. నల్లగొండ మండలాన్ని చారిత్రకంగా పరిశీలిస్తే ముఖ్యంగా బాదామి చాళుక్యుల కాలం నుంచి మనకు లభిస్తున్న సాహిత్య చరిత్ర ఈ మండలాన్ని ఆంధ్ర, తెలంగాణ సాహిత్య చరిత్రకు మణి మకుటంగా తీర్చిందిగా పేర్కొనవచ్చున్నారు. “యాద శైల నృహరీ” అనే పేరుతో కవి శార్దూల శ్లేషకవి శ్రీ గౌరీభట్ల రామకృష్ణ శాస్త్రి చక్కని సీస పద్యాలను రాశాడు.

**సీ॥ “బుద్ధి జెప్పవదేల ముద్దరాతి సుంత**
**లుబ్ధుల యిండ్లతో లొంగి పోవ**
**హద్దు బెట్టవదేల పెద్దకొడుకు నొకింత**
**అంతు లేనట్టి బ్రహ్మాండ సృష్టి**
**వారింప వదియేల బావ మరందిని**
**మిత్రాంగనల నమ్మించి చెరుప**
**సరిదిద్ద వదియేల పరిచారకునకు**

**పక్షపాతమ్ము జూపగల వృత్తి**
**తే॥గీ॥ మాకు జెప్పెడి హితబోధ నీకు వలద**
**నీకు నీవారి వల్ల నిర్నిద్ర కీర్తి**
**పరిఢవిల్లును గాదె అత్తరి మురారి**
**నరహరీ! యాదగిరి గుహాంతర విహారీ!"** అంటూ 'యాదగిరి గుహాంతర విహారీ' అనే మకుటంతో 2 సీస పద్యాలు, 'యాదశైల నృహరీ! నిరతాభయదాన వైఖరీ!' అనే మకుటంతో 7 ఉత్పలమాల పద్యాలను వ్రాశారు.

## 4. వివిధ శాఖలు – పంచాయితీ సమితులు

'నాగార్జున సాగరము – విజయపురి 'అనే వ్యాసంలో లక్షలాది ప్రజలకు జీవనాధారమై, బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్ గురించి, నిర్మాణం గురించి, నీటి నిల్వ పరిమాణం, విద్యుత్ ఉత్పత్తి, ప్రదర్శన శాల గురించిన వివరాలను తెలిపారు.

నల్లగొండ మండలంలో నిక్షిప్తమైన ఖనిజ సంపద, వాటి వివరాలను, పరిశ్రమల వివరాలు, స్వయం ఉపాధి కల్పన స్కీం, ప్రత్యేక ఉపాధి కల్పన స్కీం, ఉపాధి వివరాలు, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమము, బహుళార్థ ఆరోగ్య కార్యకర్త ప్రజలకు అందించు ఆరోగ్య సేవలను, మాతా శిశు సంక్షేమ సేవలను, స్వచ్ఛంద సమాజ ఆరోగ్య కార్యకర్తల పథకము, జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమం, జాతీయ కుష్ఠురోగ నిర్మూలనా కార్యక్రమం, జిల్లా క్షయరోగ నివారణా కేంద్రం, సమగ్ర శిశు అభివృద్ధి పథకం, ప్రచార ప్రబోధ కార్యక్రమాలు, ప్రకాశం సంచార వైద్యశాల గురించి వివరాలు అమలుపరుస్తున్న తీరును వివరించారు.

ఆనాడు నల్లగొండ జిల్లాలో ఉన్న ఆలేరు, భువనగిరి, రామన్నపేట, మోత్కూరు, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, పెద్దవూర, దేవరకొండ, చింతపల్లి, మునుగోడు, నల్లగొండ, నకిరేకల్లు, సూర్యాపేట, తుంగతుర్తి వంటి పంచాయితీ సమితిల వివరాలు; ఆ యా పంచాయితి సమితులలో పండే పంటలు, పాడి పరిశ్రమ, వైద్య ఆరోగ్య కేంద్రాలు, వ్యవసాయ పరపతి సంఘాలు, సహకార సంఘాలు, చిన్న నీటి వనరులు, సామాజిక విద్య – స్త్రీ శిశు సంక్షేమం, పంచాయితి సమితిలోని గ్రామ పంచాయితీలు, సర్పంచుల పేర్లు, పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలు మొ॥ వాటి గురించి పట్టికల రూపంలో సవివరంగా అందజేశారు.

## 5. జిల్లా పరిషత్తు – ఇతర శాఖలు

గతం నుండి స్ఫూర్తిని గ్రహించినచో వర్తమానమునకు, భవిష్యత్తునకు పునాదిగ ఉపకరించును. వర్తమాన స్థితి చక్కగా తెలిసినపుడే భవిష్యత్తునకు తగిన ప్రణాళికలను రూపొందించుటకు వీలు పడును. అందుకు అనుగుణంగా శాస్త్రి గారు నల్లగొండ మండలానికి సంబంధించిన పరిపానా విభాగాదుల వివరణను, పరిపాలనా తీరును, మండల అభివృద్ధిలో పాల్గొను ప్రముఖుల గురించిన సంక్షిప్త సమాచారం మొ॥ వాటిని ఈ విభాగంలో చేర్చారు.

1959లో ఏర్పడ్డ నల్లగొండ జిల్లా పరిషత్తు గురించి, చైర్మన్ల వివరాలను, అతిథి గృహాల గురించి, కేర్ సంస్థ మధ్యాహ్న భోజన పథకం, మంచినీటి వసతులు, పోలీసు వ్యవస్థ, రైల్వే పోలీసు శాఖ, నేర పరిశోధన శాఖ మొ॥ వాటి గురించి ఈ విభాగం మొదట్లో వివరించారు.

నల్లగొండ మండలంలోని చారిత్రక ప్రదేశాలైన ఇంద్రపాల నగరం (తుమ్మలగూడెం), ఇంద్రపాల గుట్ట, శిథిల నగరం, సిరికొండ, వేణుగోపాల స్వామి ఆలయం, కన్నేకల్లు, అనంతగిరి, ఆమనగల్లు, ఉంద్రుగొండ మొ॥ ప్రదేశాల వివరాలను, ప్రాశస్త్యాన్ని సవివరంగా తెలియ జేశారు.

నల్లగొండ మండలంలోని గ్రామీణులలో అధికులు సకాలంలో వర్షం లేక వ్యవసాయ భూములను కౌలుకిచ్చి ఇతర వృత్తులను చేపడుతున్నారు. ఈ మండలంలో ముఖ్యంగా వరి, జొన్న, సజ్జ, వేరుశనగ, ఆముదం, పెసర, కంది, ముఖ్యమైన పంటలు. పత్తి, పొగాకు, నూవులు, మిరప, ప్రొద్దుతిరుగుడు పూవు మొ॥ వ్యాపార సంబంధ పంటలు కూడ పండిస్తారు. పంటల గురించిన సమగ్ర సమాచారాన్ని, ఎన్ని ఎకరాల్లో పంటలు పండుతున్నాయో గణాత్మకంగా వివరించారు.

నల్లగొండ మండలం విద్య గురించిన సమాచారాన్ని కూడ సేకరించారు శాస్త్రిగారు. దేశ పురోభివృద్ధికి దోహద పడేది విద్యయని చెబుతూ ఈ ప్రాంతంలోని పాఠశాలలు, కళాశాలలు, స్త్రీ విద్య, అధ్యాపక వర్గం, అనియత విద్య, పాఠశాల భవనాలు, గురుకుల పాఠశాలలు (సర్వేలు బాలుర పాఠశాల, చౌటుప్పల్ బాలికల పాఠశాల), వయోజన విద్యా కార్యక్రమాలు, సమితుల వారిగా అధ్యాపకుల, అభ్యాసకుల వివరాలను (పట్టిక రూపంలో), అనుక్రమ కార్యక్రమాలను వివరించారు.

నల్లగొండ మండలంలోని మార్కెటింగ్ ప్రగతి, పశు గణాభివృద్ధి, మత్స్యశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి, సామాజిక అడవుల పెంపకం, న్యాయ వ్యవస్థ, అతిథి గృహాలు, ముఖ్యమైన రహదారులు (36), ఆడిటింగ్ శాఖ, రైలు మార్గం, వంతెనలు, తంతి తపాలా – దూర శ్రవణ శాఖ, క్రాస్ సంస్థల గురించి పేర్కొన్నారు.

నల్లగొండ మండలంలో ఉన్న ప్రముఖ వ్యక్తుల వివరాలు కూడ ఈ సర్వస్వంలో పేర్కొన్నాడు. వారిలో అచ్చాలు సుంకం, అనంత రామారావు, ఆరుట్ల కమలాదేవి, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, వడ్డేపల్లి కాశీరాం, వేనెపల్లి చందర్‌రావు, కాంచనపల్లి చిన వేంకట రామారావు, నీలా జంగయ్య, చిన వెంకట రెడ్డి, బోయ జంగయ్య, కుందూరు జానారెడ్డి, బి.ధర్మభిక్షం, గింజల నరసింహా రెడ్డి, భీంరెడ్డి నరసింహా రెడ్డి, దొడ్డ నర్సయ్య, మోత్కుపల్లి నర్సింహులు, ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి, ఎలిమినేటి మాధవరెడ్డి, గుత్తా మోహనరెడ్డి, వేదాటి రఘుపతి, శ్రీరంగాచార్య, ఎ.రఘుమారెడ్డి, వేదాటి రఘుపతి, రాగ్యా నాయక్, నర్రా రాఘవరెడ్డి, పెరికె రాజరత్నం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, కూరెళ్ళ విఠలాచార్య, వారణాసి వీరనారాయణ శర్మ, పులిజాల వెంకట రంగారావు, షబ్నవీసు వేంకట రామ నరసింహారావు, తేరాల సత్యనారాయణ శర్మ, మల్లు స్వరాజ్యం మొ॥ మొత్తం 158 మందిని పేర్కొన్నారు.

నల్లగొండ మండలంలోని సాంఘిక సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ వసతి గృహాల సంఖ్య, పనితీరు, విద్యార్థుల సంఖ్య, ఉపకార వేతనాల గురించి మరియు హరిజన సేవా సంఘం వివరించాడు. అదే విధంగా గిరిజన సంక్షేమం గురించి పేర్కొన్నారు.

## 6. శాసనాలు

చరిత్ర రచనకు ఉపకరించిన శాసనావళిలో నల్లగొండ మండలంలో లభ్యమైన అన్నింటిని సంకలన కర్త వరుసగా ఇందులో కూర్చటమనేది సర్వస్వానికి ఎంతో గౌరవాన్ని సమకూర్చింది. దీనిలో శాసన పాఠముల మొత్తం సంఖ్య 126. ఈ శాసనాల వలన పాఠకులకు తెలుగు భాషా పరిణామ రీతియు, సాంస్కృతిక పరిణామ గతియు చక్కగా విశదమగుచున్నది. చారిత్రక పరిశోధకులకు, భావి సాహిత్య పరిశోధకులకు, ఆకర గ్రంథముగ ఈ సర్వస్వమును, ఈ శాసనాలు రూపొందించబడ్డాయి. శాసన ప్రతిబింబాలను మనోహర్ గారు తీశారని పేర్కొన్నారు. తన జీవిత కాలంలో ఏ ఒక్క వ్యక్తి చేయలేని పనిని బి.ఎన్.శాస్త్రిగారు చేశారు. దాదాపు వెయ్యికి పైగా శాసనాలను వెలికి తీసి, వాటిని పరిష్కరించి, అచ్చువేశారు. ఈ నేపథ్యంలో వారి చేతికి వచ్చిన రెండు తామ్ర శాసనాలు అప్పటి దాకా ఉన్న 500 వందల ఏండ్ల చరిత్ర ఖాళీని పూరించేలా చేశాయి. అవి విష్ణుకుండినులకు చెందిన శాసనాలు. వీటి సేకరణ బి.ఎన్.శాస్త్రిగారి పరిశోధనలో కలికి తురాయి. గోవిందవర్మ ఇంద్రపాలనగర తామ్ర శాసనం, విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాల నగర తామ్ర శాసనం. రాగిరేకులపై ఉన్న ఈ రెండు శాసనాలు నేటి యాదాద్రి భువనగిరిలోని నాగారం - తుమ్మలగూడెం వద్ద లభించాయి. ఈ బ్రాహ్మీ శాసనాలను చదివేందుకు

శాస్త్రిగారు వెంటనే బ్రాహ్మీ నేర్చుకుని వాటిని పరిష్కరించారు. ఈ శాసనాల ఆధారంగా వారి రాజధాని ఇంద్రపాల నగరం (తుమ్మలగూడెం) అని నిరూపించారు. ఈ వ్యాసాలు 1965 జూన్, జులై భారతి సంచికలో ప్రచురింపబడ్డాయి. తర్వాత ప్రసిద్ధ చారిత్రక పరిశోధకులతో ఆమోదించబడినాయి.

తెలుగు ప్రాంతంలో దాదాపు నాలుగు వేల గ్రామాలు పర్యటించి, వందలాది శాసనాలను ప్రచురించారు. ఈ సర్వస్వంలో కొలనుపాక శాసనం, చిలుకూరు శాసనం, ఊట్కూరు శాసనం, అనుముల శాసనం, బూరుగు గడ్డ శాసనం, పానగల్లు శాసనం, పేరూరు శాసనం, నాగుల పాడు శాసనం, పిల్లలమర్రి శాసనం, అలగడప శాసనం, వాడపల్లి శాసనం మొ॥ 126 శాసనాలను ప్రచురించారు. శాస్త్రిగారికి శాసనాలపై పరిశోధన అంటే ఎంతో ఇష్టం. ఈయన పరిశోధనాంశం 'శాసనాల ద్వారా తెలుగు భాషా వికాసం'. తెలుగుదేశంలో ఉన్న వేల కొలది శాసనాలను పరిశీలించి నన్నయకు పూర్వం నుండి శాసనాల్లో తెలుగు భాష ఏ విధంగా ఉందో, ఎట్లా పరిణామం చెందిందో, ఆయా రాజుల కాలంలో తెలుగు భాష ఎట్లా పోషించబడిందో వివరించారు. తెలంగాణను కేంద్ర స్థానం చేసుకుని పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించి పరిపాలన సాగించిన వారు విష్ణుకుండినులు అని శాసనాల ద్వారా నిరూపించడమే కాకుండా వారి వంశవృక్ష, కాల నిర్ణయాన్ని చేసిన శాస్త్రి గారి శాసన పరిశోధన తరువాతి పరిశోధకులకు మార్గదర్శనం చేసింది. **"శాస్త్రి నుడివితే ప్రతి మాటా శాసనమౌతుంది. శాస్త్రి అడిగితే రాయైనా తన చరిత్ర చెబుతుంది"** అన్న గంజి సత్యనారాయణ గారి మాటలు అక్షర సత్యాలు.

## 7. వివిధ శాఖలు

నల్లగొండ మండలంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న బాలసదనములు, బాల విహార్‌లు, స్వయం ఉపాధి పథకం, పొదుపు పథకం, దుస్తుల తయారీ కేంద్రం, సిద్ధాన్న భోజన పథకం, కరువు నివారణ పథకం, జిల్లాస్థాయి కమిటీ గురించి వివరించారు. సమగ్ర బాలల అభివృద్ధి సేవా పథకము, మోత్కూరు, పోషకాహార పంపిణీ పథకం, వీనింగ్ ఫుడ్, నార్మల్ ఫుడ్, నాన్ ఫార్మల్ విద్య, రోగ నిరోధక మందుల పంపిణీ, ఆరోగ్య పరిశీలన, రిఫరల్ సర్వీసెస్, పోషక మరియు ఆరోగ్య విద్య, కార్యాత్మక విద్య, పోషకాహార కార్యక్రమం, ఆరోగ్య రక్షణ మొ॥ వాటిని వివరించారు. అంతే కాకుండా పాడి పరిశ్రమ, చేనేత పరిశ్రమ, రహదారులు మరియు భవనములు, రైతులు, భూగర్భ విజ్ఞానం, గృహ నిర్మాణం, నల్లగొండ జిల్లా ప్రాథమిక గణాంక దర్శిని, మండల వ్యవస్థను ఈ విభాగంలో వివరించారు.

## 8. అనుబంధాలు

1931 మార్చి 3వ తారీఖున దేవరకొండలో జరిగిన రెండవ ఆంధ్ర మహాసభలో ఆహ్వాన సంఘాధ్యక్షుని స్వాగతోపన్యాసం, ఖమ్మంలో జరిగిన తృతీయ ఆంధ్ర మహా సభాధ్యక్షోపన్యాసాలను అనుబంధంలో చేర్చడం జరిగింది. తర్వాత శ్రీ స్వయంభూ, శంభు లింగేశ్వర తారావళి అనే మకుటంతో జూనూతల వేంకట నారాయణ శర్మ గారు రాశారు. గ్రంథం చివర్లో 28 ఉపయుక్త గ్రంథాల పట్టిక, ముఖ్య పదానుక్రమణిక చేర్చారు.

శాస్త్రిగారు రచించి కూర్చిన ఈ మండల సర్వస్వం ఒక విజ్ఞాన భాండాగారం. మొదటగా నల్లగొండ మండల సర్వస్వంతో మొదలైన జిల్లా సర్వస్వాల రచన తర్వాత ఆదిలాబాద్, మహబూబ్ నగర్ సర్వస్వాల రచనకు దారి తీసింది.

ఉత్తమ శాసన పరిశోధకులుగా, చరిత్ర అధ్యయనవేత్తగా, సృజనాత్మక రచయితగా, సర్వస్వాల నిర్మాణ కర్తగా, చరిత్ర, సంస్కృతీ గ్రంథాల రచయితగా, పత్రికా సంపాదకునిగా, నడయాడే చారిత్రక సర్వస్వంగా బి.ఎన్.శాస్త్రి గారు అనేక శాఖోపశాఖలుగా విస్తరించారు.

**డా॥ ఇడికోజు శ్రీనివాసాచారి**
ప్రభుత్వ తెలుగు అధ్యాపకులు
ఫోన్ : 98853 49305



# ఆదిలాబాదు జిల్లా సర్వస్వము

**ఉపక్రమణిక**

అడవుల తల్లిగా విలసిల్లిన ఆదిలాబాదు జిల్లా సంపూర్ణ వివరాలను మాన్యులు మూసీ సాహిత్య పత్రికా వ్యవస్థాపకులు మరియు సంపాదకులైన శ్రీ బి.ఎన్.శాస్త్రి గారితో 1990 లో నాకు పరిచయం జరిగింది. తెలంగాణ ప్రాంతంలోని గల జిల్లాలను ప్రపంచానికి పరిచయం చేయాలన్న ఒక నిర్ణయాత్మకమైన దృఢ దీక్షతో మొదట తాను పుట్టి పెరిగిన నల్లగొండ జిల్లాను సమగ్రంగా దర్శించి, నల్లగొండ జిల్లా సర్వస్వంగా వెలువరించి భావి తరానికి, చరిత్రకారులకు, పరిశోధనలకు మార్గదర్శిగా అయినవాడనడంలో ఎలాంటి సంకోచం లేదు. ఆదిలాబాదు జిల్లాను కూడా సమగ్రంగా దర్శించిన మహానుభావులు వీరు. నాటి జిల్లా పరిషత్తు నిధులను సమకూర్చగా, ప్రపంచానికి పరిచయం చేయడానికి వీరొనర్చిన ప్రయత్నం, శ్రమ అనిర్వచనీయం.

1989,90 ప్రాంతంలో ఆనాడు జిల్లాలో గల 52 మండలాల సమగ్ర సర్వేగా వ్యవసాయ, చారిత్రక, సాంఘిక, ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, పారిశ్రామిక, రాజకీయమే కాకుండా జిల్లా నలుమూల ప్రాంతాల్లో గల శాసనాలు మరియు మరుగున పడ్డ ఎన్నో విషయాలను భావి తరానికి అందించే ప్రయత్నం చేసిన మేరునగధీరులు వీరు. వీరి ఈ రచనా గ్రంథం 1990 లో ఆనాటి జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులు మరియు కడెం మండల పరిషత్తు అధ్యక్షులైన శ్రీ రాజేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో డా. సామల సదాశివ గారు, ప్రముఖ పాత్రికేయులు జి. కృష్ణగారు, నాటి కలెక్టర్ గారు... ఇలా ఎందరో ప్రముఖులు హాజరు కాగా, కడెం మండల పరిషత్తు భవనము నందు ఆవిష్కరించబడింది.

ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్తు ఇచ్చోడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా ఒక సాహితీ పిపాసతో ఈ ఆవిష్కరణోత్సవంలో పాల్గొనే అదృష్టాన్ని నోచుకున్నాను. వారితో ఏర్పడ్డ సాహిత్యం మరియు సాహిత్యంలో గల వారికి గల అభినివేశం నాకు, నేను పదవీ విరమణ పొందిన పిదప 2005 లో జిల్లాలోని 52 మండలాలను దర్శించి, మన 'ఆదిలాబాదు' అనే ఒక జిల్లా దర్శినిని రచియించి, వెలువరించుటకు ఎంతో తోడ్పడిందని తెలియచేస్తున్నాను.

ఈ మహా గ్రంథం 'ఆదిలాబాదు సీమ విఖ్యాత నామ' అని శ్రీ జి.ఎం. రాములు గారి పద్య సరళితో ఆరంభమై, జిల్లా ప్రశస్తిని కొండను అద్దమందు చూపించినట్లు కవిరత్న నీలా జంగయ్య గారి పద్య ప్రాభవంతో ఆబాల గోపాలాన్ని ఆకర్షించింది. మాన్యులు బి.ఎన్.శాస్త్రి గారు ఈ అపూర్వ సర్వస్వాన్ని భక్తిశ్రద్ధలతో బాసర వాసిని అయిన చదువుల తల్లి శ్రీ జ్ఞానసరస్వతీ దేవి అమ్మవారి పాదపద్మాలకు అంకితం ఇవ్వడం ప్రశంసనీయం.

## ఆదిలాబాదు జిల్లా భౌగోళిక చరిత్ర

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమునకు ఉత్తర భాగాన సరిహద్దు జిల్లాగా, ఉత్తరాన పెన్‌గంగా, దక్షిణాన పవిత్ర గోదావరి నదుల విస్తరించి ఉన్న జిల్లా ఇది. ప్రాచీన కాలం నుంచి ఈ భూభాగం ప్రసిద్ధ రాజవంశీయుల పాలనలో ఉన్నట్టిది. ఈ జిల్లాను తమ రాజ్యాంతర్భాగంగా గ్రహించి మౌర్యులు మొదలుకొని ఆసఫ్జాహీ వంశీయుల వరకు పరిపాలన కొనసాగించారు. బీజాపూర్‌ను పరిపాలించిన మొదటి అలీ ఆదిల్షా తదనంతరం ఈ జిల్లాకు 'ఆదిలాబాదు' అనే నామం ఏర్పడిందని భావింపబడుతోంది.

నేటి ఆదిలాబాదు జిల్లా అంతా కూడా శాతవాహనుల ఏలుబడిలో ఉండెను. వారి సామంతులు, మాండలికులు, దండనాయకులు జైనథ్, చెన్నూరు, నిర్మల, మహిషపురము (భైంసా) ఉట్నూరులో ఉండిరి. ఆనాడు గోదావరి ప్రధాన జల మార్గముగా ఉపయోగపడింది. శాతవాహన వంశమునకు ఆదిపురుషుడు శాతవాహనుడు.

## నైసర్గిక స్థితి

సహ్యాద్రి పర్వత శ్రేణి ఈ జిల్లాలో వాయువ్యం నుంచి ఆగ్నేయం వరకు సుమారు 281.5 కి.మీ. వ్యాపించి వుంది. స్థానికులు ఈ పర్వత పంక్తిని 'సాత్నాల శ్రేణి' అంటారు. మహబూబు మరియు కెరిమెరి ఘాట్లు సముద్ర మట్టానికి మూడు వేల అడుగుల ఎత్తులో వున్నాయి.

జిల్లాలో ప్రధాన నదిగా గోదావరి, దక్షిణాన, ఉత్తరాన పైన్‌గంగా, వర్ధనది, చెన్నూరు ప్రాంతమున ప్రాణహిత, తూర్పు సరిహద్దుగా ప్రవహిస్తున్నవి. ప్రాణహిత ప్రాంతంలో కొన్ని లక్షల సంవత్సరాల క్రితం రాక్షసబల్లులు మొదలుగా గల సరీసృపాలు,

చరించినట్లుగా లభించిన శిలాజాల ద్వారా ఊహింపబడుతోంది. గోదావరి నది భారత ద్వీపకల్పంలోనే అతి పెద్దది, పొడవైంది. మహారాష్ట్రమందున్న పడమటి కనుమలలో నాసిక్ చెంతనున్న త్ర్యంబకమున గోదావరి జన్మించింది. ముథోల్ తాలూకాలోని బాసర వద్ద ఆదిలాబాదు జిల్లాలో ప్రవేశించి, జిల్లాకు దక్షిణ సరిహద్దుగా ప్రవహించి, నిజామాబాదు, కరీనంగర్ జిల్లాలను, ఆదిలాబాదు నుంచి వేరుపరుచుచున్నదని పేర్కొన్నారు.

పెన్‌గంగా నది ఆదిలాబాదు ఉత్తర సరిహద్దుగా ఉంది. వార్ధా నదియు ఈ జిల్లా ఉత్తర ప్రాంత సరిహద్దుగా ఉంది. ఇది సిర్పూరు తాలూకాకు ఉత్తరాన వుంది. ప్రాణహిత చెన్నూరు తాలూకా తూర్పు సరిహద్దుగాను, ఆదిలాబాదు జిల్లాకు ప్రాగ్దిశలో ఉంది. ప్రాణహిత ఉపనదులను, వార్ధా నదిని కలుపుకొని ప్రవహిస్తూ చెన్నూరు తాలూకాలోని దేవులపల్లి చెంత గోదావరిలో సంగమిస్తోందని పేర్కొన్నారు.

పెద్దవాగు ఆసిఫాబాదు, సిర్పూరు తాలూకాలలో ప్రవహించి ప్రణీతా నదిలో కలుస్తోంది. సాత్నాల, స్వర్ణ, సుద్దవాగు మొదలైన నదులు గోదావరిలో సంగమిస్తున్నాయి. వాగులు, వంకలు, ఉపనదులు, నదులు చివరకు గోదావరిలో చేరుతున్నాయి. భారత ద్వీపకల్పమున ఆదిలాబాదు జిల్లాకు భూనిర్మాణ ప్రణాళికావగాహన దృష్టితో చూస్తే ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉందని రచయిత పేర్కొన్నారు. భూగోళ నిర్మాణాన్ని సాక్షాత్కరించుకొని కొన్ని పొరలు ఆదిలాబాదు జిల్లాలో కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్ని విధాలైన భౌగోళిక పరివర్తనలను, మార్పులను తెలియజేయడానికి ఏర్పడిన బోధశాల వంటిది ఆదిలాబాదు అని రచయిత ప్రశంసించారు. రాక్షసిబొగ్గు, సున్నపురాయి, ఇనుప ఖనిజం, బంకమన్ను వంటి ఖనిజాలు ఈ జిల్లాలో ఉన్నాయి. వీటితో పాటు ఇనుప ఖనిజం, సున్నపురాయి. బంకమట్టి, మాంగనీసు వంటివి దొరుకుతాయి. అలాగే నిర్మల్ ప్రాంతంలోని అడవుల్లో పొనికి కర్ర లభించడం వల్ల కొయ్యబొమ్మల పరిశ్రమ కొనసాగుతోంది. అలాగే ఆదిలాబాదు, దేవాపూర్, మంచిర్యాల్ ప్రాంతాల్లో లభించే నాపరాయి వల్ల సిమెంటు పరిశ్రమ అభివృద్ధి చెందింది. ఇవేకాకుండా ఇనుప ఖనిజం, సున్నపురాయి, బంకమట్టి, మాంగనీసు మొదలైన ఖనిజాలున్నాయి.

## ప్రజలు – ఆచార వ్యవహారాలు

ఈ జిల్లా ఆదివాసి జిల్లాగా ప్రసిద్ధి చెందింది. గోండులు, వారితో వున్న మరికొన్ని తెగలవారు, బంజారాలు, మరాఠాలు, హిందూ సమాజంలోని నాలుగు వర్ణాల వారూ ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు ఉన్నారు. ప్రకృతి సంపద ఎక్కువగా ఉ

ండటం మూలాన ఈ జిల్లాకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చి స్థిరపడ్డారు. అలాగే వివిధ భాషలు మాట్లాడే వారిచట ఉన్నారు. అత్యధికంగా తెలుగు, మరాఠీ, బంజారా మాట్లాడేవా రున్నారు. గోండీ, లంబాడి, బంజారి, కోలామి, కోయ, మానె, నేతకాని, కన్నడ, మాథుర, తమిళం, బారె, మలయాళం, పంజాబీ మాట్లాడేవారూ ఉన్నారు.

అయితే ఆదిమవాసులలో గోండులు అత్యధికంగా వున్నారు. వీరు వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్నారు. పశుపోషణ, అటవీ సంపద సేకరణ వీరి ఆర్థిక స్థితి కొంత వరకు మెరుగుపరచటంలో తోడ్పడుతుంది. కొండపైన, లోయలోను, అడవి మధ్య గృహాలను ఏర్పర్చుకొని అడవి తల్లిని, భూమిని నమ్ముకొని జీవిస్తున్నారు. గోండులలో నాలుగు శాఖల వారున్నట్లు శాస్త్రిగారు పేర్కొన్నారు. పహండి, కుప్పార్, లింగోల్ వారు. గోండులలో రాజగోండులు, పర్ధాన్, తోటి, దడ్వే, గోవన్, కోలామ్ తెగలవారున్నారు. వీరిలో అంతర్వివాహములున్నవి. ఖజేగోత్రా, పెషివట్యాల్ పద్ధతులలో వీరు వివాహాలు చేసుకుంటారు. ఖజేఖోత్రా సంప్రదింపుల ద్వారా వివాహాలు జరుగుతాయి. పెషిపట్యాల్ పద్ధతిలో పెండ్లి కుమార్తెను బలవంతంగా ఎత్తుకొని పోయి వివాహం చేస్తారని వెల్లడించారు. ఇది రాక్షస వివాహం. ఈ పద్ధతి రాక్షస వివాహాలు అంతరించే దశకు వచ్చాయి. హిందూ వివాహ పద్ధతిని అనుసరించి గోండులు కనిపిస్తారు. గోండులలో ధనికులు, భూస్వాములు, రాజకీయ నాయకులు ఒకరికంటే ఎక్కువ మందిని వివాహమాడే పద్ధతుంది. వీరిలో బహుభార్యత్వం నిషేధం కాదు. కానీ కాలమును బట్టి మారుతోందని శాస్త్రి గారు స్పష్టంగా పేర్కొన్నారు. రాజగోండులకు సన్నిహితులు కోలామ్ జాతివారు. వీరి సాంఘిక ఆచార వ్యవహారాలు దగ్గరి పోలికలుంటాయి. కోలామ్ జాతి వారు వ్యవసాయమే ముఖ్యవృత్తిగా గలవారు. వీరు కోలామీ భాషను మాట్లాడతారు.

గోండు పురుషులు తెల్లని నూలు పంచెను మోకాళ్ల వరకు ధరించి తెలుపు లేక రంగు తలపాగాను ధరిస్తారు. స్త్రీలు తెల్ల చీరలు ధరించి చీరల క్రింద మొలచుట్టూ ఒక వస్త్రాన్ని కప్పుకుంటారని పేర్కొన్నారు. పురుషుల కంటే స్త్రీలే ఎక్కువ నగలు ధరిస్తారు. హిందువులు వినాయక చవితి, దసరా, దీపావళి లాంటి పండుగలు జరుపుకోగా, ముస్లింలు మొహర్రం, రంజాన్, బక్రీద్ లాంటి పండుగలు జరుపుకుంటారు. అయితే మొహర్రం మాత్రం హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకోవడం ఈ జిల్లా విశేషంగా పేర్కొంటారు. క్రిస్టియన్లు గుడ్‌ఫ్రైడే, క్రిస్మస్ ఈస్టర్ జరుపుకుంటారు. ఇక గిరిజనులు భీమ్‌దేవ్ పెర్సాపెన్, ఖుద్‌భానే, రాజుల, పొర, దసరా, దీపావళి, ఖెచ్‌డనురన్, గోకులాష్టమితో పాటు వివిధ పండుగలు జరుపుకుంటారు.

భూకంపాలు సంభవించడం వల్ల భూమిమీద అనేక పరిణామాలు సంభవించాయి. భూచలనం వల్ల సముద్రం ముందుకు చొచ్చుకొని వచ్చింది. అలా చొచ్చుకు వచ్చిన సముద్ర భాగంలోనివే నేటి నాందేడ్, యావత్‌మాల్, చాందా, ఆదిలాబాదు, కరీనంగర్, వరంగల్, ఖమ్మం, జిల్లాలని శాస్త్రి గారు ఈ పుస్తకంలో వెల్లడించారు. అదేవిధంగా రాక్షసి బొగ్గు గనులుంటాయని పేర్కొన్నారు. వీటిని సింగరేణి బొగ్గు గనుల యాజమాన్యం వారు తమ పరిధిలోకి తీసుకొని ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. తాండూరు, బెల్లంపల్లి, బొగ్గుగులను ప్రాంతాలు.

## అటవీ సంపద

ఈ జిల్లాలో అటవీ సంపద పుష్కలంగా ఉంది. ఇది ఉష్ణమండలారణ్యం. బంకమన్ను ప్రాంతాలందు విపరీతంగా తెల్లతుమ్మ, ఇసుక కలిసున్న ప్రదేశంలో చంద్ర, సోమిచెట్లు, ఉన్నట్లు తెలిపారు. ఈ జిల్లాలో భూ గర్భంలో వున్న భూమి సారవంతమైంది కాదు. రాళ్లు, రప్పలు పైకే కనిపిస్తాయి. ఈ ప్రదేశంలో దేవదారు, కొఱివి, అల్లి, పాలవంటి చెట్లు ఎక్కువగా కనిపిస్తాయి. తీరప్రాంతంలో ఈ చెట్లు బాగా కనిపించాయని ఆయన పేర్కొన్నారు. అక్కడక్కడ టేకు చెట్లున్నా సరే, ఆ కాలంలో వాటిని అటవీ అధికారులు పర్యవేక్షించేవారని తెలిపారు. అడవిలో 30 శాతం టేకుచెట్లు, తక్కినభాగం ఇతర చెట్లతో వుండేది. ఈ పుస్తకం రాసే క్రమంలో జిల్లాలో 40 శాతం భూమి అనగా 7600 చ.కి.మీ. అటవీ ప్రాంతమున్నట్లు తెలిపారు. ముధోల్ తాలూకాలో తప్ప, తక్కిన అన్ని ప్రాంతాలందు వంటచెరుకు, కలప, గడ్డిగాదము స్థానిక ప్రజలు అడవుల నుంచి సేకరించేవారు. అయితే ప్రభుత్వం మంచి టేకు, యూకలిప్టస్, వెదురు చెట్లను ఎక్కువగా పెంచేవారని పేర్కొన్నారు.

వీటితో పాటు వివిధ రకాలైన చెట్లను శాస్త్రి గారు ఎంతో శ్రద్ధగా పేర్కొనడం మనం గమనించాల్సిన అంశం. జిల్లా అడవుల్లో టేకు, నల్లమద్ది, ఏగి, చిట్టుమాను, బిల్లుడు, చిన్నంగి, తుమికి, ఇప్ప, తప్సి, గుంపెన, బూరుగు, జిట్టెగి, పచ్చారి, విషముష్టి, మారేడు, మోదుగు, గొట్టి, సారపప్పు, సార, రేల, ఎట్టబిక్కి, చిన్న వెదురు తంగేడు, పారిజాతం, దంతి, నూలుతాడు, పాలబరికి, చిట్టిజాన, జాజి, పాపట్ట, కొమ్మి, వావిలి చెట్లతో పాటు తీగమోదుగు, కోరింత, పాలతీగ, బొంతతీగ వంటి లతలుండేవి తెలిపారు. ఇక పశు గ్రాసానికి సంబంధించి కావంచగడ్డి, చీపురుగడ్డి, కంతారిగడ్డి, ఈడగడ్డి, రెల్లుగడ్డి, గరికగడ్డి, గుల్మాల గడ్డి ముఖ్యమైనవి. వీటితో పాటు విదేశీ వృక్షాలైన యూకలిప్టస్, జిట్టెగి, సూబబుల్ వంటి కార్యాలయాల్లో పెంచేవారి సునిశిత పరిశీలన ద్వారా శాస్త్రి గారు మనకు తెలిపారు.

అదేవిధంగా అడవుల్లో క్రూరమైన మృగాలు కూడా వుండేవి. పెద్దపులి, చిరుత, గుంటనక్కలు, తోడేళ్ళు, ఎలుగుబంట్లు లాంటివి బెజ్జూర్ అడవుల్లో వుండేవని పేర్కొన్నారు. దీంతో నిర్మల్, జన్నారం, మామడ అడవి ప్రాంతాలందు ఉండే పంటలకు విపరీతమైన నష్టం వాటిల్లేది. ఉట్నూరు, జన్నారం అడవుల్లోను, కొండలపైనను రాజులమడుగు, బీర్సాయ్‌పేట, అరణ్యాలందు బైసన్‌లు, మందలు మందలుగా సంచరించేవి. లక్షెట్టిపేట, చెన్నూర్, ఖానాపూర్ ప్రాంతాలందు జింకలు అధికంగా వుండేవట. నీల్గాయ్ అన్ని అడవులందు కనిపించేవి. ఈ జంతువు పంట పొలాలందు ప్రవేశించి నష్టం కలిగించేవట. కొందరు ఈ జంతువులను పెంచేవారని కూడా పేర్కొన్నారు. సాంబార్, పొదలదుప్పి జాతి జంతువులు మందలు మందలుగా సంచరించేవని పేర్కొన్నారు. ముళ్లపంది సంతతి అడవుల్లో అధికంగా కనిపించేవట. నాడు శాస్త్రి గారు పేర్కొన్న ఇవన్నీ కూడా నేడు అతి స్వల్పంగానే కనిపిస్తున్నాయి.

పెద్ద పులిని వేటాడి చంపుట గొప్పగా భావించేవారు ఈ జిల్లాలో ఉన్నారన్నది ఆసక్తికర వార్త. పెద్దపులి చర్మం చాలా విలువైంది. హైదరాబాదు నవాబులు, జమీందార్లు, ధనాఢ్యులు వేటవృత్తిని చేపట్టి జీవించేవారని పేర్కొన్నారు. పులిని వేటాడి చంపుట ఘనకార్యమని భావించేవారు. దొంగచాటుగా వేటాడేవారు. సరియైన పద్ధతిలో వేటాడక జంతువులకు గాయాలు చేసేవారన్న సున్నిత అంశాన్ని కూడా సర్వస్వంలో పేర్కొన్నారు. అయితే గాయపడ్డ జంతువులు తిరిగి పగ తీర్చుకోడానికి గ్రామాలపై పడి, మనుష్యులను గాయపరిచి, చంపిన ఘటనలు కూడా నమోదయ్యాయని పేర్కొన్నారు.

## జిల్లా వాతావరణం

జిల్లా వాతావరణంలో వేసవి కాలము ప్రధాన పాత్ర వహించేది. నైరుతి రుతుపవనాలు వచ్చే కాలమందు తప్ప తక్కిన కాలం అంతా కూడా వాతావరణం సమూష్ణంగా ఉంటుంది. ఆదిలాబాదు జిల్లా వాతావరణ సమయాలు నాలుగు భాగాలుగా విభజింపవచ్చు. డిసెంబరు నుంచి ఫిబ్రవరి మాంసాంతం వరకు శీతాకాలము, మార్చి నుంచి మే నెల చివరి వరకు వేసవి కాలము. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాకాలము. అక్టోబర్, నవంబర్ మాసములు వర్షాకాలము.

అశోక చక్రవర్తి కళింగ యుద్ధానంతరం, బౌద్ధమతాన్ని స్వీకరించి, ఆ మత ప్రచారమునకు జీవితమంతా ధారవోశాడు. అతని సామంతులుగా ఆంధ్రులున్నట్లు అతని 13 వ శిలా శాసనము తెలుపుతున్నది. మహాదేవ భిక్షువు ఆంధ్ర దేశమున బౌద్ధమతాన్ని ప్రచారం చేయడానికి అశోక చక్రవర్తిచే నియమింపబడ్డాడు. అశోక చక్రవర్తి క్రీ.పూ. 232

లో మరణించు నాటికి ఆంధ్ర దేశమును కోటిలింగాల రాజధానిగా సిముకుడు ఏలుచుండెను. శాతవాహనుడు, సిముకుడు పాలించారు. ఆ తర్వాత కృష్ణుడు, మొదటి శాతకర్ణి, పూర్ణోత్సంగుడు, స్కందస్తంబి, రెండో శాతకర్ణి, అపీలకుడు, మేఘస్వాతి... ఇలా పాలించి పులోమావితో ముగుస్తుంది.

శాతవాహనుల కాలంలో రాజన్యులు వారి సామంత మాండలికులు సమర్థులైన పాలకులుగా కీర్తివహించారు. పరిపాలనకు మూలాధారుడు. వారసత్వము పురుషులదే. రెండవ పులోమావి వాసిక శాసనమున గౌతమీపుత్ర శాతకర్ణి "అపరాజిత విజయ పతాక ససతు జనతువధసనీయ పురవరస కులపురిన పరపరాగత విపులా రాజసదస అగమాన నిలయసస పురిసానం అసయాససిరీయ' అని వర్ణింపబడినాడు. ఈ రాజన్యులు అపరాజిత విజయపతాకలుగా, ఏక ధనూర్ధారులుగా శాసనాలలో వర్ణించారు.

శాతవాహనుల కాలంలో విదేశీ వ్యాపారం కూడా బాగా సాగింది. వర్తక సంఘాలు, శ్రేణులు, వ్యాపారులకు అన్నివిధాలా సహాయపడుచుండెను. కార్మిక శ్రేయో సంస్థలు కార్మికుల క్షేమముగా చూసేడివారు. పైఠన్, తగర, జున్నార్, కరహాటక, నాసిక, గోవర్ధనము, వైజయంతి, కల్యాణ నగరములు, వ్యాపార కేంద్రాలు. ధరణికోట, కెవురూర, విజయపురి, మూషిక నగరాలు, భూమర్గ వ్యాపార కూడలులు.

జావా, సుమత్రా, బోర్నియో, మలయా, బర్మా, సయాం, చైనా, ఈజిప్టు, మెసపుటేమియా, బాబిలోనియా, రోమ్‌వంటి ప్రాక్పశ్చిమ దేశాలతోను, నగరములతోను వ్యాపారము జరుగుచుండెను. సుగంధ ద్రవ్యాలు, బట్టలు విశేషంగా విదేశాలకు ఎగుమతి చేసేవారు.

శాతవాహనుల తర్వాత వాకాటకులు, విష్ణుకుండినులు వచ్చారు. శాసనములందు విష్ణుకుండినులు 'దక్షిణాపథపతి", "త్రికూట మలయాధిపతి, శ్రీ పర్వతస్వామి పాదానుధ్యాత"లను బిరుదములు కలిగి యున్నట్లు వర్ణించారు. ఈ వంశీయులు తమ రాజ్యమును కృష్ణా గోదావరి నదుల మధ్య ప్రాంతమునందే కాక, దక్షిణమున విస్తరింపజేసిరి. విక్రమేంద్ర భట్టారక వర్మ వేయించిన ఇంద్రపాలనగర తామ్ర శాసనము వల్ల విష్ణుకుండిన రెండవ మాధవవర్మ తూర్పు, దక్షిణ, పడమటి సముద్రములను, ఉత్తరమున రేవానది సలిలముగాను సరిహద్దు గల భూభాగమునకు ప్రభువైనాడని ఇందులో వర్ణించారు.

విష్ణుకుండినుల తర్వాత బాదామీ చాళుక్యులు వచ్చారు. వీరు ఆదిలాబాదు జిల్లా మొదలుకొని తెలంగాణ ప్రాంతం అంతా జయించి, తమ రాజ్యములో చేర్చుకొని రాజప్రతినిధుల ద్వారా పాలనము గావించి వందల కొలది శాసనములను వేయించినారు.

కన్నడ, సంస్కృతాంధ్ర, మహారాష్ట్ర భాషలను ఆదరించి అనేక గ్రంథాలు వెలువడటంలో తోడ్పడ్డారు. బాదామీ లేక వాతాపి వీరి రాజధాని. గొప్ప వ్యాపార కేంద్రము. వైదికమత సంస్థలకు నిలయాలు. బాదామీ తరువాత రాష్ట్రకూటులు, వేములవాడ చాళుక్యులు, చాళుక్యులు, కాకతి వంశీయులు పరిపాలించారు.

ఈ జిల్లా 77 డిగ్రీల -46 డిగ్రీల-80 డిగ్రీల రేఖాంశాలు, 18 -40 డిగ్రీలు, 19-56 డిగ్రీల అక్షాంశాల మధ్య ఈ జిల్లాకు ఉత్తరాన మహారాష్ట్రలోని యావత్‌మాల్-చాందా జిల్లాలు, తూర్పున చాందా, పశ్చిమాన నాందేడ్, దక్షిణాన నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలు సరిహద్దుగా ఉన్నవి. ఈ జిల్లా వైశాల్యం 16,203.8 చ.కి.మీ. రాష్ట్రంలో వైశాల్యంలో మహబూబునగరం తర్వాత రెండో స్థానం ఆక్రమించింది. ఈ పుస్తకం వెలువడే నాటికి ఈ జిల్లాలో నాలుగు డివిజన్లుగా విభజింపబడి వుంది. అవి. 1. ఆదిలాబాదు 2. నిర్మల్ 3. ఆసిఫాబాదు 4. ఉట్నూరు

మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత ఆదిలాబాదు రెవిన్యూ డివిజన్లో పది మండల కేంద్రాలు, నిర్మల్ డివిజన్లో 19 మండల కేంద్రాలు, ఆసిఫాబాదులో 15 మండల కేంద్రాలు, ఉట్నూరులో 8 మండల కేంద్రాలుండేవి. చారిత్రక నేపథ్యాన్ని గ్రహించినట్లయితే 1905 లో ఆదిలాబాదు జిల్లా స్వతంత్ర జిల్లాగా రూపొందించబడింది. 1913,1914 సంవత్సరమున ఆదిలాబాదు నుంచి జిల్లా కేంద్రం ఆసిఫాబాదుకు మార్చబడింది. తర్వాత 1941 లో ఆదిలాబాదు పట్టణానికి జిల్లా కేంద్ర కార్యాలయాలన్నీ ఆసిఫాబాదు నుంచి మార్చబడింది.

1956 లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ, భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ జిల్లాలన్నీ విలీనం అయ్యాయి. ఈ జిల్లాలో సరిహద్దు ప్రాంతాలైన రాజురా, కిన్వట్, బోథ్ తాలూకాలోని ఇస్లాంపూర్ సర్కిల్ మహారాష్ట్రాన చేర్చబడింది. ఆ రోజుల్లో నాందేడ్, కుభీర్, భైంసా, రెవిన్యూ సర్కిల్ గ్రామాలను ఆదిలాబాదు జిల్లాలో చేర్చారు. జిల్లాలో రెవిన్యూ గ్రామల సంఖ్య 1721. అందు నిర్జన గ్రామాలు 178 (పుస్తకం వెలువడిన సందర్భంలో)

ఆదిలాబాదు జిల్లాను పాలించిన రాజవంశముల వారికి భూమిపై వచ్చే పన్ను ముఖ్య ఆదాయంగా ఉండెను. శాతవాహనాది రాజవంశీయులు భూమిశిస్తును ధన రూపంలోనో, ధాన్య రూపంలోనో వసూలు చేసేవారు. నిజాం ప్రభుత్వపాలనలో తాలుగ్దారు భూమిశిస్తు వసూలుతో పాటు జిల్లా పరిపాలన బాధ్యత వహించేవారు. దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు, గ్రామాధికారులు ప్రజల నుంచి భూమిపన్నులు వసూలు చేసి రాజ

కోశాగారానికి చేర్చేవారని శాస్త్రి గారు ఇందులో పేర్కొన్నారు. ప్రతీ గ్రామానికి కూడా శిస్తు చెల్లించు ద్రవ్యమును ముందే నిర్ధారించేవారు. ఈ ద్రవ్యమునకు కొరత యేర్పడినా, ఆ కొరత ద్రవ్యమును గ్రామీణులు వారి వారి భూ పరిమితిని అనుసరించి భరించేవారని తెలుస్తోంది. కోతలకు ముందే శిస్తు చెల్లించేవారు. ముందుగా శిస్తు చెల్లించని వారి తరపున గ్రామంలోని షావుకారు హామీపత్రం రాసి ఇచ్చేవారట. శిస్తు వసూలు చేయలేని వారు సకాలమున ప్రభుత్వమునకు శిస్తు చెల్లించకున్న ప్రభుత్వము వారికి నోటీసులు జారీచేసేది. పన్ను చెల్లించని వారి భూములను ఆక్రమించుకొనుట, ఇంటిసామానులను జప్తు చేయడం లాంటివి అప్పట్లో వుండేవని రచయిత ఈ సర్వస్వంలో పేర్కొన్నారు.

ఇక, ఆర్థిక పరిస్థితి మూమూలుగా ఉండేదని పేర్కొన్నారు. పూర్వం వైశ్యులు రైతులకు, పనివారికి దేశీయ పద్ధతిలో అప్పులిచ్చి వడ్డీలు వసూలు చేసేవారు. ప్రత్యేకంగా డబ్బును వడ్డీకిచ్చు వ్యాపారులే ఎక్కువ అని పేర్కొన్నారు. తర్వాత తర్వాత నిజాం ప్రభుత్వం అధికారుల ద్వారా, రుణ వ్యవస్థను పరిశీలించి, సహకార సంఘాల ద్వారా రైతులకు, ప్రజలకు తక్కువ వడ్డీతో రుణ సౌకర్యము కొరకు తగిన చర్యలు తీసుకుంటారు. అలాగే వాణిజ్య బ్యాంకులు కూడా ఉండేవి. 1947 లో మొట్టమొదటి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు శాఖ ఆదిలాబాదుకు వచ్చింది. తర్వాత కాగజ్‌నగర్, నిర్మల్, భైంసా, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూరులో వచ్చాయని పేర్కొన్నారు. వీటితో పాటు గ్రామీణ బ్యాంకులు కూడా ప్రజలకు సేవలందించేవి. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం వాణిజ్య బ్యాంకులుండేవి. 1968 నాటికి ఆదిలాబాదు జిల్లాలో ఐదు గ్రామీణ బ్యాంకులు వచ్చేవని పేర్కొన్నారు. వీటితో పాటు జీవిత సాధారణ బీమా వ్యాపారం కూడా జరిగినట్లు పేర్కొన్నారు. హిందుస్థాన్ ఐడియల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా జనరల్ ఇన్సూరెన్సు కంపెనీలుండేవి.

ఇక శాంతిభద్రతలను కూడా సర్వస్వంలో రచయిత పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో లాగే పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేసేది. అయితే సరైన పద్ధతిలో లేదని పేర్కొన్నారు. సైన్యము నుంచి విరమించిన సైనికులు, సిబ్బంది, నౌకరులు, గ్రామ సేవకులు పోలీసు విధులను నిర్వర్తించేవారట. అయితే కలెక్టర్లు తమ పనులను కింది స్థాయి ఉద్యోగులకు అప్పజెప్పి హైదరాబాదులో ఉండేవారని పేర్కొన్నారు. అయితే శాంతిభద్రతల్లో నిమగ్నులైన వారికి నెలనెలా జీతాలు వచ్చేవి కావు. ఇతర మార్గాలను అన్వేషించేవారు. దీంతో శాంతిభద్రతలు కరువైయ్యాయి. జిల్లాలోని గ్రామాల్లో దోపిడీలు జరిగేవి. అఫ్ఘన్ దేశీయులగు కాబూలి వాలాలు, ప్రజలకు రుణాలిచ్చి అధిక వడ్డీని వసూలు చేసేవారు. అయితే 1865

తర్వాత మెల్లిగా పోలీసు వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. దీంతో పాటు రైల్వే కూడా సేవలందించేది. అయితే నిజాం ప్రభుత్వం భారత ఆధీనంలోకి వచ్చిన తర్వాత రైల్వే అభివృద్ధి చెందింది. ఆదిలాబాదు నుంచి నాందేడ్ వరకున్న మీటర్ గేజ్ రైల్వేలైనుపై ఉన్న స్టేషన్లలోను, మంచిర్యాల నుంచి సిర్పూరు వరకున్న బ్రాడ్‌గేజ్ లైనుపై నున్న స్టేషన్లలోను సిబ్బంది ఉండేవారు. అలాగే ఖైదీల కోసం కారాగారాలు, బందీఖానాలు ఉండేవి. అయితే నేరస్థులను. దోషులను కలెక్టరు కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాములల్లో బంధించేవారట. తర్వాత కారాగారాలు వెలిసాయి. అయితే నేరస్థులు స్వయంగా వంట చేసుకునేవారు.

జిల్లాలో విద్యావ్యాప్తి అంతంత మాత్రంగానే వుండేది. కానీ కాలం మారుతున్నా కొద్దీ విద్యావంతులు కూడా పెరిగారు. జిల్లా ప్రజాపరిషత్తు ఆధ్వర్యంలో పాఠశాలలు నడిచేవి. వాటి సంఖ్యను, విద్యార్థుల సంఖ్యను, ఉపాధ్యాయుల సంఖ్యను కూడా పొందుపరిచారు. వయోజన విద్య, ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టు ఉట్నూరు ద్వారా, సమగ్ర బాలాభ్యుదయ సేవా పథకం ద్వారా, సమగ్ర బాలాభ్యుదయ సేవాపథకం చెన్నూరు, తెలుగు బాల మహిళా ప్రాంగణం చించోళి, స్త్రీ శిశుసంక్షేమం ద్వారా విద్యా వ్యాప్తి జరిగింది. అయితే 1948 వరకు జిల్లాలో గ్రంథాలయోద్యమ ప్రభావం లేదు. 1958 నుంచి ఆదిలాబాదు జిల్లాలో గ్రంథాలయాల ఊపు వచ్చింది. అయితే గ్రంథాలయ సంస్థ 1958 లో జరిగింది. జిల్లా విద్యాధికారి పర్యవేక్షించేవారు. తొలుత ఒక జిల్లా కేంద్ర గ్రంథాలయం, మూడు శాఖా గ్రంథాలయాలుండేవి. అయితే 1960 లో గ్రంథాలయ సంస్థ ఎన్నికలు జరిగాయి. డా.ఎస్.ఎల్. వైద్య అధ్యక్షులుగా, కె. రామారావు కార్యదర్శిగా పనిచేశారు. అయితే ఎవరెవరు సిబ్బంది ఇందులో పనిచేశారన్న పూర్తి సమాచారాన్ని శాస్త్రిగారు ఇందులో పొందుపరిచారు.

సహకార శాఖ ద్వారా కేంద్ర సహకార బ్యాంకులు రుణమాఫీలు, వ్యవసాయ రుణాలు ఇచ్చేవారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఋణాలిచ్చేవారు. అయితే ఏయే కాలాల్లో రైతులు ఎంతెంత ఋణాలను తీసుకున్నారన్నది సవివరంగా వివరించారు. దీంతో పాటు ఏఏ మండలాల్లో వివిధ బ్యాంకులు ఎరువులు ఎంత విలువలకు ఇచ్చారో పేర్కొన్నారు. అయితే వైద్య ఆరోగ్య శాఖలో కూడా జిల్లా, డివిజన్ కేంద్రాల్లో అట్లే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తపడేవారు. పరిశ్రమ విభాగంలో కూడా జిల్లా ముందంజలో వుండేది. సిర్పూర్ కాగజ్‌నగర్లో ఓ పేపర్ మిల్లు, ఆదిలాబాదులో సీసీఐ సిమెంటు ఫ్యాక్టరీలుండేవి.

ఎత్తు పల్లాలతో వుండే ఆదిలాబాదు జిల్లాలోని భూమి, చిన్నచిన్న సెలయేర్లు, వాగులు, నదులు ప్రవహించడానికి అనుకూలంగా వుండేది. ఇక్కడ గోదావరి, పెన్‌గంగా, ప్రాణహిత, వార్దానదులుంటాయి. కడెం, పెద్దవాగు, చిన్నవాగు, కెరిమెరి, స్వర్ణ వంటి ఉప నదులు ఉన్నాయి. కడెం, సీరాల, స్వర్ణ. సాత్నాల, వట్టివాగు, చెలిమెల ప్రాజెక్టులు, ఖానాపూర్ కాలువ, సరస్వతీ కాలువ, బావులు, గొట్టపు బావులు, కుంటలు, చెరువులు, ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి.

కడెం, నీల్వాయి, స్వర్ణ, సాతనాల, వట్టివాగు ప్రాజెక్టులు ఈ జిల్లాలో వేలాది ఎకరాలకు నీరు అందిస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి బయలుదేరు సరస్వతీ కాలువ కడెం రిజర్వాయరులో కలుస్తోంది. ఖానాపూర్, గోదావరి కాలువ వందల కొలది ఎకరాలకు నీరందిస్తూ కడెం ప్రాజెక్టులో కలుస్తుంది. కడెం ప్రాజెక్టు గోదావరి ఉత్తరలోయ పరివాహక ప్రాంతంలో వుంది.స్వర్ణ ప్రాజెక్టు నిర్మల్ తాలూకాలోని జౌలీ గ్రామంలో ఉ ంది. ఈ ప్రాజెక్టు పరిణామం చిన్నది. 31 కి.మీ. పొడవున్న కాలువ గల ఈ ప్రాజెక్టు కింద వందల ఎకరాలు సేద్యమవుతున్నాయి. వీటితో పాటు జిల్లాలో జలపాతాలు కూడా ఉన్నాయి. అందులో ఒకటి కుంతల జలపాతం. ఇది నేరెడుగొండ మండలం నుంచి 12 కి.మీ. దూరంలో వుంటుంది. కడెం గోదావరి ఉపనది. సహ్యాద్రి పంక్తులలో చిన్నవాగుగా ఏర్పడి, నదీ రూపము ధరించి, ఒంపుసొంపుల ఒయ్యారంతో ప్రవహస్తూ కుంతల జలపాతం ఏర్పడింది. 45 మీ. ఎత్తు నుంచి దూకే ఈ జలపాత ప్రాంతం ప్రకృతి సౌందర్యం వర్ణనాతీతం. ఈ జలపాతం వద్దనున్న వృక్షము కింద దేవతా విగ్రహాలున్నాయి.

కుంతల జలపాతంతో పాటు పొచ్చెర జలపాతం కూడా కనిపిస్తుంది. కుంతల కంటే చిన్నదైనా చూడడానికి కడు రమణీయంగా ఉంటుంది. ఇది పొచ్చెర గ్రామ పరిధిలోనిది. దీని తర్వాతి జలపాతం గాయత్రి జలపాతం. ఇది బోథ్ తాలూకాలోని తర్ణం గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో వుంది. దీనిని స్థానికులు గాడిద గుండముగా పిలుస్తారు. ఇచ్చోడ, బోరిగాం గ్రామము సరిహద్దు నుంచి ప్రవహించు గుడివాగు, చిన్నవాగుతో కలిసి తర్ణం అడవిలో గాయత్రీ జలపాతం ఉంది. జాతీయ రహదారికి కొద్ది దూరంలో ఘన్‌పూర్ జలపాతం ఉంది. దీనిని బంగనాల జలపాతం అని కూడా అంటారు.

ఇక, స్థానిక పరిపాలన విభాగాన్ని గనుక తీసుకుంటే ఇదివరకే చెప్పినట్లు జిల్లాల్లో 52 మండలాలు ఉన్నాయి. ఈ 52 మండలాలు కూడా రాజకీయంగా అత్యంత చైతన్యవంతమైన గ్రామాలు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు ఇత్యాదులతో వర్ధిల్లుతున్నాయి. ఈ 52 మండలాల్లో కూడా ప్రతీ విషయాన్నీ శాస్త్రిగారు

కూలంకషంగా చర్చించారు. పశువులు, గ్రామాలు, వ్యక్తులు, రాజకీయ నాయకులు వివరాలు, స్థానిక నేతలు, స్థానిక సంస్థల నేతల ఫోటోలతో సహా వివరించారు.

చివరి పుటల్లో గోలకొండ కవుల సంచికలో ఆదిలాబాదు జిల్లా కవుల ప్రస్తావనపై వ్యాసం వుంటుంది. అయితే అందులో ఆదిలాబాదు జిల్లాకు చెందిన ముగ్గురు కవులను పేర్కొన్నారు. కానీ అందులో ఇద్దరి కవుల సమాచారం మాత్రమే లభించింది. కవుల సంచికలో 273 నెంబరు కవిగా పేర్కొనబడిన శ్రీ నిర్మల శంకరశర్మ గారి వివరాలు 380 వ పుటలో ఉన్నట్లు శాస్త్రిగారు పేర్కొన్నారు. తర్వాత ఆయన పుట్టుపూర్వోత్తరాలు, ఆయన రచనా వ్యాసంగము, పద్యాలను పొందుపరిచారు. వారి తర్వాత ఆరుట్ల రామానుజాచార్యుల వారిని పేర్కొన్నారు. గోలకొండ కవుల సంచికలో 103 వ కవిగా, 406 పుటలో పేర్కొన్నారని శాస్త్రిగారు సవివరంగా పేర్కొన్నారు. అంతేకాకుండా సుప్రసిద్ధ హిందుస్థానీ సంగీత విశ్లేషకులు, సాహితీవేత్త అయిన సామల సదాశివ గారు 'ఆదిలాబాదు జిల్లా సాహిత్య చరిత్ర' అనే వ్యాసాన్ని ఇందులో రాశారు. జిల్లావ్యాప్తంగా ఏఏ సాహిత్య సుప్రసిద్ధులు ఎక్కడ స్థిరపడినారు, వారి పుట్టుపూర్వోత్తరాలను సదాశివ గారు పేర్కొన్నారు. వామమామలై వరదాచార్యులు, డా. విజయ మోహన్‌రావు, శ్రీమతి మాలినీ చందూర్కర్, రంగనాథ్, అలాగే మారుగొండ నర్సింలు, మడిపల్లి భద్రయ్య, డా. వఝ్ఝ, భావూరావు, వైద్య, రఘునాథరావు సర్‌పట్‌వార్, డా. నార్లావార్, జయప్రకాశ్ వైద్య, విశ్వనాథరావు దేశ్‌పాండే, నారాయణరావు తిక్కా, శశికాంత్‌రావు దేశ్‌పాండే, మాధవరావు చల్లా, ఆడెపు నారాయణ రావు...... ఇలా ఎందరినో సదాశివ గారు ఈ వ్యాసంలో పేర్కొంటారు. ఆ తర్వాత ముదిగొండ ఈశ్వరచరణ్ రాసిన జిల్లా జానపద సాహిత్య వైభవం వ్యాసం ఉంటుంది. జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి, బాసర సరస్వతి, మాహూర్ రేణుకాదేవి మొదలైన ప్రాచీన దేవాలయాల ప్రస్తావన ఉంటుంది. దీంతో పాటు అంకమ రాజు కథ, బాలనాగమ్మ కథ, కుచేలోపాఖ్యానం, గొల్లకథ, వాసుదేవుని కథ..... ఇలా వీటిన్నంటి జానపద గాథలుంటాయి.

'ఆదిలాబాదు మాండలికాలు' పేర అద్భుతమై వ్యాసం సర్వస్వంలో పొందుపరిచారు శాస్త్రిగారు. ఆదిలాబాదుజిల్లాను పూర్వం 'ఎదులాపురం' అని కూడా పిలిచేవారు. ఆదిలాబాదుకు ఆనుకొనే పక్కన మహారాష్ట్ర ప్రాంతం వుంటుంది కాబట్టి తెలుగు, మరాఠీ సంప్రదాయం కలిసిపోయి ఉన్నట్లు కనిపిస్తుంది.కాబట్టి మధ్యమధ్యలో మరాఠీ మాండలికాలు కూడా వచ్చి చేరుతాయి. ఉదాహరణకు... 1. ఆయి : (మ), తల్లి, అమ్మాయి: అమ్మ+ ఆయి= తల్లి 3. బొప్ప : పల్లెటూరి వాడు, అమాయకుడు,గురడి కాపులు - రెడ్లు, గూండ్లోళ్లు - బెస్తవారు, ధన్గరోళ్లు : నకాశివారు, తొగర్లు : కందులు, మక్కలు : మొక్కజొన్న కంకులు, కసలం: పెద్దబండి, సవార్లు : పీరీలు, చేదాడ్డి : చేద్దాము... ఇలా కొన్ని ముఖ్యమైన

మాండలిక పదాలను తీసుకొని వాటిని వ్యవహార భాషలో ఏమంటారో ఓ జాబితాను రూపొందించారు. దీని తర్వాత 'ఆదిలాబాదు గ్రామనామాలు' అనే వ్యాసం ఉంటుంది. ఆయా గ్రామాలకు ఆ పేరు ఎలా వచ్చిందో సోదాహరణంగా వివరించారు శాస్త్రిగారు.

ఉదాహరణకు : జిల్లా కేంద్ర స్థానం ఆదిలాబాదు తొలినాటి పేరు 'ఎదులాపురం'. ఆ రోజుల్లో ఇక్కడ ఎద్దుల సంత జోరుగా సాగేదట. చుట్టుపక్కల గ్రామాల వారే కాకుండా కరీంనగర్ నుంచి కూడా వచ్చి బేరసారాలు సాగించేవారని రచయిత తెలుపుతారు. అందువల్లే దీనికి 'ఎదులాపురం' అని వచ్చిందని పేర్కొంటారు. ఆ తర్వాత 'ఆదిల్‌ఖాన్' అనే అధికారి అభివృద్ధి చేశారు కాబట్టి, దీనికి 'ఆదిలాబాద్' అని పేరు వచ్చిందని అంటారు.

ఇక. లక్సెట్టిపేట. లక్ష్మి+ శెట్టి+పేట అని, లక్ష+శెట్టి+పేట అని రెండు రకాలుగా విభాగం చేశారు. లక్ష్మిశెట్టి పొందించడం వల్ల లేదా అతడు నివసించడం వల్ల 'లక్ష్మిశెట్టిపేట" అయిందని వారి వాదం. అంటే తన ఏత్వం క్ష పూర్తిగా కిచ్చి శ కారం పూర్తిగా మరుగైపోయిందన్న మాట. లక్ష్మిశెట్టి కాదు, లక్ష కల శెట్టి – లక్షశెట్టి. అతడున్న ఊరు లక్షశెట్టి పేట. అదే లక్సెట్టిపేటగా మారిందని తెలిపారు. ఇలా... కొన్ని గ్రామాల పేర్లు తీసుకొని వాటికి ఆ పేర్లు ఎలా వచ్చాయో తెలిపారు.

దీని తర్వాత ఆదిలాబాదు జిల్లాలో జరిగిన ముఖ్య సంఘటనల జాబితాను పేర్కొన్నారు. అందులో ఇంద్రవెల్లి కాల్పులు, తమిళనాడు రైలు ప్రమాదం. మంజులాపూర్ కాల్పులు, గొల్లగూడ ఎన్‌కౌంటర్, సాతనాల రైతుల పోరాటం, రేడియో స్టేషన్ ప్రారంభం, అల్లంపల్లి కాల్పులు... ఇలా మొదలైన వాటిని రికార్డు చేశారు.

చివరి అధ్యాయంగా 'ఆదిలాబాదు జిల్లా–పుణ్యక్షేత్రములు' అన్న వ్యాసం ఉంటుంది. ఇందులో జిల్లాలోని ముఖ్య ఆలయాలు, వాటి శాసనాలను ఫోటోలతో సహా పొందుపరిచారు. అక్కకొండ నరసింహ స్వామి, అడెల్లి పోచమ్మ, ఈస్‌గావ్, ఉమ్రి – రామాలయం, కదిలి పాపహరేశ్వరం, కేస్లాపూర్ నాగోబా, గంగాపూర్ వేంకటేశ్వర ఆలయం, గూడెంగుట్ట సత్యనారాయణ దేవాలయం, జైనథ్ లక్ష్మినారాయణ ఆలయం వాటి శాసనాలు, పెద్దబుగ్గ శివాలయం, బాసర సరస్వతీ క్షేత్రము, వడ్డాడి నృసింహ దేవాలయం, సిరిచెల్మ సోమేశ్వరాలయం..... ఇలా దేవాలయాలు, వాటి క్షేత్ర మాహాత్మ్యం, శాసనాలు, దేవతా విగ్రహాలు పూర్తి వివరాలతో **'ఆదిలాబాదు జిల్లా సర్వస్వం'** అనే ఉద్గ్రంథాన్ని శాస్త్రిగారు ముగించారు.

**మడిపల్లి భద్రయ్య**
విశ్రాంత ఉపాధ్యాయులు, నిర్మల్.
ఫోన్ : 988 583 0550



# మహబూబు నగర సర్వస్వము

"శ్రీశైలోత్తర పశ్చిమాశల లసత్ క్షేత్రస్థ ద్వారావళీ
ప్రాశస్త్యంబలరారి వైరిగత దర్పమ్మూర్చి భూభృద్వరుల్
సౌశీల్యాదుల పాలనల్ నెరపగా సద్వాదులౌ నార్షబా
షా శాస్త్రజ్ఞుల కాటపట్టనగ మా చారిత్రముప్పొంగెడిన్"

శ్రీయుతులు బి.ఎన్.శాస్త్రిగారి బహుముఖీన సాహిత్య, చరిత్ర, శాసన పరిశోధనల్లో నూతన విషయావిష్కారం జరిగి తెలుగు వారి చరిత్ర కొక మార్గనిర్దేశం చేసినట్లే – వారి 'సర్వస్వము'ల కూర్పు కూడా అసాధ్య కృషీవలత్వానికి ప్రతీకగా నిలిచింది. ఇవి వారి దీక్షా దక్షతల సర్వస్వాలు, శాస్త్రిగారు వీటిని సిద్ధం చేయటానికి ప్రోత్సాహం కల్గించినవి కొమర్రాజు వారి విజ్ఞాన సర్వస్వములే గాక ఖండవల్లి వారి సంగ్రహాంధ్ర కోశములు. అప్పటివరకు గుంటూరు, కృష్ణా, నెల్లూరు జిల్లా సర్వస్వాలు వచ్చినాయి.

ఆనాడు సర్వస్వాలను సిద్ధం చేసిన పెద్దలకున్న వసతులు స్వల్పం. సంచార సౌకార్యలు అంతంత మాత్రమే. దీనికితోడు చరిత్ర, సాహిత్యం, శాసనాలలో అముద్రితాలు, అప్రకటితాలే అధికం కాబట్టి విషయ నిర్ధారణ కొరకు ఎంతో శ్రమింపవలసి వచ్చేది. దీనికితోడు గ్రాంధిక, వ్యవహార భాషల వివాదాలు, పరాయి పాలన ప్రభావం, ఇట్లా ఎన్నో బాధలను అధిగమించిన అప్పటి పెద్దల కృషిని అధ్యయనం చేసిన భిన్నూరి నరసింహ శాస్త్రిగారు తమ నాటికి కొన్ని సౌకర్యాలు ఏర్పడినా – ఈ విభాగంలో శ్రమించేవారు లేకపోవటం వలన చాలా అసంతృప్తిగా వుండేవారు. ఐనా – అప్పటి సర్వస్వాల కన్న భిన్నంగా సమాచారాన్ని

సేకరించి వివరణతో చేర్చటం, చరిత్ర, శాసన విషయాల్లో వాదోపవాదాలకాస్కారం కల్గించని రీతిలో వాటిని వివరించటం, వీలయినంత మేర సచిత్ర శాసన వివరాలకే వారు ప్రాధాన్యం యిచ్చినట్లు మరెవరూ ఇవ్వలేదు. భాషా విషయంలో శాస్త్రిగారి పైన ఖండవల్లివారి, రామరాజుగారి ప్రభావం బాగా చూపటం వలన కరడు కట్టిన గ్రాంధికం గానీ, మిక్కిలి వ్యవహార భాష గానీ వీరి రచనల్లో కన్పడదు. అంతా సులభ గ్రామ్య భాషా విశేషాలే వుండటం ఒక విశేషం. దీనికి తోడు ముద్రణలో సర్వవిధ పాఠక జన సౌకర్యంగా వుండే అక్షరాల కూర్పుతో రచనను వెల్వరించటం వీరి ప్రత్యేకత. తాము వివరించే విషయానికి చెందిన దేవాలయం - గ్రామం - శాసనం - ప్రదేశం వంటివాటిని ఎంత శ్రమకోర్చియైనా ఫోటోలను తీసి చేర్చటం వలన చెప్పదలచిన విషయానికి ప్రామాణికత సిద్ధిస్తుంది.

వీటన్నిటినీ పరిశీలించింతర్వాత తనదైన విశేషమార్గంలో ప్రప్రథమంగా నల్లగొండ జిల్లా సర్వస్వాన్ని 1986లో వెల్వరించి, తను పుట్టి పెరిగిన సొంత జిల్లా 'జననీ జన్మభూమిశ్చ' శ్లోకానికి ప్రతీకగా ఒక దశాబ్ద కాల సాహితీ యజన ఫలం 1986లో 'నల్లగొండ మండల సర్వస్వంగా వెలుగు చూచి ఆనాటి ఆంధ్రదేశ చరిత్రకే గాదు, తెలంగాణవారి చరిత్రకొక మార్గనిర్దేశం చేయటం ఈ సర్వస్వ ధ్యేయం. దీనికి లభించిన ప్రశస్తి, ప్రత్యేక గౌరవాదరాలను ప్రోత్సాహకాలుగా గ్రహించి ఆదిలాబాదు జిల్లా సర్వాస్వాన్ని ఆనాటి అక్కడి పెద్దల ప్రోత్సాహంతో సిద్ధం చేసినారు. తర్వాత మన తెలంగాణ జిల్లాల సర్వస్వ రచన చేయవలెననే ప్రగాఢ వాంఛ వారికున్నా ఎందుకో అది కార్యరూపం దాల్చలేదు. మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వ రచన కొరకు ఆ జిల్లాలోని చరిత్ర సాహిత్య రంగ మిత్రులే గాక జిల్లా అధికార వర్గం కూడా వీరిని ప్రోత్సహించటం వలన బృహత్ పరిశోధనకై శ్రీకారం చుట్టిన శాస్త్రిగారు ఆనాడు ఎన్నో ఆటుపోట్లకు తట్టుకొని అనారోగ్యాన్ని కూడా గణింపక తదేక దీక్షగా సర్వస్వం సిద్ధం చేయటం శాస్త్రిగారి వంటి ధీర - ధిషణామూర్తికే సాధ్యమయింది. ఘంటాపథంగా నేను ఈ విషయాన్ని చెప్పటానికి కారణమేమంటే సర్వస్వ రచనా శ్రీకారం నుండి ఆవిష్కరణోత్సవం వరకు ఎందరో మిత్రులు శాస్త్రిగారితో వుండి కష్టసుఖాలను అనుభవించినారు కాబట్టి చెబుతున్నాను.

శాస్త్రిగారు మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వ రచనా సంకల్పం చేసినప్పటి నుండీ ఒక ప్రత్యేక పద్ధతి నవలంబించినారు. తానే (కిరాయి కార్లో) సమాచారానికి అవసరమైన ప్రదేశానికి, వ్యక్తి వద్దకు వెళ్లి పరిశీలించి, సంభాషించి తనకవసరమైన విషయం ప్రామాణికమనుకుంటేనే చేర్చేవారు. ఏదో తొందరపడి అనూహ్య విషయాన్ని చేరిస్తే అది ప్రామాణికమై భవిష్యత్తు పరిశోధనల్లో ప్రామాణికంగా మారకూడదని వారి పట్టుదల. అందుకే చాలా జాగ్రత్త పడేవారు.

ఒకప్పుడు పాలమూరు జిల్లా అని ప్రచారంలో వుండి తరువాత మహబూబునగరంగా ప్రఖ్యాతమైన తెలంగాణలోని పెద్ద జిల్లా యిది. ఇటీవలి కాలంలో జిల్లాను విభజించి మొత్తం 4 జిల్లాలు చేసినా 'పాలమూరు ప్రత్యేకత, చరిత్ర, సంస్కృతి, ఆచార వ్యవహారాదులు మాత్రం చెక్కుచెదరవనేది త్రికాలాబాధిత పరమ సత్యం. ఇంత గొప్ప చరిత్ర అనేకానేక విషయాల్లో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ఈ జిల్లా సర్వస్వ రచనయనేది శాస్త్రిగారి అకుంఠిత దీక్షాదక్షతల ప్రతీకయైనా 'పాలమూరు' అక్షరశః కీర్తి గాంచింది. ఆనాడు శాస్త్రిగారీ పని చేయకుంటే మహబూబ్‌నగర్ జల్లా ప్రత్యేకత ఎవరికి తెలిసేది? దీన్ని పాలమూరు వారే గాదు నాటి, నేటి పరిశోధకులు, వివిధ రంగాల్లోను ఖ్యాతులైనవారు గమనించవలసిన విషయం. యథార్థంగా జిల్లా సర్వస్వాలు విజ్ఞాన సర్వస్వాలు కాకున్నా ఆ జిల్లావారికి మాత్రం తమ జిల్లా విషయంలో 'సర్వస్వ' ఫలితాన్ని సమకూరుస్తుంది. పరిశోధకులకొక పరామర్శ గ్రంథంగా నిలుస్తుంది. విద్యార్థులు – అధ్యాపకులే గాదు ఆ జిల్లాలో పనిచేసే సమస్త శాఖల అధికార్లకు సమాచారాన్నిస్తుంది. ఐతే సర్వస్వ రచనలో సమాచార సేకరణ విశ్లేషణ ముఖ్యం. ఏ ఒక్క చిన్న పొరపాటు జరిగినా అది బహువిధాలా వ్యాప్తి చెందుతుంది. ఇతర జిల్లాల కన్నా మహబూబ్‌నగర్ జిల్లా ప్రత్యేకమైంది. శ్రమజీవులధికం. కరువు, క్షామాలు నిరంతరం వదలకుండా వుంటాయి. ఐనా జిల్లా ప్రజలు గొప్పవారు. అన్యాయాలను ఎదుర్కొంటారు. ఎవరికీ మోసం చేయలేని పరమ అమాయకులు. దీనికి తోడు ఈ జిల్లా ఎందరో కవులు, పండితులు, రచయితలు వర్ధిల్లి వర్ధిల్లుచున్న వాణీ సమారాధనా కేంద్రం. ఒకప్పటి సంస్థానాల కాలంలో ఈ జిల్లాలోనే అధిక సంస్థానాలుండి, సంస్థానాల జిల్లాగా ప్రఖ్యాతి గాంచటమే గాదు, ఫణీశ గౌతమ కణాద వ్యాస ముఖ్యోక్త శాస్త్ర చర్చల్లో ప్రతిపక్షం వారిని తృణప్రాయంగా తీసివేయగలిగే ప్రసిద్ధులు. తిరుపతి వేంకట కవులనే పరాభూతుల చేసిన పండిత ప్రకాండులు వర్ధిల్లిన పాలమూరు ఎంత గొప్ప చరిత్ర గలదో మనం పునరాలోచించుదాం.

క్రీ.పూ. 2500 నాటి చరిత్ర, సంస్కృతి, నాగరికత, ప్రకృతి సంపద విభిన్న మత సంప్రదాయాల వారి పరస్పరాపేక్షా పద్ధతి, దేవాలయాలు, వివిధ మతాల వారి బసదులు, అపురూప శిల్ప సంపద, మొదలైన అనేకానేక ప్రత్యేకతలతో 4500 ఏండ్ల పూర్వ పూర్వ చరిత్ర కలిగి అనేక రాజవంశాల వారి పాలనచే ప్రాముఖ్యం చెందిన పాలమూరు జిల్లాను గూర్చి శాస్త్రిగారు సర్వస్వ రచనా దీక్షా కంకణధారులు కావటం, పాలమూరు జిల్లావారి చిరకాల తపఃఫలమనే చెప్పవచ్చు.

మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వ రచనలో శాస్త్రిగారు మారుమూల పల్లె చరిత్ర, శాసనం, గుడి, గోపురం విషయాలను శ్రద్ధగా సేకరించేవారు. అటువంటివి ఈ సర్వస్వంలో

చాలా కన్పడుతాయి కానీ ఒకటి చెపుతాను. నేటి నాగర్‌కర్నూలు జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలో 'కల్వకోలు' అనే గ్రామం, ఇది 'కలువల కొలను' అట. ఈ వూరి చివర్లో (గండావు పల్లకి పోయే త్రోవ), ఒక శివాలయం చాలా ప్రాచీనమైంది. దండయాత్రల్లో చాలా నష్టమై అవశేషంగానైనా అందంగా విచిత్రంగా వున్న ఈ దేవళం ముందు ఒక చిన్న నంది వుంటుంది. దీనిదొక విచిత్ర గాథ. పరిసర వ్యవసాయ భూమిలో రైతుకు చాలా కాలంనాడు విరిగిన నంది (ముఖభాగం కలది) లభిస్తే దాన్ని తెచ్చి ఈ దేవళంలో ఎదురుగా ఒక అరుగుపైన పెట్టినాడు. కొంతకాలం తర్వాత మరొక రైతు వ్యవసాయభూమిలో ఖండితమైన నంది పృష్టభాగం లభిస్తే దాన్ని తెచ్చి మొదటి ఖండభాగ నంది వద్ద పెడితే ఇవి ఒకే శిల విరిగిన భాగాలు కాబట్టి కాస్తా దూరంగానే వుండేవి. కొంతకాలానికి అవి సమీపించి రెంటి మధ్య మన చేతి వ్రేళ్ళు పట్టే సందుల్లో వుండేవి. మరికొంత కాలానికి రెండూ అతికి ఏకశిలా నందిరూపం ఏర్పడటమే గాక నేటికీ ఈ నంది పెరుగుతూ కన్పడటం వింతనే గదా! ఇది కట్టు కథ కాదు. దేవళంలో పనిచేసే వృద్ధురాలు దీని పరిణతని స్వయంగా చూచి చెప్పటం 2 పర్యాయాలు నేనూ, శాస్త్రిగారు, లింగమూర్తిగారు చూచి వ్రాసుకొన్నది. సర్వస్వంలో (పు. 609) ఈ విషయం తెల్పబడింది. ఇట్లా ప్రతి చిన్న విషయాన్ని ఏ కొద్ది విశేషమున్నా వివరించటం బి.ఎన్.శాస్త్రిగారి ప్రత్యేకతల్లో ఒకటి. ఈవిధమైన సమాచారాలు సర్వస్వంలో చేర్చటం అభినందనీయం. పెద్ద జిల్లా కాబట్టి నదీనదాలు, పర్వతాలు, భవనాలు, దేవాలయాలు మొదలైనవి ఎక్కడో మారుమూలల్లో వుంటే తాను వెళ్లలేని స్థితిలో అభిలాష గల ఆత్మీయుణ్ణి పురమాయించి ఆయనకొక కారు, ఫోటోగ్రాఫర్‌ను సమకూర్చి పంపటం వారి ఆచారం. ఇట్లా నేను, హరిహరనాథ్‌గారు, లింగమూర్తిగారు చాలా స్థలాలను చూచి వ్రాయగలిగినా మేము వ్రాసియిచ్చినదాన్ని బాగా చదివి, తనదైన శైలిలో వివాదరహిత విషయంగా వివరించటం వారి ప్రత్యేకత.

మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వం పెద్దసైజులో 1450 పుటల్లో సిద్ధమై పాలమూరు జిల్లా విస్తృతిని వ్యక్తపరుస్తున్నది. దీంట్లో దాదాపు 150 శాసనాలు, అనేక దేవాలయాలు, ప్రాచీన సమాధులు, చరిత్ర ప్రదేశాల ఫోటోలతో బాటు, సంస్థానాల భవనాలు, సంస్థానాధి పతులు, ప్రాచీనులైన కవి, పండిత, గాయక, శిల్ప, సంగీత, నాట్య, విద్యా నిష్ణాతుల చిత్రపటాలను ఎంతో శ్రమించి సేకరించి దీంట్లో చేర్చటం ఒక గొప్ప రికార్డు.

శాస్త్రిగారింతకు పూర్వం సిద్ధం చేసిన నల్లగొండ (1986), ఆదిలాబాద్ (1992) జిల్లాల సర్వస్వాల కంటే అన్ని విషయాల్లో మహబూబ్ జిల్లా సర్వస్వం పెద్దగానే తయారయింది.

సంక్షేపంగా దీనిలోని విషయాలిట్లా వున్నాయి. జిల్లా భౌగోళిక చరిత్ర, చరిత్ర – సంస్కృతి దీంట్లో ఆదిమానవ ఆవాస చరిత్ర నుండి అసఫ్జాహీల వంశం దాకా వివరమైన చరిత్ర కలదు. తర్వాత జిల్లాలోని వివిధ శాఖలు దాదాపు 58. వీటి ప్రారంభం వీరు చేస్తున్నది వివిధ సంక్షేప కార్యక్రమాల వివరణ సర్వస్వంలో ఎంతగానో అమూల్యమైన శాసన సంపదను సచిత్రంగా వివరంగా యిచ్చిన శాస్త్రిగారి కృషి సర్వధా ప్రశంసార్హం. దీంట్లో బాదామీ చాళుక్యుల శాసనాల నుండి విజయనగర శాసనాలు దాదాపు 100. తర్వాత వివిధ శాసనాలు శీర్షికతో 60 శాసనాల నిచ్చినారు, మరొక ముఖ్య విషయం ఏమంటే ఆనాటికి మహబూబ్‌నగర్ జిల్లాలో 64మండలాలున్నాయి. వీటిలో ప్రతిదాని చరిత్ర, ఆ మండలంలోని గ్రామాలు, వాటి విశేషాలను ఆయా డివిజన్ల వారీగా తెలపటం వలన ఏ డివిజన్లో ఏ మండలం దాని సమాచారం సులభంగా తెలుస్తుంది. వీటితో పాటు జిల్లాయందు వివిధ రంగాల్లో పేరెన్నికగన్న వారి ఫోటోలను చేర్చినారు. ఇట్లా ప్రముఖులు, భవనాలు, దేవళాలు, నదీనదాలు, నిజాంకొండ వంటి ప్రసిద్ధ గిరులు, శాసనాలు – విగ్రహాలు, సరేసరి. ఇట్లా ఈ చిత్రపటాలే (చిన్నవి – పెద్దవి) దాదాపు 600 దాకా వుంటాయి. 1992(1993) ప్రాంతాల్లో ఫోటోలను తీయడానికి నేటి సులభ పద్ధతి లేదు. ఫోటోలను ప్రింటు చేయడానికి కూడా శ్రమించవలసి వచ్చేది. నాగర్‌కర్నూలు, అచ్చంపేట, కొల్లాపుర డివిజనల్లలోని ఎన్నో ఫోటోలను వర్షంలోను, మండే ఎండల్లోను తీసిన ఫోటోగ్రాఫర్ నగేశ్ ప్రతిభ అత్యద్భుతం.

చరిత్ర – శాసనాలు జిల్లా వివిధ శాఖల సమాచారం సేకరించటానికి శాస్త్రిగా రెన్నిమార్లో జిల్లాలో సంచరిస్తే, జిల్లా పరిషత్తు వారు సహకరించటం వల్లనే ఇంత విషయాన్ని సచిత్రంగా మనముందుంచగలిగినారు. ఈ సమాచారం ఇట్లా వుంటే – సాహిత్య రంగాన ఎంతో కీర్తి గాంచిన ఈ జిల్లా సాహిత్య విశేషాలను కొంత సంగ్రహంగా తెల్పే ప్రయత్నం చేసి సాహిత్య పరిశోధకులైన వారికి సిద్ధాన్న ప్రసాద వితరణ చేసినారు, వీటిల్లో గోలకొండ కవుల సంచికలో వున్న పాలమూరు జిల్లా కవులు, ఈ జిల్లాలోని వేద, శాస్త్ర, సంస్కృత, సాహిత్యేతిహాసం, తెలుగు కవులు, జిల్లాలోని చాటు కవిత, శాసన కవులు, స్వాతంత్ర్య సమరయోధులు, జానపద విజ్ఞానం, గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, జటప్రోలు సంస్థానాలు, సాహిత్యం, జిల్లా సాంస్కృతిక వైభవం, జిల్లాలోని ప్రముఖులు ఇట్లా విషయ వైవిధ్యం విస్తృతంగానే చోటు చేసుకున్నది. శ్రీ రంగాపురం హనుమత్‌శర్మగారి 'పాలమూరు మహామండల ప్రశస్తి' అనే తొమ్మిది పద్యాలు, ఈ సంచిక నిమిత్తం 'సద్యోనిర్మిత సంస్కృతాంధ్ర కవితా సంభారమయంగా అద్భుతంగా చెపుతుంటే ప్రప్రథమంగా వాటిని కాగితాల కెక్కించిన నేను ఇప్పటికీ ఎంతో ఆనందిస్తుంటాను. వీటితో పాటు డా. మహమ్మద్ హుసేన్ జిల్లా

ప్రశస్తి పద్యాలు బాగా వ్యాప్తి చెందాయి. దాంట్లో ప్రచురితమైన 'చాటువుల' గురించి పరిశోధన చేసి పాలమూరు విద్యార్థి హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్ పొందినాడు. వేద శాస్త్ర సంస్కృత సాహిత్యేతిహాస వ్యాసాన్ని ఎందరెందరో గ్రహించినారు. ఇట్లా ఈ సర్వస్వంలోని ప్రతి విషయం పరిశోధకులైన వారికి కెలకులనున్న తంగెటిజున్ను వలె ఉపయోగపడుతున్నది.

ఇట్లా మనం సంతోషంగా సమస్త విషయ సమన్వయ సమాచార సర్వస్వాన్ని చదువుతుంటే దీని వెనుక శాస్త్రిగారి కృషిని కూడా గమనించటం అవసరం. ఇంతకు ముందు చెప్పినట్లు విషయ సేకరణ కొరకు చాలా శ్రమించి సాధించటం ఒక దగ్గర అన్నపానీయాల –క్షామాన్ని కూడా అనుభవించి, భర్తృహరి చెప్పినట్టు 'ప్రజ్ఞానిధిత్వం' గల వ్యక్తిగా నిలదొక్కుకున్నారు. విచిత్ర వ్యక్తులు – చిత్ర విచిత్ర సంశయాత్మక ప్రశ్నల పరంపరలే గాక కొన్ని స్థలాల్లో ఫోటోలు తీయటానికి కూడా నిరాకరించిన సన్నివేశాలను ఎదుర్కొన్నారు. ఇదంతా ఎందుకు? ఈ జాతి కొరకు. పరిశోధకులైనవారికి బంగారు గనివంటి తెలంగాణ గొప్పదనం తెల్పి దాంట్లో విశాలమైన పాలమూరుకున్న అనేకానేక విషయాల ప్రాముఖ్యాన్ని అక్షరబద్ధం చేసి భవిష్యత్ తరానికి తరగని పెన్నిధిగా 'మహబూబ్‌నగర జిల్లా సర్వస్వం' సిద్ధమై శాశ్వతంగా నిలువాలనే వారి గాఢవాంఛను ఇట్లా ఫలవంతం చేసి కృతజ్ఞతా పాత్రులైనారు.

శ్రీ శాస్త్రిగారికి దాదాపు 1964 నుండి ఈ జిల్లా వివిధ ప్రాంతాలు పరిచయం. వ్యక్తులు, విశేషాలు బాగా తెలుసు. పైగా పెద్ద జిల్లా కాబట్టి 1992లో శ్రీకారం చుట్టిన ఈ సర్వస్వ రచన 1993లో అంటే సరిగ్గా ఒక సంవత్సర కాలంలో పూర్తియైంది. ఎందరో చరిత్రకారులు, సాహితీమిత్రులు వీరి శ్రమకు తోడుగా వుండటం వల్ల త్వరగా ఈ పనిచేసినానని శాస్త్రిగారే సవినయంగా ముందు మాటల్లో తెల్పటం వారి ధర్మజ్ఞత – కృతజ్ఞతల కొక నిదర్శనం. ఇంత పెద్దపని చేయటానికి ప్రోత్సాహం చాలా ముఖ్యం. కాబట్టి ఆనాడు మహబూబ్‌జిల్లా కలెక్టర్‌గా వున్న శ్రీ జి.పి. రెడ్డయ్యగారు డి.డి.ఒగా వున్న తుకారాంగారి తోడ్పాటు అత్యద్భుతమై వారిని 'అక్షర'బద్దుల చేసింది. వీరి చొరవ వల్లనే ఇంత బృహద్రచన జిల్లాలోని ప్రతి పాఠశాల, ప్రతి పంచాయితీ కార్యాలయం గ్రంథాలయాలు, వివిధ ప్రభుత్వ శాఖా కార్యాలయాలకు చేరి, శాస్త్రిగారి కృషికొక గుర్తింపును తెచ్చింది. ఇది జిల్లాకు చెందిన రచన కాబట్టి, శాస్త్రిగారు అప్పటి రాష్ట్రపతి శంకర దయాళశర్మగారు, భారత ప్రధాని పి.వి. నరసింహారావుగారు, రాష్ట్ర ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డిగారు, పంచాయితీరాజ్ శాఖామాత్యులు డి.కె. సమరసింహారెడ్డిగారు,

నీటిపారుదల శాఖామంత్రి శంకర్‌రావుగారు వీరి ఫోటోలను వేసి తమ సగౌరవ కృతజ్ఞతాభావ నిరూపణ చేసినారు. మహబూబ్‌నగరం జిల్లాకొక శాశ్వత సర్వస్వాన్ని సిద్ధం చేసిన శాస్త్రిగారి ఈ గ్రంథాన్ని స్థానిక జిల్లా అధ్యయన వేదికవారు 7.3.1993న కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా ఆవిష్కరణ ఏర్పాటు చేసి అప్పటి పంచాయతీరాజ్ శాఖామాత్యులైన సమరసింహారెడ్డిగారిచే ఆవిష్కరింపచేస్తే ఆ కార్యక్రమానికి ఆచార్య ఎస్వీరామారావుగారు అధ్యక్షత వహించినారు. సభలో ఆనాటి జిల్లా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, సమితి అధ్యక్షులు, కలెక్టర్ మొదలైన ఉన్నతోద్యోగులంతా పాల్గొనటం వలన విశాల సభాప్రాంగణానికి స్థలాభావ సమస్య కూడా ఏర్పడింది. శ్రీయుతులు గంగాపురం హనుమత్ శర్మ, ఎల్లూరి శివారెడ్డి, డా. హరిహరనాథ్, మొదలైన సాహితీ ప్రముఖులంతా పాల్గొన్నారు. మంత్రులు సమరసింహారెడ్డి, శంకరరావుగార్లు ఈ సభనుద్దేశించి ఇదొక జిల్లా సాహిత్య పర్వదినం. మన జిల్లా గొప్పదనం తెలిపిన శాస్త్రిగారికి మనమంతా ఋణపడి వున్నాం అని ఎంతో ఆప్యాయంగా ప్రసంగించారు.

శాస్త్రిగారు తమ 'స్పందన'లో సర్వస్వంలో చేరవలసిన విషయం ఇంకా చాల వున్నది. ఇక్కడికే ఇంత పెద్ద పుస్తకమయింది. శక్తి, ఉత్సాహాలు అనుకూలిస్తే రెండవ భాగాన్ని సిద్ధంచేసి లోపాన్ని సవరించుకుంటానని వివరిస్తూ ఈ కృతిని "శ్రీపర్వతోత్తర ద్వార శ్రేష్ఠ శ్రీ ఉమామహేశ్వర పాదపద్మములకు భక్తి ప్రపత్తులతో" సమర్పించుకొని న్యస్తభరితులైనారు.

ఇదంతా ఆనాటి మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వాల గూర్చిన సంక్షిప్త సమాచారం. ప్రస్తుతం మహబూబ్‌నగరం జిల్లా 4 జిల్లాలుగా మారింది. వాటి పరిధి కూడా తగ్గింది. కాబట్టి నూతన జిల్లాల ప్రాతిపదికగా విషయ సేకరణ చేసి సర్వస్వాలను ప్రచురించుకునే యోగం మనకు లభించాలని ఆశిస్తున్నాను.

డా. శ్రీ రంగాచార్య
ప్రముఖ పరిశోధకులు, విశ్రాంత ప్రధానాచార్యులు, పాలెం ఓరియంటల్ కళాశాల.
ఫోన్ : 9299451266



# రెడ్డి రాజ్య సర్వస్వము

శాసనాల శాస్త్రిగా ప్రఖ్యాతి గాంచిన శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు సుప్రసిద్ధ చరిత్రకారులు. వారెన్నో శాసనాల ఆధారంగా తెలుగు ప్రజల వాస్తవ చరిత్రను మనకందించారు. భారతదేశ చరిత్రను కూడా ఎన్నో సంపుటాలుగా రచించారు. మహబూబ్‌నగర్, ఆదిలాబాదు తదితర జిల్లాల సర్వస్వాలందించి జిల్లాల విజ్ఞాన సర్వస్వాల నిర్మాతగా పేరు ప్రఖ్యాతులందుకొన్నారు.

రెడ్డిరాజ్య సర్వస్వం వంటి గ్రంథాల ద్వారా కొన్ని వంశాల పరిపాలనా స్థితిగతులను, సంస్కృతీ సంప్రదాయ విశేషాలను ప్రస్తావించారు. రెడ్డిరాజ్య సర్వస్వాన్ని 1998 మార్చినెలలో విజ్ఞాన సరోవర ప్రచురణల సంస్థ ప్రచురించింది. ఆ సంస్థ అధినేత శ్రీ కొండా లక్ష్మీకాంత రెడ్డి ఈ గ్రంథ రచనకూ, ప్రచురణకూ కారకులు, ప్రేరకులు. శ్రీ శాస్త్రి గారు ఈ విషయాలే ప్రస్తావించి గ్రంథావిర్భావ ఆవశ్యకతను వివరించారు.

**... ఆంధ్రదేశము సామంతులుగ, దండనాయకులుగ, మహా సామంతులుగ, మహాసామంతాధిపతులుగ, స్వతంత్ర రాజులుగ, సంస్థానాధీశులుగనుండి ప్రజానురంజకముగా పాలించి, పౌరుష ప్రతాపములతో అరివీరుల నాహవములందు నిర్జించి హైందవ సంస్కృతిని పరిరక్షించి, కవిపండితులను పోషించి, స్వయముగననేక గ్రంథములను రచించి, ఆంధ్రుల అభ్యున్నతికి పాటు పడిన రెడ్డిరాజ వంశీయుల చరిత్రలతో పాటు సాంఘిక చరిత్రలు సంక్షిప్తముగ నీ సర్వస్వమున వ్రాయబడినవి...... (పుట:4)**

గ్రంథంలోని వస్తువుకు సంబంధించి ఈ వివరణలిచ్చిన శ్రీ శాస్త్రిగారే, ఇది 1/4 డెమ్మీ సైజులో 600పుటలున్న గ్రంథమన్నారు; 174 శాసనాలున్నాయన్నారు; 140 పుటల్లో ఛాయాచిత్రాలు,

చిత్రపటాలు ఉన్నాయన్నారు. గ్రంథానికి రెడ్డిరాజ్య సర్వస్వమనే పేరుపెట్టినా ఇందులో ఇంకా మూడు సంస్థానముల చరిత్ర చేర్చవలసి ఉండిందని, అవి మలి ముద్రణలో చేరుస్తామన్నారు.

ఈ బృహద్గ్రంథానికి ముందుమాట వ్రాస్తూ పురావస్తుశాఖ పూర్వ సంచాలకులు డా.వి.వి.కృష్ణశాస్త్రి గారు, ఈ గ్రంథం ముఖ్యంగా పరిశోధకులనే కాక సామాన్య పాఠకలోకాన్ని కూడా విశేషంగా ఆకర్షిస్తుందని ఆకాంక్షించారు.

అభినందనలందించిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు, చారిత్రక పరిశోధన రంగంలో శ్రీ శాస్త్రిగారు అవిశ్రాంత పథికులన్నారు.

అభిప్రాయం తెలిపిన శ్రీ గడియారం రామకృష్ణ శర్మగారు, శ్రీ శాస్త్రిగారు ఈ గ్రంథమును రచించి ఆంధ్రచరిత్రకు ఒక అపూర్వ ఆభరణమును ప్రసాదించారన్నారు.

రెడ్ల వికాసానికేగాక, విద్యా-సాంస్కృతిక సామాజిక చైతన్యానికి కృషి చేసిన రాజా బహాదూర్ కోత్వాల్ వెంకట రామారెడ్డి, డా. కట్టమంచి రామలింగారెడ్డి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, సురవరం ప్రతాపరెడ్డి, దువ్వూరి రామిరెడ్డి, చీఫ్ జస్టిస్ కొండా మాధవరెడ్డి తదితరుల గురించి ప్రారంభంలోనే పరిచయాలిచ్చారు. ఇందులో సుప్రసిద్ధ చరిత్రకారులు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తమకంటే పూర్వమే రెడ్డి రాజ్య చరిత్రకు మూలాధారాలైన గ్రంథాలు రచించినందువల్ల శ్రీ శాస్త్రి గారు వారినీ పరిచయం చేశారు. ఆ తర్వాత ఈ క్రింది వర్గీకరణతో రెడ్డి రాజ్యాల చరిత్ర, సాంఘిక విషయాలు – ప్రజా జీవనం తదితర అంశాలు వివరించారు.

**1.రెడ్డి పద నిర్వచనం (ఉపోద్ఘాతం)**

**2. రెడ్డిరాజుల వంశాలు, రెడ్డి రాజ్యాలు– వివరాలు**

**3. రెడ్డిరాజుల నాటి సాంఘిక చరిత్ర**

**4. సాహిత్య చరిత్ర – పాండిత్య ప్రాభవాలు.**

**5. రెడ్డి సంస్థానాలు**

**6. 54 మంది రెడ్డి రాణులు**

**7. రెడ్డి రాజుల శాసనాలు.**

**1. రెడ్డి పద వివేచనం :**

ప్రధానంగా వ్యవసాయ వృత్తే ఆధారంగా రెడ్లు జీవించి పాడిపంటల వికాసానికి ప్రయత్నించారు. వారి పంటను వారు రక్షించుకొనే వ్యవస్థలో పరిపాలకులుగా పరిణతి చెందారు. రెడ్డిరాజులను చారిత్రక శాస్త్రవేత్త శ్రీ శాస్త్రిగారు ఇలా ప్రశంసించారు.

**వీరులును, శూరులును, యుద్ధ విద్య విశారదులును, అరివీర భయంకరులును, ఉన్నత విద్యావంతులును, గ్రంథకర్తలును, సంస్కృతాంధ్రాది భాషలయందపరిమిత పాండిత్యమున్నవారును, దానకర్ణులును, బల పరాక్రమ సంపన్నులును, దేవాలయములను నిర్మించినవారును, బ్రాహ్మణులకగ్రహారముల నొసంగినవారును, యవనాక్రాంతమైన అగ్రహారములను పునరుద్ధరించినవారును, నయ వినయ సంపదగలవారును, సమ్యక్ ప్రజాపాలనమొనర్చినవారును.....**

....... అని ప్రశంసించి అనేక ఆధారాలతో రెడ్డి పద వ్యుత్పత్తి వివరాలందించారు. రట్టగుళ్లు, రట్టోడ్లు, రాట్‌లు, రట్టడ్లు, రాష్ట్రకూటులు, రట్టడి, రడ్డి, రడ్డు, రడి, రెడ్డి ..... తదితర పదాలను విశ్లేషించారు. శాసనాల్లో, సాహిత్యంలో ఉన్న ఈ పదాలన్నింటిని సోదాహరణంగా వివరించారు.

**2. వివిధ రెడ్డి వంశాలు :**

ఆంధ్రదేశాన్ని కాకతీయులు పరిపాలించే కాలంలో సామంతులుగా, మాండలికులుగా, మహా సామంతులుగా రెడ్లు వ్యవహరించారు. ఇందులో 1. రేచర్ల రెడ్డి వంశజులు 2. చెరకు రెడ్డి వంశీయులు 3. మల్యాల 4. విరియాల 5. గోన 6. వావిలాల 7. కొప్పుల 8. కోరుకొండ రెడ్డి వంశీయుల చరిత్రల్ని సోదాహరణంగా, శాసనాద్యంశాల చారిత్రకాధారాలతో వివరించారు.

**3. రేచర్ల వంశీయులు :**

గణపతి దేవుడు శత్రువులైన యాదవరాజుల చేత బంధింపబడినప్పుడు, ఎలకుర్తి రాజ్యాన్ని పరిపాలిస్తున్న రేచర్ల రుద్రారెడ్డి శత్రువులతో పోరాడి గణపతి దేవుణ్ణి చెరసాలనుండి విముక్తుణ్ణి చేశాడు. తాను ఎలకుర్తిని పరిపాలిస్తూనే రామప్ప దేవాలయాన్ని నిర్మించాడు. ఆ సమీపంలోనే బృహత్తటాకాన్ని ఏర్పాటు చేయించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ్డాడు. కాకతి రాజ్యభార ధౌరేయుడన్న బిరుదునందుకొన్న రుద్రారెడ్డిని పరియం చేశారు శాస్త్రిగారు. అంతేగాక తన అన్నను ఎలకుర్తికి అధికారిగా నియమించి, తాను ఓరుగల్లులో ఉండి కాకతీయ సామ్రాజ్య రక్షణభారాన్ని వహించాడు. రుద్రారెడ్డి పెద్దకొడుకు లోకచమూపతి (సైన్యాధిపతి) ఎలకుర్తి దేవాలయానికి భూమి దానమిచ్చిన శాసనస్థ ఆధారాలను ప్రస్తావించారు. అంతేగాక రుద్రారెడ్డి రెండవకొడుకు గణపతి దేవుని సకల సైన్యాధ్యక్షుడైన పెద్ద గణపతి అనీ, ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఇతడు వేయించిన శాసనమున్నదన్నారు. రుద్రారెడ్డి మూడవ కుమారుడు నాల్గవ కాటసేనాని అనీ, రాజ్య విస్తరణలో సహకరించిన

మహాయోధుడని వర్ణించారు. రుద్రారెడ్డి మనుమని ప్రశంస కూడా ధర్మారావు పేట శాసనంలో ఉందన్నారు. ఇలా కాకతి సామ్రాజ్య వికాసంలో రేచర్ల రెడ్డి వంశీయుల సేవల గురించి అనేక విషయాలు ఈ రెడ్డి రాజ్య సర్వస్వంలో శ్రీ శాస్త్రిగారు ప్రస్తావించారు.

వారి శక్తి సామర్థ్యాల వల్లనే నల్లగొండ జిల్లాలోని ఆమనగల్లు రాజ్యం, పిల్లమఱ్ఱి రాజ్యం, వరంగల్లు జిల్లాలోని ఎలకుర్తి రాజ్యాన్ని పరిపాలించారన్నారు. రేచర్ల రెడ్డి వంశీయుల బిరుదావళిలోని సకలగుణగణాలంకార, పరనారీదూర, మార్బలభీమ, రణరంగదామ, వితరణకర్ణ, శౌర్య సపర్ణ, పతిహితారానేయ, శౌచ గాంగేయ, సత్య రత్నాకర, దుష్టజనభీకర .... ఇంకా మరెన్నో విశేషణాలను పరిశీలించినప్పుడు, ఆయా బిరుదుల వెనుక ఉన్న చరిత్రను పరిశోధించాలనే ఆసక్తి అధ్యయన శీలుర మనస్సులో కలిగించిన ఇటువంటి రచనలు పరిశోధకుల పాలిటి పాథేయాలనే చెప్పాలి. శాస్త్రిగారి ఈ కృషి చరిత్రకారులకు మూలభిత్తికగా నిలిచిందనే చెప్పాలి.

**4. చెరకు వంశీయులు :**

కాకతీయ సామంతులైన చెరకు రెడ్లు జలాల్పురం (జమ్ములూరు), అమరాబాదు, కలువకోలు, వేల్పూరు తదితర రాజ్యాలను పాలించారు. కటసేనానితో ప్రారంభమై రాజరుద్రుని వరకు ఎందరో సామంతరాజులు పై రాజ్యాలను పరిపాలించారన్నారు. వీరు కాకతి ప్రభువులకు విధేయులుగా ఉన్నారు; దేవాలయాలను నిర్మించారు; శాసనాల ద్వారా అగ్రహారాదులెన్నో దానమిచ్చినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. ఈ చెరకు రెడ్లకు కూడా సమస్త గుణగణాభరణ, శరణాగత వజ్రపంజర, పరమ మాహేశ్వర, సుజనైక మిత్ర, .... తదితర బిరుదులున్నాయి. శాసనాల్లోని ఈ బిరుదులు అధ్యయనం చేసేవారి అభిరుచిని పెంచుతాయి.

కాటారెడ్డి నుండి రాజా రుద్రారెడ్డి వరకు కేతసేనాని, సూరసేనాని, మల్ల, కాటయ, అన్నయ, మారయ గణపతిరెడ్డి, నామరెడ్డి, జాయారెడ్డి, నాగిరెడ్డి, బొల్లయరెడ్డి తదితరులెందరో పరిపాలించిన ఆధారాలున్నాయి.

**5. మల్యాల వంశీయులు :**

మల్యాల వంశీయులైన రెడ్లు సంకీసపురాన్ని, మల్యాల రాజ్యాన్ని, వర్ధమానపుర రాజ్యాన్ని పరిపాలించారు. ఆయా రాజ్యాలలో అనేక దేవాలయాలు నిర్మించారు. అంగరంగభోగాలకు, నిత్యదీపాలకు, నైవేద్యాలకు అగ్రహారాది భూములనిచ్చి ప్రోత్సహించారు. ఈ ఆలయాలు – దానాలు కొండిపర్తి, వర్ధమానపురం, మల్యాల, బూదపురంలో ఉన్నాయి.

దుర్జయుడు, దన్నయ, సబ్బసేనాని, వరూధినీశుడు, కాటసేనాని, పోతసేనాని, చండసేనాని, గుండదండాధీశుడు, బాచయబొప్పన, గణపతి దేవుడు తదితరులెందరో భిన్న రాజ్యాలలో పాలకులుగా ఉన్నారు. మల్యాల వంశీయులైన ఈ రెడ్డి రాజులు ఎందరో కవి పండితుల నాదరించి పోషించారు. ఇందులో గుండదండాధీశుడు శాసనకవే కాక గొప్ప సంస్కృత పండితుడు కూడా. ఈయన చిత్ర బంధ కవిత్వాలను కూడా అవలీలగా చెప్పేవాడు.

మల్యాల వంశీయులైన ఈ రాజుల బిరుదాలు వర్ధమాన పురాది శాసనాల్లో కనిపిస్తున్నాయి. తిమిర మార్తాండ, వీర వితరణ గుణగణాలంకార, సుచరిత వ్రతాచార .... ఇటువంటి బిరుదాలు సర్వసాధారణమే అయినా కుప్పాంబిక భర్త అయిన గుండదండాధీశు నివి విశేషంగా కనిపిస్తున్నాయి. వర్ధమానపుర, బూదపుర శాసనాల్లో మల్యాల – గోన వంశీయుల పరిపాలన సంబంధి విశేషాలున్నాయి.

**6. గోన వంశీయులు :**

గోన వంశీయులు, వర్ధమానపుర ప్రాంతాన్ని, రాయచూరు దుర్గ పరిసరాల్ని పరిపాలించారు. రాయచూరు శాసనంలో ఆదవాని, తుంబళం, మానువ, హోళువాది రాజ్యాలను వివిధ దుర్గాలను జయించిన విశేషాలున్నాయి. గోనగన్నారెడ్డి మహాసేనాని ఇతని పుత్రుడే. విఠలభూపతి కూడా మహాశూరుడు.

ఈ వంశంవారికి అరిగండ భైరవ, సాహసోత్తుంగ, కాకతీయ కటక సన్నాహ వీరవితరణోత్సాహ, వీరలక్ష్మీనిజేశ్వర, మీసరగండ, ఉభయ బలగండ, గండరగండ, అభంగ గండ భేరుండ, పరబల సాధకాది వందల కొలది బిరుదులు వీరికున్నాయి.

**7. విరియాల వంశీయులు :**

రాష్ట్రకూటులకు కల్యాణీ చాళుక్యులకు సామంతులుగా ఉన్న సేనానాయకులే తర్వాత కాకతీయులకు సామంతులుగా పరిపాలించారు. కాకతి మల్యాల వంశీయులతో వీరికి సంబంధ బాంధవ్యాలున్నాయి. కొలవి సీమ, ముదిగొండ, రేంబర్తి తదితర ప్రాంతాలను పరిపాలించారు.

ఎఱ్ఱభూపతి, కామసాని, నాగసానమ్మ, రుద్రయ రాజు, బేతసేనాని, సూరన్నపతి, మల్లసేనాని,.... తదితరులు పాలించారు. ఈ విరియాల రాజ్యం మల్యాల రాజ్యంలో విలీనమైంది. సంబంధ బాంధవ్యాల వల్ల ఇలా జరిగింది. వీరిలో విరియాల సూరనను వర్ణించిన ఒక శాసనం నిండా సంస్కృత శ్లోకాలే ఉన్నాయి.

**సత్యే ధర్మసుత: పరే రవిసుత స్త్యాగే పృథాయా: సుత:**

**శౌర్యే ధైర్యగుణే సుమేరురపి సౌందర్యే స్వయం మన్మథ:॥**

13,14 శతాబ్దాల్లోని శాసనాల్లో ఈ భాష గురించి అధ్యయనం చేసేందుకు, అవగాహన పెంచేందుకు మార్గదర్శనం చేశారు శాస్త్రిగారు.

**8. వావిలాల వంశీయులు :**

పూర్వ మహబూబునగర్ జిల్లాలోని ఆమనగల్లు, కల్వకుర్తి, వంగూరు విషయాలను (రాజ్యాలను) వావిలాల వంశీయులు పాలించారు. రుద్రయరెడ్డి ఇరివెన్నులోని ఇంద్రేశ్వరాలయానికి దానమిచ్చిన శాసనం వల్ల కొంత చరిత్ర తెలుస్తున్నది.

**9. కొప్పుల – కోరుకొండ వంశీయులు :**

కొప్పుల వంశీయులు పిఠాపురం రాజధానిగా తూర్పుగోదావరి, విశాఖపట్టణ ప్రాంతాల్ని పరిపాలించారు. ఈ వంశానికాద్యుడు కొప్పమారెడ్డి. తదనంతరం చరిత్రలో కనిపించే వీరి పుత్రులు, తర్వాత వారు నాయకులుగా పిలువబడ్డారు.

గోదావరి తీర ప్రాంతంలోని సిద్ధేశ్వర కోటనగరాలను రాజధానిగా పాలించినవారు కోరుకొండ వంశీయులు. కేశవనాయకుడు, గణపతి, కూనప, ముమ్మడీంద్ర, గంగయ, సింగయ నాయకులు పాలించారు. కొండవీటి రెడ్ల దండయాత్రల్లో కోరుకొండ అంతరించి కొండవీటిలో విలీనమయింది.

**10. కొండవీటి రాజ్యం :**

కాకతి రాజ్య పతనానికి మహమ్మదీయులే కారకులు; దురాక్రమణదారులైన వారి వల్ల ఈ దేశ మూల రాజవంశాలు అంతరించాయి. అయినా అద్దంకి రాజధానిగా ప్రోలయరెడ్డి, అతని కుమారుడు ప్రోలయ వేమారెడ్డి రాజ్యాలు స్థాపించారు. ముసునూరి కాపయ ప్రోలయ నాయకులు మహమ్మదీయ రాజులను పారద్రోలారు. విలస తామ్ర శాసనంలో, అనితల్లి కలువచేరు శాసనంలో, కవుల రచనల్లో మహమ్మదీయుల వల్ల అష్టకష్టాలు పడ్డ హిందువుల కడగండ్లు వర్ణింపబడ్డాయని శ్రీ శాస్త్రిగారు ఇలా వివరించారు.

**..... ముస్లింల పాలనమున హిందువులనేక యిబ్బందులకు గురియైనారు. దేవాలయములు విధ్వంసము గావింపబడి వాటి స్థానమున మసీదులు, దర్గాలు నిర్మింపబడినవి. హిందువుల ఆచార వ్యవహారముల కాటంకములు కల్పింపబడినవి. బ్రాహ్మణులనేకులు వధింపబడినారు. యజ్ఞయాగాది కర్మకాండలకు విఘాతమేర్పడినది. దినదినగండముగ ప్రజలు ప్రాణములరచేత బెట్టుకొని జీవింపసాగినారు.**

కొండవీటి రెడ్డిరాజులనే పంటదేసటి వంశీయులుగా పిలువబడ్డారని శాస్త్రిగారు వివరించారు. కామభూపతి, వేమరాజు, ప్రోలయరెడ్డి అద్దంకి పాలకులుగా పేరు తెచ్చుకొన్నారు. కొండవీటి దండకవిలె, కైఫియతులు,శాసనాలు, కొండవీటి రెడ్డిరాజుల చరిత్ర నిర్మాణాని కాధారమయినై. మొదట అద్దంకి తరువాత కొండవీడును వీరు పాలించారు. పంటదేసటి వంశమే కాక, ఈ పాలకుల్లో దొంతి వంశీయులున్నారు.

**11. ఇంకా ఎన్నో సామంత మాండలిక వంశాలు**

శాసనాలు కాక 336 పుటల్లో రచింపబడ్డ ఈ రెడ్డి రాజ్య సర్వస్వంలో మనుమకుల మల్లిరెడ్డి వంశం, కాంత మధూక వంశచరిత్ర, పెంతమల్లి రెడ్డి వంశచరిత్ర, విట్టికుల వంశం, పేరమరెడ్డి వంశము, కొలిపాక వంశము, దోసపాటి వంశము, మొల్లల వంశము, కూరపాటి వంశము, చందుల్లు వంశము, సబదర అంబయరెడ్డి, మలిరెడ్డి మారెడ్డి, మాదయ రెడ్డి వంశము, సలకము వంశము, తేమనూరి వంశము, మోటవాడ వంశము.... ఇలా సామంత మాండలిక వంశాల్ని 120 పుటల్లో వివరించారు. ఆ తర్వాత కొప్పుల రెడ్డి వంశచరిత్రను, కోరుకొండ కొండమీది రెడ్డిరాజ్యాల చరిత్రను, రాజమహేంద్రవర, కందుకూరు రెడ్డిరాజ్యాల విశేషాలను ప్రస్తావించారు.

**12. చిన్న సామంతరెడ్డి రాజ వంశాలు :**

కొన్నాతాడి వంశము, బ్రహ్మారెడ్డి వంశము, మరాడ్డి వంవము, దాడి వంశము, ఎరబోలు వంశము, తమ్మిలి రెడ్డి వంశము, పంటమైలార రెడ్డి వంశము, సూరమ రెడ్డిసాని వంశము, భోగాది వంశము,.... ఈ వంశాలన్నిటి చరిత్రలను సంక్షిప్తీకరించారు.

**13. రెడ్డిరాజుల సంస్థానములు :**

ఇక రెడ్డి రాజుల 16 సంస్థానాల చరిత్రను దాదాపు 80 పుటల్లో వివరించారు. అలంపూర్, ఆత్మకూరు, గద్వాల, వనపర్తి, దోమకొండ, పాపన్నపేట, మునగాల, శిర్నపల్లి, బోరవెల్లి, గోపాలపేట, బుచ్చిరెడ్డిపాలెము, నొసముపాళెం, నారాయణపురం, దొంతి, కొండూరు, కార్వేటి సంస్థానాల చరిత్రలను సంగ్రహంగా చారిత్రక దృష్టితో ఆయా సంస్థానాధీశుల పాలనను ప్రస్తావించారు. ఈ సంస్థానాలలోని కవుల గురించి, సాహిత్య సంస్కృతుల గురించి అందులో భాగంగానే వివరించారు.

**14. రెడ్డి రాణులు :**

భర్తలు పరిపాలనలో ఉండగా శాసనాలు వేయించినవారు, ఆలయాలు కట్టించిన వారు, సంక్షేమ కార్యక్రమాలు చేసినవారు, స్వయంగా పాలనాబాధ్యతలు చేపట్టినవారు

రెడ్డి రాణుల్లో ఉన్నారు. కాచమాంబ, ఎరకసాని, కామసాని, బొల్లసానమ్మ, ఐతాంబిక, వల్లసాని, పొరసాని, కామసాని, బెజ్జమాంబ, కామాంబిక, తిక్కాంబిక, కుప్పాంబిక, మల్లాంబిక, రుద్రసాని, ఆచమ, బొల్లమ–కాచమ, బాచాంబ, కుప్పాంబిక, మైలమ్మ, కామసాని, నాగసాని, బెజ్జమాంబిక, ఐతమ, నాగమాంబ, మైలమాంబ, బొల్లమాంబ, వెలెదాంబ (లేచమాంబ), ముద్దమాంబ, లక్కసాని (మల్లసాని), రంగసాని (మైలసాని), పెంతకొమ్మసాని, వల్లుసాని, బొల్లసాని, కామసాని, కేతసాని, ఎరకసాని, సూరసాని, పోతసాని, సర్వమాంబ, కొమ్మసాని, చోడమాంబ, ముప్పమదేవి, అనితల్లి, రాణి భాగ్యలక్ష్మమ్మ, రాణి లింగమ్మ, రాణి వేంకట లక్ష్మమ్మ, రాణి లక్ష్మీ దేవమ్మ, మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ, రాణి సరళాదేవి, రాణి శంకరమ్మ, రాణి వెంకట లక్ష్మాయమ్మ, గోపమ్మ–రుక్మమ్మలు, లచ్చాయమ్మా రావు, నీలం జానకీబాయి,.... ఈ రాణులందరినీ పరిచయం చేశారు.

ఇందులో పరిపాలన చేసినవారు, దానధర్మాలు చేసినవారు, భర్తకు తోడుగా నిలచినవారు, విద్యావికాసానికి దోహదం చేసినవారు, కళా సంస్కృతులను పోషించినవారు, దేవాలయములు కట్టించిన వారూ ఉన్నారు.

పిల్లలమఱ్ఱి, ఎర్కవరం, బొల్లసముద్రం, పెట్టనచెరువు, నామసముద్రం, చింతలచెరువు, గొడిశాల, వేలూరు, ఇరివెన్ను, కొండిపర్తి, వర్ధమానపురం, బూదపురం, మల్యాల, త్రిపుర సముద్రం, మునగాల, పాపన్నపేట, మునగాల, శిర్నపల్లి..... ఇలా అనేక సంస్థానాలలో నగరాలలో రెడ్డిరాణులు (54) దాన ధర్మశీలురై వ్యవహరించిన తీరుతెన్నులు రెడ్డిరాజ్య సర్వస్వంలో పేర్కొన్నారు శాసనాల శాస్త్రిగా ప్రసిద్ధిచెందిన శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు.

**15. చరిత్ర నిర్మాణంలో శాసనాలు :**

336 పుటలతో రెడ్డిరాజ్య సర్వస్వం పూర్తయినట్లే! కాని తామదివరకే సేకరించిన రెడ్డి రాజుల–రెడ్డి రాణుల శాసనాన్ని 337వ పుట నుండి 598వ పుట వరకు అంటే 261 పుటల్లో పూర్వాపరాలు వివరిస్తూ 174 పై చిలుకు శాసనాలిచ్చారు. 140 పుటల్లో శాసనాల లిపి చిత్రాలను, చారిత్రక భవనాల, ఆలయాల, శిథిలాల దృశ్యాలనూ ఇచ్చారు.

ఇందులో అయిదారు పుటల శాసనాల నుండి అరపుట శాసనాలూ ఉన్నాయి. మచ్చుకు ఒక అరపుట శాసనం వివరాలతో పాటు చూద్దాం!

**డిచ్చకుంట శాసనము**

నర్సంపేట తాలూకాలోని డిచ్చకుంట గ్రామము దక్షిణమునగల పొలములో పడియున్న స్తంభముపై 23 పంక్తులలో చెక్కబడిన శాసనమిది. ప్రదక్షిణమహాదేవ మంచి

డిచ్చకుంటలోని చవుట కాలువ క్రింద ఒక మర్తురు భూమిని తత్పురుష దేవునకిచ్చు సందర్భమునందీశాసనమును వేయించెను. ఈ భూమిని రేచర్ల మండలిక రుద్రసేనాని కుమారుడగు కాటయ సేనాపతి నుండి మహాదేవమంచిగారు పొందిరి. కాటయ సేనాపతి, కాకతి గణపతి దేవ మహారాజు అశ్వసైన్యాధికారి. (గ్రంథంలో ఇది 14వ శాసనం).

డిచ్చకుంట శాసనము - మూలము

1. స్వస్తి శ్రీ మన్మహారాజా
2. ధి రాజులైన గణప
3. తి దేవ మహారాజుల
4. మందడి రేచర్లమండ
5. లిక రుద్రరడ్డి కొడుకు
6. కాటయ సేనా ప
7. తి వలనను డిచ్చకుం
8. టందుల చవుట కా
9. లువ మత్తురు ప్రదక్షి
10. ణము మహాదేవ మంచిం
11. గారు ధారా పూర్వకము
12. పడసి తత్పురుష దేవ
13. ర కిచ్చితిమి
14. పాలింతురు వారికి
15. శివలోకము ప్రతి
16. పాలింపని వారికి
17. ఇరువది ఎనిమిది వరకా
18. లవు। స్వదత్తాం పరద
19. త్తాంవా యోహరేత
20. వసుంధరా షష్టిం

**21.** వర్ష సహస్రాణి వి

**22.** ష్ఠాయాం జాయతే

**23.** క్రిమి।

అధ్యయన శీలురకు ఈ మూలశాసనాలెంతో ఉపకరిస్తాయి. ఉన్నది ఉన్నట్టు లిపితో ఇచ్చినవి పరిశీలనకు పరిశోధనకు పనికివస్తాయి. ఇలా ఆలోచనలకు తావిచ్చేట్టు చేసిన మహోన్నత చరిత్రకారులు శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు.

**16. రెడ్డి రాజుల నాటి సాంఘిక చరిత్ర :**

రెడ్డి రాజ్య సర్వస్వం గ్రంథంలో 177వ పుట నుండి 234వ పుట వరకు, శాసనాలు-సాహిత్యం ఆధారంగా నిర్మించిన సాంఘిక చరిత్ర ఉంది. అది రెడ్డి రాజుల కాలం నాటి సాంఘిక చరిత్ర. శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు ఈ అంశాన్ని ఇలా ప్రారంభించారు.

**.....రెడ్డి రాజుల నాటి సాంఘిక చరిత్ర కాకతి రాజుల కాలపు సాంఘిక స్థితిగతులను పోలియున్నను కొంతమార్పు కనిపించును. కాకతీయుల కాలమునందాంధ్రజాతి సమైక్యముగ నుండి అన్ని రంగములందు ముందంజ వేసియుండెను. కాని క్రీ.శ. 1324 తరువాత ఆంధ్రదేశము ముస్లిం పాలనలో నుండి, వారి పాలనానంతరము చిన్న చిన్న రాజ్యములుగ రూపుదిద్దుకొనినది. (పుట : 177)**

**.....రెడ్డి రాజులు వైదిక మతమునుద్ధరించి, వర్ణవ్యవస్థను రక్షించి, అనేక దానధర్మములొసంగి, తమ కీర్తి శాశ్వతముగనుండునట్లు ప్రజోపయోగ నిర్మాణములను చేపట్టి నిర్వహించినారు. (పుట : 177)**

కొండవీటి రెడ్డి రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం నిమిత్తం సీమలుగా విభజించుకొన్నారని, ఆ సీమలనే నాయంకరాలుగా పిలిచారని అవి తంగెడ, గురజాల, బెల్లంకొండ, నాగార్జున కొండ, కొండవీడు, కందుకూరు, రాజమహేంద్రవరము మొదలైనవిగా పేర్కొన్నారు. రెడ్డిరాజుల కాలంలో అనేక యుద్ధాలు జరిగాయని, వారిలో వారే కలహించుకొన్నారని కొండవీడు, రాచకొండ, దేవరకొండల మధ్య వైషమ్యాలుండేవని, రెడ్డి రాజులు పద్మనాయకుల మధ్య వైషమ్యాలు బహమనీ సుల్తానులు స్థిరపడడానికి కారణమైందని వివరించారు. కరవుకాలంలో రాచవేమారెడ్డి వంటివారు పన్నులు విధించి ప్రజల ఆగ్రహానికి గురయ్యారన్నారు శ్రీ బి.ఎన్.శాస్త్రి గారు. మహమ్మదీయుల దండయాత్రల వల్ల ప్రజలు కష్టనష్టాలకు గురయ్యారన్నారు. పంటలు పండించే రైతులకు రక్షణ లేకపోయిందని ఈ ప్రకరణ ప్రారంభంలో వివరించారు.

మత విషయాలు ప్రస్తావించి రెడ్డిరాజులు శైవమతానుయాయులన్నారు. వీరశైవం కూడా వ్యాప్తిలో ఉందన్నారు. వీర శైవంలో అంగాలు ఛేదించుకోవడం, తలలను నరుక్కోవడం, హింసా కార్యక్రమాలు కొనసాగించడం వల్ల శివ సాయుజ్యం లభిస్తుందనే నమ్మకా లుండేవన్నారు.

శక్తిపూజలు, నరబలులు, క్షుద్రదేవతలకు కల్లు సాకపోయడం, భైరవ-కాళీ ఆదిశక్తులకు బలులివ్వడం వంటి శాక్తేయ భైరవ తంత్రాదులను అనుసరించే ఆచారాలుండేవన్నారు.

రెడ్డిరాజులు శైవమతానుయాయులైనా పరమత సహనాన్ని పాటించారు. కుమారగిరి రెడ్డి తదితరులు వైష్ణవ మతాన్ని స్వీకరించి వ్యాపింపజేశారు. వైష్ణవంలోని వైఖానస శాఖ వికసించింది. గ్రామ దేవతలకు తోడుగా వీరభద్ర-గణనాథులకు విష్వక్సేనులకు పూజలు చేసే ఆచారం బలపడింది. దేవాలయాల్లో ఉత్సవాలు నిర్వహించేవారు. ఈ ఉత్సవాల్లో తరతమ బేధాలు - కులబేధాలు లేకుండా అందరూ పాల్గొనేవారు.

మత విషయాలను సాంఘిక జీవనంలో పై విధంగా వివరించిన శ్రీ శాస్త్రిగారు, దేవాలయాల్లో జరిగే శుభకల్యాణ సంక్షేమ కార్యక్రమాల గురించి ఈ క్రింది విధంగా విశ్లేషించారు.

**"దేవాలయములకనుబంధముగ విద్యాపీఠములు, మఠములు, గోళకీమఠములుండెడివి. వైష్ణవ సంప్రదాయబద్ధమైన విద్యాలయములు దేవాలయములందు నెలకొల్పబడినవి. రాజులు శైవ వైష్ణవ దేవాలయములందు నిత్యదీపములు, నిత్యారాధనములు, ధూప-దీప-నైవేద్యాదులు సక్రమముగా నిర్వహించుటకును, అంగ రంగ భోగములకును అగ్రహారములను, భూదానములను ఇచ్చి తమ పరమత సహనమును ప్రకటించుకొనినారు. ఆనాటి స్త్రీలనేక వ్రతముల నాచరించుచుండిరి. తమ భర్తల యోగ క్షేమములకు, సంతాన శ్రేయస్సుకు, ఐశ్వర్యమునకు అట్టి వ్రతములు నిర్వహించుచుండిరి." (పుట : 180)**

సాంఘిక చరిత్ర అనే శీర్షిక క్రింద మత విషయాల అనంతరం నాటి సంఘం పరిస్థితులు చెప్పబడినాయి.

రెడ్డి రాజుల కాలంలో హైందవ సంఘంలోని వివిధ కులాలవారు తమ తమ శక్తి సామర్థ్యాల బట్టి వికసించారు. అధికారాలు, గౌరవాదరాలు వారి నైపుణ్యాన్ని బట్టి లభించేవి. రెడ్డి రాజులు చతుర్థకులజులు (శూద్రులు) అయినా వారి సంబంధ బాంధవ్యాలు సామంత, మహా సామంత, మాండలిక ప్రభువులతో ఉన్నాయి. రెడ్డి అనేది ఒక పదవి అని శ్రీ శాస్త్రిగారు ఇలా విశ్లేషించారు.

**"...... గ్రామ సీమలందు ప్రభుత్వమునకు భూమి శిస్తు వసూలు చేయు బాధ్యత వహించువారు, రట్టొడ్లుగా వ్యవహరింపబడినారు. వీరు గ్రామ రక్షణార్థము ప్రభువుచే**

**నియమింపబడిన రట్టగుడులు. వ్యవసాయార్థము, ప్రజల రక్షణార్థము కొంత భూమిని ప్రభువు నుండి పొంది గ్రామ శ్రేయస్సుకు పాటుపడువారు రట్టగుడులు. కాలక్రమమున రట్టగుడులు రట్టడ్లుగను, రట్టడ్లు వారు చేయు వృత్తిని బట్టి రడ్డరికము పదవిని పొందిరి. రడ్డరికము లనగా శిస్తు వసూల చేయు పని. అది క్రమముగా రడ్డి, రెడ్డి పదవులుగా మారినది." (పుట : 180)**

రెడ్డి పదానికి శ్రీ శాస్త్రిగారి ఈ వివరణ ప్రామాణికంగా నిలిచింది. ఈ గ్రంథ ప్రారంభంలో రెడ్డి వ్యుత్పత్తికి సంబంధించిన అనేక నిర్వచనాలిచ్చిన శాస్త్రిగారు ఇక్కడ ఆ పదం వ్యాప్తి చెంది ఏ అర్థంలో స్థిరపడిందో వివరణ ఇచ్చారు. పైగా రాజులు చతుర్థజులైనా వారి మంత్రులుగా, సేనానాయకులుగా, దీక్షా గురువులుగా, విద్యాధికారులుగా, పురోహితులుగా బ్రాహ్మణులు వ్యవహరించారన్నారు.

గౌరన హరిశ్చంద్రోపాఖ్యానం, ఎఱ్ఱాప్రెగడ హరివంశం, శ్రీనాథుని భీమేశ్వర పురాణం, విజ్ఞానేశ్వరీయ స్మృతి తదితర గ్రంథాల్లోని అనేక అంశాల ఆధారంగా ఆనాటి సాంఘిక పరిస్థితులను వివరించారు.

వ్యవసాయము – ఆర్థిక వ్యవస్థ అనే అంశం మీద ఈ గ్రంథం అనేక ప్రామాణిక సాంఘికాంశాలను ప్రస్తావించింది. ఈ విషయంలో శాస్త్రిగారి నిశిత పరిశీలన సురవరం వారి సాంఘిక చరిత్రతో దీటుగా నిలిచింది.

జొన్న, సజ్జ, వరి, చెరకు, నువ్వులు, ప్రత్తి, నవధాన్యాలు ఆకాలంలో పండించేవారని ఉదాహరణలిచ్చారు. భూమికొలతల ప్రస్తావన తెచ్చారు. దున్నలు, గొఱ్ఱెలు, బఱ్ఱెలు, ఆవులు అసంఖ్యాకంగా ఉన్నాయన్న మల్లంపల్లి సోమశేఖర శర్మగారి వ్రాతలను ప్రస్తావించారు.

వస్త్ర పరిశ్రమ, పంచాణంవారు తయారు చేసిన వస్తువులు, అవచి తిప్పయశెట్టి విదేశీ వ్యాపార నైపుణ్యం, వస్తు క్రయవిక్రయాల విశేషాలు, తిరునాళ్లు – జాతరలు – సంతలు, మోటుపల్లి రేవు ద్వారా కొనసాగిన వర్తకం, సంఘంలో మోసాలు చేసినవారికి విధించే శిక్షలు .... ఇలా అనేక విషయాలు ఈ ప్రకరణలో ఉన్నాయి. శిల్ప సంగీత్యాద్యంశాలున్నాయి.

ప్రజావినోదాలలో వేటలు, వేటకుక్కలు, జూదాలు, అంజి, పాచిక, పగడసారి, అచ్చనగండ్లు, కచ్చకాయలు, ఓమనగుంటలు తదితర క్రీడలను ప్రస్తావించారు. వినోదాల్లో పొడుపు కథల గురించి చెప్పారు. చతురంగం, పులిజూదం మొదలైన ఆటలను చిత్రాలు వేసి చూపించారు. వసంతోత్సవాలనూ పేర్కొన్నారు. రెడ్డిరాజుల పాలనా ప్రాంతాన్ని చిత్రపటంలో చూపించారు. మైలారుభటులు, మైలారు దేవాలయాలు, దేశి నృత్య విధానాలనూ ప్రస్తావించారు.

కేయూర బాహు చరిత్ర, సింహాసన ద్వాత్రింశిక, భోజరాజీయం, హరవిలాసం, వివిధ

చాటుపద్యాలు మొ॥ వాని ఆధారంగా పై విషయాలను ప్రామాణికంగా ప్రస్తావించారు. చివరగా సాంఘిక పరిస్థితులు, సాంఘిక జీవనము అనే శీర్షికల క్రింద కొన్ని విశేషాలను పేర్కొన్నారు.

సంఘంలో పాపభీతి, భయభక్తులున్న ప్రజలు అధిక సంఖ్యలోనే ఉన్నారని శిక్షా తీవ్రతలుండేవని చెప్పారు. ప్రజాజీవితాన్ని వివరించిన తీరు వారి మాటల్లోనే చూద్దాం.

**....సామాన్య ప్రజల జీవితము వివిధ వృత్తులపైనాధారపడి యుండెను. పల్లె ప్రజలలో మూఢనమ్మకములు, మూఢాచారములు ప్రబలి యుండెను. శకునములను పాటించుచుండిరి. వినోదములందు కాలక్షేపము చేయు యువతీయువకులు వసంతోత్సవములను, జాతరలను, పండుగలను, పర్వములను ఉత్సాహముతో నిర్వహించుచుండిరి. ప్రజలు, రైతులు, పురోహితుల పంచాంగములపై ఆధారపడి నూతన కార్యక్రములను తలపెట్టెడివారు. జూదరులానాడు ప్రతి నగరమందును ఉండిరి. ధనార్జనకనేక వృత్తుల నవలంబించిన వారుండిరి. యుద్ధములందు మునిగి తేలిన కాలమిది. ప్రజలు ధనవంతుల నుండి అప్పుగా ఋణము గ్రహించి వడ్డీ చెల్లించెడివారు. బ్రాహ్మణులు, రాజులు, తదితర వర్ణములవారు వేశ్యాలోలురై యుండిరి...." (పుట : 199)**

సాంఘిక జీవనంలో వస్త్రధారణ, గొఱ్ఱెల పెంపకం, బఱ్ఱెల పెంపకం, ఇప్పపూసారా తయారి, స్త్రీల ఆచారాలు ఎన్నో విశేషాలు శ్రీ శాస్త్రిగారు ఈ గ్రంథంలో వివరించారు. పిండివంటలు, ఆతిథ్యాలూ ప్రస్తావించారు. ఈ విధంగా అనేక విశేషాలు సాంఘిక జీవనంలో సమగ్రంగా విశ్లేషించారు. ఒక విధంగా సాంఘిక చరిత్ర అనే ఈ అంశం రెడ్డిరాజ్య సర్వస్వ గ్రంథానికి ఆత్మవంటిదనే చెప్పాలి.

**17. రెడ్డి రాజులు–సాహిత్యము :**

రెడ్డిరాజుల నాటి సాంఘికచరిత్ర అనే ఈ ప్రకరణంలో భాగంగా రెడ్డి రాజుల కాలంనాటి సాహిత్య విశేషాలను వివరించారు. ప్రబంధకవి శ్రీగిరి నాయనింగారి గౌరనగారి నవనాథచరిత్రలు, కందుకూరు రాచవేమారెడ్డి శాసనం, హరివంశం, కాటయ వేముని గ్రంథాలు, శాసనాలు, సంస్కృత గ్రంథాలు, వామన భట్టబాణుని శృంగార భూషణాది గ్రంథాలు, శ్రీనాథుని వివిధ గ్రంథాలు ముఖ్యంగా శివరాత్రి మాహాత్మ్యం, శాలివాహన సప్తశతి, పలనాటి వీరచరిత్ర మొదలైనవి, శ్రీనాథుని కనకాభిషేక విషయాలు, శివలెంక కొమ్మన వీర మాహేశ్వరం, శివలీలా విలాసం అనే గ్రంథాల్లోని విషయాలు ప్రస్తావించారు.

రెడ్డి రాజుల కాలంలో ప్రబంధ పరమేశ్వర, కవి సార్వభౌమాది బిరుదాలున్న కవులూ ఉన్నారని, దానికి కారణం వారు సాహిత్య పోషకులు కావడమే అని, స్వయంగా

కవిపండితులైన కారణంగా విద్యావికాసం జరిగిందని, వైదుష్యం (పాండిత్యం) గుర్తింపబడిందని చెబుతూ, ఈ విభాగాన్ని ముగిస్తూ ఉపసంహారంగా శ్రీనాథుని కాశీఖండాన్ని ప్రస్తావించి ప్రత్యేకంగా వీరభద్రారెడ్డి తదితర రాజుల సాహిత్య పోషణను శ్రీ బి.ఎన్.శాస్త్రి గారు వివరించారు.

**18. ఉపసంహృతి :**

శాసనాల శాస్త్రిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు అనేక చారిత్రక సాంఘిక సర్వస్వాలను రచించారు అందులో ఈ రెడ్డి రాజ్యసర్వస్వం ఒకటి. ఇది సమగ్రం కాదని గ్రంథ ప్రారంభంలోనే వారన్నారు. సరళ గ్రాంథిక శైలిలోనే వారి ఈ రచనంతా సాగింది. విశేష పరిశ్రమ వల్ల ఆవిర్భవించిన ఈ గ్రంథం చరిత్ర శాస్త్రవేత్తలకు, సాహిత్యాధ్యయన శీలురకు, ముఖ్యంగా పరిశోధకులకు అపూర్వ సమాచారాన్నందిస్తుంది. అందుకే ఇది అపూర్వ పరిశోధనా గ్రంథంగా నిలిచింది.

**ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి**
శతాధిక గ్రంథకర్త, విశ్రాంతాచార్యులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 98669 56250



# బ్రాహ్మణ రాజ్య సర్వస్వము

బ్రాహ్మణులు మంత్రి, పురోహిత, సేనాని, దండనాయకాది ఉన్నత పదవులను నిర్వహించిన వారే. కానీ, మహా సామ్రాజ్యాలను స్థాపించి, పాలించిన వారు కారని సామాన్యులలో ఒక అపప్రథ ప్రచారంలో ఉన్నది. ఇది వాస్తవం కాదని బ్రాహ్మణ్య రాజ్య సర్వస్వం నిరూపించింది. శాసన పరిశోధనలోను, చరిత్ర నిర్మాణంలోను నిష్ణాతులైన బి.ఎన్.శాస్త్రిగారు - మహా సామ్రాజ్యాలను స్థాపించిన శుంగ, కాణ్వ, శాతవాహన, పల్లవ, కదంబాది వంశీయులే కాక, గుప్త సామ్రాట్టులు కూడా బ్రాహ్మణులేయని ఇందు సాధికారికంగా నిరూపించినారు.

మౌర్య సామ్రాజ్యం పతనమైన తర్వాత శుంగ వంశము మొదలుకొని వేయి సంవత్సరాలకు పైగా నిరంతరాయంగా బ్రాహ్మణ రాజవంశీయులు భరత భూమిలో వివిధ దేశాలను, ప్రాంతాలను పరిపాలించినట్లు చరిత్ర వల్ల తెలియవస్తున్నది. శాస్త్రిగారు ఈ ఇతిహాసానికంతా శాసనాలను, ప్రాచీన గ్రంథాలను ఆధారంగా గ్రహించినారు. ఈ సర్వస్వంలో ప్రసిద్ధమైన 26 బ్రాహ్మణ రాజవంశాలు, తద్రాజ్యాల చరిత్రయే కాక, దేశమంతా వ్యాపించి యున్న ఎన్నియో చిన్న రాజ్యాల, సంస్థానాల చరిత్రలు కూడా చోటు చేసుకున్నవి.

రాజ్య వ్యవస్థ లేని ప్రాచీన కాలంలో భారత వర్షంలో మాత్స్య న్యాయం ప్రచలితమై ఉంది. మాత్స్య న్యాయమనగా చిన్న చేపను పెద్ద చేప మింగడం. బలవంతుడు దుర్బలుడ్ని హింసించడం. ఇట్టి అవ్యవస్థ చేత ఉద్వేజితులైన ప్రజలు ఇటువంటి దుస్థితి నుంచి విముక్తి పొందే ఉద్దేశంతో వైవస్వత మనువును సర్వసమ్మతంగా రాజుగా ఎన్నుకొని పండిన పంటలలో

ఆరవ భాగాన్ని, వాణిజ్యంలో పదోభాగాన్ని, స్వర్ణాన్ని రాజుకు చెందవలసిన భాగంగా నిర్ణయించి పరిపాలన సాగించవలసిందిగా ప్రార్థించినారు. దానిచే పోషింపబడిన రాజులు అప్పటినుంచి ప్రజల యోగ క్షేమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ విషయం ఆర్య చాణుక్యుని అర్థశాస్త్రం వల్ల తెలియవస్తున్నది.

ఆ కాలంలో దేశంలో ఎందరో వీరులు, బలవంతులు, నియంతలు, పాలకులు, ధనికులు, విద్వాంసులు ఉన్నా వైవస్వత మనువునే రాజుగా వరించడానికి కారణమేమనే జిజ్ఞాస కలుగక మానదు. ఋగ్వేదంలోని 8 వ మండలంలో 4 సూక్తాలకు వైవస్వత మనువు ద్రష్ట, అనగా ఆ సూక్తాలను దర్శించిన ఋషి. సత్యాన్ని ధర్మాన్ని సాక్షాత్కరించుకున్న వాడే ఋషియని ఆ శబ్దాన్ని యాస్కుడు నిర్వచించినాడు. ఋషియైన మనువును ప్రజలు రాజుగా వరించడానికి కారణం మనువు సర్వధర్మ విదుడనియే. రాజత్వ, ఋషిత్వ ధర్మాలు రెండూ మనువు నందు ప్రతిష్ఠితమై ఉండడం వల్ల రాజర్షి అన్న సార్థక నామం మొదట అతనికే చెందుతుంది. వైవస్వత మనువు ఆదిరాజుగా కీర్తింపబడ్డాడు. తర్వాత జనకాదులు రాజర్షులుగా కీర్తింపబడ్డారు.

ప్రజలు మనువును సర్వ సమ్మతంగా ఎన్నుకొనుటతో, మనదేశంలో ప్రజాతంత్రానికి, ప్రభు వ్యవస్థకు రెండింటికీ ఒకేసారి బీజావాపం జరిగినట్లు ఈ ఇతిహాసం వల్ల తెలుస్తుంది. మనువు మొదలైన ఋషుల పరంపరకు చెందినవారే బ్రాహ్మణులు. వేద, శాస్త్ర విదుడైన బ్రాహ్మణుడు సేనాధిపత్యానికి, రాజ్యానికి, దండ నేతృత్వానికి, సర్వ లోకాధిపత్యానికి అర్హుడని మనుస్మృతి (12-100) తెలుపుతున్నది.

వైదిక యుగానంతరం క్రీస్తుకు పూర్వం ఆరు, ఐదు శతాబ్దులలో గౌతమ బుద్ధుణ్ణి, పాణినిని అధిగమించి క్రీ.పూ. 4 వ శతాబ్దంలోకి పయనిస్తాం. శిశు నాగవంశీయుడైన కాలాశోకుణ్ణి మోసంతో, అధర్మమార్గంలో హతమార్చి, మహా పద్మనందుడు మగధ సింహాసనాన్ని ఆక్రమించుకొనడంతో భరతవర్షంలో నంద వంశీయుల పాలన మొదలై క్షత్రియ రాజన్యుల పాలన పరిసమాప్తమయింది. (క్రీ.పూ. 365) నంద వంశీయుల ఏలుబడి 41 సంవత్సరాల పాటు సాగింది.

అధర్మపరమైన నంద సామ్రాజ్యాన్ని క్రోధంతో అతిశీఘ్రంగా కూలద్రోసి, నందరాజగతమైన భూమిని, శస్త్రాన్ని, శాస్త్రాన్ని ఉద్ధరించి ఆర్య చాణుక్యుడు క్రీ.పూ.326 లో మగధ సింహాసనంపై చంద్రగుప్త మౌర్యుని ప్రతిష్ఠించినాడు. దీనితో మౌర్య చక్రవర్తుల పాలన మొదలైంది. బిందుసారుడు, అశోకుడు మొదలైన సమర్థులైన రాజన్యులు

పరిపాలించినంత కాలం మౌర్య సామ్రాజ్యం కొనసాగింది. ఈ వంశపు చివరి రాజగు బృహద్రథుడు భోగలాలసుడై రాజ్యాన్ని పట్టించుకోకపోవడంతో అతనిని కడతేర్చి, మహా సేనాని అయిన పుష్యమిత్ర శుంగుడు మగధ సింహాసనాన్ని అధిష్ఠించినాడు. శుంగ వంశీయులు భారద్వాజ గోత్రికులైన బ్రాహ్మణులని పాణిని వల్ల (4-1-117), పురాణాల వల్ల తెలియ వస్తున్నది. పుష్యమిత్రుడు వైదిక మతావలంబి. వైదిక ధర్మాన్ని, శ్రౌత యజ్ఞ యాగాలను సర్వవిధాలా ప్రోత్సహించినవాడు మహాభాష్యకారుడైన పతంజలి ఆధ్వర్యంలో రెండు అశ్వమేధాలను అనుష్ఠించినాడు.

పుష్యమిత్ర శుంగుని సామ్రాజ్యంలో పూర్వపు మౌర్య సామ్రాజ్యంలోని మధ్యభాగం మాత్రమే ఉండినది. దక్షిణ భారతం, కళింగం, కొన్ని ఉత్తర భారత భాగాలు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని ఉండినవి. ఇతడు సింధు దేశంలోను, మధ్య ప్రాంతంలోను చొచ్చుకొని వస్తున్న యవన సేనలను ఎదుర్కొని వాటిపై విజయం సాధించినాడు. బార్హుత్ స్తూపం, శుంగుల కాలంలో వెలసిన గొప్ప వాస్తు నిర్మాణం. అశోకుడు నిర్మించిన సాంచీ స్తూపం చుట్టూ ద్వార తోరణాలు, అందమైన ఆవరణం వీరి కాలంలోనే నిర్మింపబడినవి. పదిమంది శు ంగ వంశపు రాజులు 112 సంవత్సరాలు (క్రీ.పూ. 187 నుంచి క్రీ.పూ. 75 వరకు) పరిపాలన సాగించినారు.

## కాణ్వవంశం

శుంగ వంశపు చివరి రాజగు దేవభూతి భోగలాలసుడై రాజ్యాన్ని పట్టించుకోక పోవడంతో అతని మంత్రి వాసుదేవుడు అంత:పుర దాసీ పుత్రికచే దేవభూతిని హత్యచేయించి మగధ సామ్రాజ్యంలో ప్రబలులైన వారిని తన వశం చేసుకొని సింహాసన మాక్రమించినాడు. వాసుదేవుడు కణ్వ మహర్షి వంశానికి చెందిన బ్రాహ్మణుడు. ఇతడు కాణ్వ గోత్రికుడు కావడం వల్ల ఇతనిది కాణ్వాయన వంశంగా పేరు గాంచినది. ఈ వంశీయులు నలుగురు క్రీ.పూ. 75 నుంచి - క్రీ.పూ. 30 వరకు మొత్తం 45 సంవత్సరాలు మగధ సామ్రాజ్యాన్ని పాలించారు. మగధ సామ్రాజ్యంలోని అధిక భాగం వీరి అధీనంలో ఉండినట్లు మనం భావించవచ్చు.

మౌర్య సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడంతో దక్షిణాపథ, ఉత్తరాపథాలల్లో గల విభిన్న రాజ్యాలలో గల మంత్రి, సామంత, సేనానాయకాది పదవులలో గల బ్రాహ్మణులందరూ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుని వేర్వేరు రాజ్యాలను స్థాపించినారు. వారే శుంగులు, కాణ్వులు, శాతవాహనులు, పల్లవులు మున్నగువారు. ఈ రాజన్యుల కారణంగా భారతదేశంలో సుమారు వెయ్యి (1000) సంవత్సరాలు బ్రాహ్మణ రాజ్యపాలన కొనసాగింది.

## శాతవాహన వంశం

శ్రీముఖుని నుంచి నాల్గవ పులోమావి వరకు మొత్తం 30 మంది శాతవాహన రాజులు క్రీ.పూ. 231 నుంచి క్రీ.శ. 219 వరకు, సుమారు 450 సంవత్సరాలు దక్షిణా పథాన్ని, కొన్ని ఉత్తర ప్రాంతాలను పరిపాలించినారు. వారిలో కొందరు ముఖ్యుల సంక్షిప్త పరిచయం ఇక్కడ చేయబడుతున్నది.

శాతవాహన వంశ మూల పురుషుడు శ్రీముఖుడు కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాల ప్రాంతంలో గణతంత్ర పాలకుడుగా ఉండి, అశోక చక్రవర్తి మరణానంతరం స్వతంత్రుడై విశాల సామ్రాజ్యాన్ని ఏర్పర్చుకొని పాలించినాడు. మహారాష్ట్ర ప్రాంతంలో అత్యంత బలాన్వితుడైన మహారథి త్రణయికరో కుమార్తె దేవినాగనీకను తన కుమారుడు మొదటి శాతకర్ణితో వివాహం జరిపించి, మహారథుల సహకారంతో బలమైన రాజ్యాన్ని నిర్మించు కున్నాడు. శ్రీముఖుడు పిష్టపురము రాజధానిగా క్రీ.పూ.231 నుంచి క్రీ.పూ.208 వరకు దక్షిణాపథాన్ని పాలించినాడు. ఇతడు జైనమతాన్ని వదలుకొని వైదికమతం స్వీకరించినాడు.

శ్రీముఖుని పుత్రుడు మొదటి శాతకర్ణి క్రీ.పూ.198 లో శాతవాహన సామ్రాజ్యాన్ని చేపట్టాడు. దేవి నాగానీక వేయించిన నానేఘాట్ శాసనంలో వీర, శూర, అప్రతిహతచక్ర దక్షిణాపథపతి యని వర్ణింపబడ్డాడు. ఉత్తర భారతంపై దండెత్తి, మగధాధిపతియైన పుష్యమిత్రుడిని ఓడించిన ఖారవేలునిపై విజయం సాధించడం వల్ల శాతకర్ణి సమస్త రాజులను జయించినట్లయింది. ఈ మహారాజు వైదిక మతావలంబియై అగ్న్యాధేయం, అప్తోర్యామం, అనారంభణీయం, త్రిరాత్ర, దశరాత్ర, త్రయోదశ రాత్రాది శ్రౌతయజ్ఞాలను అనుష్ఠించినాడు.

కుంతల శాతకర్ణి క్రీ.పూ. 10వ సం॥ నుండి క్రీ.పూ. 2వ సం॥ వరకు పరిపాలన సాగించినాడు. శాతవాహన రాజులలో ప్రసిద్ధుడైన యితడు శక రాజులతో అనేక యుద్ధాలు చేసి విజయం సాధించినాడు. సంస్కృత, ప్రాకృత భాషలు ఇతనిచే పోషింపబడినవి. బృహత్కథలో ఇతని ప్రశంస ఉన్నది. ఈ మహారాజు ఆస్థానంలో శర్వవర్మ, గుణాఢ్యుడు మొదలైన సుప్రసిద్ధ విద్వాంసులుండేవారు.

శాతవాహన రాజులలో హాలుడు సాహిత్య పోషకుడిగా, మహాకవిగా, సంస్కృత, ప్రాకృత భాషను ఆదరించి పోషించిన వాడుగా కీర్తింపబడ్డాడు. ప్రతిష్ఠానపురం ఇతని రాజధాని. ఈ రాజప్రవరుని ప్రాకృత కవితా సంకలనం 'గాథాసప్తశతి' విశ్వవిఖ్యాతమైంది. లీలావతి కావ్యం, దేశీనామమాల, అభిధాన చింతామణి వంటి గ్రంథాలు ఇతని కాలంలో వెలువడినవి. ఈ రాజు పాలన కాలం క్రీ.శ.61 నుంచి 66 వరకు.

శాతవాహన వంశ కీర్తిప్రతిష్ఠలు పెంపొందించిన వారిలో గౌతమీపుత్ర శాతకర్ణి అగ్రగణ్యుడు. క్రీ.శ. 104లో సింహాసనం అధిష్ఠించి రాజ్య విస్తృతి కావించినాడు. గౌతమీపుత్రుని తల్లి బాలశ్రీ నాసిక్‌లో వేయించిన శాసనాల వల్ల ఇతని బలపరాక్రమాలు, విజయాలు, పాలించిన రాజ్యాల పేర్లు తెలియవస్తున్నవి. ఈ మహారాజు ఏకబ్రాహ్మణ బిరుదాంచితుడుగా, క్షత్రియ దర్ప మాన మర్దనుడుగా, క్షహరాట వంశ నిరవశేషకరుడుగా కీర్తింపబడ్డాడు.

యజ్ఞశ్రీ శాతకర్ణి (క్రీ.శ. 167-196) గొప్ప విజేత. పూర్వం శాతవాహనులు కోల్పోయిన రాజ్యాలను ఇతడు జయించి తిరిగి సామ్రాజ్యాన్ని విస్తరించినాడు. యజ్ఞశ్రీ త్రిసముద్రాధిపతిగా బాణభట్టుచే హర్షచరిత్రలో ప్రశంసింపబడ్డాడు. శూన్యవాదాచార్యుడైన నాగార్జునుని ఆదరించి, అతనికై విజయపురిలో పారావత విహారం నిర్మించినాడు.

శాతవాహనులు నిర్మించిన గుహలు శిల్ప సంపదకు ఆయువుపట్టులు. సాంచీ ద్వారమందలి శిల్పం, అమరావతి శిల్పం ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయి. అజంతాలోని ఐదు గుహలు శాతవాహనుల కాలానివి. ఇందలి చిత్రాలు, గోడలపై గల బుద్ధుని జీవిత ఘట్టాలు మనోహరములై కళావిదులైన చూపరులను ఆకర్షించేవి.

## ఇక్ష్వాకు వంశం

శాతవాహన సామ్రాజ్యం అస్తమించడంతో దక్షిణాపథంలో చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. ఇక్ష్వాకు వంశీయులు నలుగురు రాజులు విజయపురి రాజధానిగా 75 సంవత్సరాలు ఆంధ్ర దేశంలోని కొన్ని ప్రాంతాలను ఏలినారు. శాతవాహనులు అంత: కలహాల్లో మునిగిపోయినపుడు, ఇక్ష్వాకు వంశీయుడగు శాంతమూలుడు విజయపురిలో స్వాతంత్ర్యం ప్రకటించుకొని, ధాన్యకటకంపై దండెత్తి శివమకసద శాతకర్ణిని ఓడించి, రాజ్యమాక్రమించి, క్రీ.శ. 225లో ఇక్ష్వాకు రాజ్యాన్ని స్థాపించినాడు. ఇతడు పరమ వైదికుడు. విరూపాక్షపతి భక్తుడు. అశ్వమేధ, వాజపేయ, అగ్నిష్టోమాది యజ్ఞములను చేసినాడు. హిరణ్యాన్ని, గోవులను, హలసహస్రాన్ని దానంగా ఇచ్చినాడు.

ఇక్ష్వాకు వంశపు రాణులు, అంత:పుర స్త్రీలలో కొందరు బౌద్ధమతాభిమానులు. వారు బౌద్ధ విహారాలకు, చైత్యాలయాలకు అనేక దానాలు కావించినారు. శాంతమూలుని తర్వాత వీరపురుషదత్తుడు, ఎహువల శాంతమూలుడు, రుళు పురుషదత్తుడు రాజ్యపాలన కావించినాడు. పల్లవులు, ఇక్ష్వాకులు బద్ధవిరోధులు. పల్లవ రాజగు సింహవర్మ ఇక్ష్వాకుడైన రుళు పురుషదత్తుడిని యుద్ధంలో ఓడించి విజయపురిని ఆక్రమించినాడు. దీనితో ఇక్ష్వాకుల రాజ్యం అస్తమించింది.

## పల్లవ రాజవంశం

శాతవాహనుల తర్వాత దక్షిణభారతాన్ని పాలించిన రాజవంశాలలో పల్లవ రాజవంశం పేరు గాంచింది. వీరి రాజధాని కాంచీనగరం. పల్లవ వంశీయుల పాలన ఏడు శతాబ్దులు కొనసాగింది. అందు ప్రాచీన పల్లవులు మూడు వందల యేండ్లు, మహాపల్లవులు నాలుగు వందల యేండ్లు పాలించారు. పల్లవ వంశానికి మూల పురుషుడు సింహవర్మ. ఇతనికే వీరకూర్చవర్మ యని మరొక పేరు. సింహవర్మ (క్రీ.శ.280-310) మొదలుకొని మహేంద్రవర్మ (క్రీ.శ.600-630) వరకు గల రాజన్యులు ప్రాచీన పల్లవులుగా పరిగణింపబడుతున్నారు. సింహవర్మ (క్రీ.శ.550-575) మొదలుకొని 2వ నందివర్మ పల్లవమల్లుని (క్రీ.శ. 730-796) వరకు గల రాజులు మహా పల్లవులని ప్రసిద్ధి. పల్లవులు భారద్వాజ గోత్రజులైన బ్రాహ్మణులని శాసనాల ద్వారా తెలుస్తున్నది. శివస్కంధవర్మ అశ్వమేధ, వాజపేయ, అగ్నిష్టోమాది క్రతువులను నిర్వహించి ధర్మ మహారాజులుగా కీర్తింపబడినారు.

పల్లవులు కొన్ని తెలుగు, కన్నడ ప్రాంతాలతో పాటు సువిశాలమైన దక్షిణ భారతాన్ని కూడా పాలించినారు. శివస్కంధ వర్మ వేయించిన హిరహడగళ్ళి శాసనం వల్ల పల్లవుల నాటి పాలనా విశేషములు తెలుస్తున్నవి. రాజు సర్వాధికారి అయినా, పాలనా విషయంలో సలహాలనిచ్చేందుకు మంత్రిమండలి ఉండేది. రాజు మంత్రుల అభిమతానుసారం ప్రజోపయోగ నిర్మాణాలను చేపట్టేవాడు. రాజులు ధర్మ మహారాజులుగా పేరుగాంచారు.

పాలనా సౌలభ్యానికై సామ్రాజ్యం రెండు రాష్ట్రాలుగా విభజింపబడింది. వీరి శాసనాల్లో కర్మరాష్ట్రం, వేంగీరాష్ట్రం, ముండ రాష్ట్రం, అడేయారు మొదలైనవి పేర్కొనబడినవి. రాష్ట్రాలు మరల విషయాలుగా, కోష్ఠాలుగా విభజింపబడినవి. గ్రామపాలన సువ్యవస్థితమై యుండినది. వేదశాస్త్ర విద్వాంసులకు అగ్రహారాలు ఇవ్వబడేవి. దేవాలయాల నిర్వహణకై దేవభోగాలుండేవి. ఘటికలనే పేరుతో గొప్ప విద్యాలయాలుండేవి. వీటిని రాజులే పోషించేవారు.

పల్లవ రాజులు ఎందరో కవులను, పండితులను ఆదరించినారు. రాజులలో కొందరు స్వయంగా పండితులు, కవులు. వీరు ప్రాకృత, సంస్కృత, తమిళ భాషలను పోషించారు. వేదవిద్యా పీఠంగా, నాగరికతా సంస్కృతులకు నిలయంగా కాంచీనగరం పేరు గాంచింది. రెండవ నరసింహ వర్మ ఆస్థానంలో దండి మహాకవి ఉండేవాడు. 63 మంది నాయనారులలో అప్పర్, తిరుజ్ఞాన సంబంధార్, సుందరార్‌లు మహేంద్రవర్మ సమకాలికులు. వీరు భక్తితత్వంతో నిండిన శైవ గ్రంథాలను రచించారు. జైన దిగంబరాచార్యుడు లోక విభాగమనే గ్రంథం రచించినాడు. రెండవ నరసింహ వర్మ జ్యేష్ఠపాద సోమయాజికి ఏకాదిర మంగళం అనే

అగ్రహారాన్నిచ్చాడు. ప్రతిగ్రహీతయైన సోమయాజి చతుర్వేదాలను, షడంగాలను అధ్యయనం చేసినవాడు. శ్రవణపేయంగా సామగానం చేయడంలో సమర్థుడు. సర్వశాస్త్ర కోవిదుడు, బుద్ధిలో బృహస్పతి, పురాణోపాఖ్యాన నాటకాలలో నిష్ణాతుడు. ఛాందోగ్య సూత్రావలంబి, వాజపేయి, నందివర్మ వాల్మీకి వంటి కవిగా కీర్తింపబడినాడు. పరమేశ్వర, ఉత్తర కర్ణిక, త్రివిక్రమాది పండితులు ఇతని ఆస్థానంలో ఉండేవారు. చతుర్విధ కావ్యరచనా శోభితుడు తిరుమంగయాళ్వారనే వైష్ణవాచార్యుడు ఇతని సమకాలికుడు. ఈ భక్తుడు నాలాయిర ప్రబంధ రచయిత.

పల్లవుల కాలంలో వింధ్యకు దక్షిణంగా కన్యాకుమారి వరకు వైదిక ధర్మం వ్యాపించి యుండినది. జైన, బౌద్ధాలు క్షీణదశలో ఉండినవి. బౌద్ధన్యాయ శాస్త్ర ప్రవర్తకుడైన దిఙ్నాగాచార్యుడు కాంచీ నివాసి. రాజధాని కాంచిలో ఎన్నో శిల్ప మండితాలైన ఆలయాలు నిర్మింపబడినవి. మహేంద్ర వర్మ అనేక శివాలయాలను, మహేంద్ర వాడిలో విష్ణ్వాలయాన్ని నిర్మించినాడు. మూడవ నందివర్మ అశ్వమేధయాజి. కంచిలో వైకుంఠ పెరుమాళ్, ముక్తేశ్వరం, పరమేశ్వర విణ్ణగరేశ్వరాలయాలను, కూరమిలో కేశవ పెరుమాళ్ ఆలయాన్ని నిర్మించినాడు.

గ్రామ పరిపాలనకై గ్రామ సభలుండేవి. విద్యావంతులు, సత్ప్రవర్తన కలవారు, వేదశాస్త్ర కోవిదులు, ధర్మశాస్త్రవేత్తలు అందులో సభ్యులుగా ఉండి, గ్రామ సమస్యలను పరిష్కరించేవారు. శివస్కంధ వర్మ కాలంలో విదేశీ వ్యాపారం వృద్ధిలో ఉండినది. సింహళం, జావా, సుమాత్రాది ద్వీపాలతో వాణిజ్యం జరుగుతుండేది.

## బృహత్పలాయనులు

ఇక్ష్వాకుల తర్వాత ఆంధ్ర దేశంలోని కొన్ని ప్రాంతాలను పాలించినవారు బృహత్పలాయనులు. జయవర్మ మహారాజు వేయించిన కొదముది ప్రాకృత శాసనం బృహత్పలాయనుల చరిత్రకు ఆధారం. ఈ వంశీయులు బ్రాహ్మణులు. క్రీ.శ. 270 నుంచి 285 వరకు జయవర్మ మహారాజు పాలనా కాలం. ఇతని రాజధాని కోదూరు. ఇతని కాలంలో సింహళం, యవ, సుమాత్ర ద్వీపాలతో, బర్మా, చీనా, కంబోడియా, రోము మున్నగు దేశాలతో వ్యాపారం జరిగేది.

## శాలంకాయనులు

శాతవాహనుల తర్వాత ఆంధ్ర దేశాన్ని పాలించిన రాజ వంశాలలో శాలంకాయనుల వంశం ఎన్నదగింది. వీరు గోత్ర నామాన్ని వంశనామంగా ధరించినారు. శాలంకాయనుడు వేదర్షి, శాలంకాయనులు చిత్రరథ స్వామి పాదానుధ్యాతులు. విజయదేవ వర్మ

శాలంకాయన రాజ్య స్థాపకుడు. వేంగీ నగరం ఇతని రాజధాని. ఇక్ష్వాకులకు సామంతులుగా ఉండి, స్వతంత్రులై రాజ్యం స్థాపించుకున్నారు. ఇందు మొదటి రాజు విజయదేవ వర్మ (క్రీ.శ. 300-335). విజయస్కంధ వర్మ (క్రీ.శ.415-440) శాలంకాయనుల చివరి రాజు. విష్ణుకుండినుల చేత శాలంకాయన రాజ్యము అంతరించింది.

శాలంకాయన రాజొకడు బర్మాలోని ఐరావత నదీ తీర ప్రాంతాన్ని ఏలినట్టు, బర్మాలో బౌద్ధమతం వ్యాపించుటకు కారణభూతుడైనట్లు ఒక బౌద్ధ గ్రంథం వల్ల తెలుస్తున్నది. బౌద్ధ దార్శనికుడు దిఙ్నాగాచార్యుడు వేంగీ నగరంలో చాలాకాలమున్నట్లు చరిత్ర తెలుపుతున్నది.

## ఆనంద గోత్రికులు

ఆనంద గోత్రికుల మూల పురుషుడు కందర రాజు. స్వశక్తిచే రాజ్యము స్థాపించి, పల్లవులకు సామంతుడిగా ఆంధ్ర భూభాగాలు పాలించాడు. ఇతడు ధాన్యకటక యుద్ధంలో శత్రువులనోడించి కృష్ణవేణ్ణానాథుడని, త్రికూటపతియని పేరు పొందినాడు. ధాన్యకటక ప్రాంతంలో ఇతడు శాలంకాయన నందివర్మ నోడించాడు. ఈతని రాజ్యం త్రికూట పర్వతం నుంచి కృష్ణవరకు వ్యాపించి యుండినది. ఇతని పరిపాలన కాలం క్రీ.శ.290 నుంచి 325 వరకు. ఈ మహారాజు రాజధాని ధాన్యకటకం, తర్వాత తనపేర కందరపురం నిర్మించినాడని, చేజెర్ల శాసనం వల్ల ఇతడు మొదట బౌద్ధమతానుయాయి అని తెలుస్తున్నది. పల్లవ శివస్కంధ వర్మ ఇతనిని ఓడించి, సామంతునిగా చేసుకొని, ఇతడు బౌద్ధమును వదిలి, వైదిక ధర్మమునవలంబించునట్లు చేసినాడు. కందరపుర బౌద్ధస్తూపం శివాలయంగా మార్చబడింది. ఈ వంశీయులవి మూడు శాసనాలు లభిస్తున్నవి. ఈ వంశీయుడైన అత్తివర్మ (హస్తివర్మ), యమ, నియమవంతుడు, ఆపస్తంబ సూత్రుడు, ఋగ్యజుస్సామ వేదవిదుడు, కాశ్యప గోత్రుడు అయిన కోటిశర్మకు కృష్ణా దక్షిణతీరంలోని తాడికొన్డలో కొంత భూమిని, అంతుక్కుర గ్రామాన్ని దానం చేసి గోరంట్ల శాసనం వేయించినాడు. ఈ రాజు వైదిక మతోద్ధారకుడు, శైవుడు. పల్లవ, శాలంకాయన రాజులాక్రమించిన భూభాగాలను తిరిగి సాధించాడు. హిరణ్యగర్భ వ్రతాన్ని ఆచరించినాడు. ఇతని పాలనా కాలం క్రీ.శ.335-380. అత్తివర్మ తనయుడు దామోదర వర్మ విష్ణుకుండినులతో సంభవించిన యుద్ధంలో ఓటమి పాలైనాడు. ఇతని తర్వాత ఆనంద గోత్రికులు బలహీనులు అగుటతో విష్ణుకుండినులకు లొంగిపోయి వారికి సామంతులుగా ఉండుటకు అంగీకరించారు. ఆనంద గోత్రికుల కాలంలో తూర్పు సముద్రపు దీవులలో రోము, ఈజిప్టు మొదలైన దేశాలతో వ్యాపారం విరివిగా సాగింది. దుర్గిలోని ఓంకారేశ్వరం, చేజెర్లలోని కపోతేశ్వరాలయం విశిష్టమైన శిల్పసంపద కలవి.

### విష్ణుకుండిన వంశం

శాతవాహనుల తర్వాత ఆంధ్ర దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన రాజులు విష్ణుకుండినులు. మహోజ్జ్వల చరిత్ర, నయవినయ సంపద, ఆభిజాత్యం, సమ్యక్ ప్రజాపాలనాధికారం గల విష్ణుకుండిన రాజన్యుల చరిత్ర అసదృశమైంది. వీరు శాలంకాయనులు బలహీనులు కావడంతో కృష్ణకు ఉత్తర తటంలో గల అత్యధిక భాగాలను ఆక్రమించి రాజ్యాన్ని విస్తరించినారు. అపుడు దక్షిణాపథ పశ్చిమోత్తరాలలో విశాల సామ్రాజ్యాన్ని ఏర్పర్చుకొని చక్రవర్తులుగా కీర్తింపబడ్డారు. విష్ణుకుండిన రెండవ మాధవవర్మ, వాకాటక రెండవ పృథ్వీసేన చక్రవర్తి ఏకైక పుత్రిక వాకాటక మహాదేవిని వివాహమాడి విష్ణుకుండిన, వాకాటక రాజ్యాలను పాలించినాడు.

విష్ణుకుండినులు మొత్తం 12 మంది క్రీ.శ. 358 నుంచి 624 వరకు అంటే దాదాపు 266 సంవత్సరాలు ఆంధ్ర దేశాన్ని పాలించినారు. విష్ణుకుండిన మహా రాజేంద్రవర్మ ఈ వంశ స్థాపకుడు. ఇతడు ఇప్పటి నాగర్‌కర్నూలు జిల్లాలోని అమరావతి (అమ్రాబాద్)ని రాజధానిగా చేసుకొని, ఏలేశ్వర ప్రాంతాలలో అధికారాన్ని స్థిరమొనర్చుకొని క్రీ.శ.358 ప్రాంతంలో విష్ణుకుండిన రాజ్యం స్థాపించినాడు. ఇతని తనయుడు మొదటి మాధవవర్మ ఇంద్రపాల నగరం, కీసర, భువనగిరి వరకు తన రాజ్యాన్ని విస్తరించినాడు. మొదటి మాధవవర్మ తర్వాత అతని పుత్రుడు గోవిందవర్మ విష్ణుకుండిన రాజ్యపీఠాన్ని చేపట్టి ఇంద్రపాల నగరిని రాజధానిగా పాలించెను. ఇతడు గొప్ప విజేత. బౌద్ధమతానుయాయి. ఇతడనేక బౌద్ధ విహారాలను నిర్మించినాడు.

గోవిందవర్మ సకల శాస్త్రార్థ శ్రవణ పరిజ్ఞానా దిహ పరత్ర చానన్య చక్షుషుడు, మహాజ్ఞాని, పరమత సహనం కలవాడు. తండ్రి యనంతరం రెండవ మాధవవర్మ క్రీ.శ.435 లో రాజైనాడు. దక్షిణాపథాన్నే కాక, దక్షిణ భారతాన్ని కూడా జయించినాడు. విష్ణుకుండినులతో జరిగిన ఒక యుద్ధంలో వాకాటక పృథ్వీసేనుడు పరాజితుడై, సంధి చేసుకొని, తన కుమార్తె మహాదేవిని మాధవవర్మకిచ్చి వివాహం చేసినాడు. వాకాటకులు పరమ వైదికులైన బ్రాహ్మణులు. వీరి ప్రభావంతో మాధవవర్మ వైదిక ధర్మాన్ని అనుసరించి దిగ్విజయం చేసి ఏకాదశాశ్వమేధాలను, రాజసూయాన్ని, బహు సువర్ణ, పౌండరీక, వాజపేయాది క్రతు సహస్రాన్ని నిర్వహించినాడు.

రెండవ పృథ్వీసేనుని తర్వాత వాకాటక సామ్రాజ్యం విష్ణుకుండినుల రాజ్యంలో కలిసిపోయింది. ఇతని సామ్రాజ్యం 'ప్రాగ్దక్షిణ పరాంబుధి రేవాసరిత్సలిల వలయిత' మని,

శాసనాల వల్ల తెలుస్తున్నది. రెండవ మాధవవర్మ జ్యేష్ఠపుత్రుడు దేవవర్మ క్రీ.శ.470 లో సింహాసనాసీనుడైనాడు. ఇతడు గొప్ప విజేత.

దేవవర్మ అనంతరం అతని పుత్రుడు మూడవ మాధవవర్మ రాజ్యాధిపతి అయినాడు. ఇతని రాజధాని గుంటూరు జిల్లాలోని అమరావతి. ఇతనికి త్రికూట మలయాధిపతి అనే బిరుదున్నది. ఇతడు సుదీర్ఘకాలం పాలించుట వల్ల ఇతని పినతండ్రియైన విక్రమేంద్ర వర్మ, పితృవ్యుడైన ఇంద్రభట్టారక వర్మలు ఇతనిపై పగబూని, యుద్ధంలో విజయులైనారు.

రెండవ మాధవవర్మ, వాకాటక మహాదేవుల తనయుడు విక్రమేంద్ర వర్మ (క్రీ.శ.522 – 528). ఇతడు గొప్పయోధుడు. వేల్పూరు స్కంధావారమున నుండి పల్లవులను యుద్ధంలో ఎదుర్కొని విజయం సాధించినాడు. విక్రమేంద్ర వర్మ అనంతరం అతని తనయుడు ఇంద్రభట్టారక వర్మ (క్రీ.శ.528–556) రాజ్యమును చేపట్టాడు. ఇతడు అనేక యుద్ధాల్లో విజయం సాధించిన శూరుడు. ఈ రాజన్యుడు అగ్రహారాలను, గో, సువర్ణ, కన్యాదానాలను కావించినాడు. పెక్కు ఘటికా స్థానాలను స్థాపించినాడు. హైదరాబాదుకు దగ్గరలో గల కీసర వద్ద గల ఘటకేశ్వరం ఇంద్రభట్టారక వర్మ నెలకొల్పిన ఘటికాస్థానమే.

ఇంద్రభట్టారక వర్మ జ్యేష్ఠపుత్రుడు విక్రమేంద్ర భట్టారకవర్మ (క్రీ.శ.556) తండ్రి తర్వాత రాజ్యమునకు వచ్చినాడు. పల్లవ సింహవర్మ ఆంధ్రభూభాగాలపై ప్రచండ సైన్యంతో దండెత్తినాడు. విష్ణుకుండిన సామంతుడైన పృథ్వీమూల రాజు సహాయంతో విక్రమేంద్ర భట్టారకవర్మ ధైర్యంతో పోరాడి పల్లవులపై విజయం సాధించినాడు. రెండవ గోవిందవర్మ (క్రీ.శ.570–576) విక్రమేంద్ర భట్టారకవర్మ తనయుడు. ఇతడు దక్షిణాపథంలో ప్రతిభావంతుడైన రాజు. గోవిందవర్మ పుత్రుడు నాల్గవ మాధవ వర్మ (576–623). పరిపాలన దక్షుడు. ఇతడు ఏకాదశాశ్వమేధాలను, వేయి అగ్నిష్టోమాలను కావించినాడు. ఈ మహారాజుకు జనాశ్రయుడనే బిరుదున్నది. మాధవవర్మ న్యాయం చేకూర్చడంలో తన కుమారునికి సైతం మరణశిక్ష విధించుటకు  వెనుకాడనివాడు.

నాల్గవ మాధవవర్మ పుత్రుడు మంచన భట్టారకుడు తండ్రి తర్వాత క్రీ.శ.623లో రాజై, సామంత మాండలికులను సమీకరించుకొని పోరాటము సాగించినాడు. రాజధాని లేని రాజుగా సైన్యాన్ని కూర్చుకొని చాలాకాలం యుద్ధాల్లో నిమగ్నుడై తుదకు చాళుక్య జయసింహ వల్లభుని చేతిలో హతుడైనాడు.

జనాశ్రయుడనే బిరుదు గల నాల్గవ మాధవవర్మ జనాశ్రయ ఛందోవిచితి అనే ప్రామాణికమైన ఛందోగ్రంథము రాసినవాడు. ఇంద్రకీలాద్రిపై అక్కన్న మాదన్న గుహాలయము

లున్నవి. ఇవి త్రిమూర్తులకు అర్పింపబడినవి. భైరవకొండ యందుగల 8 గుహాలయాలు అద్భుతమైన శిల్ప సంపదతో ఒప్పి, విష్ణుకుండినుల శిల్పాభిరుచికి నిదర్శనంగా నిలిచియున్నవి.

## మాఠర వంశము

సముద్ర గుప్తుని దక్షిణ దండయాత్ర తర్వాత కళింగలో చిన్న చిన్న రాజ్యాలు తలెత్తినవి. మాఠర వంశీయులు పిష్టపురం రాజధానిగా కళింగ దేశాన్ని పాలించినారు. బృహత్పలాయన, శాలంకాయన, ఆనంద గోత్రికుల వలె వీరు కూడా గోత్ర నామాన్ని వంశ నామంగా గ్రహించిన విప్రులు. వీరు శక్తివర్మ మొదలుకొని విశాఖవర్మ వరకు క్రీ.శ.350 నుంచి క్రీ.శ.440 వరకు ఈ వంశీయులు పరిపాలన సాగించినారు. మాఠర వంశీయులవి తొమ్మిది శాసనాలు దొరుకుతున్నవి. ఇవి సంస్కృతంలో ఉన్నవి.

శక్తివర్మ 4 వ శతాబ్దిలో కళింగ దేశాధీశుడైనాడు. ఇతడు వాసిష్ఠీ పుత్రుడు. కళింగ విషయంలోని రాకలువ గ్రామాన్ని అగ్రహారంగా చేసి బ్రాహ్మణ కుమార శర్మకు దానం కావించినాడు. శక్తివర్మ తనయుడు అంతవర్మ క్రీ.శ.365 లో కళింగాధిపతి అయినాడు. ఇతడంత శక్తి సమన్వితుడు కాదు. పిష్టపురంపై దండయాత్రలకు వెరచి, ఇతడు రాజధానిని సింహపురానికి మార్చినాడు. ఈ మహారాజు తర్వాత అతని పుత్రుడు అనంతశక్తి వర్మ రాజ్యమునకు వచ్చినాడు. ఈ రాజు కాలంలో మాఠరులు దక్షిణ కళింగపై ఆధిపత్యము కోల్పోయినారు. వీరి రాజధాని సింహపురం (సింగాపురం) శ్రీకాకుళం, నరసన్న పేటల మధ్య ఉన్నది. అనంతశక్తివర్మ తర్వాత క్రీ.శ.394 లో అతని పుత్రుడు చండవర్మ రాజ్యాధిపతి అయినాడు. ఇతడు తిరిధాణ వాటిక గ్రామాన్ని పలువురు విప్రుల కొసగినాడు. అంతకు పూర్వం కళింగంలో ఉన్న 366 అగ్రహారాలకు ఈ తిరిధాణ గ్రామం చేర్చబడ్డది. ఉమా వర్మ తండ్రి తరువాత క్రీ.శ.400 లో కళింగ రాజ్య పీఠాన్ని అలంకరించినాడు. ఉమావర్మ అనంతరం అతని కుమారుడు విశాఖవర్మ రాజ్యానికి వచ్చినాడు. ఇతని పాలన కొద్ది కాలమే సాగింది. తర్వాత కళింగదేశం గాంగవంశ రాజుల స్వాధీనమైంది.

## పృథ్వీమూల వంశం

వేంగీ నగరము రాజధానిగా ప్రాగాంధ్ర దేశాన్ని పాలించిన శాలంకాయనుల సామంతులుగా, గుణపాశ పురము రాజధానిగా తీరాంధ్రాన్ని ఏలిన మూల రాజవంశజులు పరాక్రమవంతులు. శాలంకాయనులలో చివరివారు అసమర్థులై ఉన్నప్పుడు మూలరాజు వంశపు ప్రభాకర మహారాజు స్వతంత్రుడై తన పరిధిలోని రాజ్యాన్నే కాక, పరిసర సామంతుల నోడించి విశాల సామ్రాజ్యాన్ని నెలకొల్పి పాలించినాడు. ఇతని వంశీయులు బ్రాహ్మణులు,

వైదికమత నిరతులు, పరమ బ్రహ్మణ్యులు. ఈ వంశంలో మొదటివాడు ప్రభాకర మహారాజు. ఇతడు విష్ణుకుండినులతో వివాహ సంబంధం నెరపి తన సామంత రాజ్యాన్ని సుస్థిర పరుచు కున్నాడు. విష్ణుకుండిన మొదటి గోవిందవర్మకు తన మనుమరాలు, పృథ్వీమూలుని కుమార్తె అయిన పరమ మహాదేవిని ఇచ్చి వివాహము కావించి, రెండు వంశాలు అన్యోన్యంగా ఉ ండునట్లు చేసినాడు. ఇతని పాలనా కాలం క్రీ.శ.360-398.

పృథ్వీమూలరాజు ప్రభాకర మహారాజు తర్వాత రాజ్యాధికారం చేపట్టినాడు. ఇతడు వివేక వినయ విద్యాసంపన్నుడు. విష్ణుకుండినులకు సన్నిహితుడిగా ఉండి వారి రాజ్య విస్తృతికి తోడ్పడినాడు. ఇతని పాలనా కాలం 398-460. పృథ్వీమూలుని తర్వాత అతని పుత్రుడు హరివర్మ క్రీ.శ.460 లో సింహాసనమును అధిష్ఠించినాడు. ఈ వంశీయుల రాజధాని గుణపాశపురం నేటి తూర్పుగోదావరి జిల్లాలోని తాడూరు. హరివర్మ తనయుడు మూలరాజు. అతడు తన మేనత్త పేర నిర్మించిన మహాదేవి విహారానికి విక్రమేంద్ర భట్టారకునిచే ఇరుండేరో గ్రామాన్ని దానమిప్పించినాడు. మూలరాజు పరిపాలన కాలం క్రీ.శ.528 నుండి 560 వరకు. ఇతని తోడనే ఈ వంశం అంతరించి ఉంటుంది. ఈ రాజన్యులు ఎన్నో ధార్మిక కార్యాలు చేసి విద్వాంసులకు గ్రామ దానాదులు కావించినారు.

## గుప్త రాజవంశం

కుషాణ, శాతవాహన రాజవంశాలు పతనమైన తర్వాత భారతదేశంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిన వంశం గుప్తవంశం. వీరి పాలన క్రీ.శ. 275 నుంచి ప్రారంభమైంది. శకరాజులు, క్షహరాట వంశీయులు భారత భూమి పశ్చిమ భూభాగాల్లో, ఉత్తర ప్రాగ్భాగాల్లో చిన్న చిన్న రాజ్యాలు స్థాపించుకొని, ప్రబలశక్తి సమన్వితులై ఉన్న వేళ గుప్త సామ్రాజ్యం ఆవిర్భవించుటతో శక వంశీయుల ప్రాబల్యం క్షీణించింది. గుప్తవంశ రాజుల పాలన స్వర్ణయుగంగా పరిణమించింది. భారతీయ సంస్కృతి వికాసానికి వారు దోహదమొనర్చినారు. భారతజాతి ప్రపంచంలో ఉన్నత సంస్కారం గల జాతిగా గుప్తుల కాలంలో ప్రసిద్ధి గాంచింది. 13 మంది గుప్తరాజులు క్రీ.శ.275 నుంచి క్రీ.శ.600 వరకు భారతావనిని పరిపాలించినారు. వీరిలో ప్రథమ గణ్యుడు శ్రీగుప్తుడు.

గుప్త వంశానికి చెందిన రెండవ చంద్రగుప్త సార్వభౌముని పుత్రిక ప్రభావతీ గుప్త. ఈమె వాకాటక ప్రభువైన రెండవ రుద్రసేనుని వివాహమాడింది. వాకాటకులు బ్రాహ్మణులని, విష్ణువృద్ధ గోత్రజులని వారి శాసనాల వల్ల స్పష్టమవుతున్నది. ప్రభావతీ గుప్త వేయించిన పూనా తామ్ర శాసనాలలో ఆమె తాను ధారణస గోత్రంలో జన్మించినట్లు స్వయంగా

తెలిపింది. గుప్త, వాకాటక రాజవంశాలకు చెందిన విష్ణువృద్ధ గోత్రాలు రెండు బ్రాహ్మణులలో ప్రసిద్ధములైన అగస్త్య, భారద్వాజ గోత్రాంతర్గములైనవనుటలో ఎట్టి సందేహమూ లేదు. గుప్త శబ్దము ఇటు క్షత్రవాచకం కాని, వైశ్య వాచకం కాని కాదు. ఇది రక్షణార్థకమైన 'గుప' ధాతువు వలన ఉత్పన్నమైన శబ్దం. బ్రాహ్మణుడైన ఆర్య చాణక్యునకు విష్ణుగుప్తుడనే నామాంతరం ఉన్నది. విష్ణువుచే రక్షింపబడిన వాడని ఈ పేరుకు అర్థం. చంద్రగుప్త, మాతృగుప్త, ప్రభాకర గుప్తాది నామాలు ఆయా దేవతలచే రక్షింపబడిన వారనే అర్థంలో ప్రయుక్తమైనవి. గుప్త రాజన్యులు బ్రాహ్మణగోత్రాలు కలవారైనా, తమ పేర్ల చివర పితృవంశనామాలనే నిల్పుకొన్నారు.

శ్రీగుప్తుడు గుప్తవంశ స్థాపకుడు. ఇతని పూర్వీకులు శాతవాహన, కుషాణ నరేంద్రులకు విధేయ సామంతులుగా నుండి పాటలీపుత్ర నగరపు ఉత్తర పరిసర ప్రాంతాలను పాలించినారు. అదను చూసుకొని శ్రీగుప్తుడు పాటలీపుత్రాన్ని జయించి, దానిని రాజధానిగా చేసుకొని, వంగ మొదలైన ప్రాగ్భాగాలను జయించుటతో రాజ్యపు ఆర్థికస్థితి మెరుగైంది. శ్రీగుప్తుడు సమర్థంగా పరిపాలన కావించి, క్రీ.శ.300 లో దివంగతుడు కాగా, అతని తనయుడు ఘటోత్కచుడు మగధ సింహాసనాన్ని అధిష్ఠించినాడు. ఇతడు బలవంతులైన రాజ వంశీయులతో బాంధవ్యం నెరపి, శత్రువుల దండయాత్రల వల్ల భయం లేకుండా చేసి, రాజ్య విస్తరణ కావించినాడు. ఘటోత్కచుని మరణానంతరం అతని పుత్రుడు మొదటి చంద్రగుప్తుడు క్రీ.శ.320 లో మగధ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడు గొప్ప విజేతగా, అరివీర భయంకరుడుగా కీర్తింపబడ్డాడు. గంగా యమునా నదుల పరివాహ ప్రదేశాలు, దక్షిణ బీహార్, అయోధ్య, వాయవ్య రాష్ట్రాలు ఇతని వశమైనాయి. చంద్రగుప్తుని తర్వాత అతని పుత్రుడు సముద్ర గుప్తుడు క్రీ.శ. 326 మగధ సామ్రాజ్యాధిపతి అయినాడు. ఈ మహారాజు యుద్ధ విద్యా విశారదుడు. సంగీత, సాహిత్యాలలో ప్రవీణుడు. ప్రచండ సైన్యాన్ని సమకూర్చుకొని, ధర్మ సంస్థాపనార్థం దేశ సమగ్రతకై సముద్రగుప్తుడు క్రీ.శ. 337,338, 345 సంవత్సరాలలో దండయాత్రలు నిర్వహించి, ఉత్తరాపథంలో తొమ్మిదిమంది రాజులను, దక్షిణాపథంలోని 15 మంది ప్రభువులను జయించినాడు. ప్రాక్పశ్చిమ, ఈశాన్యాది రాజ్యాలన్నీ ఇతనికి పాదాక్రాంతమైనవి. ప్రయాగలో గల హరిసేనుడు రచించిన సంస్కృత శాసనం వల్ల ఇతని భరతవర్ష విజయ పరంపర విదితమవుతున్నది.

సముద్రగుప్తుని అనంతరం అతని జ్యేష్ఠపుత్రుడు రామగుప్తుడు క్రీ.శ.375 లో మగధ పీఠం ఎక్కినాడు. ఇతడు భీరువు, అసమర్థుడు. కొద్ది కాలమే పాలించినాడు. సముద్రగుప్తుని రెండవ కుమారుడు చంద్రగుప్తుడు రామగుప్తుని అనంతరం క్రీ.శ.375 లో మగధ సింహాసనం అధిష్ఠించినాడు. భారత వర్ష చరిత్రలో చంద్రగుప్తుని కాలం 'స్వర్ణయుగ'మని నిర్ణయింపబడింది.

సముద్ర గుప్తుని కన్నా చంద్రగుప్తుడు గొప్ప చక్రవర్తిగా కీర్తింపబడ్డాడు. ఇతడు విక్రమాదిత్య బిరుద విభూషితుడు. విద్యా వైదుష్యం కలవాడు, ధర్మ శాస్త్రజ్ఞుడు.

చంద్రగుప్త విక్రమాదిత్యుని సామ్రాజ్యం ప్రాక్పశ్చిమాలలో బ్రహ్మపుత్ర మొదలు సింధునది వరకు, ఉత్తర దక్షిణాలుగా హిమాలయం నుంచి వింధ్య, సాత్పురా పర్వతాల పర్యంతం వ్యాపించి యుండినది. శకరాజులను నిర్జించుట వల్ల శకారి విక్రమాదిత్యుడని ప్రసిద్ధుడైనాడు. చంద్రగుప్తుడు వైదిక మతానుయాయి. అయినా, వైష్ణవాన్ని ఆదరించినవాడు. జైనాచార్యులను, బౌద్ధ విద్వాంసులను సన్మానించినాడు.

చంద్రగుప్తుని తర్వాత అతని తనయుడు మొదటి కుమార గుప్తుడు క్రీ.శ.413 లో గుప్త సామ్రాజ్యాధినేత అయినాడు. తాత, తండ్రులు ఆర్జించిన మహా సామ్రాజ్యాన్ని కుమారగుప్తుడు అన్యాక్రాంతం కాకుండా జీవిత చరమ దశ వరకు పాలించినాడు. అశ్వమేధ యాగం చేసినాడు. ఇతని పాలన కాలం క్రీ.శ.413 నుంచి 455 వరకు.

మొదటి కుమారగుప్తుడి మరణానంతరం అతని పుత్రుడు స్కందగుప్తుడు సింహాసనాసీను డైనాడు. ఇతడు సమర వ్యూహ నిపుణుడు. హూణులు విజృంభించి, గుప్త సామ్రాజ్యంలో అలజడులను సృష్టించగా, వారిని ఓడించి, తరిమేసి స్కందగుప్తుడు సౌరాష్ట్ర ద్వీపకల్పాన్ని స్వాధీనం చేసుకున్నాడు. తుదకి హూణులతో జరిగిన యుద్ధంలో మరణించినాడు. ఇతని పాలన కాలం క్రీ.శ.455-473.

మొదటి కుమారగుప్తుని తనయుడైన పూరుగుప్తుడు స్కందగుప్తుని తర్వాత గుప్త సామ్రాజ్యాధినేత అయినాడు. ఇతడు మూడేండ్లు పాలించినాడు. స్కందగుప్తుని తర్వాత గుప్తరాజుల చరిత్ర సమగ్రంగా తెలియుట లేదు. బుధ గుప్తుడు, వైశ్య గుప్తుడు, భానుగుప్తుడు, నరసింహ గుప్తుడు, బాలాదిత్యుడు, మూడవ కుమార గుప్తుడు, మాతృగుప్తుడు, ప్రవరసేనుడు మొదలగు వారు గుప్త సామ్రాజ్యంలోని కొన్ని భాగాలను మాత్రం పాలించినారు.

మూడవ కుమార గుప్తుని తనయుడు దామోదరగుప్తుడు రాజ్యానికి వచ్చిన కొద్ది కాలానికే మౌఖరి ఈశానవర్మ సంతతి వారితో జరిగిన యుద్ధంలో మరణించినాడు. ఇంతటితో గుప్తవంశం సమూలంగా నిర్మూలింపబడింది. గుప్తుల కాలంలో షడ్దర్శనాలు వృద్ధి పొందినవి. బౌద్ధులు, జైనులు కూడా తమ దర్శన గ్రంథాలు సంతరించినారు. క్రీ.శ. 6వ శతాబ్ది పూర్వార్ధంలో కాశ్మీరాన్ని పాలిస్తూ పశ్చిమ భారతం వరకు రాజ్యాన్ని విస్తరించిన ప్రవరసేనుడు మహాకవిగా కీర్తిని ఆర్జించినాడు. ప్రాకృత భాషలో సేతుబంధ మహాకావ్యం రాసి, ప్రఖ్యాతుడైనాడు. వత్సభట్టు భట్టి కావ్యాన్ని, వామనుడు కావ్యాలంకార

సూత్రాన్ని, దండి మహాకవి దశకుమార చరితాన్ని, కావ్యాదర్శమనే అలంకార గ్రంథాన్ని ఈ కాలముననే రచించినారు. ఆర్యభటుడు, వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు మొదలగు వారు జ్యోతిశ్శాస్త్ర, ఖగోళ శాస్త్రాలలో గ్రంథాలు రాసి ప్రసిద్ధులైనారు.

## ఘూర్జర వంశము

గుప్త సామ్రాజ్య పతనానంతరం ఘూర్జరులు విజృంభించి రాజ్యస్థాపన కావించినారు. గుజరాతుకు ఘూర్జర దేశమని పేరు. మౌలికంగా వీరక్కడివారే. ఘూర్జర వంశ స్థాపకుడు హరిశ్చంద్రుడు. ఇతడు రాజపుత్ర స్థానమందలి జోధ్‌పూర్ రాజధానిగా ఘూర్జర రాజ్యం స్థాపించినాడు. హరిశ్చంద్రుడు బ్రాహ్మణుడు. వేదాధ్యయనం చేసినాడు. క్రీ.శ. 550 లో సైన్యాన్ని సమకూర్చుకొని జోధ్‌పూర్‌ను ఆక్రమించి, పరిసర భూభాగాలను జయించి పాలించినాడు. హరిశ్చంద్రునికి బ్రాహ్మణ స్త్రీల వల్ల కలిగిన పుత్రులు ప్రతీహార బ్రాహ్మణులనబడినారు. క్షత్రియ వనితకు జన్మించిన కుమారులు ప్రతీహార రాజవంశము వారైనారు. హరిశ్చంద్రునికి క్షత్రియ రాణి భద్రాదేవి వల్ల దద్ద, రజ్జిల, కక్క, భోగభటులను నలుగురు తనయులు కలిగినారు. భోగభట, కక్క అనువారి విషయం తెలియుట లేదు. కాని దద్ద, అతని సంతతి వారు నందపురి రాజ్యపాలకులైనారు. హరిశ్చంద్రుని మూడో కుమారుడు రజ్జిల మాండవ్య పుర పాలకుడు.

నరభట తర్వాత అతని పుత్రుడు నాగభట మాండవ్య పుర సింహాసనమును చేపట్టినాడు. ఇతని రాజధాని మేడంతకం. ఇతని తర్వాత ఇతని వంశంలో ఎనిమిది తరాలకు చెందిన పది మంది రాజులు సుమారు రెండువందల సంవత్సరాలు ఘూర్జర రాజ్యాన్ని ఏలినారు.

నందిపుర ఘూర్జర వంశీయులు కూడా హరిశ్చంద్రుని వంశీయులు. మొదటి దద్దరాజు భరుకచ్ఛము లేదా నందిపురం రాజధానిగా క్రీ.శ. 575 నుండి రాజ్యపాలన కావించినాడు. వీరు ప్రతీహారులుగా పరిగణింపబడ్డారు. దద్ద రాజు తర్వాత ఏడుగురు రాజులు నందిపుర పాలకులుగా ఉన్నారు.

## మౌఖరి వంశం

మహాభారతంలో మద్రదేశాధీశుడు అశ్వపతి వంశీయుడు. మౌఖరులు ఈ అశ్వపతి వంశానికి చెందినవారు. వీరు ఉత్తర భారతావని అంతా వ్యాపించినారు. క్రీ.శ. 6వ శతాబ్దిలో గయ ప్రాంత పాలకులుగా, గుప్త సామంతులుగా వ్యవహరించినారు. మౌఖరి వంశంలో ఆద్యుడు యజ్ఞవర్మ. ఇతని తర్వాత అనంతవర్మ, శార్దూలవర్మ దక్షిణ బీహార్, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాలను పాలించినారు. మౌఖరి రాజులలో నాల్గవ వాడైన ఈశానవర్మ

అపరిమిత సైనిక సంపద కలవాడు. ఇతడు కళింగలోని శూలికులను, వంగదేశ పాలకులైన గౌదులను జయించినాడు. ఈశాన వర్మ సమర్థుడే గాక, స్వతంత్ర రాజ్య స్థాపకుడు. క్రీ.శ. 554 నాటికి దక్షిణ అంగదేశం, ఉత్తర ప్రదేశం, దక్షిణాపథ సీమల వరకు ఉన్న ప్రాంతాలు ఈతని ఆధిపత్యంలోకి వచ్చినవి. ఈశానవర్మ భారతదేశ చరిత్రలో ప్రముఖస్థాన మాక్రమించి క్రీ.శ. 576 వరకు రాజ్యాన్ని పాలించినాడు. ఈశానవర్మ తనయుడు ఈశ్వరవర్మ రాజ్యం పశ్చిమంలో సట్లెజ్ నది వరకు, దక్షిణంలో మధ్యప్రదేశ్‌లోని అసీర్‌ఘర్ వరకు, తూర్పున కామరూపం వరకు, ఉత్తరంలో హిమాలయాల వరకు విస్తరించి యుండినది. ఇతని రాజధాని కనోజ్. ఈశ్వర వర్మ పాలన కాలం క్రీ.శ.576-580. తర్వాత అవంతివర్మ, గృహవర్మ క్రీ.శ.600 నుంచి 606 వరకు పాలించినాడు. క్రీ.శ.7వ శతాబ్ది ప్రథమపాదం వరకు మౌఖరి వంశీయులు గొప్ప రాజులుగా కీర్తి సంపాదించి వైభవోపేతంగా రాజ్యపాలన కావించినారు.

## వంగరాజ్యం

గుప్త సామ్రాజ్య పతనానంతరం వంగ దేశంలో ఒక స్వతంత్ర రాజ్యం స్థాపించబడినది. క్రీ.శ. 6వ శతాబ్దిలో దక్షిణ, పశ్చిమ, ప్రాగ్భాగాల్లో విస్తరించి యుండినది. గోప చంద్రుడు క్రీ.శ.507 నుంచి 525 వరకు స్వతంత్రుడుగా పాలించినాడు. గోపచంద్రుని తర్వాత ధర్మాదిత్యుడు, సమాచార దేవుడు క్రీ.శ.575 వరకు వంగరాజ్యము పాలించినవారు, వంగదేశ ప్రాచీన నామం సమత.

మహాసేన గుప్తుని చివరి రాజ్య సంవత్సరాలలో శశాంకుడు గౌడ దేశంలో పాలన బాధ్యతలు స్వీకరించి స్వతంత్ర రాజ్యం స్థాపించినాడు. ఇతడు దక్షిణ అంగ, కళింగ దేశాలను జయించి ప్రబల శక్తి సమన్వితుడిగా పేరు గాంచాడు.

## కదంబ వంశం

దక్షిణ భారతంలో ప్రసిద్ధి గాంచిన రాజవంశాల్లో కదంబ వంశమొకటి. ఈ వంశీయుల తొలినివాసం ఇప్పటి వనపర్తి జిల్లాలోని కందూరు. కందూరులో రామలింగేశ్వర ఆలయం వద్ద ఇప్పటికి కదంబ వృక్షాలున్నవి. కందూరులోని సాంగ వేదవిదులైన విప్రుల ఇంట్లో వికసించిన పుష్పభరితమైన కదంబ వృక్షముండుట వల్ల వీరికి కదంబులని పేరు వచ్చింది. తాళగుండు శాసనం వల్ల కదంబ వంశజుల సమాచారం కొంత తెలుస్తున్నది.

కదంబులు హారీతీ పుత్రులు, హూనవ్యస గోత్రులు, వేదవేదాంగేతిహాసాల ప్రవచన వాఙ్మయాన్ని సమగ్రంగా అధ్యయనం చేసినవారు. యజ్ఞావభృథ స్నానం చేత తడిసిన

శిఖలు గలవారు. ఈ వంశంలో శౌచం, పాండిత్యం, శ్రీమంతత్వం గల మయూరశర్మ జన్మించినాడు. ఉపనయన సంస్కారం అనంతరం ప్రవచనాన్ని సమగ్రంగా అధ్యయనం చేయుట కొరకు తన గురువు వీరవర్మతో కలిసి కాంచీనగరానికి చేరి, గొప్ప విద్యాసంస్థయైన ఘటికా స్థానంలో ప్రవేశించినాడు. అచట వేదవిద్య నభ్యసిస్తుండగా, ఒకనాడు కాంచీనగరంలో ఒక ఆశ్విక భటునితో పోరాడాల్సి వచ్చింది. ఆ కలహంలో రోషితుడైన మయూర శర్మ క్షత్రియుల కన్నా విప్రులెంత హీనులుగా నున్నారు. గురుకులంలో ప్రవేశించి స్వాధ్యాయం కావించే వానికి సైతం బ్రహ్మసిద్ధి కలుగుట నృపాధీనమై యున్నచో అంతకు మించిన దు:ఖం మరొకటి లేదని తలచి, రోషంతో ఖడ్గాన్ని వరనుండి పెరికి, పల్లవరాజు అంతపాలుని ఓడించి, కాంచీ నగరం వీడి శ్రీశైలారణ్యములకు చేరుకొన్నాడు. మయూర శర్మ బ్రాహ్మణుడు. పౌరుష ప్రతాపాలున్నవాడు. అతడు బ్రాహ్మణ్యమును వీడక క్షాత్రాన్ని అవలంబించి బ్రహ్మక్షత్ర తేజోభృతుడైనాడు. శ్రీశైలారణ్యంలో అచటి ఆటవికులకు, గ్రామీణులకు శిక్షణనిచ్చి, ప్రబల సైన్యంతో మొదట పల్లవ రాజుల సామంతులైన బృహద్బాణులను ఓడించినాడు. మయూర శర్మ దండయాత్రలను ఎదుర్కొనుటకై పల్లవులు గొప్ప సైన్యము పంపవలసి వచ్చింది. ఉత్సాహం, శౌర్యం, ఉట్టిపడునట్లు మయూర శర్మ పల్లవ సైన్యాన్ని అవలీలగా ఓడించినాడు. అనేక పర్యాయాలు జరిగిన యుద్ధాల్లో పల్లవ సైన్యం అపజయాన్ని చవిచూడటం వల్ల, పల్లవరాజులు మయూరశర్మ స్థాపించిన స్వతంత్ర కదంబ రాజ్యాన్ని గుర్తించినారు. తుంగభద్ర నుండి పశ్చిమ సముద్రం వరకు గల భూభాగానికి ప్రభువుగా అతనిని అంగీకరించి గౌరవించినారు.

మయూర శర్మ అష్టాదశ అశ్వమేధములు చేసి, బ్రాహ్మణులకు అగ్రహారము లొసంగి, తన మహదైశ్వర్యాన్ని దానమిచ్చినట్లుగా పరశురాముని వంటి పరాక్రమశాలిగా కీర్తింపబడినాడు. మయూరశర్మ క్రీ.శ. 345 నుంచి 360 వరకు పరిపాలన సాగించినాడు. ఈ రాజన్యుని రాజధాని అవంతిపురం. ఇది వనవాసి పట్టణంగా ఖ్యాతి గాంచింది.

మయూర శర్మ అనంతరం అతని పుత్రుడు కంగవర్మ (క్రీ.శ.360–385) పాలనా సౌలభ్యానికై పాలశిఖ (హాల్సీ) పట్టణాన్ని రాజధానిగా చేసుకొన్నాడు. కంగవర్మ తనయుడు భగీరథుడు 25 ఏండ్లు పాలించినాడు. తర్వాత అతని పెద్ద కొడుకు రఘువు ఏలిక అయినాడు.

ఈ వంశంలో ప్రసిద్ధి గాంచిన కకుత్థ్సవర్మ భగీరథుని రెండవ కుమారుడు. ఇతడు చుట్టుపక్కల రాజవంశాలతో బంధుత్వం నెరపినాడు. వాకాటక నరేంద్రసేనునికి తన కుమార్తె అజిత భట్టారికనిచ్చి వివాహం చేసినాడు. గుప్తవంశ రాజులతో వైవాహిక సంబంధం ఏర్పర్చుకున్నాడు. ఆనాడు వాకాటకులు, గుప్తరాజులు, విష్ణుకుండినులు, కదంబులు సన్నిహితులై ఉండిరి. కకుత్థ్స వర్మ కాలంలో పశ్చిమ తీర రేవు పట్టణాలు వృద్ధిపొందినవి.

కకుత్థ్స వర్మ అనంతరం శాంతివర్మ, కృష్ణవర్మ, విష్ణువర్మ, మృగేశ వర్మ, రవివర్మలు క్రీ.శ.430 నుంచి క్రీ.శ.538 వరకు పరిపాలన చేసినారు. హరివర్మ క్రీ.శ.538లో రాజైనాడు. ఇతడు చాళుక్యుల నెదిరించలేక రాజ్య భాగాలన్నింటినీ కోల్పోయినాడు. ఇతని పాలన క్రీ.శ.550 వరకు సాగింది. ఇతనితో కదంబ వంశ ప్రధానశాఖ అంతరించింది. అజవర్మ, భోగివర్మల కాలంలో చాళుక్య కీర్తివర్మ దండెత్తి కదంబ రాజ్యాన్ని కబళించినాడు. ఇంతటితో కదంబ రాజ వంశం అంతరించింది.

## మైత్రక వలభి వంశం

గుప్త రాజుల సేనానిగా ఉన్న భట్టారకుడు సౌరాష్ట్ర పాలకుడుగా నియమింపబడినాడు. ఇతని పాలన క్రీ.శ.5 వ శతాబ్ది ఉత్తరార్ధంలో సాగింది. ఇతని పుత్రుడు ధారసేనుడు మహారాజు బిరుదు గలవాడు. ద్రోణసింహుడు, ధ్రువసేనుడు, ధారపట్ట, రెండవ ధారసేనుడు, మొదటి శిలాదిత్యుడు మొదలగు వారు వలభి నగరాన్ని రాజధానిగా చేసుకొని పాలించినారు.

రెండవ ధారసేనుని రెండవ కుమారుడు మొదటి శిలాదిత్యుడు వలభి పాలకులలో ప్రముఖుడు. బౌద్ధ మతానుయాయి. ఇతని తండ్రి ద్వారకా నగరాన్ని జయించి, రేవు పట్టణంగా అభివృద్ధి చేసినాడు. మూడవ శిలాదిత్యునితో మైత్రక రాజవంశం అంతరించింది. వీరి పాలన క్రీ.శ.465 నుంచి క్రీ.శ.640 వరకు సాగింది.

## వాకాటక వంశం

శాతవాహనుల తర్వాత చనకాను, వత్సగుల్మాన్ని రాజధానులుగా చేసుకొని మధ్య భారతాన్ని పాలించినవారు వాకాటక ప్రభువులు - అజంతా 16 గుహలలో గల 25 వ శాసనంలో వింధ్యశక్తి వాకాటక వంశమున పతాకమని, ద్విజుడని వర్ణింపబడింది. వీరిది విష్ణువృద్ధ గోత్రం. ఇతడు క్రీ.శ.250 నుంచి 270 వరకు పాలించినాడు. వింధ్యశక్తి అనంతరం అతని పుత్రుడు ప్రవరసేనుడు రాజ్యానికి వచ్చినాడు. ఉత్తరంలో నర్మదా నది వరకు రాజ్యాన్ని విస్తృతపరిచినాడు. పశ్చిమ క్షత్రపులపై విజయం సాధించినాడు. ప్రవరసేనుడు వేదవిదుడై నాలుగు అశ్వమేధాలను, అగ్నిష్టోమ, వాజపేయాది సప్తసోమ సంస్థలను అనుష్ఠించినాడు. ఈ మహారాజుకు ధర్మమహారాజని బిరుదమున్నది. ఇతడు దక్కనుపై కూడా ఆధిపత్యాన్ని నిలుపుకున్నాడు. ఇతని పాలన కాలము క్రీ.శ.270 నుంచి 330 వరకు.

క్రీ.శ.350 లో మొదటి రుద్రసేనుని పుత్రుడు మొదటి పృథ్వీసేనుడు రాజ్యపాలన చేపట్టినాడు. అపుడు రెండవ చంద్రగుప్తుడు క్షత్రపులను ఓడించి, మాళవ దేశాన్ని స్వాధీనం చేసుకొని ఉజ్జయినిని రెండవ రాజధానిగా చేసుకున్నాడు. ఈ రాజన్యుడు వాకాటకులతో

తన మైత్రిని పటిష్టం చేసుకునేందుకు తన కుమార్తె ప్రభావతీ గుప్తను మొదటి పృథ్వీసేనుని కుమారుడైన రుద్రసేనునికిచ్చి వివాహం చేసినాడు. పృథ్వీసేనుడు తన రాజధానిని నాగపూర్ సమీపంలోని నందివర్ధనానికి మార్చినాడు. పృథ్వీసేనుని తర్వాత అతని పుత్రుడు రుద్రసేనుడు రాజ్యాభిషిక్తుడైనాడు. ఇతడు క్రీ.శ.405లో మరణించినాడు. దీనితో అతని పుత్రులు దివాకర సేనుడు, దామోదర సేనుడు ఒకరి తర్వాత ఒకరు రాజ్యం చేసినారు. తండ్రి అకాలమరణంతో బాలుడైన దివాకర సేనుడు రాజ్యానికి వచ్చినాడు. అందువల్ల అతని వైపునుంచి తల్లి ప్రభావతీ గుప్త రాజ్యపాలన సాగించింది.

రెండవ ప్రవరసేనుని తర్వాత అతని కుమారుడు నరేంద్రసేనుడు క్రీ.శ.450 లో సింహాసన మధిష్ఠించినాడు. ఈ సమయంలో కోసల రాజగు భవదత్త వర్మ వాకాటక సామ్రాజ్యంలోని చాలా ప్రాంతాలను స్వాధీనం చేసుకొన్నాడు. నరేంద్ర సేనుని పుత్రుడు రెండవ పృథ్వీసేనుడు తన విశాల రాజ్యాన్ని సాధించుటయే గాక, తండ్రి కంటే ఎక్కువగా ముందుకు చొచ్చుకొని పోయినాడు. ఇతని ఏకైక పుత్రిక మహాదేవి విష్ణుకుండిన రెండవ మాధవ వర్మను వివాహమాడుట వల్ల వాకాటక రాజ్యం విష్ణుకుండినుల రాజ్యంలో విలీనమైంది. వాకాటక రాజవంశంలోని ప్రధానశాఖకు చెందిన చివరి రాజు రెండవ పృథ్వీసేనుడు.

వత్సగుల్మ శాఖను నెలకొల్పినవాడు ప్రవరసేనుని కుమారుడు సర్వసేనుడు. వింధ్యాద్రి నుంచి గోదావరి గట్టు వరకు ఇతని రాజ్యం వ్యాపించి యుండినది. ఇతడు విదర్భలోని అకోలా జిల్లాలో గల వత్సగుల్మను రాజధానిగా చేసుకొన్నాడు. వింధ్యసేనుడు, రెండవ ప్రవరసేనుడు, దేవసేనుడు, హరిసేనుడు ఈ వంశంలో పాలకులు. ఈ శాఖకు చెందినవారిలో హరిసేనుడే చివరి రాజు. ఇతడు క్రీ.శ.475 నుంచి 500 వరకు రాజ్యం ఏలియుంటాడు. 300 ల సంవత్సరాల తర్వాత వాకాటక ఆధిపత్యం సమాప్తమైంది.

## భారత – వలస రాజ్యాలు

ఆగ్నేయ ఏషియాలో జావా, సుమాత్రా, చంపక, కంబుజ మొదలైన ద్వీపాలు భారతీయుల వలస రాజ్యాలుగా పేరు గాంచివని. భృగు వంశీయ, అగస్త్య గోత్రికులైన బ్రాహ్మణులు అచట రాజ్యాలు స్థాపించినారు. చంపా రాజ్యంలో 30, కంబోజ రాజ్యంలో 70 సంస్కృత శాసనాలు వేయించబడినవి. ఈ శాసనాల వల్ల ఆ దేశాల్లో సంస్కృత భాషకు గల ప్రాచుర్యం వ్యక్తమవుతున్నది.

అగస్త్య గోత్రజుడైన బ్రాహ్మణుడు స్థాపించిన రాజ్యమును ఇంద్రవర్మాదులు పాలించినారు. ఇంద్రవర్మ పుత్రుడు యశోవర్మ క్రీ.శ.889లో కంబుజ రాజ్యాధిపత్యము

వహించాడు. ఈ మహారాజు తన పేర కంబుజ దేశంలో యశోధర పురం నిర్మించినాడు. మహాద్భుత శిల్ప సంపదతో ఒప్పారి విశ్వవిఖ్యాతి గాంచిన అంగ్‌కోర్‌ధామ్ ఈ నగరాంతర్గతమైనది. చంపా, జావా మొదలైన ద్వీపాలలో భారత సంతతి రాజన్యులు నిర్మించిన శిల్పమండితమైన దేవాలయాలు అసంఖ్యాకంగా ఉన్నవి.

## ప్రతీహార వంశం

రాజపుత్ర స్థానాన్ని పాలించిన రాజవంశీయులలో ప్రతీహార వంశం ప్రముఖమైంది. హరిశ్చంద్రుడనే బ్రాహ్మడు ఈ వంశ స్థాపకుడు. ప్రతీహార వంశం క్రీ.శ.8వ శతాబ్ది ప్రథమార్థంలో ప్రాముఖ్యంలోకి వచ్చింది. ప్రతీహార ప్రభువు నాగభట్టు మ్లేచ్ఛ రాజును ఓడించాడు. ఇతడు పశ్చిమ భారతంలో అనేక రాజ్యాలను, సంస్థానాలను జయించి, ఆక్రమించుకొని పాలించిన అరబ్బులను ఓడించి, ఆయా రాజ్యాలను స్వాధీనం చేసుకొని పాలించినాడు. జోథ్‌పూర్, నందిపురం ఈ మొదటి నాగభట్టు స్వాధీనంలో ఉండినవి. ఈ రాజన్యుడు సైన్యం సమీకరించి, మాళవం, రాజపుత్ర స్థానం, కొన్ని ఘూర్జర ప్రాంతాలను జయించి ప్రతీహార రాజ్యాన్ని స్థిరపరచినాడు. వత్సరాజు, రెండవ నాగభట్టు రాజ్యాన్ని పాలించినారు. రాష్ట్రకూట గోవింద రాజన్యుని చేతిలో ఓడిపోయిన నాగభట్టు, కొంతకాలం అజ్ఞాతవాసియై, తిరిగివచ్చి కఠియవాడ్, కనోజ్ కాలంజరులను పాలించినట్లు తెలుస్తున్నది. క్రీ.శ.883 లో మరణించగా, అతని పుత్రుడు రామభద్రుడు రాజయినాడు. ఇతడు బలహీనుడు. ఇతని తనయుడు భోజుడు ఈ వంశంలో ప్రసిద్ధుడు. ఇతడు మొదట అనేక విజయాలు సాధించినా, తుదకు రాష్ట్రకూటుల చేతిలో ఓడవలసి వచ్చింది.

భోజుని పుత్రుడు మహేంద్రపాలుడు తండ్రి అనంతరం క్రీ.శ.885 ప్రతీహార రాజ్యానికి అధిపతియైనాడు. ఇతడు మగధ రాజ్యాన్ని, ఉత్తర వంగదేశాన్ని తమకు శత్రువులైన పాల రాజన్యుల నుంచి స్వాధీనం చేసుకున్నాడు. రాజశేఖర కవి, ఆలంకారికుడే గాక, భారతీయ సాహిత్య కోవిదులలో సమున్నత స్థానం ఉన్నవాడు. ఇతడు మహేంద్రపాలుని ఆస్థాన విద్వాంసుడు.

మహీపాలుని తుది దశలో రాష్ట్రకూట 3వ కృష్ణుడు దక్షిణ ప్రాంత దుర్గాలను వశపరుచుకొనుటలో క్రీ.శ.940 నాటికి ప్రతీహార రాజ్యవైభవం క్షీణించింది. క్రీ.శ.1019 నాటికి ప్రతీహార రాజ్యం అంతరించింది.

## పాల వంశం

శశాంకుని మరణానంతరం వంగదేశం ఒక శతాబ్ది కాలం అరాజక స్థితికి లోనైంది. ప్రజల ఆర్థిక స్థితి అస్తవ్యస్తమైంది. చిన్న చిన్న రాజ్యాధిపతులు దండయాత్రలకు విసుగెత్తినారు. వారు వంగ దేశంలో ఒక శక్తిమంతమైన రాజ్య స్థాపనకు అనుకూలత వ్యక్తపరిచారు. ప్రజలు ప్రజ్ఞా సంపన్నుడు, యుద్ధవీరుడు, ధైర్యవంతుడు అయిన గోపాలుని తమ ప్రభువుగా ఎన్నుకొన్నారు. గోపాలుని తర్వాత రాజ్యానికి వచ్చినవారు 'పాల' నామం, తమపేరు అంతంలో గల వారు. గోపాలుని పేర పాలవంశం ఏర్పడింది.

దైత విష్ణువు గోపాలుని తాత. ఇతడు గొప్ప విద్వాంసుడు. ఇతని తనయుడు వత్సత, విద్యావంతుడు. బ్రహ్మతేజ సంపన్నుడు. సకల శాస్త్రాలను అభ్యసించినవాడు. యుద్ధ విద్యలందు నేర్పరి. ఇతని పుత్రుడే రాజ్య స్థాపకుడు గోపాలుడు. పాల వంశీయుల జన్మస్థలం ఉత్తర వంగదేశం. ఈ రాజన్యుడు క్రీ.శ.750 నుంచి 770 వరకు పాలించినాడు. ఇతని పుత్రుడు ధర్మపాలుడు రాజ్యానికి వచ్చి సుమారు 40 ఏండ్లు పాలించినాడు. ధర్మపాలుడు యువకులను చేర్చుకొని గొప్ప సైన్యాన్ని సిద్ధపరచి, పశ్చిమంలోని చిన్న రాజ్యాలను జయించినాడు. అప్పుడు ప్రతీహారులు, రాష్ట్రకూటులు తమ రాజ్యాలను విస్తరించే యత్నాల్లో ధర్మపాలునితో యుద్ధాలు చేయ వలసి వచ్చింది. ప్రతీహార వత్సరాజుకు, ధర్మపాలునికి గంగా తీరంలో యుద్ధం జరిగి, వేల సంఖ్యలో సైనికులు హతులైనారు. వత్సరాజు చేతిలో ధర్మపాలుడు ఓడినాడు. వత్సరాజును రాష్ట్రకూట ధ్రువరాజు ఓడించి మాన్యఖేటం చేరినాడు. ధ్రువరాజు ఆక్రమించిన పాలరాజు భూభాగాలను ధర్మపాలుడు మరల స్వాధీనపరుచుకున్నాడు. అతడు అపార సైన్యాన్ని సమకూర్చుకొని ఉత్తరాపథాన్ని జయించిన తర్వాత తన సార్వభౌమత్వాన్ని ప్రకటించుకొని, కన్యాకుబ్జంలో ఒక మహాసభను ఏర్పాటు చేసినాడు. ఆ సభకు మత్స్య, మద్ర, కురు, యదు, యవన, అవంతి, గాంధారాది సామంతులు వచ్చి ఆ రాజన్యుని ఆధిపత్యాన్ని స్వీకరించినారు. ఈ విషయం శాసనాల్లో వర్ణింపబడింది. ధర్మపాలుడు శతాధిక యుద్ధములొనర్చి, పాల రాజ్యాన్ని మహా సామ్రాజ్యంగా మార్చి వంగదేశ గౌరవం నిలిపినాడు. మహారాజు శాసనాల్లో పరమేశ్వర, పరమభట్టారక, మహారాజాధిరాజ అని ప్రశంసింపబడ్డాడు.

ధర్మపాలుడు బౌద్ధమత పోషకుడు. విక్రమ శిల విశ్వవిద్యాలయం నెలకొల్పి, ఖండాంతరాలలో భారతీయ సంస్కృతిని విస్తరింపజేసినాడు. క్రీ.శ.810 లో ఇతడు దివంగతుడైనాడు. ఇతని తనయుడు దేవపాలుడు క్రీ.శ.810 లో రాజ్యాధిపతియైనాడు. ఇతడు రాజ్య విస్తృతి కావించినవాడు. ఈ మహారాజు రాజ్యానికి ప్రాక్పశ్చిమ సముద్రాలు,

వింధ్య సీమలు హద్దులుగా ఉండినవి. క్రీ.శ.851 లో భారతావనికి వచ్చిన అరబ్ వర్తకుడు సులేమాన్ ఇతని సామ్రాజ్యాన్ని ఇట్లు ప్రశంసించినాడు: ఈ రాజు సైన్యంలో 50 వేల గజములు ఉండినవి. సైనికుల బట్టలు ఉతుకుటకు 15 వేలమంది రజకులు నియమింప బడినారు. పాలరాజు సైన్యం శత్రు సైన్యాల కన్నా మిన్నగా ఉండెను. దేవపాలుని పాలన కాలం క్రీ.శ.810-850.

దేవపాలుని తర్వాత అతని పుత్రుడు విగ్రహపాలుడు క్రీ.శ.850 లో రాజై, 854 వరకే పాలించాడు.నాలుగేండ్లు పాలించి, విరాగియై సన్న్యాసాశ్రమం స్వీకరించినాడు. ఇతని తనయుడు నారాయణపాలుని అసమర్థ పాలనలో ప్రతీహారులు విజృంభించి పాల సామ్రాజ్యంలోని అధిక భాగం ఆక్రమించినారు. క్రీ.శ.908 నాటికే సైన్యం సమీకరించుకొని ఉత్తర వంగదేశాన్ని అంగ రాజ్యాదులను జయించినాడు. రాష్ట్రకూట కృష్ణ ప్రభువు పాల రాజ్యాన్ని జయించినట్లు శాసనం ద్వారా ప్రకటించుకున్నాడు. విజయ యాత్రలో రాష్ట్రకూటులకు పాల వంశీయులతో సంధి జరిగి, రాష్ట్రకూట తుంగుని తనయను నారాయణ పాలుని కుమారుడు రాజ్యపాలుడు పెండ్లాడినాడు. తర్వాత మహీపాలుడు రాజ్యానికి వచ్చి పతనావస్థలో ఉన్న పాల సామ్రాజ్యాన్ని సముద్ధరించి పూర్వ వైభవాన్ని కాపాడినాడు.అగ్ని ప్రమాదంలో నలందలో నశించిన ప్రాచీన భవనాలను ఇతడు పునరుద్ధరించినాడు. వంగ ప్రజలు ఇప్పటికి కూడా మహీపాలున్ని కీర్తిస్తున్నారు.

క్రీ.శ.1038 లో మహీపాలుడు దివంగతుడు కాగా, నయపాలుడు రాజ్యాధిపతి అయినాడు. తర్వాత క్రమంగా మూడవ విగ్రహపాలుడు, రెండవ మహీపాలుడు, రామపాలుడు, రాజ్యపాలుడు, కుమారపాలుడు, మూడవ గోపాలుడు రాజ్యానికి వచ్చినారు. తర్వాత రామపాలుని చిన్న కుమారుడు క్రీ.శ.1144 లో రాజై క్షీణదశలో ఉన్న పాల సామ్రాజ్యాన్ని ఉద్ధరించే ప్రయత్నం చేసినాడు. పాలవంశానికి చెందిన రాజులలో మదనపాలుడు చివరివాడు. (క్రీ.శ. 1161) భారతదేశంలో చక్రవర్తులుగా కీర్తింపబడిన పాలవంశీయులు నాలుగువందల సంవత్సరాల దీర్ఘకాలం పాలన సాగించినారు.

## మహావీరుడు హేమచంద్రుడు

మహ్మద్ ఆదిల్షా చున్నార్ రాజధానిగా పరిపాలిస్తూ మొగలుల ఆధిపత్యాన్ని అరికట్టే ప్రయత్నంలో నిమగ్నుడై, తన ప్రధాన మంత్రి, సర్వ సమర్థుడు, సైన్యాధ్యక్షుడు అయిన హేమ చంద్రున్ని (హేమును) మొగలులను హిందూదేశం నుండి తరిమికొట్టే కొరకు నియమిస్తాడు.

విప్ర కుటుంబంలో జన్మించి, పౌరోహిత్యం చేపట్టి, ఆ వృత్తి వల్ల ఆదాయం లేక పేదవాడై, ఉప్పు వ్యాపారం చేపట్టి, ధైర్య సాహసాల కలిమితో కొంత ధనమార్జించి, ఓర్పు, నేర్పును ప్రదర్శించి క్రమంగా ఉన్నత పదవులను అధిష్ఠించి, తుదకు హిందూదేశ చక్రవర్తికి సైన్యాధిపతిగా నియుక్తుడైనాడు. తన శక్తి యుక్తులతో, వినయ విధేయలతో హేము మహమ్మద్ ఆదిల్షా కాలంలో ప్రధానమంత్రి పదవిని అలంకరించినాడు. మహమ్మదీయ చక్రవర్తుల పాలనలో ప్రధానమంత్రి పదవిని చేపట్టిన వారిలో హేమచంద్రుడు ప్రథమ గణ్యుడు. మహమ్మద్ ఆదిల్షా శత్రువు ఇబ్రహీంషాను యుద్ధము లందు ఓడించినాడు. హుమాయూన్ చక్రవర్తి దివంగతుడైన సమయంలో హేము ఆగ్రా పైకి దండెత్తినాడనే వార్త విని, దాని పాలకుడు ఇస్కిందర్‌ఖాన్ ఉజ్బేగ్ భీతుడై నగరాన్ని వదిలి పారిపోవలసి వచ్చింది. ఆ సమయంలో ఉజ్బేగ్ సైనికులు 3000 మంది మరణిస్తారు. హేము ఆగ్రా నగరాన్ని ఆక్రమించిన తరువాత అచ్చటి సంపద, ఆయుధాలు హేము వశమైనవి. హేమ చంద్రుడు అపార సైన్యంతో ఢిల్లీ చేరుకుని, ఢిల్లీ పాలకుడైన దర్జీబేగ్‌ఖానును యుద్ధరంగంలో పరాజితుని కావించాడు.

గ్వాలియర్ నుండి సట్లెజ్ నదీ పర్యంతం వ్యాప్తమైన భూభాగం హేము వశమైంది. అతడు రాజా విక్రమాదిత్య బిరుదు పొంది, స్వతంత్ర చక్రవర్తిగా ఢిల్లీ సింహాసనము అధిష్ఠించినాడు. దాదాపు 300 ఏండ్ల విదేశీయ పరిపాలనాంతరం హిందూ దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించిన హేము మన దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహా మనీషి.

ఢిల్లీ, ఆగ్రా నగరాలను హేము ఆక్రమించినాడన్న వార్తను మొగలులు తెలుసుకున్నా సైనికులు మాత్రం యుద్ధ విముఖులై ఉంటారు. లక్షకు పైగా సైన్యం గల హేము సంగతిని గూఢచారులు అక్బరుకు సమాచారమందిస్తారు. జలంధర్‌లో విడిదియున్న అక్బరు 20 వేల సైన్యము మాత్రమే కలిగి యున్నాడు. శక్తి యుక్తులు, సాహసం గల బైరంఖాన్, అక్బరు – ఇరువురు ధైర్యంతో హేమును ఎదుర్కొనుటకు పూనుకున్నారు. ఆగ్రా, ఢిల్లీ నగరాల్లో లభించిన అపార సంపదను హేము తన సైనికులకు, అధికారులకు పంచిపెట్టి వారిలో ఉత్సాహాన్ని కలుగ జేస్తాడు. సర్దార్ అలీ ఖురీఖాన్ మొగల్ ఫిరంగి దళానికి ఆధిపత్యం వహించి, హేము ఫిరంగిదళాన్ని ఓడించి దాన్ని స్వాధీనం చేసుకుంటాడు. ఉభయ సైన్యాలు పానిపట్టు యద్ధ క్షేత్రంలో తలపడ్డవి. హేము సైన్యంలో 30వేల అశ్విక సైన్యముండినది కాని తుపాకి దళం లేకుండినది. మొగలు సైనికులు, ధనుష్కులు బాణము సంధించి హేము సైన్యంపై వదులుతుండగా దురదృష్టవశాత్తు ఒక బాణం వచ్చి హేము కంటికి కుచ్చుకున్నది. అతడు బాణాఘాతంచే వివశుడై, బాధ భరించలేక స్పృహ కోల్పోతాడు. హేము క్రింద పడిపోయిన దృశ్యం చూచి, అతడు మరణించినాడని భావించి, నంశ్రీతీ

సైనికులు దిక్కు తోచక పారిపోయినారు. హేము ఎక్కిన గజపు మావటీడు అతనిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తుండగా, మొగలు సైనికాధికారి అడ్డగించి, హేమును అక్బరు వద్దకు తీసుకుని పోతాడు. ఇస్లాం మతానికి బద్ధవిరోధియైన హేమును ఖడ్గంతో వధించమని కోరగా, తన రక్షకుడైన బైరాంఖాన్ మాట మన్నించి, శిర:ఖండన కావిస్తాడు. హేము భార్య తన వెంట అపార ధనరాశుల్ని కొనిపోగా, మొగలు సైన్యం ఆమెను బంధించే ప్రయత్నం సఫలం కాలేదు. హేము తండ్రి వయోవృద్ధుడై మొగలుల చేత చిక్కగా, బైరాంఖాన్ అతనిని ఇస్లాం మతం స్వీకరించమని నిర్బంధిస్తాడు. హేము తండ్రి దానికి అంగీకరించక పోవడంతో మొగలు సైనికులు అతన్ని వధిస్తారు. హేమ చంద్రుని యుద్ధ వ్యూహ రచనా శక్తి, యుద్ధ తంత్రం, 22 యుద్ధాల్లో అతడు విజయం సాధించుటకు తోడ్పడినవి. భారత మాతృ దాస్య శృంఖలాలను తెంచిన మహాత్మునిగా హేమును భావించవచ్చు.

## కొలను ఇందులూరి వంశం

కొలను విషయాన్ని సుమారు మూడు శతాబ్దుల కాలం కొలను మాండలికులు లేక నరోధ రాజ వంశీయులు నరసీ పురాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలన సాగించినారు. ఈ వంశంలో 10 మంది రాజులు గొప్ప శక్తి సంపన్నులై అనేక యుద్ధాల్లో శత్రు సంహారం కావించి, కీర్తి గాంచినారు. వివిధ కాలాల్లో వీరు వేంగీ చాళుక్య, చాళుక్య చోళ, కళ్యాణీ చాళుక్య, కాకతీయ రాజ వంశీయులకు సామంతులుగా నుండి తమ రాష్ట్రాన్ని స్వతంత్రం గానే పాలించినారు.

కాకతి గణపతి దేవుడు కొలను మండలాన్ని స్వాధీనం చేసుకుని, ఆ వంశంలోని రెండవ శాఖ వారిని చేరదీసి వారికి కొలను రాజ్య పాలన అప్పగిస్తాడు. బాలాదిత్యుడు ఈ వంశానికి మూల పురుషుడు. క్రీ.శ. 900-945 వరకు ఇతడు రాజ్య పాలన కావించినాడు. నృప కాముడు, గండ నారాయణ, కొలను భీముడు, రాజేంద్ర చోళుడు, కాటమ నాయకుడు (క్రీ.శ. 1135), కేశవ దేవుడు, మంగయ దేవరాజు (క్రీ.శ. 1243 నుండి 1260 వరకు) తరువాత పాలన కావించినారు. కొలను రాజ్యం కాకతి గణపతి దేవుడు, రుద్రమదేవి పాలన కాలంలో పతనమైంది.

## ఇందులూరి వంశం

కాకతి రెండవ ప్రోలరాజు కాలం నుండి ప్రతాప రుద్రుని వరకు ఇందులూరు వంశీయులు వారి ఆమాత్యులుగా, సామంతులుగా వ్యవహరించినారు. కాకతి రుద్రుని కొలువులో నన్నె గౌరయ, అతని పుత్రులు పెద మల్లయ, పిన మల్లయ ఉన్నత పదవులలో

ఉండేవారు. పెద మల్లయ తనయుడు సోమయ కాకతీయ సేనలకు నాయకత్వం వహించి, అనేక విజయాలను సాధించినాడు. ఇతని కొడుకు మనుమ గన్నయ కాకతి రుద్ర దేవుని కాలంలో సేనానిగా ఉన్నవాడు. కొలను సోమయ సోదరుడైన పెద్ద గన్నయకు రుద్ర దేవుడు, అన్నయ అనువారు కుమారులు. అన్నయ, రుద్ర దేవుడు, కాకతి రుద్రమ, ప్రతాప రుద్రులకు మంత్రులు. అలావుద్దీన్ ఖిల్జీ పనుపున తెలుగు దేశంపై తొలిసారిగా దండెత్తి వచ్చిన మాలిక్ కాఫూర్‌ను అన్నయ మంత్రి తన సైనిక వ్యూహ రచనా నైపుణ్యంతో ఓడించి పారద్రోలినాడు. ఇతడు ఓరుగల్లు ప్రాగ్ద్వారం నుండి సింహాచల పర్యంత భూభాగాన్ని పాలించినాడు.

అన్నయ మంత్రి కాకతి రుద్రమ తనయ రుయ్యమను వివాహమాడినాడు. రుయ్యమ అసాధారణ ప్రజ్ఞావంతురాలై రుద్రమ దేవికి పాలనా వ్యవహారాల్లో సహకరించేది. కొలని రుద్రుడు అన్నయ సోదరుడు. ఇతను ఓరుగల్లు నుండి సింహాచలం వరకు కొలనువీడు రాజధానిగా పాలించినాడు. కొలను వంశీయులు రాజ మహేంద్రవరం రెడ్డి రాజులకు సామంతులు. వీరు 15, 16 శతాబ్దాలలో కళింగ, విజయ నగరాధీశుల కడ ఉన్నత పదవులను అలంకరించిన యోధులు.

## మరాఠా పీష్వాలు

ఛత్రపతి శివాజీ మహారాష్ట్రులలో శక్తిని పెంపొందించి వారిలో పౌరుష ప్రతాపాలను కలిగించే కొరకు నిరంతరం శ్రమించినాడు. మహారాష్ట్ర సామ్రాజ్య నిర్వాహకుడుగా పీష్వా బాజీరావు 1721 నుండి 1740 వరకు వ్యవహరించినాడు. ఇతని తండ్రి విశ్వనాథ రావు పీష్వా మహరాష్ట్రులను ఏకోన్ముఖం కావించినవాడు.

సాహూ మహరాజు సభా భవనంలో ఒకనాడు బాజీరావు "లక్ష్మీ కటాక్షం ఉంటే సర్వ కార్యములను విజయవంతంగా నిర్వహించవచ్చు. హిందూదేశం నుండి అన్య దేశీయులను వెడలగొట్టి శాశ్వత కీర్తిని సంపాదించడం మహారాజు కర్తవ్యం. మహారాష్ట్ర పతాకం కృష్ణా నది ఉత్తర భూముల నుండి సింధూ నది పర్యంతం ఎగురవలెను. మహారాజు హిమాలయ పర్వతోన్నత శిఖరంపై మరాఠా జెండా నిలుపవలెను. తండ్రికి తగిన తనయుడని మహారాజు ప్రశంసించబడవలెనని నిశ్చయాత్మకంగా ప్రకటించినాడు. మొగలు సామ్రాజ్యం ఎండిపోతున్న వృక్షం వంటిదని, కూకటి వేళ్ళతో తెగవేస్తే దాని శాఖలు వాటంతట అవి కూలిపోగలవని" వక్కాణిస్తాడు.

బాజీరావు బ్రాహ్మణుడైనా అసదృశ బాహుబలం, శౌర్య ధైర్యాలు, యుద్ధ వ్యూహ రచనా నైపుణ్యం, పరిపాలనా దక్షత, ప్రజోపయోగ నిర్మాణాలపై ఆసక్తి, ప్రభుభక్తి పరాయణత, బంధుప్రీతి, దేశాభిమానం, ముస్లింలను భారతావని నుండి పారద్రోలి విశాల సామ్రాజ్యాన్ని నిర్మించవలెననే కాంక్ష కలవాడు. ఈ ఆశయాలకు తగినట్లు ప్రవర్తించి మహారాష్ట్ర సముద్ధరుడైనాడు. అనేక రాజ్యాలపై దండెత్తి, చౌథ్, సర్దేశ్‌ముఖ్ వంటి పన్నులు వసూలు చేసి, నిజాముల్ ముల్కుకు సింహ స్వప్నమై, అతని నుండి ధనం సంపాదించి, మహా వీరులైన మరాఠా సైనికుల జీత బత్తెములను చెల్లించి, వారు ప్రభుభక్తి పరాయణులుగా ఉండుటకై కృషి చేసినాడు.

బాజీరావు మరణానంతరం అతని పుత్రుడు బాలాజీ బాజీరావు 1740లో పీష్వా పదవిని చేపట్టి మహారాష్ట్ర సామ్రాజ్యాన్ని మహోన్నత స్థితికి కొనిపోయినాడు. కాని ఇతని చివరి దినాల్లో మహారాష్ట్రులు పానిపట్టు యుద్ధంలో ఆఫ్ఘనుల చేత పరాజితులై క్షీణ దశకు చేరుకున్నారు.

బాలాజీ బాజీరావు తర్వాత అతని రెండవ పుత్రుడు మాధవ రావు తన 17వ ఏట క్రీ.శ. 1761లో పీష్వా పదవిని అలంకరించినాడు. ఇతడు మహారాష్ట్ర సైనిక శక్తిని పెంపొందించి, మహా శక్తిమంతుడైన హైదరలీని ఓడించి, కప్పము వసూలు చేసినాడు. బ్రిటీషు వారికి సింహ స్వప్నమై, నిజామలీ వంటి కుటిల వర్తనులను లొంగదీసుకుని తన పరిపాలనలో మహారాష్ట్రులు ఉత్తర హిందూ దేశమంతటా విజయాలు సాధించడంలో తోడ్పడ్డ మహా వీరుడు. ఇతడు అస్వస్థతకు గురియైన తర్వాత మాధవరావు తన సోదరుడు నారాయణ రావు పీష్వా అగుటకు పిన తండ్రియైన రఘునాథరావు సహకారం అవసరమని తలచి అతనితో సఖ్యంగా వ్యవహరించినాడు. నారాయణరావు పీష్వా అయిన తర్వాత కర్ణాటక యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. అపుడే రఘునాథ రావు విద్రోహ చర్యకు పూనుకున్నాడు. క్రీ.శ. 1773 ఆగష్టు 30వ తేదీ నాడు నారాయణ రావు పీష్వా పూనాకు దక్షిణంలో గల కొండమీద గల పార్వతీ దేవి ఆలయానికి వెళ్ళి, దేవిని దర్శించి, ఇల్లు చేరుకుని, భోజనం చేసిన పిదప విశ్రాంతికై శయనాగారం చేరుకుంటాడు. నారాయణ రావు నిద్రించే సమయంలో రఘునాథ రావు ఖద్మత్‌దారైన తల్వాజీ పవార్, సుబేదార్ ఠాకూర్ సింగును, మహమ్మదు యూసుఫ్‌ను అంత:పురంలోకి ప్రవేశించుటకు అనుమతినిస్తాడు. వీరిద్దరు రెండు వేల సైనికులతో భవనంలోకి ప్రవేశించి, నారాయణరావు రక్షక దళాధిపతిని వధించి, విద్రోహులైన సుమేసింగ్, మహమ్మద్ యూసుఫ్ పీష్వా నారాయణ రావును రఘునాథ రావు చూస్తుండగానే హత్య కావించినారు. ప్రజలకా హత్యోదంతం తెలిసి గుంపులు, గుంపులుగా వచ్చి ఎదురు తిరిగినారు. రఘునాథ రావు తను చేసిన తప్పుకు భయపడి బారామతికి పారిపోవలసి వచ్చింది.

ఈ విపత్కర స్థితిలో మహారాష్ట్ర మంత్రులు, సామంతులు, సేనానులు, ప్రముఖులు రఘునాథ రావును పీష్వాగా ఉండవలెనని కోరినారు. న్యాయాధికారియైన రామశాస్త్రి రఘునాథరావు ద్రోహ చర్యపై విచారణ జరిపి అతనిని దోషిగా నిర్ణయించినారు. రఘునాథ రావు తాను చేసిన అకృత్యానికి శిక్ష ఏమిటని రామశాస్త్రిని ప్రశ్నిస్తాడు. నీకు మరణమే శరణ్యం. పశ్చాత్తాప పడ్డా హత్యా పాప పంకిలం నుండి బయట పడజాలవు. మీరు, మీ రాజ్యం వృద్ధి చెందదు. నీవు పీష్వాగా ఉన్నంత కాలం నేను పూనాలో కాలు పెట్టనని ఒక పల్లెకు వలస పోతాడు రామశాస్త్రి.

ఈ విధంగా జయాపజయాలను, ఉత్థాన పతనాలను ఎదుర్కొంటూ పీష్వాల పాలన కొనసాగింది.

బ్రాహ్మణుల ఏలుబడిలో శాతవాహన, గుప్తాది సామ్రాజ్యాలే కాక దేశమంతట అనేక సంస్థానాలు, జమీందారీలు వ్యాపించి ఉండేవి. తెలంగాణలో లోకాయ పల్లి, లింగన గిరి, చంద్రగఢ, వాడాల బ్రాహ్మణ సంస్థానాలుగా ప్రసిద్ధాలు. అకల్‌కోట్, ముధోల్, సావంత్ వాడి, ఔధ్, బోర్, సాంగ్లీ వాడీ, రాయదుర్గ్, జాంఖండి, పెద్దమరాజ్, చిన్నమరాజ్, పెద్ద కురండ్ వాడీ, చిన్న కురండ్ వాడీ సంస్థానాలు మహారాష్ట్రలోని పట్వర్ధన్ సంస్థానాలుగా పేరు గాంచినవి. ఆంధ్ర దేశంలో ఉర్లాం, వాద్రేవు, బేతవోలు సంస్థానాలు, జమీందారీలు ఉండేవి.

ఈ సమీక్షలో భరత వర్షమంతటా వ్యాపించియున్న బ్రాహ్మణ సామ్రాజ్యాల సంక్షిప్త సమాచారం ఇవ్వడమైంది. ఆయా రాజ్యాల సమగ్ర చరిత్రలను తెలుసుకొనగోరే జిజ్ఞాసువులు శాస్త్రిగారి బ్రాహ్మణ రాజ్య సర్వస్వాన్ని చూడగలరని మనవి.

**డా. గంగాపురం హరిహరనాథ్**
విశ్రాంత అధ్యాపకులు, పాలెం ఓరియంటల్ కళాశాల.
ఫోన్ : 9347484200



# శాసన సంపుటి

ఇంద్రపాల నగర శాసనాలను పరిష్కరించి, ప్రకటించి ప్రముఖ చరిత్ర, శాసన పరిశోధకుల దృష్టిని విశేషంగా ఆకర్షించిన బి.ఎన్. శాస్త్రి గారు అప్పటి నుంచి దాదాపు దశాబ్ది పాటు నిర్వహించిన శాసన గవేషణ, పరిశోధనల సమాహారం ఈ శాసన సంపుటి. ఇందులో రెండు భాగాలున్నాయి. మొదటి భాగం తామ్ర శాసనాలు, రెండవ భాగం శిలా శాసనాలు. ఇందులోని శాసనాలు తత్సంబంధి విశ్లేషణలతో సింహభాగం 'భారతి' లో ప్రచురితమైనాయి. భారతి వ్యాసాల క్రమాన్ని కాక వంశాను క్రమాన్ని, కాలానుక్రమాన్ని పాటించడం ఇందులోని సౌలభ్యం.

ఈ శాసనాలలో మొదటివి, విస్తృత చర్చకు నోచుకున్నవి ఇంద్రపాలనగర తామ్రశాసనాలు. ఈ రెండు శాసనాలూ నల్లగొండ జిల్లా రామన్న పేట తాలూకా తుమ్మలగూడెం గ్రామానికి రెండు మైళ్ల దూరంలో ఉన్న నాగవరంలో దొరికినాయి. ఇంద్రపాల నగరమనే పేరు శాస్త్రి గారు సూచించింది. తుమ్మలగూడెం చెరువు నాగవరం గ్రామాన్ని ఆనుకొని వున్న ఇంద్రపాల గుట్టల మధ్య శిథిల నగరపు ఆనవాళ్లున్న విశాల ప్రదేశమే ఇంద్రపాల నగరమని, విష్ణుకుండిన వంశ రాజులలో మొదటి వాడైన మహా రాజేంద్రవర్మ పేరుతో ఈ నగరం స్థాపించబడిందని, ఈ నగరమే విష్ణుకుండుల తొలి రాజధాని అని శాస్త్రి గారు సూచించారు. ఇంద్రవర్మ పేరుతో స్థాపించబడిన ఈ నగరం ఇంద్రపురమని, దీని పొలిమేరలో వున్న గుట్ట ఇంద్రపుర గుట్టగా పిలవబడి కాలాంతరంలో ఇంద్రపాల గుట్టగా జన వ్యవహారంలో స్థిరపడి వుంటుందని నా ఊహ. ఇక ఇక్కడి శాసనాల విషయం...

ఈ శాసనాలు విష్ణుకుండినుల చరిత్ర పున:రచనానికి, వారి వంశానుక్రమణిక, కాలాను క్రమణికలను పునర్నిర్మించడానికి ఘంటా పథాన్ని ఏర్పరచినాయనడం నిర్వివాదాంశం. వీటిలో గోవిందవర్మ శాసనం ఇప్పటి వరకు లభించిన విష్ణుకుండి తామ్ర శాసనాలలో మొదటిది. ఇది గోవిందవర్మ 37వ విజయరాజ్య సంవత్సరం నాటిది. మహారాజేంద్రవర్మ పౌత్రుడు, మాధవవర్మ పుత్రుడైన గోవిందవర్మ తన అగ్రమహిషి పరమ మహాదేవి నిర్మింపజేసిన విహార నిర్వహణ కోసం చాతుర్దిశ ఆర్య సంఘానికి 'పెణ్కపఱ' గ్రామాన్ని దానమిచ్చినట్లు ఈ శాసనం తెలుపుతోంది.

రెండవ శాసనం గోవిందవర్మ – మాధవవర్మ – విక్రమేంద్రవర్మ – ఇంద్రభట్టారక వర్మ (సత్యాశ్రయ)– విక్రమేంద్ర భట్టారకవర్మ (ఉత్తమాశ్రయ) ల వారసత్వ క్రమాన్ని, (గోవిందరాజు అగ్రమహిషియైన) పరమభట్టారికా మహాదేవి ఇంద్రపురంలో ప్రతిష్ఠాపించిన పరమభట్టారికా మహా విహారంలో చాతుర్దిశార్య భిక్షుసంఘానికి 'ఇరుణ్డెఱో' గ్రామాన్ని విక్రమేంద్ర భట్టారకవర్మ, తన 11వ విజయరాజ్య సంవత్సరంలో దానమిచ్చిన విషయాన్ని తెలుపుతోంది. శాసనాంతంలోని ఒక శ్లోకం, ఉత్తమాశ్రయ నృపుడు (విక్రమేంద్ర భట్టారకవర్మ), శకాబ్దం 488 లో పల్లవరాజైన సింహవర్మను ఓడించి తిరిగివస్తూ 'శక్రాభిధానపురం' లో ఈ శాసనాన్ని ఇచ్చినాడని, దాన సందర్భాన్ని ప్రస్తావించింది.

మారేమండ రామారావు గారు విష్ణుకుండినుల వంశానుక్రమణిక విషయంలోనూ, కాల నిర్ణయంలోనూ శాస్త్రి గారితో విభేదించడంతో పాటు ఈ రెండు శాసనాలలో పేర్కొనబడిన గోవిందవర్మ – గోవిందరాజు వేరువేరు వ్యక్తులని, ఈ రెండు శాసనాలు ఇంద్రపురంలోని రెండు వేరువేరు విహారాలకు ఇచ్చిన దానాలను నమోదు చేసినాయని, మొదటి శాసనాన్ని ఇచ్చిన గోవిందవర్మ, అతని పూర్వీకులు, విష్ణుకుండినుల ప్రధాన శాఖకు కాక, దాయాది శాఖకు చెందినవారని, విక్రమేంద్ర భట్టారకవర్మ అనంతరం రాజ్యాన్ని ఆక్రమించుకొన్నారని అభిప్రాయపడ్డారు. శాస్త్రిగారు ఈ వాదాన్ని వినమ్రంగా తిరస్కరించి తమ అభిప్రాయాలను సోపపత్తికంగా పునరుద్ఘాటిస్తూ విష్ణుకుండినుల కాలనిర్ణయంపై ప్రత్యేకంగా వ్యాసాన్ని ప్రకటించారు.

అజయ్‌మిత్ర శాస్త్రి గారు సహితం రామారావు గారి సూచనలతో ఏకీభవించడం కష్టమని, గోవిందవర్మ, అతని పూర్వీకులు, దాయాది శాఖకు చెందినవారని చెప్పడానికి ఎలాంటి ఆధారాలూ లేవని, రామారావు గారి అభిప్రాయాన్ని అంగీకరిస్తే విష్ణుకుండిన వంశంతో సంబంధమున్న వారైన పరమభట్టారికా మహాదేవి, పరమ మహాదేవి అనే నామ

సామ్యమున్న ఇద్దరు రాణులున్నారని, వారిరువురి భర్తల పేర్లలోనూ సామ్యముందని (పరమ భట్టారికా మహాదేవి - గోవిందవర్మ, పరమమహాదేవి - గోవిందరాజ), వారిరువురూ బౌద్ధమతానుయాయులని అసంగతమైన నిర్ణయానికి రావాల్సి వస్తుందని, అందువల్ల ఈ శాసనాలలో పేర్కొనబడిన గోవిందవర్మ - గోవిందరాజు ఒకరేనని అట్లే పరమ భట్టారికా మహాదేవి - పరమమహాదేవి కూడా ఒకరేనని సమన్వయించినారు.

మారేమండ రామారావు గారు సూచించిన కాలపుట్టిక ఆమోదయోగ్యమైనది కాకపోవడంతోను, ఇంద్రపాల నగర శాసనాలు రెండింటిలోనూ పేర్కొనబడిన గోవిందవర్మ ఒకరేనని తేలిపోవడంతోను, విష్ణుకుండిన వంశానుక్రమణికను పునర్మించడానికి ఈ శాసనాలను ప్రాతిపదికగా తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. అప్పుడు శాస్త్రి గారు ప్రతిపాదించిన విధంగా మహారాజేంద్ర వర్మ (మహారాజ - ఇంద్రవర్మ?) - మాధవవర్మ గోవిందవర్మ - మాధవవర్మ - విక్రమేంద్రవర్మ - ఇంద్రభట్టారకవర్మ (సత్యాశ్రయ) - విక్రమేంద్ర భట్టారకవర్మ (ఉత్తమాశ్రయ) - అనే ఏడు పురుషాంతరాల వారసత్వ క్రమం ఏర్పడుతుంది. ఈ క్రమాన్ని అజయ్‌మిత్ర శాస్త్రి గారు 'నేలటూరి వేంకటరమణయ్య గారు ఆమోదించి అనుసరించడం శాస్త్రిగారి కృషికి అమూల్యమైన బహుమతి.

విష్ణుకుండిన కాలానుక్రమణికను పునర్నిర్మించడంలో రెండవ విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాల నగర శాసనం విశ్వసనీయమైన తురుపుముక్క. ఈ శాసనం వెలుగులోకి రాకముందు విష్ణుకుండిన వంశ కాలానుక్రమణికను ఆయా పరిపాలకుల రాజ్య సంవత్సరాలను, ఆ రాజవంశంలో చివరి వాడుగా భావింపబడుతోన్న రెండవ విక్రమేంద్ర భట్టారక వర్మ పరిపాలన ఏడవ శతాబ్ది చివరి పాదంలో రెండవ పులకేశి వేంగీ దేశాన్ని ఆక్రమించినంత వరకు కొనసాగి వుంటుందన్న ఊహను జోడించి, పరిశోధకులు వారు విశ్వసించిన ఆధారాలను అనుసరించి భిన్న విధాలుగా నిర్ణయించినారు. కానీ ఈ శాసనంలో రెండవ విక్రమేంద్ర భట్టారకవర్మ 11 వ విజయరాజ్య సంవత్సరంతో పాటు దానికి సరియైన శకాబ్దం 488 (క్రీ.శ.566-67) పేర్కొనబడటం వల్ల ఇతని పరిపాలన శకాబ్దం 477 లో (క్రీ.శ.555-56) లో మొదలైందని స్పష్టంగా తెలుస్తోంది. ఇతని 14 వ రాజ్యసంవత్సరం (క్రీ.శ.570) నాటి తుండి శాసనం ఇప్పటివరకు లభించిన ఇతని శాసనాలలో చివరిది. కాబట్టి రెండవ విక్రమేంద్ర భట్టారకవర్మ క్రీ.శ.555-56 నుంచి క్రీ.శ.570 వరకు రాజ్యపాలన చేసినాడని నిశ్చయంగా చెప్పవచ్చు,. ఈ ప్రత్యక్ష ప్రమాణం ప్రాతిపదికగా ఇతని పూర్వీకుల పరిపాలన కాలాన్ని ఇంచుమించుగా లెక్కకట్టవచ్చు.

ఇంగువ కార్తికేయ శర్మ గారు ఈ సంపుటిని సమీక్షిస్తూ నేలటూరి వేంకట రమణయ్య గారి వివరణను అనుసరించి విష్ణుకుండినులు స్వతంత్ర రాజులుగా క్రీ.శ.358 నాటికే స్థిరపడినారని, 'ఇదియెంతో సమంజసముగా తోచుచున్నది' అని శాస్త్రి గారు దీనిని క్రీ.శ.388 కి అనగా 30 ఏండ్ల వెనకకు జరపడం, వీరి రాజ్య పరిసమాప్తి క్రీ.శ.594 వరకు కాక, క్రీ.శ.624 వరకు అనగా వేంగీ చాళుక్యుల రాజ్య స్థాపన వరకు పొడిగించడం సరికాదని అభిప్రాయపడ్డారు. వంశానుక్రమణికలో తేడాలున్న విషయాన్ని కూడా కార్తికేయ శర్మ గారు ఈ సందర్భంలో రేఖామాత్రంగా ప్రస్తావించినారు.

విక్రమేంద్ర భట్టారకవర్మకు ముందున్న ఆరుగురు రాజులలో ముగ్గురి పరిపాలన కాలాలకు సంబంధించి ఏవిధమైన ఆధారమూ లేని స్థితిలో ఉజ్జాయింపుగా వేసిన లెక్కలలో తేడాలుండటం సహజమే. కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారు, భావరాజు వేంకట కృష్ణారావు, పులుంబూరు, మొదటి ఈపూరు శాసనాలను సమన్వయించి, పులుంబూరు శాసనంలోని విక్రమ (మ) హేంద్రవర్మను వికమేంద్రభట్టారక వర్మగా నిర్ణయించి అతని వారసులైన గోవిందవర్మ, మాధవవర్మ, మంచన భట్టారకులు క్రమానుగతంగా రాజ్యపాలన చేసినట్లు సూచించారు. నేలటూరి వేంకట రమణయ్య గారు విక్రమ (మ)హేంద్ర వర్మను రెండవ మాధవవర్మ కుమారుడైన మొదటి విక్రమేంద్రవర్మ గాను, అతని వారసులైన గోవిందవర్మ, (నాలుగవ) మాధవవర్మ, మంచన భట్టారకులను దాయాది శాఖకు చెందినవారుగా నిర్ణయించినారు. శాస్త్రిగారు, భావరాజు వేంకట కృష్ణారావు గారు సూచించిన వంశానుక్రమణికను అనుసరించడం వల్ల విష్ణుకుండినుల రాజ్య పరిసమాప్తి క్రీ.శ.624 వరకు పొడగించబడింది.

ఎంతో చారిత్రక ప్రాముఖ్యమున్న ఈ శాసనాలను పరిష్కరించి ప్రకటించడంతో పాటు వీటిని విష్ణుకుండినుల ఇతర శాసనాలతో సమన్వయించి వారి చరిత్ర పున:రచనంలో కొత్త ఆలోచనలను రేకెత్తించిన శాస్త్రిగారికి, తిరుమల రామచంద్రగారు, అజయ్‌మిత్ర శాస్త్రిగారు సూచించినట్లు చరిత్ర జిజ్ఞాసువులు, ప్రత్యేకించి విష్ణుకుండినుల చరిత్రపై ఆసక్తి వున్నవారు కృతజ్ఞత తెలపాల్సి వుంది.

మాఠర వంశానికి చెందిన ఉమావర్మ 40 వ రాజ్య సంవత్సరం నాటి హోణరేజ్జ శాసనం తెంబూరులో లభించింది. ఈ శాసనం హోణరేజ్జ గ్రామంలో ఇవ్వబడింది కనుక శాస్త్రిగారు ఈ పేరుతో సూచించినారు. ఉమావర్మ తన కుమారుడైన వసుషేణ రాజుకు పుణ్య యశోభివృద్ధి కలగడం కోసం హోణరేజ్జ గ్రామాన్ని దానమిచ్చిన సందర్భంలో ఈ శాసనాన్ని ప్రకటించాడు. కుమారుని పుణ్య యశోభివృద్ధి కోసం దానమివ్వడం అతని

మరణం తర్వాతనే జరుగుతుంది. అందువల్ల వసుషేణ రాజు ఈ దానకాలానికి కొంత ముందు మరణించాడని నిర్ధారించవచ్చు.

ఈ శాసన లిపి విష్ణుకుండిన శాసనాలలోని లిపికి సన్నిహితమైందని శాస్త్రి గారు భావించినారు. కానీ ఈ లిపి పల్లవ సింహవర్మ వేసంత శాసన లిపికి ముందు దశను సూచిస్తోంది. శాస్త్రిగారు ఈ శాసన కాలాన్ని వివరిస్తూ 'ఉమావర్మ కాలము నాటికి మాసములో 30 రోజులు గణించినపుడు తిథుల లెక్కన కాక బహుళ పంచమిని 20 వ దినముగా, ఇట్లే ఇతర దినములను లెక్కించుచుండిరని భావించవచ్చును" అని సూచించినారు. కానీ ఈ విధమైన కాలగణన సర్వసామాన్యం కాదు. ఉమావర్మ టెక్కలి శాసన కాలం 'మాఘస్య కృష్ణ దివసే సప్తమి' అని పేర్కొనబడి ఉండటం గమనార్హం.

ఈ సంపుటిలోని తామ్ర శాసనాలలో చివరి రెండూ తూర్పు గాంగవంశీయులవి. ఈ శాసనాలు శ్రీకాకుళం జిల్లా పాతపట్నం తాలూకా తెంబూరు గ్రామంలో లభించాయి. వీటిలో మొదటిది అనంతవర్మ యిచ్చిన సేవిది గ్రామదాన శాసనం. శాసన ప్రదాత అయిన కళింగాధిపతి అనంతవర్మ పూర్వీకుల గురించి కానీ, ఇతని రాజ్యకాలాన్ని గురించి కానీ ఈ శాసనంలో ప్రస్తావన లేదు. లిపి ఆధారంగా ఈ శాసనం మొదటి అనంతవర్మకు చెందినదిగా శాస్త్రిగారు నిర్ణయించినారు. 'లిపి యాధారంగా చూస్తే ఈ అనంతవర్మ రెండవ లేక మూడో అనంతవర్మలు కూడా గావచ్చును కదా" అని ఈ నిర్ణయంపై కార్తికేయశర్మ గారు వెలిబుచ్చిన సందేహాన్ని నివృత్తి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇక రెండోది అనంతవర్మ చోడ గంగదేవుని తెంబూరు శాసనం. ఇతడు దాదాపు 70 సంవత్సరాలు (క్రీ.శ.1077-1150) కళింగ ప్రాంతాన్ని పరిపాలించాడు. తన సుదీర్ఘ పాలనలో ఇతడు అనేక శాసనాలను జారీచేసాడు. శక సంవత్సరం 1051 (క్రీ.శ.1129)కి సరియైన తన 55వ రాజ్య సంవత్సరంలో ఉత్కల దేశంలోని 'నివాలి' అనే రాజధాని నుంచి చోడగంగదేవుడు ప్రస్తుత శాసనాన్ని ఇచ్చినాడు. ఇంతకు మించి ఈ శాసనం ద్వారా తెలుస్తున్న చారిత్రకాంశాలు లేవు.

ఈ సంపుటిలోని శిలాశాసనాలలో మొదటివి కందూరు చోడుల శాసనాలు. క్రీ.శ.11-13 శతాబ్దుల మధ్య తెలంగాణలోని వివిధ ప్రాంతాలను పరిపాలించిన మాండలిక రాజ వంశాలలో కందూరు చోళులు ప్రముఖులు. మొదట కళ్యాణీ చాళుక్యులకు అనంతరం కాకతీయులకు సామంతులుగా ఇప్పటి మహబూబునగర్, నల్గొండ జిల్లాలోని భూభాగాలను రెండు శతాబ్దులకు పైగా (క్రీ.శ.1078 నుంచి 1282 వరకు) ఈ వంశానికి చెందిన పదమూడు మంది రాజులు పరిపాలించారు. వీరికాలం నాటి పది శాసనాలు ఈ సంపుటిలో

వున్నాయి. వీటికి 23 శాసనాలను జోడించి మొత్తం 33 శాసనాలను, ఆ కాలం నాటి రాజకీయ, సాంఘిక ఆర్థికాది విశేషాలను వింగడిస్తూ ఒక విపులమైన గ్రంథాన్ని అనంతర కాలంలో శాస్త్రిగారు రచించారు.

పేరూరులోని శ్రీ స్వయంభూ సోమేశ్వరాలయంలో ఉన్న మూడు శిలాశాసనాలలో ఒక శిలపై తొమ్మిది శాసనాలు నాలుగువైపులా చెక్కబడి వున్నాయి. వాటిలో కందూరి భీమనచోదుని కాలానికి చెందిన శాసనంతో కలిపి ఏడు శాసనాలు కళ్యాణీ చాళుక్యుల కాలంనాటివి. ఒకటి రుద్రకుమారుని (కాకతీయ ప్రతాపరుద్రుని?) కాలం నాటిది, మరోటి ముమ్మడి నాయకుని కాలం నాటిది. ఇవికాక రెండవ జగదేకమల్లుని కాలంనాటి బొల్లేపల్లి, శనిగరం శాసనాలు, మూడవ తైలపదేవుని కాలం నాటి రాచూరు శాసనము ఈ సంపుటిలో ఉన్నాయి. కాకతీయుల శాసనాలలో శక సంవత్సరం 1102 నాటి రుద్రదేవుని తుంగపాడు శాసనం, కాకతీయుల సామంతులైన చెఱకురెడ్లు మొదలైన వారి శాసనాలున్నాయి.

ఈ సంపుటిలో చివరిదైన అబ్దుల్లా కుతుబ్‌షా కాలం నాటి శనిగరం శాసనం కుతుబ్‌షాహీల మత సామరస్యాన్ని పునరుద్ఘాటిస్తూ వుంది. ఈ శాసనాల కాలం శక సంవత్సరం 1786 (క్రీ.శ.1864), ప్లవంగ సంవత్సర శ్రావణ (శుద్ధ పాడ్యమి). అబ్దుల్లా కుతుబ్‌షా పరిపాలన కాలాన్ని అనుసరించి ఈ శక సంవత్సరాన్ని 1586 (క్రీ.శ.1664) గా శాస్త్రిగారు సవరించినారు. ఇది ఈ శాసనంలో పేర్కొనబడిన ఫసలీ 1070 తో సరిపోలుతుంది. కానీ ప్లవంగ సంవత్సరంతో (శక సంవత్సరం 1589- క్రీ.శ.1667) సమన్వయం కుదరదు.

ఈ సంపుటిలోని శాసనాలు విష్ణుకుండినుల నుంచి కుతుబ్‌షాహీల కాలం వరకు వున్న వివిధ రాజవంశాలలోని పరిపాలకుల కాలానికి చెందిన చారిత్రక విశేషాలను మాత్రమే కాక, ఆయా కాలాలలోని తెలుగు పదజాలాన్ని, భాషా విశేషాలను అధ్యయనం చేయడానికి ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేకించి తెలుగు లిపి పరిణామ దృష్టితో ఈ శాసనాలు ఎంతో విలువైనవి.

**సూచికలు :**

1. M. Ramarao : "New Light on the Vishnukundins, Journal of Indian History", Vol XLIII, Part III (Dec 1965), pp, 745.

2. బి.ఎన్.శాస్త్రి : "విష్ణుకుండినుల కాల నిర్ణయము", భారతి, నవంబరు, 1967, పుటలు 29-39.

3. Ajay Mitra Shastri : "Fresh Light on the History of the Vishnukundins", Indian History Congress, Proceedings of the 28th Session, 1966.

4. Ibid.

5. నేలటూరి వేంకట రమణయ్య : విష్ణుకుండినులు, A.P. Govt. Archaeological Series, No. 40, 1973. పుట. 24

6. కార్తికేయ శర్మ : గ్రంథ విమర్శలు, భారతి, డిసెంబరు, 1974, పుట. 60

7. కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు : విష్ణుకుండిన మూడవ మాధవవర్మ "ఆంధ్ర సాహిత్య పరిషచ్ఛాసనము", భారతి, ఫిబ్రవరి, 1931, పుట. 302. ఇది కొమర్రాజు వేంకట లక్ష్మణరావు గారి "The Telugu Academy Plates of Vishnukundin -Madhavarma III, A.D. 594" (Journal of the Department of Letters - University of Calcutta, Vol.11, 1924, pp.31-64) – అనే వ్యాసానికి మల్లంపల్లి గారి అనువాదం.

8. Bhaavaraju Venkata Krishnarao : "History of the Early Dynasties of Andhra Desa, A.D. 200 - 625", Page. 421.

9. కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు : పూర్వోద్ధృతము

10. Epigraphia Indica, Vol. XVII, pp. 334 - 37.

11. తిరుమల రామచంద్ర : "ఇంద్రపాల నగర తామ్రశాసనము" – చర్చ, భారతి, జూలై, 1968

12. Copper - plate Inscription of Andhra Pradesh Government Museum, Vol.I (1962), pp. 211 ff. and plates.

13. Gopinath Harichandan Jagadeb : "A New - Plate Grant of Umavarma" Journal of the Andhra Historical Research Society, Vol.6, pp. 53-55.

14. కార్తికేయశర్మ : పూర్వోద్ధృతము

**అవధానం ఉమామహేశ్వర శాస్త్రి**

ప్రముఖ శాసన పరిశోధకులు

ఫోన్ : 9154042807



# త్రిపురాంతక దేవాలయ శాసనములు

తెలుగునాట శాసన సేకరణ శాసన పరిశోధన కల్నల్ కాలిన్ మెకంజీతో ప్రారంభమయ్యింది. కల్నల్ కాలిన్ మెకంజీ (1754-1821) వద్ద పనిచేస్తున్న 20 మందికి పైగా పండితులు (వీరినే మెకంజీ గుమస్తాలని కొంతమంది వ్రాస్తున్నారు) దేశమంతా తిరిగి ఆయాగ్రామాల / పట్టణాల కైఫియత్తులను సేకరించటముతో పాటు అయాప్రాంతాలలో కనిపించిన తామ్రశాసనాలను, శిలాశాసనాలను సేకరించి గ్రంథస్తం చేశారు. ఈవిధంగా మెకంజీ క్రీ.శ. 1793 నుంచి 1816 దాకా 8076 శాసన పాఠాలను సేకరించాడు. మెకంజీ తరువాత సర్ వాల్టర్ ఇలియట్ దక్షిణ భారతదేశములో అనేక తామ్రశిలాశాసనాలను సేకరించాడు. ఈ శాసనాలలో 'తెలుగు శాసనాలు' రెండు భాగాలుగాను, 'కన్నడ సంస్కృత శాసనాల'ని రెండుభాగాలుగాను శాసన ప్రతిబింబాలతో సహా ఏషియాటిక్ సొసైటి బెంగాల్, బొంబాయి, మద్రాస్, లండన్‌లలో భద్రపరిచాడు. జేమ్స్ ప్రిన్సెప్ 1837వ సంవత్సరంలో 'బ్రాహ్మీలిపి'ని చదవటంతో మనదేశంలో శాసనాల అధ్యయనం, పరిశోధనలు మరింత ముమ్మరమయ్యాయి. భారత పురావస్తుశాఖ ఆధ్వర్యంలో శాసనాలను ఇండియన్ యాంటిక్వరీ, ఎపిగ్రాఫియా ఇండికా, South Indian Inscriptions లలో ప్రచురించటం ప్రారంభించారు. ఈ విధంగా మొదలైన శాసనపరిశోధనలో జె.ఎఫ్. ఫ్లీట్, అలెగ్జాండర్ కన్నింగ్ హామ్, బర్జెస్, కీల్‌హార్న్, హుల్ట్‌జ్, రైస్, ఇల్లియట్, రాబర్ట్ సీవెల్, అలెగ్జాండర్ రీ, బట్టర్‌వర్త్ మొదలగు విదేశీయులు అనేక శాసనాలను పరిష్కరించి వాటి వివరాలను అయా పత్రికలలో వ్యాసాలుగా ప్రచురించారు. అయితే ఈ ప్రచురణలన్నీ

ఆంగ్ల భాషలో ఉన్నాయి. ఈ వ్యాసాలను చదివి ఆ స్ఫూర్తితోను, తెలుగు వారి చరిత్ర సంస్కృతులపై తమకుగల అభిమానముతోను కొంతమంది తెలుగువారు తెలుగులో తమ శాసన పరిశోధన వివరాలను, ఆనాటి పత్రికలలో తమ వ్యాసాలను ప్రచురించటం ప్రారంభించారు. తెలుగువారిలో తొలితరం శాసన పరిశోధకులు (1925 వరకు) - జయంతి రామయ్యపంతులు మొదలుకొని గిడుగు వెంకటసీతాపతి వరకు – దాదాపు 45 శాసనాలను సేకరించి, పరిష్కరించి ప్రచురించారు. వాటి వివరాలు:

1. జయంతి రామయ్య – తొత్తరమూడి తామ్రశాసనము, 1893, చింతామణి, డిసెంబరు.
2. జయంతి రామయ్య – చాళుక్య రాజరాజు నందంపూడి శాసనము, 1912, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.
3. జయంతి రామయ్య – గుణగ విజయాదిత్యుని ఉరుటూరు శాసనము, 1912, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.
4. నందగిరి వెంకటప్పారావు – కోడూరు తామ్ర శాసనము, 1912, ప్రభోధిని, అక్టోబరు.
5. పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, దుగ్గిరాల సూర్యప్రకాశరావు - ఆర్యవట శాసనము, 1912, ఆంధ్ర భారతి, అక్టోబరు.
6. జయంతి రామయ్య– అనితల్లి కలువచేఱు శాసనము, 1913, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.
7. జయంతి రామయ్య – శక్తివర్మ ప్రభుపట్టు శాసనము, 1913, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.
8. జయంతి రామయ్య – సర్వలోకాశ్రయుని శాసనము, 1913, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.
9. జయంతి రామయ్య - మధుర నాయకుల దానపత్రములు, 1913, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.
10. దుగ్గిరాల సూర్యప్రకాశరావు – పులిబూరు శాసనము, 1913, ఆంధ్ర భారతి, మార్చి.
11. దుగ్గిరాల సూర్యప్రకాశరావు – పసుమఱ్ఱు శాసనము, 1913, ఆంధ్ర భారతి, ఏప్రియల్.
12. దుగ్గిరాల సూర్యప్రకాశరావు – ఎఱఱుపల్లి శాసనము, 1913, ఆంధ్ర భారతి, జూన్.
13. జయంతి రామయ్య – రాయలనాటి శాసనములు, 1914, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.
14. జయంతి రామయ్య – రెడ్లనాటి రెండు శాసనాలు, 1914, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.
15. జయంతి రామయ్య – బద్దిగదేవరాజు (కొండనాయనివరము శాసనములు), 1915, ఆంధ్ర సారస్వత పరిషత్పత్రిక.

16. జయంతి రామయ్య – రాయచూరు శాసనము, 1917, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.

17. జయంతి రామయ్య – యుద్ధమల్లుని బెజవాడ శాసనము, 1917, ఆంధ్ర సారస్వత పరిషత్పత్రిక.

18. జయంతి రామయ్య – ఇంద్రకీల పర్వతము మీది రెండు చాళుక్య శాసనములు, 1918, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.

19. కొమర్రాజు వేంకటలక్ష్మణరావు – పెదకోమటి వేమారెడ్డి నూతన శాసనము, 1921, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.

20. జయంతి రామయ్య – ఆనెగొంది వెండిశాసనము, 1921, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.

21. కొమర్రాజు వేంకట లక్ష్మణరావు – శ్రీనాథుని నూతన శాసనములు, 1921, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.

22. రచయిత పేరు లేదు – హస్తివర్మ ఉర్లాము శాసనము, 1920–21, ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక.

23.కొమర్రాజు వేంకటలక్ష్మణరావు – బాదక మహరాజు ఆరుంబాక తామ్రశాసనము, 1921–22, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక.

24. కొమర్రాజు వేంకటలక్ష్మణరావు – రాజరాజు కూతురు సోమలదేవి శాసనము, 1922, శ్రీరాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక.

25. పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి – ఏదువాడలపాలెం శాసనం, 1922, శ్రీరాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక.

26. కొమర్రాజు వేంకటలక్ష్మణరావు – యుద్ధమల్లుని బెజవాడ శాసనము, 1922–23, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక.

27.శేషాద్రి రమణ కవులు – అనవేముని ఉప్పుగల్లు శాసనము, 1922–23, ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక.

28. కొమర్రాజు వేంకటలక్ష్మణరావు – ప్రథమ చాళుక్య భీముని అత్తిలి తామ్రశాసనము, 1923, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.

29. కొమర్రాజు వేంకటలక్ష్మణరావు – వేగినాటి శాలంకాయనుల రెండు క్రొత్త శాసనములు, 1923, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.

30. కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు – రెండవపులకేశి నూతన శాసనము, 1923, ఆంధ్ర సారస్వతపరిషత్పత్రిక.

31. చిలుకూరి వీరభద్రరావు – రెండవ అమ్మరాజ విజయాదిత్యుని నూతన తామ్రశాసనము, 1923, శారద, నవంబరు.

32. గొ.రామదాసు – గుణార్ణవుని కొమారుడైన ఇంద్రవర్మగారి పుర్లితామ్రశాసనము, 1923, శారద, డిసెంబరు.

33. శేషాద్రి రమణ కవులు – అనవేముని ఉప్పుగల్లు శాసనము, 1924, శారద, జనవరి.

34. కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణరావు – గుణగవిజయాదిత్యుని సాతలూరు తామ్రశాసనము, 1924, భారతి, మే.

35. సి.ఆర్.కృష్ణామాచార్యులు – రెండవ జయసింహుని పెణుకపఱ్ఱు దాన శాసనము, 1924, భారతి, ఆగష్టు.

36. మల్లంపల్లి సోమశేఖర శర్మ – శాలంకాయన నందివర్మ పెదవేగి శాసనము, 1924, భారతి, ఆగష్టు.

37. మానవల్లి రామకృష్ణకవి – కొన్ని కాకతీయ శాసనాలు, 1924, భారతి, సెప్టెంబరు.

38. మల్లంపల్లి సోమశేఖర శర్మ – మూడవ విష్ణువర్ధనుని గణపవరం తామ్రశాసనము, 1924, భారతి, డిసెంబరు.

39. కానూరి వీరభద్రేశ్వరరావు – గనియాతుకూరు తామ్రశాసనము, 1925, శారద, ఫిబ్రవరి.

40. శిరుగూరు హనుమంతరావు – రుద్రమాంబ కాలమునాటి కోటగిరి శాసనము, 1925, శారద, మార్చి.

41. కానూరు వీరభద్రేశ్వరరావు – ప్రోలయవేముని కొండపల్లి తామ్రశాసనము, 1925, శారద, మే.

42. మానవల్లి రామ కృష్ణకవి – కొన్నికాకతీయ శాసనాలు, 1925, భారతి, పుష్యమి.

43. మల్లంపల్లి సోమశేఖర శర్మ – మూడవ వజ్రహస్తుని చిక్కాలవలస తామ్ర శాసనము, 1925, భారతి, మే.

44. మల్లంపల్లి సోమశేఖర శర్మ – మొదటి జయసింహవల్లభుని నిడమఱ్ఱు శాసనము, 1925, భారతి, మే.

45. గిడుగు వెంకట సీతాపతి – అనంతవర్మ చోడగంగదేవుని కొన్ని శాసనములు, 1925, భారతి, ఆగష్టు, నవంబరు.

ఆతరువాత చిలుకూరి నారాయణరావు, వి. వెంకయ్య, భావరాజు వెంకట కృష్ణారావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, ఒంగోలు వేంకటరంగయ్య, రాళ్ళబండి సుబ్బారావు, ముసునూరి సాంబశివరామమూర్తి, సి.ఆర్. కృష్ణమాచార్యులు, పుట్టపర్తి శ్రీనివాసాచారి, శేషాద్రి రమణకవులు, నేలటూరి వెంకటరమణయ్య, కుందూరి ఈశ్వరదత్తు, కల్రి సాంబమూర్తి శాస్త్రి, మండ నరసింహం, గడియారం రామకృష్ణ శర్మ, కొల్లూరు హర్షవర్ధన్ శర్మ, ఆర్.సుబ్రహ్మణ్యం, తురగా కృష్ణమూర్తి, ఇంగువ కార్తికేయశర్మ, బి.ఎన్. శాస్త్రి, పి.వి.పరబ్రహ్మశాస్త్రి, వి.వి. కృష్ణశాస్త్రి, ఎన్.ముకుందరావు, ఎస్.ఎస్.రామచంద్రమూర్తి, ఎన్.ఎస్.రామచంద్రమూర్తి, సి.ఎ.పద్మనాభశాస్త్రి, కె.మునిరత్నం, నాగార్జున, యేసుబాబు, మేకా వెంకట రాఘవేంద్ర వర్మ, అవధానం ఉమామహేశ్వరశాస్త్రి, బెల్లంకొండ రమేశ్ చంద్రబాబు, నాగోలు కృష్ణారెడ్డి, దామరాజు సూర్యకుమార్, కె. జితేంద్రబాబు మొదలగు శాసన పరిశోధకులు వేలాది శాసనాల సేకరించి వాటిని పరిష్కరించి ప్రచురించారు, ప్రచురిస్తున్నారు. వీరు ఈ శాసనాలను ఎపిగ్రాఫియా ఇండికా, జర్నల్ ఆఫ్ ఆంధ్ర హిస్టారికల్ రీసెర్చ్ సొసైటి, ఆంధ్ర సారస్వత పరిషత్పత్రిక, శారద, ఆంధ్రభారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, భారతి, ఎపిగ్రాఫియా ఆంధ్రిక, జర్నల్ ఆఫ్ ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా మొదలగు పత్రికలలో ప్రచురించారు.

శాసనాలను ప్రాంతాలవారీగా, జిల్లాలవారీగా గ్రంథ రూపంలో ప్రచురించటం 1905 నుండి ప్రారంభమయ్యింది. 1905 లో అలాన్ బట్టర్ వర్త్, వి. వేణుగోపాల చెట్టి నెల్లూరు జిల్లా శాసనాలను 'A Collection of the Inscriptions on Copper Plates and Stones in the Nellore District' అనే పేరుతో మూడు భాగాలుగా ప్రచురించారు. తిరుమల తిరుపతి దేవస్థానంవారు తిరుపతి, తిరుమలలోగల శాసనాలను 1930–1937 సంవత్సరాల మధ్య కాలములో ఆరు సంపుటాలుగా ప్రచురించారు. అవి :- 'Early Inscriptions from 1445 A.D. to 1506 A.D.' – Sadhu Subrahmanya Sastry 1930; Inscriptions of Saluva Narasimha's Time (from 1445 A.D. to 1506 A.D.) –Sadhu Subrahmanya Sastry and V.Vijayaraghavacharya, 1933;

Inscriptions of Krishnaraya's Time (from 1509 A.D. to 1531 A.D.) – V.Vijayaraghavacharya, 1935; Inscriptions of Achyutaraya's time (From 1530 A.D. to 1542 A.D.) – V.Vijayaraghavacharya, 1936; Inscriptions of Sadasivaraya's time (From 1541 A.D. to 1574 A.D.) – V. Vijaya raghava charya, 1937; Inscriptions of Venkatapatiraya's time (From 1530 A.D. to 1542 A.D.) – V. Vijaya raghavacharya, 1937.

ఆ తరువాత నిజాము రాష్ట్ర పురావస్తు విభాగము వారు The Maski Inscription of Asoka. Edited by H. Krishna Sastri and revised by P. Sreenivasachary; The Daulatabad Copper Plates of Jagadekamalla. Edited by D. R. Bhandarkar and revised by P. Sreenivasachary; The Palampet and Upparpalli Inscriptions. Edited by L.D. Barnett, and revised by P.Sreenivasachary; The Pakhal Inscriptions of Ganapati. Edited by L. D. Barnett, and revised by P. Screenivasachary; The Munirabad Inscriptions of Vikramaditya VI. Edited by H. Krishna Sastri and revised by P. Sreenivasachary; The Kotagiri Plates of the Reign of Rudramamba. Edited by Professor S. Hanumant Rao and revised by H. Krishna Sastri; The Bodhan Inscription of Someswara I. Edited by R. Narasimhacharya; The Inscriptions of Nagai. Edited by C. R. Krishnamacharlu, revised by P. Sreenivasachar; The Warangal Inscription of Shitab Khan. Edited by K. V. Lakshmana Rao and Hirananda Sastry; The Kopbal Inscriptions of Asoka. Edited by R. L. Turner; The Inscriptions of Kukkanur and Kallur. Edited by P. Sreenivasachar; The Canarese Inscriptions of Kopbal. Edited by C. R. Krishnamacharlu, revised by P. Sreenivasachary; A Corpus of Inscriptions of Telangana. Edited by P. Sreenivasachary; The Vakataka Inscriptions in Cave XVI at Ajanta. Edited by Prof. V. V. Mirashi; The Inscriptions in Cave XVII at Ajanta. Edited by Prof. V. V. Mirashi; నిజామురాష్ట్రం లోని శాసనాలను 1940-1956 సంవత్సరాల మధ్యకాలంలో ప్రచురించారు. అయితే ఈ రచనలన్నీ కూడా ఆంగ్లభాషలోనే ప్రచురించబడ్డాయి.

శాసనాల గూర్చి తెలుగులో వచ్చిన తొలి గ్రంథం జయంతిరామయ్య పంతులుగారి 'శాసనపద్యమంజరి'. జయంతిరామయ్య పంతులుగారు 'శాసనపద్యమంజరి' ప్రథమ భాగాన్ని 1930లోను, ద్వితీయ భాగాన్ని 1937 లోను ప్రకటించారు. ప్రథమభాగములో 88 శాసనాలలో ఇమిడియున్న 287 పద్యాలను, ద్వితీయభాగములో 46 శాసనాలలోగల 95 పద్యాలను శాసనములందున్నవి ఉన్నట్లుగానే పద్యాలుగా ముద్రింపబడినవి.

'తెలంగాణా శాసనములు' (మొదటి సంపుటము), ను లక్ష్మణరాయ పరిశోధక మండలి, హైదరాబాదు వారు 1935 సంవత్సరంలో ప్రకటించారు. మొత్తము 123 శాసనాలు ప్రకటింపబడ్డాయి. ఇందులో 82 శాసనాలను శ్రీ శేషాద్రిరమణ కవులు, 40 శాసనాలను శ్రీ మారేమండ రామారావు, ఒకదానిని శ్రీ భావరాజు వేంకటకృష్ణారావుగారు పరిష్కరించారు. 'తెలంగాణా శాసనములు' (రెండవ సంపుటము), లక్ష్మణరాయ పరిశోధక మండలి వారిచే 1960 లో ప్రచురింపబడింది. ఇందులో మొత్తము 85 శాసనాలు ముద్రించబడ్డాయి. వాటిలో 83 శాసనాలను శ్రీ గడియారము రామకృష్ణశర్మ గారు, రెండు శాసనాలను శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు పరిష్కరించారు.

కంభంపాటి అప్పన్నశాస్త్రిగారు 'అచింతేంద్రవర విరచితమైన వేయిస్తంభాలగుడి శాసనము' అనే పుస్తకాన్ని 1934 లో ప్రచురించారు. **'అచటి శిలాశాసనముపైగల లిపిని చూసి అది యే భాషలో నున్నదో మనకెట్లు తెలియునో తెలుసుకొన్న మనకేమగునో అనుమానము శంకలను వెల్లడించే అనేకులకు ఈశాసనములోని సత్యచరిత్రను దేశీయ భాషలో ప్రకటింపవలెనను ఉద్దేశ్యముతో అన్నిటికన్నా ముఖ్యముగా చారిత్రిక గ్రంథమున చాయాపటములు లేకుండగ చదువవలసి వచ్చునంతటి చాదస్తపు పని చేసినవారమనిపించుకొనకుండునట్లు చక్కని చాయా పటములను గొన్ని సంగ్రహించి ఇందుకూర్చితిమి'** అని ఈపుస్తకాన్ని ప్రచురించుటలో తమ ఉద్దేశ్యాన్ని పీఠికలో రచయిత పేర్కొన్నాడు. ఈపుస్తకం అనుబంధంలో వేయిస్తంభాలగుడి శాసనము (రుద్రదేవుని అనుమకొండ శాసనము) తోపాటు మాదిరెడ్డికుంట శాసనము, ఖాజీపేటదర్గా శాసనము, గూడూరి శాసనము, గణపేశ్వర శాసనాలను ప్రచురించారు.

నిడదవోలు వెంకటరావుగారు 30 శాసనాలతో 'Selected Telugu Inscriptions' అను పేరిట కూర్చిన సంపుటాన్ని 1952వ సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయము ప్రకటించింది. ఇందులో అప్పటివరకు ప్రకటించిన 30 శాసనాల శాసన పాఠాలను తెలుగులోను వాటి అనువాదము ఆంగ్లములోను ఇవ్వబడింది.

బూదరాజు రాధాకృష్ణగారి ప్రాచీనాంధ్ర శాసనాలు (క్రీ.శ.1100 వరకు) పాఠ, పదకోశ, సంగ్రహ భాషా చరిత్రలతో 1971 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించింది. ఇందులో క్రీ.శ. రెండు-పదకొండు శతాబ్దాల మధ్యనగల 900 సంవత్సరాల కాలములోని 269 పూర్తి శాసనాలుగాని, తెలుగు పదాలున్న శాసనాలుగాని ఉన్నాయి. ఈ గ్రంథములోని శాసనాలలోని ముఖ్య పదాలకు అర్థవివరణతోపాటు పదప్రయోగ విశేషాలుకూడా ఇవ్వబడ్డాయి. వీటిలో చాల పదాలు అంతకు పూర్వము నిఘంటువులకెక్కనివి ఉన్నాయి. **'ఈ శాసనాలన్నీ ఒక చోట దొరికేవి కావు. ఒకరు ప్రచురించినవికావు. ఇందులో కొన్ని ఇంతకుముందు ఎవరూ ప్రకటించనివి కూడా ఉన్నాయి'** అని పీఠికలో రచయిత పేర్కొన్నాడు.

నేలటూరి వేంకటరమణయ్య గారి సంపాదకత్వంలో మెకంజీ సేకరించిన కడపజిల్లా లోని శాసనాలను 1972 సంవత్సరంలో మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయము వారు 'కడప శిలాశాసనములు వగయరా' అనుపేరిట ప్రచురించారు. ఇందులో కడప తుకిడి దూపాడు శిలాశాసనములు అనే అధ్యాయంలో త్రిపురాంతకంలోని కొన్ని శాసనాలు ప్రకటింపబడ్డాయి.

శాసన పరిశోధనపై అనేక ఆంగ్ల గ్రంథాలు వెలువడ్డాయి. ప్రతిసంవత్సరము ఎన్నో వస్తున్నాయికూడా. ఇటువంటి గ్రంథాలు ప్రాంతీయ భాషలలో లేకపోవడం శోచనీయం. శాసనాల గురించి తెలుగులో రచనలు చాల తక్కువ. శ్రీ బి.ఎన్. శాస్త్రి గారు ఆ లోటును పూడ్చుటకుగాను తగు శ్రద్ధతో శాసనాలను సేకరించుటయేగాక వాటిని శాసన సంపుటి (1974), త్రిపురాంతక దేవాలయ శాసనములు (1984), కందూరి చోడుల శాసనములు-చరిత్ర సంస్కృతి (1984), బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసనములు (1985) ముఖలింగం దేవాలయ చరిత్ర - శాసనములు (1985) చెరకురెడ్డి వంశ చరిత్ర - శాసనములు (1989), గోల్కొండ చరిత్ర, సంస్కృతి - శాసనములు (1989), రేచెర్ల వంశ చరిత్ర - శాసనములు (1989), రేచెర్ల పద్మనాయకులు (1991), కాయస్థ రాజులు (1991), వేములవాడ చరిత్ర - శాసనములు (1994), మల్యాలవంశ చరిత్ర - శాసనములు (1994) అనే గ్రంథాలుగా ప్రచురించారు. తద్వారా చరిత్ర, భాషా, శాసన పరిశోధకులకు యెంతో మేలు చేసిన ధన్యజీవి శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు.

× × ×

శ్రీ బి.ఎన్. శాస్త్రి గారు రచించిన 'త్రిపురాంతక దేవాలయ శాసనములు' అను గ్రంథాన్ని మూసీ పబ్లికేషన్స్ (మూసీ సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక), హైదరాబాదువారు 1984లో ప్రచురించారు. ఈ గ్రంథం 1991 లో ద్వితీయ ముద్రణ కూడా పొందింది. ఈ గ్రంథం జగద్గురువులు, పుష్పగిరి పీఠాధిపతులు, శ్రీమదభినవోద్దండ శ్రీ శ్రీ శ్రీ విద్యానృసింహ భారతీస్వామి వారికి అంకితమివ్వబడింది.

ఆంధ్రప్రదేశ్ లో ప్రకాశం జిల్లాలో మండల కేంద్రమైన త్రిపురాంతకంలో కుమారగిరి లేదా కుమారాద్రి అను కొండపై గల ప్రముఖ శైవక్షేత్రం త్రిపురాంతకేశ్వరాలయం. భారతదేశ ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలలో ఒకటైన శ్రీశైల క్షేత్రానికి గల అష్టద్వార క్షేత్రాలలో త్రిపురాంతకము ప్రాగ్ద్వారము. శ్రీ బి.ఎన్.శాస్త్రి గారు 1964 జూన్ మాసములో త్రిపురాంతకంలో 72 శాసనాలను, 1983 సంవత్సరములో 33 శాసనాలను సేకరించి, కొన్ని శాసన శిలల ఛాయాచిత్రాలను, ఆలయ, ద్వార, గోపురముల ఛాయాచిత్రాలను తీసికొని, శాసన పాఠాలను చదివి, పరిష్కరించి, సంక్షిప్తముగా శాసనాలకు విషయ వివరణ వ్రాసి, ఈ గ్రంథాన్ని ప్రచురించుట జరిగింది.

ఈ గ్రంథంలో త్రిపురాంతకము, త్రిపురాంతకేశ్వరాలయము, చీకటిమిద్దె, త్రిపురాంతకేశ్వరాలయము - గర్భగుడి, ముఖమండపము, బాలా త్రిపురసుందరి ఆలయము, త్రిపురాంత కేశ్వరాలయ పరిసరములు, శ్రీపర్వత పురాణము, త్రిపురాంతక శాసనములు - అగ్రహారములు - భూములు, దీప దానములు, త్రిపురాంతక దేవాలయ నిర్వహణాధికారులు, వెలనాటి చోడులు, కాకతీయులు, కాయస్థ వంశీయులు, రెడ్డి రాజులు, త్రిపురాంతక శాసనములు-సాంఘిక పరిస్థితులు, త్రిపురాంతక దేవాలయ శాసనములు అను శీర్షికలున్నాయి.

భారతదేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలగురించి, శ్రీశైలక్షేత్రానికిగల ఎనిమిదిద్వారముల గురించి, కుమారాద్రిపై నిర్మింపబడిన త్రిపురాంతకేశ్వరాలయము గురించి, ఆలయంలోని చీకటిమిద్దె, ఆలయము వెనుక ఉన్న చిన్న చిన్న గుళ్ళ గురించి, ఆలయ వాస్తు, శిల్పాలు, అక్కడున్న వీరశిలలు, కుమారాద్రికి సమీపంలోని చెరువు వద్ద నిర్మింపబడిన బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయము, మల్లీశ్వరాలయం గురించి, త్రిపురాంతకము పరిసరాలలోగల పాపవినాశ, అంగారేశ్వర, మూల స్థానేశ్వర, సోమేశ్వర, ఖడ్గేశ్వర, కన్యాసిద్ధేశ్వర, కేదారేశ్వర, మల్లికార్జున, కపిలేశ్వర, గౌరీశ్వర, ఉత్తరేశ్వర, అను ఏకాదశ రుద్రస్థానముల గురించిన వివరాలను శాస్త్రిగారు ఈ గ్రంథంలో పొందుపరచారు.

త్రిపురాంతకంలో లభించిన శాసనాలలో క్రీ.శ. 1108 నుండి క్రీ.శ.1386 వరకు త్రిపురాంతకేశ్వరునికి, త్రిపురాదేవికి వివిధ వంశాల రాజులు, వారి సామంత మాండలికులు, దండనాయక, సేనాపతి, మంత్రి, పురోహిత, సామాన్య, ధనిక వర్గానికి చెందినవారు, రాణి వాసపుస్త్రీలు, తదితరులు, దీప దానాలు, భూ సువర్ణ గోదానాలు చేశారు. అఖండదీప నిర్వహణకు ఇచ్చిన ఆవులు, మేకలు, ఇనుపెద్లు, పద్దలు, పెయ్యలు, ఆంబోతులు, కోడెలు, ఎద్దుల వివరాలు, శాసనాలలో పేర్కొన్న అగ్రహారాలు, భూములు, వివిధ వంశీయులు, ప్రజలు ఇచ్చిన అఖండదీపదాన వివరాలు 'అగ్రహారములు- భూములు' అనే పట్టిక ద్వారాను, 'అఖండ దీపదానములు' అనే పట్టిక ద్వారాను శాస్త్రిగారు పాఠకుల సౌకర్యార్థం ప్రకటించారు. ఈ పట్టికలవలన శాసన విషయాలను సామాన్య పాఠకులు సులభంగా అవగాహన చేసుకొనుటకు వీలగుచున్నది. 'అగ్రహారములు-భూములు' అనే పట్టికలో ఆలయ నిర్వహణకు గ్రామాలు, భూములు దానంగా ఇచ్చిన శాసనాలు 19 ఉన్నాయి. ఈ 19 శాసనాలలో ఏ యే గ్రామాలు దానంగా ఇవ్వబడ్డాయో, ఏయే గ్రామాలలోని భూమిదానంగా ఇవ్వబడిందో వివరించబడింది. 'అఖండ దీపదానములు' అనే పట్టిక వలన అఖండదీప నిర్వహణకు 1276 ఆవులు, 125 ఇనుపెద్లు, మేకలు, 123 పద్దలు, పెయ్యలు, 127 ఆంబోతులు, కోడెలు, ఎద్దులు దానంగా ఇవ్వబడినట్లు తెలుస్తున్నది. శాస్త్రిగారు ఈ పట్టికలో చేర్చలేదు కాని గుర్రాన్ని దానమిచ్చిన శాసనం ఒకటి కనిపిస్తున్నది. క్రీ.శ.1258 నాటి మొల్లల అన్నపరెడ్డి శాసనంలో శ్రీత్రిపురాంతక శ్రీమహాదేవర అఖండదీపానికి మొల్లల అన్నపరెడ్డి తన తల్లి కేతసానికి తన తండ్రి ప్రోలిరెడ్డికి పుణ్యముగా 25 ఆవులను, ఒక గుర్రాన్ని దానమిచ్చినట్లు పేర్కొంటున్నది.

చోళచక్రవర్తులకు సామంతులుగా తీరాంధ్రదేశమును పాలించిన వెలనాటి చోడుల గురించి ఎన్నో అంశాలను శాస్త్రిగారు ప్రస్తావించారు. మొదటి గొంకరాజు మొదలుకొని పృథ్వీశ్వరుని వరకు గల వెలనాటి రాజుల పాలనాకాలము, రెండవ గొంకరాజు తన కుమార్తె మైలాంబను పల్నాటి హైహయ వంశానికి చెందిన అనుగురాజునకిచ్చి వివాహము చేసి పలనాటి సీమను అరణముగ ఇచ్చిన విషయము, రెండవరాజేంద్రచోళుని మంత్రి నందూరి కొమ్మన శ్రీకూర్మము, ఎలమంచిలి, త్రిపురాంతకం, కొణిదెన మొదలైన 32 నగరాలలో విష్ణు ప్రతిష్ఠలు చేసినట్లు కేయురబాహు చరిత్ర వలన తెలుస్తున్న విషయం, గణపతిదేవుడు వెలనాటి పృథ్వీశ్వరుణ్ణి, మూడవ రాజేంద్రచోడుని సంహరించిన విశేషాలను శాస్త్రిగారు సంవత్సరాలతో సహా వివరించారు. ఐతే పొరపాటున చందవోలు, ధనదుప్రోలు వెలనాటి చోడుల రాజధానులుగా వర్ధిల్లిన నగరాలని శాస్త్రిగారు పేర్కొన్నారు. బహుశా

తీరాంధ్రప్రాంత గ్రామనామాల గురించి తెలియక అలా వ్రాసి ఉండవచ్చు. వెలనాటి మండలేశ్వరులకు గుంటూరు జిల్లాలోని పిట్టలవానిపాలెం మండలములోని చందవోలు (చందోలు) రాజధాని. దీనికే సనదవ్రోలు, ధనదుపురము, ధనదుప్రోలు అనే నామాంతరాలున్నాయి. వెలనాటి గొంకరాజు ద్రాక్షారామ శాసనంలో అతడు వెలనాటిలో ధనదేశ్వర నగరమునకు (అలకాపురి) సాటివచ్చు సనదవ్రోలు పట్టణమును ఏలుచున్నాడని చెప్పబడింది. (చూడుము – ప్రాచీనాంధ్ర చారిత్రిక భూగోళము,పేజి 307).

కాకతీయుల గురించిన అన్ని అంశాలను సంగ్రహంగా శాస్త్రిగారు ఈ గ్రంథంలో పేర్కొన్నారు. కాకతీయులు రాష్ట్రకూట వంశ సంజాతులని మొదటి బేతరాజు మొదలుకొని ప్రతాపరుద్రుని వరకు కాకతీయుల గురించిన అన్ని అంశాలను సంగ్రహంగా శాస్త్రిగారు ఈ గ్రంథంలో పేర్కొన్నారు. కాకతీయుల విజయాలను, పరాజయాలను, ఇతర రాజవంశాలతో వారికిగల వైవాహిక సంబంధాలు, వారి రాజ్య విస్తరణ, వారి పాలానాకాలం మొదలైన కాకతీయ చరిత్రనంతా వివరించారు. కాకతీయులు అనుమకొండ విషయాన్ని పొందడం, కాంచీపురాన్ని జయించడం, సబ్బిసాయిర మండలాన్ని పొందడం, చాళుక్యచక్రవర్తియగు తైలపుడిని ఓడించి బంధించడం, ప్రోలరాజు నేలకొండపల్లి గోవిందరాజును, మంత్రకూటాధిపతియగు గుండనను ఓడించడం, వెలనాడు దండయాత్రలో ప్రోలరాజు మరణం, రుద్రదేవుడు దొమ్మరాజును, కందూరి ఉదయనచోడ, భీమదేవ చోడుల ఓడించడం, భీమదేవచోడుని సోదరియగు పద్మావతీదేవితో వివాహం, పలనాటి యుద్ధంలో జోక్యం కలిగించుకోవడం, వేంగి, కోట, నతవాడి రాజ్యాలపై దండెత్తడం, కాకతి రుద్రుని రాజ్యము శ్రీశైలమువరకు వ్యాపించడం, దేవగిరి యాదవరాజు జైతుగితో జరిగిన యుద్ధంలో కాకతి రుద్రుని మరణం, మహాదేవరాజు యాదవరాజ్యము పై దండెత్తడం, ఆ యుద్ధంలో మహాదేవరాజు మరణం, అతని కుమారుడైన గణపతిదేవుని యాదవులు బంధించడం, కాకతి సేనానులు, మంత్రులు యాదవరాజుకు నచ్చచెప్పి గణపతిదేవుని చెరనుండి విడిపించడం, గణపతిదేవుడు తన సోదరీమణులగు మైలాంబిక, కుందాంబికలను నతవాడి రుద్రునకిచ్చి వివాహం చేయడం, దివిరాజగు జాయపసేనాని సోదరీమణులను వివాహమాడడం, జాయపసేనానికి గజసాహిణి పదవినివ్వడం, తన కుమార్తెలైన గణపాంబను కోట బేతరాజుకు, రుద్రమదేవిని చాళుక్య వీరభద్రేశ్వరునకు ఇచ్చి వివాహాలు జరిపించడం, ఈ సంబంధ బాంధవ్యాలవలన గణపతిదేవ మహారాజు వెలనాడు, వేంగి ప్రాంతాలపై ఆధిపత్యం పొందడం, క్రీ.శ. 1224 నాటికి ఒంగోలు, అద్దంకి, పొదిలి, కొణిదెన, దర్శి, పొత్తపి ప్రాంతాలు కాకతీయ సామ్రాజ్యంలో విలీనంకావడం, కళింగ దండయాత్ర లో

విజయం సాధించడం, నెల్లూరు మండల పాలకుడు మనుమసిద్ధికి సైన్యసహాయ మొనర్చడం, కొప్పెరుంజింగను యుద్ధంలో ఓడించడం, యావద్దక్షిణాపథాన్ని జయించి మైసూరువరకు కాకతీయుల అధికారాన్ని వ్యాపింప చేయడం, కృష్ణా, తుంగభద్రా నదుల దక్షిణ ప్రాంతాలను జయించి సామ్రాజ్యాన్ని కాంచీనగరం వరకు విస్తరింపచేయడం, గణపతిదేవుని అవసానకాలంలో జటావర్మ సుందరపాండ్యుడు విజృంభించి, కాకతీయ రాజ్యంపై దండెత్తి కొన్ని ప్రాంతాలను జయించడం, కాకతీయ సేనానులు తరువాత కొంతకాలానికి సుందర పాండ్యునోడించి తమ సామ్రాజ్య భాగాలను తిరిగి వశపరుచుకొనడం, రుద్రమదేవి రుద్రదేవమహారాజు అనే పేరుతో క్రీ.శ. 1280 లో సింహాసన మధిష్ఠించడం, సామంతులైన సిద్ధయచోడుడు, ఏఱువమల్ల, కేశవదేవ, అల్లుగంగ, మల్లికార్జున, దామోదరుల తిరుగుబాటు, కొప్పెరుంజింగడు దండెత్తివచ్చుట, అంబదేవుడు, త్రిపురాంతకుడు మొదలగు సేనానుల సహాయంతో రుద్రమదేవి ఆ తిరుగుబాటును అణచివేయడం, కాకతీయ రాజ్యంపై దండెత్తి హరిహరదేవ, మురారిదేవులతో సఖ్యము చేసి ఓరుగల్లు శిలాప్రాకారాలను భేదించి వశపరచుకొన్న దేవగిరి యాదవరాజును, అతని అనుచరులను, పరివారమును, సైన్యమును రుద్రమదేవి అవలీలగ ఓడించి సామ్రాజ్య సరిహద్దులవరకు తరిమివేయడం, ఓరుగల్లు నగర అభివృద్ధి, కోట, అగడ్త, బురుజుల నిర్మాణం, కోటను రుద్రమ శత్రుదుర్భేద్యమొనర్చడం, మార్కోపోలో కాకతీయ రాజ్యాన్ని దర్శించి కాకతీయ రాజ్యవిశేషాలను, ఓరుగల్లు దుర్గాన్ని గురించి తన గ్రంథంలో వ్రాసుకోవడం, (మార్కోపోలో కాకతీయ రాజ్యంలోని మోటుపల్లి ఓడరేవును గురించి, ఆరాజ్యంలో తయారయ్యే సన్నని నూలువస్త్రాల గురించి, వజ్రాల గనుల గురించి మాత్రమే వ్రాసినట్లున్నది కాని ఓరుగల్లు దుర్గాన్ని గురించి వ్రాసినట్లు కనిపించదు.) ప్రతాపరుద్రుని కాలంలో అంబదేవుడు, నెల్లూరి చోడుల తిరుగుబాటును అణచివేయడం. క్రీ.శ.1311లో తురుష్కులతో యుద్ధాలు, పాండ్యుల దాడి, ఎఱ్ఱదాచానాయక, ఇందులూరి రుద్రయ సేనానులు వారిని తరిమివేయుట, రుద్రదేవుడు గండికోటపై దండెత్తి జయించడం, కంపిలు నోడించి క్రీ.శ. 1314 నాటికి యుద్ధ యాత్రలు ముగించుకొని ఓరుగల్లు చేరడం, తురుష్క దండయాత్ర, క్రీ.శ.1323-1324లో ఓటమిపాలైన ప్రతాపరుద్రుని బందీగా హస్తినాపురము తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో ప్రతాపరుద్రుడు మరణించడంతో కాకతీయ సామ్రాజ్యం అంతరించడం మొదలైన అన్ని అంశాలను క్లుప్తంగా వివరించారు.

కాయస్థ వంశంలోని గంగయ సాహిణి, జన్నిగదేవుడు, త్రిపురాంతకుడు, అంబదేవుల గురించి వారు కాకతీయులవద్ద సేనానులుగాను, బాహత్తరనియోగాధిపతులు గాను, మండలేశ్వరులుగాను ఉన్నట్లు, త్రిపురాంతకంలోనే గాక ఇతర ప్రాంతాలలో లభించిన వారి శాసనాల గురించి, వారికున్న బిరుదులు, వారు పాలించిన ప్రాంతాలు, రుద్రమపై అంబదేవుని తిరుగుబాటు మొదలైన అంశాలను శాస్త్రిగారు ఈగ్రంథంలో వివరించారు.

కొండవీడును పాలించిన రెడ్డిరాజులలో ప్రోలయ వేమారెడ్డి, అనపోతారెడ్డి, కుమారగిరిరెడ్డి, పెదకోమటి వేమారెడ్డి, రాచవేమారెడ్లను గురించి మాత్రమే శాస్త్రిగారు వ్రాశారు. ఏకారణముచేతనో కొండవీటి రాజులలో మూడవవాడైన అనవేమారెడ్డి గురించి ఏమీ వ్రాయలేదు. రెడ్డిరాజుల విజయాలు మోటుపల్లి ఆక్రమణ, వారి రాజ్యవిస్తరణ, వారి పాలనాకాలము, వారి బిరుదులు కళింగ, గాంగ, చోడభక్తిరాజు, అల్లావుద్దీన్, విజయనగర రాజులతోను, రాచకొండ పద్మనాయకులతో జరిగిన యుద్ధాలు, రాజమహేంద్రవర రెడ్డిరాజుల గురించి, వారి సాహిత్య పోషణ మొదలగు అంశాలను చాల సంగ్రహంగా వివరించారు.

× × ×

## త్రిపురాంతక శాసనములు

ప్రకాశం జిల్లాలో మండల కేంద్రమైన త్రిపురాంతకంలో గల ప్రముఖ శైవక్షేత్రం త్రిపురాంతకేశ్వరాలయ ప్రాంగణంలో స్తంభాలపైన, గోడలపైన శాసనాలు తొలచబడి ఉన్నాయి. ఇవి భారతప్రభుత్వ శాసన పరిశోధన శాఖవారి South Indian Inscriptions సంపుటాలలో ప్రచురింపబడ్డాయి. ఆ సంపుటాలు సామాన్య పాఠకులకు, పరిశోధకులకు లభించడంలేదు. ఆ కొరత తీర్చుటకై శాస్త్రిగారు ఈ గ్రంథాన్ని ప్రచురించారు. ఈ గ్రంథంలో 105 శిలాశాసనాలున్నాయి. కల్యాణీ చాళుక్య, వెలనాటి చోడ, పొత్తపి చోడ, ఏఱువ చోడ, మనుమకుల, కాకతీయ, నతవాడి, చాగి, కొండపడుమటి, కాయస్థ, చాళుక్య, ఇందులూరి, పరిచ్ఛేది, రేచర్ల, రెడ్డి రాజుల, విజయనగర రాజ వంశాల, వారి సామంత, మాండలికుల, దండనాయక, సేనాపతి, మంత్రి, పురోహిత, సామాన్య, ధనికవర్గాలకు చెందిన వారి శాసనాలు ఇక్కడ లభించాయి. శాస్త్రిగారు తాను సేకరించిన శాసనాలను South Indian Inscriptions ప్రచురించబడిన శాసనాలతో సరిచూచుకొని, క్రొత్తగా లభించిన శాసనాలను అనుబంధంలో (శాసనం నెం. 91 నుండి 105 వరకు) చేర్చారు. ఈ శాసనాలలో 'త్రిపురాంతకేశ్వరాలయంలోని చీకటిమిద్దె నాలుగు గోడలపైనా, చీకటిమిద్దె తూర్పు, ఉత్తర గోడలకు ఆనుకొని ఉన్న శిలా స్తంభాలపైనా, నంది స్తంభాలపైనా 56

శాసనాలు చెక్కబడినవి. తక్కిన శాసనాలు, త్రిపురాంతక శ్రీమన్మహాదేవుని ఆలయగోడలపైనా, ఇతర దేవాలయములోను, మూలస్థానేశ్వరాలయమున గల శిలా స్తంభాలపైనా చెక్కబడినవి'. వీటిలో కొన్ని శాసనాలు శిథిలమైనట్లు, మరికొన్ని శాసనాలు అక్షరాలు చెదరిపోయినట్లు శాస్త్రిగారు వ్రాశారు.

శాస్త్రిగారు వ్రాసిన ప్రకారం త్రిపురాంతకంలో లభించిన శాసనాలలో కల్యాణీ చాళుక్యుల శాసనాలు 2, వెలనాటి చోడుల శాసనాలు 5, కాకతీయుల శాసనాలు 14, కాయస్థుల శాసనాలు 9, రెడ్డిరాజుల శాసనాలు 2, నతవాడి వంశీయుల శాసనాలు 5, చాగి వంశీయుల శాసనాలు 4, ఇందులూరి వంశీయుల శాసనాలు 2, పరిచ్ఛేది వంశీయుల శాసనాలు 2, విజయనగర రాజుల శాసనాలు 1. తక్కిన శాసనాలన్నీ వివిధ వంశీయులకు సంబంధించినవి. అందులో అధిక భాగం దీపదానాలకు చెందినవి. త్రిపురాంతకంలో కోటవంశీయుల, స్థానాధిపతుల, శివమత గురువుల, గోళకీ మఠాధిపతుల శాసనాలున్నాయి. ఈశాసనాలలో క్రీ.శ. 1108 నుండి క్రీ.శ. 1386 వ సంవత్సరము వరకు వివిధ వంశీయులు వేయించిన శాసనాలున్నాయి. క్రీ.శ. 1386 సంవత్సరం తరువాత కాలంనాటి శాసనాలు త్రిపురాంతకంలో ఇప్పటివరకు లభించలేదు అని శాస్త్రిగారు వ్రాసారు కాని రెండహరిహరరాయల 1385 నాటి శాసనం, విజయబుక్కరాయల క్రీ.శ. 1423 నాటి శాసనం, రెండవదేవరాయల క్రీ.శ. 1441 నాటి శాసనం త్రిపురాంతకంలో కనిపిస్తున్నందున క్రీ.శ. 1441 సంవత్సరం నాటి రెండవదేవరాయల శాసనం తరువాత కాలంనాటి శాసనాలు త్రిపురాంతకంలో ఇప్పటివరకు లభించలేదు అని భావించాల్సి వస్తున్నది.

బి.ఎన్.శాస్త్రిగారి **'త్రిపురాంతక దేవాలయ శాసనములు'** గ్రంథంలో ప్రచురింపబడిన 105 శాసనాల జాబితా. South Indian Inscriptions లో ప్రచురింపబడిన శాసనాల జాబితా.

**త్రిపురాంతక దేవాలయ శాసనములు South Indian Inscriptions**

1. కరికాలచోడ మహారాజు శాసనము Vol. X No.62 (A.R.No.265 of 1905)
2. వెలనాటి మొదటి గొంక రాజు శాసనము Vol. X No.63 (A.R.No.277 of 1905)
3. పొత్తపి కామదేవచోడ మహారాజు పూజారి శ్రీధరభట్టు శాసనము Vol. X No.235 (A.R. No. 267 of 1905)
4. పొత్తపి కామదేవ చోడ మహారాజుల ప్రెగ్గడ భీమయ శాసనము Vol.X No.67 (A.R. No. 262 of 1905)

47. మొల్లల అన్నపరెడ్డి శాసనము Vol. X No.359 (A.R.No.2157 of 1905)

48. అల్లాడ పెమ్మయదేవ మహారాజు శాసనము Vol. X No.362 (A.R.No.217 of 1905)

49. నతవాడి కుమార గణపతిదేవ మహారాజు శాసనము Vol. X No.367 (A.R.No.181 of 1905)

50. కురపాటి సూరారెడ్డి, ఎఱకసాని శాసనము Vol. X No.368 (A.R.No.220 of 1905)

51. ఇందులూరి గన్నయ శాసనము Vol. X No.369 (A.R.No.213 of 1905)

52. గండపెండారు జన్నిగదేవ మహారాజు శాసనము Vol. X No.370 (A.R.No.208 of 1905)

53. కాకతి గణవతిదేవ మహారాజు శాసనము Vol. X No.371 (A.R.No.196 of 1905)

54. సిద్ధశివులకువిప్రులకు, మఠములకు, సత్రముల కొసంగిన భూదానశాసనము Vol.X No. 388 (A.R.No.282 of 1905)

55. ఇందులూరి గన్నయ శాసనము Vol. X No.394 (A.R.No.214 of 1905)

56. రుద్రదేవమహారాజు సేనాపతి శాసనము Vol. X No.398 (A.R.No.194 of 1905)

57. కరుమాణిక్క పెరుమాడినాయకుని శాసనము Vol. X No.400 (A.R.No.272 of 1905)

58. తంమిరాజు శాసనము Vol. X No.407 (A.R.No.207 of 1905)

59. నారెవ శాసనము Vol. X No.414 (A.R.No.247 of 1905)

60. సిద్దయదేవచోడ మహారాజు శాసనము Vol. X No.415 (A.R.No.175 of 1905)

61. ఏఱువ మనుమిలి దేవరాజు శాసనము Vol. X No.417 (A.R.No.190 of 1905)

62. ఏఱువరాజు శాసనము Vol. X No.418 (A.R.No.189 of 1905)

63. పరిచ్ఛేద వడమాని కోట దేవరాజు శాసనము Vol. X No.426 (A.R.No.222 of 1905)

64. మాడప విలక శాసనము Vol. X No.428 (A.R.No.246 of 1905)

65. నానాదేశ వర్తకుల శాసనము Vol. X No.429 (A.R.No.192 of 1905)

66. పరిచ్ఛేద భీమరాజు శాసనము Vol. X No.430 (A.R.No.193 of 1905)

67. గండపెండారు త్రిపురారిదేవ మహారాజు శాసనము Vol. X No.431 (A.R.No.248 of 1905)

68. గండపెండారు అంబదేవ మహారాజు శాసనము Vol. X No.432 (A.R.No.168 of 1905)

69. మంతెవల్లభుని రామయ శాసనము Vol. X No.457 (A.R.No.206 of 1905)

70. సవదర అంబయరెడ్డి శాసనము Vol. X No.460 (A.R.No.242 of 1905)

71. గండపెండారు అంబదేవ మహారాజు శాసనము Vol. X No.464 (A.R.No.174 of 1905)

72. గండపెండారు అంబదేవ మహారాజు శాసనము Vol. X No.465 (A.R.No.268 of 1905)

73. మాండలిక ఖదేవుని శాసనము Vol. X No.466 (A.R.No.173 of 1905)

74. కంటులూరి అన్నలదేవుని శాసనము Vol. X No.467 (A.R.No.238 of 1905)

75. గండపెండారు అంబదేవుని శాసనము Vol. X No.470 (A.R.No.174A of 1905)

76. రేచర్ల ముమ్మడినాయుని శాసనము Vol. X No.471 (A.R.No.183 of 1905)

77. వర్తకులు సంఘీభావముతో వేయించిన శాసనము Vol. X No.473 (A.R.No.180 of 1905)

78. విక్రమోత్తుంగ రాజేంద్రచక్రవర్తి శాసనము Vol. X No.474 (A.R.No.170 of 1905)

79. మలిరెడ్డి మారెడ్డి శాసనము Vol. X No.475 (A.R.No.172 of 1905)

80. అడిదంమల్లు శాసనము Vol. X No.479 (A.R.No.179 of 1905)

81. ఉభయ నానాదేశి పెక్కంద్ర శాసనము Vol. X No.480 (A.R.No.45 of 1909)

82. ఒల్లయ రెడ్డి శాసనము Vol. X No.497 (A.R.No.260 of 1905)

83. ఆలయసిబ్బంది, అర్చకులు వేయించిన శాసనము Vol. X No.502 (A.R.No.233 of 1905)

84. నేమాని పినవిచయ ప్రెగ్గడ శాసనము Vol. X No.530 (A.R.No.178 of 1905)

85. పోతిరెడ్డి తల్లయరెడ్డి శాసనము Vol. X No.548 (A.R.No.261 of 1905)

86. రామభూపాలుని తనయ పోతాంబ శాసనము Vol. X No.550 (A.R.No.230 of 1905)

87. తపోజు కూతురు నాగలదేవి శాసనము Vol. X No.551 (A.R.No.191 of 1905)

కాని శాస్త్రిగారు ప్రచురించిన 105 శాసనాలలో ఒక్క తమిళ శాసనము కూడా లేదు. అంతేకాక దేవనాగరి లిపిలో శాసనాలున్నట్లును కనిపించదు. శాస్త్రిగారు ప్రచురించిన 48 శాసన శిలల ఛాయాచిత్రాలలో మనకు ఎక్కడా తమిళ, దేవనాగరి లిపి ఉన్న శాసనాలు కనపడవు. దీనికి కారణము శాస్త్రిగారు తమిళ, దేవనాగరి లిపులున్న శాసనాలను ఈ సంపుటంలో చేర్చకపోవడమే. రెండవ కొప్పెరజింగుని మూడుశాసనాలు ఈ శాసనసంపుటిలో చోటుచేసుకోలేదు. అవి మూడు మూడు లిపులలో ఉన్నాయి. ఒకటి తమిళలిపి, మరొకటి దేవనాగరి లిపి, ఇంకొకటి తెలుగు లిపి లోను ఉన్నాయి. వీటిలో గ్రంథ లిపిలో ఉన్న తమిళ శాసనము మాత్రము South Indian Inscriptions 12వ సంపుటంలో నెం. 247 (A.R. No.198 of 1905)గా ప్రకటింపబడింది. త్రిపురాంతకేశ్వ రాలయం వంటగది ఉత్తర గోడపై ఈశాసనము చెక్కబడింది. గ్రంథ లిపిలో ఉన్న ఈ శాసనం మహారాజసింహుని (రెండవ కొప్పెరజింగుడు) ప్రశస్తిని తెలియ చేస్తుంది. ఈ శాసనంలో పెర్కొన్న విషయాలే ఆ గోడపైనే ఉన్న నాగరిలిపి శాసనంలోను (A.R. No.202 of 1905), తెలుగు శాసనము లోను (A.R. No.197 of 1905) ఉన్నాయి. ఐతే ఈ రెండు శాసనాలు అముద్రితాలు.

శాస్త్రిగారు ప్రచురించిన త్రిపురాంతకము దేవాలయ శాసనములలో 105 గాక మరికొన్ని శాసనాలున్నాయి అవి.

1. కళ్యాణి చాళుక్య చక్రవర్తి త్రిభువనమల్లదేవుని క్రీ.శ. 1126 నాటి శాసనము. South Indian Inscriptions సంపుటం IX No. 212 (A.R. No.276 of 1905) త్రిపురాంతకేశ్వరాలయంలో మూసి ఉన్న పశ్చిమ ద్వార ప్రాకారాన్ని ఆనుకొని ఉన్న శిలపై గల శాసనము. ఈ శాసనము కళ్యాణి చాళుక్య చక్రవర్తి త్రిభువనమల్లదేవుడు జయంతిపురాన్ని రాజధానిగా పాలిస్తున్నప్పుడు చాలుక్య విక్రమ శకం 51వ సంవత్సరం (క్రీ.శ. 1126) పరాభవ, జ్యేష్ఠ అమావాస్య సోమవారం సూర్యగ్రహణ కాలములో ఈ శాసనము జారీచేయబడింది. త్రిభువనమల్లుని మహాప్రధాని అనంతపాల దండరస శ్రీ త్రిపురాంతక దేవర అంగరంగ భోగాలకు, ధూపదీప నైవేద్యాలకు, ఖండస్ఫుటిత జీర్ణోద్ధరణకు మొట్టవాడి నాడులోని చాపలమడుగు గ్రామాన్ని దానంగా ఇస్తున్నట్లు ఈ శాసనము పేర్కొంటున్నది.

2. అనవోతారెడ్డి క్రీ.శ. 1356 నాటి శాసనం, South Indian Inscriptions సంపుటం X, No.555 (A.R.No.185 of 1905).

3. రెండవ హరిహరరాయల క్రి.శ. 1385 నాటి శాసనం, South Indian Inscriptions సంపుటం XVI, No.7 (A.R.No.270 of 1905).

4. విజయబుక్కరాయల క్రీ.శ. 1423 నాటి శాసనం, South Indian Inscriptions సంపుటం XVI, No.26 (A.R.No.255 of 1905).

5. రెండవ దేవరాయల క్రీ.శ. 1441 నాటి శాసనం, South Indian Inscriptions సంపుటం XVI, No.33 (A.R.No.269 of 1905).

కల్యాణి చాళుక్య చక్రవర్తి త్రిభువనమల్లదేవుని శాసనం ఒకటి, రెండవ కొప్పెరజింగుని మూడు శాసనాలు, రెడ్డిరాజుల శాసనం ఒకటి, విజయనగర రాజుల మూడు శాసనాలతో మొత్తం త్రిపురాంతకంలోని శాసనాల సంఖ్య 113 కు పెరిగింది.

శాస్త్రిగారు త్రిపురాంతక దేవాలయ శాసనాలలో పేర్కొనబడిన సీమల జాబితాను తయారుచేశారు. ఆ సీమలు - వెలనాడు (శాసనము నెం. 1), కమ్మనాడు (శాసనము నెం. 53), కొండపల్లినాడు (శాసనము నెం. 9), వలనాడు (శాసనము నెం. 52), నతవాడి (శాసనము నెం. 11), కొనకంద్రవాడి, పూంగినాడు (శాసనము నెం. 46, 53), మార్జవాడి (శాసనము నెం. 1), పొత్తపినాడు (శాసనము నెం. 3), నుడపలి కంపణము (శాసనము నెం. 12), దువలి కంపణము (శాసనము నెం. 33), దువ్వ కంపణము (శాసనము నెం. 44), మెటవాడి (శాసనము నెం. 43. 88), ఎఱువ (శాసనము నెం. 11), వేంగి (శాసనము నెం. 88). కాని ఆ సీమలు ఏ యే ప్రాంతాలలో విస్తరించాయో వివరించలేదు. ఆ వివరణ కూడా ఇచ్చివుంటే పాఠకులకు ఉపయోగంగా వుండేది.

శ్రీ శాస్త్రి గారు ఈ శాసనాలలోని తెలుగుభాష - పద ప్రయోగాలు, వ్రాత, వ్యాకరణము మొదలగు వాటి గురించి చక్కని పరిశీలనచేసి ఎన్నో విషయాలను విశ్లేషించటం భాషపై వారికున్న పట్టును తెలియజేస్తున్నది.

× × ×

'త్రిపురాంతక క్షేత్ర చరిత్ర నాకు తెలిసినంత వరకు వ్రాసినాను. ఈ గ్రంథమసమగ్ర మనియే నా నమ్మకము, కాని, భావి పరిశోధకులకు ఉపయోగముగా నున్నయెడల నా కృషి ఫలించినదని భావింతును', అని వ్రాయుట వారి సహృదయతకు అద్దం పడుతున్నది. మొత్తముమీద ఈ గ్రంథము పరిశోధకులకు మిక్కిలి ఉపయోగపడుతుందనుటలో సందేహం లేదు. గ్రంథములో అనేక ముఖ్యాంశాలున్నా లోపాలుగూడ కొన్ని ఉన్నాయి. అందులో అచ్చుతప్పులు ముఖ్యమైనవి. శాసన ప్రతిబింబాలు లేదా శాసన శిలల ఛాయాచిత్రాలు



# కందూరి చోడుల శాసనములు : చరిత్ర - సంస్కృతి

భిన్నూరి నరసింహశాస్త్రిగారు బి.ఎన్.శాస్త్రిగా, శాసనాల శాస్త్రిగా ప్రసిద్ధి పొంది, శాసన పరిశోధన ఉచ్ఛ్వాసముగా, చరిత్ర రచన నిశ్వాసముగా జీవించి, ఆంధ్రుల చరిత్రను అందునా తెలంగాణ ప్రాంత చరిత్ర గతిని మార్చిన మహనీయుడు. ఆంగ్లేయుల నుండి ఆధునిక చరిత్ర పరిశోధకుల వరకు ఎందరో తెలంగాణ ప్రాంత చరిత్రపై పరిశోధన చేసినప్పటికీ, తెలంగాణ ప్రాంతంలో పుట్టి పెరిగి ఈ ప్రాంత చరిత్రను వెలికి తీసిన వారిలో ప్రథములు శ్రీ శాస్త్రిగారు.

వీరు శాసన సంపుటాలు, దేవాలయ శాసనులు, వంశ చరిత్రలు ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి (3 భాగములు), భారతదేశ చరిత్ర - సంస్కృతి (21 భాగములు), మండల సర్వస్వములు, జిల్లా సర్వస్వములు, రెడ్డిరాజ్య సర్వస్వము, బ్రాహ్మణ రాజ్య సర్వస్వము ఇత్యాదిగా ఎన్నో చారిత్రక గ్రంథాలను వెలువరించారు. "కందూరిచోడుల శాసనములు చరిత్ర - సంస్కృతి" అనే గ్రంథం వారి అసామాన్య కృషికి, చరిత్ర రచన పట్ల వారికి గల నిబద్ధతకు అక్షర సాక్షి.

శాస్త్రిగారు చరిత్ర రచనలో ఒక వినూత్న విధానమును ప్రవేశపెట్టారు. చెప్పదలచుకున్న విషయమును స్పష్టంగా, ఆధార సహితంగా, సహేతుకంగా, సరళభాషలో చెప్పటమే కాకుండా పాఠకులకు, పరిశోధకులకు తక్షణ విషయావగాహన కొరకు వారు అందలి రాజుల క్రమ పట్టికలను, శాసనముల పట్టికలను, శాసనస్థ వాపీకూప తటాకాది విషయములు, గ్రామనామములు, దేవాలయ నిర్మాణములు, దానగ్రహీత గోత్రనామాలు, ఇత్యాదుల

పట్టికల రూపంలో పొందుపరచి నూత్న పరిశోధకులకు మార్గదర్శకులయ్యారు, సమకాలీన చరిత్ర రచయితలకు ఆదర్శప్రాయులయ్యారు.

కళ్యాణీ చాళుక్యుల గురించి గాని, కాకతీయుల గురించి గాని ఎవరైనా పరిశోధన చేయదలచినప్పుడు తప్పకుండా కందూరి చోడుల గురించి తెలుసుకొని తీరవలసిందే. కారణం కందూరి చోడులు కళ్యాణీ చాలుక్యుల సామతులుగా, తదుపరి కాకతీయులు ఉచ్ఛస్థితికి చేరుకుంటున్న తరుణంలో వారితో వైవాహిక సంబంధములు నెరపి వారికి సామంతులుగా ఉండి నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం ప్రాంతాలలోని కొన్ని భాగాలను సుమారు 250 సంవత్సరములు సుభిక్షంగా పరిపాలించారు. చరిత్ర పరిశోధకులకు ప్రస్తుత గ్రంథం ఆధార గ్రంథంగా ఉపయోగపడుతుంది. ఇది కందూరి చోడుల చరిత్ర - సంస్కృతులపై వెలువడిన సప్రామాణిక గ్రంథం.

శాస్త్రిగారు ప్రస్తుత తమ గ్రంథంలో కందూరిచోడులు ఎవరు, వారి వంశావళి, ఏఱువ చోడులుగా ఉన్న వీరు కళ్యాణీ చాళుక్యులకు సామంతులై వారి మన్నన పొంది, కందూరి చోడులుగా మారి స్వతంత్రులుగా పరిపాలించిన విధము, కాకతీయులతో వైవాహిక సంబంధములు నెరపి చెలిమితో వ్యవహరించిన తీరు, అప్పటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులు, అష్టాదశ ప్రజలు, ద్వాదశ వృత్తుల వారు ఇత్యాదిగా ప్రజల జీవన విధానము వివిధ సందర్భములలో రాజులు, పట్టమహిషులు, సామంతులు, మాండలికులు, దండనాథులు వెలువరించిన శాసనములు, నిర్మించిన దేవాలయ వివరములు, శైవ, వైష్ణవ, జైన, బౌద్ధ మతాలను సామరస్య భావంతో ఆదరించిన తీరు, పండిత, కవి, జనపోషణ, బ్రాహ్మణులకు అగ్రహారములు, భూమి, గోవు, సువర్ణ దానములు, వ్యవసాయాభివృద్ధికై ఈ రాజులు కట్టించిన ఆనకట్టలు, త్రవ్వించిన కాలువలు, ఉదయ సముద్రం, భీమ సముద్రం ఇత్యాది అసంఖ్యాక తటాకముల వివరములు, వీరి గిరి, స్థల, జల, వన దుర్గముల విస్తృతి ప్రాశస్త్యము, విదేశీ వాణిజ్యము ప్రోత్సహించుటకుగాను వాడపల్లి, పెరూరులను ప్రధాన ఓడరేవులుగా తీర్చి సిలోన్, బర్మా మొదలైన దేశములకు, జావా, సుమిత్రా, బోర్నియా మొదలైన దీవులకు ఎగుమతులు జరిపిన తీరు మనల్ని ఆశ్చర్యానందాలకు గురి చేయటమే కాకుండా ఇంకా తెలుసుకోవాలనే తపనను మనలో రేకెత్తిస్తాయి.

ఇంకను శాస్త్రిగారు తెలుగు లిపి పరిణామ క్రమంలో తెలుగు - కన్నడ లిపి నుండి కాకతీయ రుద్రమదేవి కాలానికి గల శాసనములు తెలుగు లిపిలోకి మారిన విధములు తెలిపి అప్పటివరకు లభించిన కందూరి చోడుల నలభై శాసనములలో ముప్పై శాసనములు, ఇతరులకు సంబంధించిన ఎనిమిది శాసనములు ప్రకటించారు. శాసన నకళ్ళు ప్రతిబింబము

నాటికి పానగల్లు మాత్రమే వీరి వంశంలో ఉండెను. అనంతర కాలమున కాకతి రుద్రమదేవి ఏకచ్ఛత్రాధిపత్యము వహించి ఉండెను. ఈ విధంగా కందూరి చోడ వంశీయులు ఏఱువ చోడులుగా తెలంగాణమున స్థిరపడి కందూరిచోడులై సుమారు 250 సంవత్సరములు ప్రజానురంజకముగా పాలన చేశారు.

కందూరి చోడులు కళ్యాణీ చాళుక్యుల పాలనా విధానమును అనుసరించినప్పటికీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగియుండిరి. మహామండలేశ్వరులైన కందూరిచోడ మహారాజుల సైనిక వ్యవస్థ కాకతీయ రాజుల సైనిక వ్యవస్థకు తీసిపోని విధంగా ఉండి సుమారు 31 దుర్గములకు అధిపతులై సువిశాల సామ్రాజ్యమును పాలించుచు సామంత మాండలికులచే కప్పములు గొనుచు దేశమును సుభిక్షముగా పాలించిరి.

గ్రామము ప్రాతిపదికగా పాలన సాగెను. గ్రామములో అష్టాదశ విధములైన ప్రజలు, ద్వాదశ వృత్తుల వారు గ్రామ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుచుండిరి.

ఆనాటి వర్తకులు వర్తక సంఘములు ఏర్పరచుకొని దేశ విదేశ వ్యాపారములు చేయుచుండిరి. వాడపల్లి, కృష్ణానదీ తీరమునున్న ఓడరేవు పట్టణము. అట్లే పెరూరు కృష్ణానదికి ఉపనది అయిన అహల్యానదీ తీరమునున్న నగరము. వీరి కాలము నాటి పెరూరు శాసనము వలన పెరూరు వర్తకమునకు కూడలి అనియు విదేశ వర్తకులు, పార రాష్ట్రిక వ్యాపారులు పెరూరులో స్థిర నివాసులై వర్తక సంఘములు ఏర్పరచుకొని తూర్పు దేశములతోను పల్లవ, చోళ, చాళుక్య రాజ్యమందలి వణిక్ ప్రముఖులతోను వ్యాపారము చేసేవారని తెలియుచున్నది. వర్తకులు సుగంధ ద్రవ్యములు, సన్ననూలు బట్టలు, బంగారు, వెండి వస్తువులు ముత్యములు తదితరములు పెరూరు రేవు నుండి తీసుకొని వెళ్లి తూర్పు దేశాలైన జావా, సుమత్రా, బోర్నియో, కంబోడియా, బర్మా, సిలోన్‌లలో అమ్మేవారు. అంతేగాక ఇచ్చటి వర్తక సంఘములు దేవాలయముల నిర్వహణా బాధ్యత వహించునంతటి ఆర్థిక స్థోమత కలిగియుండిరి.

మూసీనదికి నమిలె వద్ద ఆనకట్ట నిర్మించి పంట కాలువలు త్రవ్వించి, ఆ నీరు నల్లగొండ చేరువలో ఉన్న పానుగంటి ఉదయ సముద్రం లోనికి ప్రవహింపజేసి వ్యవసాయమునకు మిక్కిలి తోడ్పాటందించిరి. వీరి కాలమున ఉదయ సముద్రం, పెద్ద దేవులపల్లి చెఱువు, ఆకారం చెఱువు, గోకవరం కాలువ చెఱువు ఇత్యాదిగా తటాకములు నిర్మితమయ్యెను.

వీరి రాజ్యమున కన్నడిగులు, తెలుగువారు, జైనులు, బౌద్ధులు, వివిధ కులముల వారు కలిసి మెలిసి ఉండిరి. శైవులు, వైష్ణవులు ఇతర మతముల వారితో కలిసి జీవించుచుండిరి.

కందూరిచోడులు అపూర్వ శిల్పకళా శోభితములైన దేవాలయములను సామ్రాజ్యమంతటా నిర్మించిరి. పానుగంటి పచ్చల సోమేశ్వరాలయము, చెన్నకేశవాలయము,

పెరూరు సోమేశ్వరాలయము, కొలనుపాక సోమేశ్వరాలయములలోని శిల్పసంపద ఎన్నదగినది. శిథిల దేవాలయములను పునరుద్ధరించి దేవాలయ నిర్వహణకు, పూజాదికములకు, అంగరంగ భోగములకు, ధూపదీప నైవేద్యములకు అగ్రహారములు, భూ, సువర్ణ, గోవులు, అఖండ దీపముల నిర్వహణకు ఇనుప ఎద్లు దానమిచ్చిరి.

వీరు కవులను, పండితులను, ఆచార్యులను పోషించిరి. వీరి ఆస్థానములో మయూర ఛటోపాధ్యాయుడు, కాలాముఖ శైవ సంప్రదాయానుసారులైన ఆచార్యులు ఉండిరి. ఈ కాలమున శైవమత సంబంధిత గ్రంథములు, శివలీలా విలాసము, పండితారాధ్య చరిత్ర, బసవపురాణము, వృషాధిప శతకాదులు వెలసినవి.

సుదీర్ఘమైన 250 సంవత్సరముల కాల పరిమితి గల వీరి పరిపాలనా కాలములో శాసనములు కన్నడ, సంస్కృతములలోను, తెలుగులోను వెలువడినవి. క్రీ.శ. 1040 నుండి 1240 వరకు శాసనములన్నియు తెలుగు-కన్నడ లిపిలో ఉన్నవి. పిమ్మట శాసనములు తెలుగు లిపిలో వేయబడినవి. కాకతి రుద్రమ కాలమునాటికి తెలుగు లిపి ప్రత్యేకతను సంతరించుకున్నది. శాసనభాష, కావ్యభాష ఒకేవిధముగా నున్నవి. నన్నయ తిక్కనల కాలపు తెలుగు సాహిత్యమున కలిగిన మార్పులు వీరి శాసనము లందును, ఈ కాలమున వ్రాయబడిన గ్రంథములందు, ద్విపద కావ్యములందు, శతకములందును కనిపించును. అచ్చమైన తెలుగు భాషా నుడికారము వీరి శాసనములందు అగుపించును.

ఈవిధంగా కందూరిచోడులు సువిశాలమైన సామ్రాజ్యమును సర్వతోముఖాభివృద్ధితో ప్రజారంజకముగా పాలన చేసి చరిత్రలో చెరగని ముద్ర వేసిరి.

శాస్త్రిగారు ప్రకటించిన శాసనములే కాకుండా వారి శిష్యులైన డా. దామరాజు సూర్యకుమార్ గారు వారి పరిశోధనలో వెలుగులోకి వచ్చిన తొండయ మహారాజు అడవి దేవులపల్లి శాసనము (క్రీ.శ. 1091), గోకర్ణ చోడ మహారాజు తంబడపల్లి శాసనము (క్రీ.శ. 1109)లను పరిష్కరించి 'ఆచంద్రార్కం' (తెలంగాణ కొత్త శాసనాలు కొన్ని) అనే గ్రంథంలో ప్రచురించిరి.

ఈ క్రొత్త శాసనములను కూడా కందూరిచోడుల శాసనములు చరిత్ర - సంస్కృతి పునర్ముద్రణలో చేర్చితే పరిశోధకులకు, చరిత్రకారులకు ప్రయోజనకరంగా ఉండగలదు.

**లీలా సుబ్రహ్మణ్యం**
టెక్నికల్ అసిస్టెంట్, ఆర్కియాలజీ శాఖ, ఆంధ్ర ప్రదేశ్
ఫోన్ : 99898 66702



# బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసనములు

భిన్నూరి నరసింహ శాస్త్రి గారు సంకలనం చేసిన 'బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసనాలు' గ్రంథం, ఆనాటి బెజవాడ ఆలయాల చరిత్రను సజీవంగా మనముందు నిలుపుతుంది. ఆంధ్ర దేశాన్ని పాలించిన శాతవాహన, ఇక్ష్వాకు, విష్ణుకుండిన తదితర రాజవంశాలకి చెందిన 95 శాసనాలు ఈ గ్రంథంలో మనకు కనిపిస్తాయి. క్రీ.శ.8 వ శతాబ్దం ఉత్తరార్ధం నుంచి 16 వ శతాబ్దం చివరి దాకా రాజవంశాలతో పాటు ఇతరులు వేయించిన శాసనాలు ఈ సంపుటిలో చేర్చబడ్డాయి.

శాస్త్రి గారు ఈ శాసన సంపుటిని రెండు భాగాలుగా చేశారు. మొదటి భాగంలో బెజవాడలో ప్రధాన ఆలయాలైన శ్రీ కనకదుర్గా దేవి ఆలయం, శ్రీ మల్లేశ్వరాలయం, శ్రీ భ్రమరాంబా మల్లేశ్వరాలయం, ఇంద్రకీలాద్రి, వీటి ప్రాశస్త్యం ఈ ఆలయాల్లో జరిగే ఉత్సవాలు, దుర్గాదేవికి సంబంధించిన చారిత్రక అంశాలు, కృష్ణానదీ విశేషాలను పొందుపరచగా, రెండో భాగంలో 'యుద్ధమల్లుడి బెజవాడ శాసనం'తో మొదలుపెట్టి, 'నానా దేశాల వెలికి వేగురు' శాసనం దాకా తొంబై అయిదు శాసనాల మూల పాఠాన్ని (ముఖ్యమైన వాటి ఛాయాచిత్రాలతో) అందించారు. ప్రతి శాసనానికి ముందుగా ఆ శాసనం ఎవరు వేయించారు? ఎప్పుడు వేయించారు? అది ఎక్కడ లభించింది అనే విషయాల్ని సంక్షిప్తంగా అందించారు. శాసన భాష అర్థం చేసుకోలేని వారికి ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. తొంబై అయిదు శాసనాల మూలపాఠం తరువాత ఆ శాసనాలకి సంబంధించిన సంక్షిప్త సమాచారాన్ని మరొక విభాగంగా మనకి అందించారు. చివరగా అకారాది

క్రమణికలో బెజవాడ ఆలయ శాసనాల్లో కనిపించే రాజులు, వ్యక్తుల, ఊర్లపేర్లని పొందుపరిచారు. బెజవాడ ఆలయ శాసనాల మీద పరిశోధన చేయాలనుకునే విద్యార్థులకి ఈ గ్రంథం ఒక కరదీపికగా ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

శాస్త్రి గారు సంకలనం చేసిన ఈ శాసన సంపుటిలో ప్రధానమైనవి 1.తూర్పు చాళుక్య రాజైన యుద్ధమల్లుడి బెజవాడ శాసనం 2. త్రికోటి బోయదు వేయించిన కిరాతార్జున స్తంభ శాసనం 3.పల్లకేతు భూపాలుడి శాసనం 4. మహామాండలిక సింగయ దేవరాజు వేయించిన శ్రీ కనక దుర్గాలయ శాసనం 5. చట్టపుదు వేయించిన పార్థీశ్వరాలయ శాసనం వీటి గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

## 1. యుద్ధమల్లుడి బెజవాడ శాసనం :

క్రీ.శ.11 వ శతాబ్దానికి చెందిన తూర్పుచాళుక్య రాజు యుద్ధమల్లుడు. ఆయన విజయవాడలో ఒక శాసనాన్ని ప్రకటించాడు. ఇది పద్య శాసనం. తెలుగు వాఙ్మయ చరిత్రలో ఈ శాసనానికి ఒక ప్రత్యేక గుర్తింపు వుంది. ఎందుకంటే తెలుగు ఛందస్సుకి సంబంధించిన 'మధ్యాక్కర' మొదటిసారిగా ఈ శాసనంలో కనిపించింది. ఈ శాసనం శిలాస్తంభం మీద మూడు వైపులా చెక్కబడి ఉంది. ఈ స్తంభం మొదటి వైపు 17 పంక్తులు, రెండోవైపు 19 పంక్తులు, మూడోవైపు 10 పంక్తులు ఉన్నాయి. కొంత అసంపూర్ణంగా లభించిన ఈ శాసనంలో యుద్ధమల్లుడు సత్యత్రినేత్ర విస్తరుడని, త్రిభువనాభరణుడని, సకల వస్తు సమేతుడని, విఖ్యాత కీర్తివంతుడని చెప్పబడ్డాడు.

యుద్ధమల్లుడు శైవ మతాభిమాని. ముఖ్యంగా శివపుత్రుడైన కుమారస్వామి భక్తుడు. ఆయన కాలంలో గుంటూరు జిల్లా చేబ్రోలు నుంచి బెజవాడ జాతరకి ఊరేగింపుగా వచ్చిన కుమారస్వామికి బెజవాడలో ఒక గుడిని, దానికి అనుబంధంగా ఓ మఠాన్ని కూడా కట్టించాడు. అంతేకాదు, ఒక కట్టడి కూడా చేశాడు. అదేమిటంటే తాను కట్టించిన మఠంలో శైవభక్తులైన గొరగలు కాకుండా మరెవరూ బస చేయకూడదని, అలా ఎవరైనా లోపలికి వస్తే వచ్చిన వారిని వెంటనే బైటికి పంపేయాలని గుడి స్థానాధిపతుల్ని హెచ్చరించాడు. శాసనం చివర్లో తన తాతగారైన మల్లరాజు బెజవాడలో ఒక అందమైన దేవాలయాన్ని నిర్మించాడని తాను ఆ దేవాలయానికి మరమత్తులు చేయించానని, ముందు గోపురాన్ని కూడా నిర్మించానని చెప్పుకున్నాడు.

ప్రస్తుతం యుద్ధమల్లుడు నిర్మించిన కుమారస్వామి ఆలయం ఎక్కడుందో తెలియదు కానీ, ఆయన తాత గారు నిర్మించిన ఆలయం విజయవాడ 1 టౌన్‌లో పాత శివాలయం అనే పేరుతో ఉంది. ఇక్కడి శివుడి పేరు మల్లీశ్వరుడు. అమ్మవారి పేరు భ్రమరాంబాదేవి.

మల్లపరాజు తన పేరు మీదుగానే ఈ మల్లేశ్వరాలయాన్ని నిర్మించాడు. ఈ యుద్ధమల్లుడి బెజవాడ శాసనం కూడా ఈ ఆలయ ప్రాంగణంలోనే ఇప్పటికీ ఉంది.

## 1. త్రికోటి బోయడు వేయించిన కిరాతార్జున స్తంభశాసనం :

బెజవాడ ఆలయ శాసనాల్లో ఇది ప్రత్యేకంగా కనిపిస్తుంది. కలియమ బోయడి కొడుకైన త్రికోటి బోయడనేవాడు ఈ శాసనాన్ని ప్రకటించాడు. ఇది శిలాస్తంభ శాసనం. అర్జునుడి దశ నామాలతో ఉన్న సంస్కృత శ్లోకం (అర్జున,ఫాల్గుణ, పార్థ, కిరీటి...) తో ఈ శాసనం ప్రారంభమౌతుంది. ఇది పూర్తి సంస్కృత భాషలో రాయబడి ఉంది.

ద్వాపర యుగంలో పాండవ మధ్యముడైన అర్జునుడు ఇంద్రకీలాద్రి మీదికి రాగా, ఆయన తపస్సు చేసుకోడానికి అనువైన స్థలాన్ని ఒక యక్షుడు చూపించాడని ఆ యక్షుడే ఈ జన్మలో త్రికోటి బోయడు అనే పేరుతో తిరిగి జన్మించాడని, యక్షుడ్ని తానేనని శాసనకర్త చెప్పుకున్నాడు. తనకి తన పూర్వజన్మ జ్ఞాపకం వచ్చిందని, అందుకే ఆ విషయాన్ని ఇలా శాసన రూపంలో తెలియజేస్తున్నానని చెబుతూ ఈ శాసనాన్ని ప్రకటించాడు. ఇది కిరాతార్జున ఘట్టానికి సంబంధించిన శిల్పాలతో వేయించబడ్డ స్తంభ శాసనం. రెండు వైపులా 21 పంక్తుల్లో ఈ శాసనం చెక్కబడింది. విజయాచార్యుడనే వాడు దీన్ని చెక్కించాడు.

పూర్వం ఈ శాసనం ఇంద్రకీలాద్రి శిఖరం మీద అర్జునుడు తపస్సు చేశాడని చెబుతున్న ప్రాంతంలో ఉండేది. ప్రస్తుతం దీన్ని పురావస్తు శాఖ వారు తెచ్చి అర్జున వీధిలో ఉన్న అక్కన్న మాదన్న గుహల ప్రాంగణంలో భద్రపరిచారు.

## 3. పల్లవకేత భూపాలుడి మల్లేశ్వరాలయ శాసనం :

ముక్కంటి కాడ్వెట్టి వంశీయుడైన పల్లవకేత భూపాలుడనే వాడు క్రీ.శ.12 వ శతాబ్దంలో ఒక శాసనం వేయించాడు. ఇది బెజవాడ ఇంద్రకీలాద్రి మీదున్న మల్లేశ్వరాలయ ప్రాంగణంలో దొరికింది. సంస్కృతాంధ్ర భాషల్లో రూపొందించిన ఈ శిలాస్తంభ శాసనం 25 పంక్తుల్లో చెక్కబడింది. ఈ శాసనంలోని సారాంశం ఏమంటే...

ఇంద్రకీలాద్రి మీద తపస్సు చేసిన అర్జునుడితో శివుడు కిరాతుడి రూపంలో వచ్చి మల్లయుద్ధం చేశాడని, ఆ కారణంగా ఆయన తనకున్న ఈశానుడు అనే పేరుని వదిలేసి 'మల్లేశ్వరుడు' అనే పేరుతో విఖ్యాతి చెందాడని చెప్పబడింది. అలాగే విష్ణుకుండిన వంశానికి చెందిన మాధవవర్మ అనే రాజు బెజవాడని పాలిస్తున్నాడని, ఆ కాలంలో ఒకరోజు మాధవవర్మ కొడుకు రథం మీద వేగంగా వెళ్తున్న సమయంలో చింతకాయలు అమ్ముకునే బీదరాలి కొడుకు ఆ రథం చక్రం కిందపడి మరణించాడని, ఆ విషయాన్ని బీదస్త్రీ వెళ్లి మాధవవర్మతో

మొరపెట్టుకుని న్యాయం చేయమని కోరగా, మాధవవర్మ న్యాయాధికారుల నిర్ణయం ప్రకారం మరణశిక్ష విధించాడని, అతడి నిస్వార్థ ధర్మనిరతికి మెచ్చి మల్లీశ్వర స్వామి బెజవాడలో స్వర్ణవర్షం కురిపించి మరణించిన బీదస్త్రీ కొడుకుని తిరిగి బతికించాడని ఈ శాసనం తెలుపుతుంది.

దీంతో పాటు సుప్రసిద్ధ శైవాచార్యుడైన శ్రీపతి పండితారాధ్యుడు, శివభక్తుల మహిమని చాటుతూ తన ఉత్తరీయంలో నిప్పుల్ని మూటకట్టి జమ్మిచెట్టుకి వ్రేలాడదీశాడని, అతడి భక్తికి మెచ్చి మల్లేశ్వర స్వామి ప్రత్యక్షమయ్యాడని కూడా ఇదే శాసనంలో ప్రస్తావించబడింది. ఈ శాసనాన్ని ప్రకటించిన పల్లవకేత భూపాలుడు తాను భారద్వాజ గోత్రుడనని, వృషభ లాంఛనుడని, మల్లేశ్వర పాదపద్మారాధకుడననీ చెప్పుకున్నాడు.

## 4. మహామండలేశ్వర సింగయదేవ రాజు – శ్రీ కనక దుర్గాలయ శాసనం :

బెజవాడ ఆలయ శాసనాల్లో ప్రముఖమైంది ఈ శాసనం. శ్రీ కనకదుర్గమ్మ ఆలయ విశేషాల్ని తెలియజేసే ఏకైక శాసనం ఇది. ఈ శాసనాన్ని క్రీ.శ. 1516 లో శ్రీకృష్ణదేవరాయలు పరిపాలన చేసే కాలంలో మాధవవర్మ వంశానికి చెందిన శ్రీమన్మహా మండలేశ్వరుడైన సింగయదేవరాజు అనేవాడు ప్రకటించాడు. ఇది ఇంద్రకీలాద్రి మీదున్న శ్రీ కనకదుర్గాలయ ప్రాంగణంలో లభించింది. మొత్తం 204 పంక్తుల్లో సంస్కృతాంధ్ర భాషల్లో ఈ శాసనం చెక్కబడింది.

ఈ శాసనంలో మహామండలేశ్వరుడైన సింగయదేవరాజు తన తల్లిదండ్రులకి, అన్నగారైన బసవరాజుకి పుణ్యం కలగడం కోసం, తన కీర్తి ఆచంద్రార్కం వెలగాలనే కోరికతో ఎన్నో ధార్మిక కార్యక్రమాల్ని నిర్వహించానని చెప్పుకున్నాడు. వాటిలో భాగంగా దుర్గాదేవి లయం ఉన్న కొండ ఉత్తర దిక్కు చుట్టూ తూర్పు పడమరలుగా తొమ్మిది చేతుల పొడవు, ఏడు చేతుల వెడల్పు కొలతలతో కొండని తొలిపించాడు. దీనివల్ల ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసుకునే అవకాశం భక్తులకి కలిగింది. ఇది, శాసనం నాలుగో పక్క 73 పంక్తుల్లో చెక్కబడింది.

ఇక మొదటి రెండు, మూడు పక్కల్లో సంస్కృత శ్లోక, వచనాల్లో చెక్కబడ్డ శాసనంలో ఇలా ఉంటుంది – దుర్గావర ప్రసాదులైన విష్ణుకుండిన మాధవవర్మ వంశంలో కంఠమరాజు మనుమడైన పాపరాజుకి సింగరాజైన తాను జన్మించానని, దుర్గా దేవి భక్తుడినైన తాను ఇంద్రకీలాద్రి మీద కొలువున్న దుర్గమ్మ ఆలయానికి అంతరాళికని, భోగ మండపాన్ని కట్టించానని చెప్పుకున్నాడు శాసనకర్త సింగరాజు. దేవాదాయశాఖ అంతులేని నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం ఈ శాసనాన్ని శాస్త్రి గారి శాసన సంపుటిలో తప్ప ప్రత్యక్షంగా చూడలేము.

## 5. చట్టపూడి శాసనం :

బెజవాడ దుర్గామల్లేశ్వరాలయ శాసనాలలో ఇది కూడా ప్రముఖమైందే. సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మహారాజు 17 వ రాజ్యపాలనా సంవత్సరంలో 'చట్టపుడు' అనే సామంతరాజు ఈ శాసనాన్ని వేయించాడు. ఒక శిలాఫలకం మీద పది పంక్తుల్లో చెక్కబడ్డ ఈ శాసనం ఇంద్రకీలాద్రి మీద పార్థీశ్వర స్వామిని ప్రతిష్ఠ చేసిన విషయాన్ని తెలియజేస్తుంది. ఈ శాసనంలో పేర్కొన్న విష్ణువర్ధనుడు తూర్పు చాళుక్య రాజైన మొదటి భీముడే అని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడతారు. ఇంద్ర కీలాద్రి మీద గోవింద మఠం అనే ప్రదేశంలో ఈ శాసనం లభించింది.

ప్రస్తుతం ఇంద్రకీలాద్రి మీద ఈ పార్థీశ్వరాలయం ఉన్న చిహ్నాలేవీ మనకు కనిపించవు. అయితే ఈ పర్వత శిఖరం మీద అమ్మవారి గుడికి పై భాగంలో కుడివైపు ఒక శిథిలమైన ఆలయ చిహ్నాలు కనిపిస్తున్నాయి. బహుశా ఇదే ఆ పార్థీశ్వరాలయం అయి ఉ ండవచ్చు. ఎందుకంటే ఈ ఆలయ శిథిలాల సమీపంలోనే త్రికోటి బోయదు వేయించిన కిరాతార్జున శిలాస్తంభం శాసనం లభించింది. మరొక విశేషం ఏమిటంటే సరిగ్గా ఈ శిథిల ఆలయం క్రింది భాగంలో ఉన్న గోవింద మఠం అనే ప్రదేశంలోనే చట్టపుడు వేయించిన శాసనం దొరికింది.

బి.ఎన్.శాస్త్రి గారి ఈ శాసన సంపుటిలో పేర్కొన్న శాసనాల ద్వారా క్రీ.శ.898 నుంచి 1589 దాకా వివిధ రాజవంశాలు, సామంతులు, మాండలీకులు, మంత్రులు, వివిధ కులాలకి చెందిన వ్యక్తులు దుర్గా మల్లేశ్వర ఆలయాలకు చేసిన రకరకాల దానాల గురించి మనకు వివరంగా తెలుస్తోంది. ఈ శాసనాలన్నీ సౌతిండియన్ ఇన్‌స్క్రిప్షన్ వాల్యూం 10,4 ఎపిగ్రఫియా ఇండికా అనే పుస్తకంలో ప్రకటించబడ్డాయి. ఈ గ్రంథంలో ఉన్న శాసనాన్ని శాస్త్రిగారు ఒక క్రమపద్ధతిలో విభజించి సరళంగా అందరికీ అర్థమయ్యేలా రూపొందించారు. శాసనాలతో పాటు శాసన ప్రతిబింబాలను కూడా చేర్చడం పరిశోధకులకి ఎంతగానో ఉ పయోగపడుతుంది. బెజవాడ ఆలయాలకి ఎవరెవరు ఏఏ రకాల దానాలు చేశారనే విశేషాల్ని ఒక పట్టిక రూపంలో అందించడం శాస్త్రి గారి ప్రత్యేక కృషికి నిదర్శనంగా కనిపిస్తుంది.

ఈ శాసన సంపుటిలో ఉన్న శాసనాల్ని పరిశీలిస్తే, నేటి విజయవాడ మధ్యాంధ్ర యుగంలో ప్రముఖ శైవమత క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిందని తెలుస్తోంది. నాటి బెజవాడ పాలకులు, మాండలీకులు, సామాన్య ప్రజలు వేయించిన శాసనాల్లో విజయవాడ వివిధ రకాల పేర్లతో వ్యవహరించబడింది.

**బెజవాడ :** ఇది యుద్ధమల్లుడి శాసనంలో 'పరగంగ బెజవాడ గొమర స్వామికి భక్తుండై" అని కనిపిస్తుంది.

**పెచ్చువాడ :** త్రికోటి బోయడు వేయించిన శాసనంలో 'పెచ్చువాడ కలియమ బోయిపుత్ర:' అని బెజవాడ పచ్చువాడగా పేర్కొనబడింది.

**విజయవాటీ పురం –** కలి విష్ణువర్ధనుడి చెరువు మాధవవరం శాసనంలో 'విజయవాటీ పురం' అని ఉంది.

**విజయవాటీ విషయం –** త్యాగి పోతరాజు బెజవాడలో ప్రకటించిన శాసనంలో 'విజయవాటి విషయేచ' అని చెప్పబడింది.

**అర్జునస్య పుర్యాం :** త్యాగి వంశీయుడైన పోతరాజు మరో శాసనంలో 'అర్జునస్య పుర్యాం మల్లేశ్వరాయఖిల గురవే" అని బెజవాడని అర్జునుడి పురంగా ప్రస్తావించాడు.

ముప్పల మహాదేవి కరణం కేతరాజు కలిసి వేయించిన శాసనంలో (విజయవాడ మల్లీశ్వర శ్రీమహాదేవర అఖండ దీపమునకు) బెజవాడ – విజయవాడ అని పేర్కొనబడగా, దుర్జయ నరేంద్రుడి ప్రశస్తిని తెలియజేసే మరో శాసనంలో (విజయవాటికా పురేశ్వర (త్రిసప్తతి గ్రామాధీశ్వర) బెజవాడ విజయవాటికా పురం అని కనిపిస్తుంది.

## దానాలు – ధర్మాలు

బెజవాడ దుర్గా మల్లీశ్వరాలయ శాసనాల ద్వారా ఆనాటి ప్రజలు, సామంతులు, మాండలీకులు, ప్రభువులు, శ్రీ మల్లేశ్వర స్వామి వారి అఖండదీప నివేదన కోసం అగ్రహారాల్ని, ఆవుల్ని, గేదల్ని, ఆబోతుల్ని, గొర్రెల్ని, మేకల్ని సమర్పించారని తెలుస్తోంది. శాస్త్రి గారు ఈ శాసనాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి ఒక పట్టిగా ఈ దానాల గురించి ప్రస్తావించారు. ఇది బెజవాడ శాసనాల మీద ఆయన చేసిన సమగ్ర అధ్యయనాన్ని తెలియజేస్తుంది.

ఈవిధంగా బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసనాల మీద సంపూర్ణంగా అధ్యయనం చేసి బి.ఎన్.శాస్త్రి గారు ప్రచురించిన ఈ గ్రంథం పరిశోధకులకు ఎంతగానో ఉపకరిస్తుంది. ఒక రకంగా ఈ సంకలనం పిహెచ్.డి. పట్టాకి అర్హమైంది. ఈ గ్రంథం సాయంతోనే నేను 1997లో 'ఎ స్టడీ ఆఫ్ ది టెంపుల్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ బెజవాడ' అనే శీర్షికతో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పరిశోధనా వ్యాసాన్ని సమర్పించి ఎం.ఫిల్. పట్టాని పొందాను.

తెలుగు భాష పట్ల, చరిత్ర పట్ల, శాసనాల పట్ల శాస్త్రిగారి కున్న మమకారానికి, తెలుగు చరిత్ర పరిశోధకులకు దారిచూపిన ఆయన సంకలన గ్రంథానికి సహస్రాధిక నమస్కారాలు సమర్పిస్తున్నాను.

**డా॥ జయంతి చక్రవర్తి**
రచయిత, సంపాదకులు, విజయవాడ
ఫోన్ : 7780561151



# ముఖలింగ దేవాలయ చరిత్ర - శాసనములు

జాతికి పటుత్వాన్ని, దేశానికి ప్రతిష్ఠను తెచ్చిపెట్టేది దాని చరిత్రే. చారిత్రక మధ్య యుగాల నేపథ్యంలో చూస్తే భారతీయ సమాజాన్ని సుసంఘటితం చేయడానికి వేర్వేరు కోణాల్లో మత కేంద్రాలైన ఆలయాలు, మఠాలు ఎంతగా తోడ్పడ్డాయో ద్యోతకమౌతుంది. జాతి సంస్కృతికి అవి ప్రతిబింబాలు. ఆలయ చరిత్రలను విస్మరించి చూస్తే ఏ జాతి చరిత్ర అయినా సరే, నిర్జీవంగాను, నిస్తేజంగానూ కనిపిస్తుంది. ఇలాంటి ఆలయ చరిత్రలు, స్థానిక చరిత్రలు ప్రాంత, మత, సంకుచితత్వాలకి దోహదకారులు కాకుండా, యిలాంటివే దేశ చరిత్ర, సంస్కృతులకు ఊపిరిపోస్తాయని పేర్కొంటూ క్లుప్తంగా శాస్త్రి గారు రూపుతీర్చిన **'ముఖలింగ దేవాలయ చరిత్ర - శాసనములు'** గ్రంథ నేపథ్యంలో వంశధారా నదీ తీరప్రాంతం, చరిత్ర యుగాల్లో ఎలా గణుతికెక్కిందో ప్రస్తావించబూనటం ప్రస్తుతాంశం. పౌరాణిక ప్రశస్తిని, చారిత్రక విశిష్టతను యిముడ్చుకొన్న ముఖలింగ దేవాలయాన్ని ఆవిష్కరించిన శాస్త్రి గారి కృతికి యిది సూక్ష్మ స్వరూప దర్శన మాత్రమే.

క్రీ.శ. పందొమ్మిదవ శతాబ్దపు చివరి దశల్లో నమోదు చేయబడ్డ దక్షిణ భారత శాసన సంపుటాల్లోనూ, ఎపిగ్రాఫియా ఇండికా, ఇండియన్ ఏంటిక్విటీ, భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక మొదలైన సంపుటాల్లోనూ, శ్రీ యన్. రమేశ్, నెమలికంటి ముకుందరావు గార్లు ప్రచురించిన 'టెంపుల్ ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ శ్రీకాకుళమ్ డిస్ట్రిక్ట్' లోనూ ప్రస్తావించిన అంశాలకు తోడుగా వారి వారి పరిశోధనల్ని జోడించి ఎందరో చరిత్ర జిజ్ఞాసువులు, పరిశోధకులు ముఖలింగ ఆలయ చరిత్రను గతంలో ప్రస్తావించడం జరిగింది.

సుమారు తొమ్మిది పదుల ఏళ్ళనాటి 'కళింగ దేశ చరిత్ర' గ్రంథంలో శ్రీ భావరాజు వేంకట కృష్ణారావు గారు రాసిన 'ముఖలింగము' అనే సుదీర్ఘ వ్యాసము, నాలుగు దశాబ్దాల నాడు శ్రీ ఎ.సూర్యనారాయణ మూర్తి గారు వెలయించిన 'శ్రీ ముఖలింగం టెంపుల్స్' అనే ఆంగ్ల గ్రంథం, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్యుడైన డా. బట్టేపాటి మస్తానయ్య సిద్ధాంత గ్రంథమైన 'టెంపుల్స్ ఆఫ్ ముఖలింగం', డా. సి.వి. రామచంద్రరావు ప్రభృతులు వారి వారి రచనల్లోనూ శ్రీముఖలింగ ఆలయ వివరాలు పేర్కొన్నారు. కానీ ఆయా రచయితల ప్రాధాన్యతావసరాల్ని బట్టి విషయ సేకరణ, విషయ వివరణ ఆ గ్రంథాల్లో విశ్లేషించబడ్డాయి. కానీ శ్రీ శాస్త్రి గారి 'ముఖలింగ దేవాలయ చరిత్ర-శాసనములు' గ్రంథం, కేవల శాసన నిక్షిప్త, శిల్పశోభిత రమణీయ, కళింగ నిర్మాణ శైలి విలసిత ఆలయ ప్రాంతాల చారిత్రక గుబాళింపులనే కాక, యీ పవిత్ర క్షేత్ర మాహాత్మ్యాన్ని, స్థల పురాణాల్ని, తత్కాల ప్రాంతీయ సామాజిక స్థితిగతుల్ని, వివిధ సామాజిక అంతరువుల వారు సభక్తియుతంగా సమర్పించిన వేర్వేరు దాన విశేషాల్ని ఏరికూర్చి, రూపుతీర్చి శ్రీముఖలింగ క్షేత్రంపై అనన్య సాధ్యమైన గ్రంథాల్ని వెలువరించడం, ఏమాత్రం అతిశయోక్తి కాదు. పవిత్రతను నింపుకొన్న యీ చారిత్రక సుమదళాన్ని శ్రీ శృంగేరీ పీఠాధిపతులు, శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వాముల వారికి సమర్పించ బూనటం ఎంతేని సముచితం.

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ఉత్తరాగ్రాన వంశధారానదీ తుంగ మాలికల నానుకొని వున్న అత్యంత ప్రాచీనమైన శైవక్షేత్రం శ్రీముఖలింగం. ఈ క్షేత్రమే గోవిందకాననం, మధుకేశ్వరం, జయంతీ క్షేత్రం, మోహలింగ లేక ముఖలింగ క్షేత్రంగా వివిధ చారిత్రక దశల్లో వర్ణించబడింది. విప్పచెట్టు మొదలే శిలాసదృశమై లింగాకృతిని పొందిన క్షేత్రమిది. ద్వాదశ శతాబ్దుల పైబడి ప్రకృతి వైపరీత్యాలకు ఎదురునిల్చి అతి సుందరంగా భాసిల్లుతోన్న శిల్ప నైపుణ్యం నాటి శిల్పకళా ప్రావీణ్యానికి నికషోపల. కొన్ని కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన పాటిమట్టి దిబ్బలు, శైథిల్యమైన ఎన్నో ఆలయ మంటపాదులు, చెల్లాచెదురుగా పడివున్న శిల్ప సముదాయం. నూరున్నరకి పైగానున్న శాసనస్థ విషయాలు, శతాబ్దుల నాటి ఆ క్షేత్ర విశేషాలనే కాక, ఆ ప్రాంత చరిత్రను కూడా లీలామాత్రంగా నైనా ద్యోతకం అయ్యేలా చేస్తాయి. ఈ క్షేత్రానికి దాపునే ఉన్న 'నగరికటకం' ప్రస్తావనని, దాని ఉనికిని, యితరేతర ఆధారాల్ని బట్టి దీనినే ప్రాచీన కళింగ రాజధానిగా శ్రీ శాస్త్రిగారు కూడా గుర్తించడం జరిగింది. ఆలయంలోని శాసనాలు కూడా దీన్ని సూచిస్తాయి. కొత్త ఆధారాలేమైనా బయల్పడే వరకు, ప్రస్తుత ఉత్తర కళింగాంధ్ర మందున్న యీ నగరికటక - ముఖలింగ ప్రాంతాన్ని ప్రాచీన కళింగ రాజధాని 'కళింగ నగరం' గా గుర్తింపక తప్పదు.

ఇక్కడి క్షేత్ర పరిశీలన సందర్భంగా పర్యటించిన శ్రీ శాస్త్రిగారు యిచ్చటి ప్రముఖ ఆలయాలైన ముఖలింగేశ్వర, సోమేశ్వర, భీమేశ్వర ఆలయాలే కాక, మరెన్నో దేవాలయాలు అక్కడ గతంలో వుండి వుండవలెనని భావించారు. వారి ఊహకు అనుగుణంగానే ఒక దశాబ్దపు కిందట అక్కడి భీమేశ్వరాలయానికి అభిముఖంగా కొద్ది దూరంలో పానవట్టంతో సహా ఒక శివలింగం త్రవ్వకాల్లో బయటపడటం, దానిని అక్కడి శాసనాల్లో పేర్కొనబడ్డ 'స్వప్నేశ్వరాలయం' గా భావించడం జరుగుతోంది. అక్కడ పరిసరాల్లో ఏమాత్రపు పురావస్తు త్రవ్వకాలు జరిగినా ఆ పాటిమట్టి దిబ్బల నడుమ మరిన్ని ఆలయాల చిహ్నాలు వెలికి వచ్చే అవకాశాలు మెండుగా వున్నాయంటే ఏ మాత్రమూ అతిశయోక్తి కాదు.

పెక్కు పర్యాయాలు చరిత్ర జిజ్ఞాసువుగా శ్రీముఖలింగ క్షేత్ర ఆలయాలను దర్శించిన నేను నిర్ద్వంద్వంగా ఒక్క విషయాన్ని పేర్కొనగలను. గతంలో ప్రచురింపబడ్డ యీ క్షేత్రానికి సంబంధించిన గ్రంథాల్లో అక్కడి నైసర్గిక స్వరూపం, ప్రాచీన కళింగాంధ్ర చరిత్ర, పూర్వగంగ రాజుల ఏలుబడి, శాసనాలు, శిల్పకళా రీతుల వర్ణన, వారి వారి అభిరుచుల్ని, ఆసక్తిని బట్టి ప్రస్తావించినప్పటికీ యీ క్షేత్ర సమ్యక్‌దర్శనం శ్రీ శాస్త్రి గారి గ్రంథంలోనే పరిపుష్టమైందంటే, అది యే మాత్రమూ అతిశయోక్తి కాని వాస్తవం.

చారిత్రక నేపథ్యాల నిశిత పరిశీలన, అక్కడ దీపించిన వివిధ శిల్పకళా విన్యాసాల సవ్వడులు, శాసనస్థ విషయాలు ఎత్తి చూపుతున్న వివిధ కైంకర్యాల సమర్పణలు – వీటనన్నింటినీ కలబోసి విశ్లేషించిన సంవిధాన గరిమ శ్రీ శాస్త్రిగారి 'ముఖలింగ దేవాలయ చరిత్ర' రచనలో ప్రస్ఫుటమౌతుంది. హేతుబద్ధము, సప్రమాణీకము అయిన చరిత్ర రచనలో పౌరాణిక గాథల ప్రస్తావన, స్థల పురాణాల అతిశయోక్తులు ఏ మేరకు అవసరమను ప్రశ్నార్థులకు ఒక్కటే సమాధానం. ఒక చారిత్రక ప్రసిద్ధి పొందిన దివ్య క్షేత్రము జనులలో ఏ మేరకు ప్రాచుర్యము పొందిందో పరిశీలించడానికి ఆయా కాలాల్లో చొప్పించబడి తీర్థ ప్రాశస్త్యాన్ని యినుమడింప చేసే పౌరాణిక గాథల నేపథ్యం, స్థల పురాణాల కథనాలు, చరిత్ర విశ్లేషణలో భాగాలై నిలుస్తాయనటం కాదనలేని సత్యం. ఆ క్రమంలోనే ఎన్నో ప్రాచీన దేవాలయాల మాదిరిగానే యీ ప్రాంత పరిసరాల్లో నెలకొన్న షోడశ తీర్థాల్ని, యితర సంబంధిత గాథల్ని యీ గ్రంథంలో మేళవించారు.

శాస్త్రి గారి చారిత్రక రచనలో ప్రముఖంగా పేర్కొనవలసింది సుమారు నూట యాభైకి పైబడ్డ శాసనాల క్రోడీకరణ. దక్షిణ భారత శాసన సంపుటాల్లోనూ, మరి యితరేతర సంచికల్లో ప్రస్తావించి పేర్కొనబడ్డ యీ ఆలయపు శాసనాలన్నింటినీ నకళ్ళు తీసి, సరిచూచి,

తాత్పర్య సహితంగా వరుస కూర్చడం ఎంతో అభినందనీయం. కేవలం శాసనస్థ విషయాలే సరిబుచ్చక ఆ నేపథ్యంతో సమకాలీన సామాజిక పరిస్థితుల్ని బేరీజు వేయడంలో శాస్త్రి గారి పరిశోధనా పటిమ మేరువు ఎత్తులో ద్యోతకమౌతుంది. అందులోని దాన గ్రామ ప్రస్తావనలు, రాణివాసము వారు, ఏలికల పేర్లు, రాజాస్థానపు వివిధ అధికారుల వివరాలు, ప్రత్యేకించి ఆయాచోట్ల చెప్పబడ్డ భక్తురాళ్ళ వివరాలు క్రమపద్ధతిలో గుదిగుచ్చడం వీరి చరిత్ర పరిశోధనా పద్ధతికి, అనియత శ్రమకి గీటురాళ్ళుగా చెప్పకతప్పదు.

ఆ నేలనేలిన గంగరాజులు, ఓఢ్ర గజపతుల వంశ కాలానుక్రమణికలు గ్రంథ ప్రామాణికతను ద్విగుణీకృతం చేస్తాయి. ఆనాటికి వారికి లభ్యమై ప్రచురింపబడ్డ గ్రంథాలని వీరు తమ ఉపయుక్త గ్రంథాలుగా పేర్కొన్నారు. చరిత్ర రచనలో, పరిశోధనా పటిమలో, క్షేత్రస్థాయి పరిశీలనల్లో, శాసనస్థ విషయ విశ్లేషణలో తనకు తానే సాటియని నిరూపించుకున్న శ్రీ బి.యన్.శాస్త్రి గారి **'శ్రీముఖలింగ దేవాలయ చరిత్ర – శాసనములు'** గ్రంథాన్ని నేను స్పృశించడం, వారి అధ్యయనాన్ని చర్చించడం నా చరిత్ర అధ్యయన అభిలషితలు మాత్రమే.

**డా॥ కొల్లూరు సూర్యనారాయణ**
విశ్రాంత ఆచార్యులు, చరిత్ర శాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం
ఫోన్ : 98485 22023



# చెఱకు రెడ్డి వంశ చరిత్ర - శాసనములు

చరిత్రను రచించాలంటే, చరిత్రకారుడు మొదటగా చారిత్రకాంశానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించవలసిన అవసరం ఎంతగానో ఉంది. సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, క్రమపద్ధతిలో రచించాల్సిన అవసరం ఉంది. చారిత్రక ఆధారాలుగా పురావస్తు అవశేషాలు, శాసనాలు, కట్టడాలు, నాణేలు, సమకాలీన సాహిత్య గ్రంథాలు ప్రాథమిక మైనవిగా చెప్పవచ్చు. క్రీ.శ. 19వ శతాబ్దం నుంచి చరిత్ర రచన ప్రాధాన్యత సంతరించుకుంది. రచయితలు నాడు ప్రముఖ రాజ వంశాలను ముఖ్య అంశంగా ఎంచుకొని అదే దృష్టితో వారు చేసిన యుద్ధాలు, విజయాలు, రాజవంశాలు, రాజులు చేపట్టిన కార్యాలను మాత్రమే ఎక్కువగా ప్రస్తావిస్తూ రచనలు చేశారు. వారి పాలనా కాలంలో వివిధ కార్యాలందు సహకరించి, సహాయపడి తమ ప్రాణాలు సహితం కోల్పోయిన వారికి ప్రాధాన్యత ఇవ్వలేదు. వారు ఎవ్వరు అనగా మహాసామంత, దండనాయక, సైనిక, కర్షక, వివిధ వృత్తుల ప్రజల సేవలను చెప్పుటకు ప్రయత్నించలేదు.

20 వ శతాబ్దం ఉత్తరార్ధంలో మాత్రం కొంతమంది చరిత్ర రచనాకారులు సామంత, మండలేశ్వర, దండనాయక, ప్రాంతీయ మాండలాల వారు చేసిన సేవలు వెలుగులోనికి తేవాలన్న సంకల్పంతో రచనలు సాగించారు. గత రెండు,మూడు దశాబ్దాలుగా ఇలాంటి పరిశోధనలు కూడా జరుగుతున్నాయని చెప్పవచ్చును.

ప్రాంతీయ రాజవంశాలు, ప్రాంతాలు, చారిత్రక స్థలాలపై రచనలు సాగించడానికే తాను జన్మించానన్న సంకల్పంతో ప్రత్యేకించి తెలంగాణా ప్రాంతంలో మధ్యయుగంలో

పాలించిన సామంత రాజ్యవంశాలు, ప్రాంతాల వారి చరిత్రను రచించిన పరిశోధకులలో కీ.శే. బి.ఎన్.శాస్త్రి గారు మొదటివారుగా చెప్పవచ్చును. వారు తన జీవిత కాలమంతా శాసనాలు, సామంత, ప్రాంతీయ చరిత్రను రచించడానికి అంకితం చేసారు. వారు ప్రాథమిక ఆధారాలలో ముఖ్యమైన శాసనాల సాయంతో రచనలు గావించారు. వీరి రచనలు రేచర్ల, చెఱకు, కందూరునాడు, త్రిపురాంతకం, ద్రాక్షారామం, కాయస్థ, ఆంధ్రదేశ చరిత్ర, సంస్కృతి (మూడు భాగాలు), నల్లగొండ జిల్లా సర్వస్వం, ఆదిలాబాదు, మహబూబునగర్ జిల్లా సర్వస్వాలు, రెడ్డిరాజ్య సర్వస్వము ఇలా పరిశోధన గ్రంథాలు, మరెన్నో పరిశోధక వ్యాసాలు రచించారు. వారి ప్రాథమిక ఉద్దేశము చిన్న రాజ్యాలు, ప్రాంతాల చరిత్రను సమగ్రంగా రచించిన అవి పెద్ద రాజ్యాలు, పెద్ద ప్రాంతాల రచనలకు మూలాధారాలుగా ఉపయోగ పడతాయి అన్న విశ్వాసము.

చరిత్ర వ్యాసాన్ని వ్రాయడానికి, దానికి అవసరమైన ప్రాథమిక, మాధ్యమిక ఆధారాలను సేకరించాలి. దేశ, రాష్ట్ర ప్రాంతాల చరిత్రను రచించేటప్పుడు నాడు ప్రముఖ రాజవంశాల సేవలే కాకుండా, సమకాలీనంగా వారికి వివిధ సమయాలలో సహకరించిన సామంత పాలకులు, దండనాయకులు, సైనికులు, వివిధ వృత్తుల వారు, వ్యవసాయ శ్రామిక ప్రజల సేవలను, కృషిని సేకరించి పొందు పరచాల్సిన అవసరం ఎంతగానో ఉంది.

దక్షిణ భారతదేశంలో ప్రత్యేకించి ప్రస్తుత తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలను క్రీ.శ. మూడో శతాబ్దం నుంచి పరిశీలించినచో ప్రముఖ పాలక వంశాలతో పాటు వారికి సహాయకారిగా ఉన్న స్థానిక, సామంత, మహాసామంత పాలకుల పాత్ర గణనీయమైందని చెప్పవచ్చు. వారు చేసిన రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, ప్రజాహిత కార్యాలు వెలకట్టలేనివని చెప్పక తప్పదు. సామంత, ప్రాంతీయ పాలకులు ప్రజలకు పట్టుకొమ్మలు, ప్రభువులకు వెన్నుముక వంటివారు.

మధ్యయుగ కాలానికి సంబంధించి చరిత్రకారులు ప్రత్యేకించి పరిశీలించినచో, సామంత, మాండలీకుల పాలనాపరంగా, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మతపరమైన సేవలు వెలుగులోకి వచ్చును. మధ్యయుగ తెలుగునాడును సామంతరాజుల పాలనా కాలంగా చెప్పవచ్చు. ప్రముఖ రాజ్యాల పాలకులకు సామంతుల, సహాయ సహకారాలు ఎంతగానో అవసరం ఉంది. సామంత, మహామండలేశ్వర హోదాలను కల్పించడం జరిగింది. మధ్యయుగ కాలాన తెలంగాణ ప్రాంతమందు కాకతీయులకు సామంతులుగా గోన, రేచర్ల, చెఱకు, కందూరు, వేములవాడ విరియాల, మల్యాల, ఇందులూరు, కొలను మొదలగు వారు సామంతులుగా పేరుగాంచిరి. రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలలో కూడా

కాకతీయులకు సామంత పాలకులు ఉండిరి. ఆయా ప్రాంతాలలో పాలనాపరమైన కార్యాలు, ప్రజా అవసరాలను తీర్చుతూ తమ ప్రభువులకు సహాయ సహకారాలు అందించేవారు.

కాకతి రుద్రదేవుని పాలనా కాలాన్ని స్వతంత్ర రాజ్యంగా చెప్పవచ్చు. రుద్రదేవునికి యుద్ధాలలో సహకరించినందులకు కొన్ని గ్రామాలను ఇచ్చి సామంతులుగా చేసుకున్నారు. అలా వచ్చిన వారిలో ప్రస్తుత పరిశోధనా వాస్యం 'మధ్యయుగ చరిత్రలో చెఱకు వంశ రెడ్డి రాజుల చరిత్ర' ఇందులో చెఱకు వంశీయులు కాకతీయుల ఉన్నతికి ఎంతగానో కృషిచేసిరి. వారికి స్వతంత్ర రాజ్యంగా పాలించుకునే అవకాశం వచ్చినా, తమ ప్రభువులపై ఉన్న భక్తిని చాటుకొని గణపతిదేవుని చెర నుంచి విడిపించి కాకతీయ సింహాసనంపై కూర్చోబెట్టినవారిలో చెఱకు ఇమ్మడి బొల్ల, రేచల్ల రుద్రుడు చెప్పుకోదగిన వారు.

## చెఱకు వంశ రెడ్డి రాజులు

కాకతీయుల రాజ్యం విస్తరించు కాలాన మల్యాల, విరియాల, రేచల్ల, కందూరిచోడ, కోట, కోన, కొలను, చెఱకు, గోన, ఇందులూరి మొదలగు సామంత మాండలీకులు విధేయులుగా వివిధ యుద్ధాలలో పాల్గొని కాకతీయులకు విజయాలు సాధించి పెట్టారు. వారిలో మహాసామంతులుగా పేరు గాంచిన చెఱకు వంశీయులు ముఖ్యులు. వీరు రుద్రదేవుని కాలానికి సేనానుల స్థాయి నుంచి మహాసామంతుల స్థాయిని పొందారు.

చెఱకు వంశ సామంతులు చతుర్థ కులజులు. వీరి వంశ ప్రశస్తిని, ఉన్నతిని కీర్తించుటకు బ్రహ్మ, విష్ణువులు వీరి వంశకర్తలుగా శాసనాలలో పేర్కొన్నారు. ఈ చెఱకు వంశీయులు నల్లగొండ, మహబూబునగర్ మరియు కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలను పాలించారు. చెఱకు వంశ రెడ్ల చరిత్ర రచనకు శాసనాలు, సమకాలీన రాజవంశాల చరిత్ర, దేవాలయాల శిల్పం, గ్రంథాలు, శైవ గురువులు, మఠాలు, ఇతర నిర్మాణాలు మొదలగునవి ఆధారాలుగా ఉన్నాయి. చెఱకు రెడ్డి వంశీయుల కాలమందు సమకాలికంగా ఉన్న రేచర్ల, మల్యాల, విరియాల, గోన, వావిలాల, కందూరు చోడ, కాకతీయుల చరిత్రలలో చెఱకు వంశీయుల ప్రస్తావన వుంది.

వీరి కాలంలో దేవాలయాలు నిర్మించబడినవి. అందులో జలాల్పురం, కలువకొలను, అమరాబాదు, ఉడిమిళ్ళ, వేలూరు, కూరెళ్ళ తదితర ప్రాంతాలందు ఉన్న దేవాలయాలు, అందులో ఉన్న శిల్పసంపద ద్వారా వారి శిల్ప కళాభిరుచిని తెలుసుకోవచ్చు. శాసన రచయితల భాషా నైపుణ్యం గద్య, పద్యాలు, సంస్కృతాంధ్ర శాసన రచయితలు, పండితులు, మహాకవుల రచనలకు ఉపకరించును. చెఱకు వంశీయులు శైవ మతాన్ని అవలంబించి పరమత సహనం పాటించారు. మత గురువులకు, శైవ వైష్ణవ దేవాలయాలకు అగ్రహారాలను,

భూములను దానంగా ఇచ్చి శాసనాలు వేయించారు. శైవ మఠాలు ఏర్పాటు చేసి విద్యా బోధనకు తగిన వసతులను ఏర్పరచినారు. వీరు నిర్మించిన భవనాలు, మఠాలు, జలాల్పురం, కన్నేకల్లు, అమరాబాదు, ఒంకేశ్వరం, ఉడిమిళ్ళ, లక్ష్మీపురం, వేలూరు, కలువకోలు ప్రాంతాలలో కనిపించుచున్నవి. చెఱకు వంశీయులు కాకతీయుల సేనానులుగా, మహా సామంతులుగా పేరుగాంచి అనేక దేవాలయాలను నిర్మించి, అంగరంగ భోగాలకు ధూప దీప నైవేద్యాలకు భూములను దానమిచ్చి తమ వంశ ప్రతిష్ఠ శాశ్వతంగా నిలుచునట్లు చేసినారు.

## చెఱకు వంశం - జమ్ములూరు శాఖ

కాకతీయుల సేనానులలో కాటయ చెఱకు వంశీయులు ప్రసిద్ధులుగా పేరు గాంచారు. ఈ వంశమునకు మూల పురుషుడు కాటయ. ఇతను రెండవ బేతరాజు ద్వారా పండ్రెండు గ్రామాలను పొంది చెఱకు వంశ మొదటి పాలకుడాయెను. ఇతని సంతతి వారు కాకతి రుద్రదేవ, మహాదేవ, గణపతిదేవ, రుద్రమదేవి, ప్రతాపరుద్రుల పాలనా కాలంలో దండ నాయకులుగా, సామంత పాలకులుగా జమ్ములూరు, అమరాబాదు, వేలూరు పట్టణాలను రాజధానులుగా మధ్యయుగ ఆంధ్రదేశ కొన్ని భూభాగాలను పాలించారు. ఇతర సామంత రాజుల లాగే వీరు కూడా కాకతీయుల ఆదరాభిమానాలకు పాత్రులైరి. వీరు కాకతీయ సేనానులుగా అనేక యుద్ధాలందు విజయాలను సాధించి తమ పాలకుల మన్ననలు పొంది సామంత స్థానాన్ని పొందారు.

చెఱకు వంశీయులు నల్లగొండ జిల్లా దేవరకొండ, నకిరేకల్లు తాలూకాలలో ఉన్న చెఱకుపల్లి గ్రామాలు ఈ వంశీయుల తొలి నివాసంగా చెప్పవచ్చును. వీరి తొలి రాజధాని జమ్ములూరు, నేటి తిరుమలగిరి మండలంలోని జలాలుపురము గ్రామమే జమ్ములూరు. జలాలుపురము వెలుపల గల ఎత్తైన పరుపు బండపై చెఱకు బొల్లయరెడ్డి కౌతేశ్వర, కాళేశ్వర, మారేశ్వర, సూరేశ్వర ఆలయాలు రాతితో నిర్మించెను.

బ్రహ్మ పాదోద్భవులైన ధర్మాత్మ అగు చతుర్థకులంలో కాటయ జన్మించాడు. ఇతడు కొంగొండ ధవళుడను పులిని సంహరించి, ఎఱున మండలాల్ని ఛేదించి కాకతి బేతరాజుచే 12 గ్రామాలు పొందెను. చెఱకు వంశమున కాటయ కుమారుడు కేతసేనాని ప్రసిద్ధుడు. ఇతని కుమారులలో బొల్లయరెడ్డి గొప్పవీరుడు, ప్రతిభావంతుడు, అరివీర భయంకరుడు. అతని సోదరులు కాకతి సేనానులుగా అనేక యుద్ధాలు చేసి రుద్రదేవునికి విజయాలు చేకూర్చాడు. బొల్లయరెడ్డి యడల కాకతి రుద్రదేవుడు గౌరవంతో జమ్ములూరి ప్రాంతానికి మహా సామంతునిగా నియమించాడు. బొల్లయరెడ్డి సంతతి వారు కాకతీయుల సేనానులుగాను, మహా సామంతులుగను వ్యవహరించి యుద్ధాలందు విజయాలు చేపట్టి

జమ్ములూరి రాజ్యానికి అనుబంధంగా అమరాబాదు, వేలూరు ప్రాంతాలను పొంది మహా సామంతులుగా పేరు సంపాదించుకొనిరి. వీరు రెండవ బేతరాజు కాలంలోనే సేనానులుగా నియమింపబడి, రుద్రదేవుని కాలంలో మహాసామంతులైన క్రీ.శ.1158 నుంచి క్రీ.శ.1324 వరకు 166 సంవత్సరాలు పాలించిరి.

## కాటసేనాని (క్రీ.శ.1080-1140)

జలాల్పురము శాసనంలో కాటసేనాని చతుర్థ కులజుడు గొప్ప పరాక్రమశాలి, పులివంటి వాడుగా పేరుగాంచెను. యుద్ధ రంగమందు ఎఱువ మండలాధీశుని సంహరించి కాకతి బేతరాజుకు విజయాలు చేకూర్చి 12 గ్రామాలను పొంది పాలకునిగా పేరుగాంచెను. కాటసేనాని కామాంబికలకు కేత,సూర, బొల్ల అను ముగ్గురు కుమారులు. పొలవాస పాలకుడు మేడరాజు, కొలనుపాక పాలకుడు పారమార జగద్దేవుడు కాకతి రాజ్యంపై దండెత్తి రాగా, రెండవ బేతరాజుకు సామంతులు, సేనానులు సహాయం చేసిరి.

## కేతసేనాని (క్రీ.శ.1140-1190)

కాటసేనాని పెద్ద కుమారుడుగా చెఱకు వంశాన ప్రసిద్ధి కెక్కినాడు. ఇతను రెండవ ప్రోలరాజు, రుద్రదేవుని సేనానిగా పేరుగాంచెను. ఇతనికి ఇరువురు భార్యలు. మొదటి భార్యకు నలుగురు కుమారులు కలిగిరి. వారు కాట, మార, ఎఱ్ఱన, ఎఱ్ఱ అనేవారు. ఆ నలుగురు సద్గుణ సంపన్నులు, యుద్ధ విశారదులు, అరవీర భయంకరులు కాకతి రుద్రదేవుని సేనానులుగా సేవ చేశారు. కేతసేనాని రెండో భార్య కుప్పాంబిక వేయించిన జలాల్పురం శాసనంలో మన్మథుడు రతీదేవిని, ఇంద్రుడు శచీదేవిని, నారాయణుడు లక్ష్మీదేవిని వివాహమాడినట్లు కేతసేనాని కుప్పాంబికను వివాహమాడెను. కేతసేనాని కుప్పాంబికల వల్ల కాట, మార, బొల్లయ అనే కుమారులు కలిగిరి. బొల్లయ గొప్ప వీరుడు, శూరుడుగా కాకతి రుద్రదేవునికి ఆప్తుడుగా వుండెను.

వీరు కాకతి రుద్రదేవ, మహాదేవ, గణపతిదేవుల కాలంలో ఖ్యాతిగాంచి జమ్ములూరు రాజ్య సామంతాధిపతిగా చెఱకు బొల్లయ కాలం నుంచి మహాసామంతులుగాను, జమ్ములూరు పురవరాధీశ్వరులుగను కీర్తినార్జించారు. కాకతి రుద్రదేవుడు కందూరు చోడులపై చేసిన యుద్ధంలో రుద్రదేవునికి చెఱకు కేతసేనాని అతని కుమారులు మరా, బొల్ల, కాట సేనానులు విరియాల సూరసేనాని, రేచఱ్ల కాట, బేత, నామిరెడ్డి సోదరులు ఉండిరి. ఈ సేనల సహకారంతో వర్తమానపురాన్ని ముట్టడించి భీమదేవ చోడుని బంధించి సంధి గావించెను. చెఱకు కేతసేనాని రుద్రదేవుని మన్ననలతో దండనాయకుని నుంచి జమ్ములూరు రాజ్యానికి సామంతుడాయెను.

## బొల్లయరెడ్డి (క్రీ.శ.1195-1250)

కేతసేనాని కుప్పాంబికల మూడవ కుమారుడు బొల్లయరెడ్డి. ఇతను కాకతి రుద్రదేవ, మహాదేవ, గణపతిదేవుల కాలంలో చముపతిగా, సైన్యాధీశుడిగా, సామంత పాలకునిగా, జమ్ములూరు పురవరాధీశునిగా ప్రసిద్ధికెక్కాడు. బొల్లయరెడ్డి గొప్ప యుద్ధవీరుడిగా విజయాలు సాధించారు. కాకతీయులకు, యాదవులకు జరిగిన యుద్ధంలో మహాదేవరాజు పక్షాన యుద్ధంలో పాల్గొనెను. మహాదేవరాజు మరణించి గణపతి దేవుడు శత్రువుల చేత చిక్కగా కాకతిరాజ్య సంరక్షణ భారం వహించి శత్రువుల నెదుర్కొని పారద్రోలిన రేచర్ల రుద్రసేనానికి బొల్లయ రెడ్డి అండగా నిలిచెను. గణపతిదేవుడు రాజ్యపీఠాన్ని అలంకరించగానే జమ్ములూరు రాజ్యంతో పాటు అమరాబాదు, వేల్పూరు సామంత రాజ్యాలను పొందెను.

క్రీ.శ.1202 నాటి జలాల్పురం శాసనంలో బొల్లయరెడ్డి శ్రీ కేతేశ్వర, కాటేశ్వర, మారేశ్వర, సూరేశ్వర, గణేశ్వర, దుర్గాది దేవతల ఆలయాలను నిర్మించి ధూప నైవేద్యాలను భూదానమిచ్చు సందర్భాన శాసనం వేయించారు. ఇందులో 'సమీప గుణగణాభరణ పతిహిత చరణ జమ్ములూరు పురవరాధీశ్వర, పరమమహేశ్వర, విశ్వనాధదేవర, దివ్యశ్రీపాదారాధక నామాది సమస్త ప్రశస్తి సహితుడైన శ్రీయతి చెఱకు బొల్లారెడ్డి' అని వర్ణించారు. ఇదంపల్లి శాసనాన బొల్లయరెడ్డి సమస్త గుణగణాభరణ పతిహితచరణ, రణరంగ భైరవ వైరికంఠీరవ శరణాగత వజ్రపంజర వీరావతార, చాములూరి పురవరాధీశ్వర, పరమ మహేశ్వర సకల హరుద -ప.ద్ల - రేక రేవదిత విజయలక్ష్మి కమని వల్లభ భయలోభ దుల్లకభ సుజనైక మిత్ర, పరాంగనా పుత్ర, పరమ గాంగేయ నామాది సమస్త ప్రశస్తి సంహితం' అని పొగడబడినాడు.

బొల్లయరెడ్డి నాల్గవ కుమారుడు ఇమ్మడి విశ్వనాథుడు క్రీ.శ. 1253 న జలాల్పురంలో వేయించిన శాసనంలో కేతసేనాని కుప్పాంబిక పుత్రుడైన చెఱకు బొల్లసేనాధిపతికి మల్లాంబిక అను ధర్మపత్ని ఉండెను. వీరికి గణపతి, విశ్వనాథ, కేత, ఇమ్మడి విశ్వనాధులను నలుగురు కుమారులు. వారు మిక్కిలి సమర్థులుగా పేరు గాంచారు. బొల్లయరెడ్డి తటాకాలు, సత్రాలను నిర్మించి అనేక దానధర్మా లొనరించినట్లు శాసనంలో చెప్పబడెను. మారయ, బొల్లయ రెడ్లకు పుణ్యంగా ఎఱ్ఱగూరయ అనునతడు మల్లినాధదేవర భోగానకు తాటిచెట్లలో వచ్చు పంట ద్వారా ఒక మాడనిచ్చు సందర్భాన కన్నేకల్లులో శాసనం వేయించెను.

బొల్లయ రెండవ భార్యకు దేవయ అను కుమారుడు కలదు. ఇతనికి పెద్ద దేవయ అనే పేరు కూడా కలదు. కాకతి గణపతికి యుద్ధము నందు సహకరించుట వల్ల బొల్లయ మహబూబునగర్ జిల్లా అమరాబాదు, వంగూరు సీమలను, కర్నూలు జిల్లా వేలూరు

ప్రాంతాలను పొందెను. పెద్ద దేవయను వేలూరు ప్రాంత పాలకునిగా బొల్లయ నియమించెను. బొల్లయ సోదరులు కాట, మారయలు యుద్ధాలలో మరణించిరి. మారయ కుమారులు అన్నమరెడ్డి, గణపతిరెడ్డి అనువారు తన పినతండ్రి బొల్లయరెడ్డి నుంచి జలాల్పురు ప్రాంతాన్ని పొంది నల్లగొండ జిల్లా తాడువాయి, పాలకవీడు, కూరెళ్ళ, జలాల్పూర ప్రాంతాలను పాలించుచుండిరి.

కాకతి గణపతిదేవుడు చేసిన యుద్ధాలలో బొల్లయ నాయకత్వం వహించి దివిసీమ, నెల్లూరు, వెలనాడు ప్రాంతాలు, హోయసాల, చోళ, వైదుంబ, పాండ్య, యాదవ రాజులతో జరిగిన యుద్ధాలలో పాల్గొన్నారు. బొల్లయ తన రాజ్యంలో వివిధ దేవాలయాలను నిర్మించి నిత్య పూజలు, అంగరంగ భోగాలకు గాను అగ్రహారాలు, భూములను దానం చేసెను. ప్రజోపయోగ కార్యక్రమాలు అనేకం చేపట్టెను. బ్రాహ్మణులకు, వేద పండితులకు అగ్రహారాలిచ్చెను. వ్యవసాయాభివృద్ధికి కృషి చేసి తటాకాలు, చెరువులను తవ్వించెను. బొల్లయ గొప్ప సేనానిగా, పరిపాలనాదక్షుడిగా, భక్తి తత్పరుడిగా పేరుగాంచాడు.

## ఇమ్మడి విశ్వనాథుడు (క్రీ.శ. 1250-1268)

ఇతను బొల్లయ మల్లాంబల నాల్గవ కుమారుడు. గొప్ప పరాక్రమశాలి, బల సంపన్నుడు, అరివీర భయంకరుడు. తండ్రి తరువాత సామంత పాలకుడై జమ్మిలూరు, అమరాబాదు ప్రాంతాలను పాలించెను. క్రీ.శ. 1253 లో జలాల్పురము నందు ఒక శాసనం వేయించెను. ఇందులో చెఱకు వంశం యొక్క పుట్టుక, వివిధ పాలకులను గూర్చి చెప్పబడింది. అందులో ఇమ్మడి విశ్వనాథుని గూర్చి చెపుతూ మహావీరుడు రేపూండి గ్రామాన తన తల్లిదండ్రులు, తన ప్రభువు పేర బొల్లేశ్వర, మల్లేశ్వర, గణపేశ్వరాలయాలను నిర్మించెను. ఆలయాలలో పూజలకు, అంగరంగ భోగాలు, ధూపదీప నైవేద్యాలు సక్రమంగా నిర్వహించుటకు మామిడి నరవ క్రింద 40 నివర్తనాల భూమిని గని మెట్టుకు తూర్పున కడపరేయి కింద రెండు ఖండికల భూమి దానం చేసెను. సూరేపల్లి గ్రామాన్ని బ్రహ్మేశునకు, రేజింత గ్రామాన్ని విష్ణుదేవరాయలకు అగ్రహారంగా ఇచ్చెను. ఈ దానం స్వీకరించిన వారు శ్రీశైల క్షేత్ర పశ్చిమ ద్వారమగు అలంపుర నివాసులు శ్రీశైల మల్లికార్జున స్వామికి కారపాక గ్రామ దక్షిణాన లక్షపతి తటాకాన్ని దానమిచ్చెను. రాజోలు గ్రామాన దొడ్డపల్లి తటాకం కిందనున్న సగభాగం శ్రీశైల స్వామికిచ్చెను.

ఇమ్మడి విశ్వనాథునికి సంబంధించిన శాసనం అచ్చంపేట తాలూకా అమరాబాదు గ్రామ శివాలయం దగ్గర శిలాఫలకంపై ఉంది. క్రీ.శ. 1264 సంవత్సరం నాటి ఈ శాసనంలో ఇమ్మడి విశ్వనాథుడు శ్రీ బొల్లయ ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధికి గాను శ్రీ

సిద్ధిమహాలక్ష్మి దేవిని ప్రతిష్టించి, మాచిరాజు, ఇమ్మడిదేవర, రావణ శంకర, శుకదేవరలు వృత్తులు పెట్టు సందర్భాన శాసనం వేయించబడింది.

## చెఱకు వంశీయులు - అమరాబాదు శాఖ

**ఇమ్మడి బొల్లయ రెడ్డి :** చెఱకు సామంత రాజ్యాన్ని ఏలిన ఇమ్మడి బొల్లయరెడ్డి ప్రతిభావంతుడు, ప్రసిద్ధుడు, యుద్ధ విశారదుడిగా చెప్పబడెను. ఇతను వావిలాల వంశమున రుద్రయరెడ్డి సోదరి రుద్రసానిని వివాహమాడెను. రుద్రయరెడ్డి తమ సోదరి రుద్రసానికి, ఇమ్మడి బొల్లయరెడ్డికి పుణ్యంగా ఇరువెక, ఇంద్రేశ్వర దేవర పాత్రభోగానకు కంబలమ కాల్వను, సూఱాడ్ల కాల్వను అద్ద, మల్లి కాల్వను పాతిక కార్తీక, వైశాఖాలు సూర్యచంద్రులున్నంత వరకు ఇచ్చిరి. వీరు ఇరువురు వియ్యము నొందిరి.

క్రీ.శ.1286 నాటి అమరాబాదు శాసనంలో ఇమ్మడి బొల్లయరెడ్డికి పుణ్యంగా అమరావతిలోని మిందమల్లియ దేవరకు గుడి వెనుక ఒక పాతిక భూమి దానమిచ్చుచున్నట్లు చెప్పబడింది. అదే శాసనంలో ఇమ్మడిజెట్టి బొల్లయరెడ్డి వారి రాజ్యాభివృద్ధి, ఇమ్మడి దేవరకు పుణ్యంగా పతిమారువు గుండాల కాల్వ కింద నీరునేల పాతిక, ఆ వైపుననే 5 1/4 వెలిపొలం మహాసామంత చెఱకు ఇమ్మడి బొల్లయరెడ్డి వారి రాజ్యాభివృద్ధికి కీర్తికుంట వెనుకచేను పడమట నీరునేల ఇరుగారు పండినది బొల్లయరెడ్డి ఇచ్చెను.

## ఇమ్మడిజెట్టి బొల్లయరెడ్డి (క్రీ.శ.1290-1293)

ఇమ్మడి విశ్వనాథుని జ్యేష్ఠ కుమారుడు ఇమ్మడి దేవయ తనయుడు ఇమ్మడిజెట్టి బొల్లయరెడ్డి. ఇమ్మడి బొల్లయరెడ్డి జీవించి ఉండగానే ఇమ్మడిజెట్టి బొల్లయరెడ్డి రాజ్యపాలన బాధ్యత వహించినట్లు క్రీ.శ.1286 నాటి అమరాబాదు శాసనంలో చెప్పబడింది. ఇమ్మడి బొల్లయరెడ్డి క్రీ.శ.1290 లో మరణించాడు. ఇమ్మడిజెట్టి బొల్లయ మహాసామంతాధిపత్యం వహించియుండెను. అవిటినాయుడు, బొప్పరిపోచె అనువారు బొల్లయరెడ్డి వారికి పుణ్యంగా అమరావతి మైలార దేవరకు పొగసిరి వాగు కాల్వను వృత్తిగా ఇచ్చిరి. మైలారదేవి క్రీడాభిరామంలో ప్రస్తావించబడింది. కోమటి నరసింహాశెట్టి పోచెగారి చేత ఈ కాలువను స్వామి వారికిప్పించి పలపరచి చెల్లించెను. ఈ శాసనంలో కాకతీయ రాజుల ప్రశంస కలదు. కాయస్థ అంబదేవరాజు బలవంతుడై కాకతి నాయంకరులను ఓడించి, చెఱకు వంశీయులతో వియ్యమొందియుండెను.

ఇమ్మడిజెట్టి బొల్లయరెడ్డి, కర్నూలు ప్రాంతమందున్న వేలూరు పాలకుడగు మనమ బొల్లయరెడ్డి కాకతీయులను లెక్క చేయకుండా వుండవచ్చును. అందువల్ల ఇమ్మడిజెట్టి

బొల్లయరెడ్డి పృథ్వీరాజ్యం చేయుచుండగా అని పేర్కొనబడింది. కాకతి రుద్రమదేవి మరణానంతరం ప్రతాపరుద్రుడు రాజ్యానికి వచ్చి కాయస్థ అంబదేవుని ఓడించి, అతని స్నేహితులను, సామంతులను అణచివేసెను. ఇమ్మడిజెట్టి బొల్లయ సమాచారం తెలియుటలేదు. బహుశా సామంత స్థాయి నుంచి తొలగించి వుండవచ్చు.

**ప్రోలయరెడ్డి :** ఇమ్మడిజెట్టి బొల్లయ సోదరుడు ప్రోలయ ప్రస్తావన కనబడుతున్నది. క్రీ.శ. 1321 నాటికి కాకతి ప్రతాపరుద్రునికి అనుకూలుడై కలువకోలు ప్రాంతం నేలుచుండునని తెలియుచున్నది. తరువాత వీరి సమాచారం లభ్యం కావడం లేదు.

## చెఱకు వంశీయులు (తాడువాయి, పాలకవీడు శాఖ)

**మారయరెడ్డి :** కేతసేనాని కుప్పాంబికల రెండవ కుమారుడు మారయరెడ్డి. ఇతడు తన అన్న కాటసేనాని, తమ్ముడు బొల్లయ రెడ్డితో కలిసి కాకతి గణపతిదేవ మహారాజు యుద్ధాలందు సహకరించెను. క్రీ.శ. 1202 నాటికి మారయరెడ్డి మరణించగా జమ్ములూరు రాజ్యాధికారాన్ని బల్లయరెడ్డి స్వీకరించెను. బొల్లయరెడ్డి క్రీ.శ. 1202 లో కేతేశ్వర, కాటేశ్వర, మారేశ్వర, సూరేశ్వర దేవాలయాలను జలాల్పురమున నిర్మించి తన తండ్రి సోదరుల యెడల తనకు గల అభిమానాన్ని చాటుకున్నారు. మారయకు ఇరువులు కుమారులు. వారు మారయ గణపతి, అన్నయరెడ్డి.

## మారయ గణపతిరెడ్డి (క్రీ.శ. 1250-1299)

పాలకవీడు, తాడువాయి ప్రాంతాధిపత్యం స్వీకరించి, చక్కని పాలన చేసి దేవాలయాలకు భూదానాలిచ్చెను. క్రీ.శ. 1220లో గణపతిరెడ్డి సామంతాధిపతిగా పినతండ్రితో నియమిపబడినట్లు శాసనాలలో చెప్పబడింది. క్రీ.శ. 1269 నాటి పాలకవీడు హుజూర్‌నగర్ శాసనంలో గణపతిరెడ్డి తన తండ్రి మారయరెడ్డికి పుణ్యంగా జానపాటి చెఱవు కింద పొలమును, పోనుగోటి తూర్పు పడమర రాట్ల పూలతోట, దాని పడమర వనమును, బావిని ఇచ్చెను. తాడువాయి శాసనంలో గణపయ రెడ్డికి పుణ్యంగా శ్రీ చెన్నమల్లికార్జున మహాలింగ దేవునికి తాడువాయి ప్రజలు, కేతులెంక గారు తాడువాయి సర్వాయములో మాడ 12 బవిసుల రీతినిచ్చు సందర్భంగా వేయించినది. నేలమట్టి ప్రజలు ఆ ఊరి సిద్ధాయం ప్రకారమే దానమిచ్చిరి. క్రీ.శ. 1300 నాటి తాడువాయి శాసనంలో మారయ గణపతిరెడ్డి తన సామంత రాజ్యాన్ని సమర్ధవంతంగా నిర్వహించుచు, కాకతి రుద్రమ దేవి విధుయుడుగా ఉంటూ దేవాలయ నిర్మాణంలో తన సహచరులను ప్రోత్సహించాడు.

## అన్నయ రెడ్డి (క్రీ.శ. 1286 - 1315)

చెఱకు మారయరెడ్డి కుమారుడు సమర్ధుడిగా, శివ పూజా ధురందరుడుగా తన రాజ్యాన్ని చక్కగా పాలించాడు. క్రీ.శ.1306 నాటి తాడువాయి శాసనంలో అన్నయరెడ్డి చెన్నమల్లికార్జున దేవరకు ఆచంద్రార్క స్థాయిగా, అన్నయరెడ్డికి, రంగనాథ పెద్దింగారి వృత్తి పందము వెలిపొలం, మామిడి తోటను ఆచంద్రార్క స్థాయిగా అల్లు సూరిశెట్టి దానమిచ్చు సందర్భాన శాసన మివ్వబడింది. క్రీ.శ.1314 నాటి చెఱకు అన్నయరెడ్డి, నామిరెడ్డి ఊరి ప్రజల తాడువాయి మైలార దేవర అంగరంగ భోగములకు దానమిచ్చు సందర్భాన శాసనం వేయించిరి.

**నామిరెడ్డి :** అన్నయరెడ్డి అనంతరం అతని కుమారుడు నామిరెడ్డి తాడువాయి, పాలకవీడు ప్రాంత పాలకుడాయెను. క్రీ.శ.1314 నాటి శాసనంలో తాడువాయి మైలారదేవర అంగరంగ భోగాలకు ఊరను కొలబడిని నీరునేల, కొలపాటివరు దానమిచ్చు సందర్భమున ప్రశంసించబడినాడు.

**నాగిరెడ్డి బొల్లయరెడ్డి :** ఇతను చెఱకు వంశీయుడు. క్రీ.శ.1312 నాటి మేళ్ళచెఱువు శాసనంలో బొమ్మరాజు ఎఱ్ఱయ నాయంకర మందు నాగిరెడ్డి బల్లయరెడ్డి అధికారాన మేళ్ళచెర్వు మూలస్థాన శ్రీస్వయంభూదేవర రంగభోగానకు ఆ గ్రామమందలి వెలిపొలం సమస్త ప్రజలు దేవుని సన్నిధానంలో ధారపోసి ఇచ్చెను.

చెఱకు వంశీయులు (వేలూరు శాఖ) :

**పెద్ద దేవయ (క్రీ.శ. 1250-70) :** సుప్రసిద్ధుడైన చెఱకు బొల్లయరెడ్డి రెండవ భార్య కుమారుడు దేవయ వాహనీశుడు. తడు వేలూరు రాజ్యపాలకునిగా నియమింపబడి ఉండెను. ఇతని సంతతి వారు కర్నూలు జిల్లా నందికొట్కూరు ప్రాంతాన్ని మరికొన్ని భాగములను వేలూరు రాజధానిగా పాలించుచుండిరి. పెద్దదేవయ కాకతీయుల సామంతునిగా తుంగభద్రానది దక్షిణ ప్రాంతాలను ఏలుచూ కాయస్థరాజుల ప్రభావంతో అనేక శివాలయాలకు దానధర్మాలు చేసిరి.

**వేలూరి బొల్ల లేక మనుమబొల్ల :** (క్రీ.శ.1270-1291) పెద్ద దేవయ కుమారుడు మనుమబొల్ల తండ్రి అనంతరం వేలూరు సామంతరాజు అయినాడు. కొంతకాలం ఇతను రుద్రమదేవికి విధేయ సామంతుడిగా ఉండెను. కాకతీయులకు విధేయ సామంతుడై వేలూరు ప్రాంత పాలకునిగా నున్న మనుమ బొల్లయ కుమారుడు రాజరుద్రునికి అంబదేవుడు తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసి అల్లునికి కట్నంగా నందనపుర రాజ్యమొసంగి మనుమ

బొల్లయను కాకతీయులకు శత్రువుగా మార్చినాడు. తుంగభద్రా నదీతీర పర్యంత వ్యాప్తమైన భూభాగాలను అంబదేవుని ఆధీనంలోకి తెచ్చుకొనెను.

**రాజరుద్రుడు (క్రీ.శ.1291-1324) :** తన తండ్రి మనుమ బొల్లయ మరణానంతరం రాజరుద్రుడు చెఱకుకు సామంత పాలకుడాయెను. అంబదేవునికి ప్రతాపరుద్రునికి జరిగిన యుద్ధంలో ప్రతాపరుద్రుడు విజయం సాధించెను. అంబదేవుని అల్లుడు రాజరుద్రుడు కూడా యుద్ధంలో ఓడిపోయెను. మరలా ప్రతాపరుద్రునికి సామంతుడుగా ప్రకటింపబడెను. అప్పటి నుంచి రాజరుద్రుని గోరువంకపల్లి తామ్ర శాసనంలో కాకతివంశ వర్ణన తరువాత చెఱకు వంశ వర్ణన చెప్పబడింది. నందికొట్కూరు తాలూకా మల్యాల, లింగాల గ్రామాలలో చెఱకు రాజరుద్రుని శాసనాలున్నవి. రాజరుద్రుడు తన తండ్రి బొల్లయకు పుణ్యంగా నలుగురు బ్రాహ్మణులకు గ్రామదానమిచ్చే సందర్భాన గోరువంకపల్లి శాసనం ఇవ్వబడింది. తన తండ్రి బొల్లయ్యకు పుణ్యంగా లింగాల, మల్యాల శాసనాలు ఇవ్వబడినవి.

క్రీ.శ.1295 చెఱకు రాజరుద్రుడు కూరెళ్ళ సంగమేశ్వరుని సన్నిధిన, తమ పురోహితాగ్రగణ్యులైన లక్ష్మి ధరప్పనం గారికి కూఱెడ్ల సామ్యభోగ సహితంగా ధారవోసి ఇచ్చెను. లక్ష్మి ధరప్పనం గారు అనేక పుణ్యక్షేత్రాలకు, విప్రులకు దానమొసంగెను. స్వయంభూదేవరకు, దేవర పరిచారక బ్రాహ్మణులకు, నరసింహ దేవరకు, కొలిపాక సోమనాథ దేవరకు అనేక మంది విప్రులకు కూరెళ్ళ గ్రామంలోని భూములను దానమిచ్చెను. చెఱకు రాజరుద్రుడు ప్రతాపరుద్రుని అభిమానానికి పాత్రుడై వేలూరు, జమ్ములూరు రాజ్య భూభాగాలను నేలుచు మహమ్మదీయులతో జరిగిన ఓరుగంటి యుద్ధాన మరణించి యుండవచ్చును.

చెఱకు వంశపాలకులు మధ్యయుగంలో కాకతీయులకు సామంత దండనాయకులుగా ఉండి మహాసామంత స్థాయికి ఎదిగినారు. వారు నల్లగొండ, మహబూబునగర్, కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలను పాలించారు. తమ పాలనా కాలంలో వివిధ ప్రాంతాలలో శైవ దేవాలయాలను, మఠాలు, విద్యాలయాలు, చెరువులు, నీటి కాలువలు నిర్మించి వాటి నిర్వహణ దానాలు ఇచ్చారు. వీరి దాన గుణాన్ని చాటిచెప్పడానికి బిరుదులు వహించారు.

**ఆచార్య ఆర్. చంద్రశేఖర రెడ్డి**
ఆచార్యులు, చరిత్ర - పురావస్తు శాఖ, తెలుగు విశ్వవిద్యాలయం, శ్రీశైలం.
ఫోన్ : 9440125069



# గోలకొండ చరిత్ర - సంస్కృతి - శాసనములు

మూసీ ఒడ్డున పుట్టిన బి.ఎన్.శాస్త్రి గారు, చారిత్రక సేద్యం చేసి, దాదాపు 60కి పైగా గ్రంథాలను పండించారు. మూసీ  నదీ పరివాహక ప్రాంత చరిత్ర, సంస్కృతి, శాసనాలపై ఇంత వరకూ ఎవరూ చేయలేనన్ని పరిశోధనలు చేసి, మూసీనది, మరేనదికీ తీసిపోని దీమ నాగరికతను అందించిందని సగర్వంగా నిరూపించిన మహనీయ చరిత్రకారుడు. తెలంగాణ రాజన్యుల శాసనాలనే కాక, మొత్తం తెలుగు నేల నేలిన పాలకుల, సామంతుల శాసనాలను ఔపోసన పట్టి, లక్షలాది పేజీల చరిత్రను అందించిన మేటి శాసనం అంటే బి.ఎన్.శాస్త్రి గారని, చరిత్ర అంటే బి.ఎన్.శాస్త్రి గారని, సర్వస్వమంటే బి.ఎన్.శాస్త్రి గారని పేరుగాంచిన గొప్ప పరిశోధకుడు. తెలుగునాట ప్రత్యేకించి తెలంగాణలో ఆయన కాలుమోపని ఊరులేదు, వాడలేదు, చారిత్రక స్థలం లేదు, ఆయన చూడని బౌద్ధ, జైన క్షేత్రాలు, హైందవ దేవాలయాలు, మసీదులు, చర్చీలు, చివరికి గుట్టలు, గట్టులు, వాగులు, వంకలు, చెరువులు, చేమలూ, కొండలు, గుట్టలు, కోటలు, రాచభటులు, దండుపాటలు ఒకటేమిటి, అన్నీ చూచి, ఆకలింపు చేసుకున్నాడు. తన రచనల ద్వారా అందరికీ పంచి ఇచ్చాడు.

ఏ రాజవంశ చరిత్ర తీసుకున్నా, మునుపటి రచనల కంటే మిన్నగా, రాజకీయ నేపథ్యం, వంశావళి, పరిపాలన, సామాజిక, ఆర్థిక, మతపరమైన విశేషాలతో సమగ్రంగా రచించి, తెలుగు నేల చరిత్ర, సంస్కృతిని రచనా సుసంపన్నం చేశారు. శాసనాలను కూడా పొందుపరిచి, చరిత్ర రచనా పద్ధతికి కొత్త ఒరవడిని అందించారు. పగలంతా ఊళ్లు

దిరగటం, శాసనాల నకళ్లు దీయడం, చారిత్రక ఆనవాళ్ల ఫోటోలు తీయడంతో ఎడతెరిపి లేని శాస్త్రి గారు, ఎప్పుడు నిద్రపోతారో గానీ, రాత్రంతా తెచ్చుకొన్న శాసనాల నకళ్లను వేలాడదీసి, అక్షరం, అక్షరం తడిమి చూసి నిజమైన చరిత్ర నందించిన అలుపెరుగని చారిత్రక సైనికుడు. చిత్తుప్రతి లేకుండా సరాసరి మేలు ప్రతులతోనే చరిత్ర, శాసనాల గ్రంథాలను రాయటం ఆయనకి చెల్లు. ఆయన ఎప్పుడూ ఏకాకి కాదు, బహుకాకి, చుట్టూ నలుగురుంటే ఆయన ఆనందానికి అవధులుండవు. తాను తెలుసుకున్న విషయాన్ని నలుగురితో ముచ్చటించి, నిజాలను నిగ్గుతేల్చి, ఏ ఇజాల జోలికీపోక, నిజమైన చరిత్ర రచించడమే బి.ఎన్.శాస్త్రిజం అని నిరూపించినవాడు. ఆదరణ, ఆప్యాయతలు ఆయన ఉచ్ఛ్వాస నిశ్వాసలు. ఇతరులకు సాయమందించడమే తన వ్యవసాయమని నమ్మి, యువ పరిశోధకులకు మార్గదర్శన ఫలాలనిచ్చిన మహనీయుడు.

చరిత్రలో ఉన్న అగాథాల్ని పూడ్చి, సమగ్ర చరిత్ర రచనకు కొత్త భాష్యం చెప్పిన భాష్యకార్లు శాస్త్రిగారు. చరిత్రకందనంత కాలం నుంచి లెక్కలేనంత మంది, రాజులు, రాణులు, మంత్రులు, సామంతులు, రకరకాల ప్రజల ఇతివృత్తాలను మస్తిష్కంలో నింపుకొని, పుస్తకాల మధ్య జీవితాంతం కాలం గడిపిన శాస్త్రిగారు తెలుగు నాట సాటిరాని, పోటీలేని మేటి చరిత్ర పరిశోధకులు, శాసనపరిష్కర్తలు. ఆ ఒరవడిలో తెలుగునేల నేలిన అనేక రాజవంశ చరిత్ర, ఆ కాలపు సంస్కృతిపై శాసన ఆధారాలతో అనేక గ్రంథాలను రాశారు.

శాస్త్రి గారి ప్రత్యేకత ఏమిటంటే, తాను రాసిన గ్రంథాలు ఇంతకు ముందు ఎవరూ రాయనివే రాయడం, ఒక వేళ అంతకు ముందురాసినా, విషయాన్ని పునర్మూల్యాంకనం చేసి, శాసనాలను, కట్టడాలను చేర్చి ప్రచురించారు. అదిగో ఆ కోవకు చెందిందే బి.ఎన్.శాస్త్రి గారి రచన 'గోలకొండ చరిత్ర – సంస్కృతి శాసనములు.' 1989 లో వెలుగు చూసిన ఈ పుస్తకం, అత్యంత ప్రజాదరణకు నోచుకొని, మరుసటి సంవత్సరాదికే ప్రతులు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఆయన ఈ పుస్తకం మనవి మాటల్లో, దక్కను ఐదు ముస్లిం రాజ్యాలుగా విడిపోయి, తెలంగాణా పరాయి పాలకుల చేతుల్లో ఎలా విలవిలలాడిందో వివరించారు. కుతుబ్‌షాహీల పాలన ప్రారంభం నుంచి, క్రీ.శ.1687 లో పతనమైన తీరు, చిన్నచిన్న తెలుగు రాజ్యాలను ఏకం చేయడం, వారు తెలుగు సాహిత్యాన్ని పోషించిన విధం, అటు తరువాత మొగలుల పాలనలో మళ్లీ తల్లడిల్లిన తెలుగు నేల, మొదలైన వివరాలను సాక్ష్యాధారాలతో అందించడమే తన ధ్యేయమని పేర్కొన్నారు.

ఏదో రాయాలని రాయడం కాకుండా, అప్పటి వరకూ జరిగిన పరిశోధనలు, వెలువడిన గ్రంథాలను బాగా చదివిన నేపథ్యంలో విడివిడిగా వివిధ కోణాలలో వివిధ

రచయితల అభిప్రాయాలను ఒకచోట చేర్చి, సమగ్ర గోలకొండ చరిత్రను అందించారు శాస్త్రిగారు. ఒక ప్రామాణిక పరిశోధకుని పంథాలో గ్రంథ రచనకు ఉపకరించిన సంస్కృత, తెలుగు, ఉర్దూ, పారసీ శాసనాలు, గ్రంథాలు, విదేశీ యాత్రికుల రచనలు, సమకాలీన రాజవంశాల చరిత్రలో గోల్కొండ ప్రస్తావనలు, కట్టడాలు, (దేవాలయాలు, మసీదులు, కోటలు, సమాధులు) వారు విడుదల చేసిన నాణెములు ఆధారాలను కూలంకషంగా పరిశీలించిన శాస్త్రిగారు గోలకొండ చరిత్ర – సంస్కృతి శాసనముల గ్రంథాన్ని సాటిలేని మేటి గ్రంథంగా తీర్చిదిద్దారు. కుతుబ్‌షాహీల పూర్వ చరిత్ర, వారి వంశవృక్షం, టర్కీ మూలాలు, భారతదేశానికి రాక, సుల్తాన్‌అలీ పిన తండ్రితో కలిసి దక్కన్‌కు వచ్చి అక్కడి వాతావరణాన్ని, సంస్కృతిని మెచ్చుకోవడం, తరువాత అతడు మహమూద్ షా బహమన్ కోరికపై అస్తవ్యస్త తెలంగాణలో శాంతిభద్రతలను నెలకొల్పినట్లు, క్రీ.శ.1518 నుంచి 1543 వరకూ అతడు తొలుత కొడంగల్ జాగీర్దారుగా చేరి, తెలంగాణ సుబేదారై, క్రీ.శ.1518 లో స్వతంత్రుడై, గోల్కొండ కోటను బాగు చేయించి, రాజధాని నగరముగా తీర్చిదిద్దిన తీరును బి.ఎన్.శాస్త్రి గారు ఆసక్తికరంగా వర్ణించడమే కాక, ఫరిస్తా రచనల్లో కొంత నిజం లేదని తేల్చి చెప్పారు. తరువాత, సుల్తానుకులీ, తెలంగాణ నుంచి తూర్పుతీరాన్ని, రాజమహేంద్రవరాన్ని గెలిచి గోలకొండకు తిరిగొస్తూ దేవరకొండ దుర్గాన్ని వశపరుచుకొని, గోలకొండ కోటను పటిష్ఠపరిచి, అనేక కట్టడాలను నిర్మించి, విజయనగర సేనలను అడ్డగించడానికి మహబూబునగర్ జిల్లా పానగల్లు కోటను, 1530 ప్రాంతంలో కొండపల్లి తరువాత కొండవీడును, 1534 లో రాయచూరును వశపరుచుకున్నట్లు శాస్త్రిగారు., సుల్తానకులీ విజయ పరంపరను వర్ణిస్తూ, తెలుగునేలపై ముస్లిం పాలన ఎలా సుస్థిరమైందో కళ్లకు కట్టినట్లు వర్ణించారు. అటు తరువాత ఘన్‌పూర్, కోయిల్‌కొండ, ఖమ్మం కోటలను జయించాడు.

సుల్తాన్ కులీ తొలి శాసనాన్ని క్రీ.శ.1518లో హుస్నాబాదులో వేశాడనీ, అటు తరువాత, ఎల్లందుల, గోలకొండ, ఘన్‌పూర్, కొండపల్లి కోటల్లో శాసనాలను వేయించాడనీ అతడు గొప్ప శూరుడు, రాజకీయవేత్త, గణిత శాస్త్రజ్ఞుడు, పరిపాలనా దక్షుడు, గోలకొండ నిర్మాత అనీ, విజేతగా నిలిచిన అతడ్ని బడేమాలిక్ సుల్తాన్ కులీకుబ్‌షా అని పిలిచేవారని గోలకొండ రాజ్యంగా పిలువబడిన కుతుబ్‌షాహీ రాజ్య స్థాపన గురించి మునుపెవరూ రాయనన్ని వివరాలతో, సులభశైలిలో చరిత్రనందించారు శాస్త్రిగారు.

సుల్తాన్ కులీ మరణించిన తరువాత అతని ఆరుగురు కొడుకులు కలహించుకొని కొందరు మధ్యలో మరణించగా, మూడో కుమారుడైన యార్‌కులీ, జంషీద్ కుతుబ్‌షా పేరుతో క్రీ.శ.1543 నుంచి 1550 వరకూ క్రూరమైన పాలనను అందించి ప్రజా

కంటకుడైనాడని, సోదరులను హతమార్చి, కుతంత్రం పారక, ఇబ్రహీంకులీ, పొరుగు వారి సాయంతో విజయనగర ప్రభువైన రామ రాయలు అండగా ఉండి, అతడ్ని కొంతకాలం తమతో ఉంచుకొన్న విషయం, జంషీద్ బీదర్, అహ్మద్ నగర్, విజయనగర రాజులతో యుద్ధంచేసి వీరునిగా గుర్తింపు పొందినా, అతడి దుశ్చర్యలు అతని కీర్తిని కప్పి పుచ్చాయని, అతడు 67 వ యేట క్షయవ్యాధితో మరణించాడని శాస్త్రిగారు తెలియజేశారు. సుల్తాన్‌కులీ ఒక్క సంవత్సరం పాలన తరువాత, ఏడు సంవత్సరాలు విజయనగరంలో తలదాచుకున్న ఇబ్రహీం కుతుబ్‌షా (క్రీ.శ.1550-80) నాటకీయ నేపథ్యంలో గోల్కొండ సింహాసనాన్ని అధిష్ఠించడం, దక్కన్‌లో అంత:కలహాలు, రామరాయల జోక్యం, రామరాయలు పైగల గౌరవం సన్నగిల్లడంతో ఇబ్రహీం కుతుబ్‌షా రామరాయల్ని వ్యతిరేకించి, తల్లికోట యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం కూలిపోవడానికి దోహదం చేసిన పరిస్థితులను, తల్లికోట యుద్ధం జరిగిన తీరు, తల్లికోట యుద్ధానంతర పరిస్థితులు, ఇబ్రహీం కుతుబ్‌షా, తీరాంధ్రను జయించడం, గొల్కొండలో పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టడం, 1580 లో మరణించడం తదితర విషయాలను శాస్త్రిగారు వివరించి చెప్పారు. అప్పటి వరకూ చిక్కుముదులుగా వున్న చారిత్రక విషయాలపై శాసనాధారాలతో విప్పి, స్పష్టతనందించారు. ఇబ్రహీం కుతుబ్‌షా, కోయిల్‌కొండ, పానగల్లు రాచకొండ, కొలలంపూడి, ఈపూరు, మల్కాపురంలో సంస్కృతాంధ్ర శాసనాలను పానుగల్లు, ముక్కీదర్వాజా, గుండూరు,ఇబ్రహీం కుతుబ్‌షాహీ సమాధిపైన గల పారసీ, అరబిక్ శాసనాలు ఇబ్రహీం కుతుబ్‌షా పానలకు సంబంధించిన విషయాలను తెలియజేస్తున్నాయని శాస్త్రి గారు ఈ పుస్తకంలో వివరించారు.

ఏడో ప్రకరణంలో ఇబ్రహీం తరువాత, అతని మూడో కుమారుడు మహ్మద్ కులీకుతుబ్‌షా క్రీ.శ.1580లో సింహాసనాన్ని అధిష్ఠించాడనీ, తీరాంధ్రలోని గుంటూరు, రాజమండ్రి, శ్రీకాకుళంలను జయించి, గోల్కొండ సామ్రాజ్యాన్ని విస్తరించినట్లుగానూ, గోల్కొండ రాజ్యంతో, విజయనగర పాలకులైన తిరుమలరాయలు, వెంకటపతి రాయలు తలపడినా, కులీకుతుబ్‌షా వ్యూహాత్మకంగా ఎదుర్కోవటం, రాజకీయ చతురుడిగా, భాగ్యనగర్ నిర్మాతగా, అనేక కట్టడాల రూపశిల్పిగా, కవిగా, కళాపోషకుడిగా రాణించిన వివరాలను శాస్త్రిగారు కళ్లముందు కదలాడే సంఘటనలుగా వివరించారు. మహ్మద్ కులీకుతుబ్‌షా కాలపు దక్కన్ పరిస్థితులు, మీర్‌మోయిన్ అస్త్రబాది లాంటి ప్రముఖులను బయటినుంచి రప్పించుకొని చక్కటి పరిపాలనను అందించిన వివరాలతో పాటు, అతడు విడుదల చేసిన సంస్కృత తెలుగు శాసనాలు, ఐదు అరబ్బీ పారసీ శాసనాల వివరాలను శాస్త్రిగారు మనకు అందించారు. అవి, జుత్తిగ, అమీనాబాదు, మంగళగిరి (రెండు శాసనాలు), జాగర్లమూడి

(రెండు శాసనాలు), శ్రీకూర్మం (రెండు శాసనాలు), ధర్మవరం, సింహాచలం శాసనాలు, మీర్జా మహమ్మద్ సమాధి శాసనం, జామెమసీదు శాసనం, సాజిద్ ఖాదీమ్ మసీదు శాసనం, మహ్మద్ కులీకుతుబ్‌షా సమాధి శాసనాల వివరాలను తేదీలతో సహా తెలిపారు.

ఎనిమిదో ప్రకరణంలో క్రీ.శ.1612 –26 మధ్య గోల్కొండ నుంచి పాలించిన సుల్తాన్ మహ్మద్ కుతుబ్‌షా జీవిత విశేషాలను, కుతుబ్‌షా సోదరుని కుమారుడైన సుల్తాను మహ్మద్ క్రీ.శ.1607 లో హయత్‌బక్షీ బేగంను వివాహమాడినట్లు 1612 లో మహ్మద్ కులీకుతుబ్‌షా ఆరోగ్యం సన్నగిల్లగా, సుల్తాను మహ్మదును పట్టాభిషిక్తుడ్ని చేయడం, ఆ సందర్భంగా మీర్ మహ్మద్ అస్త్రబాదీ రెండు కవితల్ని వినిపించడం, అహ్మద్ నగరానికి ఆపన్నహస్తాన్ని అందించడం, 12 యేళ్ల క్రమం తప్పకుండా నమాజు చేసి, మక్కామసీదుకు పునాదిరాయి వేయడం, గోల్కొండ సుల్తాన్ పురాన్ని నిర్మించడం, 34 వ యేట మరణించడం దాకా అనేక వివరాలను అందించారు శాస్త్రిగారు.

తొమ్మిదో ప్రకరణంలో అబ్దుల్లా కుతుబ్‌షా, క్రీశ 1626 నుంచి క్రీ.శ.1672 వరకూ పాలించిన వివరాలను వివరించారు. ఏమంత సమర్థుడు కాని అబ్దుల్లా పాలన మంత్రుల అధీనంలో ఉండేదనీ, సుఖలాలసుడై పాలన పట్ల నిరాసక్తుడైనట్లు, బీజాపూరు ఆదిల్షా గోలకొండ ముట్టడిస్తున్న సంగతి తెలుసుకొని మీర్‌జుమ్లా నమ్మక ద్రోహానికి పాల్పడగా, అతనికి సహకరించిన విజయనగర రాజైన శ్రీరంగరాయలతోనూ, మొఘల్ సేనానులతోనూ కుతుబ్‌షా తలపడినట్లు, శాస్త్రిగారు వివరించారు. మీర్‌జుమ్లా సాయంతో కడప, సిద్ధవటం, గండికోటలను జయించి 40 లక్షల ఆదాయాన్ని పొందడం, తరువాత ఔరంగజేబు గోల్కొండ కోటపై దాడి చేయడం, హయత్‌బక్షీ బేగం సంధి కుదుర్చుకోవటం, మొగల్ ప్రతినిధుల ఆగడాలు, అబ్దుల్లా కుతుబ్‌షా విలాస జీవితం, అతని మూడో కుమార్తె భర్త అబుల్ హసన్ వారసుడు కావడం, అబ్దుల్లా ఎదుర్కొన్న యుద్ధాలను విద్యార్థులకు సైతం చక్కగా అర్థమయ్యేట్లు రాశారు.

పదో ప్రకరణంలో గోల్కొండ చివరి పాలకుడైన అబుల్‌హసన్ తానీషా జీవితంలోని ప్రధాన ఘట్టాలను వివరించారు. అబుల్ హసన్ సోమరి, తిరుగుబోతన్న కొందరి పండితుల అభిప్రాయాలు నిజంకాదని నిరూపించారు. అతడు సత్ప్రవర్తకుడని, ప్రజల అభిమానాలను చూరగొన్నారని, అక్కన్న,మాదన్నలనే బ్రాహ్మణులకు తన దర్బారులో మంచి పదవులిచ్చాడని, తోడల్లుడు సయ్యదహ్మద్ తనకు శత్రువుగా మారి, అంత:పుర వ్యవహారాలపై పెత్తనం చెలాయించాడని, 2.4.1672 న అబ్దుల్లా కుతుబ్‌షా మరణించగా, సయ్యదహ్మద్ అతని భార్య మాసాసాహెబ్‌లను బందీలుగా చేసి, అబుల్‌హసన్ గోల్కొండ సుల్తానుగా

ప్రకటింపబడినాడు. ఆ సంవత్సరం మొహర్రం 13 వ దినాన సింహాసనాన్ని అధిష్ఠించాడని తనకు ఏటా ఐదు లక్షల రూపాయలు చెల్లించాలనీ, అబుల్‌హసన్‌కు అన్నివిధాలా అండగా ఉంటానని ఔరంగజేబు ఫర్మానా పంపటం, మాదన్న మీర్‌జుమ్లా పదవిని అలంకరించడం, అబుల్‌హసన్ తానీషా, మాదన్నలు కర్ణాటక తీరాంధ్ర పర్యటనలు, కొండపల్లి, కొండవీడు దుర్గాల పటిష్టత, విదేశీ వ్యాపారులపై అదుపు, మాదన్న పట్ల ఔరంగజేబుకు కోపం, 1686 లో మొఘలులు గోల్కొండపై దాడి, హైదరాబాదు నగర విధ్వంసం, 1687 లో ఔరంగజేబు సైనికులు గోల్కొండలో ప్రవేశం, తానీషాను బందీగా దౌలతాబాదు చెరసాలలో ఉంచడం, క్రీ.శ. 1700 సంవత్సరంలో నిరహారదీక్షలో తానీషా మరణించడం, అప్పటి నుంచి దాదాపు గోల్కొండ మొఘల్ ఆధిపత్యంలో ఉండటం, ఒక్క వెలుగు వెలిగిన కుతుబ్‌షాహీల గోల్కొండ సామ్రాజ్యం కూలిపోయి విషాద గీతికను ఆలపించడం లాంటి అనేక చారిత్రక ఘట్టాలను పూసగుచ్చినట్లుగా వర్ణించారు.

పదకొండో ప్రకరణంలో గోల్కొండ రాజ్యంలో సామాజిక చరిత్ర, అమాత్యులు, ప్రభుత్వోద్యోగులు, న్యాయవ్యవస్థ, ఆదాయ వనరులు, సైనిక వ్యవస్థ, వారి జీతభత్యాలు. సాంఘిక, ఆర్థిక పరిస్థితులు, విద్య, కవులు, కళాకారుల గురించిన వివరాలు అందించగా, 12 వ ప్రకరణంలో గోలకొండ, హైదరాబాదు నగర నిర్మాణం, మందపల్లి, దుర్గాలను బలోపేతం చేసిన విధానాలను వర్ణించారు.

గోల్కొండ ఉత్థాన, పతనాలపై ఎన్నో గ్రంథాలు వెలువడినా, అన్నిరకాల చారిత్రకాధారాలతో గోలకొండ సమగ్ర చరిత్ర – సంస్కృతి పై శాస్త్రిగారి రచన అసామాన్యం. 13వ ప్రకరణంలో కుతుబ్‌షాహీల కాలం నాటి సంస్కృత, తెలుగు, పారసీ, అరబ్బీ విషయాలపై వివరణలిచ్చిన శాస్త్రిగారు విలక్షణ చరిత్రకారునిగా నిలిచిపోయారు. శాసనాల్లో సల్తాన్‌కులీ విడుదల చేసిన 1528 నాటి మహబూబ్‌నగర్ జిల్లా శాసనాలు, నల్లగొండ జిల్లా నాగులపాడులోని క్రీ.శ. 1544 నాటి ఎలీసుఖాన్ శాసనం, కోయలకొండ శాసనం, క్రీ.శ. 1566 నాటి నల్లగొండ జిల్లా పానుగల్లు శాసనం, క్రీ.శ. 1565 నాటి గుంటూరు జిల్లా కోలంపూడి శాసనం, క్రీ.శ. 1574 నాటి గుంటూరు జిల్లా ఈపూరు శాసనం, క్రీ.శ. 1577 నాటి అదేజిల్లా మర్కాపురం శాసనం, క్రీ.శ. 1583 నాటి మహ్మద్‌కులీ పశ్చిమ గోదావరి జిల్లా జుత్తిగ శాసనం, క్రీ.శ. 1590 నాటి శ్రీకాకుళం జిల్లా బోడగుల శాసనం, క్రీ.శ. 1592 నాటి గుంటూరు జిల్లా అమీనాబాదు శాసనం, క్రీ.శ. 1593 నాటి మంగళగిరి శాసనం, క్రీ.శ. 1598 నాటి గుంటూరు జిల్లా జాగర్లమూడి శాసనం, క్రీ.శ. 1599 నాటి శ్రీకూర్మం శాసనం, క్రీ.శ. 1600 నాటి ప్రకాశం జిల్లా ధర్మవరంలోని ఎక్లాస్‌ఖాన్ శాసనం,

క్రీ.శ. 1602 నాటి జాగర్లమూడి శాసనం, క్రీ.శ.1604 నాటి శ్రీకూర్మశాసనం అదే సంవత్సరం సింహాచలం శాసనం, క్రీ.శ.1619 నాటి గుంటూరు జిల్లా మాచర్ల శాసనం, క్రీ.శ.1650 నాటి అనంతపురం జిల్లా అనుంపల్లియిని అబ్దుల్లా కుతుబ్‌షా శాసనం, క్రీ.శ.1656 నాటి అబ్దుల్లా కుతుబ్‌షా గోలకొండ కోటలోని మూసాబుర్జు శాసనం, క్రీ.శ.1658 నాటి చిత్తూరు జిల్లా మదనపల్లె తౌలుత దేవుల చెరువు శాసనం, క్రీ.శ.1663 నాటి గుంటూరు జిల్లా పెదపరిమి శాసనం, క్రీ.శ.1664 నాటి కరీంనగర్ జిల్లా శనిగరం శాసనం, క్రీ.శ.1668 నాటి, గుంటూరుజిల్లా తెనాలి తాలూకా ఈపూరు శాసనం, క్రీ.శ.1669 నాటి కృష్ణాజిల్లా కుదురవెల్లిలోని అబుల్‌హసన్ తానీషా శాసనం, అదే సంవత్సరం తమిళనాడులోని ఉత్తర ఆర్కాటు జిల్లా అరక్కోణం తాలూకాలోని కావేరిప్పాక్కం శాసనం, తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా, తిరుకల్లూరు తాలూకాలోని కువ్వలోనున్న క్రీ.శ.1670 నాటి శాసనం, క్రీ.శ.1677 నాటి అనంతపురం జిల్లా హిందూపురం తాలూకా ఛాగలేడు శాసనం, క్రీ.శ. 1678 నాటి ముక్తేశ్వర శాసనం, క్రీ.శ.1678 నాటి లేపాక్షి శాసనం, క్రీ.శ.1680 నాటి గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఎడ్లపల్లి గ్రామంలోని శాసనం, క్రీ.శ.1686 నాటి చిత్తూరుజిల్లా, సత్యవేడులోని శాసనాలను శాస్త్రిగారు ఒకచోట చేర్చి, శాసనంలోని రాజు లేక అధికారి, ఏయే సందర్భాల్లో శాసనాలను వేయించారో వివరాలను అందించారు. దక్షిణ భారత శాసన సంపుటాల్లోనూ,ఇంకా ఇతరత్రా ప్రచురితమైన శాసనాలను రాజుల వారీగా, తేదీల వారీగా ఒకచోట చేర్చి మొదటిసారిగా తెలుగులో అచ్చువేయించిన ఘనతకు దక్కించుకున్నారు. పరిశోధకులకు, చరిత్ర అధ్యాపకులకు బి.ఎన్.శాస్త్రి గారి గోలకొండ చరిత్ర – సంస్కృతి – శాసనములు గ్రంథం ఒక ప్రామాణిక ఆధార గ్రంథంగా ఉపయోగపడుతుందనటంలో సందేహం లేదు.

**డా. ఈమని శివనాగిరెడ్డి**

ప్రముఖ శాసన చరిత్ర పరిశోధకులు, సిఇఓ, కల్చరల్ సెంటర్ ఆఫ్ అమరావతి, విజయవాడ

ఫోన్ : 9848598446



# రేచెర్ల రెడ్డి వంశ చరిత్ర - శాసనములు

చరిత్ర పట్ల నిబద్ధత కలవారే నిక్కమైన చరిత్రను రచించగలుగుతారు. చరిత్ర రచనకు కావల్సిన నిరంతర పరిశోధన, సత్యాన్వేషణ, నిష్పక్షపాత వైఖరులున్న చరిత్రకారులు ఎక్కడైనా పిడికెడే. తెలంగాణలో చరిత్రకారులు తక్కువ. పక్షపాత ధోరణులతో కొందరు రాసిన చరిత్రలో తెలంగాణకు దక్కిన చోటూ తక్కువ.

తెలంగాణకున్న అఖండమైన చరిత్రను పరిశోధించి, తెలంగాణ చరిత్రను తిరిగి రాయాల్సిన సందర్భంలో గుర్తుచేసుకోవాల్సిన గొప్ప చరిత్రకారుడు బి.ఎన్.శాస్త్రి. ఉత్తమ శాసన పరిశోధకులుగా, చరిత్ర అధ్యయనవేత్తగా, సృజనాత్మక రచయితగా, సర్వస్వాల నిర్మాణకర్తగా, చరిత్ర, సంస్కృతీ గ్రంథాల రచయితగా, పత్రికా సంపాదకునిగా, ఎవరికి ఏ అవసరం చప్పినా తీర్చే దాతృత్వం గల ఉదాత్తునిగా, బహుముఖీన వ్యక్తిత్వ సంపన్నుడిగా, తెలంగాణలో నడయాడే చారిత్రక సర్వస్వంగా భిన్నూరి నరసింహ శాస్త్రి శాఖోపశాఖలుగా విస్తరించారు. ఆ మహానుభావుడిని స్మరించుకోవడం మన తెలంగాణ చరిత్రను మనం యాదికి తెచ్చుకోవడమే.

కాకతీయుల ఏలుబడికి స్తంభాలుగా నిలిచిన మాండలికులు, సామంతులు, చమూపతుల వంశీకులలో రేచర్ల రెడ్డి, చెరకు రెడ్డి , కందూరి చోడ, మల్యాల, విరియాల, వావిలాల, త్యాగి, నతవాడి, కోట, కాయస్థ, ఇందులూరి, గోన, రేచర్ల పద్మనాయకులు ప్రధానమైనవారు. బి.ఎన్.శాస్త్రి రచించిన చరిత్ర గ్రంథాలలో కాకతీయ చరిత్రకు దన్నుగా నిలిచిన, వారి రాజ్య సంస్కృతిలో అంతర్భాగమైన 'రేచర్ల రెడ్డివంశ – శాసనములు' ప్రాధాన్యత

కలిగినవి. కాకతి మొదటి బేతరాజు నుంచి రుద్రమదేవి వరకు పరిపాలనా కాలంలో ఉన్నత పదవులలో నియమించబడిన రేచర్ల రెడ్డి వంశం వారు వారికి సామంతులుగా, మంత్రులుగా, సైన్యాధ్యక్షులుగా వుండేవారు. అంతేకాదు, పరిపాలకులుగా ఆమనగల్లు, పిల్లలమర్రి, మిర్యాలగూడ, నాగులపాడు, సోమవరము, ఎలకుర్తి, ములుగు, నర్సంపేట, మాచాపూర్, హుజురాబాద్ ప్రాంతాలను ఏలినారు. వీరి వంశీకుల పాలకులు, రాణులు, మంత్రులు, అనుచరులు నిర్మించిన దేవాలయాల నిర్వహణలకు చేసిన దాన శాసనాలు వీరి చరిత్రను తెలిపే ఆధారాలు.

సాధారణంగా అందరు చరిత్రకారులు రాజుల చరిత్రకు ఇచ్చినంత ప్రాధాన్యత వారి సామంతులకు, సైన్యాధ్యక్షులకు, పరివారాలకు ఇవ్వకపోవడం కనిపిస్తుంది. బి.ఎన్.శాస్త్రి శాసనాధారిత చరిత్రకే ప్రాధాన్యతనివ్వడమే కాకుండా రాజుల సామంతుల, చమూపతుల వంటి ద్వితీయశ్రేణి, తృతీయశ్రేణి పాలకులను గురించి కూడా రాజులు గురించి రాసినంత విలువగానే రాశారు. వారు చక్రవర్తుల సార్వభౌమత్వాలకు ఎంత సాయపడ్డారో, యుద్ధాలలో ప్రాణత్యాగాలు చేశారో, రాజ్య నిర్వహణలో ఎంత కర్తవ్య నిష్ఠతో పనిచేశారో సవివరంగా రాశాడు. రేచర్ల రెడ్డి వంశీకులు, కాకతీయ పాలకుల వద్ద (మొదటి బేతరాజు నుంచి రెండవ ప్రతాపరుద్రుని వరకు) రెండువందల యేండ్లకు పైగా తమ సేవలందించారు.

బి.ఎన్.శాస్త్రి ఈ చారిత్రక శాసన సంకలనంలో రెండు శాఖల రేచర్ల రెడ్ల గురించి రాయడానికి శాసనాలు, గుడులు, నిర్మాణాలు, మతాలు, విద్యాకేంద్రాలు, సాహిత్యం, మతగురువులు, దుర్గాలు, శిల్పాలు, చెరువుల తవ్వకాలను ఆధారంగా తీసుకున్నాడు.

**1. శాసనాలు :** పాత జిల్లాలు వరంగల్, నల్లగొండ, కరీంనగర్, ద్రాక్షారామం, వేల్పూరు ప్రాంతాలలో లభించిన 30 శాసనాలను గ్రహించారు.

**2. దేవాలయాలు :** రేచర్ల రెడ్లు శైవమతావలంబకులు కావడం వల్ల వారు, వారి రాణివాసాల స్త్రీలు గుళ్ళను కట్టించి, వారి నిర్వహణకు భూములను, ధనాన్ని, అగ్రహారాలిచ్చారు. ఆ దేవాలయాలలో పిల్లలమర్రి దేవాలయాలు, నాగులపాడు దేవాలయాలు, రామప్పగుడి, గొడిశాల పంచలింగేశ్వరాలయం, డిచ్చకుంట, రామన్నపేట చిట్యాలపాడు, ఎలకుర్తి, మాచాపూర్ దేవాలయాలను ఎన్నుకున్నారు.

నిజానికి కాకతీయ పాలకులు కట్టించిన గుళ్ళలో మిగిలివున్నది వేయిస్తంభాల గుడి ఒక్కటే. మిగితావన్నీ రేచర్ల రెడ్లు కట్టించినవే అంటాడు పరబ్రహ్మశాస్త్రి.

**3. కట్టడాలు :** వీరు కట్టించుకున్న అంత:పురాలు, ధన, ధాన్యాగారాలు, నివాసాలు, వాడలు ఒక సాక్ష్యం.

**4. మఠాలు :** శైవాగమవేత్తయైన ఇవటూరి సోమన అధిపతిగా ఎరుకసాని ఎరుకేశ్వరంలో శైవ మఠాన్ని నిర్మించింది.

**5. విద్యాపీఠాలు :** శైవ మఠాలు, ఘటికాస్థానాలు, గుడులు నాటి విద్యాకేంద్రాలు, ఎరుకవరం, పిల్లలమర్రి వంటి చోట్ల విద్యార్థులకు వసతులు, ఉపాధ్యాయులకు జీతాలు, భూదానాలివ్వడం వారి విద్యా పోషణకు నిదర్శనాలు.

**6. సాహిత్యం :** శాసనకర్తల సాహిత్య, చాటువులు, హరిహరార్యుడు, ఇవటూరి సోమన, బాల సరస్వతి మంచిరాజు, మహాదేవమంచి, సోమమంత్రి, పినవీరభద్రుడు వంటి కవి పండితుల సాహిత్య రచనలలో లభించిన సమాచారం రేచర్లరెడ్ల చరిత్ర తయారీలో ఉపకరించింది.

**7. శైవమత గురువులు :** ఇవటూరి సోమన, విశ్వేశ్వర శివదేశికులు

**8. దుర్గములు :** రేచర్ల రెడ్లు నిర్మించిన గిరి, స్థల దుర్గాలు ఆమనగల్లు, పిల్లలమర్రి, ఉంద్రుగొండ, ఉర్లుగొండ, వాడపల్లి, ఎలకుర్తిలలో కనిపిస్తాయి.

**9. శిథిల శిల్పసంపద :** రేచెర్ల రెడ్లు కట్టించిన ఆలయాలలోని శిల్ప సంపద వారి కళా పోషణను, వారి కాలపు సంస్కృతిని తెలిపేవిగా వున్నాయి.


**10. తటాకాల నిర్మాణం :** వీరు ప్రసిద్ధమైన రామప్ప చెరువుతో పాటు ఇరవైకి పైగా చెరువులు తవ్వించి ప్రజా సంక్షేమానికి పాటు పడ్డారు.

పైన రాసుకున్న ఆధారాలను ఆధారం చేసుకొని బి.ఎన్.శాస్త్రి రేచర్ల రెడ్ల వంశ చరిత్రను, వారి పాలన, సైనిక శక్తులు, శైవభక్తి, ప్రజా సంక్షేమ కార్యకలాపాలు, రాజభక్తి గురించి విపులంగా రాసాడు.

## రేచర్ల రెడ్ల వంశ చరిత్ర

లభించిన శాసనాలు, చారిత్రక గ్రంథాల నుంచి సేకరించిన సమాచారాలతో రేచర్ల రెడ్ల వంశానికి ఆద్యుడిగా బమ్మసేనాని నిర్ణయించబడ్డాడు. బమ్మసేనాని మూలాలు తేల్చవలసిన పరిశోధనాంశం. ప్రక్క పేజీలోనిది బి.ఎన్.శాస్త్రి గారు చేసిన రేచర్ల రెడ్డి వంశ క్రమ నిర్మాణం. డా. పి.వి.పరబ్రహ్మ శాస్త్రి గారు కూడా కాకతీయులు లో ఇచ్చిన క్రమం కొంచెం నామభేదాలు కలిగి ఉంది.

# రేచర్ల రెడ్డి వంశవృక్షం




ఈ రెండు వంశవృక్షాలలో పెద్ద తేడాలు లేకపోయినా, వరుస క్రమాలు అటీటుగా వున్నాయి. బి.ఎన్.శాస్త్రి, రుద్ర సేనాని మనుమడు పసాయితకు వీరపసాయిత అనే కొడుకున్నట్లు చూపాడు. పరబ్రహ్మశాస్త్రి నామిరెడ్డికి విశ్వనాథ అనే మరో కొడుకున్నట్టు, అంతకు ముందు కామిరెడ్డికి ఇద్దరు భార్యలున్నట్టు చూపాడు. బి.ఎన్.శాస్త్రి బేతిరెడ్డికి కామసాని, ఎరుకసాని లిద్దరు భార్యలుగా చూపాడు. పరబ్రహ్మశాస్త్రి ఎరుకసాని నొకదానినే చూపాడు. ఇద్దరు ఉద్ధండుల నడుమ తప్పిపోయిన పేర్ల జాడలను వెతికి పున:ప్రతిష్ఠ చేయాల్సి వుంది. కాకతీయ

సంచికలో ఇచ్చిన వంశవృక్షము ఇంత సమగ్రంగా లేదు. అప్పటికీ శాసనాలన్నీ లభించకపోవడమే దానికి కారణం.

ఇటీవల మాకు (కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి) ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో లభించిన కొత్త దాన శాసనం గణపతిదేవ చక్రవర్తి సేనాని రుద్రసేనాని కొడుకు కాటరెడ్డి కొడుకు పసాయిత గణపతిరెడ్డి చమూనాథునిది. ఈ శాసనం కూడా రేచెర్ల రెడ్ల వంశ చరిత్రకు అదనంగా చేర్చతగిందే. ఈ పసాయిత చమూనాథుడి గురించి ధర్మారావు పేట శాసన మొక్కటే తెలుపుతున్నదని బి.ఎన్.శాస్త్రి రాశాదు. కానీ, మాకు లభించిన నేలకొండపల్లి, ములుగు గణపురం శాసనాలలో పసాయిత గణపతిరెడ్డి చమూనాథుడు ప్రస్తావించబడ్డాడు.

## రేచెర్ల రెడ్ల వంశం

రేచెర్ల ఇంటిపేరు గల వారు రెడ్లు, వెలమలున్నారు. కాకతీయ సంచికలో వెలమలు రేచెర్ల గోత్రీకులని, రేచెర్ల ఇంటిపేరు గలవారు రేచెర్ల రెడ్లని పేర్కొనబడింది. కాకతీయ సామంతులైన రేచెర్ల రెడ్లు రేచరువుల గ్రామస్థులని, రేచడి లేక రేచర్ల కుటుంబీకులు రేచర్ల వెలమలుగా పేరొందినట్లుగా కాకతీయులలో పీవీ పరబ్రహ్మ శాస్త్రి రాశాదు. కానీ, బి.ఎన్.శాస్త్రి రేచెర్ల రెడ్ల జన్మస్థలం, తొలి రాజధానిగా పూర్వ నల్లగొండ జిల్లా ఆమనగల్లును పేర్కొన్నాడు. అంతేగాక బేతిరెడ్డికి ధనం లభించిన ఘట్టం ఆమనగల్లులోనని ప్రచారంలో వున్న కథలోనిది. బి.ఎన్.శాస్త్రి దానిని పిల్లలమర్రిలో జరిగినట్లుగా రాశాదు. చారిత్రకాధారం లేనివి ఊహింపబడటం సహజమే. శాస్త్రి పిల్లలమర్రిలో రేచెర్ల రెడ్లు స్థిరపడదానికి కారణంగా ఈ కల్పన చేసివుంటారేమో.

రేచెర్ల రెడ్ల ఇంటిపేరు కూడా రేచెరువుల. రేచర్ల అని రెండు విధాలుగా శాసనాలలో రాయబడింది. రేచర్ల రెడ్లలో ఎలకుర్తి శాఖ వారికి కాక పిల్లలమర్రి శాఖ రేచెర్ల రెడ్లలో మాత్రమే బేతిరెడ్డి, నామిరెడ్డి, కాట్రెడ్డి, కామిరెడ్డిలు ఆమనగంటి పురవరేశ్వరులుగా, మనుమ కులం వారుగా పిల్లలమర్రి, నాగులపాడు, అన్నవరం, రామన్నపేట శాసనాలు పేర్కొంటున్నాయి. మనుమ కులం గురించి ఎక్కడా వివరణ లేదు. రేచెర్ల రెడ్లకు మనుమ కులం వుందంటే రెడ్డి అనేది కులం పేరు కాదని చెప్పినట్టే కదా. రెడ్డి అనే మాట రడ్డిగా చాలాచోట్ల చెప్పబడింది. కళ్యాణీ చాళుక్యుల శాసనాలలో రడి అనే మాట రాయబడింది. మనుమ అనే మాట చతుర్థ కులజుడైన కొండపడమటి బుద్ధరాజు వంశంలో మంద అనే అతనికి పేరు ముందర మనుమ వుంటుంది. (చందవోలు శాసనం) ఆ చర్చ అసంగతమే అయినా, బి.ఎన్.శాస్త్రి వంటి మౌలిక చరిత్ర పరిశోధకులు వీటిని విశ్లేషించి వుంటే బాగుండేదనిపించింది.

**రేచెర్ల రెడ్ల వంశ మూలపురుషుడు బమ్మసేనాని :** కాకతి సేనాపతి మహావీరుడు. కాంచీపురాన్ని జయించి ఆ విజయాన్ని కాకతీయులకు అందించిన స్వామిభక్తిపరుడు. బమ్మసేనాని గురించి రుద్రసేనాని పాలంపేట, ఎరుకసాని పిల్లలమర్రి, నామిరెడ్డి పిల్లలమర్రి, కాటచమూపతి చిట్యాలంపాడు శాసనాలు బమ్మసేనాని యుద్ధతంత్ర విశారదునిగా, వీరునిగా, కాంచీపురాన్ని గెలిచి కాకతివల్లభునికి విజయలక్ష్మితో వివాహ మొనరించిన వాడని పేర్కొంటున్నాయి. ఆ సమయంలోని కాకతి వల్లభుడెవరని బి.ఎన్.శాస్త్రి చేసిన చర్చ యుక్తియుక్తంగా వుంది. ఆ కాకతివల్లభుడు మొదటి బేతరాజు (క్రీ.శ.1051) గా నిర్ణయించాడు. కాకతీయులలో పరబ్రహ్మశాస్త్రి కూడా మొదటి బేతరాజుగానే నిర్ధారించినాడు.

**రేచెర్ల ముచ్చ సేనాపతి మొదట ప్రోలరాజు చమూపతి :** నామిరెడ్డి, ఎరుకసాని పిల్లలమర్రి శాసనాలలో పేర్కొనబడ్డారు. ముచ్చసేనాని బమ్మసేనాని కొడుకో, మనుమడో అని సందేహాన్ని వెలిబుచ్చాడు బి.ఎన్.శాస్త్రి. సందేహానికి కారణం రాసివుంటే బాగుండేది. బమ్మసేనాని 1035 నుంచి 1055 వరకు కాకతీయుల కొలువులో వున్నపుడు, క్రీ.శ.1050 నుంచి 1076 వరకు పాలించిన మొదటి ప్రోలరాజు వద్ద పనిచేసిన ముచ్చసేనాని బమ్మసేనానికి కొడుకవడానికే అవకాశం వుందని నా అభిప్రాయం. పరబ్రహ్మ శాస్త్రి ముచ్చ బమ్మసేనాని కొడుకనే రాశాడు.

**కాకతీయ సేనాని రేచెర్ల కాటచమూపతి :** పాలంపేట, చిట్యాలంపాడు, పిల్లలమర్రి శాసనాలలో ప్రస్తావించబడ్డాడు. రెండవ బేతరాజు సామంత మాండలికుడు, చమూపతి కాటసేసాని.

**రేచెర్ల కాటచమూపతి కొడుకు కామసేనాని :** కామచమూపతి కోడలు ఎరుకసాని పిల్లలమర్రి, కొడుకు నామిరెడ్డి పిల్లలమర్రి, పెద్దకొడుకు రెండవ కాటచమూపతి చిట్యాలంపాడు, మనుమడు రుద్రసేనాని పాలంపేటలలో వేయించిన శాసనాలలో కామసేనాని గురించిన వర్ణనలున్నాయి. రెండవ ప్రోలరాజు కందూరునాడు, పొలవాసలపై చేసిన యుద్ధాలలో తనకు విజయాలను చేకూర్చినవాడు కామసేనాని.

**కామసేనాపతి కొడుకు రెండవ కాటచమూపతి :** తాను వేయించిన చిట్యాలంపాడు శాసనంలో, తన కొడుకు రుద్రసేనాని వేయించిన పాలంపేట శాసనంలో ప్రశంసింపబడ్డాడు కాటచమూపతి. కాకతి రుద్రదేవ మహారాజు కాలంలో సామ్రాజ్య రక్షణాభారం వహించి, మహా సామంతాధిపతిగా ఎలకుర్తి రాజ్యాన్ని పొందాడు. రేచెర్లరెడ్డి వంశంలో మొదటిరాజుగా కీర్తిగాంచాడు. కాలచురి బిజ్జలుని కుట్రలను ఛేదించడంలో రాజుకు అండదండగా నిలిచి రాజ్యాన్ని కాపాడినవాడు రెండవ కాటచమూపతి.

**పిల్లలమర్రి బేతిరెడ్డి పేరుగాంచిన వాడు కామచమూపతి రెండవ కుమారుడు :** ఇతని భార్య పేరు ఎరకసాని. ఇతనికి 2వ కాటసేనాని అన్న. నామిరెడ్డి తమ్ముడు. బేతిరెడ్డి కాకతి రుద్రదేవుని సామంతుడు. చమూపతి, బేతిరెడ్డి స్వయంగా గచ్చె బొల్లెనాయుడితో కలిసి వేయించిన శాసనం (1213), ఎరకసాని శాసనా(1208)లలో ప్రశంసింపబడ్డాడు. సోమవరం, వాడపల్లి, పిల్లలమర్రి శాసనాలలో పిల్లలమర్రి బేతిరెడ్డిగా పేర్కొనబడ్డాడు.

ఈ బేతిరెడ్డి రుద్రదేవుని చేత ఆమనగల్లు పురవరాధీశ్వరుడుగా ప్రతిష్ఠించబడ్డాడు. అయితే బేతిరెడ్డి వేటలో అలిసి పిల్లలమర్రిలో ఒకప్పుడుండే మర్రిచెట్టు నీడన పడుకొని వున్నపుడు, చెట్టుపైనున్న పిట్టలు రెండు గాలివానకు ఆ చెట్టు కూలిపోతుందని, దాని మొదట్లో 7 కొప్పెర్ల ధనం దొరుకుతుందని మాట్లాడుకుంటే పక్షుల భాష తెలిసిన ఒక ఎరుకల వాడు విని నవ్వుకున్నాడట. అది చూసి పిట్టలతనిని తాను విన్న మాటల్ని ఎవరికైనా చెపితే తల పగిలి చస్తావని పిట్టలు శపించాయట. అక్కడే విశ్రమించిన బేతిరెడ్డి ఎరుకలవాని నవ్వుకు కారణాన్ని ప్రశ్నిస్తే జవాబు చెప్తే తాను తల పగిలి చస్తానని, అయితే తాను విన్న పిట్టల మాటలను బేతిరెడ్డికి చెప్పి, తాను మరణిస్తే తన పేరు మీద గ్రామాన్ని కట్టమని ఎరుకలవాడు చనిపోయాడట. బేతిరెడ్డి ఆ నీడ విడిచి జరుగగానే మర్రిచెట్టు కూలిపోయి, దాని మొదట్లో ధనం లభించిందట. ఆ ధనంతో బేతిరెడ్డి పిల్లలమర్రి కోట నిర్మించి ఆ గ్రామానికి ఎరుకవరము అని పేరు పెట్టాడట.

ఇలాంటి కథే ఆమనగల్లులో చెవ్విరెడ్డి లేదా బేతాళనాయుడు విషయంలో చెప్తారు. ఆమనగల్లును చెవ్విరెడ్డి పాలిస్తున్నపుడు రేచడనే మాలతని నాగలికి తట్టి నిధి బయటపడ్డదట. దాన్ని తీయడానికి నరబలి కోరిందట నిధి. ఆ సంగతి బేతాళ నాయునితో చెప్పి, తనను బలియిచ్చి ఆ ధనం తీసుకొని, తన పేరు తమ ఇంటిపేరుగా ధరించాలని కోరినాడట. అదేవిధంగా వెలమలు లేదా పద్మనాయకులు ధరించిన ఇంటిపేరు రేచడ్ల లేదా రేచర్ల అయిందని లోకం కథ.

ఈ రెండు కథలు రేచర్లరెడ్లు, రేచర్ల పద్మనాయకుల నడుమ సంబంధ, భేదాలను చరిత్రలో నింపాయి. ఎవరి మూలాలెక్కడివో చారిత్రక ఆధారాలు శాసనాల వల్ల దొరికినంతనే తప్ప మరోవిధంగా చూపశక్యం కావు. బేతిరెడ్డి చాలాకాలం వరకు జీవించి వున్నట్లు బి.ఎన్.శాస్త్రి రాశాడు. రేచెర్ల రెడ్లలో నొక శాఖ పిల్లలమర్రి రెడ్లుగా పిలువబడడానికి కారకుడు, పలు దేవాలయాల నిర్మాత, దాత బేతిరెడ్డి రేచెర్ల రెడ్లలో ప్రఖ్యాతుడు.

**రేచెర్ల నామిరెడ్డి కామసేనాని మూడో కొడుకు :** ఇతని భార్య ఐతాంబిక. నామిరెడ్డి

స్వయంగా మూడు శాసనాలను వేయించాడు. నామేశ్వరాలయాన్ని కట్టించాడు. కాకతి రుద్రదేవునికి తీరాంధ్ర ప్రాంతాల గెలుపుకు సహకరించిన వారిలో నామిరెడ్డి ఒకడు. రేచెర్ల రెండవ కాటసేనాని పెద్ద కొడుకు రెండో ముచ్చసేనాని. అతని సోదరుడు రుద్రసేనాని వేయించిన ఎలకుర్తి శాసనంలో ప్రశంసింపబడ్డాడు.

**రుద్రసేనాని రెండవ కాటచమూపతి రెండో కొడుకు :** రుద్రసేనాని రుద్రదేవుని చమూపతి. రుద్రదేవ, మహాదేవుల మరణానంతరం కాకతీయ సామ్రాజ్యాన్ని ఆక్రమించడానికి నాగతి భూపాలుడు, 2వ పృథ్వీశ్వరుడు, 3వ కుళోత్తుంగ చోళుల దాడులు, గణపతి దేవుడిని యాదవరాజు నిర్బంధించడం వంటి రాజరిక ప్రమాదాలను ఎదిరించి, పోరాడి కాకతీయ సామ్రాజ్యాన్ని కాపాడడానికి కాకతీయ చమూపతులనేకం చేసిన ఘనత రుద్రసేనానిది. రుద్రసేనాని ఉప్పరపల్లి, పాలంపేట, ధర్మారావుపేట, ద్రాక్షారామం, ఎలకుర్తి, సోమవరం శాసనాలలో ప్రస్తావించబడ్డాడు. ప్రశంసింపబడ్డాడు. ఎలకుర్తి రాజ్య పాలకుడైన రుద్రసేనాని రామప్ప దేవాలయాన్ని కట్టించాడు. రామప్ప చెరువును తవ్వించాడు.

**లోక చమూపతి రుద్రసేనాని జ్యేష్ఠ పుత్రుడు :** ఎలకుర్తి శాసన కర్త. ఎలకుర్తిలో దేవాలయాల నిర్మాత లోక చమూపతి. తన గురించి ఎక్కువగా సమాచారం లేదు.

**పెద్ద గణపతి చమూపతి రేచర్ల రుద్రసేనాని రెండో కొడుకు :** కాకతీయ గణపతిదేవ చక్రవర్తి ఇతనిని సకల సేనాధిపతిగా నియమించాడు. ఎలకుర్తి, ద్రాక్షారామ శాసనాలలో పెద్ద గణపతి పేర్కొనబడ్డాడు.

**నాలుగవ కాట సేనాపతి రేచర్ల రుద్రుని 3వ కొడుకు :** మాచాపూర్, డిచ్చకుంట, ధర్మారావు పేట శాసనాలలో ప్రస్తావించబడ్డాడు. గణపతిదేవుడు ఇతనిని తన సైన్యంలో మందడి (అశ్వ సైన్యాధిపతిగా), సామంతుడిగా నియమించాడు. చోళ, పాండ్య యుద్ధాలలో కాకతీయులకు విజయం చేకూర్చడంలో 4వ కాటసేనాని పాత్ర శ్లాఘనీయం.

గణపతి చమూపతి లోకసేనాని కొడుకు, రుద్రారెడ్డి మనుమడు. ఒక్క ఎలకుర్తి శాసనంలోనే ఇతని పేరు ప్రస్తావించబడింది.

**పసాయిత చమూనాథుడు 4వ కాటసేనాని, రేచాంబల కొడుకు :** ధర్మారావు పేట శాసనంలో పేర్కొనబడిన వాడు పసాయిత చమూనాథుడు.

**వీర పసాయిత చమూపతి పసాయిత చమూనాథుని కొడుకు :** ధర్మారావు పేట శాసనంలో ప్రస్తావించబడ్డాడు. ఇతని మంత్రి సోమన.

**మల్లారెడ్డి పిల్లలమర్రి బేతిరెడ్డి, ఎరుకసానుల కొడుకు :** పిల్లలమర్రి శాసనంలో మాత్రమే పేర్కొనబడినవాడు.

**లోకిరెడ్డి బేతిరెడ్డి, కామసానుల కొడుకు :** ఊటూరు శాసనంలో ప్రస్తావించబడ్డాడు.

**మూడవ కాట్రెడ్డి నామిరెడ్డి, ఐతాంబికల కుమారుడు :** నాగులపాడు, తాడువాయి శాసనాలలో ప్రశంసింపబడ్డవాడు కాట్రెడ్డి. ఇతని భార్య పారసాని, ఆమనిగంటి పురవరాధీశ్వరుడుగా ప్రసిద్ధి పొందినవాడు.

**మూడవ కాట్రెడ్డి కొడుకులు నామయ, కామయ, మల్లయలు :** ఈ ముగ్గురు కొడుకులు తల్లిదండ్రుల పుణ్యం కొరకు నాగులపాడు త్రికూటేశ్వరాలయం, మూసేటికాలువ కింద భూదానం చేసినట్లు నాగులపాడు శాసనం తెలుపుతోంది.

**గణపిరెడ్డి, మర్రెడ్లు** నామిరెడ్డి రెండో కొడుకు కామిరెడ్డి , ఇతని భార్య కామసాని సంతానం. నాగులపాడు, అన్నవరంలలో కామిరెడ్డి వేయించిన శాసనాలు గణపిరెడ్డి, మర్రెడ్లను ప్రస్తావిస్తున్నాయి.

బి.ఎన్.శాస్త్రి ఈ పుస్తకంలో శాసనాలలోని చారిత్రక అంశాలను ముఖ్యంగా శాసనాల్లో చెప్పబడిన అగ్రహారాలు, భూములు, గ్రహీతల పేర్లివ్వడం అభినందనీయ విషయం. శాసనాలను చదివే వారికి శాసనాలను పోల్చి చూసుకోడానికి మంచి అవకాశం. వివిధ కాలాలలో వివిధ ప్రదేశాలలో వేర్వేరు పాలకులు చేసిన దానాలు, దేవాలయ నిర్మాణాలు, వేర్వేరు చోట్ల ఒక పాలకుడు చేసిన దానాలు, దేవాలయ నిర్మాణాల వివరాలు చరిత్రకు అవసరమైన ఆధారాలు. ఈ వివరాల వల్ల అప్పటి పేర్లు మిగిలిన వూర్లు, చెరువులు, దేవాలయాలు ఇప్పుడున్నవెన్నో తెలుస్తుంది. దానివల్ల చరిత్రకు రుజువులు దొరికినట్లు అవుతుంది. పుక్కిటి పురాణాలను చూపించి, గొప్పలకు పోయే వారికి కనువిప్పు కలిగించే చారిత్రక నిదర్శనాలివి. అన్నీ కాకతీయులు కట్టించినవే అనే మాట కాకతీయులకు వారికి విధేయులైన సామంతులు, సేనాపతుల వల్ల దక్కిందని చెప్పవచ్చు. రాజ్యం వారిదే అయిన్నా సామంతులు నిలిపిన రాజ్యసౌధమే వారిదని అర్థమౌతోంది.

రేచర్ల రెడ్లు రెండు శాఖలుగా ఎలకుర్తి, ఆమనగల్లు ప్రాంతాలను పాలించినపుడు వారి పాలనలో ఎలకుర్తి కింద ఎలకుర్తి, మాచాపూర్, గోడిశాల, డిచ్చకుంట, ధర్మారావుపేట, రామన్నపేట, చిట్యాలంపాడు, పాలంపేటలు. ఆమనగల్లు కింద ఆమనగల్లు, పిల్లలమర్రి, నాగులపాడు, తాడువాయి, వాడపల్లి, బూరుగుగడ్డ, సోమవరం, సిరికొండ, చిలుకూరు ప్రాంతాలున్నాయి.

రేచెర్ల రెడ్డి పాలకులు ఆమనగల్లు, పిల్లలమర్రి, ఉంద్రుకొండ, ఉర్లుకొండ, వాడపల్లి, సిరికొండ, పాలకవీడు, ఎలకుర్తి, చిట్యాలంపాడు, ధర్మారావు పేటలలో దుర్గాలను నిర్మించారు. తమ సైన్యాలతో దుర్గ రక్షణ చేస్తూ, కాకతీయ సామ్రాజ్యానికి కంచుకోట వలే రక్షణ భారాన్ని వహించారు.

తాము ఏలికలుగా వున్న ప్రాంతాలలో రేచెర్ల రెడ్లు వ్యవసాయాభివృద్ధి కొరకు 37 నీటి వనరులను ఏర్పరిచారన్న వివరాలను పొందుపరిచిన బి.ఎన్.శాస్త్రి 'యథా రాజా తథా సామంత' అన్న కొత్త సామెతను తెచ్చారు.

రాజ్యము ఆహార సంపన్నతతో వున్నపుడు దానిమీద ఆధారపడిన ప్రతీ పరిశ్రమ, వ్యవసాయాధారిత వృత్తులన్నీ బలపడతాయి. ఎగుమతి, దిగుమతులు జరుగుతాయి. రేచెర్ల వారి ఆధీనంలో వున్న వాడపల్లి నిజానికది ఓడపల్లి. అక్కడి నుంచి సార్థవాహులు కాకతీయ రాజ్యంలో ప్రవేశించి వ్యాపారాలు నిర్వహించుకునేవారు. ఓడపల్లి సాతవాహను కాలంనుంచి ఓడరేవే. ఓరుగల్లు రాచవీధులలో అమ్మిన సుగంధ ద్రవ్యాలు, వస్త్రాలు, ముత్యాలు, రత్నాలు విదేశ, స్వదేశ వ్యాపారుల వల్ల వాడపల్లి నుంచి వచ్చి చేరినవే.

నాటి మత పరిస్థితులను కూడా బి.ఎన్.శాస్త్రి సాకల్యంగా, నిష్పక్షపాతంగా వివరించారు. కాకతీయులు తొలుత జైనులైనప్పటికీ రెండవ ప్రోలరాజు కాలం నుంచి శైవాన్నాదరించడం వల్ల జైనం, బౌద్ధాలు అనేకమైన వేధింపులకు, దాడులకు, బసదులు, ఆరామాలు నిర్మూలనకు గురైనవి. చక్రవర్తుల ననుసరించిన రేచర్ల రెడ్లు కూడా శివమతానుయాయులై, శైవ దేవాలయాల నిర్మాణాలను, వాటి నిర్వహణలకు దానాలను చేశారు.

ఈ కాలంలో జైనుల సాహిత్యం వెలుగుకు నోచుకోలేదు. వారు రాయలేదా, రాసినవి నశించాయా? కారణాలు తెలియవు. శైవ, వైష్ణవ సాహిత్యం విరివిగానే వెలువడింది. రేచెర్ల రెడ్ల శాసనాలలో శాసన కవుల పాండిత్యం కనిపిస్తుంది. ఒక్కొక్క శాసనం ఒక్కొక్క కావ్యమా అన్నట్లు రాయబడ్డాయి.

చరిత్రను సంపూర్ణంగా రాసే విధానంలో బి.ఎన్.శాస్త్రి నెలకొల్పిన సంప్రదాయం అనుసరణీయం. 'శాసనాధారిత రచనే' తన దృక్పథమనీ చెప్పారు. శాసనాలను ఆధారం చేసుకొని బి.ఎన్.శాస్త్రి రాసిన రేచెర్ల రెడ్ల వంశ చరిత్ర ప్రశంసనీయం. ఎక్కడా ఏ చిన్న ఆధారాన్ని వదలకుండా సమాచారాన్ని సేకరించి క్రమబద్ధీకరించడంలో వారి చారిత్రక దృష్టి సర్వదా గణనీయం. రేచెర్ల రెడ్ల వంశీకులతో పాటు వారి రాణివాసపు స్త్రీలలో 28 మంది పేర్లను, రేచెర్ల రెడ్డి వంశ పాలకులు, సామంతులలో 64 మంది పేర్లను, వారి

పాలనలో పేర్కొనబడిన 39 గ్రామాల పేర్లను ఒకచోట చేర్చి చరిత్ర పరిశోధకులకు మంచి జాబితాను అందించారు. శాసన పరిశోధకులకు, చరిత్రకారులకు గొప్ప రెఫరెన్స్ పుస్తకం రేచెర్ల రెడ్డి వంశ చరిత్ర, శాసనములు.

ఈ పుస్తకం వల్ల చరిత్రకు కలిగిన ప్రోది తక్కువదేం కాదు. ఒక్కచోట ఒక వంశ చరిత్రనంతా చదువుకోడానికి అవకాశమిచ్చింది. రేచెర్ల రెడ్లను ప్రస్తావించిన 30 శాసనాలు వారి వంశ వృక్షాన్నివ్వడమే కాకుండా వారి కాలంలోని సామాజిక స్థితిగతులు, రాజ్యపాలన, ఆర్థికస్థితి, మతం, సాహిత్య, సాంస్కృతిక విశేషాలను తెలియజేస్తున్నాయి. వాటిని బి.ఎన్.శాస్త్రి ప్రత్యేకంగా రాయడం చరిత్రకారులకు చరిత్ర రాయడానికి చెప్పిన శిక్షణా పాఠమే.

**శ్రీరామోజు హరగోపాల్**
ప్రముఖ చరిత్ర పరిశోధకులు
ఫోన్ : 99494 98698



# రేచర్ల పద్మనాయకులు


తెలంగాణ చరిత్రకు కొత్త నిర్వచనానిచ్చి, కొత్తచూపు చూపి, కొత్తదారులు వేసి, వర్ధమాన చంద్రులకు సత్పథగామిగా నిలిచిన మహనీయులు బి.యన్.శాస్త్రిగారు. సమ్యక్పరిశీలన, శాసన శోధన, వివేచనాశక్తి, శివారాధనే ఆస్తిగా గలవారు శాస్త్రిగారు. జీవితాన్నంతా చరిత్ర శోధనకు, శాసన పరిశీలనకు, భాషా సరస్వతి పాదాలకు పాద్యంగా ఒసగిన ధన్యజీవి. కోరి చెలిమి చేసుకోవలసినవారు లోకంలో కొందరే తారసపడుతారు. ఆ కొందరిలో ముందుగా చెప్పవలసినవారు బి.యన్.శాస్త్రిగారు. నిశితమైన చూపు, నిర్మలమైన మనస్సు, సహజమైన ఆప్యాయత, సందర్భశుద్ధి ప్రసంగాలు, నిక్కమైన వ్యక్తిత్వము నిరంతరాయ శాసన శోధన, అన్ని కలిస్తే శాస్త్రిగారు. వారు వెళ్ళిపోయి పదిహేడు సంవత్సరాలైనా వారు అందించిన తెలంగాణ చరిత్ర దోసిళ్ళలోని పూల పరిమళం ఇంకా వీస్తూనే వుంది. ఆయన సంకల్పము, పూనిక ప్రతిభా ప్రాగల్భ్యాలు, సమ్యగ్బోధ, నిరంతరం జ్ఞాపకం వస్తూనే ఉంటాయి. ఎంతటి మనీషులో, అంతటి సహృదయులు. విద్వన్మూర్తి బి.యన్.శాస్త్రిగారు. వారు తెలంగాణ చరిత్రను 'తమసోమా జ్యోతిర్గమయా' అన్నట్లుగా చీకట్లోంచి వెలుగులోకి తెచ్చిన జిజ్ఞాసువు. ఈ విజ్ఞాన యాత్రికుడికి, సహృదయానికి సదృశమైన ప్రజ్ఞ, ప్రసన్న వదనం, సరస్వతీ కలభాషిణిత్వం, జన్మత: ఆయనకు అబ్బిన పరిమళ ధూపం. 'అకర్మత అచేతన లక్షణం' అని చేసే ప్రతి పని వ్యక్తికి, సమాజానికి ప్రయోజనం కావాలి అని నమ్మి, పరిశోధనను జీవితకాలం అంతా కొనసాగించిన ప్రాత:స్మరణీయుడు బి.యన్.శాస్త్రిగారు.

వినుకొండే విష్ణుకుండినుల రాజధాని అని, లేదు లేదు ధరణికోట అని, కాదు కాదు గోదావరి జిల్లాలోనే వుంది అని, అటకల మీద, భోషాణాలలోను, కుండలలోనూ చాటుమాటున దాగి ఉన్న రాగి శాసనాల కవిలె కట్టలు తీసి దులిపి, శోధించి నాణేలను తిరగేసి, మరగేసి, పరిశీలించి ఆనాటి చరిత్రకారులు తేల్చి ఊపిరి పీలుస్తున్న సమయంలో బి.యన్.శాస్త్రిగారు తుమ్మలగూడెం రెండు రాగి శాసనాలను ప్రచురించి 1969 భారతి వాల్యూం 42, నెం.6,7 పుట. 1-28, 2-14) రామన్నపేట దగ్గర ఇంద్రపాల నగరమే (తుమ్మలగూడెం వద్ద) విష్ణుకుండినుల రాజధాని. ఏలేశ్వరం, కీసరగుట్టల తర్వాత ఉండిందని, నాణేలు, శిథిలాలు, శాసనాల ఆధారంగా నిరూపిస్తూ ఫిరంగిలాగా దూసుకొచ్చారు బి.యన్.శాస్త్రిగారు. ఆనాటికే ఆంధ్రావాదం గద్దెనెక్కి బాసిపెట్టి వేసుకొని కూర్చొని ఉంది. 'విష్ణుకుండినుల చరిత్రను' గచ్చువేసి కట్టేసినాం, చలనం లేదనుకొన్నారు. శాస్త్రిగారి సిద్ధాంతం పక్షాన సత్యం ఉన్నట్టుందే. దీనిని సిద్ధాంతం చేయడం ఎలాగా అని, నేలటూరి వెంకట రమణయ్య, అజయమిత్ర శాస్త్రి, మారేమండ రామారావు, డి.సి. సర్కారు లాంటివారు అనేకమంది శాస్త్రిగారు వెలుగులోకి తెచ్చిన శాసనాలను పున: పరిశీలించినారు. తప్పని పరిస్థితులలో శాస్త్రిగారి వాదాన్ని అంగీకరిస్తూనే కాలనిర్ణయాన్ని వెనక్కి ముందుకు జరుపుతూ గందరగోళం సృష్టించి, విష్ణుకుండినుల చరిత్ర సరళంగా సాగిందో, వక్రీకరించిందో తేల్చడానికి మల్లగుల్లాలు పడి చేతులెత్తేశారు. విష్ణుకుండినుల రాజ్యం ఆంధ్ర ప్రాంతంలోనే వెలసిందని పూరించిన శంఖారావం నిరుపయోగమైంది. శాస్త్రిగారు నిర్భయంగా, ధైర్యంగా నిలిచి, విశ్వ విద్యాలయాల్లో పెద్ద పరిశోధకులమన్నవారినందరి వాదాన్ని మట్టి కరిపించి, కాల నిర్ణయం చేశారు. అదే తదనంతర కాలం ప్రమాణంగా నిలిచింది. ఇలా అనేక సందర్భాల్లో బి.యన్.శాస్త్రిగారు చేసిన పరిశోధన వెలుగులోకి తెచ్చిన కొత్త శాసనాలు తెలంగాణా చరిత్రకు నిర్దుష్టమైన, ప్రామాణికమైన స్థానం పరిశోధకులలో కలిగించారు.

బి.యన్.శాస్త్రిగారు తెలంగాణాను కాకతీయ సామ్రాజ్య పతనానంతరం పాలించిన 'రేచర్ల పద్మనాయకుల చరిత్ర', శాసనాలను రేచర్ల పద్మనాయకులు అనే పేర ప్రచురించి ఈ వంశీయుల చరిత్రను వెలుగులోకి శాసనాధారంగా తెచ్చారు. నల్లగొండ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా, వరంగల్ జిల్లా, తిరుపతి, కంచి, సింహాచలం ప్రాంతాలలో గల వారి శాసనాలను, లభ్యమైన అంతవరకు సేకరించి, పరిష్కరించి, సమకాలీన రాజవంశాల చరిత్రలో పునఃసమీక్ష చేసి, స్థానికచరిత్రలో కైఫీయతులు, గ్రంథాల అవతారికలను పరిశీలించి ఒక క్రమపద్ధతిలో వారి వంశవృక్ష, పాలనా కాల నిర్ణయం చేసినారు. సమకాలీన

రాజవంశీయులలో కొండవీటిని పాలించిన 'రెడ్డిరాజుల చరిత్ర'లో పద్మనాయకులకు రెడ్డిరాజులకు గల వైరాన్ని మల్లంపల్లి సోమశేఖరశర్మ కొద్దిగా ప్రస్తావించడం జరిగింది. స్థానికంగా ప్రచారంలో ఉన్న వెలుగోటి వారి వంశావళి, జూపల్లి వారి వంశావళి లాంటి అనేక వంశపారంపర్యంగా వస్తున్న, ప్రచారంలో ఉన్న వంశావళుల నుండి, శాసనాధారంగా అనేక ఇతర ఆధారాలను క్రోడీకరించి శాస్త్రిగారు రేచర్ల పద్మనాయకుల చరిత్రను రచించారు. అందులో పద్మనాయకుల కాలంలో రచించబడిన సాహిత్యం, ఆ కాలంలో వెలసిన శిల్ప సంపద, వారి నిర్మాణ కౌశల్యానికి దర్పణంగా నిలిచిన దుర్గ నిర్మాణాలు, ఆరామ తటాకాలు, ఆ కాలపు చరిత్ర, సంస్కృతిని క్రమపద్ధతిలో పాఠకులకు, పరిశోధకులకు అందించారు. ఆ తర్వాత బయటపడిన రెండు, మూడు కొత్త శాసనాలు, సాహిత్య ఆధారాలు తప్ప మౌలికంగా శాస్త్రిగారి పరిశోధన పద్మనాయకులకు సంబంధించి ప్రమాణికంగానే నేటికి నిలిచి ఉ ంది. క్రీ.శ. 1326 నుండి క్రీ.శ.1482 వరకు తెలంగాణా ప్రాంతపు చరిత్ర నిర్మాణానికి సంబంధించి శాస్త్రిగారు సేకరించిన ఆకరాలు, రచనలు ముఖ్యంగా సింగభూపాలుని రసార్ణవ సుధాకరం, రత్నపాంచాలిక, విశ్వేశ్వర కవి చమత్కార చంద్రిక, బొమ్మకంటి అప్పయాచార్యుని అమరకోశ వ్యాఖ్యలు, గౌరన రచించిన లక్షణదీపిక, నవనాథ చరిత్ర, హరిశ్చంద్రోపాఖ్యానం, స్వరమంజరి లాంటి రచనలను, పోతన భోగినీ దండకం, వీరభద్ర విజయము, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక లాంటి రచనలను, బాణభట్టు రచనలను పద్మనాయక రచనలో ఉపయోగించుకొన్నారు. 1999–2000 ప్రాంతంలో ఈ వ్యాస రచయితతో పై గ్రంథాలను చదివించి అందులోని చారిత్రక శకలాలను ఎలా ఏరాలో చూపించి, తులనాత్మక పరిశీలనలను నేర్పే ప్రయత్నంలో భాగంగా 'రసార్ణవ సుధాకరం'పై అనేక వ్యాసాలను రచించటానికి ప్రోత్సహపరిచినారు శాస్త్రిగారు. అంతేగాక 'మూసీ' పత్రికలోను, 'ఉదయిని' సంచికలలోను వాటిని ప్రచురించి ప్రోత్సహించారు.

పద్మనాయక వంశ వృక్షాన్ని బి.యన్.శాస్త్రిగారు తమకు లభ్యమైన రాచకొండ, దేవరకొండ, దేవలమ్మ నాగారం, పానుగల్లు, భువనగిరి, దోమపల్లి, ఉమామహేశ్వరం, జాతరేవు, గార్ల, ఐనవోలు, శాయంపేట, తిరుపతి, సింహాచలం, బెల్లంకొండ శాసనాలను ఆధారం చేసుకొని వెలుగోటి వారి వంశావళిని, ఇతర వంశచరిత్రలను దృష్టిలో పెట్టుకొని పద్మనాయకుల వంశ వృక్షాన్ని బి.యన్.శాస్త్రిగారు ఈ క్రిందివిధంగా తయారు చేశారు.




రాచకొండకు చెందిన ఈ వంశవృక్షంలో చెవిరెడ్డికి (బేతాళ నాయకుడు) సంబంధించి కొన్ని వివాదాలున్నప్పటికీ మిగతాదంతా శాసన, సాహిత్యాధారాలే. బేతిరెడ్డి నేటి సూర్యాపేటకు దగ్గర గల ఆమనగల్లు (మూసీ ఒడ్డున గల) గ్రామవాసి అని శాసన చరిత్రాధారాలున్నాయి. ఈ గ్రామం రేచర్లరెడ్డి వంశీయుల పాలనలో ఉన్నట్టు అనేక చారిత్రక ఆధారాలున్నాయి. చెవ్విరెడ్డికి సంబంధించి అనేక కథలు ప్రచారంలో ఉన్నవాటిని బి.యన్.శాస్త్రిగారు సేకరించి ఇతర చరిత్రకారులలాగానే బేతిరెడ్డి సంపూర్ణ చరిత్ర లభ్యం గానందున, ఆతని పాలనాకాలం క్రీ.శ.1210–1265 అని నిర్ణయించిన పట్టిక, ఆ తర్వాత చరిత్రను మాత్రమే క్రోడీకరించారు.

బేతాళ నాయకుని కుమారులు ఇద్దరిలో దామానాయుడు, ప్రసాదిత్య నాయుడు ముఖ్యులు. ప్రసాదిత్యనాయుడు గణపతిదేవుని అనంతరం పాలనలోకి వచ్చిన రుద్రమదేవి కాలంలో నేలకొండపల్లి ప్రాంతంలో కాకతీయ సామంతునిగా ఉన్నట్లు క్రీ.శ 1254లో వేసిన నేలకొండపల్లి శాసనం ద్వారా గమనించవచ్చు.

ఈ ప్రసాదిత్యనాయుడు కాకతీయుల తరఫున అనేక యుద్ధాలలో ఆరితేరినందు అతనికి 'కాకతీయ స్థాపనాచార్య' బిరుదు, 'రాయ పితామహాంక' అనే బిరుదుతో పాటు బాహత్తర నియోగాధిపతిగా నియమింపబడినట్లు శాస్త్రిగారు నిరూపించారు. ప్రసాదిత్య నాయుని సోదరుడైన రుద్రానాయుని వివరాలు వెలుగోటి వంశావళిలో గాని, శాసనాధారాలు గాని లభ్యము కావటం లేదు. అందువలన కాకతీయుల కొలువులో పనిచేసి ఉండవచ్చు అని ఊహించడము అవుతుంది. వెన్నమనాయుడు క్రీ.శ.1303లో మాలిక్ ఫకీరుద్దీన్ జూనా అనువాని నాయకత్వంలో ఢిల్లీ సుల్తానుల సైన్యం కాకతీయ రాజ్యభాగాలను ముట్టడించినపుడు సబ్బినాటిలోని ఉప్పరపల్లి, గొడిశాల ప్రాంతములో వారిని కాకతీయుల తరఫున ఎదిరించినాడని శాస్త్రిగారు పేర్కొన్నారు. పద్మనాయకుల వంశములోని ఎఱదాచానాయుడు క్రీ.శ. 1316 కంచి ముట్టడిలో ప్రధానపాత్ర పోషించినట్లు ముఖ్యంగా వీర పాండ్య, విక్రమపాండ్య, సుందర పాండ్య, కులశేఖర పాండ్య, పరాక్రమ పాండ్యలను ఎదుర్కొని, వారిని ఓడించటం వల్ల 'కంచి కవాట చూరకార!' 'పంచ పాండ్య దళ విభాళ', 'పాండ్య గజకేసరి' లాంటి బిరుదులు పొందినట్లు గల ఆధారాలను బి.యన్.శాస్త్రిగారు నిరూపించారు.

బి.యన్.శాస్త్రిగారు, రుద్రమదేవి కాలములో పానుగల్లు నుండి మార్జవాడి వరకు పాలించిన కాయస్థరాజైన అంబదేవుడు రుద్రమదేవి పాలనను వ్యతిరేకించి ఆమె మరణానికి కారణమయినాడు. కాయస్థరాజులైన గంగయసాహిణి, జన్నిగదేవుడు, మొదటి త్రిపురారులు కాకతీయుల సామంతులుగానే ఉన్నారు కాని క్రీ.శ. 1272 నుండి క్రీ.శ. 1302 వరకు పాలించిన అంబదేవుడు ఎప్పుడూ కాకతీయ సామంతునిగా చెప్పుకొనక, కాకతీయ రాజ్యంలోని కొంత భూభాగాలను ఆక్రమించాడు. క్రీ.శ.1290 నాటి త్రిపురాంతక శాసనంలోని అంబదేవుడు, రుద్రమదేవి సామంతులైన 'పంచాదిక సప్తతి క్షతి భృతులను' జయించినట్లు చెప్పుకొన్నాడు. ఇతని కుమార్తెను చెఱకు బొల్లయ కుమారుడు రాజణ్ణకు ఇచ్చి వివాహం చేసినట్లు త్రిపురాంతక శాసనములో నున్న విషయాన్ని బి.యన్.శాస్త్రిగారు త్రిపురాంతక దేవాలయ శాసనాలలో వివరించారు. ఈ రాజణ్ణకు రుద్రదేవుడని పేరు.

ఇతని శాసనాలలో కర్నూలు జిల్లా నందికొట్కూరు తాలూకా, మల్యాల గ్రామంలో నున్నవి. క్రీ.శ. 1291 నాటి మరొక శాసనము దగ్గరి గ్రామమైన లింగాలలో కలదు. చెఱుకు బొల్లయ, అతని కుమారుడు, రాజణ్ణలు అంబదేవునికి వియ్యంకుడు మరియు అల్లుడు వరస కాని వీరు అంబదేవునితో పాటు కాకతీయులకు వ్యతిరేకంగా తిరుగుబాటులో పాల్గొన్నారా లేదా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. దోనేరు కోనేరు రచించిన 'బాల భారతాంతర్గతమైన 'యౌవరాజవంశావళి' గ్రంథంలో

**"నమితారి తాత పిన్న మహీ విభుండు**
**సమితిలో చెఱకు రాచనరేంద్రు గెలిచి**
**ఆలవుగా సప్తాంగ హరణంబొనర్చి**
**పొలుపొందె భువి మన్నెపులియని పేర"** అని వుంది. రామరాజీయంలో 'సమస్త దురాచరణ చెఱకు రాజనాయక సప్తాంగ హరణ' అని గలదు. అంబదేవుడు కాకతీయ మహారాణి రుద్రమదేవిని అంబదేవుడు ధిక్కరించిన తర్వాత అతని కుమార్తెను చెఱకు బొల్లయ కుమారుని వివాహం చేసుకొన్నాడా లేక ముందుగానే చేసుకొన్నాడా అన్న విషయం వివాదాంశము. ఈ తిరుగుబాటును అణిచినవారిలో కాకతీయుల తరఫున ఎర దాచానేడు పాల్గొన్నాడు. క్రీ.శ. 1320 ప్రాంతంలో పటానుచెఱువు ప్రాంతంలో తురుష్క సైన్యాన్ని ఎదుర్కొనే సందర్భంలో ఇతను మరణించి ఉండవచ్చని బి.యన్.శాస్త్రిగారు భావించారు.

నల్లగొండ జిల్లా ఆమనగల్లు, నాగులపాడు, సోమవరం ప్రాంతాలు ముఖ్యంగా మూసీనదికి ఇరువైపుల మరియు, మూసీనది కృష్ణానది పరీవాహక ప్రాంతాలలో రేచర్ల బేతిరెడ్డి సంతానం కాకతీయుల సామంతులుగా పాలకులుగా ఉండినారు. కాని అంబదేవుడు తిరుగుబాటు చేసిన కాలంలోనే ఈ రెడ్డి సామంతులు కూడా తిరుగుబాటు చేసినారు. అంతేకాకుండా సవతి సోదరులైన వెన్నమ, ఏచమ, మాదానేని, దాచానేని, సింగమనేనిలను గౌరవముతో చూస్తూ, రేచర్ల బేతిరెడ్డి వారసులను చులకనగా చూస్తున్నారని భావించి, వారు తిరుగుబాటుకు ప్రయత్నించి విఫలులై దక్షిణాదికి పారిపోయినారు. ఈ ప్రాంతాలకు క్రీ.శ.1320-21 ప్రాంతంలో పద్మనాయక వెలమలను కాకతీయులు సామంతులుగా నియమించుట వలన రేచర్ల పద్మనాయకులు 'ఆమనగంటి పురాధీశ్వర' అను బిరుదును తమ బిరుదావళిలో ధరించినారు. ఈనాటి ఆమనగంటి ప్రాంతానికి దొరలుగా ఉన్న 'గడ్డం' ఇంటిపేరున్న రెడ్ల గోత్రం 'రేచర్ల'. వారు కాకతీయులు పతనమైన తర్వాత రాచకొండ, దేవరకొండ రాజ్యాలు కూడా పతనమైన తర్వాత కుతుబ్షాహీల కాలంలో వారు ముస్లిం

రాజ్యం ఏర్పడిందని, గడ్డాలు పెంచుకొని తిరిగి గోలకొండ ప్రభువుల వద్దకు వచ్చి, ఆమనగల్లు - నాగులపాడు ప్రాంతం ఒకనాడు వారిదని, తిరిగి వారికే జాగీరుగా ఇప్పించమని కోరగా వారు ఫర్మానా వారికి ఇస్తూ వారి ఇంటి పేరుకు 'గడ్డం' వారిగా పేర్కొనటం వల్ల వారు గడ్డం వారి పేరున చెలామణి అవుతున్నామని ఆమనగల్లు జాగీరు వారసుల రికార్డులు సాక్ష్యం ఇస్తున్నాయి. వారసులు అదే విషయాన్ని నమ్ముతున్నారు.

కాకతీయులు పతనమై తర్వాత రేచర్ల సింగమనేడు స్వతంత్ర రాజ్యమును స్థాపించినాడు. ముసునూరి ప్రోలయ, కాపయ నాయకత్వంలో జరిపిన తిరుగుబాటులో పాలుపంచుకున్నాడు. క్రీ.శ. 1336లో ఓరుగల్లు కోటను రెడ్డి రాజ్య స్థాపకుడు ప్రోలయ వేమారెడ్డి, పద్మనాయక రాజ్య స్థాపకుడు రేచర్ల సింగమనాయుడు, ముసునూరి కాపయనాయకులు తిరిగి ఆక్రమించారు ఈ సందర్భంగా మూడు రాజ్యాలు ఆ తిరుగుబాటు అనంతరము ఏర్పడినాయి. కొండవీడుకు ప్రోలయ వేమారెడ్డి, రాచకొండ, దేవరకొండ రాజ్యాలకు రేచర్ల పద్మనాయకులు, ఓరుగల్లుకు ముసునూరి కాపయనాయకులు పాలకులైనారు. ఆధిపత్యపోరు వీరి మధ్య ప్రారంభమైన ఈ రాజ్యాలు క్షీణించిన విధానాన్ని బి.యన్.శాస్త్రిగారు చక్కగా వివరించారు.

సింగభూపాలుడు క్రీ.శ.1326-1361 వరకు రాజ్యాన్ని విస్తరిస్తూ రాజధానిని ఆమనగల్లు నుండి రాచకొండకు మార్చి రాజ్యాన్ని స్థిరపరిచినాడు. ఇతనికి అనపోతా నాయకుడు, మాదానాయుడు ఇద్దరు కుమారులు. ఈ ఇద్దరు జల్లేపల్లి కోట ముట్టడిలో ప్రధానపాత్ర వహించడము మాత్రమే గాకుండా కాపయనాయకుని రాజ్యాన్ని, అతనిని సంహరించి క్రీ.శ. 1368లో తమ రాజ్యంలో కలుపుకున్నారు. బి.యన్.శాస్త్రిగారు వీరి విజయాలను రాజ్య విస్తరణ శ్రీశైలప్రాంత పర్యంతం విస్తరించిన విధానాన్ని శాసన ఆధారంగాను, ఇతర సాహిత్య ఆధారాలను పరిశీలించి రేచర్ల పద్మనాయకుల చరిత్ర - శాసనాలలో వివరించారు. ఈ గ్రంథ రచనకు ప్రచురింపబడని బడబాగ్నిభట్టు రచించిన 'పద్మనాయక చరిత్ర'మును పరిశీలించినారు. ఈ బడబాగ్ని భట్టు రెండవ సింగ భూపాలుని సమకాలికుడు. ఈ పద్మనాయక చరిత్ర ప్రతి (ఆర్.నెం. 660) కాకినాడ (ఆంధ్ర సాహిత్య పరిషత్ గ్రంథాలయం నుండి) పురావస్తుశాఖ మ్యూజియంలో నేడు ఉంది.

దీనిలో కాపులు (వ్యవసాయదారులు), వెలమ కమ్మలైన వైనాన్ని తెల్పుతూ-

**"ఊరి వరద నీరు నురక సరయపు చే**
**తీర్థ యోగ్యమైన తెరవుగాదె**

**కాలచోదితమున కాకతీశ్వరు గొల్చి**
**కాపువారు వెలమ కమ్మలైరి" (12)**

మరొక పద్యంలో వెలమల గూర్చి

**"వన్నెగా(రడి) సాని వడికి నేయించిన**
**జొన్న కుబుసముల జోడు దొడగి**
**వరిమళ్ళు దున్నంగ వంకబోయిన కాళ్ళు**
**అంకెవన్నియలలో ననువు పఱచి**
**ఘనమైన గొడ్డండ్ల గాండవుల్ నర్క (నరకంగ)**
**గాయకాచిన చేత గత్తి బట్టి**
**కలకాలము వంటకట్టెలు మోయంగ**
**బట్టగట్టిన నెత్తిఁ బాగచుట్టి**
**సర్వకాలము కొలసాముచేసి**
**ముడ్డిపుచ్చిన గుఱ్ఱంపు గొడ్డు నెక్కి**
**వెలమననుచు దిరుగువాడు వెలమగాడు**
**కలహ స్ఫూర్తి గలవాఁడె వెలమ వెలమ" (9)**

అని అందరూ వెలమలు కాదు కలహస్ఫూర్తి గలవారే వెలమలు అని తెల్పినాడు. కాకతీయులు వెలమల ఇంటి పేర్లను, గోత్ర సమాఖ్యలను ఎలా ఏర్పరిచింది ఈ పద్మనాయక చరిత్ర తెలుపుతున్నది.

**"ఏ యూర నుండిన నా యూరి పేరును**
**గ్రామాంక నామముల్ గా నమర్చి**
**ఏ స్థలంబున నుండ నా స్థలంబు గురించి**
**స్వస్థాన యుక్తిని సౌంజ్ఞ నిలిపి**
**జనక పితామహ స్రప్రపితామహ**
**యార్షేయ సూక్తిని యనుఘటించి**
**తగు భుజబలమున తానొనర్చిన యట్టి**
**పౌరుషేయ ఖ్యాతి పరిణమించి**
**యెలమి గోత్రంబు లన్నియు నేర్పడంగ**
**గోత్ర సదనంబులన్నియు కుదురు పడగ**

**వంది బృందంబు కిచ్చి వరస జేసి**
**భద్ర యశుడైన కాకిత రుద్రవిభుడు" (33)**

వాస్తవ దృష్టితో డెబ్బదిరెండు గోత్రాల వెలమలు, వారి బిరుదులు, ఇంటిపేర్ల ఏర్పాటు విధానాన్ని ఈ చరిత్ర వివరిస్తుంది. బి.యన్.శాస్త్రిగారు ఈ దృష్టితో పరిశీలించి చాలామంది వెలమల ఇంటిపేర్లు కల్వకుర్తి తాలూకాలోని ఊర్ల పేర్లని తేల్చారు.

రేచర్ల పద్మనాయకుల చరిత్రపై బి.యన్.శాస్త్రి గారు చేసిన పరిశోధన, సేకరించిన ఆధారాలు ఈనాటికీ ప్రామాణికంగా ఉండటం మాత్రమే కాక వర్ధమాన పరిశోధక చంద్రులకు సత్పథగామిగా నిలిచారు. బి.యన్.శాస్త్రిగారి సమ్యక్పరిశోధన, వివేచనాశక్తి, ప్రజ్ఞాతిశయానికి తెలుగువారు, ముఖ్యంగా తెలంగాణవారు కలకాలం ఋణపడి ఉంటారు. వారి ప్రతిభా ప్రాగల్భ్యాలు అర్థం చేసుకోగలము కాని అందుకోలేము. అదే శాస్త్రిగారి విశిష్టత. 'చదువని వాడజ్ఞుండగు, చదివిన సదసద్వివేక చతురత కలుగున్" అని భాగవతంలో ప్రహ్లాదచరిత్రలోని వాక్యం బి.యన్.శాస్త్రిగారి రచనల అధ్యయనం విషయంలో అక్షర సత్యమౌతుంది. వారి సాహచర్యం వల్లనే విజ్ఞాన దృష్టి, విశాల దృష్టి అలవడిందని భావిస్తాను.

**కుర్రా జితేంద్రబాబు**
ప్రముఖ చారిత్రక సాహితీవేత్త, గ్రంథ రచయిత, సంపాదకులు
ఫోన్ : 98488 82600



# కాయస్థ రాజులు

తెలంగాణాలో జన్మించి, తెలంగాణా శాసనాలు పరిష్కరించిన తెలంగాణ తొలి శాసన పరిశోధకులు, పండితులు, చరిత్రకారులు 'బి.ఎన్.శాస్త్రి' గా పిలువబడే భిన్నూరి నరసింహశాస్త్రి గారు. తెలంగాణలో లభించిన శాసనాలను పరిష్కరించిన వారందరూ జన్మత : తెలంగాణేతరులే.

తెలుగు జాతి మొత్తాన్ని ఏక రాజ్యంగా చేసి పరిపాలన చేసిన రాజ్యవంశాలు నాలుగు. అవి 1.శాతవాహనులు 2. విష్ణుకుండినులు 3. కాకతీయులు 4. కుతుబ్‌షాహీలు. వీరిలో కాకతీయుల కాలము స్వర్ణయుగమని అనేకమంది చరిత్రకారుల అభిప్రాయం. కాకతీయుల కాలంలో తెలుగువారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత, సాంస్కృతిక రంగాలు అద్భుతంగా అభివృద్ధి చెందాయి. వ్యాస రచయిత అభిప్రాయంలో మూడు T లు (Town, Tank, Temple) కాకతీయులు. ఈ మూడు T లు తెలుగు వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటానికి ఉపయోగ పడ్డాయి. అడవులు నరికి, నూతన భూభాగాలు వ్యవసాయంలోకి తెచ్చి, నూతన ఆవాసాలను ఏర్పర్చి, వ్యవసాయానికి కావాల్సిన నీటికోసం 'సముద్రాల'నబడే పెద్ద పెద్ద చెరువులను తవ్వించి, అవి దురుపయోగం కాకుండా వుండేందుకు అద్భుతమైన శిల్పవాస్తు సమ్మిళితమైన ఆలయాలు నిర్మించినవారు కాకతీయులు. కాకతీయుల పరిపాలనలోనూ, వారి సాఫల్యాల వెనుక వారి సామంతులు, ప్రాంతీయ పాలకుల పాత్ర అమోఘమైంది. కాకతీయులు విశాల సామ్రాజ్యాధిపతులై కూడా 'మహా మండలేశ్వర' వంటి సాధారణ బిరుదులే ధరించారు గానీ, పెద్దపెద్ద బిరుదులు ధరించలేదు. అట్లే

కాకతీయులు వారి సామంత మాండలీకులతో అత్యంత సఖ్యతతో మెలగడమే గాక, వారితో వైవాహిక సంబంధాలు కూడా నెరపారు. అందుకే కాకతీయుల కాలంలో వారి సామంత మాండలీకుల ప్రాముఖ్యత ముఖ్యమైంది. వీరిలో మల్యాల, కందూరిచోడ, రేచర్ల రెడ్డి, చెఱకురెడ్డి, రేచర్ల పద్మనాయకులు, కాయస్థులు, యాదవులు మున్నగు వారు ప్రముఖులు. శాస్త్రిగారు ఈ సామంతుల చరిత్రను వివరిస్తూ శాసనాలను కలిపి ప్రత్యేక గ్రంథాలుగా వెలువరించారు. వాటిలో కందూరు చోళులు శాసనాలు – చరిత్ర, సంస్కృతి, చెఱకు వంశచరిత్ర – శాసనాలు, రేచర్ల రెడ్డి వంశ చరిత్ర – శాసనాలు, రేచర్ల పద్మనాయకులు, గోలకొండ చరిత్ర, సంస్కృతి – శాసనములు, మల్యాల వంశచరిత్ర– శాసనములు మున్నగునవి ముఖ్యమైనవి. అట్లే ఒకే ఆలయంలో, ప్రాంతంలో లభించిన శాసనాలను కూడా ప్రత్యేక గ్రంథాలుగా ముద్రించారు. ఈ కోవలో త్రిపురాంతక దేవాలయ శాసనాలు, ముఖలింగ దేవాలయ చరిత్ర, శాసనములు, బెజవాడ మల్లీశ్వరాలయ శాసనములు, వేములవాడ చరిత్ర – శాసనములు వస్తాయి. ఈ పరంపరలోనే వెలువడ్డ గ్రంథము "కాయస్థ రాజులు" గ్రంథం.

"కాయస్థ రాజులు" పేర 1991 లో బి.ఎన్.శాస్త్రి గారు మూసీ పబ్లికేషన్స్ ద్వారా వెలువరించిన గ్రంథంలో కాయస్థ రాజుల చరిత్రను, వారి శాసనాలను ముద్రించారు. ఈ గ్రంథంలో కాయస్థ రాజులవి 27 శాసనాలను ముద్రించారు. వీటిలో కొన్ని దక్షిణ భారతదేశ శాసన సంపుటాలలో ముద్రితమైనవి కాగా, కొన్ని శాసనాలను శాస్త్రి గారు స్వయంగా పరిష్కరించి ప్రకటించారు. ఈ గ్రంథాన్ని శాస్త్రి గారు ఆనాటి నల్లగొండ రంగారెడ్డి జిల్లాల సహకార పాడి పరిశ్రమ సమాఖ్య అధ్యక్షులు శ్రీ బొందుగుల నరసింహా రెడ్డి గారికి అంకితమిచ్చారు.

ఇక "కాయస్థ రాజులు" గ్రంథ విషయ సూచికలో 33 అంశాలు లేక అధ్యాయాలు కనిపిస్తాయి. మొదటి నాలుగు అంశాలలో కాయస్థుల చరిత్ర, కాయస్థ రాజుల రాజ్యమండలి సీమలు, గ్రామనామాలు, కాయస్థరాజుల, సామంతుల, సమకాలీన రాజుల దండనాథుల పేర్లు, అగ్రహారాల పేర్లు భూములు వివరంగా పట్టికల రూపంలో (పేజీ 45 నుంచి 54 వరకు) ఇవ్వబడినవి. 5 నుంచి 31 వరకు కాయస్థ రాజులకు సంబంధించిన శాసనా లివ్వబడినవి. 32 అధ్యాయము లేక అంశంలో ఉపయుక్త గ్రంథాలు, 33 అంశాలలో ముఖ్య పదానుక్రమణికలు కనిపిస్తాయి.

ఈ కాయస్థుల గురించి గతంలో చరిత్రకారులు, పరిశోధకులు కొన్ని వ్యాసాలు, పరిశోధక గ్రంథాలు వెలువరించారు. అట్లే మరికొందరు చరిత్రకారులు తమ గ్రంథాలలో

తమ తమ అవసరాల మేర చర్చలు జరిపారు. 1968 లో నరేంద్రనాథ సాహిత్య మండలి, తణుకు వారు ముద్రించిన 'సాహితీ వల్లభ, ఆంధ్రభోజ శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు గారి అభినందన సంపుటి 'సాహితీ వాల్లభ్యము' లో శ్రీ నేలటూరి వెంకటరమణయ్య గారు 'కాయస్థ రాజులు" అని 32 పేజీల పెద్ద వ్యాసం రాశారు. శాస్త్రి గారు ఈ వ్యాసాన్ని ఆధారంగా పెట్టుకొని ఈ గ్రంథరచన చేసినట్టుగా అనిపిస్తుంది. శాస్త్రిగారు సింహభాగము నేలటూరి వారి అభిప్రాయాలతో ఏకీభవిస్తూ రాయడం ఈ అభిప్రాయాన్ని బలపరుస్తుంది. వారణాసి యశోదాదేవి గారు తమ "మైనర్ డైనాస్టీస్ ఆఫ్ ఆంధ్రదేశ 1000 టు 1500 ఏ.డి.". గ్రంథంలో కాయస్థుల చరిత్ర గురించి చర్చించారు. వారి రచన నాటికి కాయస్థుల శాసనములు పరిమితంగా లభించాయి. అలాగే అల్లాడి వైదేహి గారు తమ "సోషియో ఏకానమీ కండిషన్స్ ఈస్టన్ దక్కన్ ఫ్రం (ఏ.డి.1000 – ఎ.డి.1250) గ్రంథంలో కూడా కాయస్థుల గురించి ప్రస్తావించారు. శ్రీయుత పి.వి.పరబ్రహ్మ శాస్త్రి గారు తమ పరిశోధనా గ్రంథం "ది కాకతీయాస్ ఆఫ్ వరంగల్" లో కాయస్థుల గురించి చక్కటి వివరణలు ఇచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 1997 లో పి.హెచ్.డి. పట్టా పొందిన శ్రీ రాచర్ల గణపతి తమ "సబార్డినేట్ రూలర్స్ ఆఫ్ మెడైవల్ దక్కన్"లో కాయస్థుల గురించి చర్చించారు. ఇటీవలి కాలంలో జరిగిన అనేక చరిత్ర సదస్సులలో ఔత్సాహిక చరిత్ర పరిశోధకులు అనేకమంది కాయస్థులపై పరిశోధక పత్రాలు సమర్పించారు. 2005 లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీశైలం 'చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్రము' పీఠంలో శ్రీమతి మద్దూరు సుజాత గారు "కాయస్థుల చరిత్ర – సంస్కృతి" పేర పరిశోధక గ్రంథం సమర్పించి పిహెచ్.డి. పట్టా పొందారు. రాచర్ల గణపతి, సుజాత గారు తదితర పరిశోధకులు తమ పరిశోధనకు శాస్త్రిగారి 'కాయస్థ రాజులు' గ్రంథాన్ని సంప్రదించారు. పైన పేర్కొన్నట్టుగా శాస్త్రిగారు తమ 'కాయస్థ రాజులు' గ్రంథానికి సాహితీ వాల్లభ్యంలోని నేలటూరి వారిని ఆధారంగా గ్రహించినా కొన్ని విషయాలలో మిగిలిన వారితో విభేదించినట్లు కనిపిస్తుంది.

కాయస్థ రాజులు కాకతీయ సామంతులందరిలో అత్యంత శక్తిమంతులు. వీరు క్రీ.శ.1244 నుంచి క్రీ.శ.1308 వరకు కాకతీయ సామంతులుగా కడప జిల్లాలోని వల్లూరు, నేటి ప్రకాశం జిల్లాలోని కొచ్చెర్లకోట, కడపలోని మనోరథ పురము– గండికోటలు రాజధానులుగా ఐదుగురు రాజులు గంగయ సాహిణి, జన్నిగదేవుడు, త్రిపురాంతకుడు, అంబదేవ, రెండో త్రిపురాంతకుడు పరిపాలన చేశారు. శాస్త్రిగారు తమ గ్రంథంలో వీరికి సంబంధించిన 27 శాసనాలు ప్రకటించారు. వీటిలో గంగయ సాహిణి కాలం నాటివి 6, జన్నిగదేవుని కాలం నాటివి 7, ఒకటవ త్రిపురారి (త్రిపురాంతకుడు లేక త్రిపురారి దేవ)వి1,

అంబదేవుని (నేలటూరి వారి అభిప్రాయంలో యితడు రెండవ అంబదేవుడు - వీరి అభిప్రాయంలో గంగయ సాహిణి బావ అంబక్ష్మాపతి మొదటి అంబదేవుడు) కాలం నాటివి 11, రెండవ త్రిపురాంతకుని కాలం నాటివి 2 ఉన్నాయి. వీటిలో కాయస్థ రాజులే నామదేవుడు, ఘోడేరాయ గంగదేవయ వంటి ప్రధానులు, గంగయ సాహిణి భార్య కమలాబాయి, గౌరేశ్వర బాయమ్మ గారు (?), మయిదేవ మహారాజుల వంటి సర్వాధికారులు, అగ్రహార ప్రముఖులు సవదర మల్లపరాజు కొడుకు కరణం నామయ, సామంత నివేద మహారాజు లాంటి వారు ఇచ్చిన శాసనాలున్నాయి. వీరిలో అంబదేవుని ప్రధాని ఘోడేరాయ గంగదేవుడు మిక్కిలి ప్రముఖుడైన చారిత్రక పురుషుడు. ఇతడే తర్వాత కాలంలో అద్దంకి రెడ్డి రాజ్యస్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి గురువు. అల్లే యితడు గొప్ప శివారాధకుడు. శైవ మతాచార్యుడిగా ఘోడేరాయ గంగదేవుడు ఘోడేరాయ గురు పీఠము స్థాపించాడు. అల్లే అంబదేవుని అల్లుడైన రాజనరేంద్రునిపై చర్య తీసుకోడానికి కాకతీయ రుద్రమ "తాతపిన్నమ"ను ఆదేశించి పంపినది. ఈ తాత పిన్నమ ఆరవీటి వంశ మూలపురుషుడు (పే.38, కాయస్థరాజులు)

కాకతీయుల కింద సామంతులుగాను విశాల ప్రాంతాలకి పాలకులుగా నున్న కాయస్థులు క్రీ.శ.1239 నుంచి 1308 వరకు 69 సంవత్సరాలు పాలించారని రాచర్ల అభిప్రాయపడగా, యశోదాదేవి 1220 నుంచి క్రీ.శ.1320 వరకు పాలన చేశారని చెప్పారు. నేలటూరి వారు 1239 నుంచి 1304 వరకు 65 సంవత్సరాలు పరిపాలన చేసినారని చెప్పగా, శాస్త్రి గారు క్రీ.శ.1244 నుంచి క్రీ.శ.1308 వరకు 64 సంవ్సరాలు పాలన చేశారని నిరూపించారు. అల్లే యశోదాదేవి, రాచర్ల గణపతిలు వీరు క్షత్రియులని చెప్పగా శాస్త్రిగారు కాయస్థులు బ్రాహ్మణులని (పేజీ 5) వుటంకించారు.

కాయస్థుల మొట్టమొదటి నాయకులు 'ధంసా' అని పరబ్రహ్మ శాస్త్రిగారు తెలుపగా, రాచర్ల కూడా దానినే అంగీకరించారు. వీరి అందరి అభిప్రాయంలో కాకతీయుల కింద సామంతులుగా కనిపించే కాయస్థ రాజుల మొదటి పాలకుడు మాత్రం గంగయ సాహిణియే. 10-13 శతాబ్దాలలో మహారాష్ట్ర మున్నగు పశ్చిమ ప్రాంతాల నుంచి తెలుగునాటకు వలస వచ్చిన అనేక రాజ వంశాలలో కాయస్థులు ఒకరు. నేలటూరి వారి భావనలలో వీరు మహారాష్ట్ర నుంచి వలస వచ్చినవారు. శాస్త్రి గారి అభిప్రాయం కూడా అదే. కాయస్థ రాజుల పేర్ల చివర 'దేవ' దేవుడు అన్న పదాలు - జన్నిగదేవుడు, త్రిపురారి దేవుడు, అంబదేవుడు, నామిదేవుడు మున్నగునవి, అల్లే స్త్రీలపేర్ల చివర 'బాయి' (కమలాబాయి, చందూబాయి, గౌరేశ్వరబాయి మున్నగునవి) అన్న పదం రావడం వీరు మహారాష్ట్ర నుంచి వలస వచ్చారనడానికి ఒక ఆధారంగా భావించారు. యశోదాదేవి అభిప్రాయంలో వీరు

మొదట నెల్లూరు తెలుగు చోళుల వద్ద సేవచేసి, తర్వాత స్వతంత్రించుకొని, ఆపై కాకతీయుల సార్వభౌమత్వాన్ని అంగీకరించి, ఓరుగల్లు సరిహద్దుల నుంచి మార్జివాడి కైవారము వరకు గల విశాల భూభాగాలకు పాలకులైనారు. ఈ అభిప్రాయాన్ని తర్వాత చరిత్రకారులు అంగీకరించలేదు. పరబ్రహ్మశాస్త్రి గారి అభిప్రాయంలో కాయస్థులు మంచి అశ్వారూఢులు, అశ్వబలాన్ని నడపటంలో దిట్టలు. యుద్ధ విద్యలలో వీరు ప్రవీణులు కనుక కాకతీయ గణపతి దేవుడు తన సైన్యంలో గుర్రాలకి శిక్షణనిప్పించడం కోసం ప్రత్యేకంగా వీరిని రప్పించాడు. శాస్త్రిగారు కూడా యిదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కాకతి గణపతి దేవ మహారాజు కాయస్థ గంగయ సాహిణిని ఆదరించి, మాండలిక ప్రభువుగా నియోగించెను. గంగయ సాహిణి సోదరి చందూబాయి, ఆమెభర్త, గంగయ సాహిణి బావ అంబాక్ష్మాపతి, గంగయ సాహిణి భార్య కమలాబాయితో కలిసి ఆంధ్రదేశమేతెంచెను (పేజీ4). గణపతి అంబక్ష్మాపతిని పలనాటి సీమకు, గంగయ సాహిణిని నల్లగొండ జిల్లాలోని చిట్యాల, పానుగల్లు ప్రాంతాలకు పాలకులుగా నియమించెను (పే.4). గంగయసాహిణి పేరు చివరనున్న 'సాహిణి' అన్నపదం యితడు అశ్వదళంపై అధికారి అని తెలుపుతోంది. ఇప్పటివరకు లభించిన యితని శాసనాలలో క్రీ.శ.1239 నాటి గుండ్లూరు (గుంటూరు) శాసనం మొదటిది. క్రీ.శ.1244 నుంచి 1258 వరకు కాయస్థ రాజుగా పాలన చేశాడు. శాస్త్రిగారి అభిప్రాయంలో గంగయ సాహిణి మహారాష్ట్ర ప్రాంతం నుంచి వచ్చి తొలుత పల్నాటి సీమలోని కొన్ని ప్రాంతములను ఆక్రమించుకొని వుండాలి. 1239 నాటి గుండ్లూరు శాసనములో గంగయ సాహిణి 'గండ పెండార గంగయ సాహిణి' అని మాత్రమే పేర్కొనబడినాడు. అప్పటికే పలనాటి సీమలో మహాభారత యుద్ధము వంటి యుద్ధము సంభవించి యుండెను. హైహయులు, వెలనాటి రాజులు బలహీనులై యుండిరి. కాకతి రుద్రదేవుడు, మహాదేవుడు దివంగతులు కాగా, గణపతిదేవ మహారాజు కాకతి రాజ్యపీఠాన్ని అలంకరించి సామ్రాజ్యమును విస్తరించు ప్రయత్నమందుండెను. గుండ్లూరు శాసనంలో గణపతిదేవుని ప్రశంస లేదు. కావున క్రీ.శ. 1239 నాటికి కాకతి గణపతి పలనాటిని జయింపలేదని భావించాలి. గంగయ సాహిణి స్వతంత్రునిగానే తన రాజ్యభాగాలను ఏలెను. (పే.8) 1242 నాటి శాసనమందు గంగయ సాహిణి గణపతిదేవ మహారాజు ప్రతినిధిగా ఏఱువ త్రిసప్తతి దేశమును కొచ్చెరువుల రాజధానిగా పాలించుచున్నట్లు తెలుపబడినది. ఇందులో గంగయ సాహిణి 'అరివీర బ్రహ్మరాక్షస' బిరుదమును వహించినట్లుగా పేర్కొనబడింది. క్రీ.శ.1242 నాటికి కాకతి గణపతి దేవుడు పల్నాటి సీమను ఆక్రమించి గంగయ సాహిణి వంటి మాండలీకులను సామంతులుగా స్వీకరించెనని భావించవచ్చును.

తర్వాత గంగయ సాహిణికి చెందిన 1244 నాటి సత్రశాల (గుంటూరు) శాసనం ముఖ్యమైనది. ఇందులో గంగయ సాహిణికి 'కాకతి గణపతిదేవ పాదపద్మారాధకుడు, మాండలిక బ్రహ్మరాక్షస, గండపెండార, అతి విషమ హయారూఢ ప్రౌఢరేఖారేవంత, దామోదర దిశాపట్ట' మున్నగు బిరుదులు కనిపిస్తాయి. అంటే 1244 నాటికి కాయస్థులు గణపతి దేవుని సేవలో ఉన్నారని భావించాలి. ఈ బిరుదులలో "అతి విషమ హయారూఢ ప్రౌఢరేఖారేవంత" (బాగా క్లిష్టమైన గుఱ్ఱాన్ని అధిరోహించి, నేరుగా రేఖా మార్గంలో నడుపగల సామర్థ్యమున్న వాడని అర్థం) బిరుదు చాలా గొప్పగా కనిపిస్తుంది. ఈ బిరుదు బ్రహ్మరాక్షస, గండపెండార, దామోదర దిశాపట్ట బిరుదులను దాదాపు కాయస్థ రాజులందరూ ధరించారు. క్రీ.శ.1250 నాటికి గంగయసాహిణి గణపతిదేవుని ఆప్తవర్గంలోని వాడైనాడు. గణపతిదేవునికి ప్రధాన వ్యక్తిగా పరిగణింపబడినాడు. ఈ శాసనంలో గంగయసాహిణికి 'మహామండలేశ్వర, బాహత్తర నియోగాధిపతి, చాతుర్వర్ణ సముద్ధరణ, పశ్చిమరాయ దామోదర దిశాపట్ట, ఏకాంగవీర, వీరావతార, నాయక నారాయణ' వంటి బిరుదులున్నాయి. (పే.8) అనగా 1242 నుంచి 1250 వరకు గల ఎనిమిది సంవత్సరాలలో గంగయ సాహిణి అనేక యుద్ధములందు విజయుడై గణపతిదేవుని మన్ననలకు పాత్రుడైనాడని భావించవచ్చు. ఆ యుద్ధాలలో సాధించిన విజయాల వల్ల అనేక బిరుదులను పొంది వుండవచ్చును. ఈ బిరుదులలోని "పశ్చిమ రాయ దామోదర దిశాపట్ట" బిరుదును గంగయ సాహిణితో పాటు అతని మేనళు ళ్లు, తర్వాత వారసులైన జన్నిగదేవుడు, త్రిపురారి, అంబదేవుడు కూడా ఈ బిరుదును ధరించారు. కాకతీయుల రాజ్యానికి పడమటి వైపున గల సేవునరాజు కన్నర దేవుడనే రాజున్నాడు. ఇతడికే 'దామోదర' అన్న పేరున్నట్లున్నది. ఇతడిని గంగయ సేనానితో పాటు అంబక్ష్మాపతి, అతడి కుమారులు, జన్నిగదేవుడు, త్రిపురారి, అంబదేవులు కూడా యుద్ధంలో ఓడించారు. కనుకనే వీరులందరూ కూడా 'దామోదర దిశాపట్ట' బిరుదును ధరించారు.

గంగయ సాహిణి గణపతిదేవుని తరపున వైదుంబ రాజైన రక్కసగంగతో యుద్ధం చేశాడు. ఈ వైదుంబ రక్కసి గంగ మార్జివాడ, పొత్తపినాడు ప్రాంతాలను పాలిస్తున్నాడు. కాయస్థ సైన్యానికి నెల్లూరు తెలుగుచోడ మహారాజు మనుమసిద్ధి సైన్యాన్ని పంపి సాయపడ్డాడు. ఈ సమయంలోనే వల్లూరు నగరం వీరి రాజధానిగా మారింది. అట్లే తెలుగు పల్లవులను కూడా ఓడించి వారి భూభాగాలను కూడా కాకతీయ రాజ్యంలో కలిపాడు. 1251 క్రీ.శ. నాటి దుర్గి శాసనం ప్రకారం గంగయ సాహిణి పాలనలో నల్లగొండ జిల్లాలోని పానుగల్లు నుంచి కడప జిల్లాలోని మార్జివాడి వరకు గల ప్రాంతాలున్నాయి. దీనిలో నేటి నల్లగొండ, కడప, కర్నూలు, అనంతపురం, బళ్ళారి, గుంటూరు జిల్లాల ప్రాంతాలున్నాయి.

గంగయ సాహిణి అనంతరం, అతనికి సంతానం లేనందున అతడి మేనళ్ళులయిన జన్నిగదేవుడు, త్రిపురారి, అంబదేవుడు వరుసగా కాయస్థ సింహాసనాన్ని అధిష్ఠించి పాలన చేశారు. క్రీ.శ.1258 నుంచి 1268 వరకు జన్నిగదేవుడు లేక జనార్దనుడు కాకతీయుల సేవలో వుండి, వారి దక్షిణ జైత్రయాత్రలో పాల్గొన్నాడు. పెన్నానది ఒడ్డున సోమశిల వద్ద పల్లవ నాయకుడు, కంచి పాలకుడైన సిద్ధమ దేవ మహారాజుతో యుద్ధం చేశాడు. దీని తర్వాత యితడు 'దక్షిణ భుజాదండ' బిరుదు ధరించాడు.

శాస్త్రి గారి అభిప్రాయంలో జన్నిగదేవుడు కాకతీయ గణపతి దేవుని అవసాన దశలో అతడికి మంత్రిగా నుండి సమస్త సామ్రాజ్య భారము వహించి, రాచకార్యములను అతి సమర్థవంతంగా నిర్వహించినాడు. గంగయ సాహిణికి సాయముగా అనేక యుద్ధములలో పాల్గన్నాడు. కనుకనే 'మావనంకకార'గా అనగా మాయమగు గంగయ సాహిణికి ఖడ్గ కార్యము నెరవేర్చు యోధుడుగా ప్రశంసింపబడ్డాడు. ఇతడిచ్చిన శాసనాలలో క్రీ.శ.1260 నాటి పొందలూరు శాసనము, క్రీ.శ.1269 నాటి దుర్గి శాసనములు చారిత్రకంగా ప్రముఖమైనవి. 1260 నాటి పొందలూరు శాసనములో జన్నిగదేవుడు శక పరుషంబులు 1182న, గణపతిదేవ మహారాజుల దివ్య రాజ్య సంవత్సరాలు 62 లో ఈ శాసనమిచ్చినట్లుగా చెప్పబడింది. అనగా శక 1182 నాటికి గణపతిదేవుడు రాజై, 62 సంవత్సరములన్న మాట. అట్లే 1269 నాటి జన్నిగదేవుని శాసనంలోనే రుద్రమదేవి గణపతిదేవుని 'పట్టోధృతి'గా చెప్పబడింది. పట్టోధృతి అనగా రాజ్యపాలనకు నియమించబడిన వ్యక్తి అని అర్థం. దీనినిబట్టి రుద్రమదేవి 1269 నాటికి రాణిగా నియమితురాలైంది. అప్పటికి గణపతిదేవుడు జీవించే వున్నాడు. దీనితో కొందరు చరిత్రకారులు రుద్రమదేవి రాణిగా, గణపతిదేవుని తరపున పాలకురాలిగా నియమితురాలైనదే గానీ పట్టాభిషిక్తురాలు కాలేదని భావిస్తున్నారు. జన్నిగదేవుడు రుద్రమదేవి పాలనలో ప్రధానమంత్రి (?)గాను, ములికినాడు, పొత్తపినాడు, గండికోట ప్రాంతాలకు పాలకుడిగాను, గణపతిదేవుని కుడిభుజంగా వ్యవహరించినట్లు కారంపూడి శాసనం పేర్కొంటోంది. ఈ శాసనము జన్నిగదేవుని సర్వాధికారి 'మెఇదేవ మహారా'జిచ్చింది. ఇతడికి గండపెండార బిరుదున్నది. ఇతడు కూడా కాయస్థ వంశీయుడే. జన్నిగదేవ మహారాజు కులోత్తుంగ చోడను మహారాజును, సిద్ధయదేవ చోడ మహారాజులను ఓడించాడు. ఈ సిద్ధయదేవ చోడ మహారాజు వెలనాటి పాలకుడైన సిద్ధయదేవ మహారాజు. కరణం నామయ క్రీ.శ.1269 లోనే వేయించిన దుర్గి శాసనములో జన్నిగదేవుడు పానుగల్లు మొదలు మార్జివాడి దాకా గల ప్రాంతాల పాలకుడిగా వర్ణింపబడినాడు. జన్నిగదేవుని మంత్రులలో ముప్వురిని శాసనాలు పేర్కొంటున్నాయి. వారు 1. మహాప్రధాని అనంతదేవుడు

2. గండ పెండార మెయిదేవుడు 3. తాళ్ళపల్లి దేవరాజులు (పేజీనెం. 23)

జన్నిగదేవునికి సాధారణ కాయస్థ బిరుదులతో పాటు పశ్చిమరాయ దామోదర దిశాపట్ట, రక్కసగంగ బెంగొండు గండ అనగా రక్కస గంగని వెన్నాడి తరిమినవాడని అర్థము – మున్నగు బిరుదులున్నాయి. (పేజీ11).

జన్నిగదేవుని తర్వాత అతని సోదరుడు మొదటి త్రిపురారి లేక త్రిపురాంతకుడు కాయస్థ పాలకుడై కాకతీయులను సేవించాడు. మూడు సంవత్సరాల తర్వాత 1272 లో యితడు మరణించాడు. త్రిపురాంతకుని తర్వాత అతడి తమ్ముడు అంబదేవుడు (నేలటూరి వారి అభిప్రాయంలో యితడు రెండో అంబదేవుడు) అధికారంలోకి వచ్చాడు. కాయస్థులందరిలోనూ ఇతడు అత్యంత శక్తివంతుడని చరిత్రకారులందరూ అంగీకరించిన విషయం. కాకతీయ చరిత్రలో జరిగిన కీలక పరిణామాలకు అంబదేవుడే బాధ్యుడని పి.వి.పి.శాస్త్రి గారి అభిప్రాయం. అంబదేవుడు తొలినాళ్ళలో కాకతి రుద్రమకు విశ్వాసపాత్రునిగా వుండి, తర్వాత ఆమెను ధిక్కరించి, తనకు తాను గండికోట – మనోరథపురం రాజధానిగా మార్చివాడి తదితర ప్రాంతాల సార్వభౌమునిగా ప్రకటించుకోవడం మొదటిదయితే, తన తిరుగుబాటు రుద్రమదేవి మరణానికి దారి తీయడం రెండో పరిణామం.

అంబదేవుడు 1272 క్రీ.శ. నుంచి 1294 వరకు పాలకుడిగా వున్నాడని పి.వి.పి. శాస్త్రిగారు, 1272 నుంచి క్రీ.శ.1305 దాకా వున్నాడని రాచర్ల గణపతి 1302 వరకు పరిపాలకుడిగా వున్నాడని నేలటూరి వారు, బి.యన్.శాస్త్రి గారు అభిప్రాయపడ్డారు. అంబదేవుని త్రిపురాంతక శాసనాలు యితడి విజయాలను వివరిస్తున్నాయి. ఇతడు శ్రీపతి గణపతిని ఓడించి, అతడి రాయసహస్ర మల్ల (వెయ్యిమంది రాజులను అణచిన యుద్ధవీరుడు) బిరుదును పొందాడు.అంతేగాక 75 మంది రాజులను వధించి, వారి శీర్షపద్మాలతో తన కళ్ళనుంచి ఉద్భవించిన కోపదేవతకు పూజ చేశాడట. నేలటూరి వారి అభిప్రాయంలో దీనిలో కొంత అతిశయోక్తి ఉన్నా, అంబదేవుడు తననెదిరించిన వారిలో అనేకమందిని హతమార్చాడన్నది నిజం. పి.వి.పి. శాస్త్రిగారి అభిప్రాయంలో అంబదేవుని విజయాలు, దండయాత్రలు కాకతీయ రాణి రుద్రమదేవి లక్ష్యంగా సాగాయి. అందుకోసమే రుద్రమకు విశ్వాసపాత్రులయిన శ్రీపతి గణపతిని, ఎఱుక మల్లిదేవుని వధించాడు. అలాగే 'ఉత్తమగండ, గండరగండ, గండభేరుండ' బిరుదులున్న శత్రువును వధించి, అతడి బిరుదులను స్వీకరించాడు. ఇతడు కోటనాయకుడై ఉండవచ్చు. త్రిపురాంతక శాసనం అంబదేవుడు అనేకమంది శత్రువులను నిర్జించి వారి కపాలాలను భైరవుని వలె మాలగా చేసుకొని మెడలో

ధరించేవాడని చెబుతోంది. వైదుంబ రాజులయిన కేశవ, సోమదేవ, అల్లుగంగను పారదోలి వారి అశ్వదళాన్ని స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత కాకతీయుల ఆధిపత్యాన్ని కూలదోసి తన ప్రాంతమున స్వతంత్రించుకున్నాడు. తన ఏలుబడి కిందనున్న రాజ్యాన్ని విస్తరింప చేసుకొనదలచి, యిరుగు పొరుగు రాజ్యాలన్నింటినీ ఆక్రమణ ఆరంభించాడు. పైన తెలిపినట్టు ఎఱువ భీముని ఓడించి, "ఎఱువ భీముని తలగొండుగండ" బిరుదు ధరించాడు. తర్వాత సెంతిసీమ పాలకుడైన మల్లికార్జుణ్ణి ఓడించి తన పూర్వీకుల వలె "చాతుర్వర్ణ సముద్ధరణ" బిరుదును ధరించాడు. అట్లే పానుగల్లు మల్లికార్జున నాయకుణ్ణి ఓడించి, అతడి సప్తాంగాలను హరించాడు. అటు పిమ్మట అంబదేవుడు, "సర్వాంధ్ర మహీపతీన్ జిత్వా రణముఖే.." అంటూ ఆంధ్ర మహీపతు లందరినీ యుద్ధంలో గెలిచి యశస్సును పొందినవాడు. ఈ మహీపతులలో కాకతీయ రాజ్ఞి రుద్రమతో పాటుగా వారి సామంతులు లేక నాయంకరులు కూడా ఉన్నారని నేలటూరి వారి అభిప్రాయం. ఈ దండయాత్రలలో అంబదేవునికి కాకతీయుల శత్రువులయిన పాండ్యులు, సేవణులు సాయపడ్డారు. కనుకనే అంబదేవునికి 'దేవగిరి రాయప్రస్థాపిత ప్రాభృత మణికనక భూషణ' అని బిరుదున్నది. క్రీ.శ.1291 తర్వాత అంబదేవుని శాసనము త్రిపురాంతకమున గాని, మరి ఎచ్చటను కనిపించుట లేదు. (పేజీ. 35)

కాకతి రుద్రమ మరణానంతరం ప్రతాపరుద్రుడు కాకతీయ సింహాసనాన్ని అధిష్ఠించాడు. నాయంకర వ్యవస్థను పటిష్ట పరుచుకొని, చక్కని యుద్ధ వ్యూహాలతో కాయస్థ అంబదేవునిపైకి, అతడి మిత్రులపైకి ఒకే పర్యాయం దాడిచేశారు. రుద్రమ మహాప్రధాని ఇందులూరి గన్నయదేవుని కుమారుడు అన్నల దేవుడు, 'రుద్రదేవ దక్షిణ భుజాదండ', బిరుదున్న అడిదంమల్లు, సోమయ పెద్దమ సాహిణిలతో కాకతి ప్రతాపరుద్రుడు కూడా దండయాత్ర నడిపాడు. కాయస్థ అంబదేవుడు ఈ దండయాత్రలలో ఓడి మరణించి యుండవచ్చును. అంబదేవుని రాజ్యంలో ఎఱున, పొత్తపినాడు, ములికినాడు, గండికోట, రేనాడు, పెదకల్లు, సకిలి ప్రాంతాలున్నాయని అత్తిరాల శాసనం పేర్కొంటోంది. కాకతీయ ప్రతాపరుద్రుడు కాయస్థులనణచి వారి ప్రాంతాలన్నింటినీ కాకతి సామ్రాజ్యంలో కలుపుకొని వంశ ప్రతిష్ఠను తిరిగి నిలిపినాడు.

అంబదేవుని తర్వాత అతడి కుమారుడు రెండో త్రిపురారి పామూరు పట్టణాధిపతిగా 1304 లో పాలించినట్లుగా చెప్పబడింది. ఇతడు ప్రతాపరుద్రుని కప్పము చెల్లించనందున ప్రతాపరుద్రుడు గొప్ప సైన్యాన్ని దాడికి పంపాడు. సోమయ నాయకుడు ఇతడిని ఓడించాడు. అట్లే జత్తియ లెంకగొంకరెడ్డి గండికోట, ములికినాడుల పాలకుడిగా నియమితులైనాడు. ఈ రెండవ త్రిపురారి గుర్తింపుపై చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. రెండో త్రిపురారి

అంబదేవుని కుమారుడని కొందరు, కాదు యితడు అంబదేవుని సోదరుడేనని, యింకా జీవించే ఉన్నాడని మరికొందరు చరిత్రకారుల అభిప్రాయం. అంబదేవునికి త్రిపురారి కుమారుడు కాగా, మరొక కుమార్తె గలదు. ఆమెను అంబదేవుడు చెఱకు బొల్లయరెడ్డి కుమారుడైన రాజరుద్రునికిచ్చి వివాహం చేశాడు. ఈ రాజరుద్రుడిని ఆరవీటి వంశమూల పురుషుడైన తాత పిన్నమ, అతని కుమారుడు కొటికకంటి రాఘవులు ప్రతాపరుద్రుని తరపున పోరాటం చేసి, కంపిలి ప్రాంతములను ఆక్రమించాడు. ఈ తాత పిన్నమ కాకతీయుల సామంతుడు.

ఏది ఏమైనా కాకతీయుల చరిత్రలో 'కాయస్థరాజుల'ది కీలకపాత్ర, ప్రధాన భూమిక. పరబ్రహ్మ శాస్త్రి గారి అభిప్రాయంలో అటు కాకతీయులకు అత్యంత విశ్వాస పాత్రులుగాను, రాజ ద్రోహులుగా కూడా వ్యవహరించారు. వీరి చరిత్రను, దానికి ఆధారభూతమైన ప్రాథమిక ఆధారాలయిన శాసనాలను "కాయస్థ రాజులు" పేర బి.ఎన్.శాస్త్రి గారు రాసిన ఈ గ్రంథం చదివి, విశ్లేషించిన వ్యాస రచయితకు ఒక సంశయం వచ్చింది. పశ్చిమ ప్రాంతం నుంచి వచ్చి, నేటి తెలంగాణాలోని నల్లగొండ జిల్లాలోని పానగల్లు, చిట్యాల ప్రాంతాల నుండి, పల్నాడు ప్రాంతం నుండి రాయలసీమలోని కడప ప్రాంతం వరకు కాయస్థులు వలస వెళ్ళి వ్యాపించారు. ఈ వలసలో రాజ కుటుంబీకులే గాక, వివిధ హోదాలలో వున్న కాయస్థులు కూడా కనిపిస్తారు. నేడు ఈ కాయస్థులు తెలంగాణలోని హైదరాబాదు తదితర ప్రాంతాలలో కనిపిస్తారు. రాయలసీమ ప్రాంతాలయిన కడప, కర్నూలు ప్రాంతాలలో గోచరించరు. వీరి ఉనికి గూర్చి, అనగా వీరు యితర ప్రాంతాలకి వలస పోయారా? లేక సామాజికంగా యితర వర్గాలలోకి 'కులాంతరం" చెందారా? అన్నది పరిశోధించాల్సిన అంశం. శాస్త్రి గారు ఆంధ్రుల సాంఘిక చరిత్రలో కళింగాంధ్ర యుగంలో కళింగ ప్రాంత కాయస్థులు క్షత్రియులతోను, కమ్మవారితోను కలిసిపోయారని రాశారు. అందువల్లనే ఇది ఇంకొంత లోతుగా పరిశీలించాల్సిన అంశంగా పరిగణించాలి.

(శాస్త్రి గారి "కాయస్థరాజులు" గ్రంథానికి కావల్సిన కారంపూడి, దుర్గి శాసనాల ఫోటోలని అందించే అవకాశం కలిగినందుకు ఈ వ్యాస రచయిత సంతోష పడుతున్నారు.)

డా. దామరాజు సూర్యకుమార్
విశ్రాంత చరిత్రోపన్యాసకులు, చరిత్ర, శాసన పరిశోధకులు
ఫోన్ : 924 787 9164



# వేములవాడ చరిత్ర - శాసనములు

నిజాం నవాబ్ చెరనుండి విడివడిన తెలంగాణ తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు చరిత్రలను ప్రోది చేసి, సంచితమొనర్చిన తెలంగాణ చారిత్రకులలో శ్రీ భిన్నూరి నరసింహశాస్త్రిగారు ప్రథమగణ్యులు. అనితర సాధ్యమైన వీరి కృషి వేలపుటల్లో లిఖితం, ముద్రితం కావడం విశేషం. వారి శిష్య ప్రాయులైన తొలి చరిత్రకారులు కూడా ఆయన బాటలో నడిచినారు. శాస్త్రిగారు పిలిస్తే శాసనం పలుకుతుందని వారి కృషి గూర్చి సమకాలికంగా కవిత్మాకత ప్రశంసలందినారు.

శాస్త్రిగారి బహుముఖీనమైన వారసత్వ రక్షణాయజ్ఞంలో శాసన సేకరణ, విషయ వివరణ, ప్రధానమైన క్షేత్రస్థాయి కృషి కాగా, రచన, ముద్రణలో కార్యాలయ స్థాయిగా నిరంతరం సాగాయి. మూసీ పబ్లికేషన్స్ ద్వారా, పత్రికా ముద్రణ, గ్రంథముద్రణల ద్వారా వారి అమోఘమైన కృషి తెలుగువారికి, విశేషించి తెలంగాణవారికి ప్రాత:స్మరణీయమైంది. అలాంటివాటిలో వేములవాడలో నెలరోజుల పాటు నివసించి, క్షేత్రస్థాయిలో కృషి చేసినారు. శాసనాల ప్రతిబింబాల సేకరణ, ఆలయ నిర్మాణాల పరిశీలన, ఛాయాచిత్ర గ్రహణ వంటి కృషి, స్థానికులు, దేవస్థానం సహకారంతో కొనసాగించి, "వేములవాడ చరిత్ర - శాసనములు" అనే గ్రంథం రాసినారు.

1991లో ముద్రించిన గ్రంథం 150 పేజీలలో వేములవాడ చాళుక్యుల సమగ్ర చరిత్రతో బాటు, 13 శాసనాల పాఠాలు, ఛాయాచిత్రాలు, వివరణలు, సాంఘిక చరిత్ర, 12 దేవాలయాల చరిత్ర, ఇతర ఆధ్యాత్మిక స్థానాలు, వేములవాడ చాళుక్యుల రాజవంశ

చరిత్ర, రాష్ట్రకూటులు, కళ్యాణి, పశ్చిమ చాళుక్య రాజుల చరిత్ర వంటి విశేషాలు ఇందు చోటు చేసుకున్నాయి. తెలంగాణలో ఒక రాజవంశానికి చెందిన సమగ్ర చరిత్ర గ్రంథంగా మన్నన పొందింది. ఓరుగల్లు చరిత్ర తరువాత వచ్చిన గ్రంథాల పరంపరలో ఇదే ప్రథమం. కొరవి, నిర్మల్, రామగిరి, పొలవాస, కొలనుపాక, రాచకొండ, ముదిగొండ చాళుక్య పాలనలపై ఇలాంటి సమగ్ర గ్రంథాలింకా రావాలి.

సత్యాశ్రయ రణ విక్రముడు (క్రీ.శ. 641-660), పృథ్వీపతి (660-695), మహారాజు (695-723), రాజాదిత్య పృథువిక్రముడు (725-750), బాదామీ చాళుక్య సామంతులు కాగా, వినయాదిత్య యుద్ధమల్లుడు మొదట మూడవ అరికేసరి వరకు (750-973) రాష్ట్రకూట సామంతులైన ఈ రాజవంశము సుమారు 2 శతాబ్దులు ఏలిందనే సంగతి మనకు శాసనాలవల్ల తెలుస్తోంది.

పశ్చిమ చాళుక్యరాజులు తెలుగు నేలను చాలా కాలం అనగా 4 శతాబ్దులు ఏలినారు. వీరి తొలి రాజధాని బోధన్. అందువల్ల వీరిని బోధన్ చాళుకులనవచ్చును. తరువాతి వారిని మాత్రం వేములవాడ చాళుక్యులనాలి. 2వ అరికేసరి వరకు వేములవాడ రాజధానిగ లేదు. ఆతడు స్థానికాధికారి కోర్కె మేరకు వేములవాడను దర్శించినాడని శాసనంలో ఉంది.

ఇక శాస్త్రిగారిచ్చిన శాసనములను పరిశీలిద్దాం. ఇవి గ్రంథంలో ఛాయాచిత్రాలు, పాఠ్యం, ఉపోద్ఘాతంతో ఉన్నాయి. ఇవి వీరి బహుముఖీన శాసన పాండిత్యానికి సాక్ష్యాలుగా ఉన్నాయి. వాటి వివరాలు శాస్త్రిగారి వ్యాఖ్యానానికి నా జోడింపుతో వివరిస్తాను.

## 1. రెండవ అరికేసరి వేములవాడ శాసనం

ప్రస్తుతం ఇది రాజేశ్వరస్వామి దేవాలయంలో ఉంది. సుప్రసిద్ధుడైన రెండవ అరికేసరి వేయించినది. శాసన భాష సంస్కృతం. చంపూశైలి.

దీనిలో వంశ ప్రశస్తి పేర్కొనబడింది. వినయాదిత్య యుద్ధమల్లుని నుండి శాసనకర్త వరకు వంశవృక్షం ఇవ్వబడింది. పోతన నగరాన్ని పాలించే వినయాదిత్యుని ప్రశంసలో అతని గజసైన్యం తైలకూపముల స్నానం వర్ణించబడింది. ఈ వర్ణన పంపని విక్రమార్జున విజయంలో కూడా వర్ణించబడింది. ఈ రాజన్యులు (రెండవ నరసింహుడు) ఉత్తర భారత దండయాత్రలు చేసి గంగానదిలో అశ్వముల స్నానాలు చేయించారని పేర్కొనబడింది.

అరికేసరి తంత్రపాలుడైన పెద్దనార్యుని కోర్కె మేరకు అన్నదాన సత్రం పెట్టించి, వేములవాడకు ఈశాన్యభాగాన గల శత నివర్తన విస్తారభూమిని దానం చేసినట్టు

రాయబడింది. రాజేశ్వరాలయ, ఆదిత్య, బద్దగేశ్వర, నాగేశ్వరాయల స్థానాపతులు, మల్లికార్జున, వ్యక్తిలింగ, విద్యారాశి, వ్యాఖ్యాన భట్టారకులనేవారు దీనికి సాక్ష్యులుగా నిలిచినారు.

ఈ రాజ్యం పేరు 'సపాద లక్ష రాజ్యమని' పేర్కోబడింది. ఇందు రామగిరి (చిత్రకూట) దుర్గ విజయం విశేషంగా పేర్కోబడింది.

**"సచిత్ర కూటం బహుచిత్ర కూటం**
**శక్య సురేంద్రైరపి నోపయాతుం**
**త్రివర్గ యుక్తం ప్రణీతారి వర్గం**
**స్వభావదుర్గం కిల తం జహార"**

అని కరీంనగర్ (ఉమ్మడి) జిల్లాలోని రామగిరి దుర్గం విశిష్టత దీనిలో పేర్కొనబడింది. అది స్వభావ దుర్గం అని రాసి ఉంది.

## 2. కుర్క్యాల శాసనం

రెండవ అరికేసరి మహారాజాశ్రితుడు ఐన పంప మహాకవికి జినవల్లభుడని ఒక తమ్ముడున్నాడు. ఆయన వేయించినదీ శాసనం. ఈ శాసనం తొలినాళ్లల్లో గంగాధర శాసనం అని పేర్కొనబడింది.

ఇది త్రిభాషా శాసనం. కాలం లేని ఈ శాసనాన్ని పంప మహాకవి అరికేసరి మహారాజుకు అంకితంగా ఈయబడిన విక్రమార్జున విజయం ఆధారంగా క్రీ.శ. 936 నాటిదిగా గుర్తించబడింది. ఈ గ్రంథం రాసిన కన్నడ ఆదికవి పంపనికి అదే జిల్లాలోని ధర్మపురి గ్రామం ధారాదత్తం చేయబడింది.

ఈ శాసనం రాజవంశ ప్రశంస కన్న పంప మహాకవి వంశ ప్రతిష్ఠ గూర్చి ప్రాధాన్యత ఇవ్వబడిన శాసనం. పంపానుజ్జ అని తనను గూర్చి పేర్కొన్న జినవల్లభుడు సవతి తల్లి కుమారుడు. మహాకవి ఇతడే శాసనకర్త. శాసనంలో, విక్రమార్జున విజయంలో వంశవృక్షం కొంత భిన్నంగా ఉంది. శాసనంపైన ఆద్యంత తీర్థంకరుల ప్రతిమలు, కూష్మాండదేవి ప్రతిమలున్నాయి. శాసనం పెద్దకొండపై గల గండ శిలా శాసనం.

దీనిలో 3 కన్నడంలో, 3 తెలుగులో కందపద్యాలున్నాయి. తెలుగులో కంద పద్యాలు లభించే తొలి శాసనమిదే. సాహిత్య చరిత్రకు అక్కరకు వచ్చే శాసనమిది. (దీనిగూర్చి విపుల వ్యాసం నేను విడిగా రాసినది ముద్రితం) జినవల్లభుడు త్రిభాషాకవి, యోధుడు, శృంగారి, కవిజనాశ్రయకారుడైన మల్లియరేచనకు పాత్రుడు.

### 3. బద్దెగుని వేములవాడ శిలా శాసనం

ఇది చిన్న శాసనం. బద్దెగుని చాళుక్య కుల భాస్కరునిగా పేర్కొన్నది. ఈ శాసనంపైన జైన తీర్థంకరుల ప్రతిమలున్నాయి. గౌడ సంఘాధిపుడు సోమదేవసూరి శుభధామ జినాలయమునకు గల సంబంధమును సూచిస్తున్నది. ఈ ప్రభువు సపాదలక్ష భూమీశుడుగా పేర్కొనబడినాడు. సపాద లక్ష ఆదాయం గల భూమికి అధిపతి అని, ఆ భూభాగం వేములవాడ చాళుక్యుల రాజ్యమని ఈ శాసనం ద్వారా తెలుస్తుంది. ఈ రాజ్యం పేరును ఇతర శాసనాలు ధృవీకరించాయి. శాసనాన్ని చదివిన శాస్త్రిగారు సూక్ష్మ పరిశీలకునిగా ధృవీకరిస్తున్న పూర్వపీఠిక ఈ శాసనంతో ముద్రితం చేసారు. ఇతరులు ఈ ఆలయాధిపతిగా సోమదేవసూరిని పేర్కొనగా, శాసనంలోని శబ్దములను బట్టి "అనుకూలముగా" అని రాసి, శాస్త్రిగారు మితవ్యాఖ్య చేసినారు.

### 4. మూడవ అరికేసరి నాటి రేపాక శిలాశాసనం

వేములవాడ చాళుక్య ప్రభువు మూడవ అరికేసరి ఈ గ్రామంలో జినాలయం నిర్మించినట్లు పేర్కొనబడిన శాసనమిది. ఇది వేములవాడ ప్రాంతంలోని రేపాక గ్రామంలోనిది. రాపాక అని కూడా వ్యవహారంలో ఉంది. ఉజయ అనే వ్యక్తి జినాలయ నిర్మాణం చేసి, భూదానం చేసినాడు. శాసనభాష కన్నడం.

శాసనకాలం శక సం. 888 ప్రభవ సం॥ ఫాల్గుణ శుద్ధ త్రయోదశి గురువారం అంటే 14. ఫిబ్రవరి క్రీ.శ. 1968.

మూడవ నాల్గవ ప్రక్కల గల శాసనం మరొకరిది. ఇది సంస్కృత భాషలోనిది. విట్టకుల సంజాతుడు, తుక్కయ, రేవణయ్య, కొమ్మయలు పేర్కొబడినారు. శాసనాంతంలో 'అరికేసరి రాజ్యంలో అని ఉంది. కాలం ఉంది కనుక ఇతడు మూడవ అరికేసరి. ఈ వివరాలు బి.ఎన్.శాస్త్రిగారివ్వకున్నా శాసనపాఠం ఇవ్వడం చేత చూడగలిగిన అంశాలు.

ఈ గ్రామ శాసనం పర్భిణి శాసనాన్ని పేర్కొంది. 'రేపాక 12'లోని గ్రామాలు మూడవ అరికేసరిచే దానం చేయబడ్డాయి. ఈ శాసనంలో జైనులకు సౌకర్యాల కోసం నాతుకూరు దానంలో చేసినట్టుంది. నాతుకూరు రామప్ప దేవాలయం ఉన్న గ్రామం. రామప్ప దేవాలయం కూడా ఒకప్పుడు జైన దేవాలయం కావచ్చు.

### 5. వేములవాడ చెరువు వద్ద తేదీ లేని శాసనం

పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆమల్లదేవుని సామంతుడు మహేశ్వర శక్తి పండితునికి దానమిచ్చిన శాసనం. భాష కన్నడం నుండి శాస్త్రిగారు స్వీకరించినారు. కాలం లేదు. ఈ

శాసనంలో "లేంబుళవాడ" అని గ్రామ నామముంది. తరువాత వేములవాడ ఐంది.

## 6. కేదారేశ్వరాలయ ప్రాంగణ శాసనం. చికరాజుది

జగదేకమల్ల రెండవ జయసింహుని శాసనం క్రీ.శ.1033 డిసెంబర్ 21 = శ.సం. 955, శ్రీముఖ పుష్య బహుళ అమావాస్య ఉత్తరాయణ సంక్రాంతి నిమిత్తం కన్నడ (సంస్కృత) శాసనం. మండలేశ్వరుడు గండయ్య రాజేశ్వర దేవాలయానికి ఆదాయంగా కొప్పరకొల సిద్ధాయం ఇచ్చినట్లు శాసనంలో రాయబడింది.

బద్యంకేశ్వర, రాజేశ్వర దేవరలకు "జొన్న" గ్రామ దానం దీంట్లోనే ఉంది. పసాయిత కామనయ్య అభ్యర్థనతో చక్రవర్తి చేసిన దానం ఇది పసాయిత అనగా అశ్వ సైన్యాధ్యక్షుడు ఈ మాట కాకతీయ శాసనాల్లో ఉందని శాస్త్రిగారు తెలిపినారు.

చికరాజు ఈ ఆలయ నిర్మాత. దేవునిపేరు కేదారేశ్వర అని గార్త రాజేశ్వర అని ఉంది. కేదారేశ్వరాలయ కుడ్యంపై మరొక నాలుగు పంక్తుల శాసనం ఉంది. దానివల్ల తెలియదగింది ఏమీ లేదు. శాస్త్రిగారు దీన్ని అసంపూర్ణ శాసనంగా గుర్తించలేదెందుకో? శాసన గ్రామం లేంబులవాడ అని ఉంది. వెన్నిసాల మండలం జున్నగ్రామం దానంగా ఇవ్వబడింది. పోలిరెడ్డి, కొండియరడ్డి పేర్కోబడ్డారు. చాళుక్య చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుని మహా మండలేశ్వరుడైన రాజాదిత్యుడు – రాజాదిత్యేశ్వరాలయం నిర్మించాడని చెప్పే క్రీ.శ. 1083 నాటి శాసనం 25, ఫిబ్రవరి 1083.

ఈ శాసనం నేటి రాజరాజేశ్వరాలయంలో వెనుక చెరువో గోడవైపు ఉంది. కన్నడ సంస్కృత భాష శాసనం 50 పంక్తులది. రాజాదిత్య స్వహస్త లిఖితం అని శాసనంలో ఉంది. తలవృత్తి అనే పన్ను పేర్కోబడింది. (పుట్టు వెంట్రుకల పన్ను కావచ్చు).

రాజాదిత్యుడు 21000 పరిమితి గల సబ్బినాడు నేలుతు కొసవళ, సపాదలక్ష భూమిని తన అధీనంలో ఉంచుకున్నాడు. తొండ మండల భూపతి రాజేంద్రచోళుని గెలిచి, కాంచీపురము వశపరచుకొన్నాడు. ఆలయము పక్కన రాజాదిత్య సముద్రం (నేటి చెరువు) ఉంది. శైవమఠ ఛాత్రులకు, ఆచార్యులకు ఉచితాన్నదానము ఏర్పాటు చేసినాడు. దీనిలో రాజధాని లేంబులవాడెయ నేలె వీడినోళ్ సుఖసంకథా వినోదదిం రాజ్యం" అని రాసి ఉంది.

## 8. ఆరవ విక్రమాదిత్యుని కుమారుడు కుమార సోమేశ్వరుని భీమేశ్వరాలయ శాసనము

చాళుక్య విక్రమ శక 29, వ్యయ నామ సం॥ వైశాఖ శు॥ పాడ్యమి సోమవారం = 10, ఏప్రిల్ 1106 నాటి కన్నడ శాసనం, భాష కన్నడం. అరికేశ్వర దేవర నైవేద్యానికి – ఇతర

వృత్తులకు సబ్బి సహస్రంలోని "వేణిసాలె ఏబది"లో బళియ అగ్రహారం దానం చేసినట్టుంది. శ్రీమత్ 'బల్లవరస' విన్నపం మేరకు ఈ దానం చేసాడు. వేణిసాలె వెలిచాల కావచ్చు.

మాచి గంగన రక్షణలో ఒక పూదోట దానంగా ఇవ్వబడింది. ఈతడు మాలాకారుడు. ఆ నగరం పేరు శాసనంలో లేంబ్లవాడె అని ఉంది. అరికేశ్వర = అరికేసరే ఐతే జైనుడెలా హిందూ ఆలయం నిర్మిస్తాడు? కనుక ఇది హరికేశ్వర కావాలి. ఆ విషయం జగద్దేవుని శాసనంలో ఉంది.

## 9. జగద్దేవరాజు వేములవాడ శాసనము

ఆరవ విక్రమాదిత్య కాలం క్రీ.శ. 1108 కన్నడంలోని శాసనం. జగద్దేవరాజు శక సంవత్సరం 1031, సర్వధారి, వైశాఖ శుద్ధ 14, ఆదివారం = ఏప్రిల్ 26, 1108న.

హరికేశ్వర దేవరకు ఇల్లిందకుంట అగ్రహారాన్ని సింఘపరిశె బ్రహ్మేశ్వర పండితునికి దానమివ్వబడింది. ఈతని పేరిట జగత్ + అల = జగత్యాల గ్రామం ఏర్పడి ఉండవచ్చు. ఇది నేడు జిల్లాగా మారింది.

"స్వస్తిశ్రీ లేంబులవాడ సమావాస" అని ఇతని ఆవాస నగరము లేంబులవాడ అని రాసి ఉంది.

జగద్దేవరుసరు అన్న పదంలోని అరుసరు అంటే, రాజులని అర్థం. ఇల్లిందకుంటలోని తొలి కన్నడపదం ఇల్లంద (కుంట) అని అపభ్రంశం ఐంది.

## 10. కురవగట్టు శాసనం

నిజానికి ఈ శాసనంతో వేములవాడ చరిత్రకు సంబంధం లేదు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల తాలూకాలోని గంగాపురం వద్ద గల చౌడేశ్వరి ఆలయంలో ఈ శాసనం ఉంది. రాష్ట్రకూట కలి వల్లభుని కుమారుడు గోవింద వల్లభుని కాలపు శాసనం. వేములవాడ చాళుక్య వినయాదిత్య యుద్ధమల్లుని రెండో కొడుకు బీరగృహుడు ఈ శాసనంలో పేర్కోబడ్డారు. అది తప్ప ఇతరత్ర వేములవాడ రాజ్యంతో సంబంధం లేదు. ఇది చాలా చిన్న శాసనం. 8 పంక్తులే ఉంది. బీరగృహుని వీరకృత్యములు వర్ణింపబడినవని శాస్త్రిగారు రాసినారు. 4 పంక్తులు సంస్కృతం, నాలుగు పంక్తులు కన్నడంలో ఉందిది.

ఈ శాసనాల వల్ల కొందరు రాజులను గూర్చి విశేషంగా తెలిసికోవచ్చు. వారిలో

**1. మొదటి అరికేసరి (క్రీ.శ. 780-800) :** వినయాదిత్య యుద్ధమల్లుని కుమారుడు. తరువాతి బోధన్ పాలకుడు. వేంగి, త్రికళింగ రాజ్యాలను గెలిచాడు. కొల్లిపర తామ్రశాసనాలు

ఇతనిని మహాపండితుడుగా గుర్తించాయి. వ్యాకరణం, గజతంత్రం, తర్కం, వైద్యం, విలువిద్యలో ప్రవీణుడని చెప్పాయి. ధృవుని సామంతుడుగ వేంగి కళింగులపై యుద్ధం చేసాడు. వేంగి చాళుక్యరాజు నాలుగవ విష్ణువర్ధనుడు యుద్ధంలో ఓడిపోగా, అతని కూతురుని (శీల మహాదేవికి) చక్రవర్తికిప్పించి పెళ్లి చేయించాడు. కృష్ణా గోదావరుల మధ్య దేశాన యుద్ధాలు ఆగిపొయ్యాయి. ఇతని వారసుడుగా నరసింహుడు ఇతని పిదప సిహాసనమెక్కినాడు. (800-825).

ధృవుడు అరికేసరి శౌర్యాన్ని మెచ్చుకొని శీలమ్మతో తన వివాహానికి బహుమతిగా 'రామదుగు' విషయాన్ని ఇచ్చినాడు. ముగ్ధాచార్యుని (ఏలేశ్వరం పండితుడు) దర్శించి, ఈ రామదుగు విషయంలోని బెల్మోగ గ్రామం అగ్రహారంగా దానం చేసాడు. రామదుగు వెంబడి పారే నది అహల్య సాహసరామ, రాజత్రినేత్ర, త్రిభువనమల్ల, సమస్త లోకాశ్రయ బిరుదులు.

**2. రెండవ అరికేసరి (క్రీ.శ. 930) :** నాలుగు శాసనాలీతనివి ఉన్నాయి. యుద్ధవీరుడు. తండ్రికి తగ్గ వారసుడు. కవి పండిత పోషకుడు. రెండవ అరికేసరి రాజనీతిజ్ఞుడు. చక్రవర్తుల రాజకీయాల్లో తలదూర్చేవాడు. పాంచరాంకుశ, అమ్మన గంధవారణ, ఆరూఢ సర్వజ్ఞ, ఉదాత్త నారాయణ, గుణనిధి, గుణార్ణవ, త్రిభువన మల్ల వంటి బిరుదాలతో పొగడ్తలనందినాడు. రెండో అరికేసరి యుద్ధమంత్ర నిపుణుడు. పెద్దనార్యుడు వేములవాడలో ఆదిత్యాలయ నిర్మాత.

మేనమామ మూడవ ఇంద్రుని కూతురు రేవక నిర్మడిని మరొక రాష్ట్రకూట రాజకుమారి లోకాంబికను వివాహమాడినాడు. రాష్ట్రకూట రాజకుటుంబానికి ముఖ్యంగా రెండవ అమోఘవర్షునికి, నాలుగవ గోవిందునికి (తన భార్య సోదరులు) అతి కీలకంగా సాయపడ్డాడు. అన్న అమోఘవర్షుని చంపి గద్దెనెక్కిన నాలుగో గోవిందునిని వ్యతిరేకించినాడు. మూడవ ఇంద్రుని భుజాలపై ఉయ్యాలలూగినాడని వర్ణించబడ్డాడు.

ముదిగొండ చాళుక్యుడైన బిజ్జ లేదా విజయాదిత్యుడు శరణు కోరినపుడు శరణమిచ్చి, దాడికి వచ్చిన నాలుగో గోవిందుని గెలిచినాడు. ఈ బావ బావమరుదుల కలహం కృష్ణార్జున యుద్ధం లాంటిది. ఎవరి కొరకో ఇద్దరు పోట్లాడినారు. ఈ అరికేసరి విజయం వేములవాడ శాసనం వివరించింది.

ఈతడు పంప మహాకవికి జినవల్లభునికి ఆశ్రయమిచ్చినాడు. కుర్యాల శాసనం విషయాన్ని వివరించింది. అరికేసరి మాల్ఖేడ్ సామ్రాజ్యాన్ని గెలిచి మూడవ అమోఘవర్షుని కిచ్చాడు.

రెండవ అరికేసరి వేములవాడను రాజధానిగా మార్చుకొని ఏలుతూ, తమ పూర్వీకుల పోదన నగర రాజ్యాన్ని విజయాదిత్యునికి సామంతరాజ్యంగా ఇచ్చి వేసినాడు. ఈ ముదిగొండ చాళుక్య విజయాదిత్యుని కొడుకు బద్దెగ అరికేసరి సామంతుడుగా కొనసాగినాడు. అతడు చెన్నూరు నేలాడు.

ఈతని తంత్రపాలుడు (ఒక అధికారి) వేములవాడలో ఒక ఆదిత్యగృహాన్ని కట్టించాడు. ఇది సూర్యారాధనను సూచిస్తుంది. రెండవ అరికేసరి ఈ ఆలయం చూడటానికి వచ్చాడని ఉంది. భక్తుల కొరకు సత్రం, ఉచిత వైద్యశాలను నిర్మించి, ఉత్తరాయణ పుణ్యకాలాన దానం చేసాడు.

ఈ రాజులు ఆలయాల నిర్వహణకు స్థానాపతులను నిర్వహించేవారు. వాటికోసం శాసనాలు వేసేవారు. మల్లికార్జునుడు (రాజేశ్వరాలయం), వ్యాఖ్యాన భట్టారకుడు (నగరేశ్వరాలయం), సోమదేవసూరి (శభధామ జినాలయం) ఇలాంటివే.

డా. సంగనభట్ల నరసయ్య
ప్రముఖ చారిత్రక సాహిత్య పరిశోధకులు, విశ్రాంత ప్రధానాచార్యులు.
ఫోన్ : 94400 73124



# మల్యాల వంశ చరిత్ర - శాసనములు

తెలుగు శాసనాలను అధ్యయనం చేసి తెలుగు చరిత్ర నిర్మాణానికి ఇతోధిక సేవ చేసిన వారిలో శ్రీ బి.ఎన్.శాస్త్రి గారికి ఒక ప్రత్యేక స్థానముంది. శాస్త్రిగారు శాసనాలే శ్వాసగా జీవించినారు. తన జీవితమంతా శాసనాలను సేకరించి, వాటిని పరిష్కరించి, ప్రచురించడంలోనే వెచ్చించారు. శాసనాలపైన, చరిత్రపైన అనేక పుస్తకాలను ప్రచురించినారు. తెలుగు, సంస్కృత భాషల్లో, వ్యాకరణ శాస్త్రంలో, చరిత్ర అధ్యయనంలో శాస్త్రిగారికున్న అపారమైన పాండిత్యం వల్ల శాసనాలను వివిధ కోణాల నుంచి అధ్యయనం చేశారు. అందుకే మల్లంపల్లి సోమశేఖర శర్మ, పి.వి. పరబ్రహ్మశాస్త్రి లాంటి ఉద్దండ పండితులతో పాటు బి.ఎన్.శాస్త్రి గారి పేరు కూడా చిరస్థాయిగా నిలిచిపోయింది.

చాలామంది చరిత్రకారులు ప్రధాన రాజవంశాలపైన చూపినంత శ్రద్ధ సామంత, మాండలిక రాజవంశాల చరిత్రపైన చూపలేదు. అయితే బి.ఎన్.శాస్త్రి గారు ఆంధ్రప్రదేశ్ చరిత్రతో పాట అనేక సామంత, మాండలిక రాజవంశాల శాసనాలను సేకరించి, పుస్తకాలుగా ప్రచురించి తెలుగు వారి సమగ్ర చరిత్ర అధ్యయనానికి ఎనలేని సేవచేశారు. ఇలా శాస్త్రిగారు కందూరి చోడుల శాసనాలు - చరిత్ర, సంస్కృతి, రేచెర్ల రెడ్డి వంశ చరిత్ర - శాసనాలు, చెఱకు వంశచరిత్ర - శాసనాలు, వేములవాడ చరిత్ర - శాసనాలు, కాయస్థ రాజుల చరిత్ర లాంటి గ్రంథాలను ప్రచురించారు. ఆ కోవలోకి చెందిన గ్రంథమే ప్రస్తుత చర్చనీయాంశమైన 'మల్యాల వంశ చరిత్ర - శాసనాలు.'

మల్యాల వంశస్థులు కాకతీయ సామంతులు. వీరు కాకతీయ రాజుల దగ్గర సేనానులుగా, దండనాయకులుగా ప్రసిద్ధి చెందారు. ఓరుగల్లు పట్టణ రక్షణ బాధ్యతను స్వీకరించారు. కాకతీయ గణపతి దేవుని కాలంలో మిక్కిలి ప్రసిద్ధి చెందారు. కాకతీయ సామంతులుగా సంకీసపుర, వర్ధమానపుర రాజ్యాలను పాలించారు. విరియాల, గోన వంశాలతో సంబంధ బాంధ్యవాలను నెరిపారు. అమిత పరాక్రమవంతులుగా పేరు గాంచారు. కాకతీయ రాజుల పక్షాన అనేక యుద్ధాల్లో పాల్గొని విజయాలు సాధించి పెట్టారు. వీరు అనేక దేవాలయాలను నిర్మించి విరివిగా దానాలు చేశారు. పండితులను ఆదరించి అనేక అగ్రహారాలను దానంగా ఇచ్చారు. అనేక ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టినారు. అనేక చెరువులను నిర్మించి, వ్యవసాయాభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. ఈ వంశానికి చెందిన స్త్రీలు కూడా పురుషులతో సమానంగా అనేక ఆలయాలను నిర్మించి, భూదానాలు చేశారు. ఇటువంటి వివరాలన్నీ వారి శాసనాధారంగా బి.ఎన్ శాస్త్రి గారు ఈ పుస్తకంలో చక్కగా వివరించారు.

మల్యాల వంశానికి సంబంధించిన మొత్తం ఏడు శాసనాలను శాస్త్రి గారు తన పుస్తకంలో పొందుపరిచారు అవి.

1. మైలమ కటుకూరు శాసనం - శ.క. సం.1124
2. చౌండ సేనాని కొండిపర్తి శాసనం, శ.క. సం. 1125
3. కాటసేనాని కొండిపర్తి శాసనం. శక. సం. 1162
4. గుండ దండాధీరుని వర్ధమాన పుర శాసనం, శక. సం. 1169
5. గుండసేనాని బూదపుర శాసనం. శ.క. సం.1184
6. గుండసేనాని బూదపుర శాసనం, శక సం. 1194
7. కుప్పాంబిక బూదపుర శాసనం, శ.క.సం.1196

ఈ శాసనాలు కొన్ని సంస్కృత భాషలో, కొన్ని సంస్కృతం, తెలుగు భాషల్లో ఉన్నాయి. సంస్కృత శాసనాలను సరళమైన తెలుగులోకి అనువదించారు. వీటి ఆధారంగా శాస్త్రి గారు మల్యాల వంశ చరిత్రను, వారి ప్రజాసంక్షేమ కార్యక్రమాలను, వారి యుద్ధాలను గురించి చక్కగా వివరించారు. మల్యాల వంశస్థులు అనేక శైవ దేవాలయాలను నిర్మించారు. వారు శైవ మతానుయాయులని శాస్త్రిగారు నిరూపించారు.

శాస్త్రి గారు మల్యాల శాసనాల ఆధారంగా ఆ వంశానికి సంబంధించిన అనేక అంశాలను వెలుగులోకి తెచ్చారు. ఈ వంశ పాలకులు గావించిన నిర్మాణాలు, దేవాలయాలు,

దుర్గాలు, శిథిల సంపద, కవుల రచనలు, ప్రజోపయోగ నిర్మాణాలు విపులంగా చర్చించారు. ఈ వంశానికి చెందిన ప్రముఖ పాలకులైన దన్నసేనాని, సబ్బ సేనాని, కాట సేనాని, పోత సేనాని, చౌండ సేనాని, బాచసేనాని, గుండ దండాధీశుడు, కుప్పాంబిక మొదలైన వారి గురించి ఆయా శీర్షికల్లో విలువైన సమాచారాన్ని ఇచ్చారు. ప్రతి పాలకుని పరాక్రమం గురించి, పరిపాలనా విధానం గురించి వివరించారు. అందుకు శాసన ప్రమాణాన్ని చూపించారు. ఈ వంశానికి చెందిన వారు దానంగా ఇచ్చిన అగ్రహారాలను, భూముల వివరాలను ఒక పట్టిక రూపంలో ఇచ్చారు. మల్యాల వంశస్థులు నిర్మించిన దేవాలయాలు, దుర్గాలు ప్రత్యేక శీర్షికల కింద చర్చించారు. అప్పటి పరిపాలనా విధానం గురించి, విద్యా వైదుష్యాల గురించి, సంస్కృత కవితా వైభవం, వ్యవసాయం ఆర్థిక స్థితిగులు, నాణేలు, మత పరిస్థితులు, యుద్ధతంత్రాలు, శిల్పసంపద గురించి ప్రత్యేకంగా చర్చించారు. వీరి శాసనాలను రాసిన అభినవ మయూర సూరి,ఈశ్వర ఛటోపాధ్యాయుని పాండిత్యం గురించి వివరించారు. శాసనాల్లో వారు చూపించిన కవితా వైభవాన్ని గురించి శాస్త్రిగారు చక్కగా ఆవిష్కరించారు. ఇది శాస్త్రిగారికున్న సంస్కృత పరిజ్ఞానానికి నిదర్శనం.

పుస్తకం చివరలో మల్యాల వంశీయుల శాసనాలను, వాటి ప్రతిబింబాలను ఇచ్చారు. శాసన కాలాల గురించి, శాసనాల్లో ఉన్న విషయాల గురించిన సమాచారాన్ని విపులంగా ఇచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే మల్యాల వంశానికి సంబంధించిన అన్ని విషయాలను సమగ్రంగా ఈ పుస్తకంలో చేర్చారు. అంటే మల్యాల వంశ చరిత్రకు సంబంధించి ఏ చిన్న సమాచారం కావాలన్నా ఈ పుస్తకం చదివితే చాలు అన్నట్టుగా శాస్త్రిగారు ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. అవసరమైన చోట్ల ఇచ్చిన దేవాలయాల చిత్రాలు, శిథిల శిల్పాలు, శాసన ప్రతిబింబ నకళ్లు, ఈ పుస్తకానికి వన్నె తెచ్చాయి. మిగితా సామంత, మాండలిక రాజవంశాల చరిత్రను కూడా ఆయన ఈ విధంగానే తీర్చిదిద్ది చరిత్ర అధ్యయనానికి, తరువాతి తరాలకు మార్గదర్శకులైనారు.

డా. నాగోలు కృష్ణారెడ్డి
ఆచార్యులు, చరిత్ర - పురావస్తు శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9441112636



# ఆంధ్రుల సాంఘిక చరిత్ర

స్వర్గీయ బి.యన్.శాస్త్రి గారు బహు గ్రంథకర్త. శాసన పరిశోధకునిగా, చరిత్ర కారునిగా వారు చిరపరిచితుడు. వారి "ఆంధ్రుల సాంఘిక చరిత్ర క్రీ.పూ. 400 - క్రీ.శ. 1100 వరకు)" అనే చరిత్ర గ్రంథాన్ని 1975వ సంవత్సరములో సరస్వతి నిలయం, హైదరాబాదు వారు ప్రచురించారు. ప్రథమ ముద్రణగా 2000 ప్రతులు ప్రకటించి, దాని వెల రూ. 12.00గా నిర్ణయించబడింది. తరువాత ఎన్ని మలి ముద్రణలు వచ్చినాయో ప్రస్తుత రచయితకు తెలియరాలేదు. ఈ పుస్తకాన్ని రచయిత తన గురువుగారైన ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం గారికి భక్తితో అంకితమిచ్చారు.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర అనగానే ఏ చరిత్రకారునికైనా సురవరం ప్రతాప రెడ్డిగారు రచించిన అత్యున్నతమైన గ్రంథం గుర్తు రావడం కద్దు. ఈ పుస్తకాన్ని రెడ్డిగారు 1949లో ప్రచురించారు. మొదటి ప్రచురణను కాకతీయయుగంతో ప్రారంభించి, 1907తో ముగించారు. 1950లో ఈ పుస్తక ద్వితీయ ముద్రణలో తూర్పు చాళుక్య యుగము అనే కొత్త ప్రకరణాన్ని చేర్చానని, "ఇకముందు ఈ సాంఘిక చరిత్ర పూర్వభాగమును శాలివాహనుల కాలము నుండి రాజరాజ నరేంద్రుని కాలము వరకూ రాయుటకు పూనుకొందునని" రెడ్డి గారు తెలియజేశారు. ప్రతాపరెడ్డి గారు తన సాంఘిక చరిత్రకు పూర్వ భాగ రచన ప్రారంభించారో లేదా కొన్ని ప్రకరణాలను రచించారో ఇదమిత్థంగా తెలియరావటం లేదు. ఈలోగా రెడ్డి గారు 1953వ సంవత్సరంలో పరమపదించారు.

ప్రతాపరెడ్డి గారి సాంఘిక చరిత్ర అసమగ్రంగా మిగిలి పోయిందని ఆ ఖాళీని పూరించాలని శాస్త్రిగారు భావించారు. తన పరిమితులు, పరిధులు చక్కగా తెలిసిన శాస్త్రి గారు ఇలా చెప్పుకున్నారు. **"నా వంటి అలజ్ఞుడిట్టి రచనకు ఉద్యమించుట న్యాయమైన పని కాదు. కాని సురవరం ప్రతాప రెడ్డి గారు అసంపూర్తిగా వదిలిన సాంఘిక చరిత్ర పూర్వ భాగము రచించవలెనన్న ఉత్సాహము, పట్టుదల నన్నీ రచనకు పురి కొల్పినవి".** తాను ఆ కాలము నాటి మహామహులైన చరిత్రకారులు రచించిన వ్యాసాలను శాతవాహనులాది చాళుక్య వంశీయుల కాలము వరకు వెలసిన శాసనాలను చదివి తనకు తోచిన విధముగా ఈ సాంఘిక చరిత్ర పూర్వ భాగాన్ని రచించానని శాస్త్రి గారు ప్రకటించుకున్నారు. శాస్త్రిగారు ఈ గ్రంథాన్ని ప్రచురించక మునుపే భారతి, ఆంధ్రప్రదేశ్ మాస పత్రికలలో మరియు సాహిత్య వాల్లభ్యము అనే పేరెన్నికగన్న పుస్తకములో ఈ కాలానికి సంబంధించిన కొన్ని వ్యాసాలను రచించి ప్రచురించారు. ఆ వ్యాసాలను మూలముగా తీసుకుని వాటికి మరికొంత సమాచారాన్ని జోడించి, మరికొన్ని వ్యాసాలను కొత్తగా రచించి వాటినన్నింటినీ కలిపి ఈ ఆంధ్రుల సాంఘిక చరిత్రను రచించారని భావించవచ్చును.

శాస్త్రిగారు తమ ఆంధ్రుల సాంఘికచరిత్ర మొదటి ప్రచురణను ఎనిమిది ప్రకరణాలుగా విభజించారు. అవి 1. శాతవాహనులకు పూర్వయుగం 2. శాతవాహన యుగం 3. ఇక్ష్వాకుల యుగం 4. పల్లవ యుగం, 5. బృహత్పలాయన, ఆనంద గోత్రిక, శాలంకాయనుల కాలం 6. విష్ణుకుండిన యుగం 7. కళింగాంధ్ర యుగము 8. రేనాటి చోళ యుగం. అయితే రాపాక ఏకాంబరాచార్యులు రచించిన "సుప్రసిద్ధ పరిశోధకులు బి.యన్.శాస్త్రి" అనే పుస్తకములో పది ప్రకరణాలు కలవని చెప్తూ, పైన చెప్పిన ఎనిమిది కాక అందులో చాళుక్య యుగము మరియు చాళుక్య – చోళ యుగము కూడా ఉన్నాయని తెలియజేసారు. ఈ రెండు ప్రకరణాలను శాస్త్రిగారు కొత్తగా రచించి, మలి ముద్రణలో చేర్చి ఉంటారని భావించాలి. అయితే ప్రస్తుత రచయితకు ప్రథమ ముద్రణ ప్రతి మాత్రమే అందుబాటులో ఉన్నందున ప్రస్తుత సమీక్ష దానికే పరిమితమైందని గమనించాలి.

## 1. శాతవాహనులకు పూర్వముగము :

శాస్త్రిగారు తన రచనను ఒక నిర్వచనంతో మొదలు పెడతారు. అది ఇలా కొనసాగుతుంది. **"మానవుని సాంఘిక, వైజ్ఞానిక, ఆర్థిక, రాజకీయ, మత, సారస్వత, కళా విషయములను ప్రాంతీయముగ, జాతీయముగ కాక, యావత్ప్రపంచ మానవ సమాజమునకు సంబంధించిన వానిగా ఎరుంగుటకు తెలుపునది సాంఘిక చరిత్ర"** అని ఉదహరించారు. రచయితలు నిరంకుశులంటారు. దానికి శాస్త్రిగారు అతీతులు కారేమోనని అనిపిస్తుంది.

తాను ఉటంకించిన విషయాలకు పాద సూచికలిచ్చే అలవాటు పెద్దగా లేని శాస్త్రిగారు, ఈ నిర్వచనాన్ని ఎక్కడ నుంచి తీసుకున్నారనే వివరణ ఇవ్వలేదు. ప్రస్తుత చరిత్రకారులకు ఈ నిర్వచనం విచిత్రంగా అనిపిస్తూ మింగుడుపడదు. సారస్వతము, శాసనములు, స్థానిక చరిత్రలు, విదేశీయుల వ్రాతలు, శిల్పములు, చిత్తరువులు, నాణెములు, సామెతలు, వాఙ్మయములలోని సూచనలు, దాన పత్రములు, పురాతన వస్తు సమూహము, పాటలు, చాటువులు, జానపద గేయాలు ఆధారాలని తెలియజేస్తారు.

ఈ ప్రకరణంలో ఆంధ్రుల ప్రాచీనతను గురించి చెబుతూ, ఐతరేయ బ్రాహ్మణంలోని శునశ్శేపుని కథను ఉటంకిస్తూ, విశ్వామిత్రుని చేత శపించబడిన అతని పుత్రులలో కొందరే ఆంధ్రులని, వారే దాక్షిణాత్యానికి వచ్చి, అప్పట్లో నివాసయోగ్యం కాని ప్రస్తుత ఆంధ్ర ప్రాంతంలో స్థిరపడ్డారని తెలియజేస్తారు. తరువాత కలగాపులగంగా రామాయణ, భారతాలను, బౌద్ధ, జైన మత గ్రంథాలను ఉటంకిస్తూ ఆంధ్రదేశానికి మంజీరికా దేశమని పేరు కలదని పేర్కొన్నారు. ఆర్యుల రాకతో వర్ణాశ్రమ ధర్మము ఆంధ్ర దేశములో నెలకొన్నదంటారు. మౌర్య సామ్రాజ్యంలో అంతర్భాగమైన ఆంధ్ర ప్రాంతం, అశోకుని మరణానంతరం స్వతంత్రించి, ఉత్తర భారతంపై దండెత్తి రాజ్యాన్ని విస్తరించి, దక్షిణాపథాన్ని కూడా తమ అధికారం కిందకు తెచ్చుకున్నారని శాస్త్రిగారు తెలియజేశారు.

## 2. శాతవాహన యుగము :

నానాఘాట్ మరియు నాసిక్ శాసనాలను ఉటంకిస్తూ, రాజకీయ వ్యవహారాలలో స్త్రీలు ప్రముఖ పాత్ర పోషించారని శాస్త్రిగారు చెబుతారు. ప్రజలు నిశ్చింతగా జీవించడానికి అవకాశం కల్పించడం, ప్రజల కష్టసుఖాలను తమవిగా భావించడం, వర్ణాశ్రమ ధర్మం నశించకుండా చూడడం, పెద్దల ఎడల గౌరవం కలిగి వుండటం ఆనాటి సాధారణ రాజధర్మాలు. శాస్త్రిగారు శాతవాహన కాలంనాటి రాజకీయ, ఆర్థిక, వ్యాపార, మత విషయాలకు ఈ ప్రకరణంలో పెద్దపీట వేశారు. గాథాసప్తశతి, బృహత్కథ, లీలావతి కావ్యం, వాత్స్యాయనీయం గూర్చిన సమాచారం, ముఖ్యంగా గాథా సప్తశతి నుంచి గ్రహించిన 19 సూక్తులు ప్రతివారు చదవాల్సిందే. ఈ ప్రకరణం చివరలో మాత్రమే శాస్త్రిగారు సాంఘిక పరిస్థితుల గురించి చెబుతారు.

వర్ణాశ్రమ ధర్మాలను రాజులు చక్కగా పాలించారని, ఆనాటి వర్తకులు దానధర్మాలు విరివిగా చేశారని, చతుర్థ వర్ణానికి చెందిన హాలిక, మార్దక, గోలికాది శాఖలను శాసనాలలో చూడవచ్చుని, విదేశీయులు భారత సమాజంలో స్థిరనివాసులైనారని, సమిష్టి కుటుంబం

వుండేదని, దానికి గృహపతి యజమానేనని, ఆనాటి సంఘంలో స్త్రీలకు సముచిత స్థానం కలదనీ, వారు గృహనిర్వహణ, రాజకీయ, మత విషయాలలో మగవారికి చేదోడు, వాదోడుగా వుంటూ దానధర్మాలు విరివిగా చేశారని చెప్తారు.

తల మొదలు కాలివరకు ధరించెడి అనేక ఆభరణాల పేర్లు ఉదహరిస్తారు శాస్త్రిగారు. వాటిలో చాలా వరకు మనం విననివే. పంచ కట్టడమే నామోషి అయిపోతున్న మరియు పంచెను ధోతిగా కట్టడమో తెలిసిన ఈ తరానికి, ఆ కాలంలో పంచకట్టు విధానంలో ఐదు రకాలున్నాయని, అవి 1. విరుపుకట్టు 2. పంచకచ్చము 3. మత్స్యవాలకం 4. హస్తి తుండకం 5. గుల్పవలంచి అని శాస్త్రి గారు తెలియజేస్తారు. అలాగే ఐదు రకాల ఆసనాలను ఉదహరించారు. 1.సింహాసనములు 2. ఆసందులు 3. మంచములు 4. పర్యంకములు మరియు 5. అర్ధపర్యంకములు.

ఆనాటి ప్రజా వినోదాలను కొన్నింటిని శాస్త్రిగారు సవివరంగా అందిస్తారు. వాటిలో కొన్నింటిని చరిత్రకారులు కూడా విని ఉండరని నా ఉద్దేశ్యము. వాటి వివరాలను పరిశీలించినపుడు వాటిలో కొన్నింటిని ఇంగ్లీషు పేర్లను తగిలించి నేటి యువత ఆచరించారని అనుకోవచ్చు. ఆ 24 వినోదాలను తెలుసుకుంటే మనం ఏం కోల్పోయామో అర్థమవుతుంది. ఆ పట్టికలోని వినోదాలు ఇలా వున్నాయి. 1. ఘటా నిబంధనము 2. గోష్ఠి సమవాయము 3. సమపానకము 4. ఉద్యాన గమనము 5. యక్షరాత్రి లేదా పక్షరాత్రి 6. కౌముదీ జాగరణము 7. సువసంతము లేదా మదనోత్సవము 8. సహకార భంజిక 9. అభ్యూష ఖాదిక 10. బిసఖాదిక 11. నవపత్రిక 12. ఉదక క్ష్వేదిక 13. పాంచాలానుయానము. 14. ఏకశాల్మలీ (కోతికొమ్మచ్చి), 15. యవ చతుర్థి 16. అలోక చతుర్దీ 17. మదనోత్సవము 18. దమన భంజిక 19. హోలాక (హోళీ) 20. అశోకోత్తంసిక 21. పుష్పచాయిక 22. చూతతిలకా 23. ఇక్షుభంజికా 24. కదంబ యుద్ధము 25. అలాగుననే 64 కళల పేర్లు కూడా శాస్త్రి గారు ఉదహరించారు.

**3. ఇక్ష్వాకుల యుగము** :

ఈ ప్రకరణంలో సాంఘిక చరిత్రను గురించిన వివరములు అతి తక్కువగా కనబడతాయి. ఈ అధ్యాయంలో ఆర్థిక వ్యవస్థ, నాణెములు, మత పరిస్థితులు, విదేశీ వ్యాపారము, శిల్పము అనే శీర్షికలు కనబడుతూ, వాటి గురించి వివరాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇక సాంఘిక పరిస్థితులు అనే అంశం కింద ప్రజలు సంఘ జీవనము గడుపుతున్నారని, స్త్రీలకు గౌరవం మెండుగా కలదని మాత్రమే తెలియజేస్తూ ముగిస్తారు శాస్త్రిగారు.

### 4. పల్లవ యుగము :

ఇందులో పల్లవ రాజుల పట్టిక, రాజ్యపాలనా విధానము, పరిపాలనా వ్యవస్థ, వైదుష్యము, మత పరిస్థితులు, శిల్పము, వాణిజ్యాలకు పెద్దపీట వేసి, సాంఘిక పరిస్థితులను కేవలం రెండు పేజీలకు మాత్రమే పరిమితం చేయబడింది. దానిలో కూడా ప్రజలు సుఖంగా జీవించారని, బ్రాహ్మణులను గౌరవంగా చూశారని, ప్రజల సౌకర్యార్థం పాఠశాలలను, వైద్యశాలలను నిర్మించారని ముగించవేయబడింది. ఈ ప్రకరణంలో ఆంధ్రప్రాంత విషయాల కంటే పొరుగున వున్న తమిళ ప్రాంత వివరాలే ఎక్కువ.

### 5. బృహత్పలాయన, ఆనంద గోత్రిక, శాలంకాయనుల కాలము :

ఈ ప్రకరణంలో ముందుగా బృహత్పలాయనుల కాలము, పరిపాలనా విధానము, రాజధాని – ప్రధాన నగరములు, మత సాంఘిక పరిస్థితులు, కళలు–శిల్పము, వాణిజ్యము అనే శీర్షికలు కనబడుతూ వాటి గురించి వివరాలున్నాయి. తర్వాత ఆనంద గోత్రికుల కాలము కింద పరిపాలనా విధానము, మతము, వాఙ్మయము, దానధర్మాలు, విదేశీ వ్యాపారము, శిల్పములను గురించిన వివరాలు తెల్పబడ్డాయి. అలాగే శాలంకాయనుల కాలము అనే అంశం కింద పరిపాలనా విధానము, ప్రజల వృత్తులు, వాణిజ్యము, వైదుష్యము, వేంగి నగరము గురించిన వివరాలు తెలుస్తాయి.

ఈ ప్రకరణము ముఖ్యమైన ఆకర్షణ ఏమంటే రథకార కులము గురించి వివరణము. ఇది సాంఘిక చరిత్ర కారులకు అమితంగా ఉపయోగపడుతుంది. రథకారులంటే క్షత్రియ తండ్రికి వైశ్యతల్లికి, లేదా వైశ్య జనకునికి, శూద్ర స్త్రీకి జన్మించిన సంతానమని మరొక విధంగా చెప్పాలటే సంకర జాతి వారని ధర్మసూత్రాల ఆధారంగా నిరూపణ చేశారు శాస్త్రిగారు. ఈ రథకార కులజులు కళల యందు ఆరితేరారని, శిల్పము, వాస్తుశిల్పము, రథము, బండ్లు, దేవాలయ గోపురములు, గోపురాలపై కుడ్యములపై చిత్రములు వేయుట, రాజభవనములు నిర్మించుట, సువర్ణ రత్నాభరణములు చేయుట, ముఖ్య వృత్తులుగా చేసుకొని జీవించారని చెప్పబడింది. తర్వాత కాలంలో తమను తాము పంచాణము వారని చెప్పుకుంటూ, ఒకే గొడుగు కిందకు చేరిన కంసాలి, కుమ్మరి, కంచరి, కాశె మరియు వడ్రంగి వారు తాము రథకారులమని చెప్పుకున్నారని గమనించాలి.

అలాగే ఈ కాలంలో మాతృస్వామ్య వ్యవస్థ క్రమంగా బలహీనపడి, అంతరించి సమాజము పితృస్వామ్యానికి మారడాన్ని శాస్త్రిగారు వివరించారు.

## 6. విష్ణుకుండిన యుగము :

విష్ణుకుండినులు మొదటగా తెలంగాణా ప్రాంతాన్ని పరిపాలించారని సాధికారికంగా శాస్త్రిగారు నిరూపించారు. విష్ణుకుండినుల మొదటి రాజధాని ఇంద్రపాల నగరం తెలంగాణలోని నల్లగొండ ప్రాంతంలో కలదని వివరణాత్మకంగా చెప్తారు. తర్వాత విష్ణుకుండినుల పరిపాలనా విధానము, మత పరిస్థితులు, వైదుష్యము, వాణిజ్యము, శిల్పము గురించిన శీర్షికలు కనబడతాయి తప్ప, సాంఘిక చరిత్ర మచ్చుకైనా కనబడదు. తన రచనా శైలికి విరుద్ధంగా శాస్త్రిగారు ఈ ప్రకరణంలో పాదసూచికలు ఇస్తారు.

## 7. కళింగాంధ్ర యుగము :

కళింగాంధ్ర రాజధాని కళింగ పురమని, అదే నేటి శ్రీకాకుళం జిల్లాలోని ముఖలింగమని శాస్త్రిగారు భావించి, నిరూపణ చేశారు. తర్వాత రాజ్యపరిపాలనా విధానము, మతపరిస్థితులు, వ్యాపారం, వాఙ్మయము, కళింగ దేశంలోని ఆలయ నిర్మాణ పద్ధతి గురించి వివరిస్తూ, సాంఘిక జీవనానికి కూడా స్థానం కల్పించారు. నివాసాల గురించి వివరిస్తూ, రాజులు, సామంతులు, ముఖ్యమైన వర్తకులు మేడలలోనూ, ఉద్యోగులు, వర్తకులు తదితర ధనవంతులు మంచి ఇండ్లలోనూ, పేదవారు తాటి యాకులతో నిర్మించిన పూరిండ్లు/ గుడిసెలలో జీవించారని తెలియజేస్తారు. సారవంతమైన భూములు, పాడిపంటలు సమృద్ధిగా వుండి, వర్తకవాణిజ్యాలు ఎక్కువగా గల కళింగాంధ్రదేశంలో రాజులు ప్రజలు విలాసవంతంగా జీవించారట. నేటి ఈ ప్రాంత వెనుకబాటుతనానికి బాధ్యులెవరనే ప్రశ్న మాత్రం చరిత్రకారులలో తప్పక ఉద్భవిస్తుంది.

ఇక్కడ కళలు నేర్పడానికి ప్రత్యేక విద్యాలయాలు ఉన్నాయని, ప్రజలు మాగధి, పైశాచి, ఆంధ్ర, కళింగ భాషలను మాట్లాడే వారని చెబుతారు. కళింగాంధ్రమున బ్రాహ్మణులు, వైశ్యులు, కాయస్థులు, కాపులు, పల్లవ కాపులు, గొల్లలు, అగశాలులు, తెలికాపులు ఉన్నట్లు శాసనాధారంగా శాస్త్రిగారు చెబుతారు.కళింగ ప్రాంతంలో తెలుగు బ్రాహ్మణులు స్థిరపడ్డారని, వీరికీ కళింగ బ్రాహ్మణులకు మధ్య సంబంధ బాంధవ్యాలు ఉన్నట్లు తెలియరావడం లేదని, కళింగ విప్రులు తమ గోత్రాదికములను శాసనాలలో తెలుపుకోలేదని శాస్త్రిగారు చెబుతారు. గొల్లలకు బోయండు అను ఇంకో పేరుందని, కాయస్థుల గురించి చెప్తూ ఆశ్చర్యకరంగా వీరు క్షత్రియులతోనూ, కమ్మవారితోనూ కలిసి పోయారంటారు. వీరిలో కరణీక వృత్తి అవలంబించే వారు కరణపు కాయస్తులని, ఆ వృత్తిని స్వీకరించని వారు కాయస్థులు లేదా కళింగులని వ్యవహరించబడుతున్నారని చెప్తారు. శాస్త్రిగారు

చెప్పిన ఈ విషయాలపై మరింత లోతుగా పరిశోధించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతానికి చెందిన బ్రాహ్మణులు, వైశ్యులు, గంగ, రాయ అనే బిరుదములను ధరించినట్లు శాసనాల ద్వారా తెలుస్తుందని చెప్తారు. పోతి, పోతు అనే పదాలు స్త్రీ, పురుష నామాల చివర కనిపిస్తాయని, ఆ పదాలే తెలంగాణ ప్రాంతంలో వాడుకలో ఉన్న పోరి అనే పదానికి ప్రాచీన రూపమని శాస్త్రిగారు అభిప్రాయపడ్డారు. దీని గురించి భాషాపండితులు ఆలోచించాల్సిందే. కళింగాంధ్ర ప్రాంతములో రాజులలో పిత్రానుకమును, కాయస్తులలో మాత్రానుకము ఉన్నట్లు తోస్తుందని చెప్పారు.

రాజ వంశీకులు మిక్కిలి సన్ననైన దారంతో నేసిన బట్టలను ధరించేవారని, తమిళ భాషలో కళింగ మనగా సున్నితమైన బట్ట అనే అర్థం ఇప్పటికి కలదని చెప్తూ, శాస్త్రిగారు ఒక చమత్కారమైన కథను తెలియజేస్తారు. "కళింగ రాజు, కోసల రాజుకు కానుకగా పంపిన దుస్తులను ధరించి, అతని రాణి సభా ప్రవేశమొనర్ప, ఆమె అవయవములు పైకి కనబడుట చూసి, సభికులు తలలు వంచుకొనుట వల్ల, కోసల రాణి సిగ్గుపడి లోపలికి వెళ్ళినట్లు ఐతిహ్యమున్నది" అని తెలియజేస్తారు.

అలాగే ప్రజావినోదాలను, దేవాలయ శిల్పాధికారికంగా ఆనాటి ప్రజల వస్త్రధారణను, ఆభరణాల వివిధ అలంకార భూషణాల గురించి తెలుసుకోవచ్చని శాస్త్రిగారు చెబుతారు. ప్రజలు వసంతోత్సవము, ఏరువాక పూర్ణిమ వంటి పండుగలలో రాజులు మొదలు సామాన్య ప్రజల వరకు కూడా పాల్గొనేవారని చెబుతారు. శాస్త్రిగారు ఈ ప్రకరణానికి కూడా పాద సూచికలను ఇచ్చి, భావి పరిశోధకులకు అవకాశం కల్పించారు.

## 8. రేనాటి చోళయుగము :

మొదటి ముద్రణ ప్రకారం, ఇదే పుస్తకానికి చివరి ప్రకరణము. కొందరు రాజులు తాము చోళులమని చెప్పుకుంటూ రేనాడు 7000 ప్రాంతాన్ని అనగా ప్రస్తుత కడప జిల్లా ప్రాంతాన్ని పరిపాలించారు. మొదటి తెలుగు శాసనమైన కలమళ్ళ శాసనాన్ని ప్రకటించిన ఘనత రేనాటి చోళులకే దక్కుతుంది.

రేనాటి చోళ రాజుల గురించిన సమాచారం అందించిన తర్వాత, శాస్త్రిగారు వారి పాలనా విధానము, భాషాస్థితి, మతము, వ్యాపారము అనే శీర్షికలతో పాటు సాంఘిక పరిస్థితులను కూడా వివరించారు. ప్రజలు సుఖమయ జీవనం గడిపారని, వర్ణ వ్యవస్థ పూర్తిగా ఏర్పడిందని, అన్ని వృత్తులవారూ ఉండేవారని, వ్యవసాయం ముఖ్యవృత్తిగా వుండేదని, ప్రజలు సంఘీభావంగా కట్టుబాట్లతో నివసించేవారని, కొందరి పురుషుల పేర్లు, స్త్రీల పేర్ల

వలే కనపడతాయని, పంచాణనం వారైన కమ్మరులు శాసనాలు చెక్కెడి వారని చెప్తారు. కోడి పందేలు, మేష మహిష యుద్ధములు, వేట, ఏరువాక పున్నమి వంటి పండుగలు మొదలైనవి ఆ కాలము నాటి ప్రజా వినోదాలని చెప్తారు. స్త్రీలు కర్ణాభరణములు, ముక్కెరలు వంటి ఆభరణాలను ధరించేవారని చెప్తూ, వివాహాలు నాలుగు రోజుల పాటు జరిగేవని, బాలికలు బొమ్మలాటలు, ఆయా పండుగలకు సంబంధించిన ఆటలను ఆడేవారని తెలియజేస్తారు. ఈ ప్రకరణము కూడా శాస్త్రిగారి పద్ధతిలో పాదసూచికలు లేకుండా సాగిపోతుంది.

**ముగింపు :**

శాస్త్రిగారి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' ను సమగ్రంగా చదివిన తర్వాత, ఈ పుస్తక నామౌచిత్యం పట్ల సందేహాలు తలెత్తక మానవు. ఎందుకంటే ఈ ఆంధ్రుల సాంఘిక చరిత్రలో, సాంఘిక మరియు సామాజిక విషయాలను వెదుక్కోవాల్సిన పరిస్థితి. అందువల్ల దీనిని ఆంధ్రుల సాంఘిక చరిత్ర అనడం కంటే, ఆంధ్రుల చరిత్ర (క్రీ.పూ.400 మొదలు క్రీ.శ.1100 వరకు) అని పేరు పెట్టినట్లయితే బాగుండేదేమో. అన్ని విషయాలు కూలంకషంగా తెలిసిన శాస్త్రిగారు ఆ పేరుపెట్టి ఉండకపోవచ్చునేమోనని ప్రస్తుత రచయిత భావన. బహుశ: ప్రచురణ కర్తలు, అప్పటికే ప్రజాభిమానం చూరగొన్న సురవరం ప్రతాపరెడ్డి గారి ఆంధ్రుల సాంఘిక చరిత్ర పేరు మీద వ్యాపారం అధికంగా చేయవచ్చునని శాస్త్రిగారిని ఒత్తిడి చేయించి రాయించారేమోనని భావించాల్సి వస్తుంది.

రాశిలో కానీ, వాసిలో గానీ బి.ఎన్.శాస్త్రి గారి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, అంతకు మునుపే అదే పేరుమీద 1907 వరకు రచించిన పుస్తకానికి దరిదాపుల్లో కూడా రాలేదు. దీనికి కారణం లేకపోలేదు. ప్రతాపరెడ్డి గారి సాంఘిక చరిత్ర రచించిన కాలానికి వివిధ రకాలైన ఆధారాలు మిక్కిలి అధికం. ముఖ్యంగా సాంఘిక చరిత్ర రచనకు ఎక్కువగా ఉ పయోగపడే ఆ కాలానికి చెందిన ఆధారాలు తెలుగు భాషలో ఎక్కువగా లభిస్తాయి. వాటిని రెడ్డి గారు విరివిగా ఉపయోగించడంలో కృతకృత్యులయ్యారు. అయితే శాస్త్రి గారి సాంఘిక చరిత్ర కాలానికి చెందిన ఆధారాలు, ముఖ్యంగా సాహిత్య ఆధారాలు అతి తక్కువ. బహుశ: ఈ కారణంగా వున్నటువంటి ఆధారాలతో ఆ కాలం నాటి ఆంధ్రుల సాంఘిక చరిత్ర రాయడం సాహసమే. అందువల్ల వారు అనాసక్తంగా ఈ పుస్తక రచన చేశారేమోనని అనుమానించాలి.

ఈ ఆంధ్రుల సాంఘిక చరిత్ర పుస్తకం చదివినంత సేపూ, ఇది శాస్త్రి గారి మొదటి చిత్తు ప్రతియేమోనని, దానిని ప్రచురణ ముందు సరిదిద్దలేదని అనుమానం కలుగక

మానదు. అక్షర గుణింతాల తప్పులను అలాగే వదిలివేసినట్లు తెలుస్తోంది. అంతకు మించి సేకరించిన విషయాలను అన్నింటిని ఒక మంచి దండలా గుచ్చినట్లుగా, ఏకీకృతంగా వుండునట్లు అనిపించి, చదువరులను చికాకు పరిచేట్లుగా వున్నది.

శాస్త్రి గారికి పాద సూచికలను, వివరణాలను ఇచ్చే అలవాటు పెద్దగా లేదనే విషయం అందరికీ తెలిసిందే. కానీ పుస్తకంలో రెండు ప్రకరణాలను మాత్రమే తన పద్ధతికి విరుద్ధంగా పాదసూచికలను ఇవ్వడం మనం గమనించవచ్చు. ఇదేలాగున అన్ని అధ్యాయాలకు పాద సూచికలు ఇచ్చి వున్నట్లయితే భావి పరిశోధకులకు ఉపయోగంగా వుండేది. అయితే ప్రతి ప్రకరణం చివర ఉపయుక్త గ్రంథాల పట్టిక ఇచ్చి కొంతమేలు చేశారు శాస్త్రిగారు.

అయితే శాతవాహనుల యుగపు సాంఘిక పరిస్థితుల గురించిన సమాచారము, కళింగాంధ్ర కాలము నాటి సామాజిక మార్పుల గురించి సమాచారం సమగ్రంగా వుండి మనకు తెలియని అనేక విషయాలను శాస్త్రిగారు తెలియజేస్తారు. ముఖ్యంగా కళింగాంధ్ర ప్రాంతం గురించిన అనేక విషయాలపై శాస్త్రిగారు అభిప్రాయాలపై మరింత లోతుగా పరిశోధనలు చేయాల్సిందే.

**డా. బి. రామచంద్రారెడ్డి**
శాఖాధ్యక్షులు, చరిత్ర శాఖ, కె.ఎం.ఎస్. పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్, పుదుచ్చేరి.
ఫోన్ : 9442034015



# ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి (3 భాగాలు)

బి.ఎన్.శాస్త్రి గారు (భిన్నూరి నరసింహ శాస్త్రి) తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రసిద్ధ చరిత్రకారులు. కొమర్రాజు లక్ష్మణరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మల తరువాత అంతగా పరిశోధనా వాఙ్మయాన్ని అందించిన విద్వాంసులు.

బి.ఎన్. శాస్త్రి గారు 1932వ సం॥లో యాదాద్రి - భువనగిరి జిల్లా, వలిగొండ గ్రామంలో ఒక సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. వీరి బాల్యంలో నల్లగొండ జిల్లా మొత్తం నిజాం వ్యతిరేక పోరాటంలో ఉంది. ఈ ప్రభావం శాస్త్రిగారిని ఉద్యమంవైపు వెళ్ళేందుకు ఉత్సాహాన్నిచ్చింది. కొంతకాలం పాటు అజ్ఞాత జీవనాన్ని కూడా గడిపారు. ఆ సమయంలోనే రావి నారాయణ రెడ్డితో పరిచయం ఏర్పడింది. భువనగిరి, హైద్రాబాద్‌లలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న శాస్త్రిగారు 1952లో నారాయణగూడ పాఠశాల (హైద్రాబాద్)లో అధ్యాపక జీవితాన్ని ప్రారంభించారు. తన తొమ్మిదవ ఏటనే దృష్టి పడిన శాసన శిలల గురించి పరిశోధన చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగి "శాసనాల శాస్త్రి" గా ప్రసిద్ధి పొందారు. 1959లో ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు విభాగం నుండి ఎమ్.ఏ. పూర్తి చేశారు. ఆ తర్వాత అదే శాఖలో 'శాసనాల ద్వారా తెలుగు లిపి పరిణామం' అనే అంశంపై పిహెచ్.డి. కి దరఖాస్తు చేసుకున్నారు.

బహు గ్రంథకర్త అయిన శాస్త్రిగారు రచించిన గ్రంథాలలో "ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి" ప్రథమ, ద్వితీయ, తృతీయ భాగాలు చాలా ప్రసిద్ధమైనవిగా చెప్పుకోవచ్చు.

## ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి

## (క్రీ.పూ. నుండి క్రీ.శ. 1323 వరకు)

"ఆంధ్రదేశ చరిత్ర – సంస్కృతి" మొదటి భాగంలో క్రీ.పూ. నుండి క్రీ.శ. 1323 వరకు వ్రాశారు. "ఆంధ్రదేశము సువిశాలమైనది. సుసంపన్నమైనది. సిరి సంపదలకు నిలయము. ప్రకృతి శోభలకు ఆలవాలమైనది. దక్కన్ పీఠభూమి, దక్కన్ భారతము నందున్న జాతులలో ఆంధ్రజాతికి గల ఉజ్జ్వల చరిత్ర మరియే జాతి యందును కనిపించదు" గా వీరు వ్రాసిన తీరు అద్భుతం.

"ఎత్తైన పర్వతపంక్తులు, కొండలు, కోనలు, లోయలు, సాంద్రారణ్యములు, ఖనిజములు, బృహత్ తటాకములు, పంట కాలువలు, నవ ధాన్యములు ఫలించు భూములు గల ఆంధ్ర దేశమును పావనమైన కృష్ణా, గోదావరి, తుంగభద్ర, మంజీర, పినాకిని వంటి నదులు, ఉప నదులతో కలిసి ప్రవహించి పునీత మొనర్చునది"గా అనేక వివరాలతో చర్చించబడింది.

"ప్రాచీన మానవ ఆవాసములు, చరిత్ర పూర్వ యుగము నాటి స్మశాన వాటికలు, సిస్త్, డాల్మెను సమాధులు, ప్రాచీనాంధ్ర నగరములు, తీర మైదానములు, జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ మతములకు సంబంధించిన బసదులు, జినాలయములు, ఆరామ విహారములు, చైత్యములు, స్థూపములు, శిల్పకళా శోభితములైన వందల కొలది శైవ, వైష్ణవ దేవాలయములు ఆంధ్రుల నొక ప్రత్యేకమైన జాతి వారుగా, అసహాయ శూరులుగా, విశాల హృదయమున్న వారుగ భారత జాతి జీవనమున సమున్నత స్థానమును పొందిన"ట్లు ఆ యా అంశాల గూంర్చి వివరించారు.

ప్రత్యేక భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, వేష భూషణములు, ఆహార విహారాలు, సాహిత్య సంపద, కళా పోషణ, సంగీత, నృత్య, శిల్ప చిత్ర కళారాధన, అన్యోన్యత, దేశభక్తి, సదసద్వివేక సంపత్తి, భక్తి భావము, ఆధ్యాత్మిక చింతన, సమున్నత సంస్కారము గల ఆంధ్రుల చరిత్ర సంస్కృతి మొదటి భాగములో సంగ్రహముగా వివరించారు.

"ఆంధ్ర దేశమును కీస్తు పూర్వము, నాల్గవ శతాబ్ది నుండి గణతంత్ర రాజులు, శాతవాహనులు వారి కాలంనాటి నిర్మాణాలైన కార్లే గుహలు, నాగార్జున కొండలోని సైనికుల శిల్పం, విష్ణు కుండినులు, వారి సాంస్కృతిక కేంద్రాలైన ఉండవల్లి, భైరవకొండ, ఇంద్రకీలాద్రి పర్వత గుహ దేవాలయాల గురించి, ఇంద్రపురి – పంచ లింగేశ్వరాలయం, భువనగిరి దుర్గములో లభించిన విష్ణుకుండిన విక్రమేంద్ర భట్టారక వర్మ నాణెము, బాదామి

చాళుక్యుల కాలంలో నిర్మించబడిన "జోగుళాంబ"లోని, బాలబ్రహ్మ, నవబ్రహ్మ ఆలయాలు, (అలంపుర బ్రహ్మేశ్వరాలయాలు) దీనిలో ఉన్న క్షీరసాగర మథనం, నటరాజ విగ్రహాలు, వేములవాడ చాళుక్యులు - వారి కాలం నాటి "రాజేశ్వరాలయం"ల గురించి వివరించబడింది.

వేంగీ చాళుక్యులు, రాష్ట్రకూటులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు వీరి కాలం నాటి సామంతులు, రాజకీయ విధానం, కాకతీయుల వేయి స్థంభాల గుడి (హన్మకొండ), ఏకశిలానగరం - ఓరుగల్లు, ద్వారతోరణం - వరంగల్, జైన తీర్థంకరులు - శిష్యగణము, కాకతీయుల రాజచిహ్నం దాయ(రాజ) గజకేసరి, కాకతీయుల సామంతులు కందూరి చోళుల కాలం నాటి పచ్చల సోమేశ్వరాలయం (పానగల్లు) నల్గొండ, వీరగల్లు - రామలింగాల గూడెం, వీరయోధుడు - పెద్దవూర, పిల్లలమర్రిలోని ఎఱుకేశ్వరాలయం, దీనిలో ఉన్న 'చిత్ర' వర్ణాల గురించి రచయిత 'బి.ఎన్.శాస్త్రి' గారు అనేక ఆసక్తికర అంశాలు ఛాయాచిత్రాలతో సహా ముద్రించారు.

ఆంధ్రదేశమున గల గిరి, స్థల, జల, వన, మట్టి దుర్గములను, ప్రసిద్ధ దేవాలయా ల్లోని శిల్పకళా వర్ణనలను, శాస్త్రి గారు స్వయంగా సందర్శించి, పరిశీలించి, పరిశోధించి ఈ గ్రంథంలో పొందుపరిచినారు.

చరిత్ర పరిశోధనలో అగ్రగణ్యులైన శ్రీయుతులు చిలుకూరి వీరభద్ర రావు, భావరాజు వేంకట కృష్ణారావు, జయంతి రామయ్య పంతులు గారు, రాళ్ళబండి సుబ్బారావు గారు, కొమర్రాజు వేంకట లక్ష్మణ రావు గారు, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, డా॥ గిడుగు వెంకట సీతాపతి గారు, డా॥ మారేమండ రామారావు గారు, డా॥ నేలటూరి వెంకట రమణయ్య గారు, డా॥ రాయప్రోలు సుబ్రహ్మణ్యం గారు, డా॥ ఎన్. రమేశన్ గారు, ఖండవల్లి సోదరులు, ఆదిరాజు వీరభద్రరావు గారు వంటి మహామహులు రాసిన చారిత్రక వ్యాసములను గ్రంథాలను, శాసనాలను క్షుణ్ణంగా పరిశీలించి, తనదైన శైలిలో బి.ఎన్.శాస్త్రి గారు ఈ గ్రంథం రచించినారు. చారిత్రక ప్రాధాన్యత గల ఎన్నో అంశాలు ఈ గ్రంథంలో ఆవిష్కరించ బడటం విశేషం.

'ఆంధ్ర దేశ చరిత్ర - సంస్కృతి' మొదటి భాగములో గల ఛాయాచిత్రములు సోమేశ్వర దేవాలయం కొలనుపాక, వేయి లింగములున్న శివలింగము (కొలనుపాక), గంగాపురంలోని - చెన్నకేశవాలయ కుడ్యము, బ్రహ్మేశ్వరాలయం - అలంపూర్, నటరాజ శిల్పము - పచ్చల సోమేశ్వరాలయము, పెరూరులో గల సోమేశ్వరాలయ స్థంభాలు,

ద్వారతోరణం - వరంగల్, కాకతి ప్రతాపరుద్రుని శిరస్సు, కాకతీయుల రాజ చిహ్నము దాయగజకేసరి మొ॥వి. ఈ వివరాలు నేటితరం శాసన చారిత్రక పరిశోధకులకు నిధిలాగా వినియోగపడతాయి.

1323 వరకు తొలి సంపుటి పూర్తి అవుతుంది. 1323 సం॥లో ఆంధ్ర దేశాన్ని పాలించిన కాకతీయుల్లోని చివరి రాజు 2వ ప్రతాప రుద్రుడు ఢిల్లీ సుల్తాన్ "గియాసుద్దిన్" కాలంలో అతని కుమారుడు "జునాఖాన్" మహమ్మద్ బిన్ తుగ్లక్ చేతిలో ఓడింపబడి, బాధింపబడుటచే కాకతీయ రాజ్యం నేలమట్టం కావింపబడింది. ఇక్కడితో ఈ తొలి భాగము ముద్రించబడింది. చివరగా ఈ గ్రంథంలో తెలుగు ప్రాంతంలోని గోండు, కుయి, కొలామి, సవర భాషలు మాట్లాడు ప్రజలు, టాలమి వ్రాతలు (గ్రీకు చరిత్ర కారుడు), తొల్కాప్పియం తమిళ్ గ్రామర్, పాతరాతి యుగం, కొత్తరాతి యుగం కాలం నాటి స్థలాలు వారు ఉపయోగించిన పరికరాలు, లోహ యుగం నాటి మట్టపల్లి, తిప్పర్తి, ఏలేశ్వరం, వలిగొండ, మౌలాలి, రాయగిరి, తుమ్మలగూడెం, పొడిచేడు, సింగాపురం, దేవరుప్పల, నడింపల్లి, కదంబాపూర్, పెద్దమర్రూర్ మొ॥ ప్రాంతాలు అందరిని ఆకట్టుకునే విధంగా విశ్లేషణతో కూడిన అంశాలను శాస్త్రిగారు పొందు పర్చారు.

## ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి

## (క్రీ.శ.1324 నుండి క్రీ.శ.1517 వరకు)

ఈ రెండవ భాగములో - ఆంధ్రదేశ చరిత్రలో మహోజ్జ్వలముగా రాణించిన కాకతి వంశ రాజులు, మహా సామంతాధిపతులు, సామంతులు, మాండలికులలో ముఖ్యులైన రేచర్ల, చెఱుకు, కాయస్థ, మాల్యాల, విరియాల, యాదవ, నతవాడి, నాగ, బాణ, వైదుంబ వంశీయుల చరిత్రలున్నాయి. కాకతి రాజ్య పతనానంతరం ముష్కర తురుష్కులు ఆక్రమించిన ఓరుగల్లు రాజ్య విముక్తికై పోరాడి సాధించిన విజయములు గురించి ఈ విభాగం వివరంగా తెలియ జేస్తుంది.

ముసునూరి, పద్మనాయక, రెడ్డి వంశముల చరిత్రలు, దక్షిణాపథ, దక్షిణ భారతము లందు సువిశాలమైన హిందూ సామ్రాజ్యమును నెలకొల్పి, దక్షిణా పథమున మహోత్సాహంతో, ప్రచండ వేగంతో, శేముషి ప్రాగ్బలముతో, దక్షిణా పథంలో వెల్లువ వలె సాగి వచ్చిన యవనవాహినీ సేనలకు అడ్డుకట్టుగా నిల్చిన విజయనగర సామ్రాజ్యం గురించి, కూలంకషంగా, పరిశోధనాత్మక విశేషాలతో వివరించారు.

వైదికమత వ్యాప్తికి, లలిత కళల అభివృద్ధికి తోడ్పడిన విజయ నగరాధీశులగు

సంగమ, సాళువ, తుళు, అరవీటి వంశజుల చరిత్రలు ఈ సంపుటమున క్లుప్తంగా వ్రాయబడినవి. క్రీ.శ.1336లో హరిహర - బుక్కరాయలు తుంగభద్రానదీ తీరాన విజయనగర సామ్రాజ్య స్థాపన, క్రీ.శ.1347 సం॥లో అల్లాఉద్దీన్ హసన్ గంగూ "గుల్బర్గా" పట్టణమున బహ్మనీ రాజ్య స్థాపన తీరు ఇందులో చర్చించబడ్డాయి.

ఉత్తర భారతమును పాలించే ఢిల్లీ సుల్తానులు దక్షిణాపథ, దక్షిణ భారతము లందున్న కాకతీయ, యాదవ, హొయసల రాజ్యములపై దండెత్తి, ఆక్రమించి, సుబేదారులను నియమించి, వారి ద్వారా పరిపాలనము సాగించిన విధము విశదపరచడం జరిగింది.

**విరియాల వంశం** యొక్క స్థాపన, దుర్జయుని నుండి ఈ వంశ చివరి రాజు మల్యాల చండ సేనాని భార్య మైలమ వరకు రాజవంశీయుల పట్టిక, మైలమ వేయించిన కటుకూరు శాసనము గురించి చారిత్రక ప్రాధాన్యతలు గల అనేక అంశాలు యీ గ్రంథంలో వివరించ బడ్డాయి.

**రేచెర్ల పద్మ నాయకులు :** గోత్ర నామంతో (రేచర్ల), కుల నామంతో (వెలమ), రాజ్య చిహ్నంతో (పద్మం) రాజ్యానికి వచ్చిన వారు రేచర్ల పద్మనాయకులు రాజులు. ఈ వంశ మూల పురుషుడు చెవ్విరెడ్డి. బేతాళ నాయుడు, దామా నాయుడు, ప్రసాదాదిత్య నాయుడు మొదలు చివరి రాజుల వరకు విశ్లేషణలతో కూడిన పద్మనాయక మహావృక్షం ఈ గ్రంథంలో వివరించడం జరిగింది. పద్మనాయకులు రాచకొండ రాజులు, దేవరకొండ రాజులు వేర్వేరుగా వివరించబడినాయి. ఈ పట్టికలు కూడా గ్రంథంలో 258, 259 పేజీలలో ముద్రించబడింది.

**కాపయ నాయకుడు –** ఆంధ్రదేశాధీశ్వర బిరుదును ఏ విధంగా సాధించి సార్థకం చేసుకున్న విధానం తెలియజేయబడింది.

**ఆనెగొంది పాలకులు –** దక్కన్‌లో మహ్మదీయుల (తురుష్కుల) దండయాత్రల వలన అనేక కష్టనష్టాలకు గురైన ఆంధ్ర ప్రజలు, వీరువరులైన ముసునూరి, పద్మనాయక, రెడ్డి ప్రభువుల విజృంభణ వలన స్వతంత్ర వాయువులను పీల్చగల స్థితిని పొందినారు. ఈ అంశాలన్నీ యీ గ్రంథంలో వివరించబడ్డాయి.

కృష్ణా-తుంగభద్రా నదుల పరివాహక ప్రాంతం సారవంతమైనది. తరచూ విజయనగర, బహమనీ రెండూ రాజ్యములు కలహించుకున్న సంఘటనలు, 'గోవా' రేవు పట్టణమును ఆక్రమించిన తీరు, ఈ గ్రంథములో వివరించబడింది.

**శ్రీకృష్ణ దేవరాయలు (1509-1529)** 1509 లో ఫిబ్రవరి 4వ తేదీన సింహాసనం అధిష్టించిన రోజు. క్రీ.శ.1512 సం॥న దక్షిణ దండయాత్ర 1513 సం॥లో ఉదయగిరి

ముట్టడి, 1515 సం॥లో కొండవీడు ముట్టడి, 1516 సం॥లో విజయనగరం తిరిగొచ్చిన ప్రాధాన్యత గల సంఘటనలు విశ్లేషణాత్మంగా వ్రాయబడింది. శ్రీకృష్ణ దేవరాయలు 1520 సం॥లో బీజాపూర్ రాజ్యంపై దండెత్తిన సంఘటన అద్భుతంగా వర్ణించిన విధానం ఈ గ్రంథంలో 379 పుటలో వ్రాయబడింది. విజయనగర రాజ్యానికి 900 మైళ్ళ తీరరేఖ, 300 రేవు పట్టణములు, 240 కోట్ల వార్షిక ఆదాయం, 25 మంది రాజ ప్రతినిధులు, 200 మంది రాష్ట్ర పాలకులు సమస్త సౌకర్యములతో విజయనగర కీర్తి ఎలా విశ్వవ్యాప్తమై యున్నదో వ్రాయబడింది. ఈ గ్రంథంలో ఇంకా 1529, నవంబర్ 20వ తేదీన అచ్యుతరాయలు ఎలాంటి సందర్భంలో విజయనగరం సింహాసనం అధిష్టించారో తెల్పిన విధం మనకు మరే గ్రంథంలో ఇంత విపులంగా కన్పించదు.

బహమనీ సుల్తాన్‌ల కాలం నాటి సామాజిక, రాజకీయ అంశాలు కూడా యీ గ్రంథంలో వివరంగా వ్రాయబడ్డాయి. 1490లో బహమనీ రాజ్యం చీలిపోయి 5 రాజ్యాలు ఏర్పడిన విధం, దానికి గల వివిధ అంశాలను ఈ గ్రంథంలో వ్రాశారు. ఇంకనూ గాంగ వంశపు రాజులు, కళింగ గజపతులు 1434 సం॥లో కపిలేశ్వరుడు ఎలా రాజ్యం స్థాపించారు. వారు 1444 సం॥ విశాఖపట్నం ఆక్రమించిన విధం ఇందులో క్షుణ్ణంగా వ్రాశారు.

## ఆంధ్రదేశ చరిత్ర – సంస్కృతి
## (క్రీ.శ.1518 నుండి క్రీ.శ.1990 వరకు)

బి.ఎన్.శాస్త్రి గారి ఆంధ్రదేశ చరిత్ర–సంస్కృతి (మూడవ భాగం) 1518 నుండి క్రీ.శ.1990 వరకు వ్రాయబడింది. 1490–1500 ప్రాంతమున బహమనీ రాజ్యం చీలిపోయి ఐదు స్వతంత్ర ముస్లిం రాజ్యములుగా స్థాపించబడినవి.

అవి 1. నిజాం షా : అహ్మద్ నగర్
2. బరీద్ షా : బీదర్
3. ఇమాద్ షా : బీరార్
4. ఆదిల్ షా : బీజాపూర్
5. కుతుబ్ షా : గోల్కొండ

గోల్కొండ రాజ్య స్థాపన 1518 సం॥లో జరిగింది. వీరిని కుతుబ్‌షాహీ వంశీయులుగా పేర్కొంటారు. గోల్కొండ పట్టణము రాజధానిగా 1518–1687 వరకు కుతుబ్‌షాహీ వంశీయులు పరిపాలించారు. ఆంధ్ర సంస్కృతిని పరిరక్షించి, తెలుగు సాహిత్యము నాదరించి, కవులను పోషించి, చక్కని పరిపాలన మొనర్చి కీర్తి ప్రతిష్ఠలను

ఆర్జించినారు. వీరు ముస్లిం పాలకులైననూ, హిందువులకు ఉన్నత పదవులను ఇచ్చి, తమ పరమత సహనము ప్రకటించుకొన్న విధానము కూడా ఈ గ్రంథం వివరంగా తెలియజేస్తుంది.

ఔరంగజేబు 1687 సం॥లో గోల్కొండ రాజ్యాన్ని మొగల్ రాజ్యంలో అంతర్భాగంగా మార్చిన తర్వాత, ఈ ప్రాంతంలో వచ్చిన సర్వాయి పాపన్న, అతను కొనసాగించిన మొగల్ వ్యతిరేక చర్యలు గూడా ఈ గ్రంథంలో కనిపిస్తున్నాయి. చిన్నపాటి సిపాయి తిరుగుబాటులు ఈ గ్రంథం గుర్తు చేస్తుంది.

1724 సం॥ నుండి 1948 సం॥ మధ్య కాలంలో హైదరాబాద్ రాజ్యాన్ని నిజాం రాజులు (ఆసఫ్‌జాహీ వంశం) పరిపాలించారు. వీరి కాలంలో జరిగిన వివిధ తిరుగుబాట్ల గురించి, క్షుణ్ణంగా పరిశోధించి, ప్రాంతీయ చరిత్రకు ప్రాధాన్యతనిస్తూ బి.ఎన్.శాస్త్రిగారు ఈ గ్రంథాన్ని రచించినారు. నిజాం రాజ్యంలో కూడా వివిధ ప్రాంతాల్లో (రాయలసీమ, ఆంధ్ర, హైద్రాబాద్) వచ్చిన అనేక తిరుగు బాట్లను ఈ గ్రంథంలో సవివరంగా వ్రాశారు.

1857 సిపాయిల తిరుగుబాటు విప్లవానికి ముందు బ్రిటీష్ కంపెనీ పాలనకు వ్యతిరేకంగా తీవ్రమైన ఎన్నో తిరుగుబాట్లు కొనసాగాయి. వాటిలో 1846 సం॥లో జరిగిన ఉయ్యాలవాడ నర్సింహా రెడ్డి జరిపిన వీరోచిత తిరుగుబాటు, 1857లో హైద్రాబాద్‌లో చేసిన తుర్రేభాజ్‌ఖాన్ సైనిక దాడుల గురించి నేటికి వీర గాథలుగా, జానపద సాహిత్యం మూలంగా స్థానిక ప్రజల బాహుళ్యపు ఉమ్మడి జ్ఞాపకాలతో నిల్చి ఉంది. “ఆంధ్రదేశ చరిత్ర – సంస్కృతి” (1518–1990) అనే గ్రంథంలో ఈ మధ్య కాలంలో జరిగిన యుద్ధాలు, తిరుగుబాట్లు, నిజాం – బ్రిటీష్ వారికి గల సంబంధాల గురించి కూడా యీ గ్రంథ భాగంలో వివరంగా ఉంది.

ఈ మూడవ భాగంలో ఆంధ్ర ప్రాంతపు సర్కారులు (1766), రాయలసీమ (1800), చిత్తూరు, నెల్లూరు ప్రాంతాలను (1801లోనూ) కంపెనీ అధికారులు హైద్రాబాద్ నిజాం నుంచి అనేక సంధి షరతుల మూలంగా హస్తగతం చేసుకున్న తీరు విశదంగా చర్చించ బడింది. ఇంకనూ ఈ గ్రంథంలో కంపెనీ ఆధీనంలోని బ్రిటీష్ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని, వ్యతిరేక ఉద్యమాలను వాటికి గల ప్రధాన కారణాలు, వాటి పరిణామాలు విశదంగా విపులీకరించ బడ్డాయి. కోస్తా ప్రాంతంలో జరిగిన జమీందార్ తిరుగుబాట్లు, సీడెడ్ మండలాల్లో పాళెగాళ్ళు కొనసాగించిన ఉద్యమాలు, వాటిని బ్రిటీష్ సైనికులు అణిచి వేసిన తీరు, ఇందులో చర్చించబడినాయి. 1839 సం॥లో హైద్రాబాద్ నిజాం రెండో కుమారుడు ముబారిజ్ కొనసాగించిన వహాబి ఉద్యమం గురించి, బ్రిటీష్ నిజాం రాజుల మధ్య గల సంబంధాలను ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు.

సాలార్ జంగ్-1 కాలంలో వచ్చిన సంస్కరణలు (విద్యా, పారిశ్రామిక రంగాల్లో) నిజాం కాలంలో జరిగిన గ్రంథాలయోద్యమం (1901), ముల్కీ ఉద్యమం (1901), ముల్కీలపై జారీ చేసిన ఫర్మానా (1919) వంటి అనేక ఆసక్తికర విషయాలను వాటి అనుబంధాలుగా చేర్చి వ్రాయడం యీ గ్రంథంలో ఒక ప్రత్యేకత.

హైద్రాబాద్ చివరి నిజాం కాలంలో జరిగిన నీటి పారుదల, సాంస్కృతిక రంగాల అభివృద్ధి, విద్యా సంస్థల నిర్మాణం, పారిశ్రామిక సంస్థల అభివృద్ధి, ప్రభుత్వ రంగాల అభివృద్ధి, రోడ్లు, రైల్వేలు, విమాన యానం మొ॥వి, బ్యాంకింగ్ రంగాల ఏర్పాట్లు మొ॥వాటిని లోతుగా పేర్కొనటం ఈ గ్రంథానికి ఒక ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు.

తెలంగాణలో ఉన్న సంస్థానాల గురించి గద్వాల, అమరచింత, జటప్రోలు, వనపర్తి, నారాయణ్ పూర్, పాపన్నపేట, దోమకొండ, రాజపేట, గోపాల్ పేట, పాల్వంచ మొ॥ వాటిని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

ఆంధ్ర - రాయలసీమలో విజయనగరం, బొబ్బిలి, వెంకటగిరి, ఆనెగొంది, పిఠాపురం, మునగాల సంస్థానాల గురించి ముక్త్యాల, చల్లపల్లి, సాలూరు, బనగానపల్లి, పెద్దాపురం, పానగల్లు, పోలవరం, కాళహస్తి వంటి అనేక జమీందారీల గురించి ఆసక్తికర విషయాలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణోద్యమంలో జరిగిన కీలక సంఘటనలను, వివిధ కమిటీల తీరుతెన్నులను, వాటి పర్యవసానాలు వివరించబడ్డాయి. తెలంగాణ సాయుధ పోరాటం (1946 - 1951), విశాలాంధ్రోద్యమం గురించి, పెద్ద మనుషుల ఒప్పందం (1956), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం గురించి కూలంకషంగా వివరించబడినాయి.

1969 తెలంగాణ ఉద్యమంలో జరిగిన సంఘటనలను, 1969 జూన్‌లో ఇందిరా గాంధి, హైద్రాబాద్ సందర్శన, బ్రహ్మానంద రెడ్డి గారి పాత్ర, పి.వి.నర్సింహారావు తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా ఎన్నికైన కారణాలు ఈ గ్రంథంలో చర్చించబడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం వారికి రావాల్సిన నీటివాటాలో జరిగిన దోపిడిని వర్ణించి ఆనాటి తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అక్షర రూపం కల్పించారు. 1972లో జరిగిన ఆంధ్రోద్యమ సంఘటనలు, సుదీర్ఘ కాంగ్రెస్ పాలనకు చరమ గీతం పాడుతూ 1983 జనవరిలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టడం, నందమూరి తారక రామారావు నాయకత్వంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం విధానాలు, పటేల్, పట్వారి పద్ధతులను రద్దు చేయడం, తెలుగు గంగ ప్రాజెక్టు ప్రారంభం, హైద్రాబాద్ నగరంలో హుస్సేన్‌సాగర్

తీరాన వెలసిన మహనీయుల విగ్రహాలు, బుద్ధ పూర్ణిమ వంటి అనేక అంశాల స్థూల పరిచయం ఇందులో కనిపిస్తుంది. 1989 సం॥లో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చింది. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయినారు.

కేంద్ర ప్రభుత్వం బాబ్రీ మసీద్, రామజన్మభూమి వివాదం వలన భారతీయ జనతా పార్టీ మద్దతు కోల్పోయింది. జనతాదళ్ పార్టీలో ఏర్పడిన చీలిక వలన విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ గారి ప్రభుత్వం కేంద్రంలో పతనం చెందింది. కేంద్రంలో రాష్ట్రం నుండి కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రచార శాఖలను పార్లమెంటరీ వ్యవహార శాఖలను నిర్వహిస్తున్న మంత్రి పి. ఉపేంద్ర గారు తన పదవిని కోల్పోవడం వంటి ఆసక్తికర సంఘటనలు ఈ గ్రంథంలో విశ్లేషణలతో పొందుపరచబడినాయి.

కాంగ్రెస్ పార్టీ మద్దతుతో జనతాదళ్ (సెక్యులర్) నాయకుడు శ్రీ చంద్రశేఖర్ గారు తేది 10.11.1990న ప్రధాన మంత్రి పదవిని చేపట్టి మంత్రిమండలి నేర్పరిచినారు. ఈ గ్రంథంలో చివరిగా పేర్కొన్న సంఘటన ఇదే. కేంద్ర – రాష్ట్ర సంబంధాలు విపులంగా చర్చించబడినాయి.

ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకున్న ఆంధ్రదేశ చరిత్ర – సంస్కృతి మూడు భాగాలు, వీటిలోని ముఖ్యమైన పట్టికలు, చిత్రాలు, చారిత్రక ప్రాధాన్యత గల కట్టడాలు, శాసనాలు, దేవాలయాలు, శిల్ప కళలు, మొ॥గు అంశాలపై అవగాహన ఏర్పడుతుందని ఆశిద్దాం.

ఈ విధంగా ఆంధ్రదేశ చరిత్ర – సంస్కృతి గ్రంథం మూడు భాగాలుగా సంతరించ బడింది. ఇతర రచయితల కన్నా భిన్నంగా సాంస్కృతికాంశాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ సంస్కృతీ చరిత్రను రాసిన వారు శ్రీ బి.ఎన్.శాస్త్రి. తాము ప్రతిపాదించిన అంశాలకు శాసనాధారాలను గాని, వైజ్ఞానిక విశ్లేషణలను కాని సోపపత్తికంగా చూపించడం శాస్త్రిగారి ప్రత్యేకత. మన చరిత్రను మనం సవివరంగా తెలుసుకునేందుకు ఈ మూడు గ్రంథాలు ఎంతగానో ఉపయోగపడతాయనడంలో సందేహం లేదు. చరిత్ర శాసన పరిశోధకులై మాకందరకీ, పరోక్షంగా మార్గదర్శకులైన వారికి హృదయపూర్వక నమస్సులు.

**డా. పి. మురళి**

చరిత్రోపన్యాసకులు, నిజాం కళాశాల, హైదరాబాద్.

ఫోన్ : 9701 674 383



# భారతదేశ చరిత్ర (21 భాగాలు)

మానవ నాగరికత ఉనికిని, పురోగతిని, అంతాన్ని వివరించేది చరిత్ర. వివిధ యుగాల్లో మానవ నాగరికత అనేక ఒడుదుడుకులను చవిచూసింది. కాలగమనంలో చరిత్రకారులు, మేధావులు, సాహితీ ప్రియులు వివిధ యుగాలకు చెందిన భారతదేశ చరిత్ర రచనకు తమదైన రీతిలో కృషి చేసారు. కొందరు ప్రాచీన భారతదేశ చరిత్రలోని ముఖ్య ఘట్టాలైన వేదయుగంపై మరికొందరు మౌర్య యుగంపై, ఇంకొందరు శాతవాహన, గుప్త యుగాలపై ఆసక్తి కనబర్చి రచనలు చేశారు.

19వ శతాబ్దం ఆరంభ దశలో భారతదేశ చరిత్ర రచనలో నూతన ధోరణలు చోటు చేసుకున్నాయి. భారతదేశంలో పనిచేసిన బ్రిటిష్ ఉన్నతాధికారులు, సాహితీ ప్రియులు ఈ దేశ చరిత్రను తమ శైలిలో రచించడానికి కృషి చేయగా పాశ్చాత్య విద్యనభ్యసించిన భారతీయులు తమదైన శైలిలో చరిత్ర రచనలకు కృషి చేశారు. వీరిలో ఆర్.సి. భండార్కర్ (1837-1925), కృష్ణస్వామి అయ్యంగార్ (1871-1953), కె.ఎం. ఫణిక్కర్ (1895-1963), నీలకంఠశాస్త్రి (1892-1976), డి.డి. కోశాంబి (1907-1966), మల్లంపల్లి సోమశేఖరశర్మ (1891-1963), హెచ్.కె. షేర్వాణి (1891-1980).

వీరి అడుగుజాడల్లో, చరిత్రలో పట్టా లేకున్నా, సమగ్ర భారత దేశ చరిత్రను రచించడానికి శ్రమించిన మహనీయుడు బి.ఎన్.శాస్త్రి (1932-2002). ఆంధ్రదేశంలో 'శాసనాల శాస్త్రిగా' కీర్తింపబడిన వీరు నేటి చరిత్రకారులకు ఉపయోగపడే అనేక శాసనాల

సంపుటాలను రచించారు. త్రిపురాంతక చరిత్ర - శాసనాలు, బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసనాలు, ముఖలింగదేవాలయ శాసనాలు, చెఱకురెడ్లు, రేచర్ల రెడ్డి, రేచర్ల పద్మనాయకులు, కాయస్థరాజుల చరిత్ర, మల్యాల వంశ చరిత్ర, ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి (3భాగాలు), భారతదేశ చరిత్ర - సంస్కృతి, (ప్రాచీనయుగం నుండి బ్రిటిష్‌వారి పాలన అంతం, స్వతంత్ర భారతావని అవతరణ వరకు (21 సంపుటాలు), జిల్లా సర్వస్వాలు - నల్లగొండ మండల సర్వస్వం, ఆదిలాబాదు జిల్లా సర్వస్వం, మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వం, రెడ్డిరాజ్య సర్వస్వం, బ్రాహ్మణరాజ్య సర్వస్వం మొదలైన మహోన్నత రచనలు లిఖించి భారతదేశచరిత్రకు, ఆంధ్రుల చరిత్రకు అమూల్య సేవలు చేసారు.

తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని మేధావులకు శాస్త్రిగారు సుపరిచితులు. బి.యన్.శాస్త్రిగారు భారతదేశ చరిత్రను, ఆంధ్రుల చరిత్రను ఏరకమైన చారిత్రక వాదాలకు ప్రభావితం కాకుండా తనదైన స్వతంత్ర శైలిలో వ్రాయడం ఒక విశేషం. అందుబాటులో ఉన్న సాహిత్య ఆధారాలను, శాసనాల నుండి సేకరించిన సమాచారాన్ని, తనకంటే ముందు ఉన్న చరిత్రకారులు వివిధ చారిత్రక అంశాలపై, వంశాలపై, గొప్పరాజులపై వ్రాసిన రచనలను అధ్యయనం చేసి నిష్పక్షపాతంగా తన భావాలను వ్యక్తీకరించారు.

శాస్త్రిగారు 1950వ సంవత్సరంలో నేటి నారాయణగూడ ప్రాంతంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో గోపాల్‌రావ్ ఏక్బోటే గారి సహకారంతో తెలుగు అధ్యాపకునిగా జీవితం ఆరంభించారు. ఆ తర్వాత కొంతకాలానికి గోషామహల్ పాఠశాలలో చరిత్ర - భూగోళ శాస్త్రాలు బోధించాడు. 1955 నుండి నేటి చార్‌మినార్ దగ్గరలో ఉన్న కాళికమాన్‌లో ఉన్న దార్-ఉల్‌లూమ్ పాఠశాలకు బదిలీ అయి అక్కడ, 9,10 తరగతి విద్యార్థులకు తెలుగు, చరిత్ర బోధించడం ఆరంభించారు. అప్పటికి ఆయన వయస్సు 23 సంవత్సరాలు.

ఒక సామాన్య తెలుగు టీచర్‌కు భారతదేశ చరిత్ర సంస్కృతిపై 23 సంపుటాలు రచించడానికి ప్రత్యేక అంశాలు దోహదం చేశాయని చెప్పవచ్చు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత సమగ్ర భారతదేశ చరిత్ర రచనకు ఆనాటి మేధావులైన కె.ఎం.మున్షీ, ఆర్.సి.మజుందార్, ఎ.డి.పుసలేకర్, ఎ.కె.మజుందార్ మొదలైనవారు 'భారతీయ విద్యాభవన్' వారి ఆధ్వర్యంలో 'ది హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ఇండియన్ పీపుల్' అనే పేరుతో భారతదేశ చరిత్ర రచనకు కృషి నారంభిచారు. వీరి కృషి ఫలితంగా 11 సంపుటాలు ఆంగ్లంలో వెలువడ్డాయి.

కె.ఎం.మున్షీ, ఆర్.సి.మజుందార్, ఎ.డి.పుసలేకర్, ఎ.కె.మజుందార్‌ల యుగవిభజన బి.ఎన్.శాస్త్రిగారి భారతదేశ చరిత్ర – సంస్కృతి నిర్మాణానికి కొంతవరకు మార్గదర్శకంగా నిలిచిందని చెప్పవచ్చు.

శాస్త్రి గారు భారతదేశ చరిత్ర – సంస్కృతిని రచించేముందు తప్పనిసరిగా భారతీయ విద్యాభవన్ వారు ముద్రించిన అన్ని సంపుటాలను నిశితంగా అధ్యయనం చేసి ఉంటారన్న భావన, ఆయన రచనలను చదివినవారికి తప్పక కలుగుతుంది. అంతమాత్రాన శాస్త్రిగారి రచనల్లో వైవిధ్యం, స్పష్టత లేదని భావించరాదు.

బి.యన్.శాస్త్రిగారు భారత దేశచరిత్రను 21 భాగాలుగా విభజించి, 21 సంపుటాలకు పేరు ఎంపిక చేయడంలో ఎంతో జాగ్రత్త పడినారు . యావత్ భారతదేశాన్ని పాలించిన లేదా యావత్ భారతదేశానికి సంబంధించిన రాజకీయ, సామాజిక, ఆర్థిక, సైనిక, మత, సాంస్కృతిక అంశాలతో పాటు ఉత్తర, దక్షిణాపథాన్ని పరిపాలించిన, పేరొందిన రాజవంశాల చరిత్రతో పాటు చిన్న, చిన్న రాజ్యాల, వంశాల, స్థానిక పాలకుల చరిత్రను కూడా ఏమాత్రం వన్నె తగ్గకుండ వ్రాయడానికి పూనుకున్నాడు.

వరుసగా... 1. వేదయుగం, 2. మౌర్యయుగం, 3. గుప్తయుగం, 4. చాళుక్యయుగం, 5. ప్రతీహారయుగం, 6. కాకతీయ యుగం, 7. ఢిల్లీసుల్తానులయుగం –1, 8. ఢిల్లీ సుల్తానులయుగం –2, 9. విజయనగర యుగం, 10. దక్కన్ సుల్తానులయుగం, 11. మొగలుల యుగం–1, 12. మొగలుల యుగం–2, 13. రాజపుత్రయుగం, 14. మరాఠాయుగం, 15. బ్రిటిష్ ఇండియా కంపెనీ యుగం –1, 16. బ్రిటీష్ ఇండియా కంపెనీయుగం –2, 17. మహా విప్లవ యుగం, 18. వైస్రాయ్‌ల యుగం–1, 19. వైస్రాయ్‌లయుగం–2, 20. సాంస్కృతిక పునరుజ్జీవనయుగం, 21. సంస్థానాలయుగం.

భారతదేశ చరిత్ర – సంస్కృతిపై సమగ్ర చరిత్రను వివిధ అంశాలను దృష్టిలో పెట్టుకొని రచించాలన్న మహోన్నత కోరిక / తపన బి.యన్.శాస్త్రిగారికి 1980వ సంవత్సరంలో కలిగినది. ఆ ఆశయానికి ప్రతిరూపాలే ఈ 21 సంపుటాలు.

## వేదయుగం – మొదటి సంపుటం (1992)

భారతదేశ చరిత్ర – సంస్కృతిని విశేషంగా ప్రభావితం చేసిన భౌగోళిక పరిస్థితులను వేదయుగం లోని మొదటి అధ్యాయంలో వివరించడం జరిగింది. ఏవిధంగా ఈ దేశ సంస్కృతిని తీర్చిదిద్దడంలో ఇక్కడి పర్వతశ్రేణులు, నదులు, నీటి వనరులు, భూసారం,

ఖనిజ సంపద, శీతోష్ణ స్థితి మొ॥న అంశాలు ముఖ్యపాత్రను పోషించాయో ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది. రెండు, మూడు అధ్యాయాల్లో చరిత్ర పూర్వయుగ మానవ జీవిత విశేషాలు, వారు ఉపయోగించిన పరికరాలు, వస్తువుల గురించిన వివరణ ఇవ్వబడినది.

క్రీ.శ. 1921-22లో సింధు నాగరికత కనుగొనబడిన తర్వాత, దాని విశిష్ట లక్షణాలను నాల్గవ అధ్యాయంలో చర్చించబడినాయి. ముఖ్యంగా సింధు ప్రజల పట్టణ నాగరికత లక్షణాలు, వారి సామాజిక వ్యవస్థ, మత ఆచారాలు, సింధు త్రవ్వకాలలో బయల్పడిన ముద్రికలు మొ॥ అంశాలు చర్చించబడినాయి.

భారతదేశంలోకి ఆర్యుల వలసలు, వారు సప్తసింధు ప్రాంతంలో స్థిరపడిన తర్వాత కొనసాగించిన జీవన విధానం, ఆర్యులు ఎవరు?, ఏ ప్రాంతం నుండి భారతదేశానికి వలస వచ్చారు మొ॥న అంశాలపై శాస్త్రిగారు సుదీర్ఘ చర్చను కొనసాగించారు. ఋగ్వేదంలోని శ్లోకాల్లో పేర్కొనబడిన ఆర్యుల్లోని గణములను - పురగణము, యదులు, తుర్వసులు, ఫక్తులు, శివులు మొదలైనవారి చర్చ ఎంతో అర్థవంతంగా చేయబడింది. ఆరవ అధ్యాయంలో ఋగ్వేద కాలం నాటి సంస్కృతిలో ముఖ్యంగా ఆర్యుల మత ఆచారాలు, వారు ఆరాధించిన దేవీ - దేవతల వర్ణన, సోమయాగం, సోమరసం, ఋగ్వేద స్త్రీల స్థితి వర్ణన ప్రస్తావించారు. ఏవిధంగా ఈ దేశ సంస్కృతిని తీర్చిదిద్దడంలో శాస్త్రిగారు పేర్కొన్న 26 మంది ప్రసిద్ధి గాంచిన ఋగ్వేద స్త్రీల అదితి, ఇంద్రమాత, దక్షిణ, సరమ, నిశ్చల, శశ్వతి, సిక్తా, సుదేవి, జుహూ, ఘోష, సూర్య మొ॥న పేర్లు మరే చారిత్రక గ్రంథాల్లో కనబడవు. ఈ కాలంలోనే స్త్రీలు యుద్ధాల్లో పాల్గొన్నారని పుట. 230-231లలో పేర్కొన్నారు.

అప్సరస, ఊర్వశి, పురూరవుల మధ్య జరిగిన సంవాదాన్ని శాస్త్రిగారు చాలా చక్కగా వర్ణించారు. కౌశిక మహర్షి ప్రకారం ఋగ్వేదంలో 10,414 మంత్రాలు, 153826 శబ్దములు, 432000 అక్షరాలున్నాయని శాస్త్రిగారు పుట. 246-247 ల్లో పేర్కొన్నారు. ఈ గ్రంథంలో ఋగ్వేద కాలంనాటి ఆహారము, అలవాట్లను గురించి వివరిస్తూ శాకాహారులు, మాంసాహారులు సమాజంలో ఉన్నట్లు పేర్కొనడం విశేషం. ఈ కాలంలో సప్తసింధులోయలో వరుష్ణీ, అసిక్నీ, విపాట్, బియాస్, వితస్తా (జీలంనది), కుతుద్రి (సట్లేజ్)ల గురించి పేర్కొన్నారు.

హరప్పా, మొహంజదారో, లోథాల్ మొదలైనచోట్ల లభించిన ముద్రికలను గురించి చర్చిస్తూ (పుట. 129) వీటిపై ఏనుగు, మేక, దుప్పి, పెద్దపులి, యోగి (పశుపతి) ప్రతిమలు ముద్రించబడినాయని పేర్కొన్నారు.

పుట. 326లో అశ్వమేధ యాగాన్ని విశ్వామిత్ర మహర్షి 'సుదాసు'చే నిర్వహింపచేసాడని పేర్కొన్నారు. ఆర్యులు వ్యవసాయము చేసినారనీ, ఆనాటి కర్షకులు ఒకే నాగిలికి 3-6-12 కాడ్లను ఏర్పరచి, కాడికి రెండెడ్ల చొప్పున 6-12 -24 ఎడ్లను కట్టి భూమి దున్నేవారని కృష్ణ యజుర్వేద సంహిత 462-5 లో పేర్కొనబడినట్లు శాస్త్రిగారు పుట. 344లో వర్ణించి, నాటినుండి నేటివరకు వ్యవసాయం ప్రధానవృత్తిగా కొనసాగినదని పేర్కొన్నారు.

మగధరాజ్యాన్ని పాలించిన రాజుల్లో జరాసంధుని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇతడు తన కూతురును మధురాధిపుడైన కంసునికిచ్చి వివాహం జరిపించెననీ, అతడు క్రూరుడనీ, అతడిని శ్రీకృష్ణుడు అంతమొందించాడనీ పేర్కొన్నారు.

వశిష్ఠుడు, భరద్వాజుడు, కుత్సుడు, అగస్త్యుడు, గౌతముడు, విశ్వామిత్రుడు, మేధాతిథి, అపాల మొ॥న ఋగ్వేద కాలంనాటి ఋషుల వివరాలు 7వ అధ్యాయంలో చర్చించబడినవి. ఇదే అధ్యాయంలో దస్యులపై (స్థానిక ప్రజలపై) ఆర్యుల విజయాన్ని వర్ణించారు. ఋగ్వేద బ్రాహ్మణములు, ఉపనిషత్తులు - వాటి ప్రత్యేకత, విశిష్టత, ఉపవేదాలైన ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వ వేదము, శిల్పవేదం గురించి వివరించిన తీరు ఎంతో అర్థవంతమైనది. ప్రాచీన కాలంలో భారతదేశాన్ని పరిపాలించిన కుంతల, మాహిష్మతీ, విదర్భ, ఛేది, హస్తినాపుర, కురు, గాంధార మొ॥న 24 రాజ్యాల పేర్లు, వాటిని పాలించిన రాజవంశాల పేర్లు చర్చించారు. ఇందులో సూర్యవంశ రాజుల గురించి, భృగువంశం, చంద్రవంశం రాజుల గురించి ఏ చారిత్రక గ్రంథాల్లో పేర్కొనని వివరాలు కలవు, మహాభారత యుద్ధం గురించి చారిత్రక సమాచారం కలదు, మహాభారత యుద్ధానంతరం అవతరించిన 27 రాజ్యాల ప్రస్తావన కలదు. క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి భారతదేశంలో అవతరించిన 16 జనపదములలో నెలకొని ఉన్న స్థితిగతులు వర్ణించబడినాయి. విదేశీ దండయాత్రలకు దారి తీసిన పరిస్థితులు - వాటి ప్రభావం చర్చించబడినాయి. ఆర్యుల సాంఘిక పరిస్థితుల వర్ణన ఈ సంపుటం చివరిలో ఎంతో అద్భుతంగా వర్ణించబడినది.

## మౌర్యయుగం - రెండో సంపుటం (1992)

ప్రాచీన భారతదేశ చరిత్రలో మౌర్య వంశ పాలకులకు, వారి విధానాలకు, వారి విజయాలకు, వారి యుగానికి ఎంతో ప్రత్యేకత కలదు. మగధరాజ్యాన్ని పరిపాలించిన నందవంశం పుట్టుపూర్వోత్తరాలు, నందరాజుల చరిత్రను, మౌర్యుల అధికారం నెలకొల్పడానికి ముందు ఉత్తర, మధ్య భారతదేశంలో నెలకొని ఉన్న రాజకీయ అస్థిరత్వాన్ని శాస్త్రిగారు ఈ

సంపుటం మొదటి భాగంలో చర్చించిన తీరు ప్రశంసనీయం. పుట.2లో 'మహాబోధివంశమనే' గ్రంథంలో నవనందుల పేర్లు, ఉగ్రసేనుడు, పండుక, పండుగతి, భూతపాల, రాష్ట్రపాల, గోనిషాక, దశసిద్ధక, కైవర్త, ధననందుడు అని పేర్కొనడం విశేషం. ఈ వివరాలు ప్రసిద్ధ చరిత్రకారుడైన కె.ఎ.నీలకంఠశాస్త్రిగారి రచన 'ద నందాస్', దుబ్రిల్ పండితుని రచన ఏన్షియంట్ దక్కన్, రాప్సన్ పండితుడి రచన కేంబ్రిడ్జి హిస్టరీ ఆఫ్ ఇండియా, భారతీయ విద్యాభవన్ వారు ముద్రించిన 'ది హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఇండియన్ పీపుల్ సంపుటాలను సంప్రదించి వ్రాయడం వల్ల ఈ సంపుటం ఎంతో విలువైన చారిత్రక సమాచారాన్ని కలిగి ఉన్న గ్రంథంగా గుర్తింపు పొందింది.

ఈ రెండో సంపుటంలో మౌర్యులు, మౌర్యుల అనంతరం భారతదేశంలోని వివిధ ప్రాంతాలను పరిపాలించిన శాతవాహన, ఇక్ష్వాకు, శాలంకాయన, ఆనంద గోత్రికులు, కాణ్వ, కుషాణ, శుంగ, బృహత్పలాయన మొ॥న వంశ పాలకుల చరిత్ర వివరించబడింది.

ఈ గ్రంథంలో మొదట మౌర్యులకు ముందు మగధను పరిపాలించిన నందవంశ రాజుల చరిత్ర వివరించబడింది. మహాపద్మనందుని విజయాలు, శక్తి సామర్థ్యాలు, ధననందుని కాలంనాటి అస్థిర పరిస్థితుల వివరణ కలదు.

మౌర్య చక్రవర్తులైన బిందుసారుడు, అశోకుడు మొ॥వారు సాధించిన విజయాలను ముఖ్యంగా అశోక చక్రవర్తి చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలను శాస్త్రిగారు అశోకుని స్తంభశాసనాలు, శిలాశాసనాల నుండి సేకరించిన సమాచారం ఆధారంగా వివరించిన తీరు శాస్త్రిగారిని ఒక ఉన్నత కోవకు చెందిన చరిత్రకారునిగా నిలుపుతుంది.

మౌర్యుల పరిపాలన విశేషాలను చర్చించిన సందర్భంగా శాస్త్రిగారు (పుట.76) 'వ్రజశాఖ' అధ్వర్యంలో మంచినీటి బావులు, ఉద్యానవనములు, రాజ మార్గములకు రెండువైపుల నీడనిచ్చే, పండ్లు ఇచ్చే వృక్షాలను పెంచడం, విశ్రాంతి భవనములను నిర్వహించుట మొ॥న బాధ్యతలు నిర్వహించేవారని శిలా శాసనాల ఆధారంగా పేర్కొన్నారు. ఈ శాఖ అధికారిని 'వ్రజభూమిక' అని వ్యవహరించేవారనే వివరణ మరే చారిత్రక గ్రంథంలో కానరాదు.

మౌర్యుల అనంతరం భారతదేశానికి వారు ప్రసాదించిన ఐక్యత క్షీణించి అనేక చిన్న, చిన్న రాజ్యాలు వెలసినాయి. వాటిమధ్య లోపించిన సఖ్యత – ఐక్యత చివరికి ఉత్తర – దక్షిణాపథాల్లో మరిన్ని స్వతంత్ర రాజ్యాల అవతరణకు దారి తీసింది. మౌర్యులు భారతీయ సంస్కృతికి ఒనరించిన సేవలు, వారి అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల్లో

పరిపాలన ఒనరించిన రాజ్యాల పాలకులు పరిరక్షించడానికి కృషి చేసారు. దక్షిణాపథంలో శాతవాహనులు, ఉత్తరాపథంలో కుషాణులు ప్రజాహితంగా పాలన చేసి ప్రజాభిమానం పొందినారని శాస్త్రిగారు అభిప్రాయపడినారు.

## గుప్తయుగం - మూడవ సంపుటం

ప్రాచీన కాలంలో భారతదేశాన్ని పాలించిన వంశాల్లో మౌర్యుల అనంతరం విశేష ఖ్యాతి గడించిన రాజులు గుప్తరాజులు. వీరి కాలంలో దేశం అనేక రంగాల్లో పురోగతి సాధించింది. హిందూమతం, సంస్కృతి భాష పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి. గుప్తులు సాధించిన సైనిక విజయాలు వారికి శాశ్వత కీర్తిని సాధించాయి. ఈ మూడో సంపుటంలో శాస్త్రిగారు గుప్తుల చరిత్రను, వారి విజయాలను, సాంస్కృతిక వికాసాన్ని, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గుప్తుల యుగం సాధించిన విశేష పురోగతిని వివరించారు. దేశీయ ఆధారాలతో పాటు ఫాహియాన్ అనే చైనా బాటసారి ఈ యుగం గురించి వెలువరించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలి.

గుప్తుల కాలంలో భారతదేశాన్ని సందర్శించిన ఫాహియాన్ అనే చైనా యాత్రికుని యాత్రా వివరాలను శాస్త్రిగారు ఈ సంపుటంలోని రెండోపాఠంలో సుమారు 70 పుటలలో సవివరంగా చర్చించారు. భారతభూమిపై జన్మించి బౌద్ధమత ప్రవక్తగా కీర్తి గడించిన గౌతమబుద్ధుని శాంతి, అహింస, సమానత్వం మొదలైన సిద్ధాంతాలు ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో (సింహళం, బర్మా, కాంబోడియా, జావా, చైనా) వ్యాప్తి చెందాయి. ప్రజల, పాలకుల, తత్త్వవేత్తల హృదయాలను ఆకర్షించాయి. చైనా దేశానికి చెందిన ఫాహియాన్, హూయాన్‌త్సాంగ్, ఇత్సింగ్‌లు భారతదేశాన్ని సందర్శించారు. శాస్త్రిగారు ఈ పాఠ్యంలో ప్రధానంగా ఫాహియాన్ తొలి జీవిత చరిత్రను, అతని కుటుంబ నేపథ్యాన్ని, ఆనాటి చైనా దేశ పరిస్థితులను సవివరంగా వివరించిన తీరు చాలా అద్భుతంగా కలదు. ఐతే ఇంత సమాచారం ఏ గ్రంథం నుండి సేకరించారో శాస్త్రిగారు ఈ భాగంలో ఎక్కడా ప్రస్తావించకపోవడం కొంతమేరకు నిరాశ కలిగిస్తుంది. చైనా బాటసారుల రచనలు 'ఫో-కువో-కీ', 'సి-యూ-కీ'లు ఆంగ్లభాషలోకి అనువదించబడినాయి. బహుశ వాటి ఆధారంగానరే ఈ సమాచారం పేర్కొని ఉండవచ్చును.

ఫాహియాన్ 'కంగు వంశ'జుడనీ, క్రీ.శ. 370వ సంవత్సరంలో చైనాలోని 'ఉ యాంగ్ పట్టణంలో జన్మించాడనీ, ఇతనికి ముగ్గురు సోదరులుండిరనీ, బాల్యంలోనే వీరు చనిపోగా, అతని తండ్రి ఫాహియాన్‌ను అక్కడి బౌద్ధ సంఘారామంలో చేర్పించాడనీ

పేర్కొన్నారు. ఫాహియాన్ తన బోధనలచే దొంగల ముఠాను సంస్కారవంతులుగా తీర్చిదిద్దినాడనీ పేర్కొన్నారు. భారతదేశంలో ప్రవేశించడానికి ముందే (క్రీ.శ.399) ఫాహియాన్, చాంగ్‌యీా పట్టణం టన్వాంగ్, పెన్షన్, పూయిా రాజ్యాలను దాటుకుంటూ క్రీ.శ. 399లో తన 25 ఏట భారత యాత్రను ఆరంభించాడని పేర్కొన్నారు. మహాయాన శాఖ బౌద్ధులకు మంజుశ్రీ గురువని, అతడు చైనాలోని 'షాన్సీ' పట్టణ నివాసి అని పేర్కొన్నారు. ఈ వివరాలు మరే గ్రంథంలో కానరావు.

భారతదేశంలో కుశినగరం, వైశాలి, పంచవేణి సంగమం, రాజగృహం, క్షుద్రశైలము, గృధ్రకూట పర్వతం, వేణువనం, పిప్పిలివనం, గయ, అశోకనగరం, గురుపాద శైలం, వారణాసి, కపోత విహారం, నాగార్జునకొండ, చంపా, తామ్రలిప్తి మొదలైన ప్రాంతాలను సందర్శించాడనీ శాస్త్రిగారు పేర్కొన్నారు. ఆ తర్వాత సింహళదేశం సందర్శించి స్వదేశం తిరిగి వెళ్ళిన ఫాహియాన్ అక్కడి ప్రజల్లో బౌద్ధమత సిద్ధాంతాలను ప్రచారం చేసాడు. ఫాహియాన్ భారతదేశంలో జరిపిన వివిధ ప్రాంతాల యాత్రా వివరాలు ఎంతో ఆసక్తి కల్గిస్తున్నాయి.

ఆనాటి పరిస్థితులను వివరించే సందర్భంలో గుప్తరాజుల్లో అఖండ సైనిక విజయాలను సాధించిన సముద్ర గుప్తుని గొప్పతనాన్ని శాస్త్రిగారు నిష్పక్షపాతంగా వివరించారు (పుటలు 11-24). మిగతా గుప్తరాజుల చరిత్రను (25-60 పుటలలో) ప్రాథమిక ఆధారాల నుండి సేకరించిన సమాచారంతో సమన్వయ పరిచి వ్రాయడం విశేషం.

ఇదే గ్రంథంలో గుప్తుల పరిపాలన వ్యవస్థ, సామాజిక, ఆర్థిక, మతపరిస్థితులు వివరించబడినాయి. పుట 69 నుండి 74లలో గుప్తయుగానికి చెందిన భారవి మహాకవి, ప్రవరసేనుడు, వత్సభట్టి దండి మహాకవి, ఆర్యభట్టు, వరాహ మిహిరుడు, బ్రహ్మగుప్తుడు మొ॥ పండితుల రచనలు, వారి పాండిత్యానికి సంబంధించిన వివరాలు శాస్త్రిగారు సవివరంగా వర్ణించడం విశేషం. ఆనాటి విద్యా కేంద్రాలైన తక్షశిల, నలంద, విక్రమశిల గురించి వర్ణించిన వివరాలు ఎంతో ఆసక్తికరమైన చారిత్రక సమాచారాన్ని తెలియచేస్తున్నాయి.

ఈ సంపుటంలోనే నాల్గవ అధ్యాయంలో శాస్త్రిగారు గుప్తులకు సమకాలికులైన విష్ణుకుండిన రాజుల చరిత్రను సుమారు 66 పుటల్లో శాసనాలు, సాహిత్యం ఆధారంగా వివరించిన తీరు ప్రశంసనీయం. ఇందులో బౌద్ధమతం స్థితిని వర్ణించారు. ఆరవ అధ్యాయంలో రేనాటి చోళుల చరిత్ర, ఏడవ అధ్యాయంలో కళింగ గాంగుల చరిత్ర, 8వ అధ్యాయంలో పుష్యభూతి వంశ చరిత్ర - హర్షవర్ధనుని విజయాలు చర్చించారు.

ఈ సంపుటంలోని 10వ పాఠ్యంలో క్రీ.పూ 6వ శతాబ్దం నాటి జనపదములైన అస్సక, కళింగ, అవంతి, సౌవీర, విదేహ, వత్స, ఛేది, మల్ల, అంగ, కాశీలలోని రాజకీయ, సామాజిక పరిస్థితులు వర్ణించడం మరో విశేషం.

ముఖ్యంగా ఆనాటి జనపదములలో నేటి తెలంగాణ ప్రాంతానికి చెందిన అశ్మక జనపదం గురించి కెనోమ్ అనే గ్రీకు చరిత్రకారుడు, అష్టాధ్యాయి రచయిత పాణిని, మార్కండేయ పురాణం, బృహత్సంహిత, బౌద్ధ రచనల్లో అనేక వివరాలున్నాట్లు పేర్కొన్నారు. కోసల దేశవాసియగు 'భావరి' అనే విప్రుడు ఇక్కడ స్థిరపడినాడనీ పేర్కొన్నారు.

ఇదే సంపుటంలోని 16వ భాగంలో ఆంధ్రదేశంలో శాతవాహనుల అనంతరం పరిపాలించిన శాలంకాయనుల రాజకీయ చరిత్రను, ఆనాటి సామాజిక, ఆర్థిక, మత, సాంస్కృతిక అంశాలను శాస్త్రిగారు ప్రాథమిక ఆధారాలు (శాసనాలు, సాహిత్యం)ను ప్రామాణికంగా గ్రహించి వ్రాసారు. ముఖ్యంగా శాలంకాయన రాజుల వివరాలు పుట.506లో (విజయదేవ వర్మ క్రీ.శ.300-335), హస్తివర్మ (క్రీ.శ. 335-350), నందివర్మ (క్రీ.శ. 350-380), విజయ స్కందవర్మ (క్రీ.శ.410-440) పేర్కొన్నారు. 506-508 పుటల్లో శాలంకాయన రాజుల శాసనాలు కొనుకల్లు (నందివర్మ), ఏలూరు (విజయదేవ వర్మ), పెదవేగి (హస్తివర్మ), గుంటుపల్లి (రెండోనందివర్మ) మొ॥రాజులు వేయించిన శాసనాలను పేర్కొన్నారు.

చివరి అధ్యాయంలో గుప్త వంశం పాలన క్షీణించిన తర్వాత ఉత్తర మధ్యభారతంలో వెలిసిన మైత్రక (వల్లభరాజ్యం), కదంబ, మౌఖరి, కామరూప మొ॥ వంశాల కాలంలో నెలకొన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను వర్ణించాడు.

**చాళుక్య యుగం - నాలుగవ సంపుటం**

ప్రస్తుతం తెలుగు, కన్నడం, తమిళం మొ॥న భాషలు మాట్లాడే రాష్ట్రాలను క్రీ.శ. 5వ శతాబ్దం నుండి 11వ శతాబ్దం వరకు సుమారుగా 6 శతాబ్దాల పాటు బాదామీ చాళుక్యరాజులు, వేములవాడ చాళుక్యులు, తూర్పు చాళుక్యులు, రాష్ట్రకూటులు, ముదిగొండ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, చోళరాజులు, చాళుక్య - వెలనాటి చోళులు, కందూరి చోడులు పరిపాలించారు. ఈ నాల్గవ సంపుటంలో శాస్త్రిగారు చాళుక్యరాజుల్లో మొదటి శాఖవారైన బాదామీ చాళుక్యుల చరిత్రను సవివరంగా చర్చించారు. అనేక సమకాలీన సాహిత్య రచనలను, శాసనాలను ఈ రచనలో పేర్కొన్నారు. పైన పేర్కొన్న చాళుక్య

వంశరాజుల చరిత్రను వివరించే సందర్భంలో శాస్త్రిగారు వారి వారి వంశ వృక్షాలకు సంబంధించిన వివరాలను పేర్కొనడం ఈ గ్రంథ ప్రత్యేకత.

చాళుక్య వంశరాజులు, బాదామీ, వేంగి, వేములవాడ, ముదిగొండ కేంద్రాలుగా విభిన్న దశల్లో పరిపాలించారు. సమకాలీన పల్లవ, చోళ, రాష్ట్రకూట రాజులతో నిరంతర యుద్ధాలు చేసారు. వీరంతా వారి ప్రజా సంక్షేమానికి, సాహిత్య, వాస్తు, శిల్పకళల వికాసానికి నిరంతరం కృషి చేసారు. వీరి బాటలోనే భవిష్యత్‌లో తెలుగు, కన్నడ, మరాఠ ప్రాంతాలను ఏలిన యాదవ, హోయసాల, కాకతీయ రాజులు కృషి చేసారన్నది శాస్త్రిగారి అభిప్రాయం.

బాదామీ చాళుక్యుల అధికారం అంతరించిన తర్వాత, మాణ్యఖేట నగరం లేదా మాన్‌ఖేడ్ కేంద్రంగా స్వతంత్ర్య రాజ్యాన్ని నెలకొల్పి క్రీ.శ. 7-9 శతాబ్దాల మధ్య పరిపాలించిన రాష్ట్రకూటుల చరిత్రను చక్కగా చర్చించారు. ఇదేవిధంగా వేంగి, ముదిగొండ చాళుక్యుల చరిత్ర విషయంలో మరే చరిత్రకారుడు పేర్కొనని చారిత్రక అంశాలను శాస్త్రిగారు, శాసనాల ఆధారంగా పేర్కొని నేటి తరానికి మార్గదర్శకుడైనాడు.

తంజావూరు చోళరాజులు, నెల్లూరు తెలుగు చోళరాజుల సంబంధాలు వివరించిన తీరు ప్రశంసనీయం. మొత్తం మీద చాళుక్యులు భారతీయ సంస్కృతికి విశేష కృషి చేసారన్నది శాస్త్రిగారి వాదన.

## ప్రతీహార యుగం - ఐదవ సంపుటం

హర్షవర్ధనుని మరణానంతరం ఉత్తర భారతదేశంలో రాజకీయ అస్థిరత నెలకొన్నది. అలాంటి సమయంలో రాజపుత్రులు భారతదేశంలో అధికారం చేపట్టారు. వీరిలో 'ప్రతీహారులు' జోధ్‌పూర్ రాజధానిగా పరిపాలించారు. క్రీ.శ. 8వ శతాబ్దం ప్రథమార్థంలో స్వతంత్ర్య ప్రతీహార వంశాధికారాన్ని మొదటి నాగభట్టు నెలకొల్పాడు. వత్సరాజు, రెండవ నాగభట్టు, భోజుడు, మొదటి మహేంద్రపాలుడు, రెండవ భోజుడు, మహీపాలుడు ప్రతీహారుల్లో సుప్రసిద్ధ రాజులు. వీరు సమకాలీన రాజ్యాలతో తలపడినారు. క్రీ.శ. 1019 నాటికి ప్రతీహారుల అధికారం అంతరించింది. శాస్త్రిగారు ప్రతీహారుల చరిత్రను మరే గ్రంథంలో లేనిరీతిలో సవివరంగా వర్ణించడం విశేషం.

ఇదే సంపుటంలో బెంగాల్‌ను ఏలిన 'పాలరాజుల' చరిత్రను శాస్త్రిగారు చక్కగా వర్ణించారు. పాలరాజుల్లో గొప్పరాజైన ధర్మపాలుని (క్రీ.శ. 770-810) సుదీర్ఘ పరిపాలన కాలంలో సాధించిన సైనిక, సాంస్కృతిక విజయాలను వర్ణించారు. పుట 66,67,68లలో పాలవంశరాజుల వంశవృక్షం ఎంతో ఆసక్తిదాయకమైన వివరాలు అందిస్తుంది.

మాళవ దేశాన్ని పరిపాలించిన పారమారుల చరిత్రను, ఛేది రాజ్యాన్ని ఏలిన కాలచురి వంశ రాజుల చరిత్రను, బుందేల్‌ఖండ్‌ను ఏలిన చందేల వంశరాజుల చరిత్రను, బెంగాల్‌ను పాలించిన సేన వంశీయుల చరిత్రను మరియు ఇతర చిన్న చిన్న రాజుల చరిత్రను అద్భుతంగా వర్ణించడం విశేషం.

చివరి అధ్యాయంలో భారతదేశంపై అరబ్ దండయాత్ర, దాని ప్రభావం చర్చించారు. ముఖ్యంగా అరబ్ దండయాత్ర నాటికి భారతదేశంలో నెలకొన్ని ఉన్న సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులను, రాజకీయ అస్థిరతను వర్ణించారు.

## కాకతీయ యుగం - ఆరవ సంపుటం

మధ్యయుగంలో (క్రీ.శ.1000-క్రీ.శ.1600) దక్షిణ భారతదేశాన్ని పేరుగాంచిన అనేక రాజవంశాలు పరిపాలన చేశాయి. వీరిలో రాష్ట్రకూటులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, ముసునూరి నాయకులు, రాచకొండ - దేవరకొండ వెలమలు, రెడ్డిరాజులు (అద్దంకి, కొండవీడు, రాజమండ్రి), విజయనగర రాజులు, బహమనీలు పేర్కొనదగినవారు. సుమారు 1600 సంవత్సరాలవరకు సాగిన హిందూరాజుల పాలనలో దక్షిణాపథంలోని తెలుగు, కన్నడ, మరాఠి ప్రాంతాల ప్రజలు కొంతమేరకు ప్రత్యేక గుర్తింపు పొందారు. వీరు తమదైన శైలిలో దక్షిణాపథ సంస్కృతికి గొప్ప సేవ చేసారు. ఈ సమయంలోని రాజకీయ వ్యవస్థ, సామాజిక స్థితి, ఆర్థికాభివృద్ధి, సాహిత్యం, వాస్తు-శిల్పకళారంగాల్లో విశేష ప్రగతి బి.ఎన్.శాస్త్రిగారిని విశేషంగా ఆకర్షించింది. ఈ దిశలో సాగిన శాస్త్రిగారి ఆలోచనకు ప్రతిరూపమే కాకతీయ యుగం సంపుటం.

ఈ యుగ రచనలో శాస్త్రిగారు శాసనాలు, సమకాలీన సాహిత్యం నుండి సేకరించిన సమాచారాన్ని జాగ్రత్తగా విశ్లేషించారు. ముఖ్యంగా 1992లో ముద్రించబడిన ఈ గ్రంథంలో శాస్త్రిగారికి ముందు తెలుగులో చిలుకూరి వీరభద్రరావు రచించిన ఆంధ్రుల చరిత్రను, మారేమండ రామారావు రచించిన 'కాకతీయ సంచిక'ను 'పాండ్యరాజ్య చరిత్రను (కె.ఎ.నీలకంఠశాస్త్రి, భారతి మాసపత్రికలోని వ్యాసాలను, నన్నెచోదుని కుమారసంభవాన్ని, విద్యానాథుని ప్రతాపరుద్ర యశోభూషణాన్ని, రాళ్ళబండి సుబ్బారావు రచించిన 'కళింగదేశ చరిత్రను', కడప జిల్లా శాసనాలు, మద్రాసు రాష్ట్ర శాసనాలు, తెలంగాణ శాసనాలు మొదలైన వాటిలోని సమాచారాన్ని ఉపయోగించారు. అంతకుముందు అందుబాటులోనికి రాని తెలియని చారిత్రక సమాచారాన్ని, తన రచనలో వివరించారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. కాకతీయుల చరిత్రపై పరిశోధన చేసిన పి.వి.పరబ్రహ్మశాస్త్రిగారి రచన (ది కాకతీయాస్ 1979) ను శాస్త్రిగారు సంప్రదించలేదు. ఆ గ్రంథంలోని సమగ్ర వివరాల జోలికి శాస్త్రిగారు వెళ్ళలేదని భావించవచ్చు. అంతమాత్రాన సంపుటంలోని సమాచారం వన్నె తగ్గిందనీ భావించరాదు. రెండు గ్రంథాలను సమగ్రంగా అధ్యయనం చేసిన తర్వాత ఒక చరిత్రకారుడు (ఆ రంగంలో) మరో సాహితీవేత్త – శాసనకర్త ఇరువురూ కాకతీయ యుగ విశేషాలను నిష్పక్షపాతంగా విశ్లేషించారని నా భావన. ఇటీవల కాలంలో అమెరికన్ చరిత్రకారిణి సింథియా తాల్‌బోట్ తన రచన 'ప్రీ కలోనియన్ ఇండియా ఇన్ ప్రాక్టీస్, సొసైటీ, రీజన్ అండ్ ఐడెంటిటీ ఇన్ మిడీవల్ ఆంధ్రదేశ' అనే గ్రంథంలో శాస్త్రిగారిని పి.వి. పరబ్రహ్మశాస్త్రిగారితో ప్రస్తావించడం ఈ సంపుటం యొక్క చారిత్రక ప్రాధాన్యతను వివరిస్తుంది.

'కాకతీయ యుగం' సంపుటం మరో విశిష్టత ఏమనగా ఇందులో శాస్త్రిగారు కాకతీయుల అధికార వ్యాప్తిలో, పతనంలో వారి సామంత, మాండలీక కుటుంబాల పాత్రను ఆధారాలతో సహా చర్చించారు. ముఖ్యంగా రేచెర్ల రెడ్డి వంశము, చెఱుకురెడ్డి వంశము, కాయస్థ వంశజుల చరిత్ర, మల్యాల వంశ చరిత్ర, విరియాల వంశం మొదలైనవారి చరిత్రను వారి పాత్రను మరే చారిత్రక గ్రంథాల్లో లేనివిధంగా వివరించి నేటి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోని యువ చారిత్రక పరిశోధకులకు మార్గనిర్దేశనం చేసారు. సుమారు 500పేజీలకు మించిన ఈ గ్రంథంలో నతవాడి వంశం, బాణవంశం, వైదుబులు, కొణిదెనచోడులు, పొత్తపి, నెల్లూరుచోడులు, మల్యాల వంశం, కొలను పాలకులు, ఇందులూరి వారి చరిత్రను ఎంతో వివరంగా చర్చించి నేటి ప్రాంతీయ చరిత్రపై అధ్యయనం చేస్తున్న పరిశోధకులకు మార్గనిర్దేశం చేసారు.

ఇదే సంపుటంలో కాకతీయులకు సమకాలీన హిందూరాజులైన దేవగిరి యాదవ వంశం, హొయసాల రాజుల చరిత్రను శాస్త్రిగారు మరే (తెలుగులో) చారిత్రక గ్రంథంలో లేని రీతిలో వ్రాసినారు.

ఈ గ్రంథంలో (పు.96,97,98,99) పుటలలో శాస్త్రిగారు తెలిపిన రేచెర్ల వంశవృక్షం ఎన్నో తెలియని విషయాలు వివరిస్తుంది. ఈ వంశ వక్షాన్ని పాలంపేట రేచర్ల రుద్రసేనాని శాసనం, బేతిరెడ్డి భార్య వేయించిన పిల్లలమర్రి శాసనం, క్రీ.శ. 1202 నాటి నామిరెడ్డి వేయించిన పిల్లలమర్రి శాసనంలలో పేర్కొనబడిన సమాచారం ఆధారంగా నిర్ణయించారు. శాస్త్రిగారి ఈ గ్రంథం రేచెర్ల వంశంపై పరిశోధన చేయాలనుకునే భావితరాలవారికి ఎంతో ఉపయోగపడుతుంది.

ఓరుగల్లు పట్టణ వర్ణన గురించి వివరిస్తూ శాస్త్రిగారు ఈ సంపుటంలోని పుట 81లో క్రీ.శ. 1321లో ఢిల్లీ సుల్తానుల సేనలు ఈ మహానగరంపై దండెత్తి వచ్చినప్పుడు, ఢిల్లీ సుల్తాన్ సేనాధిపతి ఉలూగ్‌ఖాన్ ఆ నగరాన్ని వర్ణించినట్లు పేర్కొన్నారు. ఈ వర్ణన ఓరుగల్లు పట్టణం నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా వెల్గొందుతుందనీ, ప్రజలు ఐశ్వర్యవంతులనీ, పంటపొలాలు, పూలతోటలు, పండ్ల తోటలు పుష్కలంగా ఉన్నాయనీ, వాడలు / వీథులు జనసాంద్రత కల్గి ఉన్నాయనీ తెలియచేస్తుంది. కాని ఉలూగ్‌ఖాన్ వర్ణనకు సరైన చారిత్రక ఆధారాన్ని శాస్త్రిగారు ఎందుకు ఇవ్వలేదో తెలియదు. బహుశ ఫెరిష్టా రచన తారీఖ్ – ఇ – ఫెరిష్టాలో ఈ వర్ణన ఉండి ఉండవచ్చు.

శాస్త్రిగారు ఓరుగల్లు పట్టణంలో ప్రజల జీవనాన్ని, వివిధ రాకల గుంపులను, ఇండ్లను వర్ణిస్తూ (పు.81,82,83) 'పూటకూళ్ళ ఇండ్లను' పేర్కొన్నాడు. ఒక రూకకు 'కపురపు భోగి వంటకము' అనగా సువాసననిచ్చు బియ్యంతో వండిన అన్నము, మంచి గోధుమపిండి వంట, పంచదార, అప్పుడే కాచిన ఆవునేయి, కొమ్మునల్ల నరటిపండ్లు, నాలుగైదు నంజుండు, వడియములు, అప్పడములు, మంచి పెరుగుతో భోజనం లభించేదని వర్ణించారు.

## ఢిల్లీ సుల్తానుల యుగం – ఏడవ, ఎనిమిదవ సంపుటాలు

చరిత్రకారులు హర్షవర్ధనుని మరణంతో భారతదేశ చరిత్రలో ఒక మహోజ్జ్వల శకం ముగిసిందని పేర్కొన్నారు. (క్రీ.శ. 642– క్రీ.శ.1206) సంవత్సరంలో ఢిల్లీలో 'కుతుబుద్దీన్ – ఐబక్' చే ముస్లిం అధికార స్థాపన/ బానిస వంశ స్థాపన వరకు కల కాలాన్ని రాజపుత్ర యుగంగా చరిత్రకారులు వర్ణించారు. ఈ సుదీర్ఘకాలం (సుమారు 5 శతాబ్దాల కాలం) లో భారతదేశంలోని అరేబియాలో మహమ్మద్ ప్రవక్త బోధనల ఆధారంగా ఆవిర్భవించిన ఇస్లాం మతం, అతని వారసులు/ ఖలీఫాల కృషి ఫలితంగా ఆసియా, ఐరోపాల్లోని అనేక నూతన ప్రాంతాలకు విస్తరించింది. దీనిలో భాగంగానే భారతదేశ భూభాగాలపై క్రీ.శ. 711 నుండి 1192 మధ్య మహమ్మద్ గజనీ, మహమ్మద్ ఘోరీ దండయాత్రలు జరిగినాయి. చివరికి వీరి దాడులు భారతదేశ చరిత్రనే మలుపు తిప్పిన రెంగో తరాయిన్ యుద్ధం (క్రీ.శ. 1192)లో మహమ్మద్ – ఘోరీ సైన్యాలు, రాజపుత్ర వీరుడైన పృథ్వీరాజ్ చౌహాన్‌ను ఓడించి ఢిల్లీ దాని పరిసర ప్రాంతాలను ఆక్రమించాయి. భారతదేశంలో తాను ఆక్రమించిన భూభాగాలపై తనకు విశ్వాసపాత్రుడు, సమర్థుడైన కుతుబుద్దీన్ ఐబక్‌ను ప్రతినిధిగా నియమించి, తన స్వరాజ్యానికి తిరిగి వెళ్ళిన కొంతకాలానికే ఘోరీ మరణించాడు. ఘోరీకి కొడుకులు / వారసులు లేనందువల్ల భారతదేశంలోని అతని

భూభాగాలన్నింటికీ కుతుబుద్దీన్ ఐబక్ సుల్తాన్ అయ్యాడు. అతని వారసులనే చరిత్రకారులు 'బానిస వంశ సుల్తానులు'గా వర్ణించారు. వీరి పాలన సుమారుగా క్రీ.శ. 1290 వరకు కొనసాగింది. ఆ తర్వాత ఖిల్జీలు (1290-1320) తుగ్లక్‌లు (1320-1414) ఆ తర్వాత అసమర్థ సుల్తానులైన సయ్యద్, లోడీ వంశాల పాలకులు పరిపాలించారు. క్రీ.శ. 1526 ఏప్రిల్‌లో జరిగిన మొదటి పానిపట్ యుద్ధంలో బాబర్ చివరి ఢిల్లీ సుల్తానైన ఇబ్రహీం లోడీని ఓడించి, మొగలుల అధికారాన్ని భారతదేశంలో నెలకొల్పడంతో సుమారు 320 ఏండ్లపాటు కొనసాగిన ఢిల్లీ సుల్తానుల పాలన అంతమైంది.

ఈ 300 సంవత్సరాల ఢిల్లీ సుల్తానుల పాలనా విశేషాలను శాస్త్రిగారు 7,8 సంపుటాలలో అంతవరకు అందుబాటులో ఉన్న సమకాలీన చారిత్రక ఆధారాలను, గ్రంథాలను సంప్రదించి, తన శైలిలో పాఠకులకు సులువైన భాషలో అందించే ప్రయత్నం చేయడం విశేషం.

ఈ రెండు సంపుటాలలో సుమారు 900 పేజీలు ఢిల్లీ సుల్తానుల పాలన విశేషాలను, ప్రజల సంస్కృతిని, చారిత్రక కట్టడాలను సంపూర్ణంగా వర్ణించారు. ముఖ్యంగా రెండోభాగంలో (8వ సంపుటం) ఢిల్లీ సుల్తానుల బలహీనత వల్ల ఉత్తర, మధ్య దక్షిణాపథంలో అవతరించిన బెంగాల్, జాన్‌పూర్, మేవార్, కాశ్మీర్, మాల్వా, మార్వార్, విజయనగర, పాండ్య, బహమనీ రాజ్యాల చరిత్రను సవివరంగా వర్ణించారు. ఈ రాజ్యాల నేలిన రాజులు నిర్మించిన దేవాలయాలను, కోటలను, రాజభవనాలను, మసీదులను వర్ణించడమే కాకుండా 1947కు ముందే వ్రాయబడిన గ్రంథాల్లోకి బొమ్మలను/పటాలను/ చిత్రాలను సమకూర్చి ఈ సంపుటాలను మరింత అర్థవంతంగా చేసాడు.

ఈ రెండు సంపుటాల రచనలో శాస్త్రిగారు సమకాలీన ఢిల్లీ సుల్తానుల చరిత్రకారులైన ఫెరిష్టా, ఇసామీ, బరౌనీ, మిన్హజ్ - ఉస్ - సిరాజ్, అల్‌బెరూనీ, అమీర్‌ఖుస్రో, ఇబన్ -బటూటాల అకౌంట్లను (ఆంగ్ల అనువాదాలను) ఉపయోగించినారు. ఇది మరే తెలుగులోని చారిత్రక గ్రంథాల్లో కానరాదు. 7వ సంపుటం పుట.47,48లో శాస్త్రిగారు మహమ్మద్ - గజనీ వంశ వృక్షాన్ని పుట.90లో ఘోరీవంశం వృక్షాన్ని సవివరంగా వివరించడం విశేషం. శాస్త్రిగారి ఈ రచన భావితరం చరిత్రకారులకు ఎంతో ఉపయోగకరంగా మారినది. ముస్లిం సుల్తానుల పాలన వివరించే తెలుగు చారిత్రక గ్రంథాల కొరత కొంతమేరకు బి.యన్.శాస్త్రిగారి ఈ రెండు సంపుటాలు తీర్చినాయని చెప్పవచ్చు.

ఢిల్లీ సుల్తానుల కాలంలో భారతదేశ సరిహద్దు ప్రాంతాలపై జరిగిన మంగోలు దండయాత్రను, వాటి పరిణామాలను వర్ణించడంలో శాస్త్రిగారు అమూల్య వివరాలు 7వ సంపుటం పు. 112,113,114లలో పేర్కొన్నారు. 'ఖిల్జీ వంశ పాలకుల్లో అత్యంత విమర్శలకు గురైన విలాస ప్రియుడు, భోగలాలసుడైన, రాజ్య వ్యవహారాలు పూర్తిగా అశ్రద్ధ చేసిన 'ముబారక్‌షా' వ్యక్తిత్వాన్ని, వ్యసనాలను వివరిస్తూ 7వ సంపుటం పు. 250లో సుల్తాన్ స్త్రీల వస్త్రధారణతో సభలో తిరిగేవాడనీ, తన దర్బారులో వేశ్యలు బహిరంగంగా సుల్తాన్‌తో కల్సి వెకిలి చేష్టలతో తిరగడానికి అనుమతి ఇచ్చినాడనీ పేర్కొన్నారు. దీన్ని జియావుద్దీన్ బరౌనీ రచనైన తారీఖ్ – ఇ – ఫిరోజ్‌షాహీలో వర్ణించాడని శాస్త్రిగారు పేర్కొనడం విశేషం.

ఓరుగల్లు రాజ్యాన్ని ఆక్రమించడానికై తుఘ్లక్ అత్యంత ధైర్య సాహసాలతో ఎదిరించిన కాకతీయ చక్రవర్తి రెండో ప్రతాపరుద్రుని వీరత్వాన్ని, ఆతని సైనికుల, సేనాధిపతుల సాహసోపేత పోరాటాన్ని శాస్త్రిగారు పుట 270–273లలో వర్ణించాడు.

## విజయనగర యుగం – తొమ్మిదవ సంపుటం

తొమ్మిదవ సంపుటానికి శాస్త్రిగారు పెట్టిన పేరు విజయనగర యుగం. ఈ సంపుటంలో 400 పై చిలుకు పుటలలో రెడ్డి, కళింగ గజపతులు, బోయలు, తంజావూరు, మధుర నాయకరాజుల చరిత్రను సవివరంగా రచించారు. ఈ గ్రంథంలో అంతకుముందు తెలుగులో వ్రాయబడిన చారిత్రక గ్రంథాలలో లేని అనేక రాజకీయ, సామాజిక, ఆర్థిక విషయాలు చర్చించడం విశేషం. ముఖ్యంగా ఆంగ్లంలో విజయనగర, రెడ్డి, గజపతి, నాయక రాజ్యాల చరిత్రపై అంతకుపూర్వం చరిత్రకారులు వ్రాసిన రచనలను శాస్త్రిగారు నిశితంగా అధ్యయనం చేసి, తన అభిప్రాయాలు వ్యక్తీకరించారు.

సంగమ వంశరాజైన మొదటి హరిహర రాయల వద్ద మంత్రిగా, గురువుగా ఉన్న మాధవ విద్యారణ్యుని (1350–1380) గురించి ఈ సంపుటం పు. 108–111 వరకు శాస్త్రిగారు వెల్లగించిన వివరాలు ఎంతో చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇక్కడ విజయనగర స్థాపకులైన హరిహర, బుక్క సోదరుల తల్లితండ్రుల పేర్లు (భావ సంగముదు, మేళాంబిక) అన్న వివరాలు మరే గ్రంథంలో పేర్కొనబడలేదు. శాస్త్రిగారు ఈ లోటును తీర్చారు.

ఇదే తరహాలో మాధవ విద్యారణ్యుని రచనలు 1. వేదార్థ ప్రకాశిక, 2. పరాశర మాధవీయం, 3. కాలమాధవీయం, 4. అనుభూతి ప్రకాశిక, 5. జీవన్ముక్తి వివేకం, 6. అలంకార సుధానిధి, 7. అధికరణ రత్నమాల, 8. మాధవీయ దాతు వృత్తి, 9. సర్వదర్శన సంగ్రహం మొదలైనవి పేర్కొన్నారు.

ఇదే సంపుటంలోని పు. 138,139లలో విజయనగర కోటలోని కోనేరు ఫోటో ఇవ్వడం జరిగింది. దీన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే శాస్త్రిగారు ఎలా తీసారో, ఎవరినుండి సేకరించారో తెలియదు. పుట నెం. 1667లో సాళువ నర్సింహరాయల కాలానికి చెందిన కవుల్లో ఒకడైన పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి పూర్వీకుల వివరాలు పినవీరభద్రుడు జైమిని భారతమును సరస్వతీ దేవి వరంతో ఏవిధంగా ఒక నెలలో పూర్తిచేసి, రాజుగారికి అంకితమిచ్చిన వర్ణన ఎంతో మనోహరంగా కొనసాగింది.

పుట 187,188లలో శ్రీకృష్ణదేవరాయల సైన్యం (క్రీ.శ.1520)లోని వివరాలు 'ఎ ఫర్గాటెన్ ఎంపైర్' అనే గ్రంథంలో రాబర్ట్‌సీవెల్, పోర్చుగీసు గుఱ్ఱాల వ్యాపారి డామింగోపేస్ అకౌంటు ఆధారంగా వివరించి రాయల సైన్యంలో అమరనాయకులు (కామానాయుడు, త్రయంబకరావు, తిమ్మప్పనాయుడు, అదెప్పనాయుడు) 30వేల కాల్బలం నుండి ఒక లక్ష కాల్బలాలను కల్గి ఉన్నారనీ, అశ్వదళం సంఖ్య 2 వేల నుండి 6000 వేలవరకు ఉ ండిందనీ, గజదళం 16 నుండి 500 వరకు ఉండేదని పేర్కొన్నాడు. ఇంతటి భారీ సైన్యాన్ని పోషించిన రాయలు సమకాలీన దక్కన్ సుల్తానులకు, గజపతులకు అరివీర భయంకరుడిగా కనిపించాడు. అతని సేనలు ఒక్క యుద్ధంలో కూడా పరాజయం పొందలేదు.

విజయనగర చరిత్రపై ముఖ్యంగా సంగమవంశ చరిత్రపై పిహెచ్.డి. (1963)లో పొందిన స్వర్గీయ ఆచార్య పాటిబండ ఝాన్సీలక్ష్మిగారి థీసిస్, సాళువ వంశంపై పిహెచ్.డి. చేసిన పిశుపాటి శ్రీరామశర్మ రచనైన 'ది సాళువా డైనాస్టీ ఆఫ్ విజయనగర్' (1979), 'స్టడీస్ ఇన్ – ది థర్డ్ డైనాస్టీ ఆఫ్ విజయనగర, నేలటూరి వేంకట రమణయ్య రచన, ఫాదర్ ఆఫ్ విజయనగ మొ॥న విశిష్ట రచనలను శాస్త్రిగారికి అందుబాటులోకి రానట్టు కనబడుతుంది. బహుశ సమయం తక్కువగా ఉన్నందువల్ల, శాసనాల కొరకై ఊరూరా ప్రయాణం కట్టడం వల్ల ఇలా జరిగి ఉండవచ్చు. ఈ సంపుటంలోని పుట. 206,207లో ఆరవీటి వంశవృక్షాన్ని సవివరంగా వర్ణించాడు. ఇది హీరస్ పండితుని రచనలోని వివరాలకు సరిపోయింది.

### దక్కన్ సుల్తానుల యుగం – పదవ సంపుటం

శాస్త్రిగారు తన భారతదేశ చరిత్ర – సంస్కృతి 10వ సంపుటానికి 'దక్కన్ సుల్తానుల యుగం' అని పేరు పెట్టడం ఒక విశేషం. ఆంగ్లంలో దక్కన్ చరిత్రపై ప్రముఖ చరిత్రకారులైన జె.డి.బి. గ్రేబుల్, గులాం యాజ్దానీ, హరూన్‌ఖాన్ షేర్వాణీ, సిద్ధికీ, యూసూఫ్ – హుస్సేన్‌ఖాన్, జోషీ మొదలైనవారి రచనలు అంతగా అధ్యయనం చేసినట్లు కనబడదు.

ఎందుకనగా ఈ రచనలన్నీ ఉర్దూ, పర్షియన్, అరబిక్ మొదలైన భాషల్లో ప్రావీణ్యత కలిగిన ముస్లిం చరిత్రకారులు, పండితులు మాత్రమే లిఖించారు. అయినప్పటికీ బి.ఎన్.శాస్త్రిగారు తన లక్ష్యసాధనకు, వాస్తవాలకు విలువనిచ్చే రచనలు చేసారు.

ఈ గ్రంథంలో మొత్తం 593 పేజీలు కలవు. ఇందులో బహమనీ రాజ్యం విచ్ఛిన్నమై, దాని శిథిలాలపై వెలసిన నిజాంషాహీ (అహమద్‌నగర్), ఆదిల్‌షాహీ (బీజాపూర్), బరీద్‌షాహీ (బీదర్), ఇమాద్‌షాహీ (బీరారు), గోలకొండ (కుతుబ్‌షాహీలు)ల చరిత్రను వర్ణించాడు.

ఈ గ్రంథంలో పుట. 78, 79లలో అక్బర్ చక్రవర్తి సైన్యాలతో వీరోచితంగా పోరాడినర చాంద్‌బీబీ/ చాంద్ సుల్తానా (అహమద్‌నగర్ రాజప్రతినిధి) యుద్ధాలను వర్ణించాడు. మొగల్ సైన్యాలను ఆమె ఎదుర్కొన్న తీరు, తన సైనికులలో ధైర్యాన్ని పట్టుదలను నింపిన తీరును శాస్త్రిగారు అద్భుతంగా వర్ణించడం విశేషం. అహమద్‌నగర్ సుల్తానుల వద్ద మంత్రిగా పనిచేసిన 'మాలిక్ అంబర్' (1549-1620) పరిపాలనా సామర్థ్యాన్ని, సైన్యాలను నడపడంలో, దౌత్యనీతిలో అతడు చూపిన తెలివి తేటలను, ధైర్య సాహసాలను, మొగల్ సేనలతో వీరోచితంగా పోరాడి, సమకాలీన దక్కన్ సుల్తానులను సమైక్యం చేయడానికి మాలిక్ అంబర్ చేసిన కృషిని, నిజాం సాహీ రాజ్యంలోని రైతాంగాన్ని రక్షించడానికి అతడు చేపట్టిన కార్యక్రమాలను శాస్త్రిగారు ఈ సంపుటంలోని 25 పేజీలలో (86-105) వర్ణించిన తీరు అతన్ని గొప్ప చరిత్రకారునిగా నిరూపించింది. మరే తెలుగు చారిత్రక రచనల్లో మాలిక్ అంబర్ గూర్చి ఇంత అమూల్య చారిత్రక సమాచారం నేటికీ వ్రాయబడలేదని చెప్పవచ్చు.

దక్కన్‌లో 1510లో వెల్సిన బీజాపూర్ ఆదిల్‌షాహీ చరిత్రను శాస్త్రిగారు సుమారు 140 పుటలలో (126- 272) సవివరంగా వర్ణించాడు. విజయనగర రాజులతో (తుళువ, ఆరవీటి) జరిగిన యుద్ధాలను, యుద్ధ కారణాలను, జరిగిన తీవ్ర నష్టాన్ని సవివరంగా వర్ణించడంతో పాటు క్రీ.శ. 1565లో దక్కన్ సుల్తానుల సేనలకు, విజయ నగర సేనలకు మధ్య జరిగిన చరిత్రాత్మక రాక్షసి - తంగడి యుద్ధం, దాని కారణాలు ఫలితాలు. ఈ యుద్ధం వల్ల జరిగిన తీవ్ర నష్టాలను వివరించిన తీరు ప్రశంసనీయం.

దక్కన్‌లో వెలిసిన ఐదు షియా రాజ్యాల్లో నేటి తెలుగు రాష్ట్రాలను (ఆంధ్రదేశాన్ని) క్రీ.శ. 1518-1687 మధ్య కాలంలో ఎంతో ప్రజానురంజకంగా పరిపాలించిన గోల్కొండ, కుతుబ్‌షాహీల రాజకీయ చరిత్రను, ఆనాటి సామాజిక, ఆర్థిక, మత మొదలైన అంశాలను

ఎంతో అద్భుతంగా సుమారు 300 పేజీలలో సవివరంగా వర్ణించి శాస్త్రిగారు ప్రత్యేకత చేకూర్చినారు. 1687వ సంవత్సరంలో మొగల్ చక్రవర్తి సైన్యాలు గోల్కొండకోటను మోసపూరితంగా ఆక్రమించారని పేర్కొనడం విశేషం. ఈ వివరాలు హెచ్.కె. షేర్వాణి గారి ప్రసిద్ధ రచనైన 'ది హిస్టరీ ఆఫ్ కుతుబ్‌షాహీ డైనాస్టీ'లోని సమాచారానికి సరిగ్గా సరిపోతుంది.

క్రీ.శ. 1336-1687 మధ్యకాలంలో నిర్మించబడిన ప్రధాన పట్టణముల గూర్చి శాస్త్రిగారు ప్రత్యేకంగా ఈ సంపుటం చివరన వర్ణించారు. వీటిలో గోల్కొండ పట్టణం, హైద్రాబాద్, కొండపల్లి మొదలైనవాటి గూర్చి ఎన్నో వివరాలు పేర్కొన్నారు.

దక్కన్ సుల్తానులందరిలోకెల్లా ధర్మ ప్రభువులుగా ఆంధ్రదేశాన్ని పాలించిన కుతుబ్‌షాహీలను శాస్త్రిగారు వర్ణించారు. కుతుబ్‌షాహీల కాలంలోనే తెలంగాణలో 'మిశ్రమ సంస్కృతి'కి (కాంపోజిట్ కల్చర్) బీజాలు పడినాయన్న శాస్త్రిగారి అభిప్రాయం ఎంతో సమంజసమైనదో నేటి హైద్రాబాద్ కీ తహజీబ్‌లో ప్రతిబింబిస్తుంది.

## మొఘలు యుగం -1 - పదకొండవ సంపుటం

మధ్యయుగ భారతదేశ చరిత్రలో ఢిల్లీ సుల్తానుల పతనానంతరం, బాబర్ మొఘలు వంశాధికారాన్ని నెలకొల్పాడు. నాలుగు చాప్టర్లలో శాస్త్రిగారు క్రీ.శ. 1526-1605, అనగా బాబర్ భారతదేశంపై దండెత్తి వచ్చేనాటికి నెలకొని ఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక మొదలైన అంశాలను, ప్రాథమిక ఆధారాలను, 1559కి ముందు మధ్యయుగ, మొఘలు చరిత్రపై వచ్చిన రచనలను నిశితంగా అధ్యయనం చేసి వివరించాడు.

బాబర్ బాల్యంనాటికి 'ఫర్గానా' రాజ్య పరిస్థితులు, అతని తండ్రి మరణానంతరం బాబర్ ఎదుర్కొన్న సమస్యలను, ఫర్గాణా కోల్పోయిన తీరు, బాబర్ వ్యక్తిగత గుణగణాలను అతని సైనిక వ్యూహ రచనా పద్ధతులను వివరించాడు. మొదటి పానిపట్ యుద్ధంలో ఇబ్రహీంలోడిపై విజయం సాధించిన తర్వాత, రాజపుత్ర వీరుడైన 'రాణా సంగ్రామసింగ్'ను కాణ్వా యుద్ధంలో మొఘలు ఫిరంగి దళం శక్తితో ఓడించిన తీరును, శాస్త్రిగారు 'రష్‌బ్రూక్ విలియం, ఎడ్వర్డ్ & గ్యారట్, వి.ఏ.స్మిత్ మొదలైన బ్రిటిష్ చరిత్రకారులు తమ రచనల్లో వర్ణించిన పక్షపాత వైఖరిని ఖండించారు.

మూడవ అధ్యాయంలో హుమాయూన్ చరిత్రను, అతడి కష్టాలను, సంహాసనాన్ని క్రీ.శ. 1540లో షేర్‌షా చేతిలో ఓడిపోయి, సింహాసనాన్ని కోల్పోయిన తీరును వివరించాడు.

నాల్గవ అధ్యాయంలో సూర్ వంశ అధికార స్థాపన, షేర్‌షా పరిపాలనా వ్యవస్థ మొదలైన అంశాలను ప్రసిద్ధ చరిత్రకారులైన 'కలికా చరణ్ కానుంగో, ఆర్.పి. త్రిపాఠి మొదలైన వారి రచనల ఆధారంగా వివరించాడు.

భారతదేశాన్ని క్రీ.శ. 1206 - 1857 వరకు పరిపాలించిన ముస్లిం పాలకులందరిలో కెల్లా అగ్రగణ్యుడైన అక్బర్ చక్రవర్తి గుణగణాలను, చరిత్రాత్మక దిగ్విజయ యాత్రలను, మత, రెవిన్యూ, సైనిక విధానాలను నాల్గవ చాప్టర్‌లో వివరించాడు. ఈ సందర్భంగా శాస్త్రిగారు వి.ఎ.స్మిత్, లేన్‌పూల్, త్రిపాఠీ మొదలైన చరిత్రకారుల రచనలను ఉపయోగించారు.

## మొఘలుల యుగం-2 - పన్నెండవ సంపుటం

శాస్త్రిగారి భారతదేశ చరిత్ర - సంస్కృతి పరంపరలో 12వ సంపుటం 1999వ సంవత్సరంలో ముద్రించబడినది. ఈ గ్రంథంలో మొఘలు వంశ చరిత్రలో అత్యంత కీలక ఘట్టమైన (1605- 1707) సుమారు నూటారెండేళ్ళ కాలపు చరిత్రను, ముఖ్యంగా జహంగీర్, షాజహాన్ స్వర్ణయుగం, ఔరంగజేబు, కడపటి మొఘలుల చరిత్రను మరోసారి అందుబాటులో ఉన్న ఆధారాలను అప్పటివరకు ముద్రించబడిన ఆంగ్ల, తెలుగు రచనలను సమన్వయపరిచినారు. తన దృక్పథాన్ని వ్యక్తం చేసాడు. మొదటి మూడు అధ్యాయాల్లో జహంగీర్, షాజహాన్, ఔరంగజేబ్ చరిత్రను, వారు జరిపిన వారసత్వ యుద్ధాలను, సింహాసనం పొందడానికై వారు ఒనరించిన రక్తపాతాన్ని, ఆస్థులు / కోర్టు, దర్బార్ రాజకీయాలను, ముఠా తగాదాలను, వారు సాధించిన సైనిక విజయాలను వివరించారు.

షాజహాన్ స్వర్ణయుగ వైభవాన్ని, ఔరంగజేబ్ దక్కన్ విధాన ఫలితాలను వాస్తవాల ఆధారంగా వర్ణించారు. గోల్కొండ రాజ్యాన్ని ఔరంగజేబ్ ఆక్రమించిన తీరును (1687లో) శాస్త్రిగారు సమకాలీన చరిత్రకారుడైన 'ఖాఫీఖాన్' రచన 'ముంతకాబ్ - ఉల్ - లుబబ్'లో పేర్కొన్న వివరాల ఆధారంగా పేర్కొని, గత చరిత్ర రచనల్లో లేని కొత్త విషయాలు తెలుపుట ఇక్కడి ప్రత్యేకత.

ఈ గ్రంథంలోని ఆరవ అధ్యాయంలో మొఘలుల కాలంనాటి సాంఘిక పరిస్థితులను వివరించే సందర్భంలో శాస్త్రిగారు భారతీయ విద్యాభవన్ గ్రంథం 'ది హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ఇండియన్ పీపుల్' ఏడవ సంపుటంలోని సమాచారాన్ని, ప్రసిద్ధ మరాఠా చరిత్రకారుడైన జె.ఎన్.సర్కార్ రచనలైన 'మొఘల్ అడ్మినిస్ట్రేషన్ ఔరంగజేబ అండ్ హిస్ టైమ్స్' మొ॥న రచనల్లోని వివరాలను, అక్బర్‌నామా, అయిన్ - ఇ - అక్బరీ ఆంగ్ల అనువాదంలోని

వివరాలను చక్కగా ఉపయోగించి అంతవరకు ఉన్న లోటును తీర్చినాడు. మొగల్ యుగ విశేషాలను వివరించే సందర్భంలోనే శాస్త్రిగారు రాజకీయ చరిత్ర, సైనిక పద్ధతులు, విదేశాంగనీతి, తోడర్‌మల్ భూమిశిస్తు విధానం లక్ష్యాలను, అవి ఏరకంగా ఆనాటి రైతాంగానికి మేలు చేసాయో వివరించాడు. బ్రిటిష్ చరిత్రకారులైన వి.ఎ.స్మిత్, కారన్‌వాలీస్ శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతిని, తోడర్మల్ రెవిన్యూ విధానంతో పోల్చి విమర్శించటాన్ని శాస్త్రిగారు విమర్శించారు. షేర్‌షా, తోడర్‌మల్‌లు రైతాంగ సంక్షేమాన్ని కోరి చేసిన రెవిన్యూ సంస్కరణలు వాస్తవంగా రైతాంగానికి చాలా మేలు చేశాయని పేర్కొన్నారు.

ఇంకా ఈ భాగంలో చివరి ఇద్దరు మొగల్ చక్రవర్తులైన షాజహాన్, అతని కుమారుడైన ఔరంగజేబుల విరుద్ధ ఆశయాలను, భావాలను, రాజ్య విస్తరణ కాంక్షను, దక్కన్ షియా రాజ్యాలపై వారు జరిపిన దాడులను, ముఖ్యంగా షాజహాన్ కాలపు వాస్తు - శిల్ప కళా వైభవాన్ని, ఔరంగజేబ్ దక్కన్ విధానాన్ని, రాజపుత్రులతో, మరాఠులతో, సిక్కులతో అతడు చేసిన పోరాటాన్ని, చివరికి మొగల్ సామ్రాజ్య పతనానికి దారి తీసిన అంతరంగిక, విదేశీ కారణాలను సుమారు 176 పేజీలలో (49–226 వరకు) సమకాలీన ఆధారాలను పేర్కొంటూ శాస్త్రిగారు వ్రాసిన తీరు ప్రశంసనీయం. తెలుగులో ఇప్పటికీ ఏ చరిత్రకారుడు ఇంత సవివరంగా ఈ ఇద్దరు మొగల్ చక్రవర్తులపై వ్రాయలేదు.

సుప్రసిద్ధ చరిత్రకారులైన ఆచార్య ఇర్ఫాన్ హబీబ్, ఎస్.ఆర్.శర్మ, జె.న్.సర్కార్‌లు ఆంగ్లభాషలో వ్రాసిన మహోన్నత గ్రంథాలను కూడా శాస్త్రిగారు ఈ రెండు సంపుటాలను రచించడంలో పేర్కొనడం విశేషం.

ఈ సంపుటంలో మొఘల్ పరిపాలనా వ్యవస్థను వివరించడంలో శాస్త్రిగారు మరోసారి పరిపూర్ణత చేకూర్చారు. ఒక్కొక్క రాష్ట్రం, సర్కార్, పర్గణా నుండి వచ్చే ఆదాయ వివరాలను అద్భుతంగా వివరించిన తీరు, సుప్రసిద్ధ 'అలీఘర్ విశ్వ విద్యాలయానికి చెందిన ఆచార్య ఇర్ఫాన్ - హబీబ్‌ను తలపిస్తుంది. 'అగ్రేరియన్ రిలేషన్స్ - ఇన్ - మొఘల్ ఇండియా' హబీబ్‌గారు పొందుపర్చిన సమాచారానికి సమానంగా శాస్త్రిగారు ఈ గ్రంథంలో వివరాలు రాసారు.

## రాజపుత్ర యుగం - పదమూడవ సంపుటం

మధ్యయుగ భారతదేశ చరిత్రలో రాజపుత్రుల కీర్తి ప్రతిష్టలు, శౌర్య ప్రతాపాలు అనే బ్రిటీష్ అధికారి 'ది ఆనల్స్ ఆఫ్ రాజస్తాన్' అనే గ్రంథంలో తొలిసారిగా రికార్డు చేసాడు. అతడు చాలా మేరకు రాజస్థాన్‌లోని స్థానిక ప్రజల అభిప్రాయాలను, స్థానిక

కథలను ఆధారంగా ఈ రచన చేసాడు. శాస్త్రిగారు మాత్రం టాడ్ రచనతో బాటు వి.ఎ.స్మిత్ రచన 'ది హిస్టరీ ఆఫ్ ఇండియా'లోని సమాచారాన్ని సేకరించాడు. కొంతమేరకు భారతీయ విద్యాభవన్ వారి గ్రంథాల్లోని సమాచారాన్ని ఉపయోగించాడు.

ముఖ్యంగా ఈ గ్రంథంలో ప్రధాన రాజపుత్ర రాజ్యాలైన మేవారు, మార్వార్, బికనీర్, అంబర్, జైసల్మీర్, బూందీ, కోట రాజ్యాల ఆవిర్భావాన్ని, ఒక్కో రాజపుత్ర రాజు పరిపాలనా విశేషాలను, వారి కాలంనాటి సమకాలీన పరిస్థితులను సవివరంగా వర్ణించాడు. ఇది అంతకుముందు ఏ చరిత్ర పుస్తకాల్లో లేని వివరాలను అందిస్తుంది.

మేవాడు రాజ్య ఉనికిని, దాన్ని క్రీ.శ. 8వ శతాబ్దం నుండి 16వ శతాబ్దం వరకు పరిపాలించిన వివిధ పాలకులను గూర్చి, వారు చేసిన యుద్ధాలను, అల్లావుద్దీన్ ఖిల్జీ మేవాడ్‌పై రాణి పద్మిని కోసం జరిపిన దండయాత్రను, బాబర్ కాలంలో మొగల్ సైన్యాలను ఎదిరించిన రాణా సంగ్రాంసింగ్ వీరోచిత పోరాటాన్ని, అక్బర్ కాలంలో చరిత్రాత్మకమైన హాల్దీఘాట్ యుద్ధం (1576)లో మహారాణా ప్రతాప్‌సింగ్ పరాజయం, మొగల్ సేనలు జరిపిన విధ్వంసాన్ని శాస్త్రిగారు ఈ సంపుటంలోని సుమారు 143 పేజీలలో అద్భుతంగా వివరించాడు. చాలామేరకు మహమ్మద్ ఖాసీ ఫెరిష్టా రచనైన తారీఖ్ - ఇ - ఫెరిష్టా నుండి వివరాలు (ఆంగ్ల అనువాదం ఎడ్వర్డ్ & డౌసన్ రచన), బ్రిటిష్ సివిల్ సర్వెంట్ కల్నల్ – టాడ్ వ్రాసిన హిస్టరీ ఆఫ్ రాజస్థాన్ 1,2 సంపుటాల నుండి సేకరించి వ్రాసారు.

ఇదే సంపుటంలోని రెండో భాగంలో మార్వార్ రాజుల చరిత్రను వివరిస్తూ, కార్తీక మాసంలో రాజపుత్రులు జరుపుకునే లక్ష్మీదేవీ పూజ (16వరోజు) 29వ రోజు జరుపుకునే (విష్ణుమూర్తి ఆరాధన), జల్‌బాత్రి. సరస్సుకు చేరుకుని అక్కడ నీటి అలలపై దీపాలు వెలిగించి వదులుట, మొదలైన పండుగలను ఎంతో మనోహరంగా వర్ణించడం విశేషం. రాజపుత్రులు తమ మహిళలకు, స్త్రీలకు, ఆడపడుచులకు ఇచ్చే ప్రత్యేక గౌరవ మర్యాదలను పుటలు. 142,143లలో వివరించడం మరో విశేషం.

బికనీర్ రాజ్యం చరిత్రను, 3వ భాగంలో చర్చించెను. క్రీ.శ. 1469లో జోధా రాథోడ్ తన రాజధానిని 'మందోర్'నుండి 'జోద్‌పూర్'కు మార్చినాడనీ, జోధాకుమారుడైన బీకా రాథోడ్ తన పేరు మీద బీకానేర్ నగరాన్ని నిర్మించి, దాన్ని రాజధానిగా చేసుకున్నాడనీ పేర్కొన్నారు. బీకనేర్ రాజ్యంలో నివసించే వివిధ తెగలను, కులాలను గూర్చి ప్రస్తావిస్తూ జాతులు, సరస్వతీ బ్రాహ్మణులు, చరణులు, మాలీలు, మంగలివారు, చోరులు, తయోరీలు

మొదలైన కులాలను పేర్కొన్నాడు. చివరి రెండు కులాలు చనిపోయినవారికి అంత్యక్రియలు నిర్వహించేవారనీ, వారికి కూలీ 4 రాగి నాణేలు లభించేదని పేర్కొనడం ఇక్కడి ప్రత్యేకత.

ఈ గ్రంథంలో జైసల్‌మీర్ రాజ్య రాజకీయ చరిత్రను మధ్యయుగంలో రాజకీయ చరిత్రను మధ్యయుగంలో వారు పోషించిన నిర్మాణాత్మక పాత్రను చర్చించారు. 5వ పాఠ్యంలో అంబర్ రాజ్య రాజపుత్రుల శౌర్య ప్రతాపాలను, బ్రిటిష్‌వారి సహాయం ఈ రాజ్యపాలకులు పొందిన తీరును వర్ణించారు.

ఈ గ్రంథంలో పుట.3087లో ఇచ్చిన అంబర్‌కోటలోని శీలాదేవి పటం, పుట.313లో ఇచ్చిన జైపూర్ సిటీ ప్యాలెస్‌లోని చంద్రమహల్, పుట.315లో ఇచ్చిన జైపూర్ సిసోదియా ఉద్యానవనము, జైపూర్ అంబర్‌కోట, పుట 318లోని మహారాణుల సమాధులు, పుట.337లోని హవామహల్ ప్రత్యేక ఆకర్షణగా పేర్కొనవచ్చును. ఈ ఫోటోలు ఎక్కడినుండి సంపాదించారో తెలియదు.

ఈ సంపుటం చివరన బూంద్ రాజ్యం, కోట, రాజపుత్ర రాజ్యాలను పాలించిన రాజుల చరిత్రను ఆనాటి సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులను వివరించారు. ఇదేవిధంగా చేయత్‌సుది, పూల పండుగ (9రోజులు గౌరీ నవరాత్రులు), గంగోరే (వసంత ఋతువు పండుగ) మొదలైన పండుగలను వివరించాడు. ఇది మరే గ్రంథాల్లో కనబడదు.

## మరాఠా యుగం – పదునాల్గవ సంపుటం

మధ్యయుగ భారతదేశ చరిత్రలో మరాఠుల యుగానికి ఎంతో ప్రాముఖ్యత కలదు. రాజకీయంగా, హిందూ సంస్కృతి పరిరక్షకులుగా, రాజపుత్రుల అనంతరం అత్యంత పేరు గడించిన మహారాష్ట్ర ప్రజలు, వారి నాయకుడు, స్వరాజ్య స్థాపకుడైన శివాజీ చరిత్ర పుటల్లో శాశ్వత కీర్తిని గడించారు. మరాఠులు సామాన్య స్థాయినుండి, రాజ్య నిర్మాతలుగా ఎదిగినారు. మొగల్ చక్రవర్తులు ఉత్తర, మధ్య భారతంలో తమ సార్వభౌమాధికారాన్ని పటిష్టం చేసుకొన్న తరుణంలో, దక్కన్ ముస్లిం రాజ్యాల స్వాతంత్ర్యాన్ని ఔరంగజేబ్ సేనలు అంతం చేసిన తరుణంలో దక్కన్‌లో మరాఠులు ఒక ప్రబల శక్తిగా ఎదిగి, మొగల్ సేనలతో సుమారు అర్ధ శతాబ్దం మేరకు వీరోచిత పోరాటం చేసారు. శాస్త్రిగారు ఈ సంపుటంలో శివాజీ (1628-1680)కి ముందున్న మరాఠా స్థితిగతులు వివరించారు. మరాఠులను వీరజాతిగా తీర్చిదిద్దిన మరాఠా భక్తి ప్రబోధకుల పాత్రను ఎంతో ప్రశంసించారు.

శివాజీ తండ్రియైన 'షాహాజీ బోంస్లే' వీరత్వాన్ని, అతడి కుటుంబం గూర్చిన వివరాలు

పేజీ నం. 4,5లలో వివరిస్తూ షాహాజీ బోంస్లేకు ఇద్దరు భార్యల (జిజియాబాయి మరియు తుక్కుబాయి మోహితే)నీ, వీరిలో పెద్ద భార్య కుమారుడైన శివాజీ జున్నార్ నగర సమీపంలో ఉన్న ప్రసిద్ధ 'శివనేర్ కొండ' దుర్గమున 20.4.1627లో జన్మించాడనీ పేర్కొన్నారు. జిజియాబాయి పోషణలో పెరిగిన శివాజీని ఒక యోధునిగా తీర్చిదిద్దడంలో 'దాదాజీ కొండదేవ్' పోషించిన పాత్రను శాస్త్రిగారు వివరించారు. ఇదే సందర్భంగా శాస్త్రిగారు శివాజీ పెద్దగా చదవడం, వ్రాదయం నేర్చుకొనలేదనీ, కాని అతడు ఉత్తమ గుణాలను తల్లి, గురువులు, మిత్రులనుండే గ్రహించాడనీ శివాజీ హిందూ - ముస్లిం సోదరులనీ, ఈ రెండు మతాల సారం అల్లా ఏక్హై, ఏకో నారాయణో అని గ్రహించాడని పేర్కొన్నారు. ఇక్కడే మరో విశిష్ట సమాచారాన్ని పేర్కొన్నారు శాస్త్రిగారు. క్రీ.శ. 1641లో 14వ ఏట సాయిబాయి నింబాల్కర్ అనే యువతితో బెంగుళూరులో వివాహం జరిగిందని పేర్కొనడం విశేషం.

శివాజీ క్రీ.శ. 1646-1680 మధ్య కాలంలో సమకాలీన దక్కన్ సుల్తానులపై, మొగల్ సేనలపై అనేక చారిత్రాత్మక విజయాలు సాధించాడనీ పేజీ నెం. 7 నుండి 18లలో సవివరంగా వివరించారు. ముఖ్యంగా ఔరంగజేబ్ సేనాధిపతియైన రాజా జైసింగ్ సైన్యాల చేతిలో పరాజయం పొంది శివాజీ బందీ కావడం, ఆగ్రాలో ఉన్న మొగల్ చక్రవర్తిని సందర్శించడం, చక్రవర్తి (ఔరంగజేబ్) శివాజీని సభలో చిన్న మన్సబ్దార్ల వరుసలో కూర్చోబెట్టడం, దీనితో కోపోద్రేకుడైన శివాజీ, మొగల్ సార్వభౌమత్వాన్ని ధిక్కరించడం, పురంధర్ సంధి. ఆ తర్వాత జరిగిన పరిణామాలను ఏమాత్రం చారిత్రక క్రోనాలజీ దెబ్బ తినకుండా వర్ణించడం విశేషం.

శివాజీ పట్టాభిషేకోత్సవాన్ని సుమారు 4 పేజీలలో (36-40) వరకు నేటితరానికి కన్నులకు కట్టే రీతిలో వర్ణించడం శాస్త్రిగారికే సాధ్యమైందని చెప్పక తప్పదు. ఈ పట్టాభిషేకోత్సవానికి కాశీనుండి విశ్వేశ్వరభట్టు శివాజీ దర్బారుకు వచ్చెను. ప్రత్యేకంగా 11వందల మంది బ్రాహ్మణ పండితులు వారి కుటుంబాలతో 'రాయ్ఘడ్'లో నాల్గునెలల పాటు అతిథులుగా ఉండి గొప్పగా నిర్వహించారు.

శాస్త్రిగారు ఈ మరాఠుల యుగ విశేషాలను చర్చించే సందర్భంలో శివాజీ రూపొందించిన అష్టప్రధాన్ వ్యవస్థను ఆనాటి సామాజిక, ఆర్థిక, మత పరిస్థితులను చక్కగా వర్ణించారు.

శివాజీ క్రీ.శ. 30.7.1680లో మరణించగా, అతని కుమారుడైన శంభూజీ స్వరాజ్య చక్రవర్తి అయ్యాడనీ, అతని ప్రధానిగా/పీష్వాగా మోరోపంత్ పింగ్లే కుమారుడైన 'నీలోపంత్'

బాధ్యతలు చేపట్టినాడనీ పేర్కొన్నారు. శంభూజీని 1684వ మొగల్ సేనలు ఓడించి, నిర్బంధించిరి. ఔరంగజేబ్ ఆదేశాల మేరకు అతని సైనికులు శంభూజీని కండ్లు పీకించి, మసగుటి చేతివేళ్ళను ముక్కలు ముక్కలుగా నరికించి వీధికుక్కలకు వేసి, అతని మంత్రి, సేనాధిపతియైన కవి కలాష్ నాలుకను కోయించి, వారి శవాలలో ఎండుగడ్డి నింపి, కఱ్ఱలకు గ్రుచ్చి, దక్కన్‌లోని వివిధ నగరాలలో మేళతాళాలతో ఊరేగించి, మరాఠులపై మొగల్ విజయాన్ని చాటుకొని ఆనందించిన తీరును శాస్త్రిగారు ఈ సంపుటం పేజీ నెం.71లో వర్ణించిన తీరు హృదయాలను కదిలించేలా ఉంది.

పేజీ.నెం.75లో రాజారాం మరణానంతరం అతని భార్య రాణి తారాబాయి తన నాలుగేండ్ల పసిబాలుడైన రెండో శివాజీ పట్టాభిషేకం జరిపించి, అతని సంరక్షురాలిగా స్వరాజ్య పాలన బాధ్యత స్వీకరించిదనీ, మొగల్ సేనలను ధైర్యంగా క్రీ.శ. 1707 వరకు ఎదుర్కొన్నది. తారాబాయికి అన్ని విధాల సహకారం అందించిన మరాఠ యోధుల్లో పరశురాం త్రయంబక్, ధనూజీ జాదవ్, శంకర్‌జీ నారాయణ్ ముఖ్యులు. చివరికి 2.3.1707లో వృద్ధుడైన ఔరంగజేబ్ మరణించాడనీ శాస్త్రి పేర్కొనడం విశేషం. ఇంత కచ్చితంగా తేదీలను పేర్కొనడం ఏ చరిత్రకారుడు పాటించలేదు. ఆ ఘనత శాస్త్రిగారికే దక్కింది.

మరాఠుల చరిత్రలో ముగ్గురు పీష్వాల పాత్రను వారి ధైర్య సాహసాలను, మాతృదేశ రక్షణ కోసం, మరాఠ ప్రజల్లో జాతీయతా భావాన్ని పెంపొందించడానికై పీష్వా బాలాజీ విశ్వనాథ్ (1713–1720), పీష్వా బాజీరావు (1721–1740), పీష్వా బాలాజీ బాజీరావు (1740–1761)లు చేసిన కృషిని శాస్త్రిగారు సమర్థవంతంగా సుమారు 100 పేజీలలో వివరించడం మరో విశేషం.

ఇక్కడ మరో విశేషం పేజీనం 170లో పేర్కొన్నారు. క్రీ.శ. 1761–1771 వరకు పీష్వా మాధవరావు, అనారోగ్యంలో పూనా సమీపంలో 18.11.1771లో తన 28వ యేట మరణించగా, అతని భార్య 'రమాబాయి' అతనితో సహగమనం చేసినదనీ వివరించారు. దీనికి చారిత్రక ఆధారం మాత్రం పేర్కొనలేదు. బహుశ జె.ఎన్. సర్కార్ నుండి ఈ సమాచారాన్ని గ్రహించి ఉండవచ్చని గ్రహించాలి.

ఈ సంపుటంలో 'కొల్హాపూర్' రాజ్యం ఏర్పడుట (1714)లో ఆ తర్వాత తారాబాయి ఆమె వారసులు ఇక్కడి నుండి స్వతంత్రంగా పరిపాలన చేసినట్లు సుమారు 25 పుటల్లో వివరించారు. నాగపూరు భోంస్లే రాజుల చరిత్రను 'సర్ఫోజీ' భోంస్లే అతని వారసుల వివరాలను జి.ఎస్. సర్‌దేశాయి రచన 'హిస్టరీ ఆఫ్ మరాఠాస్' వాల్యూం 2 ఆధారంగా

చక్కగా వర్ణించారు. ఈ సంపుటం చివరన మరాఠా – ఆంగ్లేయుల, మరాఠా – మైసూర్ సంబంధాలు వివరించడం విశేషం.

## బ్రిటిష్ ఇండియా కంపెనీ యుగం – పదిహేనవ సంపుటం

మొఘల్ వంశంలో గొప్ప చక్రవర్తిగా కీర్తింపబడిన అక్బర్ చక్రవర్తి పరిపాలనా కాలంలో భారతదేశంలో వర్తకం కొరకు అడుగుపెట్టిన ఐరోపా సంఘాలలో బ్రిటిష్ ఇండియా కంపెనీ క్రీ.శ. 1600లో ప్రవేశించే నాటికి నెలకొన్న పరిస్థితులను చర్చించారు.

ఈ గ్రంథాన్ని శాస్త్రిగారు జె.ఎస్.మిల్ వ్రాసిన 'హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా' అనే గ్రంథాన్ని ఎల్ఫిన్‌స్టన్ రచన 'హిస్టరీ ఆఫ్ ఇండియా'ను సంప్రదించి అంతకుముందు తెలుగులో వ్రాయబడిన చరిత్ర గ్రంథాల్లో పేర్కొనబడని వివరాలు బెంగాల్ నవాబుల గురించి, మీర్ జాఫర్, మీర్ ఖాసింల గురించి వివరించాడు. ప్లాసీ (1757), బక్సార్ (1764) యుద్ధాల్లో కంపెనీ సైన్యాలు సాధించిన మోసపూరిత విజయాలను చక్కగా వర్ణించాడు.

ఇక రెగ్యులేటింగ్ చట్టం 1772-73 ప్రకారం ఈస్ట్ ఇండియా కంపెనీ వ్యవహారాలను పరిశీలించడానికై బ్రిటీష్ పార్లమెంటుచే నియమించబడిన గవర్నర్ జనరల్ అతని కౌన్సిల్ సభ్యుల గురించి, బెంగాల్ గవర్నర్ జనరల్ నియమించబడిన వారన్ హేస్టింగ్స్ కాలం నాటి పరిస్థితులను వివరించాడు. ఈ సందర్భంగా క్రీ.శ. 1765లో 'హోల్కారు' రాజ్యాన్ని పరిపాలించిన 'అహల్యాబాయి' యొక్క గుణాలను, పరిపాలనా దక్షతను, తన రాజ్య ప్రజల సంక్షేమం కొరకై అహల్యాబాయి చేపట్టిన వివిధ రైతు, వర్తక సంక్షేమ పథకాలను సవివరంగా వివరించడం విశేషం. శాస్త్రిగారు అహల్యాబాయిని ఒక వీర వనితగా, పరిపాలనావేత్తగా పేర్కొన్నారు. హోల్కారు రాజ్యాన్ని స్వాధీనం చేసుకొనడానికై వారన్ హేస్టింగ్స్ చేసిన అన్ని ప్రయత్నాలను ఆమె త్రిప్పి కొట్టింది. తన రాజ్యాన్ని రక్షించుకున్నది.

క్రీ.శ. 1793-1798 మధ్యకాలంలో, బ్రిటిష్ గవర్నర్ జనరల్‌గా భారతదేశంలో జాన్‌షోర్ పనిచేసిన కాలంలో జరిగిన పరిణామాలను, స్వదేశీపాలకుల అసమర్థతను, ప్రజల దీన స్థితిని పుట సంఖ్య 186-190 మధ్య ఎంతో హృదయ విదారకంగా శాస్త్రిగారు వివరించారు. బ్రిటిష్ ప్రధాని విలియమ్ పిట్ భారతదేశంలో ఫ్రెంచివారి పతనానికి అవసరమైన అన్ని రకాల వ్యూహాలు రచించాడనీ, బర్క్ అనే పండితుడికి 1500 పౌండ్లు పారితోషికం ఇచ్చి ఫ్రెంచి విప్లవాన్ని (1789), దాని మహోన్నత ఆశయాలను విమర్శిస్తూ ఒక గ్రంథాన్ని వ్రాయించాడని శాస్త్రిగారు పుట 186 లో పేర్కొనడం విశేషం.

క్రీ.శ.28.10.1793 లో సర్‌జాన్ షోర్ కలకత్తా చేరుకొని గవర్నర్ జనరల్ పదవీ చేపట్టినాడనీ, అతని రాకకు ముందే బెంగాల్ నవాబైన 'ముబారకుద్దీన&', 23 ఏండ్లు పాలించి మరణించాడనీ, అతనికి 12 మంది కుమారులు, 13 మంది కూతుర్లు ఉన్నారనీ, మగ సంతానంలో పెద్దవాడైన 'ఉజీరుద్దేలా' తండ్రి అనంతరం బెంగాల్ నవాబుగా బాధ్యతలు చేపట్టాడని పేర్కొన్నారు. పుట 188 లో సర్‌జాన్ షోర్ కలకత్తా నగరాభివృద్ధికై అనేక పథకాలు రూపొందించాడనీ, రోడ్ల నిర్మాణం చేపట్టాడనీ, కుట్రలు, కుటిల వ్యూహాలతో షోర్ ఆనాటి స్వదేశీ రాజ్యాలైన ఆర్కట్, అయోధ్య, రోహిల్ ఖండ్, నిజాం రాజ్యం, మరాఠాలను నిర్దాక్షిణ్యంగా బ్రిటిష్ సామ్రాజ్యానికి, బానిసలుగా మార్చినాడనీ పేర్కొన్నారు.

పుట 291 లో క్రీ.శ.1803 లో ఉత్తర భారతంలోని అనేక ప్రాంతాల్లో భయంకర కరువు సంభవించిందనీ, దీనివల్ల రైతాంగం, సామాన్య ప్రజలు నానా అవస్థలు పడ్డారనీ, బ్రిటిష్ అధికార యంత్రాంగం వీరిని కాపాడే ఏ పథకం చేపట్టలేదనీ విమర్శించారు.

ఇదే గ్రంథంలో కారన్ వాలీస్ భూమిశిస్తు విధానాన్ని, దాని ప్రభావాన్ని లార్డ్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతిని, దాని ఫలితంగా, స్థానిక పాలకులు ఏ రకంగా తమ తమ వాస్తవ అధికారాలను కోల్పోయి నామమాత్రపు రాజులుగా మారినారో చర్చించాడు.

మైసూరు రాజ్య పాలకులైన హైదరలీ, అతని కొడుకైన టిప్పు సుల్తానులు బ్రిటిష్ గవర్నర్ జనరల్‌లు అయిన కారన్ వాలీస్, వెల్లస్లీలతో జరిపిన మైసూరు యుద్ధాలను వర్ణించే సందర్భంగా హైదరలీ, టిప్పుసుల్తానుల శౌర్య ప్రతాపాలను, మాతృదేశ సంరక్షణ కొరకై విదేశీ శత్రువులను తండ్రీ కొడుకులు ఎదుర్కొన్న తీరును అద్భుతంగా వర్ణించారు.

బ్రిటిష్ గవర్నర్ జనరల్లు, సర్ జాన్ షోర్, మార్క్వెస్ వెల్లస్లీల విధానాలు ఏవిధంగ భారత ప్రజలను అన్ని విధాలుగా దెబ్బ తీసినాయో ఆధారాలతో సహా నిరూపించారు.

## బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ యుగం - పదహారవ సంపుటం

భారతదేశంలో వివిధ ప్రాంతాలపై బ్రిటిష్ కంపెనీ అధికార విస్తరణను శీఘ్రతరం చేయడంలో, భారత ఆర్థిక వ్యవస్థను బలహీన పర్చడంలో విశేష కృషి చేసిన గవర్నర్ జనరల్‌ల గూర్చి వివరించాడు. ప్రారంభంలో రంజీత్‌సింగ్ నాయకత్వంలో సిక్కురాజ్య ఆవిర్భావాన్ని చర్చించారు.

బి.యన్.శాస్త్రిగారు 1999వ సంవత్సరంలో ముద్రించిన బ్రిటిష్ అధికార వ్యాప్తిని క్రీ.శ. 1805-1857 మధ్య అర్ధ శతాబ్ద కాలంలో వివరించే 16వ సంపుటానికి 'బ్రిటిష్

ఈస్ట్ ఇండియా కంపెనీ యుగం -2'గా పేరు పెట్టారు. మొదటి భాగంలో క్రీ.శ. 1600 - 1757 మరియు 1757-1805లో భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వర్తక వ్యాపారాన్ని, బెంగాల్ ఆక్రమణకు ముందు స్వదేశీ రాజులతో చేసిన యుద్ధాలను, వారన్ హేస్టింగ్స్ కాలం నుండి సర్ జాన్‌షోర్, మార్కోస్ వెల్లస్లీల కాలంనాటి విశేషాలను వివరించిన శాస్త్రిగారు ఏమాత్రం క్రోనాలజీ తప్పకుండా రెండో భాగంలో రంజీత్‌సింగ్ (1708-1790) కాలంలో ఏవిధంగా స్వతంత్ర సిక్కు రాజ్యం స్థాపించబడిందో వివరించారు. ఆంగ్లేయులకు, సిక్కులతో జరిగిన యుద్ధాలను, వాటి ప్రభావాన్ని చర్చించారు. అఫ్ఘన్‌లతో వారి సంబంధాలను వివరించడం ఈ గ్రంథంలో మరో విశేషం.

క్రీ.శ. 1805-1857 మధ్యకాలంలో బ్రిటిష్ పార్లమెంటు ఆమోదంతో భారతదేశంలో పనిచేసిన 8 మంది గవర్నర్ జనరల్‌ల విధానాలను, ఆశయాలను, వారు స్వదేశీ సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను, విద్యా విధానాన్ని, ఇక్కడి న్యాయ వ్యవస్థ ఏవిధంగా మార్పుకు గురిచేసారో, ఈ 52 ఏండ్ల కాలంలో గవర్నర్ జనరల్‌లు, ఇక్కడి రైతాంగాన్ని, వ్యవసాయాన్ని, గ్రామీణ చేతివృత్తులను, కుటీర పరిశ్రమలను ఎలా ధ్వంసం చేసారో చక్కగా వివరించారు. ఈ క్రమంలో లార్డ్ కారన్‌వాలీస్ (1805 జులై - 1805 అక్టోబర్), సర్ జాన్ బోర్లో (1805-1807), లార్డ్ మింటో (1807-1813), మార్క్వెస్ హేస్టింగ్స్ (1813-1823), ఆడమ్స్, అమ్హరెస్టు, విలియం బెంటింక్ (1828-1835), లార్డ్ ఆక్లాండ్, లార్డ్ ఎల్లింబరో, లార్డ్ హార్డింజ్ (1844-1845), లార్డ్ డల్హౌసీ (1848-1856)ల గురించి ఎంతో విలువైన చారిత్రక సమాచారాన్ని ప్రసిద్ధ చరిత్రకారులైన గ్రాంట్ ధఫ్, జె.ఎన్. సర్కార్, హెచ్.హెచ్.విల్సన్ ల రచనలు చదివి ఆ సమాచారాన్ని తన రచనలో పేర్కొన్నారు.

లార్డ్ హార్డింజ్ కాలంలో సిక్కు రాజ్యావిర్భావాన్ని, దాని క్షీణతను, డల్హౌసీ కాలంనాటి రాజ్య సంక్రమణ సిద్ధాంతానికి బలైన స్వదేశీ రాజుల దీన స్థితిని చక్కగా వర్ణించాడు. మార్క్విస్ హేస్టింగ్ 1813 - 1823 మధ్య సుమారు ఒక దశాబ్దం పాటు భారతదేశంలో బ్రిటిష్ గవర్నర్ జనరల్‌గా పని చేసాడని వివరిస్తూ శాస్త్రిగారు అతడు భారతదేశంలో బ్రిటిష్ పార్లమెంట్ అనుమతితో క్రైస్తవ మత ప్రచారానికి అనుమతిని మిషనరీలకు ఇప్పించడంలో క్రియాశీలక పాత్ర పోషించాడనీ పేర్కొన్నాడు. పుట.119లో కచ్‌రాజ్యాన్ని బ్రిటిష్ సేనలు 1816లో ఆక్రమించిన తీరును, పిండారీలతో జరిపిన యుద్ధాన్ని (1817), పుట. 123లో కల్నల్‌టాడ్ (1782-1835) రాజస్థాన్‌లో గడిపిన ఉద్యోగ జీవిత కాలాన్ని, అతడు రూపొందించిన 'అట్లాస్ ఆఫ్ ది రాజస్థాన్' గురించి వివరించారు. ఇవి మరే తెలుగు గ్రంథాలలో కానరావు.

ఈ సంపుటం చివరన మహా విప్లవం (1857) సిపాయిల తిరుగుబాటు (1857)కు ఏవిధంగా (క్రీ.శ.1823-1857) మధ్య బ్రిటిష్‌వారు కొనసాగించిన దౌర్జన్యపూరిత, అన్యాయకరమైన దోపిడికి కారణమైందో శాస్త్రిగారు సమకాలీన కంపెనీ అధికారుల రికార్డులు, రచనలు ఆధారంగా వివరించారు.

## మహా విప్లవ యుగం - పదిహేడవ సంపుటం

భారతదేశ చరిత్రలో, మహాత్మాగాంధీ దేశ స్వాతంత్ర్య ఉద్యమ నాయకత్వాన్ని చేపట్టడానికి అరవై మూడేండ్ల ముందే భారతదేశంలో ఆంగ్లేయుల అధికారాన్ని తుద ముట్టించడానికై క్రీ.శ. 1857లో కంపెనీ సేవలో పనిచేస్తున్న 2 లక్షలకు పైగా సిపాయిలు చేసిన వీరోచిత, దేశభక్తిపూరిత ఘట్టాన్నే శాస్త్రిగారు 17వ సంపుటానికి మహా విప్లవయుగం అని పేరు పెట్టి రచించారు. ఈ గ్రంథంలో మొత్తం 11 అధ్యాయాలున్నాయి. మొదటి మూడు చాప్టర్లలో 1857కు ముందు బ్రిటిష్ పార్లమెంటు, బ్రిటిష్ ప్రధానుల సహకారంతో భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో యుద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు చేసి ఏ రకంగా ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు తమ అధికారాన్ని సుస్థిరపర్చుకున్నారో, వివరించిన తీరు ఎంతో ప్రశంసనీయం. బెంగాల్ మత సంస్కరణకు శ్రీకారం చుట్టిన రాజా రాంమోహన్‌రాయ్ గుణగణాలను, ప్రజల్లో అతనికి గల అభిమానాన్ని 9.2.1838లో లార్డ్ మెట్కాఫ్ గౌరవార్థం 'కలకత్తా టౌన్‌హాలులో ఏర్పాటు చేసిన పార్టీలో 'లీత్' అనే బ్రిటిష్ అధికారి రాజారాంమోహన్‌రాయ్ పాండిత్యాన్ని, న్యాయ వైదుష్యాన్ని సమాజశ్రేయస్సుకై అతడు చేస్తున్న కృషిని ప్రశంసించడాన్ని శాస్త్రిగారు పుట 11లో ప్రత్యేకంగా పేర్కొనడం విశేషం.

ఇదే గ్రంథంలో క్రీ.శ. 1828-1856 మధ్యకాలంలో ఈస్ట్ ఇండియా కంపెనీ, బ్రిటీష్ పార్లమెంటు అనుమతితో కొనసాగించిన మత మార్పిడులను ఆంగ్ల విద్యావిధానం ప్రవేశపెట్టడాన్ని, దాని పరిణామాలను వాస్తవంగా వివరించారు. ఈ రకమైన బలవంతపు చర్యలు భారత ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపర్చి 1857 తిరుగుబాటు రూపంలో పెల్లుబికిందని వర్ణించారు.

ఇదే గ్రంథంలో క్రీ.శ. 1857 జనవరి నెలలో కలకత్తా సమీపంలోని డమ్‌డమ్ దగ్గరలో ఉన్న బరక్‌పూర్ 34వ బ్రిటిష్ సైనిక పటాలంలో పనిచేసే భారతీయ సైనికులు, కంపెనీ అధికారులు కొత్తగా ప్రవేశపెట్టిన 'ఇన్‌ఫీల్డ్ రైఫిల్స్' ఉపయోగించే విషయంలో సిపాయిల్లో వాటిపై ఆవుకొవ్వు పూత పూసి ఉందనే వార్త ప్రాకింది. దానితో సిపాయిలు వాటిని వాడడానికి నిరాకరించిరి. మార్చి 29, 1857న 'మంగళ్‌పాండే' అనే సిపాయి

(34వ దళమునకు చెందినవాడు) బహిరంగంగా కంపెనీ అధికారులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసాడు. అతని వీరోచిత పోరాటాన్ని, మాతృదేశ విముక్తి కోసం అతడు కావించిన బలిదానాన్ని శాస్త్రిగారు పుట.91-93లలో ఎంతో సమంజసనీయంగా వర్ణించి, నేడు ఆ మూడు పేజీలు చదివినవారి కళ్ళల్లో నీళ్ళు ఆపుకోలేనివిధంగా హృద్యంగా వ్రాసారు.

ఆ తర్వాత సిపాయిల తిరుగుబాట్లు, మీరట్, ఝాన్సీ, కాన్పూర్, పంజాబ్, రాజస్థాన్ మొదలైన ప్రాంతాలకు వ్యాపించి బ్రిటిష్ పాలనకు స్వస్తి పలుకుతున్నట్లు పరిస్థితులు ఏర్పడ్డాయని శాస్త్రిగారు పేర్కొన్నారు.

ఈ గ్రంథంలోని 10వ భాగంలో (పుట.231-282) 1857 సిపాయిల తిరుగుబాటును అత్యంత సాహసోపేతంగా నడిపిన ప్రముఖ విప్లవవీరులైన బహదూర్‌షా జఫర్, ఝాన్సీ లక్ష్మీబాయి, తాంతియాతోపే, తుర్రేభాజ్‌ఖాన్ (కోఠీ రెసిడెన్సీపై దాడి 17.7.1857)ను, తెలంగాణ వెంకటయ్య (పుట.246), బళ్ళారి, దార్వార్, రాయచూరు ప్రజల పక్షాన ముందర్గ భీమారావు, అయోధ్యలో బేగు హజరత్ మహల్, అలహాబాదులో (లక్నో) మౌల్వీ అహమదుల్లా, బహదూర్ ఖాన్ (రోహిల్‌ఖండ్), కున్వార్‌సింగ్ (జగదీశ్‌పూర్) మొదలైనవారి వీరోచిత పోరాటాన్ని ఎంతో వివరంగా వర్ణించారు.

## వైస్రాయిల యుగం - పద్దెనిమిది, పందొమ్మిదవ సంపుటాలు

ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ అధికారాన్ని అంతమొందించడానికి జరిగిన 1857-58 తిరుగుబాటును బ్రిటిష్ సైనికశక్తి అణిచివేసింది. దేశభక్తి ప్రదర్శించిన అనేక యోధులు, ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. చివరికి బ్రిటిష్ మహారాణి విక్టోరియా, భారతీయులు వ్యతిరేకించిన ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనను రద్దు చేసింది. అక్టోబర్ 1, 1858 నుండి భారతదేశంపై మహారాణి ప్రత్యక్ష పాలనను ప్రకటించింది. 1772-73 నుండి కొనసాగిన గవర్నర్ జనరల్‌ల పరిపాలనను రద్దు చేసారు. దీని స్థానంలో వైస్రాయిని, అతని కౌన్సిలును నియమించారు.

18వ సంపుటంలో మొట్టమొదటి వైస్రాయ్ లార్డ్ కానింగ్ నుండి లార్డ్ రీడింగ్ (1858-1921) వరకు భారతదేశంలో బ్రిటిష్ ఇండియా ప్రాంతాలపై పరిపాలన చేసిన వారి వారి కాలంలో చేపట్టిన సంస్కరణలను వివరించిన తీరు అద్భుతం. ఈ రెండు సంపుటాల రచన కొరకు శాస్త్రిగారు మరోసారి సుప్రసిద్ధ చరిత్రకారులైన మజుందార్, మామిడిపూడి వేంకట రంగయ్య మొదలైనవారి రచనలను సంప్రదించాడు.

క్రీ.శ. 1858- 1885 మధ్యకాలంలో విక్టోరియా మహారాణి తాను చేసిన ప్రకటనలో భారతీయులకు చేసిన వాగ్దానాలను ఏవిధంగా పూర్తి చెయ్యలేదో, వివరిస్తూ, చివరికి బ్రిటిష్ ఇండియాలోని బెంగాల్, బొంబాయి, మద్రాస్ ప్రెసిడెన్సీలలో బ్రిటిష్ వ్యతిరేక సంస్థల స్థాపన, వాటి లక్ష్యాలు వివరిస్తూ, భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన (1885 డిసెంబర్), ఎ.ఒ.హ్యూమ్, దాదాబాయి నౌరోజీ, ఫిరోజ్‌షా మెహతా, గోపాలకృష్ణ గోఖలే మొదలైన కాంగ్రెస్ వాదులను, కాంగ్రెస్ ఆశయాలను లక్ష్యాలను చక్కగా చర్చించారు.

అతివాద కాంగ్రెస్ నాయకులుగా ముద్రపడిన లాల్,బాల్,పాల్ నేతృత్వం బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా, లార్డ్ కర్జన్‌కు వ్యతిరేకంగా కొనసాగిన 'వందేమాతరం' లేదా స్వదేశీ ఉద్యమాన్ని, బెంగాల్ ప్రజలు ప్రదర్శించిన ఐక్యతను, బ్రిటిష్ అధికారులు, సైన్యం చేసిన దౌర్జన్యాలను చర్చించాడు. 1857-58 తిరుగుబాటు అనంతరం మొదటిసారిగా బెంగాల్ ప్రజలు ప్రదర్శించిన ఐక్యత, దేశభక్తి బెంగాల్ విభజనను చివరికి బ్రిటిష్ ప్రభుత్వం (లార్డ్ హర్డింజ్) రద్దు చేయడం గొప్ప విజయమని పేర్కొన్నారు.

లార్డ్ రిప్పన్ (1880-1884) వైస్రాయిగా భారతదేశంలో పనిచేసిన కాలంలో చోటు చేసుకున్న పరిపాలనా సంబంధ, విద్యాపరమైన, సామాజిక, ఆర్థిక మొదలైన అంశాలను శాస్త్రిగారు చక్కగా వివరించారు. 1881లో మైసపూర్ రాష్ట్రమును, దాని రాజకుటుంబానికి అప్పగించి తన ఉదారతను చాటుకున్నాడనీ పుట.21లో పేర్కొనడం విశేషం. లార్డ్ లిట్టన్ కాలంలో ప్రవేశపెట్టబడిన 'ఇల్బర్ట్ బిల్లు'ను రద్దు చేసి ప్రజాభిమానాన్ని పొందెను. స్థానిక స్వపరిపాలన చట్టాన్ని చేసి విశేషఖ్యాతి గడించెను.

లార్డ్ రిప్పన్ 1884 సంవత్సరంలో తన పదవికి రాజీనామా ఇచ్చి బొంబాయికి వెళ్ళే దారిలో, రోడ్డుకు ఇరువైపులా వివిధ వర్గాల ప్రజలు నిలబడి అతనికి వీడ్కోలు పల్కిన తీరు అతడు బ్రతికున్నంతకాలం నెమరువేసుకున్నాడని శాస్త్రి పేర్కొన్నారు. బొంబాయిలోని నేటి మున్సిపల్ కార్యాలయానికి రిప్పన్ శంకుస్థాపన చేసాడు. బొంబాయిలోని కొన్ని వీధుల్లో అతనికి హారతి ఇచ్చి, నుదుట తిలకం దిద్దిరి. భూతేవ్వర్, ముంబాదేవి ఆలయం చెంత ఒక బ్రాహ్మణుడు వైస్రాయి నుదుట తిలకం దిద్ది అక్షతలతో ఆశీర్వదించి, వెండిపళ్ళెంలో కొబ్బరికాయలు తాంబూలం ఇచ్చి తమ ప్రేమను వ్యక్తం చేసారని శాస్త్రిగారు ఆసక్తికరంగా వర్ణించారు. భారతీయుల అత్యంత ప్రేమాభిమానానలు పొందిన బ్రిటిష్ అధికారులలో రిప్పన్‌ను మించిన వారెవ్వరూ లేరనీ శాస్త్రిగారు పేర్కొనడం చారిత్రక వాస్తవమని అంగీకరించాలి.

క్రీ.శ 1885-1905, 1905-1911, 1914-1921 మధ్య కాలంలో కాంగ్రెస్ కార్యక్రమాలు, 1906-1916 మధ్య జరిగిన ముస్లింలీగ్ కార్యక్రమాలు, 1919 మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు మొదలైన అంశాలను వివరించిన తీరు ప్రశంసనీయం. గాంధీజీ భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి నాయకుడిగా ఎదిగి, సహాయ నిరాకరణోద్యమం ద్వారా యావత్ జాతిని ఐక్యం చేసిన తీరును చర్చించాడు.

19వ సంపుటంలో 1926-1947 భారతదేశంలో వైస్రాయిలుగా పని చేసిన బ్రిటిష్ వైస్రాయిల విధానాలను, విజయాలను గాంధీజీ నేతృత్వంలో 1930-34, 1942-44 మధ్య దేశమాత విముక్తి కోసం జరిగిన శాసనోల్లంఘన సత్యాగ్రహాన్ని, క్విట్ ఇండియా ఉద్యమాలను అందుబాటులో ఉన్న అనేక గొప్ప ఆంగ్ల చరిత్ర రచనలు అధ్యయనం చేసి అనేక కొత్త అంశాలు చేర్చి వివరించారు.

లార్డ్ ఇర్విను, లార్డ్ విల్లింగ్‌టన్, లార్డ్‌లిన్ లిత్‌గో, లార్డ్ మౌంట్‌బాటన్ మొదలైన వైస్రాయిల విధానాలు, భారత జాతీయోద్యమం పట్ల వారు అనుసరించిన విధానం ఏవిధంగా జాతీయతా స్ఫూర్తికి గొడ్డలి పెట్టుగా మారిందో, సంకుచిత ఆ రాజకీయ లక్ష్యాల కోసం ముస్లింలీగ్ - జిన్నాలు అనుసరించిన ద్విజాతి, రెండు దేశాల సిద్ధాంతాన్ని చర్చించాడు. చివరికి 1947 ఆగస్టులో దేశ విభజన జరిగి నెహ్రూ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన పరిస్థితులు వివరించడం విశేషం.

## సాంస్కృతిక పునరుజ్జీనవ యుగం - ఇరవైయవ సంపుటం

భారతదేశంలో బ్రిటిష్‌వారి పరిపాలన కొనసాగుతున్న కాలంలో రాజకీయ రంగంలోనే కాకుండ సామాజిక, సాంస్కృతిక, మత, విద్యా, వైద్య రంగాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. మొఘల్, మరాఠా యుగంలో ఉన్న పరిస్థితుల్లో నూతన మార్పులు వచ్చాయి. బ్రిటిష్ గవర్నర్ జనరల్‌ల యుగంలో (1773-1857), వైస్రాయిల (1858-1947) పాలనా కాలంలో బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన కొత్త పరిపాలనా వ్యవస్థ, కొత్త సంస్కరణలు స్వదేశీ ప్రజల ఆచార వ్యవహారాలపై, ఆలోచనా విధానంపై, జీవన విధానంపై విశేష ప్రభావం చూపాయి. లార్డ్ వారన్ హేస్టింగ్స్, కారన్‌వాలీస్, విలియం బెంటిక్, డల్హౌసీ మొ॥వారి పరిపాలనా కాలంలో అంతవరకు ఉన్న సామాజిక వ్యవస్థ విచ్ఛిన్నమైందనీ, ఆంగ్లవిద్యను బెంటిక్ ప్రవేశపెట్టిన తర్వాత బెంగాల్, బొంబాయి, మద్రాస్ ప్రెసిడెన్సీలోని మధ్య తరగతి, అగ్రవర్ణాలకు చెందిన కొందరు ధనికులు పాశ్చాత్య విద్యను అభ్యసించారు.

వీరే భవిష్యత్ సంఘ – మత సంస్కరణ ఉద్యమాలను ఆరంభించారు. ఈ నేపథ్యంలోనే ఏర్పడిన బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, రామకృష్ణ మిషన్, హిందూ సమాజంలోని దురాచారాలను రూపుమాపడానికి కృషి చేసి రాజా రాంమోహన్‌రాయ్, స్వామి దయానంద సరస్వతీ, వివేకానంద ప్రజలను చైతన్యపరిచారు. నూతన ఆలోచనలకు సన్నద్ధులను చేసారు.

శాస్త్రిగారు ఇదే గ్రంథంలో స్త్రీ లస్థితిగతులను, హోదాను మెరుగుపరచడానికి కృషి చేసిన సంఘ సంస్కర్తలను ప్రశంసించాడు. ముస్లిం ప్రజానీకంలో ఉన్న మూఢాచారాలను, ఇతర దురాచారాలను రూపుమాపడానికై 'అలీఘర్' కేంద్రంగా గొప్ప విద్యావేత్త, కంపెనీ మాజీ ఉద్యోగియైన 'సర్ – సయ్యద్ – అహమద్‌ఖాన్' నెలకొల్పిన 'ఆంగ్లో – ఓరియంటల్ కళాశాల' కేంద్రంగా జరిగిన గొప్ప కృషిని శాస్త్రిగారు అభినందించడం విశేషం.

క్రీ.శ. 1774-1939 మధ్యకాలంలో బ్రిటిష్ ఇండియాలోని వివిధ ప్రాంతాల్లో ప్రారంభించబడిన ఆంగ్లంలో, స్వదేశీ భాషల్లో ముద్రించబడిన వార, దిన, మాస పత్రికలను గురించి శాస్త్రిగారు 5వ అధ్యాయంలో చర్చించిన తీరు, చేకూర్చిన విలువైన చారిత్రక సమాచారం మరే గ్రంథంలో ఒకేచోట లభించదు. 1780వ సంవత్సరంలో జేమ్స్ 'ఆగస్టస్ హిక్కీ', బెంగాల్ గెజెట్‌గా పేరు పొందిన, కలకత్తా జనరల్ అడ్వైజర్ అనే వారపత్రికను బెంగాల్‌లో ఆరంభించాడు. ఆ తర్వాత క్రీ.శ. 1785లో 'మద్రాస్ కొరియర్' (వారపత్రిక), 1789లో 'బొంబాయి హెరాల్డ్' (వారపత్రిక), 1790లో బొంబాయి కొరియర్, 1791లో బాంబేగజెట్ ఆంగ్లంలో ముద్రించబడినాయి. ఈ పత్రికలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను శాస్త్రిగారు వివరించిన తీరు అనుభవజ్ఞులైన ఆధునిక చరిత్రకారులను ఆలోచింపజేస్తుంది.

ఈ గ్రంథంలోని ఐదో అధ్యాయంలోని పుటలు 151-185 వరకు భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ముద్రించబడిన వివిధ రకాల పత్రికల గూర్చి ఎంతో విలువైన సమాచారాన్ని శాస్త్రిగారు చేకూర్చినారు. వీటిలో రామకృష్ణ మిషన్, బ్రహ్మసమాజం, ఆర్యసమాజ్‌లు ముద్రించిన పత్రికల వివరాలు ఎంతో సహజంగా వివరించారు. బొంబాయి సమాచార్, జమ్-ఏ- జమ్‌షడ్, రఫ్‌గఫ్తార్ ప్రభుత్వ విధానాలను విమర్శించినందుకు, వ్యాసాలు రాసినందుకు వారిపై ప్రభుత్వం అన్నిరకాల శిక్షలు విధించిందనీ, సంఘకర్తల బోధనలు, కృషిని అర్థమయ్యే రీతిలో సామాన్య ప్రజలకు వివరించారు. బెంగాలీ మేధావుల్లో ఒకరైన 'హరిశ్చంద్ర ముఖర్జీ' సంపాదకత్వంలో వెలువడే 'హిందూ పేట్రియాట్' పత్రిక పాత్రను లార్డ్‌కానింగ్ ఎంతో ప్రశంసించారు.

1938 లో కలకత్తాలో 20 పత్రికలు వెలువడేవని వాటిలో తొమ్మిది స్వదేశీయులు నడుపగా, మిగితా 11 పాశ్చాత్యులు ముద్రించారనీ, బొంబాయిలో మొత్తం 14 పత్రికల్లో నాలుగు భారతీయులు, పాశ్చాత్యులు 10 నడిపారనీ పేర్కొన్నారు. గుజరాతీ భాషలో 1851 లో దాదాబాయి నౌరోజీ 'దోస్తుగుఫ్తార్' అనే పక్ష పత్రిక ఆరంభించారని పేర్కొన్నారు. ఆంగ్ల భాషలో ఫ్రెండ్–ఆఫ్– ఇండియా బొంబే టైమ్స్, ఢిల్లీ గెజిట్, ఇంగ్లీష్ మాన్ ప్రధానమైందని పేర్కొన్నారు.

ఈ పత్రికలు ఆనాటి బ్రిటీష్ పరిపాలనలో ప్రజలు పడుతున్న అవస్థలను,దీనస్థితులను ఎంతో చక్కగా వివరించి ప్రజల్లో బ్రిటీష్ పాలన పట్ల వ్యతిరేకతా భావాన్ని బలోపేతం చేసాయని, ఈ పరిస్థితి 1857 తిరుగుబాటుకు కొంత మేరకు దోహదం చేసిందని పేర్కొన్నారు.

ఈ గ్రంథం చివరి అధ్యాయాల్లో శాస్త్రిగారు, భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం, క్రీ.శ. 1885–1905 మధ్యకాలంలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాల్లో చర్చించిన అంశాలు, సాధించిన విజయాలు, ఎ.ఓ.హ్యూమ్, ఢఫ్రిన్‌ల అనంతరం బ్రిటిష్‌వారు భారత జాతీయ కాంగ్రెస్‌పట్ల అనుసరించిన విధానాన్ని చర్చించారు.

ఈ సంపుటం నెం. 20కి బదులుగా 19 ఉండి ఈ వివరాలు 19వ సంపుటంలో కూర్చి, 19వ సంపుటం (క్రైస్తవయిల యుగం రెండో భాగం) వివరాలు ఇప్పటి 20వ సంపుటంలో చర్చించి ఉంటే, చరిత్ర రచనా పద్ధతిలో క్రోనాలజీని అనుసరించి రచించినట్లు ఉండేది.

## సంస్థానాల యుగం -1 - ఇరవై ఒకటవ సంపుటం

ఈ సంపుటంలో శాస్త్రిగారు 1947లో దేశ విభజనకు ముందు, బ్రిటిష్ ఇండియా అంతర్భాగం కానటువంటి స్వదేశీ సంస్థానాలలో అతి పెద్దదైన హైద్రాబాద్ సంస్థానం లేదా నిజాం రాజ్యం గురించి, నిజాం రాజ్యం ఏ పరిస్థితుల్లో (క్రీ.శ. 1724) నెలకొల్పబడిందో వివరించారు.

ఈ గ్రంథంలో మొత్తం 13 అధ్యాయాలున్నాయి. 'ఆసఫ్‌జాహీ'ల పూర్వీకుల చరిత్రను, నిజాం ఉల్ – ముల్క్‌చే స్వతంత్ర హైద్రాబాద్ రాజ్యస్థాపన, (క్రీ.శ. 1724–1748) మధ్యకాలంలో అతడు సాధించిన విజయాలను, మొఘల్ చక్రవర్తులతో అతని సంబంధాలను విశ్లేషించాడు.

ముఖ్యంగా ప్రసిద్ధ నిజాం ప్రభువులైన నిజాం అలీఖాన్, సికందర్‌షా, నాసిరుద్దౌలా, అఫ్జలుద్దౌలా మీర్ మహబూబ్ అలీకాన్, మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ల చరిత్రను, వారి వారి కాలంనాటి విశేషాలను అనేక ఆంగ్ల ఉర్దూ గ్రంథాలను అధ్యయనం చేసి వ్రాయడం విశేషం.

చివరి అధ్యాయంలో నిజాం రాజ్యంలోని గోందురాజుల చరిత్రను వివరించిన తీరు శాస్త్రిగారి పాండిత్యానికి, సత్యాన్నే వెదికి రాయాలన్న తపనకు చక్కటి నిదర్శనంగా పేర్కొనవచ్చు.

ముఖ్యంగా గోందుల రాజకీయ చరిత్ర, సాంఘిక వ్యవస్థ, న్యాయ వ్యవస్త, గ్రామాధికారుల విధులు, అధికారాలు మొదలైనవి సవివరంగా చర్చించారు. గోందురాజుల వంశవృక్షాన్ని వివరించాడు. ఇది మరే చరిత్ర గ్రంథంలో లేదు. ఇటీవల కాలంలో భుక్యాభంగ్యా అనే చరిత్రకారుడు రచించిన The roots of the periphery - A History of the Gonds of Deccan India (Oxford 2018) శాస్త్రిగారు ఈ సంపుటంలోని వివరాలను ఎంతో ప్రశంసించారు.

**డా. జి. అంజయ్య**

అసోసియేట్ ప్రొఫెసర్, చరిత్ర శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఫోన్ : 96529 73499



# కాశీఖండం - దాని ప్రాశస్త్యము

"నిండుమనంబు నవ్య నవనీత సమానము......" అన్న అల్లసాని వారి పలుకులకు నిలువెత్తు నిదర్శనమైన మహా పురుషులు ఇద్దరున్నారు. ఒకరు శ్రీనాథ మహాకవి, మరొకరు భిన్నూరి నరసింహ శాస్త్రి శాసన సుకవి. వారు కవిత్వం రాసిన వారైతే, వీరు కవిత్వపు లోతు తెలిపిన వారు.

చరిత్ర తెలపడం కోసం శాసనం ప్రధాన ఆధారం. శాసనంలో ఏముందో తెలియాలంటే, అది మన వద్దకు నడుచుకుంటూ రాదు, తనలో విషయమేమిటో చెప్పదు. శాసనమున్న చోటుకు మనమే వెళ్ళాలి. శిలాక్షరాలకు బ్లాటింగ్ పేపరు, సుద్దముక్కల పొడి, బొగ్గు పొడి ఇలా ఎన్నో విధాల వాటికి ప్రాణం పోయాలి. శాసనాలలోని భాష వేరు, లిపి వేరు. అది తెలిస్తే చరిత్రను నిర్మించవచ్చు. తుమ్మలగూడెం శాసనాల ద్వారా విష్ణుకుండినులు, తెలంగాణ ప్రాంతంలోని ఇంద్రపాలనగరాన్ని రాజధానిగా చేసుకుని ఆంధ్రదేశాన్ని పరిపాలించినట్లుగా ఒక కచ్చితమైన, సాక్ష్యాధారాల ద్వారా తెలంగాణ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన వారు భిన్నూరి శాసనాల శాస్త్రి గారు.

ఆరడుగుల దేహం, బక్క పలుచని రూపంతో, పొడవైన ముక్కు, తీక్షణమైన కన్నులు అపారమైన విద్యా సంపదను సమకూర్చుకోవడంలో శిథిలమై తెల్లనైన జుట్టు, పొడవు చేతుల జుబ్బా, నిరాడంబరతకు నిలువెత్తు రూపం, ఇల్లంతా పుస్తకాలతో, రాగి రేకులతో - అదే అపారమైన ఆస్తిగా భావించే హుందాతనం, మాటలలో కచ్చితత్వం, మనసంతా కరుణ రసం - అచ్చుగా పోస్తే వారు భిన్నూరి నరసింహ శాస్త్రి గారు. "నా పేరు నారాయణ

మూర్తి అని నన్ను పరిచయం చేసుకుంటే వెంటనే, కోలవెన్ను మలయవాసిని గారి గ్రంథం వెతికి తెచ్చి ఇచ్చిన వారు. ప్రేమతో వారి మూసీ కుటుంబంలో నాక్కూడా కొంత చోటు కల్పించి వందలాది వ్యాసాలు, వారి ద్వారా ప్రచురింపజేసిన వారు, స్వర్గంలో ఇప్పుడు శ్రీనాథుడితో వీరభద్రా రెడ్డి గారి వంశ చరిత్రలపై రెడ్డి రాజుల సర్వస్వ ముక్తాయింపుగా చర్చిస్తూ ఉంటారు.

తెలుగు పైన పట్టు ఉండడంతో పాటు, శబ్ద సౌందర్యం తెలిసిన వారికే సీస పద్య రచనలో నైపుణ్యం ఏర్పడుతుంది. పద్యాన్ని అలవోకగా అల్లుతూ, సంపూర్ణ ధిషణతో కావ్య చరిత్రలో తానైన ఒక యుగాన్ని సృష్టించిన మహాకవి శ్రీనాథుడు. శ్రీనాథుని కావ్య ప్రపంచంలో మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, శృంగార నైషధం, భీమఖండం, కాశీఖండం, హర విలాసం, శివరాత్రి మాహాత్మ్యం, పలనాటి వీరచరిత్ర, క్రీడాభిరామం(!), పండితారాధ్య చరిత్ర, మానసోల్లాసం, ధనంజయ విజయం, నందనందన చరిత్రం, కాటమరాజు కథ మొ॥నవి ఇంకా ఎన్నో ఉన్నాయి.

వీటిలో **"కాశీ ఖండము – దాని ప్రాశస్త్యము"** అనే పేరిట, మన శాసనాల శాస్త్రిగారు, కాసేపు తన శాసనాల ప్రియత్వాన్ని పక్కన పెట్టి, చరిత్ర పైన మక్కువతో, వీరభద్రారెడ్డి కాల నిర్ణయం కోసం చేసే కృషిలో ఒక భాగంగా ఈ గ్రంథమును రచించారు. శ్రీనాథుని ప్రశస్తి లోకం పట్టరానిది. శాస్త్రిగారి మనసు 'లోనారసి' చూసేది. కాశీఖండమయ:పిండమన్న వాక్కు ఎంత సత్యమో తెలుపుటకై మహాకవి కావ్య రచన చేస్తే, శ్రీ శాస్త్రి గారు దివిటీతో ఆ కావ్య సమీక్ష చేశారు.

## అసలేమిటీ కాశీఖండం!

పద్దెనిమిది పురాణాలలో స్కంద పురాణం పదకొండవది. ఇందులోని యాభై అయిదు ఖండాలలో కాశీఖండమొకటి. సుమారొక పన్నెండు వేల శ్లోక సముదాయమైన ఈ విశ్వేశ్వర కథా పూర్వక కాశీక్షేత్ర మాహాత్మ్యమును 1777 గద్య పద్యాలతో, ఏడు ఆశ్వాసాలలో, మూలంలోని స్వారస్యం చెడకుండ, లౌకిక విషయాలను సమయానుకూలంగా జోడించి, శివతత్త్వ ప్రతిపాదన చేసినవాడు శ్రీనాథ మహాకవి. కాశీక్షేత్ర మహిమ వర్ణన ఇందులోని విషయం.

## కాశీఖండమయ:పిండం

జీర్ణం కావాలంటే పదార్థం సులభంగా నములుటకు వీలుగా, తగిన రస పరిపుష్టితో ఉండాలి. ఇనుపగుండులోని ఇనుపరజను మధ్య ఉన్న శూన్యం వేడెక్కి ఆ వేడిని ఇనుపరజను

కణాలకు అందజేయడంతో గుండు మొత్తం వేడి అవుతుంది. అగ్ని ఉనికి ఎక్కడ? అంటే గుండు మొత్తం అనాలి. కాశీఖండమంతా అలాంటిది. ఇది ప్రౌఢ కావ్యం. భాష జటిలం. వ్యాకరణవేత్తలకు, సందర్భోచిత ఉదాహరణలకై ఈ కావ్యమే సర్వదా గ్రాహ్యం. లక్షణసార సంగ్రహంలో తిమ్మకవి, ఈ కావ్యంలోని 70 పద్యాలను ఉదాహరించాడు. అప్పకవి అనేక పద్యాలను స్వీకరించాడు. మచ్చుకు :

శ్రీనాథుడే స్వయంగా గ్రంథాదిలో **"ప్రాయమింతకు మిగుల గ్రైవాలకుండ, గాశికా ఖండమను మహాగ్రంథమేను దెనుగు జేసెద..."** అని చెప్పాడు. అయితే మూలంలోని అంశాలను యథాతథంగా అనువదించలేదు. సంపూర్ణ స్వతంత్రత వహించి అనేక ఇతర శాస్త్ర విషయ చర్చ చేశాడు. సాముద్రికశాస్త్రం, యోగశాస్త్రం, మంత్రశాస్త్రం... ఇలాగ అనేకం పొందుపరచడం చేత అది అయఃఖండమే అయింది. శ్రీనాథుని కవితా శైలికి, పాండిత్య ప్రతిభకు ఈ గ్రంథం నిదర్శనమై సంస్కృత కాశీఖండం కన్నా శ్రీనాథ కృత కాశీఖండమే నిజంగా అయఃపిండమన్న రూఢి, నానుడిగా మారింది. ఈ విషయాన్నే శాస్త్రిగారు వివరిస్తూ **"కాశీఖండముపై మయూరకృత సూర్య శతకము, వాల్మీకి రామాయణము, ఉత్తర రామ చరిత్ర, విశాఖదత్తుని ముద్రా రాక్షసము, భట్ట గోపాలుని సాహిత్య చింతామణి మొదలగువాని ఛాయలున్నాయి కనుక సంస్కృత కాశీఖండముకన్నా శ్రీనాథకృతమే అయఃపిండమని"** వివరించారు. అలాగే, అయఃపిండమన్న మాట శ్రీనాథ రచనకే తగినదని, ఈ రచనను అనుసరించే లోకంలో ప్రచారమైనదని అనేది, శాస్త్రిగారి మాట.

శాస్త్రిగారు రెడ్డిరాజ్య సర్వస్వ రచన చేసినవారు. కాశీఖండ ప్రాశస్త్య రచన చేసేనాటికే వారి మనసులో సర్వస్వ రచనకై బీజావాపనం జరిగిందేమో!. కాశీఖండం, రాజమహేంద్రవర పాలకుడు, విజయనగర సామంతుడైన వీరభద్రారెడ్డికి అంకితం ఇవ్వబడింది. ఇతడు అనితల్లి భర్త మరియు అల్లయ వేమారెడ్డికి సోదరుడు, కవి పండిత పోషకుడు. 1423 నుండి 1447 వరకు పరిపాలించినట్లు శాసనాధారాలతో శాస్త్రిగారు నిరూపించారు. కపిలేశ్వర గజపతి రెడ్డిరాజ్యంపై దండెత్తడంతో నాటి పరిస్థితులు తలకిందులయ్యాయి.

నాటి విజయనగరాధీశుడు ప్రౌఢదేవరాయలు తన మిత్రుడు, సామంతుడైన వీరభద్రారెడ్డికి, సాయం చేయడం కోసం సైన్యం పంపినప్పటికీ ఆలస్యమైంది. కానీ వీరభద్రారెడ్డి చరిత్ర, దైవభక్తి తత్పరత, శివభక్తి పారమ్యం అంతా కూడా గ్రంథస్థం కాబడి, శ్రీనాథుడి ద్వారా చరిత్రకెక్కింది అని శాస్త్రిగారి భావన. రెడ్డిరాజులు శైవమతావలంబులు. ఘోడెరాయ గంగయ దేవుడగు శివాచార్యుడు వీరభద్రారెడ్డి గురువు. శ్రీనాథుడు స్వయంగా శైవమతస్థుడు

కనుక కాశీఖండ రచన అద్భుతంగా సాగింది. వీరభద్రారెడ్డి ప్రతిస్పర్థి అయిన కొండవీటి ప్రభువాస్థానంలో ఉన్న శ్రీనాథుడు బెండపూడి అన్నామాత్యుని సాయంతో (భీమఖండం ఇతనికి అంకితమివ్వబడింది). వీరభద్రారెడ్డి ఆస్థానం చేరాడు.

## శాస్త్రిగారి రచన

శ్రీనాథుడు సంస్కృతాంధ్ర కాశీఖండము, కాశీఖండము – వీరభద్రారెడ్డి (రాజకీయ పరిస్థితులు, మత వాతావరణము, కాశీఖండ రచనాభిలాషము, కాశీఖండ రచనాకాలము, కృతికర్త / కృతిభర్త, గ్రంథ రచనా విధానం, కృతిపతి వంశ వర్ణనము, కాశీఖండ ప్రశంస, ఆశ్వాసములు, కాశీఖండము అనువాద వైఖరి, శ్రీనాథుని కవితలో ప్రజాహిత దృష్టి, అలంకారములు, కాశీ ఖండము – భక్తి శృంగారము, శ్రీనాథుని శాస్త్రజ్ఞత, శ్రీనాథుని కవిత్వము – కాశీఖండము, శైలి, ప్రకృతి వర్ణనములు అనే పన్నెండు ప్రధాన శీర్షికలతో పలు ఉప శీర్షికలతో ఒక సిద్ధాంత పరిశోధన గ్రంథ రూపంతో నేటి కాలపు విద్యార్థులకు కరదీపిక వలె ఉన్నది. ప్రధాన అంశాన్ని ఎలా విభజించుకోవాలో, ప్రస్తావిక అంశాన్ని ఎలా సమర్థించుకోవాలో, పరిశోధనాంశాన్ని ఎలా ఉప శీర్షికలుగా విభజించి, ప్రధాన అంశం పక్కదారి పట్టకుండా చూసుకోవాలో ఆ గ్రంథం చదివితే తెలుస్తుంది.

## శ్రీనాథుని రచన

వింధ్య మేరు పర్వతాల మధ్య నారదుడు కలహం కల్పించడంతో ప్రధాన కథ ప్రారంభమవుతుంది.

1. మొదటి ఆశ్వాసంలో అతిథి సత్కార లక్షణాలు అగస్త్య వింధ్య పర్వత సంభాషణా సందర్భంలో అద్భుతంగా తెలియ పరచాడు. శాస్త్రాన్ని గురు ముఖత: అభ్యసించాలి, విషయాన్ని సమూలంగా గ్రహించాలి, సాహసంతో సంకల్పాన్ని సాధించాలి, శత్రువులపై విజయాన్ని సాధించాలి, అలాంటి వాడే మనిషి అని పిలవబడతాడని తన ధిషణ ప్రదర్శించాడు.

2. ఇక రెండవ ఆశ్వాసంలో అగస్త్యుడు కాశీని విడువవలసి వస్తుంది. కాశీని విడవడం అంత సులభం కాదు. శరీరంలోని సర్వ ఇంద్రియాల నుండి ఒక్కొక్కచోట నుండి ప్రాణం కదిలి, మూల కూకటివేళ్లు కదిలించి, పెకిలించి, బయటకు వస్తుంది. అంత వేదన ఈ శరీరానికి కలుగుతుంది. మొదటి ఆశ్వాసంలో అన్నంపెట్టిన అన్నపూర్ణమ్మ కాశీని విడవ వలసిందేనని ఆజ్ఞాపించిన నేపథ్యంలో, ఈ రెండవ ఆశ్వాసంలో :

**"పరమ కల్యాణి! యో భాగీరథీ గంగ**

**వార్ధిభామిని! పోయివత్తునమ్మ...** అంటూ గంగ, ఇంద్రాది దేవతలు, విశాలాక్షి, కాశీ రక్షక దేవతలు, తీర్థసంవాసులు, పాశుపతులు, మందిరోద్యాన వాటికా మఠాలలోని వారు... ఇలా పేరు పేరునా వారికి వెళ్లొస్తానని చెప్పే పద్యాలు చదువుతుంటే మనకు హృదయం ద్రవిస్తుంది. నాతో పాటొస్తారా? అని అడిగి, "మీరెందుకొస్తారులే!" అనడం, నిష్ఠూరోక్తులాడడం, వియోగబాధను ప్రకటించినప్పుడు మనకొక తాదాత్మ్యత కలుగుతుంది. ఆ సాహచర్య వియోగబాధను మనమూ అనుభవిస్తాము.

అగస్త్యలోపాముద్రలు కాశీని వదిలే సమయంలో బృహస్పతి లోపాముద్రతో ప్రసక్తాను ప్రసక్తంగా స్త్రీ ధర్మాలు, దుష్ట స్త్రీ లక్షణాలు, పతివ్రతా మహాత్మ్యాలు వర్ణిస్తాడు. ఇవి నేటి కాలానికి అత్యంతానుసరణీయాలు.

తృతీయాశ్వాసంలో కూడా ఇటువంటి ధర్మబోధలు అనేకం ఉన్నాయి. స్త్రీలను, గోవులను, అనాథలను హింసించే వారిని యముడు ఏవిధంగా రక్షిస్తాడో ఉంది.

చతుర్థాశ్వాసంలో శివశర్మ కథ ప్రసిద్ధి పొందింది. కాశీఖండం భక్తి శృంగార రస సంభరితమనే లక్షణం ఈ ఆశ్వాసంలో నిరూపించబడుతుంది.

**"బాటలిమంబు మేన పరిపాటి వినోదన వేళ బార్వతీ**
**పాటల గంధి చారు పద్మ నఖంబుల క్రొత్తలత్తుకన్...."**

పార్వతీ పరమేశ్వర వినోద పదకళ పార్వతి యొక్క పాద నఖములకున్న పచ్చి పారాణి లత్తుక – శివుని శిరసున ఉన్న చంద్రుని కంటుకొనడం వల్ల ఆ చంద్రుడు, పాటల వర్ణం పొందాడని వర్ణించడంలో శ్రీనాథుని రసజ్ఞత ఆకాశమంటింది.

ఈ ఆశ్వాసంలో బ్రహ్మాండలోకాల వర్ణన భాగవతంలోని రెండవ స్కంధ విధానాన్ని పోలి ఉంటుంది. శనైశ్చర లోకవర్ణన శ్రీనాథకవికే ప్రత్యేక సాధ్యాంశం. ఇక గుణనిధి కథ ప్రపంచ ప్రసిద్ధం.

అయిదవ ఆశ్వాసంలో కుమారాగస్త్య సంవాదం, వారణాసి నామం నిర్వచనం, మణికర్ణికా మాహాత్మ్యం, కాశీతీర్థ మాహాత్మ్యం, జ్ఞానవాపికా తీర్థ మాహాత్మ్యం ఇలా అనేకం ఉన్నాయి. కళావతి కథ సుప్రసిద్ధం.

ఆరవ ఆశ్వాసంలో బ్రహ్మాది దేవతలు కాశీ చేరడం, దివోదాస వృత్తాంతం,

వృషభధ్వజావిర్భావం, అనేక శివస్వరూపాదుల ఆవిర్భావ కథనాలు అనేకం ఉన్నాయి. కృత్తివాస, కలహంస తీర్థాదుల మహాత్మ్య కథనాలు ప్రత్యేకం. ఇక చివరి ఏడవ ఆశ్వాసంలో అనేక చిన్న కథలున్నాయి. వ్యాసుడు కాశిని శపించడం, వ్యాస కాశీ వర్ణన, కాశీ యాత్రా విధానం, కాశీ క్షేత్ర మహిమలు ఇలా ఎన్నో ఈ ఆశ్వాసంలో చోటు చేసుకున్నాయి.

## పేరుపొందిన కథలు

చతుర్థాశ్వాసంలోని గుణ నిధి కథ చాలా ప్రసిద్ధి పొందింది. కాంపిల్య నగరంలోని యజ్ఞదత్తుడు వేదవేత్త. అతడి కొడుకు గుణనిధి. చెడు సహవాసాల కారణంగా ఇంట్లోంచి వెడలగొట్టబడి, ఒక శివరాత్రి నాడు ఆకలితో ఉపవాసం చేసి, దొంగతనం చేయడం కోసం దీపం వెలిగించి, ఆ పిమ్మట మరణించినా అతనికి మోక్షం లభించింది. కాశీ నివాసం అటువంటిది.

**శివధర్మంబతి సూక్ష్మము**
**శివధర్మము లేశమైన సిద్ధించినచో**
**వివిధ మహాపాపోప**
**ద్రవములు చేరంగరావు ధన్యుని నతనిన్**

**ఇక సుశీల కథ.** కాశీనగరంలో హరిస్వామి కూతురు సుశీల. ఒక విద్యాధరుడు ఆమెను మోహించి వెంట తీసుకుపోతుండగా, ఒక రాక్షసుడు వాడితో యుద్ధం చేశాడు. అందులో ఇద్దరూ మరణించారు. సుశీల విద్యాధరునితో సహగమనం చేయదలచింది. చితి పేర్చుకుని అగ్ని ప్రవేశం చేసింది. ఆమెకు ఉన్న శివభక్తి, భారతీయ సంస్కృతిపై మమకారం, పతితోడిదే ధర్మమన్న స్త్రీత్వ ధర్మ నియమాలు, పతివ్రతా లక్షణాలు అనేకం వర్ణింపబడ్డాయి.

వీటితోపాటు బుధుడి కథ, ధ్రువుడి కథ, కద్రూ వినతల కథ ఇలా ఎన్నో కథలున్నాయి.

## శాస్త్రిగారి దృష్టి

**కాశీఖండము - దాని ప్రాశస్త్యము** అనే ఈ పుస్తకము ఈనాటికాలంలో వస్తున్న అనేక పరిశోధన గ్రంథాల కన్నా దీటైనది. "నానాటికి తీసికట్టు..." అన్న పద్ధతిలో నేటి పిహెచ్.డి సిద్ధాంత గ్రంథాలు వస్తున్నాయి. చదువరులకు శిరోభార చందంగా పిష్టపేషణరీతిలో వెలువడుతున్న ఈ గ్రంథ రచయితలందరూ తప్పక చదవవలసిన గ్రంథమిది.

శ్రీనాథుని భాషా పరిశీలన అనే ఉపశీర్షిక చేర్చిన పక్షంలో ఈ గ్రంథం మహా గ్రంథమైపోయేది. యూనివర్సిటీల వారు ముక్కున వేలేసుకునేవారే! శ్రీనాథుడంతటి భాషావేత్త. సంప్రదాయ సాహిత్యంలో మార్గ కవిత్వ పంథాను అనుసరించిన మహాకవి, కవి సార్వభౌముడు, బ్రహ్మీదత్త వరప్రసాదుడు, ఈశ్వరార్చన కళాశీలుడు.

**"సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య**
**భాషా పరిజ్ఞాన పాటవంబు**
**పన్నగపతి సార్వభౌమ భాషిత మహా**
**భాష్య విద్యా సమభ్యాసబలము**
**నక్షపాద కణాద పక్షిలోదీరిత**
**న్యాయ కళా కౌశలాతిశయము**
**శ్రుతి పురాణాగమ స్మృతి సాంఖ్య సిద్ధాంత**
**కబళన వ్యుత్పత్తి గౌరవంబు**
**పూర్వకవి ముఖ్య విరచితాపూర్వ కావ్య**
**భావరస సుధాచర్వణ ప్రౌఢతయును**
**గందళింపంగ గాశికా ఖండ నైష**

**ధ ప్రముఖ వివిధ ప్రబంధములొనర్చి"** నటువంటి మహాకవి శ్రీనాథుని విజ్ఞాన విస్తృతి ఎంతని పేర్కొనగలము! శ్రీనాథుని భాషాధిషణాధిక్యతకు నిలువుటద్దం కాశీఖండం. కృత్తద్ధిత ప్రత్యయాది మార్పులు, సామాన్య, సంశ్లిష్ట సంయుక్త ధాతు నిర్మాణాదులు, సంయుక్తాసంయుక్త సమాపక క్రియలు, అకర్మక, సకర్మక ప్రేరణార్థక క్రియా విశేషాదులు, పదకల్పనలు... ఇదొక శ్రీనాథ పద ప్రపంచం. నేటి తెలంగాణపు మాండలిక పదజాలం కూడా కాశీఖండమందున్నది. వెతికినవారికే వజ్రాలు లభిస్తాయి. "నరత్నమన్విష్యతి మృగ్యతేహితత్".

## కొన్ని పోలికలు

| **శ్రీనాథుడు** | **శాస్త్రిగారు** |
|---|---|
| 1. ప్రభుత్వ మన్ననలు పొందినవాడు | 1. ప్రభుత్వాధికారుల గౌరవాలు పొందినవాడు |
| 2. సునిశిత పాండిత్య ప్రకర్ష | 2. సూక్ష్మ పరిశీలనాశక్తి వీరి స్వంతం |
| 3. బహు గ్రంథకర్త | 3. వ్రాసిన గ్రంథాలకు లెక్కలేదు |

4. తీక్షణ ప్రవృత్తితో రాజలాంఛనాలు కూడా తోసిరాజనే స్వభావం

4. నమ్మినదానిని కాదంటే డాక్టరేటు సైతం వద్దన్న ధిషణ

5. అపార శివభక్తిపరుడు

5. అమ్మకై ఆలయం కట్టినవాడు

6. గృహ్యాసూత్రాలను తన రచనలలో చొప్పించాడు

6. గృహధర్మాలను, అతిథి అభ్యాగతులను ఆదరణతో ఆచరించినాడు

7. అంత్యకాలంలో ధనం లేకపోయినా పాండిత్య ప్రకర్షతో

7. అపార బంధుగణమే ధనంగా జీవించినవాడు, సగర్వంగా బతికినవాడు.

"ధనాన్ని తృణప్రాయంగా తలిచినవారు వీరిద్దరూ".

ఒక వ్యాసం ఎలా రాయాలో తెలియాలంటే శాస్త్రిగారి రచనలు చదవాలి. ముఖ్యంగా నేటికాలంలో తెలుగుశాఖలో సిద్ధాంత పరిశోధనలు చేస్తూ ప్రామాణికమైన వ్యాసాలు రాద్దామనుకునేవారంతా తప్పక చదవవలసిన ఉత్తమ గ్రంథం ఇది. ఈ గ్రంథాన్ని విస్తృతపరిస్తే ఒక పరిశోధనా గ్రంథమై విశ్వవిద్యాలయ నియమాలకు లోబడి పిహెచ్.డి. పట్టా ఇవ్వవలసి ఉంటుంది. అట్లాగా అనుకున్న పక్షంలో శ్రీ భిన్నూరి నరసింహశాస్త్రిగారికి వందకు పైగా పిహెచ్.డిలు ఇవ్వవలసి ఉంటుంది. శాసనాల శాస్త్రిగా పేరుపొందిన శ్రీ బి.యన్.శాస్త్రిగారు నిజానికి ఒక కదిలే విశ్వవిద్యాలయం. అంత పెద్ద హృదయమున్నవారు. అక్కడ ఇప్పుడు ఇంద్రుడి సభలో తప్పక శ్రీనాథుడితో చమత్కార సంభాషణలు చేస్తూ "విశ్వేశ్వర దర్శనం చేయాలంటే కాశీ వెళ్ళాలా?"

**"మనం కాశీకి వెళ్ళాలా?**

**లేక మనమున్నచోటునే కాశీ చేయాలా?"** అని వాదనలు చేస్తూంటారని నా ప్రగాఢ విశ్వాసం.


డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, తెలుగు శాఖ అధ్యాపకులు, బి.జె.ఆర్. కళాశాల, హైదరాబాద్.

ఫోన్ : 807 412 0421



# శాసనములలో తెలుగు భాషా పరిణామము

ఈ పరిశోధన గ్రంథము పంద్రెండు అధ్యాయాల సంపుటి. అనుబంధంగా శాసనముల పట్టిక జతపరచడమైనది.

మొదటి అధ్యాయము శాసనములు వాటి ప్రాముఖ్యము వివరించడమైనది. కాలక్రమానుగతంగా శాతవాహనుల నుండి వివిధ రాజవంశాల కాలములో వెలువరింప బడిన శాసనముల వారీగా అధ్యయనము కొనసాగినది. తొమ్మిది అధ్యాయములలో శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, ఆనందగోత్రికులు, బృహత్ఫలాయనులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, కళింగులు, రేనాటిచోళులు, చాళుక్యులు, చాళుక్య చోళులు, కాకతీయులు, రెడ్డి, వెలమ పద్మనాయకులు, విజయనరగర రాజులు, గజపతులు, గోలకొండ నవాబులు, నాయకరాజులు, మొగలు వంశీయులు నాటి భాషను అధ్యయనము చేయడానికి ప్రణాళికాబద్ధముగా చేసిన పరిశోధన.

చివరి అధ్యాయములో శాసనములలో ఉపయోగించిన ఛందస్సుపై చర్చ సాగినది.

మొదటి అధ్యాయములోని విషయాలు తెలుగుభాష, సాహిత్య విద్యార్థులకు అంతగా తెలియనివి. చరిత్ర పరిశోధకుల ద్వారా తెలుసుకోగలిగినవి. భారతదేశంలో శాసనాలు ప్రారంభమైన విధానం, క్రీస్తుపూర్వం నుండి శాసనాలు వాడుక భారతదేశంలో ఉన్నది. స్మృతులలో శాసనాల గురించిన చర్చ ఉన్నది. శాసనాలు ఏర్పడటానికి గల కారణాలు, శాసనాలలో ఉండవలసిన తప్పనిసరి అంశాల వంటివి చర్చితమైనాయి.

గౌతమబుద్ధుని కాలము నుండి శాసనాలు ఉన్నట్లు పరిశోధనలు తెలుపుతున్నాయి. ఉత్తర భారతం కన్నా దక్షిణ భారతంలో శాసనాల సంఖ్య అధికము వంటివి ఈ పరిశోధనా గ్రంథంలో చదివినపుడు ఆశ్చర్యం కలుగుతుంది. అందునా ఆంధ్రదేశమున నున్న శాసనము లసంఖ్యాకములు.

శాసనములు శిలలపైన, వెండి, ఇత్తడి, బంగారు రేకులపైన చెక్కబడేవి. బౌద్ధమత వ్యాప్తిలో శిలలపైన శాసనాలు చెక్కబడేవి. శాసనాలు చరిత్ర రచనకు అత్యంత ప్రామాణిక మైనవి. శాసనాలు చరిత్ర రచనకే కాక భాష క్రమాభివృద్ధిని తెలుసుకొనుటకు అత్యంత ఉ పకారి. తెలుగులో లిఖిత వాఙ్మయం నన్నయ నాటినుండే లభిస్తున్నది. అంతకు ముందున్న తెలుగు భాష పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి, తెలుగు భాషా వికాసానికి శాసన అధ్యయనం అత్యంత ఆవశ్యకం.

ఒక దానము చేసినప్పుడు అది ముందు వచ్చు రాజులకు, వారి ఉద్యోగులకు తెలియాలి. కనుక ఆ విషయాలు ఖిలము కాకుండా ఉండాలంటే "లేఖ్యము"ను (లేఖ్యము లనగా రాయదగినవి అనగా పత్రములు). కార్పాసకపటము (నూలుబట్ట) లేదా తామ్రఫలకము (రాగిరేకు) వంటి వాటిపై వ్రాయవలెను.

అట్టి లేఖ్యములో -

1. రాజవంశమువారిని (ప్రపితామహ, పితామహ, పితరులను) తనను
2. పరిగ్రహీతను (తండ్రికి)
3. దానమొసంగిన భూమి వర్ణనము, దాని పరిణామము
4. శకనృపాతీత సంవత్సర రూపము
5. దానము చంద్రగ్రహణ నిమిత్తమా / సూర్య గ్రహణ నిమిత్తమా
6. దానకాలము వంటివి తెలపాలని యాజ్ఞవల్క్యుడు పేర్కొనెను.
7. రాజముద్రను వేయవలెను. అప్పుడే అది 'శాసనము' అవుతుంది.

అయితే లేఖ్యములు బంగారు, వెండి, రాగి, ఇత్తడి, కంచు, దంతపు ఫలకాలు, శిలలు మున్నగువాటిపై లిఖింపబడును. కానీ, తామ్ర, శిలలపైనే విరివిగా దొరుకుతున్నవి.

శాసనాలు విషయపరంగా చూసినప్పుడు -

**"లౌకికం రాజకీయంచ**

**లేఖ్యం విద్యాత్ ద్విలక్షణం"**

శాసనములు లౌకికములు, రాజకీయములు అని రెండు విధములు. లౌకిక శాసనములు జానపదులకు (ప్రజలకు), రాజకీయ శాసనములు రాజులకు వారి సంబంధీకులకు సంబంధించినవి.

వసిష్ఠుడు రాజకీయపత్రములను శాసనమని, జయపత్రమని, ఆజ్ఞాపత్రమని, ప్రజ్ఞాపనా పత్రమని నాలుగు విధాలుగా చెప్పాడు.

ఈవిధంగా శాసనములలో ఉండవలసిన వివిధాంశాలను స్మృతులలో వ్యాసుడు, విష్ణువు తెలిపిన విషయాలు సూత్రాధారాలతో తెలుపబడినవి.

శాసన లేఖనానికి ఒక శైలి ఉన్నది.

1. ఉపోద్ఘాతం 2. ప్రకటన 3. ఉపసంహారం. వీటిలో విషయానుక్రమణిక ఉంటుంది. ఎందులో పొందుపరచవలసిన అంశాలు అక్కడనే ఉండాలి.

శాసనారంభంలో ఓం, ఓం స్వస్తి, ఓం స్వస్తిశ్రీ సిద్ధం అని ఉంటాయి. తరువాత దీవెన, దాత సుగుణ సంపత్తి, ఇలా శాసనంలో క్రమంగా ఉండవలసిన అంశాలను తెలిపారు. (ఇటువంటి విషయాలను దక్షిణభారత శాసనాల ఆధారంగా చర్చించారు. శాసనాలలో శిలాశాసనాలు – దేవాలయ మంటప స్థంభములపైన, విజయ శాసనాలు, దాన శాసనాలు ఉన్నవి. తామ్ర శాసనాలన్నీ దానశాసనాలే.)

మనకు లభించిన శాసనములలో మొట్టమొదటిది అజాతశత్రువు శాసనం (పు.23) అని తెలుసుకోవడంలో ఆనందం కలుగుతుంది. ఇది మధుర మ్యూజియంలో ఉన్నదట. ఇలా భారతదేశంలో లభిస్తున్న తొలి శాసనాల వివరాలు పొందుపర్చారు. క్రీ.పూ. 487 ఉత్తరప్రదేశ్‌లోని 'సోహగౌరా' గ్రామంలో దొరికిన తొలి తామ్ర శాసనం.

అశోకుడు వేయించిన 31 ధర్మలిపి శాసనాలు లభిస్తున్నాయి. దక్షిణాపథంలో అశోకుని ధర్మలిపి శాసనాలున్నాయి. ఆంధ్రదేశములో కూడా లభించాయి. తరువాత ఆంధ్రదేశాన్ని పరిపాలించిన రాజవంశాలు వారి మాతృభాషలలోనూ దేశ భాషలలోనూ శాసనాలు లిఖించారు. ఇవి శిలా, తామ్ర శాసనాలు. వీటిలో లిపి పరిణామం భాషా పరిణామం కనిపిస్తుంది. జన వ్యవహార భాష గ్రంథస్థం కంటే ముందు శాసనస్థమైనవి. రాజాజ్ఞను శాసనమున రాయించు ఉద్యోగులు, వారి ఉద్యోగం పేరు శాసన లేఖకులకున్న పేర్లు, శాసనము వ్రాయు విధానము, పాటించు నియమాలు సవివరంగా ఈ అధ్యాయంలో తెలిపినారు.

భారతదేశంలో శాసనాలను చదవాలని, దానిలోని విషయం గ్రహించాలని మొదట ఎవరు ప్రయత్నించారు? చారిత్రకంగా మొదట ఫిరోజు తుగ్లక్ పంజాబు రాష్ట్రంలోని 'టోపరా'లోని శాసన స్తంభము, మీరట్‌లోని అశోకుని శాసన స్తంభమును తెప్పించి ఢిల్లీలో పాతించి, పండితులను నియమించి చదివించుటకు ప్రయత్నించెను. అయితే వారికి ఆ భాష అర్థం కాలేదు. అలాగే అక్బరు కూడ శాసన భాషా పరిశోధనకు కృషి చేసి విఫలమైనాడు.

ఈస్టిండియా కంపెనీ వారి టంకశాలలో పనిచేసిన 'జేమ్స్ ప్రిన్సెస్' అను ఉద్యోగి ఈ పరిశోధనను కొంత ముందుకు తీసుకొని పోయినాడు. లిపులను ఇతర శాసనాలలో పోల్చాడు. దానిలోని భాష సంస్కృతం కాదని, ప్రాకృతమని తేల్చాడు. అతని పరిశోధనల తరువాత మార్గదర్శకాలైనాయి. వేలకొలది శాసనాలు చదువబడి, దేశ చరిత్రకు మెరుగులు దిద్దాయి.

ఈ పరిశోధనలో అధ్యయనాంశం శాసనాలు కనుక ఆంధ్రుల ప్రశంస ఉన్న ఐతరేయ బ్రాహ్మణము, రామాయణము, మహా భారతాలలోని ఆధారాలను చూపారు. (వీటిలో కొన్ని 'తెలుగు భాషా చరిత్ర' భద్రిరాజు కృష్ణమూర్తిలో కనిపించని ఉదాహరణలు కూడ ఉన్నాయి)

ఆంధ్రుల ప్రశంస ఉన్న అశోకుడి ధర్మలిపి శాసనాలు 1. షాహబాజ్‌గడీ శాసనం 2. మన్సేర శాసనం 3. గిర్నార్ శాసనంలోని అంశాలు వివరించబడ్డాయి.

శాతవాహనుల నుండి ఆంధ్రులను పరిపాలిస్తున్న ప్రసక్తి వస్తున్నది కనుక వారి శాసనాల వివరాలు ఇచ్చారు. ఇక్ష్వాకులు పాలించిన కాలంలోనూ శాసనాలు ప్రాకృత భాషలోనే ఉన్నాయి. పల్లవుల శాసనాలు ప్రాకృత భాషలోనివే. విష్ణుకుండినులు, బృహత్పలాయనులు, ఆనందగోత్రికులు శాలంకాయనుల కాలంలో వెలువడిన వివిధ ప్రాంతపు తామ్ర శిలా శాసనాల వివరాలు ఇవ్వబడ్డాయి. ఇవన్నీ ప్రాకృత శాసనాలు.

## రేనాటి చోళులు

విష్ణుకుండినులు పాలించుకాలంలో ఆంధ్రదేశంలోని కొంత భూభాగాన్ని రేనాటిచోళులు పరిపాలించారు. వీరి శాసనములు తెలుగు శాసనములు. ధనంజయుని కలమళ్ళ శాసనము మొట్టమొదటి తెలుగు శాసనము. దీని కాలం క్రీ.శ. 575.

ఇదే కాలానికి చెందిన వైదుంబరాజుల శాసనాలు (22+3), చింద వంశీయుల శాసనాలు (8) తెలుగులోనే వెలశాయి. తరువాత దక్షిణాపథంలో మహత్తరమైన పాత్ర

నిర్వహించిన వారు తూర్పుచాళుక్యులు. ఈ వంశమునకు మూల పురుషుడు రెండవ పులకేశి తమ్ముడు కుబ్జ విష్ణు వర్ధనుడు. తూర్పుచాళుక్యుల కాలంలో కొల్లలుగా తెలుగు శాసనాలు వెలసినవి.

క్రమక్రమంగా తెలుగు శాసనాల సంఖ్య పెరిగింది. ముఖ్యరాజులు వేయించిన శాసనాలు – యుద్ధమల్లుని బెజవాడ శాసనం, జయసింహ వల్లభుని విప్పర్ల శాసనం, పండరంగని అద్దంకి శాసనం, గుణగ విజయాదిత్యుని ఉరుటూరు శాసనం మొదలైనవి భాషాపరంగా ముఖ్యమైనవి. పశ్చిమ చాళుక్యుల శాసనాలు, బాదామి, కళ్యాణీ చాళుక్యుల శాసనాలు సంస్కృతాంధ్ర కన్నడ భాషలలో ఉన్నాయి. వీటి పూర్తి వివరాలు ఆధారాలు ఈ అధ్యాయంలో పుట 55లో పేర్కొన్నారు. వీటి ఆధార గ్రంథ వివరాలు సవివరంగా కూర్చబడినవి.

ఒక్కొక్క రాజవంశంలో వెలసిన శాసనాలు, వాటి సంఖ్య, ఏ ఏ భాషలలో అవి రచితమైనవి, రచించిన వారి వివరాలు (ఉన్నట్లయితే) ఏ సంపుటులలో ప్రకటితమైనవి వంటి వివరాలు కాలక్రమ పద్ధతిలో వివరించబడ్డాయి. వీటితో పాటు రాజ్య స్థాపకులు, ఏ వంశంవారు వారి పరిణామము ఉచ్ఛతి – క్షీణతలు, తరువాత ఏర్పడిన రాజవంశాలను క్రమగతిలో వివరించారు. ఉదాహరణకు :

**కుతుబ్షాహీ వంశీయుల శాసనములు**

1. ఎస్.ఐ.ఐ. వాల్యూం 10 — తె.శా. సం. 27, సం.శా.సం 2
2. తెలంగాణ శాసనములు …………… 2

మొత్తంగా మొదటి అధ్యాయంలోని విషయాలు క్లుప్తంగా –

1. క్రీ.పూ. నాలుగవ శతాబ్ది నుండి క్రీ.శ. ఆరవ శతాబ్ది వరకు గల శాసనాలు ప్రాకృత, సంస్కృత భాషలలో వ్రాయబడినవి. వీటిలో గ్రామ, వ్యక్తి బిరుద నామములు తెలుగుభాషకు సంబంధించినవి.

2. ఆరవ శతాబ్ది నుండి ముఖ్యంగా రేనాటి చోళుల కాలం నుండి తెలుగులో శాసనాలు వెలిసాయి. తెలుగుదేశం, భాషలకు సంబంధించి 8000 శాసనాలు కనుగొనబడినవి. వీనిలో అధికభాగం ప్రచురితమైనవి.

3. వివిధ వంశాల వారి కాలక్రమము, వారు వేయించిన శాసనాల సంఖ్య, భాష క్రమాభివృద్ధిని విశ్లేషించుటకు ఉపకరించినవి.

## అధ్యాయం - 2

### శాతవాహనులు - గాథాసప్తశతి

ఈ అధ్యాయంలో సాతవాహన శబ్దమునకు సంబంధించిన స్థలనామాలు ఆంధ్రదేశంలో ఎన్ని ఉన్నాయో సూచీ చేశారు. శాసనాలలో నివి ప్రస్తుతం గ్రామనామాలుగా ఉన్నవి రెండింటినీ క్రోడీకరించారు. సతకన్ని నగరము (మధ్యదేశమునకు దక్షిణాన ఉన్నది. సాతవాహనికోట, సాతానికోట (కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలూకా), సాతవాహనపల్లె, సత్తెనపల్లె (గుంటూరుజిల్లా) సాతనుల పర్వత పంక్తి (ఆదిలాబాదు జిల్లాలోని చిన్న పర్వత పంక్తి) ఇలా ఆంధ్రదేశము, గయ, గంగానది దక్షిణభాగములలో మొత్తము 23 స్థలనామాలు గుర్తించారు.

సాతవాహనుల కాలంలో రాజభాష ప్రాకృతము. జనసామాన్యంలో 'దేశి' భాష వాడుకలో ఉంది. రాజభాష, జనభాష ఒకదానిలోనికి మరొకటి చొచ్చుకొని పోయినది. గాథాసప్తశతి మహారాష్ట్రీ ప్రాకృతంలో వ్రాయడమైనది.

సాతవాహనులకు అటు ఇటుగా వ్యాప్తిలో నున్న ప్రాకృతభాషలోని రకాలు, అధిక ప్రాచుర్యం ఉన్న ప్రాకృతం చర్చితమైనాయి. గుణాఢ్యుడు వాడిన పైశాచీ, మూల ద్రావిడ ప్రాకృత భాషల సమ్మిశ్రణమని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి అభిప్రాయం. 'దేశి' భాషలను స్పర్శించిన భారత రామాయణ నాట్యశాస్త్రం కామసూత్రాలలోని శ్లోకాలను ఉదహరించారు. 'దేశి' భాషావాచిగా ప్రస్థావించబడిన కాలక్రమం తెలుస్తుంది.

తెలుగు భాషనుండి గాథాసప్తశతిలోనికి చేరిన పదాలను సాధికారంగా నిరూపించారు. సంస్కృతంలో 'శ్వ', 'శ్రూ' అన్న శబ్దములే బహుళంగా ప్రచారంలో ఉన్నవి. అత్తా = అత్తః అనునది తమిళ, కన్నడ తుళు భాషలలో అత్తై, అత్తె, అత్తె అని ఉండగా తెలుగులో మాత్రమే అత్త అను రూపమున ఉండి, గాథాసప్తశతిలోనికి అత్తగా ఎక్కినదని నిరూపించారు. అలాగే మిగిలిన పదాలైన పాడి, పొట్టం - పీలుఅ - ఫిలహీ బోడ్డీ - మోడి - కుడ - కులు ఇచ్చి ఊణ - బోల వంటి పదాలు చర్చితమైనాయి.

ఇవేకాక శాతవామనుల కాలంలో వెలసిన ఆరు శాసనాలలో గ్రామనామాలు తెలుగుదేశానికి చెందినవి ఉన్నాయి. ఈవిధంగా క్రీ.శ రెండవ శతాబ్దికి తెలుగుభాష జన వ్యవహారంలో వాడుకలో ఉన్న విధం తెలియపరచబడినది.

## అధ్యాయం - 3

ఈ అధ్యాయంలో ఇక్ష్వాకులు, పల్లవులు, ఆనందగోత్రికులు, బృహత్పలాయనులు, శాలంకాయనులు, విష్ణుకుండినుల కాలంలోని శాసనాలలోని తెలుగుభాష వికాసాన్ని విశ్లేషించారు.

ఇక్ష్వాకులు (క్రీ.శ. 225-275) శాసనాలలోని ప్రాకృతభాషలో ఉన్నవి. ఈ శాసనాలలో తెలుగు గ్రామనామాలు, వ్యక్తుల పేర్లు, బిరుదావళులు ఉన్నాయి. ఇవి 24 ఉటంకింపులున్నాయి.

**గ్రామనామాలు**

ఆనంద గోత్రికుల శాసనాలలోని గ్రామనామాలు (4), బృహత్పలాయనుల శాసనాలలో (3), శాలంకాయనుల శాసనాలలో (14), విష్ణుకుండినుల శాసనాలలో గ్రామనామాలు (16) ఇలా ప్రతి శాసనంలో ఉన్న గ్రామనామాలు అవి ఉన్న శాసనాధారాలకు ప్రతి ప్లేట్‌ను తిరిగి పూర్తి పాఠంతో ప్రత్యక్షరీకరించారు.

కళింగుల కాలం వరకు గల శాసనాలలోని గ్రామనామాలు : ఊరు, పర, పఱ్ఱు, కొన్ఱ, కొండ, కోడు, చెఱువు, రేవు, కుదురు, పాక, వాడ, వాట - వాటిక, పల్లి, పుర, వట్టి, ముడి, ముడి - పూడి, తొఱె, మంచి అను పదాలతో పూర్తి అయ్యేవి. ఈ అధ్యాయంలో గ్రామనామాల చివరి పదాలను కూలంకషంగా విశ్లేషించినారు. గ్రామం అని సూచించే పదాలు 20 వరకు ఏర్పడ్డాయి.

వీటిలో పల్లి; పుర; వాడ - పదాలు సంస్కృత మూలాలు కలిగినవి.

మిగిలినవి దేశ్యాలు. ఊరు, పుర శబ్దానికి ప్రాకృత రూపం. ఉదాహరణగా పర, పఱ్ఱు గురించిన విశ్లేషణ చూడవచ్చు. శివస్కంధవర్మ మైదవోలు శాసనంలో 'విరిపర' అను గ్రామ పేర్కొనబడినది. ఇది ప్రాకృత రూపం.

విరిపర - విర్పఱ్ఱు - విప్పఱ్ఱు - విప్పర్ల అయినది. మరికొన్ని శాసనాలలో ఇది 'ఱ'తోనూ 'ఱ్ఱ'లోను కనిపిస్తున్నది.

పెణకపఱ్ఱు... (రెండవ స్కందవర్మ ఒంగోడు దాన శాసనం)

పేణ్కపఱ ... (విక్రమేంద్రవర్మ ఇంద్రపాలనగర శాసనం)

ఱ గుబమ్ఱు (విష్ణు గోపవర్మ చూర దాన శాసనం)

దీనిని తెలుగు భాషా పదంగా సమర్థించడానికి తమిళ, కన్నడ, మలయాళ (ద్రావిడ

భాషలు కనుక) భాషల అర్థాన్ని ఆధారంగా తీసుకున్నారు.

తమిళంలో పళ్ళి - గ్రామము, దేశైక పదము

మలయాళము - పళ్ళి ఆశ్రయము అని అర్థం.

తెలుగు, కన్నడములలో 'పళ్ళి' ధాతువు నుండి 'పట్టు' ధాతువు వచ్చింది. ఇది విశేష్యంబు కూడ చోటు, స్థలము అనునవి అర్థాలు.

'ళ్ళి' ను 'ట్టు'గా ఉచ్చరించటం ఉంది. (చిఱు - చిట్టి). ఈ పళ్ళి' - పట్టు - వట్టి రూపాలలో కూడ ఉన్నది.

'విళవట్టి - సింహవర్మ విళవట్టి దానశాసనము. 'చెంగల్పట్టు' వంటిది.

పళ్ళి / పట్టుపై సోదాహరణంగా, ఆధారాలతో చర్చించి తెలుగు పదాలుగా నిరూపించారు.

ఇదేవిధంగా శాసనస్థ ఆధారాలలో ఈనాటికీ గ్రామనామాలలో భాగంగా ఉన్న స్థలం / చోటు అనే అర్థాన్ని సూచించే అఱు, తొఱె, కోడు / గోడు, పాక, కుదురు, రేవు కొండ మొదలైన శబ్దాలను వాటి ప్రాథమిక అర్థాలలో నిరూపించారు.

తెలంగాణ ప్రాంతంలో వ్యాప్తిలో ఉన్న అర్థ విశేషం 'కోలు' (ఊరి దగ్గరి నీటి పల్లము). నది / వాగు /ఒఱ్ఱె / ఒంపు నీటి వాలున్న ప్రాంతంనందున్న బావులకు 'కీలుబాయి' అని వాడుక. 'కొలుబారు' (అలుగుబారు) అని ప్రయోగం ఉంది. ఇటువంటి శాసనస్థ పదాలను వాడుకలోని పదాలను సమన్వయించి నిరూపణ చేశారు.

వివిధ శాసనాలలో, గ్రామనామములలోని స్థల వాచక శబ్దాలను తెలుగు పదాలుగా నిరూపణ చేయడానికి శాసన ఆధారాలను ఇప్పటికీ వాడుకలో ఉన్న పదాలను సమన్వయించారు. ఇతర ద్రావిడ భాషలలో ఇదే శబ్దాలు ఉన్న అక్కడ అవి సూచించే అర్థాలతో తులన చేశారు. క్రీ.పూ. 3,2 శతాబ్దుల నుండే తెలుగు గ్రామనామాలు కనిపిస్తున్నవి.

## బిరుద నామములు

శాసనములందు వ్యక్తుల నామాలు, బిరుద నామాలు వ్రాయబడినవి. ఈ పేర్లు తొలుత తెలుగు భాషా సంబంధమైనవి పిదప తెలుగు భాష అభివృద్ధి చెందుతూ పూర్తిగా తెలుగులోనివి అయి ఉన్నాయి.

గోలశర్మ (విజయ స్కందవర్మ ఒంగోడు శాసనం)

కొట్టశర్మ (అత్తివర్మ గోరంట్ల శాసనం)

దొడ్డిస్వామి (నెడుంగరాయ శాసనం, విష్ణుగోపుడు)

పై వ్యక్తి నామాలలోని పూర్వ పదాలు తెలుగు పదాలు

అగ్గిజ్జ, వేణిజ్జ –లలోని 'జ్జ' – 'అజ్జ' ప్రాకృత శబ్దముల లుప్తశేషం. అజ్జ క్రమంగా అయ్యగా మారి యుండవచ్చు.

శాసన భాషా పరిణామంలో (క్రీ.పూ.200 – క్రీ.శ.1100) బూదరాజు రాధాకృష్ణగారు 44 రకాల స్థల నామ ప్రత్యయాలను గుర్తించారు. అయితే ఆ వ్యాసం నిడివి చిన్నది కనుక వారి పరిశోధన గ్రంథంలోని అన్ని వివరాలు అక్కడ పొందుపరచలేదు. ఆవిధంగా ఈ గ్రంథంలో మనకు మరిన్ని వివరాలను సోపపత్తికంగా పొందుపరచబడ్డాయి.

ఱ(కింద రెండు చుక్కలు) – ఈ అక్షరాన్ని ఎలా ఉచ్చరించాలో అని పండితులు చర్చించారు.

కాల్డ్వెల్ ఱ(కింద రెండు చుక్కలు) = RZH గా ఉంటుందని సూచించారు. ఈ అక్షరాన్ని సంస్కృత ప్రాకృత శాసనాలలో, కన్నడ తెలుగు లిపిలోనే వ్రాసారు. దివాకర్ల వేంకటావధానిగారు చేసిన చర్చ ద్రావిడ భాషలలో ఇది వివిధ రకాలుగా పరిణమించిన విధానం తెలుపబడినది.

తాలవ్యీకరణం చెందిన కాలం కూడా

తూఱుపు – తూఱు – మెరయు – ప్రకాశించు (176)

సాధు శకట రేఫ – రెండు బహువచన ప్రత్యయాలు

అల్లూరు – అందఱు; వారు – విలుకాఱు

విశ్లేషణ చాలా బాగుంది ఱు – రు (178)

రేనాటి చోళుల శాసనాలలో భూత తద్ధర్మ క్రియలు కానవచ్చును. కానీ అసమాపక క్రియలు గల వాక్యాల సంఖ్య అధికంగా ఉన్నాయనే పరిశీలన గమనించవచ్చు.

దీనికి రామేశ్వర స్తంభ, చిలంకూరి, వెల్దుర్తి, బుడ్డిగడ్డపల్లె, ఉరుటూరు, ఏడువాడలపాలెము శాసనాలను ఆధారం చేసుకొని నిరూపితమైన వాక్యం ఇది.

ఉదు – కొసియవాఱకిచ్చిరి (వెల్దుర్తి శాసనం)

సంబంధ బోధక సర్వ నామములతో రెండు వాక్యాలను కలిపి వ్రాయడం కనిపిస్తుంది.

1. ఇచ్చిన పన్నస పెన్వాఱ ఇశతేనికిన్ (పొట్లదుర్తి మాలెపాడు శాసనం)

ఇక్ష్వాకుల కాలమునాటి శాసనములలో 'అన్న' అను శబ్దం కానవచ్చుచున్నది. అది నామముల చివర చేర్చబడినది.

బుధిమ్నక; బహఘమ్న; నామగ్న; వీరమ్న (వీరంన - వీరమ్న - వీరన్న). అంతకుపూర్వం శాసనాలలో మూర్ధన్యం ఉండగా ఈ శాసనాలలో దంత్య నకారము ఎక్కువగా ఉన్నది. బుధమ్నక - లోని 'క' ప్రత్యయం స్వార్థమున వచ్చినది.

విష్ణుకుండినుల కాలంలోని మూడవ మాధవవర్మ ఈపూరు దాన శాసనంలో 'మంచ్యణ్ణ భట్టారకుడు' - ఇందు మంచ్యణ్ణ అను శబ్దం కాలక్రమంలో మంచన్న - మంచనగా రూపాంతరం చెందింది.

## ధ్వనులు - అక్షరాలు

ఈ కాలంలోని (ఇక్ష్వాకులు - విష్ణుకుండినులు) అక్షరాలు, ధ్వనులను గురించి చర్చించారు.

'ఱ' (శకట రేఫము) సంస్కృత ప్రాకృతాలలో లేనిది. ద్రావిడభాషలలోనిది. శాసనాలు నాగరి లిపి లేదా వేంగి లిపిలో వ్రాయబడినప్పుడు 'ఱ' వచ్చిన చోట తెలుగు కన్నడ లిపులలోని ఈ అక్షరమును వ్రాసెడివారు. 'ఱ' ఆనాటి వాడుకలో ఉండినదని దీనివలన చెప్పవచ్చు. ఈ చర్చ తరువాత తాలవ్యీకరణం, అనుస్వారమునకు బదులు అనునాసికాక్షరములు వ్రాయపబడిన విధానము, పరిణామము చర్చితమైనది. బహువచన ప్రత్యయం 'కళ్' 'ళ్'గా స్థిరపడినది. ఈ పరిణామాన్ని సోదాహరణంగా వివరించారు.

## సమాసములు

ద్రావిడ భాషలలో రెండు కన్నా మించి పదములు గల సమాసములు ఉండుట అరుదు. ఈ శాసనాలలో రెండు పదములతో ఉన్న సమాసాలే వాడుకలో ఉన్నవి. తెలుగు భాష అభివృద్ధి క్రమంలో సమాసాలలో పదసంఖ్య పెరిగినది.

మూడవ అధ్యాయంలో క్రీ.శ. ఒకటవ శతాబ్దికి తెలుగు భాష మూల ద్రావిడం నుండి విడివడి ప్రత్యేకమైన భాషగా రూపొందినదనుటకు కావలసిన ప్రతిపత్తులను శాసనాధారంగా తీసుకొని – గ్రామ నామములు, వ్యక్తుల పేర్లు, బిరుదావళులు, విశేషణాలు, సంఖ్యా వాచకాలు, నామ ప్రత్యయాలు, స్థల ప్రత్యయాలు, వచన ప్రత్యయాలు ఏర్పడిన విధానం నిరూపించబడినది. క్రీ.శ. 1-6 శతాబ్దుల వరకు జరిగిన భాషా పరిణామం సంస్కృత, ప్రాకృత శాసనాలలో కనిపించే తెలుగు శబ్దాలు, ప్రత్యయాల ద్వారా విశ్లేషించ బడినది.

## అధ్యాయం - 4

క్రీస్తుశకము ఆరవ శతాబ్దివరకు తెలుగు శాసనములు వెలువడలేదు. అప్పటివరకు ఉన్న శాసనాలు ప్రాకృత, సంస్కృత భాషలలో వ్రాయబడినవి. అయితే ఈ శాసనాలలో తెలుగు పదాలు ప్రత్యయాలు కనిపిస్తాయి. వాక్య నిర్మాణం, పద సంధాన పద్ధతి, వ్యాకరణ నియమాలు తెలియుటకు వీలు లేదు. తూర్పు చాళుక్యుల పరిపాలన క్రీ.శ. 624 నుండి ప్రారంభమవుతుంది. వీరి పాలన ప్రారంభంలోనే తెలుగు శాసనాలు బయలుదేరినవి. ఇవి ప్రాకృత పద బహుళంగా ఉన్నవి.

ఆ కాలము నాటి మాండలిక రాజులలో రేనాటి చోళులు, వైదుంబులు, చింద వంశీయులు ముఖ్యులు. వీరు తమ శాసనాలను ఆంధ్రభాషలో వేయించినారు.

రేనాటి చోళుల శాసనాలు 39; వైదుంబుల శాసనాలు 22; చింద వంశీయుల శాసనాలు 8. (ఇవి ఎపిగ్రాఫియా ఇండికాలో ఏయే సంపుటాలలో ప్రకటితమయ్యాయో వివరాలు పరిశోధనా గ్రంథంలో ఉన్నది).

తెలుగు భాషాభివృద్ధిని, స్థితిని తెలుసుకొనుటకు ఈ శాసనాలు ముఖ్యమైనవి. ఈ అధ్యాయంలో చర్చించిన భాషా విషయాలకు ఈ శాసనాలు ప్రధాన ఆధారాలు. ఈ శాసనాలలో కొందరు రాజుల పేర్లు పేర్కొనబడినవి.

(తెలుగు విద్యార్థులు ఎక్కువగా ప్రస్తావించే కలమళ్ళ శాసనం వివరాలు పూర్తిగా ఈ అధ్యాయంలో పేర్కొన్నారు. రేనాటి చోళుల వంశీయుల తెలుగు శాసనం ఎరికల్ముత్తురాజు ధనంజయుని 'కలమళ్ళ శాసనం ఎపిగ్రాఫియా ఇండికాలో ప్రకటింపబడినది. ఈ శాసన కాలం క్రీ.శ. 575.

(ఈ కాలం నాటి గ్రామనామాలు - నాడుల వివరాలు ఉన్నాయి. ఈ శాసన లేఖనమునందు నిర్మాణ పద్ధతి (స్ట్రక్చర్) వివరించారు పరిశోధకులు) ఈ శాసనాలలో రాజు పేరు, విజయరాజ్య సంవత్సరము పేర్కొనబడెను. ప్రధానమైన దాన విషయము, శాసనం మధ్యలో వర్ణించబడుటయే కాక, దత్తమైన గ్రామములు, క్షేత్రాలు, వాటి సరిహద్దులు ఫలశ్రుతి చెప్పబడినవి. ఈ ఫలశ్రుతి ఒకేవిధంగా ఉండినది. తరువాత ఆజ్ఞప్తి, కర్తృ లేఖకుల పేర్లు ఉన్నాయి.

తెలుగుభాషలో వ్రాసినవి కనుక ఈ శాసనభాషను సోదాహరణంగా విశ్లేషణ చేయడమైనది. ఈ శాసనాలలో అసమాపక క్రియగల వాక్యాల సంఖ్య ఎక్కువ. ఎనిమిది

ఉదాహరణలున్నాయి. భూతకాల క్రియాజన్య విశేషణాలు, తచ్ఛబ్దానుగత క్రియాజన్య విశేషణాలు, క్రియలుగా వాడబడుట వంటివి సోదాహరణంగా తెలిపినారు.

ఈ తొలి నాటి తెలుగు శాసనాలలో ప్రాకృతభాష ప్రభావము, సంపర్కము అధికంగా ఉన్నది. తరువాతి శాసనాలలో తెలుగుపై సంస్కృత భాషా ప్రభావం ఎక్కువైనది. ఈ పరిశీలన పరిశోధనలోని సూక్ష్మతత్త్వాన్ని తెలుపుతుంది.

(ఈ శాసనములందలి భాషను వివిధ స్థాయిలలో విశ్లేషించడమైనది)

ఈ శాసనాలలో కనిపించే తెలుగు శబ్దాల ప్రాచీన రూపాలు (మూల ద్రావిడ భాష లక్షణాలు పొందుపరచుకున్నవి) వింత పదాలుగా పేర్కొన్నారు. రట్ట, గుళ్లు, కొటుళున, పూల్ల పట్టమ్బ్యు వంటివి.

## రూపంలో వైవిధ్యం గల పదాలు

ఏబది - ఉరుటూరు శాసనం; ఏభది - వెల్దుర్తి శాసనం; ఏమ్బదియె - తిప్పలూరి శాసనం; ఏంభాది - వెల్దుర్తి శాసనం.

ఇలా ఎన్నో పదాలలో శాసనాధారాలతో వైవిధ్యం చూపెట్టారు. కొన్ని పదాలు రూప వైవిధ్యం, వర్ణక్రమ దోషం కలిగినవి కూడ శాసనాలలో ఉన్నాయి.

కొన్ని శాసనస్థ పదాలకు అర్థ చర్చ కూడ చేయడమైనది. ఉదాహరణకు పన్నస / పన్నాస / పన్నదీస / పన్నాశా అర్థాన్ని గ్రహించడానికి కన్నడ భాషా సహాయంతో వివరించారు.

వ్యక్తినామాల చివరన రట్టు, కుట్టు వంటివి చేరి రూప పరిణామము పొందిన విధానాన్ని చర్చించారు. ఇప్పుడు వ్యాప్తిలో ఉన్న పదాల వ్యుత్పత్తిని తెలుసుకోవడానికి ఈ పరిణామదశ చర్చ ఉపకరిస్తుంది.

ఈ కాలపు శాసనాలలో కొన్ని ధ్వనుల వినిమయత కనిపిస్తుంది. దీనికి ప్రజల ఉచ్చారణ ప్రభావము, ప్రాకృత సంపర్కము, లేఖకుల అజ్ఞత కారణాలు కావచ్చును.

లళ, నణ, శస, తద, ఋరి, జంటల మధ్య ఒకదాని బదులు మరొకటి వ్రాయడం కనిపిస్తుంది.

'ఱ'(కింద రెండు చుక్కలు) ధ్వని విశేషంగా కనిపిస్తుంది. రేనాటి చోళుల కాలానికి ఈ ధ్వని జనవ్యవహారంలో ఉండటం వలన ఆనాటి శాసనాలలో ఈ ఱ (కింద రెండు చుక్కలు) అక్షరంతో కూడిన పదాలు కనిపిస్తాయి.

'ఱ' (కింద రెండు చుక్కలు) ధ్వని తమిళ కన్నడ భాషలలో ఎటువంటి మార్పులు

పొందినదో తెలుపుతూ తెలుగులో ఈ ధ్వని ఎన్ని మార్పులకు లోనైందో తెలుసుకొనుటకు ఈ అధ్యాంలోని ఈ 'ఱ' ధ్వనిపై చేసిన చర్చ ఎంతో ఉపకరిస్తుంది.

తాఙో (కింద రెండు చుక్కలు) (తమిళ కన్నడములు)

తెలుగులో తాళు – నిదానించు గుహించు (సైసు) తాళుకు బదులు తెలంగాణలో సైసు ఉపయోగిస్తారు.

పూజ్యార్థంలో బహువచనంలో వ్రాయడం ఈ శాసనాలలో కనిపిస్తుంది.

ధనంజయుఱు

చోళ మహారాజుఱ్ఱ

రేనాటిచోళుల శాసనాలలో ప్రథమా విభక్తి ప్రత్యయం 'డు' లేని రూపమును వాడు పద్ధతి కనిపిస్తుంది. ధనంజయు.

అనుస్వారం – తెలుగులో పూర్ణబిందువు, ఖండబిందువు అను రెండు రూపాలలో ఉండినది. అనుస్వారాన్ని లేఖనంలో ఏవిధంగా ఏర్పడినదో వివరించారు. వీటిగురించి తెలుసుకున్నట్లయితే శాసనాలలోని పదాలను చదువుకొనడం సులభమౌతుంది.

రేనాటిచోళుల నాటికి 'అనుస్వారము బిందువగును, వర్గానునాసికముగను వ్రాయబడుచుండెను.

వక్రంబు; సంయుక్తున్టుగు; పఞ్చమహాపాతక; చిరుమ్బ్రూరి

ఈ శాసనములలో ధ్వనులు వచనం లింగం క్రమంగా రూపుదిద్దుకోవడాన్ని శాసనాధారంగా నిరూపించారు. ఒక్కొక్క అంశానికి లభించిన అన్న శాసనాధారాలను ఎత్తి చూపారు.

## విభక్తి ప్రత్యయాలు

వీరి శాసనాలలో 'న్డు'తో కూడినవి ఆరు, ఏడు శతాబ్దులలోనూ, 'ఞ్డు'తో కూడినవి అటు పిమ్మట, ఆ తరువాత ఞ్డు, పందులు వాడుకలోనికి వచ్చినవని స్పష్టంగా ఉదాహరణలతో, శాసనాధారాలతో పేర్కొన్నారు.

ముకి పూర్వరూపములైన మ్బు, ంబులతో కూడిన పదాలు ఎక్కువగా కనిపిస్తున్నవి. ఆరవ శతాబ్దము నాటికివి స్థిరత్వాన్ని పొందాయి. తరువాత రేనాటి చోళుల కాలంలో అనునాసికము లేని కేవల 'బు' వర్ణముతో కూడిన రూపాలు కనిపిస్తున్నవి.

కొన్ని శబ్దాలు సంస్కృతం నుండి ప్రాకృతం, ప్రాకృతం నుండి తెలుగులోనికి వచ్చాయి. కనుక అటువంటి రూపాలు కనిపిస్తున్నాయి.

పరిహార: – పరియారో – పరియారువు

ధర్మ: – దమ్మో – దమ్మువు

ద్వితీయ – ని,ను; తృతీయ – తోడ,తో,కి,కు; షష్ఠి –అ, లోపల; సప్తమి – అన్,న – విభక్తులుగా ఉదహరించబడినవి. సర్వ నామములు, సంఖ్యా వాచకాలు సంఖ్యను తెలుపునప్పుడు వాడు ప్రత్యయాలు ఇప్పుడు (మంది, గురు) లకు వురు, వేవురు, వేవుర, న్టు వాడెడివారు.

బహువచనాంతములైన పదములను విశేష నామాలుగా మార్చుటకు 'అ' చేర్చబడెడివి. ఉదా. చోళ మహారాజుల అమ్మ (చామలూరు శాసనం).

ఈ కాలమునందు కూడ తాలవ్యీకరణము పూర్తి కాని రూపాలు కొన్ని కనిపిస్తున్నవి.

పణి కేసిరి ; కేసిన పణి.

రేనాటిచోళుల కాలమునాటి శాసనములలో వాక్యార్థము పూర్తియగుటకు 'అగు' ధాతు రహితముగనే వాక్యములు సంపూర్ణార్థమును ఒసంగును.

1. దీనికి వక్రమ్బు వచ్చువాన్టు బారనాసి వేవురు పాఱ
జమ్పిన వాన్టు (అగును) (రామేశ్వర స్తంభ శాసనము)

2. దీనికి వక్రంబు వచ్చిన పాఱను వేయి కవిలాలను వ్రచ్చినవారు (అగుదురు)

క్రియలకు సంబంధించి; భూతకాల సమాపక క్రియలు – ఇచ్చె, కొట్టె, తాగిరి, కెసిరి, ఎత్తిఞ్చిరి, చనియె, తీఱెన్ వంటి రూపాలున్నాయి.

**క్త్వార్థక రూపాలు :** సల్పిన, అయ్ను, వ్టచ్చిన

**శత్రర్థకం :** ఏళుచు, వర్ధిలుచునుండు

కర్మణీ ప్రయోగాలు సంస్కృత ప్రభావంతో ఏర్పడినవి.

1. వైదుమ్బుళ చేత పట్టుం కట్టబిడి

ధాతు రూపములు విశేష్యములుగా వాడబడుచుండెను.

కట్టు – (బంధించు) (చామలూరు శాసనం)

చేదర్థకములు – ఏని (ఇప్పుడు ఏ – తే)

నడిపిరేని, నెఱిపిరేని - ఏడువాడల పాలెపు శాసనం.

ఈ శాసనాలలో సంధి పాటించబడినది. యడాగమం కలదు - సంవత్సరంబుళ్ యేనగు (రామేశ్వరస్తంభ శాసనము)

విసంధిగానూ వ్రాయబడినవి - రాజుల అన్డు (నలజానంపాడు శాసనం)

సంధి పాటింపబడిన చోట్లు - అఱువది వేలేండ్లు; సంవత్సరంబుళిరువదిమూండు; కొన్ని హల్సందులు కనిపిస్తున్నవి. సరళాదేశం ప్రవర్తిల్లిన తీరు చర్చితమైనది. ఆ కాలం నాటికి సంశ్లేష రూపం ఏర్పడు విధానం రూపొందలేదు. త్రికసంధి కనిపిస్తున్నది. ఇన్నల్వురు (బాణరాజుల శాసనము)

వాక్యాలపై చేసిన చర్చ ప్రత్యేకంగా పరిశీలించవలసి ఉంది. వాక్యాలలో సమాపక క్రియలు లేవు కానీ, భూత తద్ధర్మ క్రియాజన్య విశేషణములతో కూడిన విశేష్యములతోడనో, (నవ ప్రియముత్తురాజులు సాక్షికాను ఇచ్చిన పన్నస (ఎఱ్ఱగుడిపాడు శాసనం), తచ్చబ్దాను ప్రయోగయుత భూత తద్ధర్మ క్రియాజన్య విశేషణముతోడనో (దీనికి వక్రంబు వచ్చు వాన్డు పుత్రా వద్య స్త్రీ వద్య గో వద్య పఞ్చ మహాపాతకఞ్చేసిన వాని లోకంబు నుణ్డువాన్డు (మాలెపాడు శాసనం). అర్థం వ్యక్తం చేయబడుచుండును. ఇటువంటి వాక్యాలను ఎం. కందప్పచెట్టిగారు విశేషణ సమాపక వాక్యాలుగా పేర్కొన్నారు. -తెలుగు భాషా చరిత్ర, పు.163.

ఇంకా కర్త, కర్మ, క్రియల క్రమము, అసంపూర్ణ వాక్యాల స్వరూపం, సమాసరూపాలు, మణిప్రవాళశైలి, ఏవిధంగా ఉన్నవో విశ్లేషించారు.

## అధ్యాయం - 5 (చాళుక్యులు)

దక్షిణాపథంలో చాళుక్యులు మహత్తరమైన చరిత్ర కలవారు. క్రీ.శ.641 నుండి వీరి పరిపాలన క్రీ.శ.1118 వరకు అవిచ్ఛిన్నంగా సాగింది. తూర్పు చాళుక్యుల కాలంలో శాసనములు మూడు విధాలుగా కనిపిస్తున్నాయి.

1. గద్య శాసనాలు 2. పద్య శాసనాలు 3. గద్య పద్య శాసనాలు.

తూర్పు చాళుక్యుల శాసనభాషపై శాస్త్రిగారు కొన్ని భాషాపరమైన అంశాలు తెలిపారు. ఈ శాసనాలు సంస్కృతం, తెలుగు భాషలలో ఉన్నవి. ఈ శాసనాలలోని ఆంధ్రభాషపై ప్రాకృత ప్రభావం ఎక్కువగా ఉండటాన్ని వారు సోదాహరణంగా (పు.251నుండి) తెలిపారు. తరువాత కాలంలో సంస్కృత భాషా ప్రభావం పెరుగుట ప్రాకృత ప్రభావం సన్నగిల్లుట

జరిగింది. తెలుగులో దీర్ఘ సమాసాలు ప్రవేశించాయి. ఇది యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో ఏవిధంగా పరిణమించిందో విశ్లేషించారు.

నన్నయ భారత వచనశైలికి, ఈ కాలంలోని శాసన భాషాశైలికి మధ్యనున్న సామ్యాన్ని చూపారు. ఈ పరిశోధనలోని ఫుట్‌నోట్స్ కూడ చాలా విలువైనవి. పు. 254లోని "లక్ష్మీపుర శాసనము (చల్లపల్లికి మూడు మైళ్ళదూరం, దివి తాలూకా, కృష్ణాజిల్లా). శ్రీవేటూరి ప్రభాకర శా5స్త్రి గారే శాసనమును గుర్తించిన ప్రథములలో నొకరు" వంటి విశేషాలు విలువైనవి.

కొన్ని పదాలను వింత పదాలు శాస్త్రిగారు గుర్తించారు. ఈ నాటి పద రూపానికి తొలి రూపాలవి. శాసనాలలో చూచిన వెంటనే అవి అర్థం కావు. కానీ భాషా పరిణామాన్ని అవగాహన చేసుకొని ఈ పదాలకు అర్థాన్ని ఇచ్చారు. చాలా పదాలకు అర్థ చర్చ చేశారు. పొలగరుసు (పొలిమేర)లోని 'పొల' – 'పొలి' అని, అది లేఖన దోషమని శ్రీ జయంతి రామయ్య పంతులు గారి అభిప్రాయాన్ని పూర్వపక్షం చేసి 'పొల' సరియైన రూపమని అప్పటి వాడుక అని నిర్ధారించడానికి శాస్త్రిగారు ఎంతో చర్చ చేశారు. పుట. 258, 259, 260లలో ఈ చర్చ చూడవచ్చు. శ్రీనాథుని పద్యాలు, తెలంగాణలోని వాడుకపదాలు, ఇతర సమాస పదాలలోని రూపాలను ఉటంకించారు.

## వర్ణ చర్చ

ల–ళ, న–ణ, స–శ, త–ద ల పరస్పర వినిమయం శాసనాలలో ఏవిధంగా ఉండేదో సోదాహరణంగా వివరించారు. చ – శ – సలను ఒకదానికొకటి వ్రాయడం ఈ శాసనాలో కనిపిస్తుంది.

వే చెఱువులు – వేసె చెఱువులు – వేశె చెఱువుళు.

ఱ–రి ల మధ్య ఉచ్చారణ వైరుధ్యం లేకపోవుట గుర్తించారు. కనుకనే శాసనాలలో ఒకదానికొకటి రాయబడినవి. తాలవ్యీకరణము పొందిన పదాల పరిణామం విశ్లేషించారు.

ఋడమ నారాయలపాడు శాసనంలోని 'మిరిగించు' అనుటకు 'చరిగిన్చు' అని రెండు పర్యాయాలు రాయబడుట, ఇది తమిళంలోని చరుక్కు ధాతువునకు దగ్గర రూపంగా పేర్కొనుట లోతైన పరిశీలన (పు. 273).

'వికర్షము' – ఉచ్చారణ సౌలభ్యం కోసం సంయుక్తాక్షరాలకు మధ్య ఒక అచ్చు చేర్చడం – శాసనాలలో ఈ మార్పు పొందిన పదాల గురించి చర్చించారు. ముఖ్యంగా ఇవి తత్సమ పదాలే. ఇటువంటి మార్పుకు లోనవుతున్నామని పరిశీలించారు. అలాగే చాళుక్యుల శాసనాలలో వర్గయుక్కులకు బదులుగా ప్రథమ, తృతీయాక్షరాలు పరస్పరం

వాడబడిన తీరు శాసనోదాహరణలతో చూపారు. హ్రస్వ దీర్ఘ అచ్చుల మధ్య కూడ ఈ వినిమయం శాసనాలలో కనిపించు తీరు తెలుపబడినది.

చాళుక్యుల శాసనాలలో ఱ (కింద రెండు చుక్కలు) విరివిగా ప్రయోగం ఉన్నది. దీనిపై (పు. 277–పు. 293) విస్తృతంగా చర్చించారు.

చాళుక్యుల కాలంలోని ధర్మవర శాసనంలో 'పణ్డరఙ్గ' అన్న రూపం ఉంది. 'డు' ప్రత్యయం లేనిది, దీనిపై చర్చిస్తూ (పు. 293) చిన్నయసూరి సూత్రీకరించిన 'వృద్ధాదుల దుజ్గుకు లోపంబు విభాషనగు' అనునది – దుజ్ఞ్ వచ్చి లోపించినదని అనుటకు బదులు, దుజ్ఞ్ రహిత రూపం ప్రాచీన కాలంలో ఉండెనని తలచుట భావ్యం అంటారు శాస్త్రిగారు.

అనుస్వార లేఖన పద్ధతి గురించి చేసిన చర్చ (పు. 295) ముఖ్యమైనది. తెలుగు లిపి లేఖన పరిణామాన్ని తెలుపుతుంది. సంస్కృత ప్రభావంతో పరాక్షరంపై చుక్కలు లిఖించబడినవి. తరువాత పూర్వాక్షరంపై బిందువు పెట్టడం ప్రారంభమైంది. అనుస్వారం లేఖనపద్ధతి, వర్ణానునాసికం వ్రాసిన పద్ధతిని శాసనస్థ ఉదాహరణలలో పట్టికరూపంలో వివరించారు.

**బహువచనం**

బహువచన ప్రత్యయాలపై శాస్త్రిగారి చర్చలో వినూత్నంశాలు కనిపిస్తున్నాయి.

ర్ – బహువచన ప్రత్యయం. ఇది ఇర్ అను (రెండు ఇరువది) సంఖ్యావాచకము యొక్క అవశేషం.

కాగా శాస్త్రిగారు 'అమహద్వాచక ప్రథమ పురుష సర్వనామ బహువచన రూపమునకు బదులు 'వ్', 'ఉన్నది' అని గుర్తించారు. 'వ్'ను ప్రత్యేకంగా బహువచన ప్రత్యయంగా ప్రతిపాదించడం నూతనం. 'వి' మనుష్యేతర బహువచన రూపం అని బూదరాజుగారు అన్నారు. కానీ (ఇచ్చిన – వి, పుట. 87), ఇక్కడవారు ప్రథమపురుష గురించే చర్చించారు.

తెలుగులో 'వ్'ను బహువచన ప్రత్యయంగా గుర్తించడం శాస్త్రిగారి సిద్ధాంత గ్రంథంలోనే కనిపిస్తున్నది. (నా ఎఱుక తప్పయిన సరిదిద్దుకోగలను – రెడ్డి శ్యామల) అయితే దీనిపై విశ్లేషణ చేయలేదు.

బహువచనాంతాలు పూజ్యార్థక రూపంలో శాసనాలందు కనిపిస్తున్నాయి. ఉదా : మహారాజులాకున్.

లింగబోధక ప్రత్యయాలు గురించి తెలుపుతూ శాసనాలలో వాక్యములు పుంలింగ పద కర్తృకములుగనే ఉన్నాయి అనే పరిశీలన ముఖ్యమైనది.

పుట 317లో మరొకసారి 'వు' గురించి చర్చించారు. 'దేశ్య తత్సమ పదవులు ప్రథమైక వచనమున 'వు' వర్ణాంతములుగా కనిపించుట వలన వ్యాకర్తలు 'వు'ను ప్రథమా విభక్త్యైక వచనముగా గ్రహించినారు.

గో - గోవు; ఆ - ఆవు; అని వాడుక కలదు. గోవులు, ఆవులు బహువచన ప్రత్యయములు. అని ఇప్పుడు 'గోలు' అని కాక 'గోవులు' అని వాడుకగా ఉందని తెలిపారు. (ఇది ఇంకా లోతుగా చర్చించాలి). (అవి, ఇవి, ఏవి, కలవు, లేవు, ఉల్లికోవు, రావు మొదలైనవి. ఇంకా 'ఏవి'కి రూపాంతరం 'ఎవ్వి'. (పుట. 328).

ఆ కాలమునాటి శాసనాలలో నిక్షిప్తమైన విభక్తి ప్రత్యయములు, సర్వనామాలు, సంఖ్యావాచకాలు, క్రియలు కాలము, వాక్యనిర్మాణము (కర్త కర్మ క్రియ, కర్త, క్రియ, కర్మ) శైలి వంటి అంశాలు చర్చించారు.

## అధ్యాయం - 6 (చాళుక్యచోళులు - మాండలిక రాజులు)

రాజ రాజ నరేంద్రుని కుమారుడైన రాజేంద్రుడు, 'కుళోత్తుంగచోళ' బిరుదాంచితుడై క్రీ.శ. 1070- క్రీ.శ.1120 వరకు పాలించెను.

(ఇక్కడ శాస్త్రిగారు చాళుక్య చోళులకు, వెలనాటి చోడులు, కళింగరాజుల శాసనాలు ప్రచురింపబడిన గ్రంథాల గురించి వివరించారు. దక్షిణభారత దేశ శాసనాలు, ఎపిగ్రాఫియా ఇండికా, ఆంధ్రపత్రిక, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, భారతి వంటి వాటి వివరాలు పొందుపరచారు.)

(శాసనాలకు సంబంధించిన వివరాలు, అవి ప్రచురితమైన గ్రంథ వివరాలే కాక, శాసనం పూర్తి పాఠాన్ని కూడా ఇచ్చారు.) మొదట ఈ కాలమున వాడుకలో ఉన్న సంఖ్యా వాచకముల గురించి చర్చించారు. భాషా పరిణామ విశ్లేషణకు కావ్యాల కన్నా శాసనాలు ఏ విధంగా ఎక్కువ నమ్మదగిన ఆధారాలో చర్చించారు.

ప్రాచీక కవుల వ్రాతప్రతులు ఉండవు. తరువాతి కాలం వారు పునర్లిఖించుకున్న ప్రతుల నుండి ముద్రణ రూపానికి వచ్చినవి. ఇక్కడ ఎన్నో ప్రక్షిప్తాలు, సవరణలు జరిగి ఉండవచ్చు. కానీ శాసనాలలో ఆ అవకాశం ఉండదు. కనుక ఇవి ఎక్కువ ప్రామాణిక ఆధారాలుగా ఉంటాయి.

ఇక రెండవ కారణం కావ్యాలు లభించిన కాలం ఉండవచ్చు. మధ్యలో కొంతకాలం విరామం ఉండవచ్చు. కానీ, శాసనాలు ప్రతి సంవత్సరం ఒకటో రెండో వెలువడినవి. కనుక ఇది మరింత సాధికారత కలిగినవి.

శాస్త్రిగారు సంధి జరుగు పద్ధతిని తెలుపుతూ గసడదవాదేశం శాసనభాషలో వైకల్పికము కాదు, నిత్యము అని సూత్రీకరించారు. దీనికి 42 శాసనస్థ ఉదాహరణలిచ్చారు.

భాషా పరిణామాన్ని గురించి గిడుగు సీతాపతిగారు కళింగ పత్రికలో వ్యావహారిక, శాసన, గ్రంథస్థ భాషల వ్యత్యాసాల గురించి వ్యాఖ్యానించారు. దీనిని శాస్త్రిగారు గ్రాఫ్ పద్ధతిలో చక్కగా సులభంగా అర్థం అయ్యేటట్లు తెలిపారు. ఇప్పటికీ తెలుగు సిద్ధాంత గ్రంథాలలో ఇటువంటివి క్వాచ్ఛిత్‌గానే కనిపిస్తాయి.

శాస్త్రిగారు ఈ అధ్యాయంలో కొన్ని ముఖ్యాంశాలు పేర్కొన్నారు. 1. శాసన భాష, ప్రబంధ (కావ్య) భాషల మధ్య కొన్ని సమానత్వాలు కలవు. క్రీ.శ. 1132నాటికి సముచ్చయార్థక ద్విత్వము, దీర్ఘము కావ్యాలలో ఉన్నాయి. అదేవిధంగా, ద్రుతముతో వచ్చు సంశ్లేషము పొందిన రూపాలు ఉన్నాయి. అయితే ఇవి అపరిష్కృత గ్రంథాలలో మాత్రమే ఉన్నవి. కానీ పండిత పరిష్కృత గ్రంథములలో ఇవి లేవు.

శాస్త్రిగారు పుట. 15లో వెలిబుచ్చిన ఈ అభిప్రాయం అత్యంత ఆధునికమైనది. "భాషా పరిణామమును గ్రహించి, భాషా లక్షణమును నిరూపించుచు వ్యాకరణమును వ్రాసిన శాసన భాషయైనను ప్రబంధాది భాషయైనను, ఏ భాషయైనను, ఏ కాలము నాటిదైనను లక్షణ విరుద్ధమైన భాష మాత్రము కాదని తోచును"

మాండలిక రాజుల కాలములో ఆంధ్రభాషా శాసనాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ కాలము నాటి 105 గ్రామ నామాలు జాబితాగా ఇచ్చారు.

గ్రామములలో ఉన్న ఊరు, పూండి, పాడు, ఉల, పల్లి, పత్తి, కొండ, పురి, పురము, కల్లు, వాయ, దొన, వాడ, చెర్ల, కుంట, పేట, కుదురు పదాల వ్యుత్పత్తిపై చర్చ చేశారు.

శబ్దాలు లేఖనంలో స్థిరత్వం పొందాలంటే ఉచ్చారణ – లేఖనాల మధ్య స్థిరీకరణ జరగాలి. ఈ పరిణామాన్ని శాస్త్రిగారు రూపవైవిధ్యం అనే అంశంలో గుర్తించినట్లు తెలుస్తుంది. అందుకే రూప వైవిధ్యము గల పదములు (పుట. 2-26) అనే శీర్షికలో జాబితాగా ఇచ్చారు.

శ కు బదులుగా 'స'; ఋ కు బదులుగా 'రి'; త కు బదులు 'ద' శాసనాలలో పలు తావులలో కన్పిస్తుంది.

తాలవ్యీకరణము పొందడానికి చాలా సంవత్సరాల కాలం పడుతుంది. కనుక తెలుగు, ద్రావిడ భాషల నుండి చాలాకాలం క్రిందటే విడివడి యుండ వచ్చునని చెప్పవచ్చు.

తాలవ్యీకరణం చెందని పదాలను కూడ ఉదాహరణలలో చూపారు.

1. పణికేసిరి 2. కేసిన పణియు

ఱ - శకట రేఫతో కూడిన పదాలు యాభైనాలుగు జాబితాలో ఇచ్చారు. ఈ కాలంనాటి శాసనాలలో ఎక్కడ అరసున్న లేదు అని స్పష్టంగా తెలిపారు. (పు.2-48)

బహువచనం పాటించబడినది. 'తత్సమ పదములలో ండు, ఋ వర్ణాంతముల పదములు పుంలింగములనియు, ము, బు,ంబు వర్ణాంత పదములు నపుంసక లింగ పదములని స్పష్టపరచారు. దేశ్య పదములలో లింగ సూచక చిహ్న రహిత పదముల సంఖ్య ఎక్కువగా నున్నది. అవి స్త్రీ సమములు.

1. మానెందు (ఎస్.ఐ.ఐ. వాల్యూం. 10, శా.నెం.166).

పురుష నామ వాచకాంతములందు 'అమ' 'అయ' పదములున్నవి.

కొండయ; ఎల్లమ. ఇంకా ఈ అధ్యాయంలో శాసనములలో విభక్తులు, సర్వనామాలలో వస్తున్న పరిణామ క్రమాన్ని వివరించారు. సంఖ్యా వాచకములలో 'వంద' కనిపించదు. నూఱు మాత్రమే ఉన్నది. వేయి తెలుగులో మాత్రమే కనిపిస్తుంది.

విశేషణాలను గురించి (2, పు.73) చర్చిస్తూ "ప్రాచీన ద్రావిడ భాషయందు నామవాచకములకు, విశేషణములకు రూపమునందెట్టి భేదము లేకుండెను. కానీ పదములలో పౌర్వాపర్యముననుసరించి వాడబడుచుండెను" అన్నది శాస్త్రిగారి నిశిత దృష్టికి తార్కాణం. కాలక్రమంలో విశేషణానికి 'అ,ఇ' చేర్చబడేవి.

## క్రియలు

చాళుక్యచోళుల శాసనాలలో సమాపక క్రియావాక్యాలు, అసమాపక క్రియావాక్యాలు ఉన్నాయి. అయితే కొన్ని శాసనాలలో సమాపక క్రియా వాక్యాలు తక్కువ. శాసనాలలో భూతకాల సమాపక క్రియారూపములు ఎక్కువగా కనిపించును అని వారి పరిశీలనలో వెలువరించారు శాస్త్రిగారు.

చాళుక్య చోళుల కాలపు శాసనాలలో ప్రేరణార్థక సమాపక, అసమాపక క్రియారూపములు భూత కాలమున వాడబడినవి. (వీటన్నింటికి ఉదాహరణలు ఏదో ఒకటి, రెండు కాక, ఉన్నవాటినన్నింటినీ పేర్కొని సాధికారికంగా వ్యాఖ్యానించారు). అర్థక ప్రత్యయాలు, ప్రయోగాల గురించి చర్చించారు. కర్మార్థకము క్వాచిత్కముగా ఉన్నవని తెలిపారు. అప్పుడు - ఏన్ - చేదర్థక ప్రత్యయం. ఉకార, అకార, ఇకార సంధులు స్థిరపడినవి.

## అధ్యాయం - 7 (కాకతీయులు)

మూడు శతాబ్దుల కాలము ఆంధ్రదేశమును ఏకచ్ఛత్రాధిపత్యముగా పాలించినవారు కాకతీయులు. క్రీ.శ.1000వ సంవత్సరంలో కాకతి వంశీయుడగు మొదటి బేతరాజు రాజ్యమును స్థాపించినాడు. ఆంధ్రభాష జన వ్యవహారమున నున్న భూభాగమును తన యేలుబడిలోనికి తెచ్చి ఆంధ్ర భావమునకు అంకురార్పణ చేసినారు. వీరి కాలంలో వేసిన శాసనాలు, ప్రకటింపబడిన గ్రంథాల వివరాలు శాస్త్రిగారు పొందుపరచారు.

కాకతీయుల కాలము ఆర్థిక, రాజకీయ, పరిపాలన, సాంస్కృతిక రంగాలలోనే కాక భాషాపరంగానూ స్వర్ణయుగమే. తెలుగు భాషా వ్యవహారం సుస్థిరపడిన కాలం కాకతీయుల కాలం. ఆంధ్ర శాసనాలు అసంఖ్యాకంగా వెలిసాయి. భాష కూడ వర్ణ, పదాంశ, వ్యాకరణ, వాక్య నిర్మాణ స్థాయిలలో వ్యవస్థీకృతమైంది. బసవోదాహరణము వంటి కావ్యాల ద్వారా భక్తి ఎలా ఉన్నా విభక్తులు స్థిరీకరించబడ్డాయి.

శాస్త్రిగారు కాకతీయుల శాసనాల ఆధారంగా 107 గ్రామనామాలు లెక్కగట్టారు. కాకతీయుల వంశంలో మొదటి ముగ్గురు రాజుల (మొదటి బేతరాజు, మొదటి ప్రోలరాజు, రెండవ బేతరాజు) కాలంలో సంస్కృత కన్నడ భాషలలో శాసనాలుండేవి. ఈ గ్రామనామాలలో ప్రదేశాన్ని సూచించే ఊరు, కొండ, కంటి, పత్తిర్, పుర, పురము, పల్లి, వరము, ఆల, కుంట, చల్ల, ప్రోలు, పాడు, మట్టి, పడ, గడ్డ, ఏఱు, పూండి, తోంట, వాయి, కుదురు, ముడి, కట్ట, చెఱువు, పట్టు, రాచూర పదాంతంలో ఉన్నాయి.

భాష స్థిరపడే పరిణామంలో రూపవైవిధ్యం సహజం. ఈ పరిణామాన్ని తెలిపే పదాలను శాస్త్రిగారు పేర్కొన్నారు ఉదా. రెండు - రెండూ, రెండ్డు, రెణ్డు అలాగే శాసనస్థ పదాలను (అరుదైనవి) అర్థం ఇచ్చారు.

న -ణ; ల-ళ; శ-స-ష; త-ద; ఱు-రి అను వర్ణముల మధ్య స్పష్టత లేఖనంలో పూర్తిగా ఏర్పడలేదు. ఇది ఇప్పటికీ ఉన్న విషయమే. తెలుగు భాషా ధ్వనులననుసరించి తెలుగుకు దగ్గరగా ఉన్న ధ్వనులతో సంస్కృత ధ్వనులను ఉచ్చరించడం అవిద్యావంతులలో సహజమైన విషయం. కాకతీయుల కాలంలో శకటరేఫ ఉపయోగంలో ఉన్నది. 92 పదాలను ఉదహరించారు శాస్త్రిగారు.

బిందువునకు పరంగా వచ్చే వర్ణం ద్విత్వంగా లిఖించబడిన వాటిని గురించి శాస్త్రిగారు (2-137) ప్రస్తావించారు. అయితే దీనిని గుర్తించారు కానీ కారణాన్ని ఊహించలేకపోయారు. దీనికి భాషాశాస్త్రంలో సమాధానం ఉన్నది. సాధారణ 'త'కారం కంటే బిందుపూర్వ 'త'కారం

కొంత ఊనికతో ఉచ్చరింపబడుతుంది. కనుక ఉచ్చారణ కనుగుణంగా లేఖనం ఉన్నప్పుడు అంద్దు, ఉద్దండ్డుండు, లతాంత్త వంటి రూపాలు శాసనాలలో కనిపిస్తాయి. విభక్తులు ఈ కాలమున పరిణమించిన తీరును ప్రథమలో ణ్డు, న్డు, ండు, డులు స్థిరపడ్డాయి. న్టు, ణ్టు రూపాలు కనిపించవు. సప్తమిలో అందుల, అందు, అంద ప్రత్యయాలు కనిపిస్తాయి. సర్వనామాలు సంఖ్యావాచక శబ్దాల పరిణామాన్నీ శాసన ఆధారాలతో పేర్కొన్నారు. ఐదు, ఏను రెండు ప్రయోగాలున్నాయి.

శాస్త్రిగారు ఈ శాసనములలో భూతకాల సమాపక క్రియలు ఎక్కువగా ఉన్నవని గమనించారు. ఇచ్చె / ఇచ్చెను; ఇస్తిమి / ఇచ్చితిమి వంటి వైవిధ్యం శాసనాలలో ఉన్నట్లు ఉదాహరణల వలన తెలుస్తున్నది.

ప్రేరణార్థక ప్రత్యయాలుగా – రచింపించి, గుడినెత్తించ్చి రెండు కనిపిస్తాయి.

వివరణలు తక్కువగా నున్నా ఉదాహరణలు ఎక్కువగా ఇచ్చారు. క్రియా స్వరూపం, సమాసం, సంధి విషయాలు చర్చించారు. ప్రతి అంశానికి ఉదాహరణలుగా శాసనాలలో దొరికిన అన్ని రూపాలను జాబితాలుగా ఇవ్వడం బలాన్ని కూరుస్తుంది. ఏదో ఒకటో రెండో ఉదాహరణలను ఇవ్వలేదు.

## అధ్యాయం - 8 (రెడ్డి, వెలమ, పద్మనాయక రాజులు)

రెడ్డిరాజుల పరిపాలనా కాలము 1324-1448. రెడ్డిరాజుల శాసనాలలో తామ్రశాసనాలు ఎక్కువగా ఉన్నవి. దేవాలయ మంటపము, శిలలపైన శాసనాలున్నాయి. ఆంధ్రము, సంస్కృతాంధ్ర మిశ్రమములగు శాసనాల భాష ఉన్నది. ప్రకటించిన శాసనాల గ్రంథాలు పేర్కొన్నారు. అయితే ఇంకను ప్రకటించవలసిన శాసనాలు ఉన్నవని శాస్త్రిగారు తెలిపారు.

పద్మనాయకులు 1361 నుండి 1475 వరకు పరిపాలించారు. ఈ కాలము నాటికి ఆంధ్రభాషలో సాహిత్యం బాగా ప్రాచుర్యం పొందింది. భారత, భాగవత రచనలు పూర్తయ్యాయి. శ్రీనాథుని కావ్యాలు వెలువడ్డాయి.

శాసనాలలోని గ్రామనామాలు నేటికీ వాడబడుతున్నాయి. శాసనాలలోని భాష, శైలి, వచన, పద్యం కావ్యాలలో వలె ఉండేది. మహమ్మదీయులు మత, పరిపాలనా, దండయాత్ర కారణంగా అన్యదేశ్యాలు శాసనాలలోనికి ప్రవేశించినవి. గ్రామనామాలతో పాటు పరిపాలనా విభాగాన్ని బట్టి చేసిన మండలాలు, సీమలు కూడ శాసనాలలోనికి ఎక్కినవి. సాహిత్యం మొదలైనా కొన్ని పదాలలో రూపవైవిధ్యం కొనసాగుతూనే ఉంది. ఉ

దా. కూంతురు, కూతుఱు, కూంతురు, కూంతుఱు (రేఫ – శకటరేఫ, దీర్ఘము – హ్రస్వము; అనుస్వారం – అనుస్వారం లేకుండుట వంటివి పూర్తిగా స్థిరీకరింపబడని కాలం).

ధ్వనులలో న –ణ; శ –స ; ల–ళ, ఋ – రిల తారుమారు కొనసాగినది.

ఇ,ఏలతో కూడిన కకారమునకే తాలవ్యీకరణం జరిగినది. కనుక 'కైకిలి' (చేయికూలి) పదం అలాగే శాసనాలలో కనిపిస్తుంది. తాలవ్యీకరణం ఈ కాలానికి తెలుగులో ఆగిపోయింది.

రెడ్డిరాజుల కాలము నాటికి 'ఱ' ప్రాచీన రూపం డ, అలుగా మారిపోయినది.

నిఱుం (కింద రెండు చుక్కలు) జెఱువు = నిడుంచెఱువుగా మారి శాసనములందు వ్రాయబడినది. రెడ్డిరాజుల కాలపు శాసనాలలో అనుస్వారం పూర్ణబిందువుగా వ్రాయబడినది. బహువచన ప్రత్యయంగా 'లు' స్థిరపడింది. సంఖ్యా వాచకాలు, విశేషణాలు క్రియా స్వరూపాన్ని వివరించే అనేక ఉదాహరణలు శాస్త్రిగారు జాబితాగా కూర్చారు. వాక్యనిర్మాణాన్ని గురించి చర్చించారు.

## అధ్యాయం - 9 (విజయనగర రాజులు - గజపతులు)

విజయనగర సామ్రాజ్యము క్రీ.శ. 1336లో విద్యానగర నిర్మాణముతో ప్రారంభమైంది.

విజయనగర పాలకులు మూడు వంశాలకు చెందినవారు సంగమ, సాళువ, తుళువ వంశములు, అనంతరం అరవీటి వంశీయులు విజయనగరమును పాలించినారు.

వీరి పాలనలో తామ్ర, రజత, శిలా శాసనములు మిక్కిలిగా వెలసినవి. ప్రబంధ రచనలతో సాహిత్యం మిక్కిలిగా విరిసిన కాలం. విజయనగర రాజుల శాసనాలలో అక్కడి గ్రామనామాలే కాక వారు జయించిన దేశాల పేర్లు కూడా కనిపిస్తాయి. శాస్త్రిగారు ఇంచుమించు 95 గ్రామాల పేర్లు పేర్కొన్నారు. వీటన్నిటికి శాసనాల ఆధారాలను ఇచ్చారు.

శాసనాలలో వాడబడిన పదాలకు అర్థాలు ఇచ్చారు. ఆనాడు వాడుకలో ఉండి, ఈనాటికీ వ్యవహార భ్రష్టమైనవి లేదా మారుమూల పదాలుగా నున్నవి ఇవి.

'కొడుకు'తో పాటు 'కొమరుడు' కూడ శాసనాలలో స్థానం సంపాదించాయి. 'ఇద్దఱు', 'యిరువుట్టి', నాలు, నలు వంటి సంఖ్యావాచక రూపాలు కనిపిస్తాయి. ల – ళ, శ – స, చ– స, శ, త – ద, ఋ – రిలను తారుమారుగా వ్రాయడం కొనసాగుతూనే ఉంది. శకట రేఫ ప్రముఖంగా వ్రాయబడినది. సంస్కృత శాసనాలలోను ప్రత్యేకంగా వ్రాయబడినది అనుస్వారం పూర్ణబిందువుగా లిఖించబడింది. బహువచన ప్రత్యయంగా 'ళ్' కన్నా 'ల్'

ఎక్కువగా వాడబడినది. వీటన్నింటికీ ఎన్నో ఉదాహరణలను శాస్త్రిగారు పొందుపరచారు.

విభక్తులు, ఔపవిభక్తుల ప్రత్యయాలను కూడిన పదాలు శాసన ఆధారాలతో ఉదాహరణలు ఇచ్చారు. ఎనిమిది, ఎమ్మిది రెండు రూపాలు వైవిధ్యంతో కనిపించాయి. విశేషణాలను వివరించారు. అవ్యయాల గురించి చర్చించారు. (పు.11-326). సంధి, విసంధి కూడ ఈ శాసనాలలో కనిపిస్తాయి.

భూతకాల క్రియాజన్య విశేషణములతో కూడిన విశేష్యము అని ఉదాహరణగా 'దండ్డం పెట్టి ఇచ్చిన ధమ శాసనము' ఇచ్చారు శాస్త్రిగారు. దీనిని నామ్నీకరణ అని వాడుతున్నాం.

విజయనగర రాజుల కాలములో వెలసిన శాసనాలు సంస్కృత, తమిళాంధ్ర, కర్ణాట భాషలలో వెలసినవి. వీరి శాసనములలో అన్యభాషా పదములు అచ్చటచ్చటా కనిపిస్తున్నవి. ఉరుదూ, అరబ్బీ, పారసీ, మరాఠీ, కన్నడ పదాలు ఆంధ్రభాషలో సుస్థిరముగా నిలిచిపోయినవి.

## అధ్యాయం-10 (గోలకొండ నవాబులు, నాయక రాజులు, మొగలు వంశీయులు)

"ఒక భాషకు అన్యభాషలతో, ఒక భాష మాట్లాడువారికి అన్యభాషలు మాట్లాడు ప్రజలతో సంబంధము కలిగిన కొలది ఆయా ప్రజల భావములను, ఆచారములను గ్రహించుట సహజము. రాజకీయ ప్రాబల్యము, మత, సాహిత్య ప్రాచుర్యము వలన వివిధ భాషలు సన్నిహితమగుట వలన, ఆయా భాషలలో పరస్పరము పదముల, భావముల ఆదాన ప్రదానము జరుగును. గోలకొండ నవాబుల కాలములో ఆంధ్రభాష యందిట్టి పదములు చేరినవి" (2-336).

ఆదాన ప్రదానములు జరగడానికి శాస్త్రిగారు తెలిపిన పై కారణాలు చాలా హేతుబద్ధమైనవి. ఇంత స్పష్టంగా ఆదాన ప్రదానాల గురించి శాస్త్రిగారి కాలం నాటికి చర్చ జరగలేదు. "1400 నాటికీ అరబ్బీ, తురుష్క, పారసీక భాషలు ఆంధ్రదేశ రాజకీయ వ్యవహారమున వాడుకలో నుండెనని చెప్పవచ్చును". అను వాక్యం చేయడానికి శాస్త్రిగారు ఉదాహరణలను ఉపపత్తులను సమకూర్చారు.

తెలుగు భాషపై అన్యభాషల ప్రభావం కేవలం కావ్యాలలోనూ, వాడుకలోనే కాక శాసనాలపై కూడా పడినది. అన్యదేశ్యాలున్న శాసనాల వివరాలు (2-340) జాబితాగా కూర్చారు శాస్త్రిగారు. అప్పటికి వెలువడిన ప్రచురణలలో 66 శాసనాలు అన్యదేశ్యాలున్నాయి. 204 ఉర్దూపదాల వివరాలు పొందుపరిచారు. గ్రామనామాలు కూడా ఉర్దూ (వ్యక్తి నామాలతో)లో వెలువడినవి. పూర్ణానుస్వారం స్థిరపడింది. సంశ్లిష్టరూపం ఈ కాలపు

శాసనాలలో కనిపించదు. చతుర్థీ విభక్తి తక్కువగాను, షష్ఠీ విభక్తి 'కు' ప్రత్యయంతోను కనిపిస్తున్నాయి. ఇంకా సర్వనామాలు, విశేషణాలు, క్రియలు, కాల ప్రత్యయాలు సోదాహరణంగా ఇవ్వబడినవి. సంధి, విసంధి, సమాస రూపాలు ఉదహరించడమైనది.

## పదకొండవ అధ్యాయం (శాసనములలోని ఛందస్సు)

ఈ అధ్యాయంలో తొలి శాసనాల నుండి పద్య గద్య వివరాలు తెలుపుతూ, నన్నయ భారతానికి ముందు నుండి ఉండిన పద్య శాసనాలు వాటిలోని ఛందస్సు గురించి వివరించారు. ద్రావిడ భాషలలోని ఛందస్సును పరిశీలించి యతిప్రాసల గురించి చర్చించారు. సంస్కృత, ఆంధ్ర, ఇతర ద్రావిడ భాషల ఛందో వివరాలు, తొలి తెలుగు పద్య శాసనం వంటివి చర్చించారు.

**ఆచార్య వై. రెడ్డి శ్యామల**
ఆచార్యులు, నిఘంటు నిర్మాణ శాఖ, పొ.శ్రీ.తెలుగు విశ్వవిద్యాలయం.
ఫోన్ : 98496 97688



# 'భారతి' మాస పత్రికలోని వ్యాసాలు

"పత్రికొక్కటున్న సైన్యమది పదివేలు" అనే మాటల వల్ల పత్రిక యొక్క గొప్పదనాన్ని, సమాజంపై దాని ప్రభావం ఎంతటిదో తెలుసుకోవచ్చు. నేటి ఈ ప్రపంచానికి, సమాచార ప్రచార వినిమయంలో పత్రికల స్థానం చాల గొప్పది. సమాజ నిర్మాణంలో, విషయ విశ్లేషణలో, ప్రజాభిప్రాయ సేకరణలో, సామాజిక విషయ విస్తరణలో పత్రికలది కీలక పాత్ర. అటువంటి మంచి పత్రికల్లో మొదటి వరుసలో ఉండేది 'భారతి' మాస పత్రిక ఒకటి. ఇది ఇరవైయ్యవ శతాబ్దంలో మరీ ముఖ్యంగా ఆ శతాబ్దపు మొదటి ఆరు దశాబ్దాలలో చారిత్రకంగా విలువైన వ్యాసాల ప్రచురణతో, ప్రతికృతుల ముద్రణ - వివరణలతో మౌళిక సాహిత్య వ్యాసాలతో పేరెన్నికగన్నది. ఆంధ్రపత్రిక, అమృతాంజనం వంటి సంస్థలను స్థాపించిన దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు భారతి మాస పత్రిక వ్యవస్థాపకులు. మొదటి సంచిక జనవరి, 1924 సంవత్సరంలో వెలువడింది. మార్చి 1991 సంవత్సరంలో దీని ప్రచురణ నిలిచిపోయింది.

శ్రీ గన్నవరపు సుబ్బరామయ్య, నాగేశ్వరరావు, శివలెంక శంభుప్రసాద్, శివలెంక రాధాక ృష్ణ భారతి మాస పత్రికను నిర్వహించారు. భారతిలో పనిచేసిన వారిలో ముఖ్యంగా తిరుమల రామచంద్ర, విద్వాన్ విశ్వం మొదలైన వారితో పాటుగా తొలితరపు పత్రికా రచయితలు, కవులు, ప్రసిద్ధ రచయితలు, తమ సమాచార వ్యాసాలను, పరిశోధనా వ్యాసాలను రచియించిన వారు ఉన్నారు. ఈ పత్రికకు తలిశెట్టి రామారావు కార్టూన్లు వేసే వారు. తనదైన సాహిత్య విలువలను, పత్రికా నియమాలను కాపాడుకుని మంచి

పత్రికగా నిలిపోయింది భారతి మాస పత్రిక. ఆరోజుల్లో భారతిలో కవిత్వమో, వ్యాసమో ప్రచురించబడడటం అత్యంత గౌరవ ప్రదమైన విషయంగా చెప్పుకునేవారు. అవన్నీ ఒక ఎత్తు అయితే తెలుగు నేల పైన మరుగున పడిన శిలా, తామ్ర శాసనాలను వెలికితీసి, పరిష్కరించిన, ప్రచురణకు పూనుకున్న వారిలో శ్రీ బి.ఎన్ శాస్త్రిగారు అగ్రగణ్యులు. ఆయన ద్వారా వెలికితీయబడి, పరిష్కరించబడి, ప్రచురించబడిన శిలా, తామ్ర శాసన పరిష్కార వ్యాసాలు చాలా ఉన్నాయి. అందులో కొన్ని ఈ భారతి మాస పత్రికలో ప్రచురించబడినాయి. అందులో "ఆదికవి నన్నెచోడుడు"వంటి పరిశోధనాత్మక వ్యాసాలు ప్రత్యేకమైనవి. అటువంటి వ్యాసాలను గురించి తెలుసుకోవడం శాస్త్రి గారు ఈతరానికి అందించిన నిధిని వినియోగించుకునే వాళ్ళం అవుతాం అని నా అభిప్రాయం. భారతిమాస పత్రికలో ప్రచురితమై నాకు లభ్యమైన శాస్త్రి గారి వ్యాసాలు మొత్తం 20. ( ఇవి గాక ఇంకా కొన్ని ఉండి ఉండవచ్చు). ఇందులో సిరికొండ శిలాశాసనం, రాచురు, ఇర్వీన్ శిలాశాసనాలు, కాకతీయుల నాటి రెండు శిలాశాసనములు (దుప్పల్లి, తాడువాయి), బొల్లేపల్లి శిలాశాసనం, శనిగరం శిలాశాసనం, పాలకవీడు శిలాశాసనం, పాతర్లపాడు శిలాశాసనం, సదర్ షాపూర్ శిలాశాసనం, తుంగపాడు, కన్నేకల్లు శిలాశాసనాలు, కందూరిచోడుల నాలుగు శిలాశాసనాలు (మల్లేపల్లి శాసనం, పడమతిపల్లి శాసనం, ఇదంపల్లి శాసనం, ఆగామోతుకూరు శాసనం) మొదలగు పదునాలుగు శిలాశాసనాలు వాటి వివరణలు. అలాగే మదనంతవర్మ చోడంగ దేవుని తెంబూరు తామ్రశాసనం, అనంతవర్మ సేవింది గ్రామ తామ్రశాసనం, విష్ణుకుండిన విక్రమేంద్ర భట్టారక ఇంద్రపాలక నగర తామ్రశాసనం, విష్ణుకుండిన గోవిందవర్మ ఇంద్రపాలక నగర తామ్రశాసనం, ఉ మావర్మ హెూణరేజ్ఞ గ్రామ తామ్రశాసనం మొదలగు ఐదు తామ్రశాసనాలు వీటితో పాటుగా ఆదికవి నన్నెచోడుడు, శాతవాహనుల పరిపాలన విధానం, రేనాటి చోళుల నాటి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, విష్ణుకుండినుల కాలనిర్ణయం, గంగరాజుల కాలం నాటి కళింగాంధ్రులు అనే ఐదు చారిత్రక పరిశోధక వ్యాసాలు వెలువడ్డాయి. ఇందులో దేనికదే ప్రత్యేకం, ప్రకృష్టం, ప్రామాణిక సమాచార సంపన్నం.

**శిలా శాసనాలు :**

శాస్త్రిగారు నాడు దొరికిన కొన్ని గ్రంథాల ద్వారా గురువెవ్వరు లేకుండా శాసన భాషను స్వయంగా తానే నేర్చుకుని ఎన్నో శాసనాలను పరిష్కరించారు. శాసన శోధనలో తెలంగాణ నలుమూలలా తిరిగారని ఆయన చేత పరిష్కరించబడిన శాసనాలద్వారా అర్థమవుతుంది. నల్లగొండ జిల్లాలోని భువనగిరి, దుప్పల్లి, తాడువాయి, దేవరకొండ,

మిర్యాలగూడ, దొండపాడు, పాతర్లపాడు, మోత్కూరు,సిరికొండ ఇలా తెలంగాణాలోని మొదలగు శాసనాలను స్పృశించారు. అంతేకాదు ఆయన ద్వారా పరిష్కరించబడిన చాలా శాసనాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిపాలించిన అన్ని రాజవంశాల చరిత్రను ఖచ్చితత్వంతో నిరూపించారు. పరిష్కరణలో శాస్త్రిగారి పంథాయే వేరు. అక్షరజ్ఞానం ఉన్న ప్రతీవ్యక్తికీ అర్థం అయ్యే విధంగా వివరించే శైలి ఎంతో ప్రత్యేకం. మొదట శాసనమున్న ప్రస్తుత ప్రాంతంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల పేర్లు పేర్కొని, ఒకప్పుడు ఆయాప్రాంతలను ఎలా పిలిచేవారు ప్రస్తుతం ఏ పేరుతో వాడుకలోఉన్నది, దానిని ఎవరు వేయించారు, ఎందుకు వేయించాల్సి వచ్చింది అనే విషయాన్ని చెప్పిన తరువాత ఆ శాసన రూపాన్ని, కొలతలను, అందులో నలువైపులా ఉన్న పంక్తుల సంఖ్యను, వాటికి తెలుగు అర్థాలను చెప్పి విషయాన్ని సంగ్రహంగా వివరించి, లిపిని, సంజ్ఞలకు వివరణలతో పాటు నాటి కాలపరిస్థితిని, స్థాపించబడిన సంవత్సరాన్ని (తెలుగు సంవత్సర నామంతో సహా) ఖచ్చితత్వంతో, పురాతన ఆధారాలతో సహా వివరించారు. ఇదే విధానం అన్ని శాసనాలల్లో కనిపిస్తుంది. ఇలా ఆయన ప్రతాపరుద్రుని కాలాన్ని, రెండవ ప్రోలరాజు కాలాన్ని ఖచ్చితంగా చెప్పగలిగారు. ఎవరికి ఎవరు సామంతులు, హోదాలు ఏమిటి, ఎవరు ఏ ప్రాంతాన్ని హద్దులుగా చేసుకుని పాలించేవారు అనే అంశాన్ని కూడా ఖచ్చితంగా చెప్పారు. అంతేకాకుండా బాదామీ చాళుక్య విజయాదిత్యుని, కందుకూరి చోడుల, చెరుకురెడ్ల వంశ వృక్షాన్ని సరియగు కాలాలతో సహా తయారు చేసి ప్రకటించారు. పాలకవీడు శిలాశాసనం వ్యాసంలో చెరకువంశీయులు చరిత్ర రచనకు శాసనాలే ఆధారాలని, చెరకు వంశీయులు, రెడ్లు, కాకతీ రెండవ బేతారాజు కాలంనుండి రుద్రదేవునికాలం వరకు సామంత ఆధిపత్యులుగా ఉన్నారని తెలియజేశారు. తుంగపాడు, కన్నేకల్లు శాసన వ్యాసంలో రుద్రదేవ మహారాజు రెండవ ప్రోలరాజు ప్రథమ పుత్రుడని, ప్రోలరాజు క్రీ.శ 1115 నుండి 1158 వరకు పాలించెను అని, కాకతీ రుద్రమదేవుడు క్రీ.శ 1158లో సింహాసనం అధిష్ఠించెనని నిర్ధారించారు. రాజ్యాధినేతలతో సమానంగా సామంత రాజులకు గల చరిత్రను కూడా ఎక్కడా తక్కువ చేయకుండా రాయడం మరో ప్రత్యేకత. ఇలా మట్టిలో మరుగున పడ్డ అనేక శిలాశాసనాల జాడలను, అందలి నిజాలు నిగ్గుతేల్చారు శాస్త్రిగారు.

**తామ్రశాసనాలు:**

చరిత్రలో చాలా తామ్రశాసనాలు ప్రజల స్వలాభేక్షకు గురై కనుమరుగైపోయాయి. ఉన్న ఏవో కొద్దిపాటి శాసనాలు మాత్రం చాలా చరిత్రను తెలియజేస్తున్నాయి. మొత్తం

ఐదు తామ్రశాసనాల సవివరణలు భారతిలో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం ఎవరి దగ్గర లభ్యమయ్యాయి, ఎవరు వేయించారు, రేకుల సంఖ్య, బరువు, మందం, ఎన్నివైపుల లిఖితపూర్వకంగా ఉన్నాయి, ఎన్ని పంక్తులు ఉన్నాయి, లిపిని, వర్ణక్రమాన్ని, శాసన విషయాన్ని అనువదించి మరీ తెలియజేసారు. తామ్రశాసనాల ఆధారంగానే విష్ణుకుండిన రాజు గోవిందవర్మ కాలనిర్ణయంతో పాటు వంశవృక్షాన్ని (ఇంద్రపాలక నగర తామ్రశాసనం), మాఠరవంశ వృక్షాన్ని కూడా ప్రచురించారు. ఇన్ని విషయాలు తెలుసుకున్న తరువాత వెలుపలకు రాకుండా అంతరించిపోయిన తామ్రశాసనాలలో ఎన్నెన్ని చారిత్రక విషయాలు అందకుండా పోయాయో అనే ఆలోచన రాక మానదు.

**చారిత్రాత్మక పరిశోధక వ్యాసాలు :**

వివిధ రకాల శాసనాలను కూలంకషంగా అధ్యయనం చేసిన శాస్త్రిగారికి చరిత్రపైన సమగ్రమైన పట్టు ఉన్నదని ఆయన వ్యాసాలను, నిరూపణలను చూస్తే అర్థం అవుతుంది. అదే సమగ్రతతో 'భారతదేశ చరిత్ర – సంస్కృతిని' ఇరవై ఒక్క సంపుటాలుగా, 'ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంస్కృతిని' మూడు సంపుటాలుగా, 'ఆంధ్రుల సాంఘిక చరిత్రను' కూడా పాఠకులకు సమకూర్చారు. ఆయనచేత నిర్ధారించి నిరూపణచేసిన కొన్ని వ్యాసాలు భారతి మాస పత్రికలో ప్రచురించ బడ్డాయి. అవి 'ఆది కవి నన్నెచోడుడు', 'శాతవాహనుల పరిపాలన విధానం', 'రేనాటి చోళుల నాటి ఆంధ్రుల సాంఘిక చరిత్ర', 'విష్ణుకుండినుల కాలనిర్ణయం', 'గంగరాజుల కాలం నాటి కళింగాంధ్రులు' అనే ఐదు వ్యాసాలు. ఇందులో 'ఆది కవి నన్నెచోడుడు'అను వ్యాసం సాహిత్యలోకంలో ఒక పెద్ద చర్చకు దారితీసింది. అంతే కాదు నన్నెచోడుని కంటే ముందే 350 సంవత్సరాల నాటికి ఆంధ్రకవిత వర్ధిల్లిందని అది 'జనాశ్రయ' బిరుదాంకితుడు గోవిందవర్మ కాలం అని నిరూపించారు. నన్నెచోడుడు తూర్పు చాళుక్య రెండవ యుద్ధమల్లుని సామంతుడని, నన్నెచోడ మహారాజు వైదుంబలతో జరిగిన యుద్ధంలో మరణించాడని కూడా తెలియజేశారు. భారత దేశ చరిత్రలో అతి సుదీర్ఘకాలం పరిపాలించిన రాజవంశం శాతవాహనులు. ఆ శాతవాహనుల పరిపాలన విధానాన్ని, సామాన్య పరిస్థితులను, వాఙ్మయం, భాష, సైనిక వ్యవస్థను కూడా వివరించారు. వీటితో పాటుగా విష్ణుకుండిన రాజుల యదార్థ కాలనిర్ణయాన్ని, అలాగే ఈపూరు శాసనం, రామతీర్థ శాసనం, చిక్కుళ్ళ శాసనం, తుండి శాసనం, పాలమూరు శాసననం, ఇంద్రపాలకనగర శాసనాల ఆధారంగా వంశవృక్షాన్ని కూడా తయారు చేశారు. అంతేకాదు చరిత్రలో మొట్టమొదటిగా తెలుగులో శాసనాలు వేయించిన రేనాటి చోళుల పాలనా పరిస్థితులను తెలియజేసారు. చరిత్రలో కేవలం పేర్లు మాత్రమే వినిపించే గంగరాజుల

నాటి కళింగరాజుల కాలం నాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను, పరిణామాలను, నాడు వారి రాజ్యంలో బౌద్ధం మత ప్రభావాలతో పాటుగా వివిధ విషయాలను రెండు భాగాలుగా వెలువరిచారు. ఇలా భారతి పత్రికలో వెలువడిన వ్యాసాలు మచ్చుకు కొన్ని మాత్రమే. ఒక మానవ మాత్రుడు చేయలేని కృషి చేసిన శాస్త్రిగారు పని రాక్షసునిగా విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఆయన చేసిన కృషి అనితర సాధ్యమని ఏవైనా రెండు శాసన వ్యాసాలు చూస్తే చాలు అర్థమౌతుంది.. పత్రిక శక్తి సామర్థ్యాలు తెలిసిన వారు గనుక 1980లో మూసీ మాసపత్రికను, మూసీ ప్రచురణ సంస్థను స్థాపించారు. ఒక మనిషి తన జీవితంలో ఇన్ని కార్యాలు చేయడం సాధ్యమేనా అనే సందేహం కలిగే విధంగా పరిశోధనా వాఙ్మయమును ప్రచురించారు. అందుకే "శాస్త్రి నుడివితే ప్రతీమాట శాసనం అవుతుంది. శాస్త్రి అడిగితే రాయైనా చరిత్ర చెబుతుంది" అంటారు. నేడు ఆయన్ని తలుచుకోవడం అంటే ఆయన కృషిని, శ్రమను, వెలువరించిన సాహిత్యాన్ని గౌరవించుకోవడమే.

**వడ్కపురం కృష్ణ**
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 96666 02670



# రాధ (నవల)

తెలుగు సాహిత్య రంగంలో, అటు చరిత్ర, పత్రిక, పరిశోధన రంగాలలో తనదైన ముద్రవేసిన కవి, రచయిత, చరిత్రకారుడు, సంపాదకుడు, పరిశోధకులు బి.ఎన్.శాస్త్రి గారు. ఆయన చరిత్ర పరిశోధన రంగాలలో తెలంగాణ ప్రాంతానికి దిక్సూచి లాంటివారు. విష్ణుకుండినుల చరిత్ర, శాలంకాయనుల చరిత్రను ప్రపంచానికి తెలియజేయడంలోను, మహబూబ్ నగర్, నల్లగొండ, అదిలాబాద్ జిల్లాల సర్వస్వాలను రూపొందించడంలో ఆయన కృషి అనాన్య సామాన్యం. తెలుగు ప్రపంచంలో శాసనాల శాస్త్రిగా ప్రసిద్ధిగాంచారు బి.ఎన్ శాస్త్రిగారు. ఆయన రాసిన 'రాధ' నవలను నేను పరిచయం చేస్తున్నాను.

బి.ఎన్.శాస్త్రిగారి మిగతా నవలల కంటే ఈ నవల భిన్నమైనది. మధ్యతరగతి జీవితం గడుపుతూ, అష్టకష్టాలు పడుతూ చదువుకునే ఒక వ్యక్తి జీవితాన్ని అద్భుతంగా చిత్రీకరించిన నవల రాధ. ఈ నవల పేరు కథానాయకి పేరుతో పెట్టడం జరిగింది. ఇందులో కథ మొత్తం ప్రధాన కథానాయకుడు సుధాకర్ జీవితం చుట్టూ తిరుగుతుంది. ఈ సుధాకర్ జీవితంలో జరిగిన అనుకోని సంఘటనలు, అనుకున్న సంఘటనల మేళవింపే ఈ నవల నేపథ్యం.

జీవిత మాధుర్యాన్ని అనుభవించి, నిరాడంబరంగా బతకదలచినవారి జీవితంలో ఆడంబరాలు అధికమై మనోవేదనకు దారితీసే సంఘటనలు తటస్థించడం వల్ల ఆ వ్యక్తి జీవితధ్యేయమే మారిపోతూ ఉంటుంది. జీవిత భాగస్వామి జీవితానికి వెలుగు రేఖలు దిద్ది జీవితమంతా మనోహరంగా, సుఖమయంగా మారుస్తుంది. కాలవాహిని కెదురీతలీది

కాలగమానాన్ని గమనించకుండా కాలాతీత వ్యక్తులుగా సంచరించే మానవుల చరమదశ హీనాతి హీనంగా, దుర్భరంగా పరిణమిస్తుంది. అలా ఏదో ఒక ఆశయాన్ని దృష్టిలో పెట్టుకొని దాన్ని సాధించడానికి పడరాని పాట్లు పడి ఆశయాన్ని సాధించి గట్టెక్కగలిగిన వాడే శ్రమకు తగిన ఫలితాన్ని పొంది అనుభవించగలుగుతాడు. అలా అనుభవంలోకి వచ్చిన తరువాత తాను సాధించిన కార్యాన్ని గురించి దాన్ని సాధించడంలో ఏర్పడిన సంఘటనలు తలంపుకురాగా ఆ మధురానుభూతిలో తన్మయుడై ఈ ప్రపంచాన్నే మరిచిపోతాడు. ఈ ప్రపంచ చరిత్రలో కనీవినీ ఎరుగని సంఘటనలు తాను ఎదురుకొన్నాననే సంతృప్తి, గర్వం అతనిలో కలుగుతాయి. దానికోసం నిరంతరం పరితపించిన వ్యక్తి సుధాకర్. ఈ నవలలో సుధాకర్ ప్రధాన పాత్ర.

తను జీవితంలో పైకి ఎదగడానికి మధ్యతరగతి జీవిపడే కష్టాలు అన్నీ పడ్డాడు. అద్దె ఇంటిలో చాలీచాలని జీతతోం, హైదరాబాద్ లాంటి నగరంలో జీవించాలంటే మధ్య తరగతి వ్యక్తికి ఉండే అవస్థలను సుధాకర్ పాత్రలో చిత్రీకరించారు రచయిత. తల్లిదండ్రులకు దూరమైన పిల్లలుపడే ఆవేదన ఈ నవలలో స్పష్టంగా కనిపిస్తుంది.

సుధాకర్ హైదరాబాద్‌కు వచ్చి చదువుకుంటున్న వ్యక్తి. అతని ఊరు హైదరాబాద్ కు నలభై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆ ఊరుని విడిచి అప్పటికే 12 సంవత్సరాలు అయింది. సుధాకరుకి చిన్నతనంలోనే కరుణతో బాల్యవివాహం జరిగింది. ఆయన భార్యను వదిలి వచ్చి హైదరాబాద్‌లో ఉంటూ చదువుకుంటూ, చిన్న ఉద్యోగం చేసుకుంటూ జీవితం గడుపుతున్నాడు.

సుధాకర్‌కు ఇష్టమైన వ్యక్తి రేణుక. సాఫీగా సాగుతున్న జీవితంలోకి అనుకోకుండా వచ్చి అతని మనసుని కలవరపరిచింది. బాల్య వివాహం జరిగి, పెళ్ళానికి దూరంగా ఉంటున్న సుధాకర్‌ను రేణుక అందం ఆకర్షించింది. స్త్రీ పురుషులు ఒకరినొకరు చూసుకోవడం సహజం. ఆ చూపుల వల్ల ఆకర్షించుకోవడం, ఒకరి భావాలు ఒకరు అర్థం చేసుకొని ప్రేమించుకోవడం, ఇద్దరి మనసులు కలసి ఆ ప్రేమ ఫలితాన్ని పొందడం లోక సహజం. సుధాకర్ విషయంలో అదే జరిగింది. అలా కొనసాగుతున్న వారి ప్రేమాయణంలో అనుకోకుండా రేణుకకు పెళ్ళి కుదురుతుంది. రేణుక అనివార్య కారణాల వల్ల పెళ్ళి చేసుకోవడం కుదరదు అని చెపుతుంది. ఆ తర్వాత వారి మధ్య బంధం కాస్తా స్నేహంగా మిగిలిపోతుంది.

ఆ తర్వాత అదే వీధిలో రేణుకకు తెలిసిన అమ్మాయి రాధ కనిపిస్తుంది. రాధ రేణుక కంటే చాలా అందంగా ఉంటుంది. కుటుంబ బాధ్యతలు తెలిసిన అమ్మాయి

రాధ. ఇక్కడ రాధతో కూడా సుధాకర్ ప్రేమలో పడుతాడు. ఆమెతో పరిచయం, వారి కుటుంబంతో పరిచయం పెంచుకుంటాడు. ఆమెకు తన ప్రేమ విషయం తెలియజేయాలి అనుకుంటాడు. తెలియజేసే ప్రయత్నాలు మొదలు పెడతాడు. రాధ అమాయకత్వం, ఆమె ఆలోచనాధోరణి సుధాకర్‌ను బాగా ఆకర్షించాయి.

రాధ నవలలో మధ్యతరగతి ప్రజల సాంఘిక జీవన విధానం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. సుధాకర్ హైదరాబాద్‌కు వచ్చి అద్దె ఇంటిలో ఉండటానికి పడరాని పాట్లు పడటం. కాలంతో పాటు మనిషి జీవన శైలి మారింది. మానవత విలువలు మారాయి. ఆనాటి సమాజ పరిస్థతులకు అనుకూలంగా సుధాకర్ పాత్రను చిత్రీకరించటంలో రచయిత విజయం సాధించాడు.

ఈ నవలలో ఆనాటి రాజకీయ పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తాయి. 1948 సైనిక చర్య తర్వాత గ్రామాలలో పరిస్థితులను సుధాకర్ పాత్ర చక్కగా వివరిస్తుంది. హైదరాబాద్‌లో సైనిక చర్య తర్వాత రాజకీయ అస్థిరత, తమ ప్రాబల్యాన్ని ప్రదర్శించుకునేందుకు, అటు కాంగ్రేస్, కమ్యునిస్టుల వ్యవహారశైలిని చక్కగా వివరించాడు. సైనిక చర్య తర్వాత కాంగ్రెస్ వారు, పలుకుబడిని వినియోగించుకొని, ప్రముఖులగా లెక్కింపబడి, తమ రాజకీయ చతురతలతో ప్రభుత్వాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రజలో పలుకుబడిగల కమ్యూనిస్టు నాయకులు ఎన్నడు దుర్మార్గాలకు పూనుకోలేదు. ఎటొచ్చీ వారి పేరు చెప్పుకొని పూర్వపు పగలని సాధించటానికై పార్టీలో చేరి దుర్మర్గాలకు, మోసాలకు పాల్పడుతున్న వారి చర్యలే శోచనీయమని ఆనాటి గ్రామాలలో రాజకీయ పరిస్థితులను చక్కగా వివరించాడు.

ఈ నవల నాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక విషయాలను నేటి సమాజానికి తెలియజేస్తుంది. దానికి భూమికైన సుధాకర్ అతని స్నేహితులు నారాయణరావు, మనోహర్‌ల మధ్య గల సంభాషణను గమనిస్తే అర్థం అవుతుంది.

ఆ తర్వాత చెప్పుకోదగ్గ పాత్రలు కుమార్, సరోజ. వీరిద్దరు మధ్యతరగతి జీవితం గడుపుతున్న దంపతులు. కుటుంబ భారాన్ని మోయలేక, సతమతం అవుతున్న వ్యక్తి కుమార్. అతని అసమర్థతను, అసహాయతను చూసి సరోజ పెడదారులు పడుతుంది. అనుకోని సంఘటనలు ఆమెను అలా ప్రేరేపించాయి. కుటుంబ భారం మోయడంలో కుమార్ విఫలం చెందడంతోనే సరోజ అలా మారిందనడంలో సందేహం లేదు. అలా అనుకొని పరిస్థితుల్లో కుటుంబాలు చిన్నాభిన్నమై ఛిద్రమవుతన్న పరిస్థితిని ఇందులో చిత్రించాడు. ఎక్కడైతే మగవారు కుటుంబ భారాన్ని మోయడంలో విఫలం అవుతారో

అప్పుడు సంసార భారం ఆడవారిపై పడుతుంది. అప్పుడు వారు అన్ని పరిస్థితులకు తట్టుకొని కుటుంబాన్ని నడపాలంటే అందరికి అది సాధ్యం కాదు. అయినా పురుషుడు కుటుంబ భారాన్ని మోయలేనప్పుడు స్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛ ఇస్తే ఆమె కుటుంబాన్ని విజయవంతంగా నడపగలుగుతుంది. అలా కాకుండా ప్రతి దానికి అనుమానిస్తూ, ఆమెను చిత్రహింసలు పెడుతుంటే తన పిల్లల ఆకలి తీర్చడం కోసం మాత్రమే పెడదారి పడుతుంది. కానీ అంతకు మించి కాదు. ఈ నవలలో కుమార్ కుటుంబ భారాన్ని మోయడంలో విఫలం చెందడంతో సరోజ పిల్లల ఆకలి తీర్చడం కోసమే పెడదారి పట్టింది.

సుధాకర్‌కు బాల్య వివాహం అయినా రాధను ఇష్టపడటానికి కారణం భార్యతో సరైన సానిహిత్యం లేకపోవడం, చిన్నప్పుడు తెలిసి తెలియని వయసులో పెళ్ళి కావడం వల్ల సుధాకర్, కరుణల మధ్య ప్రేమబంధం బలంగా లేకపోవడం వల్ల రాధతో ప్రేమాయణానికి కారణం. సుధాకర్ రాధను చూసిన తర్వాత అతని మనసు పరిపరి విధాల ఆలోచిస్తుంది. 'నాకు ముందే పెళ్ళి అయింది, ఒక అమ్మాయిని గురించి ఇంతగా ఆలోచించడం తప్పు' అనే భావన కలుగుతుంది కానీ రాధ అందం, ఆకర్షణ ముందు అతని సంఘర్షణ నిలబడదు. అందువల్ల రాధతో ప్రేమలో పడతాడు.

సుధాకర్ ప్రేయసిగా రాధ మానసిక సంఘర్షణ ఇందులో అద్భుతంగా కనిపిస్తుంది. స్త్రీ ఒక అబ్బాయిని పూర్తిగా ఇష్టపడితే ఎంతగా ప్రేమిస్తుందో ఆమె పాత్ర వల్ల తెలుస్తుంది. రాధ అందం, అణకువ కలిగిన మధ్యతరగతి అమ్మాయి. సుధాకర్ వ్యక్తిత్వం తనను ఆకర్షిస్తుంది. ఒకానొక దశలో సుధాకర్ కు పెళ్ళి అయిందని తెలిసినా కానీ తననే జీవిత సర్వస్వంగా భావిస్తుంది.

రాధ కూడా సుధాకర్ వ్యక్తిత్వం నచ్చి అతన్ని ఇష్టపడుతుంది. రాధ విశాఖపట్టణం వెళ్ళడానికి రైల్వే స్టేషన్ కు చేరుకోగానే ఆమె మాటలు ఆ చూపులుబట్టి సుధాకర్‌ను ప్రేమిస్తున్నట్లు తెలుస్తుంది. రాధ అమాయకత్వం, ఆమె ఆలోచన దోరణి సుధాకర్‌ను బాగా ఆకర్షించాయి. సుధాకర్ తనకు భార్య ఉన్న తెలిసి తెలియని వయసులో పెళ్ళి కావడం వల్ల రేణుకను, రాధను ఇష్టపడతాడు. ఇద్దరూ, ఒకరినొకరు ఇష్టపడినా ఎవరికి వారే ఎదుటివారు తమ భావాలను వ్యక్తపరుస్తారని భావించారు. ఈ లోపల రైలు రావడం రాధ వెళ్ళిపోవడం జరిగింది. సుధాకర్ ఈ నవలలో మొదట రేణుక, తర్వాత రాధ పట్ల ఆకర్షితుడైనా తను వివాహితుడైన కారణంగా మనసులోని భావాలను పైకి చెప్పలేక పోవడం, ఆనాటి సామాజిక స్థాయిలో వ్యక్తులు తమ కోరికల కన్నా సంస్కారాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చేవారనే విషయం అర్థం అవుతుంది.

మరొక పాత్ర కరుణ. ఈ పాత్ర పేరు తప్ప ఎక్కడ కనిపించదు. కరుణ సుధాకర్ భార్య. సుధాకర్ కు కరుణతో బాల్య వివాహం అయింది. మిగతా పాత్రలు అవసరానికి వచ్చి వెళ్తాయి.

అతని స్నేహితులు, మనోహర్, నారాయణ రావు, రాజారావు. వీరు సుధాకర్‌కు హైదరాబాద్ లో ఉండటానికి అప్పుడప్పుడు సహాయం చేస్తారు. వారు అందరు చదువుకున్న మేధావులు, సమాజం పట్ల అప్పుడప్పుడే అవగాహన ఏర్పడుతున్న యువకులు. అయినా వారి కుటుంబ పరిస్థితులు, సమాజం పోకడలు మంచి వ్యక్తిత్వం అలవడేలా చేశాయి. నిజమైన స్నేహ బంధానికి ప్రతీకలు సుధాకర్, నారాయణ రావు, మనోహర్, రాజారావు. వీలందరిలో కులమతాలు కాదు మనసు మనవత్వం పరిమళిస్తుంది. అందుకే వారి స్నేహం అంత మంచిగా నిలబడింది.

**ముగింపు**

మనిషి ఏదో ఒకసారి పెడదారి తొక్కడం సహజం. అలా పెడదారులు తొక్కించే వారికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. ఒకొక్కసారి చెడు మంచిగా కనబడుతుంది. మనకు మంచి అని తోచింది వెరొకరికి చేడుగా కనిపించవచ్చు. మనకు చెడుగా తోచించి వేరొకరికి మంచిగా తోయవచ్చు. అలాంటి విచిత్రమైన పరిస్థితులు సుధాకర్ జీవితాన్ని వివిధ మలుపులు తిప్పాయి. చెడుదారిని చూపించాయి. మంచి దారిని చూపించాయి. జీవితంలో కష్టసుఖాలను అనుభవించిన మధ్యతరగతి వ్యక్తిగా సుధాకర్ పాత్ర చిరస్థాయిగా నిలిచి పోయింది. చదువుల కోసం సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే విద్యార్థి జీవితానికి నిదర్శనం సుధాకర్ పాత్ర. ఆనాటి కాలపు ఆధునిక జీవన విధానానికి ప్రతీక సుధాకర్ జీవన శైలి. అది అందరికి ఆదర్శం, ఆచరణీయం. ఈ నవల చదివిన చాలా మంది మధ్యతరగతి విద్యార్థులు తమ జీవితాని సుధాకర్ పాత్రకు చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి అనుకుంటారు.

**మ్యాతరి ఆనంద్**
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 8184859060



# తీరిన కోరిక (నవల)

తెలంగాణలో శాసన పరిశోధకుడిగా పేరుగాంచిన వారు, నిరంతర శ్రమజీవి, చదువే తన సర్వస్వంగా, పుస్తకాలే తన ఆస్తిగా భావించే శాసనాల శాస్త్రి భిన్నూరి నరసింహ శాస్త్రిగారు. సమాజానికి ఏదో చేయాలని, తెలియని విషయాలను తెలియజేయాలనేది వారి మనస్తత్వం. వివిధ జిల్లాల సర్వస్వాలు, నాటకాలు, నవలలు, కథలే కాకుండా భారతదేశం, ఆంధ్రప్రదేశ్ చరిత్రలు, అలాగే వివిధ రాజుల చరిత్రలను, వారి శాసనాలను వెలికితీసి, మనసుతో తడిమి దేశానికి తెలియజేశారు. వీరు చరిత్రపరంగా, సాహిత్యపరంగా అన్ని ప్రక్రియల్లో కూడా మంచి నైపుణ్యం కలవారు.

తెలుగు సాహిత్యంలో ఆదికవి నన్నయ కాదు, నన్నెచోడుడే అని నిరూపించినవారు. ఇది ఒప్పుకోని కొంతమంది ఆచార్యులను తన దృష్టిలో 'పెద్దమనుషులు' అంటారని గంటి సోమయాజులు పేర్కొన్నారు. భాషాశాస్త్రం అర్థవిపరిణామంలో లోకోక్తి గురించి చెబుతూ పెద్ద మనుషులంటే మోసగాళ్ళు అనే అర్థంలో వాడాలి. ఇలా ఆంధ్రపాలనలో తెలంగాణ కవులను ఎదగనివ్వలేదు.

బి.ఎన్.శాస్త్రి గారు రచించిన నవలకు 'తీరిన కోరిక' అని పేరు పెట్టారు. అసలు కోరిక తీరిందా? తీరలేదా? తీరిన కోరికను ఎవరైనా గుర్తు చేసుకుంటారా? మనిషి ఆశాజీవి. ఒక కోరిక తీరగానే మరో కోరిక జనిస్తుంది. తీరని కోరిక ఉంటుంది. కానీ, తీరిన కోరిక ఉంటుందా? అవును. ఉంటుంది. దేవుడిచ్చిన దాంతో తృప్తిగా జీవించే మనిషే నా కోరిక తీరిందని చెబుతాడు. అలాంటి స్వభావం గల వారికి నాయకుడిగా 'వినోద్' పాత్రను శాస్త్రిగారు ఎన్నుకున్నారు.

వినోద్ నిరాశపరునిగా ఇంటి నుంచి బయల్దేరి ఒక పార్కులో కూర్చున్నాడు. సుందర్ రావు, వినోద్ నాన్న గారు ఇద్దరూ స్నేహితులు. వినోద్ పరిస్థితి అర్థం చేసుకొని తనకు సహాయం చేయాలని భావించాడు. వినోద్ నాన్న, సుందర్ రావుకు చాలా విషయాల్లో సహాయం చేశాడు. ఇప్పుడు స్నేహితుడి కుమారుడికి సహాయం చేసి రుణం తీర్చుకోవాలను కున్నాడు. ఇలా ఈ రోజుల్లో బంధాలు, బాంధవ్యాలు, ప్రేమానురాగాలు ఎక్కువ. నేటి రోజుల్లో సొంత అన్నదమ్ములను పట్టించుకునే వారే ఉండరు. జీవితంలో ఎవరైనా మనకు సహాయం చేస్తే వారిని మరిచిపోకూడదని, ఎలాగైనా వారి కుటుంబానికి తన సహకారం అందించాలని రచయిత మంచి విషయాన్ని ప్రతిపాదించారు. ఒకవ్యక్తి వృద్ధిలోకి రావాలంటే మూడు సూత్రాలు పాటించాలని, అవి ధర్మం, సహృదయత, పరోపకారం... ఇలా రచయిత మనకు నైతిక విలువలను, ఇతరుల పట్ల సహృదయతను ఎలా కలిగి ఉండాలో చెబుతారు.

ఇలా ఇంటినుంచి బయటకు వచ్చిన వినోద్ తన మనసు మార్చుకొని తల్లిని వదిలి వచ్చినందుకు బాధపడ్డాడు. సుందర్ రావు తన స్నేహితుడైన రాధారమణ ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇప్పించాడు. ఆ కాలంలో నెలకు నలభై రూపాయల జీతం ఉండేది. ఇప్పుడు అవి నాలుగు వేలతో సమానం. ఆధునిక సమాజం మారుతున్న కొద్దీ డబ్బు విలువ పెరిగిపోయి మానవ విలువలు తగ్గిపోతున్నాయి. విచ్చలవిడిగా ఖర్చు చేయడం, డబ్బు కోసం దేనికైనా తెగపడటం మనం చూస్తూనే వున్నాం. కర్మాగారంలో వినోద్‌కు గోపాల్‌తో మంచి స్నేహం ఏర్పడింది. తెలియని విషయాలను గోపాల్‌ను అడిగి తెలుసుకోవడం ఇద్దరు సమ ఉజ్జీలుగా పనిచేస్తున్నారు. వినోద్ తండ్రి తాను చనిపోవడానికి ముందు నగరంలో పెద్ద ఖాళీ స్థలం కొన్నాడు. అందులోనే రేకుల ఇల్లు వేసుకొని తల్లి, అన్న వదినలతో కలిసి ఉంటున్నాడు.

ఒకరోజు ఫ్యాక్టరీకి ఎనిమిది గంటలకే వెళ్ళాడు. ఫ్యాక్టరీ గేట్లు మూసి ఉన్నాయి, ఎవరూ కనిపించలేదు. చివరకు మేనేజర్ రామయ్య యజమాని మరణించాడని చెప్పడంతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి. యజమాని ఇంటికి వెళ్ళేసరికి అందరూ దు:ఖంలో మునిగారు. యజమాని పెద్ద కొడుకు కుమార్. కూతురు రాధ. చిన్నవాడుండే వాడు, అతనికి ఐదేండ్లు. కార్మికులు కష్టాల్లో ఉన్నప్పుడు సహాయం అందించి, వారితో ప్రేమగా మెలిగేవాడు. వారిని స్నేహితుల్లా భావించేవాడు. రచయిత యజమానికి కార్మికులకు మధ్య సంబంధాలను తెలియజేశారు. ఆస్తి అంతస్థుల్లో తేడా వుండొచ్చు కానీ, మనమంతా ఒక్కటే అన్న భావన యజజమానిలో ఉందని రచయిత అభిప్రాయం వ్యక్తంచేశారు.

వినోద్, గోపాల్ ఇద్దరూ ఫ్యాక్టరీ పనులను సక్రమంగా నడిపిస్తున్నారు. కుమార్

తన అవసరానికి డబ్బులను నీళ్లలాగా ఖర్చు చేసేవాడు. బాధ్యత లేకుండా స్నేహితులతో తిరిగేవాడు. దీంతో ఫ్యాక్టరీ నష్టాల పాలైంది. అవసరం లేకున్నా, వసంత అనే అమ్మాయిని ఉద్యోగంలో చేర్పించుకున్నాడు. మేనేజరుకు 150 రూపాయలు అయితే, ఆమెకు మాత్రం 200 రూపాయల జీతం ఇచ్చేవాడు. ఫ్యాక్టరీ నష్టాల్లో వుందని చెప్పి, కార్మికులందరి జీతాల్లో కోత విధించి, ఆమెకు మాత్రం అంత జీతమివ్వడం నచ్చలేదు. అలా ఇవ్వడంలో అమ్మాయి మీద వక్రబుద్ధి కలిగి వుండటమే తప్ప, ఫ్యాక్టరీని బాగు చేసే ఆలోచన మాత్రం లేదు. ఇలా రచయిత కుమార్ మనస్తత్వాన్ని తెలియజేశారు.

కుమార్, వసంత ఇద్దరూ సినిమాకు వెళ్లివస్తుండగా రామప్ప చూస్తాడు. చెడు అలవాట్లకు బానిసగా మారారని అర్థం చేసుకున్నాడు. ఫ్యాక్టరీ బాగుపడాలంటే కృషితో, పట్టుదలతో పనిచేయాలి. అతడు నష్టపోవడానికి కారణం అమ్మాయిలతో చెడు తిరుగుళ్లు తన ఆలోచనా విధానం సరిగ్గా లేకపోవడం, వ్యాపారం చేయడంలో, ఫ్యాక్టరీని నడపడంలో అనుభవం ఏమాత్రం లేదు. రచయిత కుమార్ వ్యక్తిత్వాన్ని కాముకునిగా చిత్రించాడు. ఫ్యాక్టరీ యజమాని తన కొడుకుని ఓ పద్ధతిగా పెంచలేదు. కొడుకు అడిగిందల్లా ఇచ్చి గారాబం చేశాడు.

కొంతమంది అమ్మాయిలు తన ఆస్తిని చూసి ఆకర్షితులవుతారని కుమార్ గమనించకపోవడం, అందరి మనస్తత్వాలూ ఒకేలా వుంటాయని భావించడం కుమార్ చేసిన పొరపాటు. రచయిత ఆ కాలంలోని పరిస్థితులను, కుమార్ స్వభావం ఎలా వుందో వివరించాడు.

వినోద్ నిరుద్యోగి. ఆయన తండ్రికి మిత్రుడి సహాయంతో ఫ్యాక్టరీలో చేరి మంచి అనుభవాన్ని సంపాదించాడు. పట్టుదలతో, ఆలోచనతో, సమయ స్ఫూర్తితో పనులు పూర్తిచేసి అందరి కంటే మంచి నైపుణ్యాన్ని సంపాదించాడు. మేనేజర్ దగ్గర, ఫ్యాక్టరీ యజమాని దగ్గర పేరు సంపాదించాడు. తోటి కార్మికులతో మంచి స్నేహసంబంధాలను అలవర్చుకున్నాడు. ఫ్యాక్టరీలో పనిచేసే స్త్రీల పట్ల గౌరవ మర్యాదలు కలిగి ఉండేవాడు. యజమాని కొడుకు కుమార్, స్త్రీలపట్ల అగౌరవంగా ప్రవర్తించడం చూసి వినోద్ కుమార్‌ను ఎదిరిస్తాడు. అంటే శాస్త్రి గారు స్త్రీలపట్ల ఎంతటి గౌరవ మర్యాదలు కలిగి వుండాలో ఈ పాత్ర ద్వారా రచయిత చూపిస్తాడు అలాగే జీవితంలో కష్టపడి ఎలా వృద్ధిలోకి వచ్చాడో, వచ్చిన అవకాశాలను ఎలా వినియోగించుకుంటాడో, తాను వృద్ధిలోకి వచ్చి, పది మందికి తన సూచనలను, సలహాలను అందించి వారికి సహాయం అందిస్తాడు. ఇలా ప్రతి పనిలో వినోద్ స్వభావాన్ని చిత్రీకరించాడు.

కుమార్ పాత్రను చూసినట్లయితే ఆజానుబాహుడే గాక, స్ఫురద్రూపి కూడా. స్నేహితులతో కలిసి డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేస్తుండేవాడు. స్నేహితులంతా కుమార్‌ను అమాయకుడ్ని చేసి బలవంతంగా డబ్బు ఖర్చు చేయిస్తారు. ఇక్కడ రచయిత స్నేహితులలో కొంతమంది డబ్బును చూసే స్నేహం చేస్తారని, ఆ డబ్బు ఉన్నంత వరకే వారి స్నేహం ఉంటుందని,అవి అయిపోగానే దరిదాపుల్లోకి కూడా రారని, కుమార్ స్నేహబృందం గురించి సవివరంగా వివరిస్తారు. ఇలా కుమార్ జల్సాలకు అలవాటు పడటం, అమ్మాయిలతో తిరగడం, అవసరం లేకున్నా ఎక్కువ డబ్బులిచ్చి ఫ్యాక్టరీల్లో అమ్మాయిలను చేర్పించుకోవడం దీని వెనుక అతని స్వార్థపు ఆలోచన. చివరకు అమ్మాయి వలలో చిక్కి, ఫ్యాక్టరీ అంతటా నష్టాల పాలవుతుంది. ఆస్తులన్నీ అమ్ముకొని అప్పుల పాలై బికారీగా మిగులుతాడు.

శాస్త్రి గారు సృష్టించిన మరోపాత్ర రాధా రమణ. ఫ్యాక్టరీ యజమాని ఈయనే. మంచి మనస్తత్వం గల వ్యక్తి. ఇతరులకు సహాయం చేసే గుణం కలవాడు. పెద్దల నుంచి సంక్రమించే ఆస్తిని జాగ్రత్తగా కాపాడుకుంటూ దానిని దినదినాభివృద్ధి చేసుకుంటూ తన వ్యాపారాన్ని కొనసాగించేవాడు. కార్మికుల పట్ల అభిమానం, సహృదయత కలిగిన వ్యక్తి. స్నేహానికి విలువనిచ్చే వాడు. స్నేహితుడి మీద అభిమానంతో వినోద్‌కు ఉద్యోగమిస్తాడు. ఎంత యజమాని అయినా, కార్మికులతో కలిసి ఉండటం, మాట్లాడటం, వారి బాధల్లో తాను పాలుపంచుకోవడం రాధారమణ గారి అనే యజమాని పాత్రలో శాస్త్రి గారు చిత్రీకరించారు. కార్మికులకు, యజమానికి మధ్య సంబంధాలు ఎలా వుండాలో రచయిత మనకు ఈ నవలలో సూచిస్తారు.

రామమూర్తి ఫ్యాక్టరీ మేనేజర్. ఈయన యజమానికి అత్యంత నమ్మకస్తుడు. ఫ్యాక్టరీకి చెందిన అన్ని విషయాలనూ ఈయనే చూసుకుంటారు. రచయిత నమ్మకంతో తన బాధ్యతలను ఓ వ్యక్తి నిస్వార్థంగా ఎలా నిర్వహించాలి, తాను తీసుకున్న జీతానికి బాధ్యతగా ఎలా పనిచేయాలో ఈ పాత్ర ద్వారా చూపిస్తారు. యజమాని చనిపోయినా, అక్కడే తాను బాధ్యతగా పనిచేయడం, యజమాని కుమారుడు ఎన్ని ఇబ్బందులు పెట్టినా, తన జీతంలో కోత విధించినా, యజమాని బతికున్న రోజుల్లో ఉద్యోగం కల్పించి కుటుంబానికి ఓ దిక్సూచి చూపించారన్న కృతజ్ఞతా భావనతో యజమాని కొడుకు ఎంత ఇబ్బందులకు గురిచేసినా వాటిని మౌనంగా భరిస్తాడు. అంతేకాకుండా కుటుంబ అవసరాలను దగ్గరుండి చూసుకునేవారు.

వినోద్ ఫ్యాక్టరీలో చేరగానే, ఆ ఫ్యాక్టరీలో 18 మంది పనిచేసేవారు. వారిలో వినోద్‌కి సమ ఉజ్జీగా పనిచేసే వ్యక్తి గోపాల్. వారిద్దరూ పోటాపోటీ పడి పనులను ముగించుకునేవారు. సమానమైన బలాబలాలు గలవారు. కాబట్టే ఒకరినొకరు తొందరగా

అర్థం చేసుకునేవారు. యంత్రాన్ని నడపడంలో ఒకరినొకరు సహాయంగా ఉండేవారు. ఒకరి సలహాను మరొకరు పాటించేవారు. ఇలా కొద్ది రోజుల్లోనే వారిమధ్య అన్యోన్యత ఏర్పడింది. ఒకరిని విడిచి ఒకరు వుండలేరన్న స్థాయికి చేరుకున్నారు. వినోద్ సొంతగా వ్యాపారం ప్రారంభించడానికి మిత్రుడిగా తన వంతు సాయంగా గోపాల్ కొంత మొత్తాన్ని అందిస్తాడు. తన బాధల్లో, కష్టాల్లో పాలుపంచుకొని తోడుండేవాడు. వీరిద్దరి మధ్య పరిచయం, స్నేహసంబంధం దినదినం ఎలా అభివృద్ధి చెందిందో చూపిస్తారు.

శాస్త్రిగారు రచించిన సాంఘిక నవల తీరిన కోరిక. ఇందులో పాత్రల చిత్రణ, సన్నివేశాలను రసపుష్టితో చిత్రీకరించారు. సన్నివేశాలను ఉన్నది ఉన్నట్టుగా, నిర్మొహమాటంగా తెలిపారు. సుజాతను కుమార్ ఆశపడి, ఆమెతో కోరిక తీర్చుకోవాలని అనుకుంటాడు. శాస్త్రిగారు కుమార్ మాటలను ఇలా వెలిబుచ్చారు. “నీ సౌందర్యం అపురూపం. నన్ను ఆకర్షించింది. యవ్వన మాధుర్యాన్ని ఆస్వాదించదలిచాను. నీవు లేంది ఈ లోకంలో ఒక క్షణం కూడా జీవించలేను” అంటాడు. భారతదేశ సంప్రదాయంలో పరాయి స్త్రీని ఒక తల్లిగా భావించే సంస్కారం మనది. సుజాత కుమార్‌తో నా జీవితాన్ని క్షణ సుఖాలకై నాశనం చేయదలుచుకోలేదు అని అంటుంది. శాస్త్రిగారు సుజాత యొక్క మన: పరిణతిని, ఆమె మనస్తత్వాన్ని తెలియజేశారు. ఒక తప్పు వల్ల ఎన్ని అనర్థాలు జరుగుతాయని అనుకొని, అతడి మనసు పసిగట్టి, తప్పించుకొనే ప్రయత్నం చేస్తుంది. కుమార్ సుజాత మాటలను వినకుండా ఆమెను బలవంతం చేయడానికి ప్రయత్నం జరుగుతుంది. శాస్త్రిగారు కుమార్ యొక్క పాత్రను కామాంధునిగా చిత్రీకరించారు. ఈ విషయం తెలుసుకున్న గోపాల్, వినోద్ ఆఫీసు రూము తలుపును బద్దలుకొట్టి ఆమెను కుమార్ నుంచి రక్షించారు. వారి ఉద్యోగాల కంటే కూడా ఒక స్త్రీని కాపాడటమే తన ప్రముఖ కర్తవ్యంగా భావించిన వీరు, వారి బాధ్యతలను ఎలా నెరవేర్చారో శాస్త్రిగారు ఈ ఘటన ద్వారా మనకు తెలియపరిచారు.

శాస్త్రి గారు వినోద్ తండ్రి, సుందర్రావు మధ్య వున్న స్నేహం, ఆప్యాయాన్ని తెలుపుతూ కృష్ణుడు అర్జునుడికి గీతను ఉపదేశించినట్లుగా వినోద్‌కి సుందర్రావుకు హితబోధ ఇలా చేశారు. నీవు నమ్మకంగా, న్యాయంగా ఉన్నంత వరకు నీ అభివృద్ధికి నిరోధం కలుగదు. మానవుడు తన జీవితంలో కొన్ని కట్టుబాట్లకు లోబడి, జీవిత నౌకను సాగించాలి. ధర్మాన్ని నీవు కాపాడితే, ధర్మం నిన్ను కాపాడుతుందని... ఇలా కొన్ని సూక్ష్మ ధర్మాలను పాటిస్తే ఏనాటికైనా వృద్ధిలోకి వస్తారని వినోద్‌కు తన వంతు సహాయం చేసి, వినోద్ తండ్రి నాకు చేసిన సహాయానికి ఆయన రుణం కొంతైనా తీరుతుందని శాస్త్రి గారు సుందర్రావు పాత్ర యొక్క సహృదయతను చాటిచెప్పారు.

వినోద్‌కు తన బాల్యంలో కర్మాగారాల్లో పనిచేయాలని కుతూహలంగా వుండేది. కానీ ఎవరి వద్దా పనిచేసినా ఏమాత్రం లాభంలేకుండా పోయిందని బాధపడుతూ పనిలోని అణకువ, మెలుకువ తెలిపేవారే అరుదైపోయారు. స్వతంత్రంగా చొరవ తీసుకొని పనిచేసినా ఎగతాళి చేసేవారే కానీ ప్రోత్సహించేవారే లేరని భావిస్తాడు. చిన్నతనం నుంచే ఎన్నో కలలు కంటూ ఒక పెద్ద యంత్రాగారాన్ని నిర్వహించి, జీవితంలో కష్టించి పనిచేయాలనుకుంటాడు. కానీ, ఆ ఆలోచనలకు అంతరాయం తొలి ప్రయత్నంలోనే కలిగింది. ఒక ధనవంతుని కర్మాగారంలో యంత్రాన్ని నడిపే పని నేర్చుకొని వృద్ధిలోకి వచ్చే సమయంలోనే వినోద్ తండ్రి మరణించడం వల్ల వినోద్ ఆశలు అడియాసలయ్యాయి. కుటుంబ బాధలతో అస్తవ్యస్తత, గృహ కల్లోలాలతో సహించక, పరిస్థితులకు లోబడి మానవుడు ఎన్నో చేయరాని పనులు చేస్తుంటాడు. జీవన ఆలంబనం లభించేంత వరకు "కుడితిలో పడ్డ ఎలుకలాగా" విలవిలా గింజుకొని శ్రమపడుతూ వుంటారు. తన తండ్రి గారి స్నేహితులు ఇప్పించిన ఉద్యోగంలో మంచి అనుభవం సంపాదించి, కార్మికులతో కలిసి మెలిసి అందరి తలలో నాలుకలా మారాడు.

చేరదీసి ఉద్యోగం ఇచ్చిన యజమాని చనిపోయాడు అని తెలుసుకున్న వినోద్ శరీరం జలదరించింది. అవ్యక్త ఆవేదనతో కుమిలి పోయి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నోటమాట పెగల్లేదు. వినోద్ జీవితానికి ఒక ఆధారాన్ని కల్పించిన యజమాని పట్ల ఉన్న గౌరవం, భక్తి, ప్రేమ వినోద్ కళ్లల్లో శాస్త్రిగారు చూపించారు.

ఉద్యోగం వదిలి సొంత ఫ్యాక్టరీ అంటున్నావు. అది మనతో అయ్యేపనేనా? అని వినోద్‌ను తల్లి వారించింది. చివరకు అమ్మమ్మ ఇంటికి వెళ్లి నాకు ఉద్యోగం అక్కర్లేదు. ఓ సొంత ఫ్యాక్టరీ నడపాలని ఉత్సాహంగా ఉంది. డబ్బు ఇచ్చేవారుంటే ఒక సంవత్సరంలో ముట్టచెప్పగలను అని అంటాడు. పదిహేను వేల రూపాయలు మొదట్లో కావాలి. కొత్త మిషన్లు, సామాన్లు కొనడానికి ఈ డబ్బు సరిపోతుంది. వినోద్‌కు తనమీద నమ్మకం ఎంత ప్రగాఢంగా వుందో ఈ పంక్తుల ద్వారా పాఠకులకు తెలియజేస్తారు.

ఒకప్పుడు మనుష్యులు సాటి మనిషికి కేవలం పేరు ప్రతిష్ఠల ద్వారానే డబ్బులు అప్పులిచ్చేవారు. ఎలాంటి హామీ పత్రాలు వుండేవి కావు. కేవలం మాట మీద నమ్మకంతోనే ఇదంతా జరిగేది. కానీ నేటి పరిస్థితులు అలా ఎంతమాత్రమూ లేదని రచయిత ఆలోచనల్లో అర్థమవుతుంది. ఎలాగో అలాగా అమ్మమ్మ వినోద్‌కు డబ్బు ఇప్పిస్తుంది. వినోద్ గోపాల్ సహాయంతో సామాన్లు, యంత్రాలు కొని ఫ్యాక్టరీని ప్రారంభించాడు. తనకు తెలిసిన

వారినే కర్మాగారంలో నియమించుకున్నాడు. అతి ఎక్కువ సమయం అందులోనే గడిపేవాడు. ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం పగలనకా, రాత్రనకా కష్టపడేవాడు. ఒక వ్యక్తి అభివృద్ధిలోకి రావాలంటే ఎంత కష్టపడాలో వినోద్ పాత్రద్వారా రచయిత మనకు బోధించారు.

చివరకు కుమార్ తండ్రి సంపాదించిన ఆస్తినంతా అమ్ముకొని అప్పుల పాలవుతారు. అప్పుల వారు మీద పడటంతో ఏమీ అర్థంకాక, చివరకు వినోద్ దగ్గరికి వెళ్లి తనను క్షమించమని, నేను నష్టపోడానికి తన చెడు అలవాట్లేనని బాధపడుతుంటాడు. తన ఫ్యాక్టరీ అమ్ముతానని, అదే తానే తీసుకోవాలని అభ్యర్థిస్తాడు. ఈ నవలలో చెడు అలవాట్ల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో తెలుస్తుంది.

శాస్త్రిగారు పాఠకులకు, నేటితరం యువతకు విలువలను, మరియు సమాజంలో జరుగుతున్న మోసపూరిత నయవంచనను, పేర్కొంటారు. స్త్రీల వ్యక్తిగత సమస్యలను అదునుగా తీసుకొని వారితో అసభ్యంగా ప్రవర్తించడం, హింసపెట్టడం లాంటివి చేయవద్దని శాస్త్రిగారు వేడుకుంటారు. స్త్రీ అంటే మాతృమూర్తి అని, పరాశక్తిగా చూపించాడు. రానూరానూ నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని, ఆ సమస్యను అధిగమించాలంటే యువతను నైపుణ్యం గల వ్యక్తులుగా ఎదిగి, ఏదో పనిలో అనుభవం సంపాదించుకొని బంగారులబాట వేసుకోవాలని హితబోధ చేశారు. జీవితంలో ప్రతీఒక్కరికి ఏదో సమస్య వుంటుంది. ఆ సమస్య వచ్చినపుడు బాధపడకుండా, వాటికి పరిష్కార మార్గాలను ఎంచుకొని, ముందుకు సాగాలని నవలను నడిపిస్తారు. జల్సాలకు అలవాటుపడి, స్త్రీల మీద వ్యామోహంతో మనిషి ఎలా దిగజారిపోతోడో చూపిస్తాడు. కేవలం హెచ్చరించడమే కాకుండా వాటికి పరిష్కారాలను కూడా రచయిత చూపిస్తారు.

ఈ నవలలో శాస్త్రిగారు తీసుకున్న వస్తువు, పాత్రలు, సన్నివేశాలను ఎంచుకున్న తీరు చూస్తే ఆయనకు సమాజం పట్ల ఉన్న అవగాహనను తెలుపుతుంది. మొదటి నుంచి ఈ నవలను పరిశీలిస్తే వినోద్ పాత్రలో తనకిష్టమైన పనిని చేయడానికి ఆయన పడ్డ కృషి, పట్టుదలతో పనిచేసి తన బాల్యం నుంచి ఉన్న కోరికను ఎలా నెరవేర్చుకున్నాడో 'తీరిన కోరిక' నవలలో రచయిత చూపించారు.

**వర్ధ వేణు**
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9963815484



# విప్లవజ్వాల

శ్రీ బి.ఎన్.శాస్త్రి గారు విద్యార్థి దశలో ఉన్నపుడు నల్లగొండ మండలంలో జరిగిన సంఘటనలు రజాకార్ల దురంతాలు, నైజాం పోలీసుల దౌర్జన్యాలు, జాగీర్దార్, దేశ్‌ముఖ్, దేశ్‌పాండేల అవినీతి కార్యకలాపాలు విప్లవ సంఘాల ప్రతిఘటనలను 'విప్లవజ్వాల' నవలలో ప్రతిబింబింపజేశారు.

ఖాసీం రజ్వీ, నిజాం నవాబులు కలిసి కన్న పగటికలల కారణంగా రజాకార్లు సృష్టించిన దురాగతాలకు బలైపోయిన హిందువుల దీనమైన పరిస్థితులను కళ్లకు కట్టినట్లుగా ఈ నవలలో వర్ణించారు. ఈ నవల కేవలం నల్లగొండ మండలానికే పరిమితమైంది. అక్కడి చరిత్రను కథా రూపంలో రచించాలనే కోరికతో ఈ నవలను రచించానని శాస్త్రిగారు చెప్పారు.

తెలంగాణా ఆంధ్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించి తెలంగాణ ప్రజల్లో చైతన్యం కలిగించిన ప్రజానాయకులు రావి నారాయణ రెడ్డి గారికి ఈ నవలను అంకితం చేశారు. ఇత్తెహాదుల్ ముస్లిమీన్ మజ్లిస్ అధినేత ఖాసీంరజ్వీ. ఇతడు ఉపన్యాసాలతో వేలాదిమంది ముస్లిం విద్యార్థులను ఉత్తేజపరిచి, రెచ్చగొట్టి వారందరినీ రజాకార్లుగా మార్చి, హిందూ కుటుంబాలపై దౌర్జన్యాలు, అరాచకాలు, దోపిడీలు చేసి, మజ్లిస్ నాయకులు ఇచ్చిన ధనంతో జల్సా చేసే జీవితానికి, హింసాయుత ప్రవర్తనకు అలవాటు పడేలా చేశాడు.

నైజాం నాయకుల ముఖ్య ఆశయం వారి ఉపన్యాసాల్లో వ్యక్తమౌతుంది. ఒకచోట అబ్దుల్ రహమాన్ అనే నాయకుడు ఉపన్యసిస్తూ... 'మనం మహ్మమద్ ప్రవక్త

అనుయాయులం. తల్వార్, బందూఖ్‌లతో పోరాడటం మనధ్యేయం. కాఫిర్లకు పరిపాలనా అధికారం ఎక్కడిది?'..... "మన జాతికున్న ధైర్యం ప్రపంచంలో ఏ జాతికీ లేదు. ముస్లిం రాజ్యాలు అనేకం వున్నాయి. పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, అరబస్తాన్, టర్కీ, ఇరాన్, ఇరాక్ మున్నగు దేశాధినేతలు మన నిజాం ప్రభువుకు అండగా వున్నారు. మన ప్రభువు ప్రపంచ ధనికుల్లో రెండో స్థానం ఆక్రమించాడు. మన ఆసిషా జెండా ఈ నైజాం డొమీనియన్‌కే పరిమితం కాదు. లాల్‌ఖిలా మీద కూడా మన ఆసఫ్జా జెండా ఎగరేయాలి. ఢిల్లీ పాయ్‌తక్త్ ఆక్రమించుకోవాలి. యావద్భారతాన్ని పాలించాలి" అని అన్నాడు.

"నిజాం సైనికులకు బహదూర్ రజాకార్ల తోడుంది. ఆయుధాలున్నాయి. ధైర్యంతో మన హక్కైన మన రాజ్యాన్ని మనమే ఏలుకోవాలనే భావానికి కట్టుబడి ఉండండి. హిందువులను ఊచముట్టుగా చంపండి, నరకండి. మన జాతి జీవనాన్ని మెరుగుపరచండి. మన నాయకుడు ఖాసీంరజ్వీ గారి ఆశయాల్ని సిద్ధింపచేయండి" అంటూ ముస్లిం యువకులను రెచ్చగొట్టి రజాకార్లుగా తయారు చేశారు.

## రజాకార్ల ప్రధాన విధులు

1. ప్రజల్లో నిజాం నవాబుపై అభిమానం కలిగించడం
2. వీలైనంత మందిని ఇస్లాం మతంలోకి మార్పిడి చేయించడం
3. నవాబుకు హిందూ ముస్లింలు రెండు కన్నుల వంటి వారని ప్రచారం చేయడం
4. నిజాం వ్యతిరేకులను సర్వనాశనం చేయడం
5. ముస్లిం కుటుంబీకులు ఎలాంటి వారైనా వారిని గౌరవించడం
6. గ్రామాల్లోని జమీందార్లను, భూస్వాములను, దేశ్‌ముఖ్, దేశ్‌పాండేలను నిజాం విధేయులను ఆధీనంలో ఉంచుకొని వారి ద్వారా కార్యాలను సాధించడం
7. నిజాం వ్యతిరేక గ్రామాలను ధ్వంసం చేసి, తగులబెట్టి దోచుకోవడం, స్త్రీల, ధన, మాన, ప్రాణాలకు హాని కలిగించడం
8. కమ్యూనిస్టులను వెదకిపట్టి వారి స్థావరాలను కనుగొనడం, వారిని వధించడం
9. వీలైనంత మంది హిందువులను ఇబ్బందులకు గురిచేసి వారిని సరిహద్దుల్లోని యూనియన్ ప్రాంతాలకు వలస వెళ్లేట్లు చేయడం.
10. నిజాం ప్రభువులను భక్తి శ్రద్ధలతో కొలవడం, ఆసఫ్జా మజ్లిస్‌ల జెండాలను తమ కార్యాలయాల ముందు ఎగురవేయడం.

11. నిజాం గొప్పదనాలను తెలిపే నినాదాలు చేయడం, ప్రతిదినం క్రమం తప్పకుండా ఖురాన్ పఠించడం, నమాజు చేయడం.

ఈ సూత్రాల ఆధారంగా రజాకార్లు, మజ్లిస్ ఉద్యమ నాయకులు నిజాం రాష్ట్రమంతటా బీభత్సాన్ని సృష్టించారు. మరోవైపు నల్గొండ ప్రాంత ప్రజల్లో నిజాం ప్రభుత్వ కార్యకలాపాలపై విపరీతమైన ఏహ్యాభావం పెరిగిపోయింది. ప్రజలను కమ్యూనిస్టు ఉద్యమాలు చైతన్యవంతులను చేసాయి. వేలాదిమంది యువతీ యువకులు నిజాం వ్యతిరేకోద్యమంలో చేరారు. నల్లగొండ జిల్లా పేరు చెబితే ముస్లిం పాలకులకు హడల్ పుట్టేది.

కమ్యూనిస్టుల కార్యకలాపాలు ఇక్కడ చాలా సమర్థవంతంగా నడిచాయి. సుంకిశాల రాంబాబు, వెంకటేశ్ వంటి యువకులు రావి నారాయణరెడ్డి మొదలైన మహా నాయకుల ఉపన్యాసాల వల్ల చైతన్యవంతులై ఉద్యమానికి సహకరించారు. నల్లగొండ మండలంలో వున్న దేశ్‌ముఖ్‌లు ప్రభుత్వానికి అండగా నిలిచారు. ముఖ్యంగా విస్నూరు రామచంద్రారెడ్డి అటు ప్రభుత్వానికి, ఇటు పార్టీ వారికి సహకరించారు. తన 60 ఊళ్లలో దోపిడీలు, దౌర్జన్యాలు సాగించినా ప్రభుత్వం దృష్టిలో గొప్పవాడిగా పేరు పొందాడు.కమ్యూనిస్టు నాయకుల ఏకైక లక్ష్యం నిజాం నిరంకుశ పాలనను అంతం చేయడం. కమ్యూనిస్టు కార్యకలాపాల్లో ముఖ్యమైనవి కేంద్ర నాయకత్వ సూచనల ప్రకారం అమలు అయ్యేవి.

## కమ్యూనిస్టు కార్యకలాపాలు

1. నిజాం పాలనా యంత్రాంగాన్ని భగ్నం చేయడం, గ్రామాల్లోని పటేల్, పట్వారీల భూములను స్వాధీనపరుచుకోవడం.

2. ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని పెంచడం, వారికి వడిశెల తిప్పడం, సాముగరిడీలు నేర్పడం, తుపాకీ పేల్చడం, నేర్పడం, పార్టీ సిద్ధాంతాలను బోధించి వారిని సుశిక్షితులను చేయడం

3. రజాకార్ల ఆగడాలను అరికట్టడం, వారిని భయభ్రాంతులను చేసి సమయం వచ్చినపుడు వారిని ఎదుర్కోవడం.

4. 'దున్నేవాడిదే భూమి' అనే నినాదంతో ప్రజలను ఆకట్టుకోవడం.

5. యువకులను ఉత్తేజపరిచి వారు నిజాం పాలనా విముక్తి పోరాటంలో చేరేలా చేయడం.

6. సురక్షితమైన అటవీ ప్రాంతాల్లో నివసిస్తూ విప్లవం నడపడం, ప్రజల సానుభూతితో విప్లవం లేవదీయడం.

7. స్త్రీలను రక్షించడం, రజాకార్ల పట్ల భయాన్ని తొలగించి, ధైర్య సాహసాలు నింపి, యువతులను ఉద్యమంలో చేర్చుకోవడం. ఉద్యమంలో యువతులు ప్రధాన పాత్ర పోషించారు. (రాధిక, పార్వతి, లలిత...)

8. జాగీర్దార్ల భూములను పేదలకు పంచడం.

9. రజాకార్ల దురాగతాలను ఎప్పటికప్పుడు కట్టడి చేయడం.

10. ఆంధ్ర మహాసభ నిర్వాహకులతో, కాంగ్రేసు కార్యకర్తలతో కలిసి పనిచేస్తూ సమిష్టిగా విప్లవ సంఘాలను నడపడం, ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడం.

11. అమాయకులైన ముస్లిం ప్రజలను, నిరపరాధులను రక్షించడం వారి సానుభూతి, సహకారాలను పొందడం.

12. ప్రజలను నిజాం ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేసే విధంగా చేసి నిజాం ఆర్థిక వ్యవస్థను స్తంభింపచేయడం.

13. సంస్థానంలోని ప్రజల కష్టాలు తీరే వరకు పార్టీ కార్యకలాపాలు నిర్వహించి, తర్వాత ప్రజా జీవనం గడపడం.

14. భారత యూనియన్‌లో నిజాం చేరేవరకు ఉద్యమాన్ని కొనసాగించడం.

ఈ లక్ష్యాలతో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా బయలుదేరింది కమ్యూనిస్టు ఉద్యమం. ఈ ఉద్యమం ప్రజా సంక్షేమార్థం ఉద్భవించింది. కానీ వీరిని బలంగా పని చేయకుండా వారి కదలికలపై ఆంక్షలు, ఆనాటి ప్రధాన పత్రికలపై ఆంక్షలుండేవి. కమ్యూనిస్టులకు ఆ కాలంలో కేవలం 'ఆంధ్రవాణి' అనే పత్రిక మాత్రమే అందుబాటులో ఉండేది. గోలకొండ పత్రిక, మీజాన్, రయ్యత్ వంటి పత్రికల మీద ఆంక్షలుండేవి. వార్తలు బయటకు రాకుండా అదుపు చేసే ప్రయత్నం నిజాం ప్రభుత్వం నుంచి జరిగింది.

అయినా కమ్యూనిస్టులు 'నిజాం నిరంకుశ ప్రభుత్వం నశించాలి. హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో చేరిపోవాలి. అప్పుడు గానీ మనకు స్వాతంత్ర్యం సిద్ధించినట్లు కాదు' అంటూ లక్ష్యం చేరేవరకు పోరాటం జరిపినట్లు నవలలో చిత్రించబడింది.

నల్లగొండ జిల్లా ప్రాంతంలో ఉత్సాహవంతులైన యువకులు సంఘాల్లో నాయకత్వం వహించి చురుగ్గా నిజాం వ్యతిరేకోద్యమంలో పాల్గొన్నారు. వారి విప్లవజ్వాల చివరి వరకు కొనసాగి భారత యూనియన్ సైన్యం నిజాం రాష్ట్రాన్ని అష్టమల్లూర్ గ్రామంలో

సుంకిరాల జాగిర్దారు లచ్చిరెడ్డిని కమ్యూనిస్టులు అర్ధరాత్రి హత్యచేశారు. ఛోటేమియా అనుచరులు, పోలీసులు హత్యను గురించి ఊరిలోని పిల్లలు పెద్దలు, యువకులను ఎంతమందిని ప్రశ్నించినా మూకుమ్మడిగా పాపం పండింది. లచ్చిరెడ్డిని మేమే చంపినాము. మేమే చంపినాము" అన్నారు ముక్తకంఠంతో. దాంతో తాలుగ్దారుకు, పోలీసులకు కోపం వచ్చి లాఠీచార్జీ చేయించినా గానీ ప్రజల నుంచి జవాబు దొరకలేదు.

ఒక యువకుడు ఛోటేమియాను ఉద్దేశించి 'నీవెవ్వరు? ఏం సర్కారు మనిషివా? నిన్నియాల గాలిదుమారానికి కల్తీపటాకా కట్టినావ్? మమ్మల్నెందుకంటావ్?' అని ముందువెనుక ఆలోచించకుండా కనబడ్డ రాయినల్లా చేతపట్టి గురిచూసి ఛోటేమియా అనుచరులపైనా, పోలీసుల పైనా వేయడం ప్రారంభించాడు. ప్రజల హాహాకారాలు మిన్నంటాయి. ప్రజలు రాళ్ల దాడికి సిద్ధమైనారు. ఇండ్ల పైకెక్కి వడిశెల దిప్పి, రాళ్లవర్షం కురిపించారు. పోలీసులు కాల్పులతో ప్రజలను బెదిరించారు. ప్రజల్లో ఆరుగురి ప్రాణాలు పోయాయి. అయినా పోలీసు పటాలాల్ని ప్రజలు తరిమి తరిమి కొట్టారు.

ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా కూడా, దొరలు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ప్రజలను పీడిస్తూ, సుఖమయ జీవితానికి అలవాటుపడ్డారు. నిజాం నవాబుకు పాదదాసులై రజాకార్ల మురాకు అండగా నిలిచారు. దేశ్‌ముఖ్‌లు రజాకార్లకు డబ్బులిచ్చేవారు. రజాకార్లను సమర్థించే వారిని, సహకరించే వారిని కమ్యూనిస్టులు అంతం చేసేవారు, బెదిరించేవారు.

కమ్యూనిస్టు పటాలాల్లో స్త్రీలు కూడా ఉండేవారు. పాలెం దొరబిడ్డ పార్వతి. ఆమెను రజాకార్ల నుండి కాపాడుతూ రామవ్వ, రామచంద్రయ్యలు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి తీసుకెళ్తుండగా అడవిలో పార్వతి బావ రవి కమ్యూనిస్టు సభ్యుడు, ఇతర సభ్యులతో కలిసి తిరుగుతూ వీరిని చూసి చేరదీశారు. అక్కడ ఉన్న మిగతా నలుగురు యువతులను చూసి పార్వతికి ధైర్యం వచ్చింది. "బావా మీ పటాలంలో స్త్రీలు కూడా ఉన్నారన్న మాట." అని అంది. అప్పుడు రవి పటాలంలోని వారిని గురించి చెబుతూ "అవును పార్వతీ ఈనాడు యువతీ యువకులు త్యాగాలకు సిద్ధమైనారు. నిజాం నిరంకుశ కర్కశ పాలనకు వారి మనో నేత్రాలు తెరుచుకున్నాయి. చదువులకు స్వస్తివాచకం పలికి పోరాటాలకు సన్నద్ధులౌతున్నారు. ఎంతటి త్యాగానికైనా వెనుదీయని మనస్తత్వం వారిది" అన్నాడు రవి. ఈ సందర్భంలో పటాలం జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్లు వర్ణించారు శాస్త్రి గారు. పార్వతికి వారు నివసిస్తున్న ప్రాంతమంతా వింతగా కనిపించింది. అక్కడున్న

గుహలో సామాగ్రి, ఆయుధాలు, వంట సామాన్లు వర్షంవస్తే వీటన్నింటికీ ఏర్పాట్లు లేవు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఈ సభ్యులు ఎలా జీవిస్తున్నారో తెలియదు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న వీరిని చూస్తే తన తల్లిదండ్రుల ఆస్తిపాస్తులు, దర్పం, సోదరుల అధికార వాంఛ జ్ఞాపకం వచ్చాయి.

స్వార్థపరులకు, నిస్వార్థ సేవా పరాయణులకు ఎంత వ్యత్యాసమున్నదో అర్థమైంది. బావ మంచితనం, దేశభక్తి, విద్యా వినయ, గుణసంపదలు పార్వతిని ఆశ్చర్యానికి గురిచేశాయి. దుష్ట నిజాం రాజు ఒకవైపు, హిందువులకు నిలువ నీడ లేకుండా చేయడమే కాకుండా ఊర్లోని గోడల నిండా "హిందువులు, ముస్లింలు నిజాంకు రెండు కన్నుల వంటివారు", "షాహే నిజాం జిందాబాద్", "వలియద్ బహదూర్ జిందాబాద్", 'ప్రిన్స్ ఆఫ్ బెరార్ జిందాబాద్", అసఫ్జా వంశం వర్ధిల్లాలి, "హిందూ ముస్లిం భాయీ, భాయీ" వంటి నినాదాల గోడ రాతలు కళ్లనీళ్లు తుడవడానికే అని పార్వతికి అర్థమై, ఆలోచిస్తూ రాధిక వెంట నడిచింది.

అంతే గాకుండా పార్వతి తనకు కూడా రాధిక లాగే దేశ రక్షణ కోసం దేహత్యాగం చేయాలని ఉందని అంటుంది. అది ఒక పవిత్ర కార్యంలా భావిస్తుంది. బావ రవి మీద పార్వతికి ఎంతో అభిమానం, ఆరాధనాభావం కలిగాయి. రాధిక కూడా రవి గురించి చెబుతూ "మీ బావ చాలా మంచివాడు, దేశాభిమాని. సాటి మానవుల కష్టసుఖాల్లో పాలుపంచుకునే సున్నిత మనస్కుడు" అంటుంది. రాధిక కూడా సామాన్య స్త్రీ కాదు. ఆవేశం, రౌద్రం, కరుణ, పౌరుషం, ఆలోచనా శక్తి, అనురాగం, మేధా సంపత్తి, శక్తియుక్తులు మూర్తీభవించిన స్త్రీ. ఆమెతో కలిసి పటాలంలో పనిచేయడం అదృష్టంగా భావించేవారు. పటాలంలోని సభ్యులు. రాధిక రమేష్ గురించి మాట్లాడుతూ "మీ శక్తి సామర్థ్యాలు చూసి నేనవాక్కయిపోయాను. మానవులు సాధించలేని పనిని సాధించారు" అంది. రమేశ్ రజాకార్లను, పోలీసులను ఎదిరించి, నాలుగు పెట్టెల రైఫిళ్లు, పిస్తోళ్లు, మందుగుండు సామాగ్రిని తీసుకొని వచ్చాడు. అది చూసి రవి కూడా "రమేశ్ నీవు ఎంత ఘనకార్యం సాధించావ్ బ్రదర్. ఇంత మందుగుండు సామాగ్రి, ఈ ఆయుధాలు సాధించిన వారెవ్వరూ మన పార్టీలో లేరనుకుంటాను. ఒకరిద్దరితో అయ్యే పనికాదిది. విప్లవకారులంతా కలిసినా ఈ పని చేయలేకపోయేవారు. నాకు నిజంగా ఈ విజయం తెల్ల ఏనుగు ఎక్కినంత సంబరం కలిగిస్తూ ఉంది" అన్నాడు. ఇలా పటాలంలోని సభ్యులందరూ వారి జీవనాన్ని వదులుకొని ప్రజల సుఖసంతోషాల కోసం ఊరూరా తిరుగుతూ ప్రజలను చైతన్యపరుస్తూ చివరి వరకు పోరాటాలు చేశారు.

ఆగస్టు 15,1947 లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి హైదరాబాదు స్వతంత్ర రాష్ట్రంగా ఉండింది. నిజాం డొమీనియన్‌ను పరిరక్షించుకోడానికి నిజాం రాయబారాల పేరుతో స్వతంత్రంగానే ఉన్నాడు. భారత దేశంలో నిజాం రాజ్యాన్ని కలపలేదు. ఆనాటి నిజాం రాష్ట్రంలో అధిక సంఖ్యలో మహమ్మదీయులు కోరుకున్న అంశాలు.

స్వతంత్ర హైదరాబాద్ రాష్ట్రం

రజాకార్ల విజృంభణ

ఖాసీంరజ్వీ ఉత్తేజపూరిత వ్యాఖ్యలు

ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సంస్థ పటిష్ఠత

మజ్లిస్ అధికారులు హిందువులను హింసించుట

ఆయుధాలు సమకూర్చుకోవడం.

కమ్యూనిస్టు దళాలు ముఖ్యంగా అన్యాయంగా ఊళ్లను దోచి హత్యలు చేసే వారిని బంధించి తేవడం. ప్రభుత్వంపై ప్రజలు పగతో రగిలి పోతున్నపుడు విప్లవ సంఘటనలు జరిగేవి. విప్లవ వీరుల కన్నుల్లో విప్లవాగ్ని ప్రజ్వరిల్లిపోయేది.

భువనగిరి నుంచి బీబీనగర్ గ్రామం ఏడు మైళ్ల దూరంలో వుంది. ఒకరోజు రెండువందల మంది రజాకార్లు, ఛోటేమియా తన అనుచరులతో కలిసి వచ్చి ఊరిని దోచిన విధానం అమానుషం. 200 ఇండ్లను తగలబెట్టారు. 56 పశువులు కాలి చనిపోయాయి. 12 మంది పసిపిల్లలు, 26 మంది వృద్ధులు, 14 మంది స్త్రీలు, ఇద్దరు పురుషులు కాలి మసిబొగ్గు అయినారు. రజాకార్లను ఎదిరించిన 52 మందిని పొడిచి చంపారు. 37 మందిని గాయపరిచారు. గ్రామం రోదనలతో నిండిపోయింది. బీబీనగర్ దోపిడీ నిజాం పరిపాలనా చరిత్రలో మరుపురాని సంఘటన. పట్టపగలు జరిగిన అమానుషానికి ఇది తార్కాణం. ఇది మానవత్వానికే మచ్చ తెచ్చే చర్య. ఈ మారణకాండకు ముఖ్య కారకుడు ఆ గ్రామంలోని గుమాస్తా. పోలీస్ పటేల్ గిరీ చేసిన అబ్దుల్ లతీఫ్.

అబ్దుల్ లతీఫ్ కుటుంబానికి వసంతరావు చేసిన అన్యాయానికి ప్రతీకార చర్యగా వసంతరావు కుటుంబంపైనే కాకుండా బీబీనగర్ గ్రామంలోని ప్రజలు అందరికీ ఈ సంఘటన వల్ల తీరని అన్యాయం జరిగింది. నిడిగల్లు, తెలిదేవరపల్లి, చందంపేట, సిద్ధాపూర్, బ్రాహ్మణపల్లి మొదలైన అన్ని గ్రామాల్లోనూ కమ్యూనిస్టులుండేవారు. అక్కడ సిద్ధాపూర్ జహంగీర్ పెద్ద కమ్యూనిస్టు.

భువనగిరిలో మహా నాయకుడు రావి నారాయణ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన పదకొండవ ఆంధ్ర మహాసభ వల్ల ఆ ప్రాంత ప్రజలలో నవచైతన్యం ఉదయించింది. యువకులు, స్త్రీలు, పురుషులు, బాలురు, వృద్ధులందరూ వివక్ష లేకుండా నిజాం నిరంకుశ పాలన నిర్మూలనోద్యమంలో పాల్గొన్నారు.

ఒకవైపు తెలంగాణ ప్రాంతం మొత్తం కమ్యూనిస్టుల ప్రాబల్యానికి లోనైంది. ప్రజల సహకారం కమ్యూనిస్టులకు అండగా ఉంది. పాఠశాలలు మూతబడి విద్యార్థి నాయకులు కూడా నిజాం వ్యతిరేక ప్రచారంలో నిమగ్నమైనారు. మరోవైపు ఖాసీం రజ్వీ ఉపన్యాసాల వల్ల ప్రభావితులైన జామై ఉస్మానియా విద్యార్థులు చదువులకు స్వస్తి చెప్పి రజకార్ల ఉ ద్యమాల్లో చేరారు. దాదాపు 1200 మంది విద్యార్థులు మజ్లిస్ సంస్థలో చేరారు. రజ్వీ దారుస్సలాంలో వారికి తర్ఫీదు ఇప్పించి ప్రతి జిల్లాకు కొందరిని పంపించారు. హైద్రాబాదులో ముస్లిం మతోన్మాదుల దురంతాలు అధికమైనాయి. రజ్వీ ఏదో ఒకనాటికి హైద్రాబాదు నగరాన్ని హిందువులు లేకుండా చేయాలనే ఆలోచనలో పడ్డాడు.

నల్లగొండ మండలం యావత్తూ కమ్యూనిస్టుల కార్యకలాపాలకు ఆలవాలమైంది. విప్లవ సంఘాలకు ప్రజల మద్దతు లభించినప్పటికీ రజాకార్లు, నిజాం పోలీసు మిలటరీ వారి దౌర్జన్యాలు మితిమీరి పోయాయి. పలుచోట్ల ప్రజలు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ఊరేగింపులు నిర్వహించారు. పోలీసులు చాలాచోట్ల నిష్కారణంగా కాల్పులు జరిపారు. పోలీసులు, రజాకార్ల దాడులకు గురైన గ్రామాలు, దాడులలో మరణించిన వారి సంఖ్య అపారం. ప్రజలు రజాకార్ల ఆగడాలను ఎదుర్కొన్న చోట్ల రజాకార్లు, పోలీసులు, ప్రజలు వందల సంఖ్యలో మరణించారు.

ఛోటేమియా పరిస్థితి కూడా అంత ప్రోత్సాహకరంగా లేదు. షబ్రిమియా, రుస్తుంఖాన్‌ల హత్యలు అతడ్ని కుంగదీశాయి. నిజాం నిరంకుశ పాలనకు అంత్యదశ ప్రారంభమైంది. రెవిన్యూపద్దుల వసూళ్ళు ఆగిపోయాయి. కానీ రజాకార్లు దోచిన ధనం, వస్తువులు, స్త్రీల మంగళ సూత్రాలు, వివిధ రకాల బంగారు ఆభరణాలు నిజాం నివాసం చేరుకున్నాయి. గ్రామ ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవించారు. వెట్టి అధికమైంది. రజాకార్లకు కూడా అధికారులతో పాటు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

భారత యూనియన్ సైన్యాలు నిజాం రాష్ట్రాన్ని అష్టదిక్కుల నుంచి ముట్టడించారనే వదంతి ముస్లిం వర్గాల్లో మరింత భయాన్ని పెంచింది. వారు గ్రామాలను వదిలి పట్టణాలను ఆశ్రయించడం మొదలుపెట్టారు. వారికి భద్రత కరువైంది. కానీ ప్రభుత్వం వారికి రక్షణ కల్పించింది.

నల్లగొండ జిల్లా ప్రాంతంలో ఉత్సాహవంతులైన యువకులు సంఘాల్లో నాయకత్వం వహించి చురుగ్గా నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. వారి విప్లవజ్వాల చివరి వరకు కొనసాగి భారత యూనియన్ సైన్యం నిజాం రాష్ట్రాన్ని అష్టదిగ్బంధనం చేసి నిజాం ప్రభువును లొంగదీసుకొని హైదరాబాద్ సంస్థానం వారికి విమోచనం కలిగే వరకు కొనసాగింది.

ఈ నవలలోని రవి, రమేశ్ పాత్రలు విద్యావంతులైన యువకులు. కమ్యూనిస్టు విధానాలకు ప్రభావితులై నిజాం నిరంకుశ పాలనను, రజాకార్ల దురాగతాలను, మజ్లిస్ నాయకులైన ఛోటేమియా, షబ్బిమియాల దురాగతాలను ఏవిధంగా అడ్డుకున్నారో విప్లవకారులు ఎంత తెలివిగా వారిని విఫలం చేశారో తెలుస్తుంది.

రాధిక కుటుంబం దొరల దాష్టికాలకు బలైన విధానం కన్నీరు పెట్టిస్తుంది. నిజానికి ఈ నవలలో రాధిక ఒక విప్లవ జ్వాల. ఆ పాత్ర గురైన దౌర్జన్యాలను ఎదిరించడానికి రజాకార్లకు, పటేల్, పట్వారీలకు ఎదురు తిరిగి వారిని మట్టుపెట్టిన వీరవనిత. తన అక్కలాగా అరాచకానికి గురవబోతున్న లలిత అనే ఉద్యమకారిణిని షబ్బిమియా రుస్తుంఖాన్ల బారి నుంచి కాపాడి వారిని అంతం చేసిన సాహస యువతి. ఎన్నోసార్లు ఎన్నో తెలివి తేటలు ప్రదర్శించి రజాకార్ల పటాలాలు దౌర్జన్యాలు చేయకుండా ఆపగలిగిన ధీరవనిత. ఆమె ఒక విప్లవజ్వాల.

స్వయంగా నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నవారు బి.ఎన్.శాస్త్రి గారు కావడం వల్ల ప్రతి సంఘటనను అత్యంత వివరంగా, కన్నులకు కట్టినట్లుగా చెప్పడం కనిపిస్తుంది. ఈ నవలా రచనలో శాస్త్రిగారు ఒక చరిత్ర రచయితగా కాక, ఒక పాత్రగా, ఒక సూత్ర ధారునిగా, సహజమైన పోరాటసీమను చూసినవానిగా ప్రత్యేకరూపంలో దర్శనమిస్తారు.

**డా. పి. వారిజా రాణి**
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 97041 79975



# తుక్కాదేవి (నవల)

తెలంగాణ ప్రాంతంలో సామాజిక రాజకీయ, ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో గొప్ప సాహిత్యం వెలువడింది. ఉద్యమ సాహిత్యం, విప్లవ సాహిత్యం, కథా సాహిత్యం, అస్తిత్వ సాహిత్యం వంటివి విరివిగా వచ్చాయి. తెలంగాణ కవులు, రచయితలు వీటికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రజాజీవితాన్ని సమగ్రంగా ఆవిష్కరించాలన్న తపనతో నవలల్ని వేదికగా చేసుకున్నారు. ఈ ప్రయత్నంలో నవలల్లోనూ పలురకాల వస్తువైవిధ్యం దర్శనమిచ్చింది. హాస్య నవలలు, డిటెక్టివ్ నవలలు, సాంఘిక నవలలు అట్లా వచ్చినవే. అయితే వీటిల్లో కత్తిమీద సాము వంటిది 'చారిత్రక నవల'. దీనిలో వాస్తవాలను చెబుతూనే కథాకథనంలో సృజనాత్మకతను ప్రదర్శిస్తూ పాఠకులను ఆసక్తికి గురిచేయవలసిఉంటుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రచయితలెందరో తమ కలాన్ని కదిలించి విస్మరించబడిన గత చరిత్రల్ని తవ్వి తీసి చారిత్రక నవలలుగా రాశారు. అటువంటి వారిలో అగ్రగణ్యులు శ్రీ బి.ఎన్.శాస్త్రి. వీరి కలం నుండి జాలువారిన చారిత్రక నవల తుక్కాదేవి.

'తుక్కాదేవి' విజయనగర సామ్రాజ్య పాలకుడగు శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి రాజకీయ పరిస్థితులని, స్త్రీల స్థితిగతులని, యుద్ధవ్యూహాల రాజనీతిని ప్రతిబింబించే నవల. కానీ బి.ఎన్.శాస్త్రి గారు దీన్ని కేవలం రాజ్యం రాజు అనే అంశాలతోనే మలచ లేదు. ఆ రాజ్యమందుండే స్త్రీల గొప్పతనాన్ని చాటి చెప్పారు. తల్లి కోరికకై ఆత్మాభిమానాన్ని పక్కనపెట్టే బిడ్డగా, భర్త ప్రేమకై తపించే భార్యగా, రాజ్యాన్ని, తన భర్తను, కొడుకును రక్షించుకోవాలని ఆరాటపడే స్త్రీమూర్తిగా ఇట్లా అనేక పాత్రలతో ఎంతో సంఘర్షణాత్మకంగా

ఈ నవలని రూపొందించారు రచయిత. ఇది ప్రధానంగా స్త్రీ ఔన్నత్యాన్ని, స్త్రీ శక్తిని, స్త్రీ అనురాగాన్ని ప్రతిబింబించే నవలగా చెప్పవచ్చు.

శ్రీకృష్ణదేవరాయలు ఎంతో బలవంతుడు. ఎన్నో రాజ్యాలు గెలిచాడు. ఎంతో మంది రాజులను సామంతులుగా చేసుకున్నాడు. సాహిత్యంలోనూ అపురూప కావ్యాలను రచించి సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా కీర్తికెక్కాడు. అష్ట దిగ్గజాలను పోషిస్తూ భువన విజయాన్ని నడిపాడు. కానీ 'తుక్కాదేవి' ఇవేమీ చేయలేదు. అంటే యుద్ధమూ చేయ లేదు. రాజ్యము విస్తరించలేదు. ఎవరిపైన గెలవలేదు. అయినా ఆమె చరిత్ర సమాజానికి ఎందుకు తెలియాలంటే 'ఆమె ఎవరిని గెలవలేదు, కానీ తనను తాను గెలిచింది. తన బలహీనతలపై విజయాన్ని సాధించింది. ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎదిగింది'. అందుకే రచయిత ఆమె చరిత్రకు చారిత్రక నవలా రూపం ఇచ్చారు.

## ఇతివృత్తం

16వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల పాలనలో విజయనగర సామ్రాజ్యం దేశం నలుమూలల ఖ్యాతిగడించింది. 1509లో సింహాసనాన్ని అధిష్టించిన రాయలు రాజ్యవిస్తరణ చేయదలచి తన తాతల కాలంలో కోల్పోయిన రాజ్యాలను తిరిగి చేజిక్కించుకోవా లనుకుంటాడు. ఈ క్రమంలోనే ఆంధ్ర ప్రాంతాన్ని పరిపాలిస్తున్న ఓఢ్ర రాజగు ప్రతాపరుద్ర గజపతికి లొంగి పోవలసిందిగా వర్తమానం పంపుతాడు. కానీ ప్రతాపరుద్రుడు యుద్ధానికే సై అంటాడు. ఈ యుద్ధంలో ఓడిపోయి సామంతుడిగా ఉండేందుకు అంగీకరించడమే కాక తన కుమార్తె తుక్కాదేవిని ఇచ్చి వివాహం చేస్తాడు. ఈ చర్యలకు మనస్తాపం చెందిన అతని కుమారుడు వీరభద్ర గజపతి ఆత్మహత్య చేసుకుంటాడు. భర్త ఓటమి, వారసుడి మరణంతో చలించిపోయిన ప్రతాపరుద్రుడి పట్టపురాణి తన కూతురు తుక్కాదేవితో రాయలను హతమార్చాలనుకుంటుంది. తన అభిమతాన్ని కూతురుతో చెప్పి బలవంతంగా ఆ పని అంగీకరింప చేస్తుంది. రాయలను చంపబోయి తుక్కాదేవి భంగపడుతుంది. భర్త ఆగ్రహానికి గురై, రాజ్యం విడిచిపోలేక నల్లమల్ల అడవులకి వెళ్ళిపోతుంది. అక్కడ మంచి పనులు చేసి, రాయల మనసు తెలుసుకుంటుంది తుక్కాదేవి. ఇది సూక్ష్మంగా కథాసారాంశం.

పన్నెండు అధ్యాయాలుగా పొదిగిన ఈ నవల పరిమాణంలో చిన్నదే అయినా గొప్ప సందేశాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. అనవసరపు ఉపోద్ఘాతాలు, వర్ణనలు, ప్రయోగాలు లేకుండా సూటిగా సూక్ష్మంగా నవలా నిర్మాణం చేశారు శాస్త్రిగారు. ఒక అధ్యాయం నుండి మరొక అధ్యాయంలోకి ప్రవేశించే సందర్భంలో అధ్యాయాల మధ్య సంబంధాన్ని కొనసాగిస్తూ ప్రతి అధ్యాయంలోనూ సంతృప్తికరమైన కొంత సమాచారం

దొరికేలా అల్లినారు రచయిత. తొలి అధ్యాయంలో తుంగభద్రానదికి దక్షిణాన గల విజయనగర సామ్రాజ్యం పరిచయం చేయగా, రెండవ అధ్యాయంలో ఓఢ్ర రాజగు ఆంధ్ర రాజ్యాన్ని పాలించే ప్రతాపరుద్ర గజపతి బలపరాక్రమాలను తెలిపాడు. ఇక మూడవ అధ్యాయంలో విజయనగరంలోకి ప్రవేశించిన బందిపోట్లను, వేగులను పట్టుకొని రాజాస్థానానికి తీసుకొచ్చి విచారించడం కనిపిస్తుంది. నాలుగవ అధ్యాయంలో రాయల రాజ్యకాంక్ష, విస్తరణ, వ్యూహాలున్నవి. అయిదు, ఆరవ అధ్యాయాల్లో రాయలు, ప్రతాపుడికి రాయబారం పంపడం, సంధి వికటించడం వంటి విషయాలుండగా, ఏడవ అధ్యాయంలో యుద్ధం, ప్రతాపరుద్రుడి ఓటమి తెలుస్తుంది. ఎనిమిదవ అధ్యాయంలో తుక్కాదేవిని రాయలను చంపమని ఆమె తల్లి కోరడం, ఒప్పించడం ఉంది. తొమ్మిది, పది అధ్యాయాల్లో తుక్కాదేవి రాయలను చంపబోయి భంగపడి అడవులకి పోయి పశ్చాత్తాప పడడం ఉంది. పదకొండు, పన్నెండు అధ్యాయాల్లో తుక్కాదేవి చెరువులు తవ్వించడం, ప్రజలను ప్రేమించడం, అందరి ఆకలి తీర్చి అన్నపూర్ణగా పేరుగాంచి మనసు గెలుచుకోవడం కనిపిస్తుంది.

ఈ విధంగా బి.ఎన్.శాస్త్రిగారు పన్నెండు చిన్నచిన్న అధ్యాయాల్లో సూక్ష్మంలో మోక్షం అన్నట్లుగా చక్కని శిల్పంతో, వైవిధ్యభరితమైన పాత్ర చిత్రణలో ఈ నవలను మలిచిన తీరు ఎంతో కొనియాడదగినది. సందర్భానుసారమైన పదబంధాలు, సామెతలు, జాతీయాలు జోడించి నవలను రక్తికట్టించారు రచయిత.

## పాత్ర చిత్రణ

ఈ నవలలో కథానాయకుడు శ్రీకృష్ణదేవరాయలు ఇతనితో పాటు మంత్రి తిమ్మరుసు, ప్రతాపరుద్ర గణపతి, వీరభద్ర గణపతి, తుక్కాదేవి మొదలైన పాత్రలు ప్రధానమైనవి.

## శ్రీకృష్ణదేవరాయలు

తండ్రి నరసరాయలు మరణానంతరం మంత్రి తిమ్మరుసు చేతిలో పెరిగి, రాజ్యాధికారం చేపట్టిన శ్రీకృష్ణదేవరాయలు తన తాతల నాడు చేజారిన రాజ్యాలను తిరిగి తెచ్చుకోవడంలో చూపిన దేశభక్తి ఎంతో గొప్పది. ఒక రాజు ఎప్పుడు దృఢంగా ఉంటూ, ప్రజా శ్రేయస్సును కోరుతూ, చక్కని పాలన చేయడంలో చక్కని నైపుణ్యం కలిగి ఉండడం కొనియాడదగినది. రాజుకు ఉండాల్సిన ధైర్యసాహసాలు రాయల పాత్రలో ఉన్నాయి. ఓఢ్ర రాజగు ప్రతాపరుద్రుడికి సంధికోసం రాయబారం పంపడంలో, ప్రతాపరుద్రుడిని ఓడించి తుక్కాదేవిని వివాహమాడడంలో, ప్రతాపుడిని సామంతునిగా

చేసుకోవడంలో ఇట్లా అడుగడుగునా రాజనీతి కనిపిస్తుంది. భార్య తనను హతమార్చబోగా చంపకుండా క్షమించి, కేవలం రాజ్య బహిష్కరణ చేయడం, ఆమె పశ్చాత్తాపం చెంది, మంచి మనిషిగా మారి వచ్చిన ఆ తుక్కాదేవిని స్వీకరించడంలో రాయల పాత్రలోని మానవతని చూడవచ్చు.

## తుక్కాదేవి

ఈ నవలకు ప్రధానమైన ఇరుసు వంటి పాత్ర తుక్కాదేవి. ఈమె పాత్ర నవల మధ్యలో ప్రవేశించినప్పటికీ, ముగింపు సమయానికి కీలకమైంది. తుక్కాదేవి అమితమైన ఆత్మాభిమానం గల యువరాణి. ప్రతాపరుద్ర గణపతి గారాలపట్టి. సద్గుణవతి తల్లిదండ్రుల మాటలు జవదాటదు. తన తండ్రి యుద్ధంలో ఓడిపోతానేమోనని కలత చెందినప్పుడు ధైర్యాన్ని చెప్పింది. సమయం వచ్చినప్పుడు యుద్ధరంగంలో శత్రువులతో పోరాడుతానని చెప్పింది. యుద్ధంలో ఓడి, రాజ్యాన్ని కోల్పోయి, శ్రీకృష్ణదేవరాయల రాజ్యానికి సామంతుడిగా మారిన తండ్రి మాటను శిరసావహించి శ్రీకృష్ణదేవరాయలను వివాహమాడిన అనుకూలవతి. అందం, చందం పరాక్రమం కలిగిన రాయలు భర్తగా లభించినప్పటికీ సగటు స్త్రీగా అతని సౌందర్యానికి ముగ్ధురాలైంది. తన అంతటి అదృష్టవంతురాలు లోకమునందు లేరని మురిసిపోతుంది. అంత ఇష్టమైన భర్తని సైతం చంపడానికి తల్లికిచ్చిన మాట కోసం సిద్ధపడ్డ త్యాగి ఆమె. భర్త ముందు దోషిగా నిలవలేక నల్లమల అడవులకెళ్ళి ఆపన్నులను ఆదుకుని అన్నపూర్ణాదేవిగా మారిన మానవతామూర్తి.

రాయల ఆగ్రహానికి గురైన తుక్కాదేవి విజయనగరాన్ని వీడి అడవుల బాట పట్టిన సందర్భంలో మోయలేని అవమానభారంతో తనలో తాను కుమిలిపోతూ పలికిన మాటలు సగటు భారతీయ స్త్రీ అంతర్మథనాన్ని ఆవిష్కరించాయని చెప్పాలి. తుక్కాదేవి పాత్రను రచయిత ఎంత సున్నితంగా మలిచారో ఆమె మాటల్లో తెలుస్తుంది. "పతిని మించిన దైవం కలదా? పతి పరిత్యక్తనైన నన్ను లోకులు పరిహసింపరా? పుట్టింట నాకెంత భాగ్యమున్న నేమి? నాలో నెన్ని మంచి గుణ విశేషములున్నను లోకుల దృష్టిలో నా బ్రతుకు లోకువయే గదా! జగదీశ్వరుడగు శ్రీకృష్ణదేవరాయల పట్టపు రాణినగు నదృష్టవతినై నా పొయ్యిలో నేనే నీళ్లు పోసుకున జూచితిని" అన్న తుక్కాదేవి మాటల్లోని పశ్చాత్తాపం, బాధ ఆమెకు భర్తపై గల అభిమానాన్ని, వివాహ బంధంపై గల గౌరవాన్ని తెలియజేస్తుంది. ఒకవేళ తల్లి కోరిక కోసం రాయలను హతమార్చినా కూడా నేను సుఖంగా, సంతోషంగా ఉండగలనా అన్న భావన తుక్కాదేవిలో కలిగింది. రాయల రాజ్యం తన తండ్రి ప్రతాప గజపతిరాజ్యం రెండూ తనకే దక్కుతాయి. కాని భర్త లేకుండా

రెండు రాజ్యాలున్నా ఏం లాభం అనే బాధ తుక్కాదేవిని వైరాగ్యం వైపు నడిపించింది. ఇన్ని వైవిధ్యాలు ఈమె పాత్రలో పలికించాడు రచయిత. వాస్తవికతకు భంగం కలగకుండా చెక్కిన నవలాకారుని ప్రతిభ అసామాన్యం.

## ప్రతాపరుద్ర గజపతి

నాటి ఆంధ్ర ప్రాంతాన్ని పాలించిన ప్రతాపరుద్ర గజపతిని నవలా రచయిత ఎంతో స్వాభిమానం, ధైర్యం, రాజ్యంపై ప్రేమ, ధర్మం గల రాజుగా చిత్రించాడు. తొలుత రాయలు తన రాజ్యానికి రాయబారిని పంపి సామంతుడిగా ఉండాలని కోరినప్పుడు అంగీకరించకుండా యుద్ధానికే రమ్మనడంలో ప్రతాపుడి ధైర్యసాహసాలు కనిపిస్తున్నాయి. ఓడిన సందర్భంలో తన కూతురును విజేత, సంపన్నుడు, తెలివిగల వాడైన రాయలకిచ్చి వివాహం చేయడంలో అతని తెలివి లౌక్యం గొప్పదనిపిస్తున్నాయి. అధర్మ రీతిలో భర్తని చంపబోయిన కూతురు తుక్కాదేవిని అడవిలోకి పంపినా రాయలని బతిమిలాడకపోవడంలో అతని ధర్మనిష్ట తెలుస్తుంది. చివరికి ఆచూకీ కోసం భటులను పంపడంలో, సగటు తండ్రి మనస్తత్వం కనబడుతుంది. ఈ విధంగా ప్రతాపుడి పాత్రను నవల చివరకు గొప్ప గుణవంతునిగా నడిపించాడు రచయిత.

## వీరభద్ర గజపతి

ఈ నవలలో వీరభద్ర గజపతి పాత్ర నిడివి చిన్నదే! అయినా ఎంతో ప్రతిభావంతంగా చిత్రీకరించారు రచయిత. తన తండ్రితో రాయలు యుద్ధానికి వస్తున్నాడని తెలిసి, తండ్రిని భయపడవద్దనీ, మనమే గెలుస్తామనీ ధైర్యం చెప్తాడు. తుక్కాదేవిని రాయలు వివాహం చేసుకున్నాడని అయిష్టంగా ఉంటాడు. చివరికి రాయలకు కప్పం కట్టి సామంతుడిగా ఉండటం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకోవడంలో అతడికి గల స్వాభిమానం వ్యక్తమవుతుంది. రాయలు సైతం ఇతడి ఆత్మాభిమానానికి చలించిపోయాడంటే వీరభద్రుడి పాత్రని ఎంత ఉన్నతంగా ఈ నవలలో మలిచారో అర్థం చేసుకోవచ్చు.

## సన్నివేశ చిత్రణ

బి.ఎన్.శాస్త్రి గారు పరిశోధనలో గొప్ప శోధకులని అందరికీ తెలిసిందే. పరిశోధనలోనే కాదు, నవలా రచనల్లోను చేయి తిరిగిన వారని సన్నివేశ చిత్రణలో వారి సృజనాత్మకత మరింత ప్రకాశిస్తుందని ఈ నవలను చూస్తే తెలుస్తుంది.

'తుక్కాదేవి' స్వరూపం రీత్యా చారిత్రక నవల. దీనిలో కల్పనలకు తావుండదు. కాబట్టి ఉన్న విషయాన్ని మాత్రం కళ్ళకు కట్టినట్లు చెప్పాలి. అప్పుడే పాఠకుడి ఊహాశక్తి

కొంత సంతృప్తి పడుతుంది. నవల నడుస్తున్న క్రమంలో జరిగే సన్నివేశాల పరిణామాలని, చర్యలని ఎంత విడమరిచి (స్పష్టంగా) చెప్పితే అంత ఎక్కువగా పాఠకులకి రిజిస్టర్ అవుతుంది. దీనినే సినిమా భాషలో స్క్రీన్ ప్లే అంటారు. ఈ స్క్రీన్ ప్లేని కథా కదలికల్ని బాగా చెప్పారు రచయిత. ముఖ్యంగా విజయనగర సామ్రాజ్య రాజుగా శ్రీకృష్ణదేవరాయలు పట్టాభిషేకం పొందే సందర్భంలో ప్రతాపరుద్ర గజపతి కోటను విజయనగర సైన్యం ముట్టడించి సొంతం చేసుకొనే సందర్భంలోనూ, దేవరాయలను తుక్కాదేవి చంపబోయే సన్నివేశాలను ఎంతో సహజంగా చిత్రీకరించారు.

కృష్ణదేవరాయల పట్టాభిషేకం నాటి ఉత్సవాన్ని, రాజ్యంలోని వాతావరణాన్ని బి.ఎన్.శాస్త్రిగారు ఏ విధంగా చెప్పారో చూడండి. "నాటి సాయం సమయంబున విజయనగరాధీశుడు తెల్లని గజరాజు నధిరోహించిన మహేంద్రుడాయన బరుగు ఠీవితో నమాత్య, పండిత, సామంత, దండనాది, కవి బ్రాహ్మణ పుంగవులు వెంటరాగా, పురకాంతలు, పౌరులు, సౌధోపరి భాగములందు నిల్చి మహారాజుపై పూలవర్షం కురిపించగా, మహావైభవముగా నూరేగెను" అన్న పంక్తిలో నేత్ర పర్వమైన ఆ పట్టాభిషేకాన్ని మనం కూడా ఆ పురవీధుల్లో నిలొని చూస్తున్నామా! అన్న భావన పాఠకుడికి కలిగేలా చిత్రించారు నవలా రచయిత.

మరొక సన్నివేశంలో విజయనగర సైనికులు రాజ్య ఆక్రమణలో చూపే పౌరుషం, దూకుడు ఏ విధంగా ఉంటుందో దృశ్య సాదృశ్యం చేశారు శాస్త్రిగారు. నవల మధ్యలో వచ్చే యుద్ధ సందర్భాన్ని చూస్తే "విజయనగర సైనికులు విజృంభణము గాంచి, ఆంధ్ర దేశీయులు విచారించిరి. తమ సార్వభౌముని గతి ఏమౌనో అని చింతిల్లిరి. ప్రజలు తమ ప్రాణములను కాపాడుకొనుటకు కోటను వీడి పారిపోవ జూచిరి. కానీ యే వంక జూచినను రాయల సైనికులు యమకింకరుల వలె నిలువంబడి యుండిరి. వారు కోట చుట్టునూ కాపలా కాయుచు నొక్క పురుగును వెలుపలికి రానీయకుండిరి. సైనికులకు వెరచి పురజనుల చేత ప్రాణములుంచుకొని తమ విధిని దూరుతూ విలపించుచుండిరి" అంటూ యుద్ధం జరిగిన నాటి భయంకర స్థితిని అంతే భయంకర సన్నివేశాలతో రచన చేసి చూపారు రచయిత. ముఖ్యంగా ఈ సన్నివేశంలో ప్రజల భీతిని బాగా చిత్రించారు. సహజంగా యుద్ధంలో గెలుస్తామన్న ఆశతో ఒకరాజు, ఓడిపోతామన్న అనుమానంతో మరో రాజు కాపాడటం చూస్తాం. కానీ వారికి మించి ఆ రాజ్యంలోని ప్రజలు పడే సంఘర్షణ ఈ సన్నివేశంలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఓ సందర్భంలో తుక్కాదేవి రాయలను చంపబోతుంది. అక్కడ శాస్త్రిగారి రచన ఎంతో కొనియాడదగినదిగా ఉంది. ఒకే సన్నివేశంలో భావనలను బాగా పలికించారు. కృష్ణదేవరాయలు ఏకాంత మందిరంలో తుక్కాదేవి ప్రవేశించగా భార్యాభర్తల ప్రణయ భావం అక్కడ కనిపిస్తుంది. అంతలోనే తుక్కాదేవి దాచుకున్న 'యశిధేనుక' (చురకత్తి) బయట పడడంతో నిశ్శబ్దం ఆ గది మొత్తం ఆవహిస్తుంది. ఇట్లా ఒకే సన్నివేశంలో రెండు దృశ్యాలని, భావనలని చూపారు రచయిత. ఓ సన్నివేశంలో రచయిత మాటలు చూస్తే "నాటి రాత్రి శ్రీకృష్ణదేవరాయలు జగన్మోహిని అగు తుక్కాదేవి ఉండు సుద్ధాంతమునకేగెను. తుక్కాదేవియును నాతని నాహ్వానించి సకలోపచారములుగావించెను. ఆమె ప్రవర్తనకు రాయలెంతయో సంతసించెను. ఆసనముపై కూర్చుండి ఆమెతో మాటలాడసాగెను. కొంతకాలం వరకు వారిరువురు సరససల్లాపముల నాడుకొను చుండిరి. తుక్కాదేవి తన బంగారు ఒడ్డాణమును సవరించుకొనుచుండ గుప్తముగా దాచుకొనిన యశిధేనుకను గాంచెను" అన్న పంక్తుల్లో ఎంతో గంభీరమైన వాతావరణం అక్కడ అలుముకొన్నట్లు తెలియడమే కాక ఆ తర్వాత ఏం జరుగుతుంది అన్న మీమాంస, ఉత్సుకత పాఠకుడిలో ఏకకాలంలో ఉత్పన్నమవుతాయంటే ఆశ్చర్యం కాదు. ఇటువంటి గొప్ప సన్నివేశ చిత్రణలెన్నో ఈ నవలలో కనిపిస్తాయి.

ఈ విధంగా రచయిత నవలలోని గాఢత దెబ్బతినకుండా, కథ పక్కదారి పట్టకుండా, జాగ్రత్త పడుతూనే అద్భుతమైన సన్నివేశ చిత్రణలు చేసి కథలోని పాత్రలు సన్నివేశాలు కళ్ళముందు కదలాడుతున్న భావన ఒకింత కలిగిస్తూ నవలని రక్తి కట్టించారు.

**సంభాషణా చతురత**

బి.ఎన్.శాస్త్రి గారు తుక్కాదేవిని గూర్చిన చరిత్ర ఈ నవల ద్వారా తెలిపే ప్రయత్నం చేశారు. అయితే ఆ క్రమంలో తుక్కాదేవి పాత్రను ఆకాశ స్థాయిలో ఆవిష్కరించే పనిపై దృష్టి పెట్టలేదు. అలా పెడితే వారు అందరిలాగే వస్తువు పట్ల ఆకర్షితుడైనవారు అవుతారు. అందుకే వారు నవలని సమగ్రంగా చదువరులకు రసపుష్టిగా ఉండేలా చేస్తూ పాత్ర చిత్రణలే కాక మిగిలిన అంశాలపైన దృష్టి పెట్టారు. వాటిల్లో చెప్పుకోవాల్సింది సన్నివేశ చిత్రణ, సంభాషణా చతురతల గురించి నవలలో అనేక సందర్భాల్లో పాత్రల మధ్య సంభాషణలని చతురతతో చెప్పించి కథని ఆసక్తిగా ముందుకు నడిపారు.

విజయనగర సామ్రాజ్యంలోకి రహస్యంగా ప్రవేశించిన ఓఢ్రరాజ్య వేగులను తిమ్మరుసు రాయలు ముందు పెట్టి వారి చేత నిజాన్ని చెప్పిన సందర్భంలో రాయలని

చంపేందుకు తుక్కాదేవిని ఆమె తల్లి చేసిన సంభాషణలు, ఎంతో తెలివిగా లౌక్యంగా ఉండి పాత్రల స్వభావాల్ని పాఠకుడి మరింత స్పష్టంగా అర్థం చేసుకునేలా ఉన్నాయి.

నవలలో ఒక సందర్భంలో తిమ్మరుసు ద్వారా శాస్త్రి గారు చూపిన చతురత ఓ సారి చూస్తే "బంధితులారా! మీ పేర్లేమిటి? అయ్యా! నా పేరు ఆనందవర్ధనుడు, ఇతని పేరు మహేంద్రుడు. వర్తకముజేయతలంప మేమిచటికి వచ్చితిమి. మీరీ నగరమునకొచ్చి ఎన్ని దినములుండెను. మూడు దినములైనది. ఈ మూడు దినములు మీ నివాసమెక్కడ. నగరమునకు తూర్పువైపున సత్రంలో బస చేసితిమి. మీరు లేయే ప్రదేశములు జూచితిరి. పురవీధులు, అంగడులు, దేవాలయాలు చూచితిమి. తిమ్మరుసు కోపమున వారిని చూచెను. భటులతో వీరిద్దరిని గొంపోయి చెరయందు ఉంచండని" అంటాడు.

ఇక్కడ తిమ్మరుసు సంభాషణాచతురతతో వారు పక్క రాజ్యం నుండి వచ్చిన వేగులని గుర్తించాడు. మూడు రోజులు ఏం చూశారు ఇక్కడ అన్న తిమ్మరుసు ప్రశ్నకు బందీలిద్దరూ 'పురవీధులు, అంగడులు, దేవాలయాలు' అని చెప్పడంతో వారి ఆలోచనలు బయట పెట్టినట్లు అయ్యింది. నిజానికి వ్యాపార రీత్యా వచ్చిన వారు అంగడిలో వస్తువులు కొంటారు, లేదా అమ్ముకుంటారు. కానీ వీరు దేవాలయాలు చూడ్డంలో ఆంతర్యం ఆ రాజ్యంలోని రాజు ఎంత సుభిక్షంగా పాలన చేస్తుండో ఎంత సంపన్నుడో దేవాలయాల నిర్మాణాలు చెబుతాయి. అదేవిధంగా పురవీధుల్లోని శుభ్రత, ప్రశాంతత, ప్రజల జీవనం గమనిస్తే రాజుపై ఆ రాజ్య ప్రజలకు గల విశ్వాసం తెలుస్తాయి. అందుకే ఆ వేగులు వాటిని సందర్శించారు. శాస్త్రి గారు మంత్రి తిమ్మరుసు పాత్ర సంభాషణాచతురత ద్వారా ఈ విషయాలు ఎంతో ఆసక్తిగా వెలువరించారు.

మరో సందర్భంలో "రాణి తుక్కాదేవిని ఆలింగనం ఓనర్చుకొని బిడ్డా ! నిన్ను గనిన నా పూర్వజన్మ ఫలమే యనవచ్చును. నా మాట జవదాటని దానివేని నే జెప్పు కార్యము చేతునని వాగ్దానము జేయుమని అడిగెను. దైవసాక్షిగా నెరవేర్తును. ఆ కార్యం ఏమిటో ఎరింగింపుమని తుక్కాదేవి తల్లితోయనెను". ఈ వాక్యాల్లో తుక్కాదేవి తల్లి మాటలను పరిశీలిస్తే ఆమె పాత్ర ద్వారా రచయిత సంభాషణా చాతుర్యం ఎట్లా ఒలికించారో తెలుస్తుంది. రాణి తన కోరికని ముందే చెబితే తుక్కాదేవి ఒప్పుకుంటుందో లేదో అన్న సంశయంతో తీవ్రమైన వేదనతో కూడిన మాటలను తెలివిగా ముందే ప్రయోగించి బిడ్డని ఒప్పిస్తుంది. దీన్నిబట్టి బలం, బంధము, సంధి వంటివేవీ పనిచేయని నిస్సహాయ స్థితిలోనూ మాటల చతురత ఏ విధంగా పనికి పూనుకునేలా చేస్తాయో నవలా రచయిత

ఈ సన్నివేశం ద్వారా చక్కగా వివరించారు. ఇట్లా తుక్కాదేవి నవలలో శాస్త్రిగారు ఎంతో సంభాషణ చతురతను జోడించి ఆసక్తిగా కథనాన్ని నడిపారు.

## తుక్కాదేవి నవలలో శిల్పం :

దాశరథి చిల్లరదేవుళ్ళు, విశ్వనాథ ఏకవీర నవలలో ఏవిధంగా అయితే శిల్పం అద్భుతంగా ఉంటుందో బి.ఎన్.శాస్త్రి రాసిన 'తుక్కాదేవి' నవలలోను శిల్పం అంత చక్కగా ఉంది. తుక్కాదేవి నవల చారిత్రక నవల. దీన్ని నిర్మించేటప్పుడు ఒక కల్పిత రచనలా కాకుండా చరిత్రను చెప్తూనే ఆ కథలో భాగమైన పాత్రల స్వభావాల్ని అనుసరిస్తూ చక్కని నవలాశిల్పాన్ని ఏర్పరచవలసి ఉంటుంది. ఆంగ్లం నుంచి అనువదించబడిన మాక్సిం గోర్కీ 'అమ్మ' వంటి నవలలో శిల్పానికన్నా అధికంగా నవలా వస్తువు సమర్థనకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కానీ శాస్త్రి మాత్రం అట్లా చేయలేదు. వస్తువుకి, పాత్ర చిత్రణకి, శిల్పానికి సమ ప్రాధాన్యం ఇచ్చారు.

నేటికీ సుమారు 450 సంవత్సరములకు పూర్వము పావన తుంగభద్రా నదికి దక్షిణ భాగమున నాంధ్ర సామ్రాజ్య రాజధాని నగరంగా విజయనగరము శృంగారమైన పట్టణము అన్న ప్రారంభ పలుకుల నుండి... అట్టి సన్మార్గవతిని రప్పించి కృష్ణరాయలు స్వీకరించుట న్యాయము తుక్కాదేవి మాకు మహారాణి కావలసియున్నదని తలచి రాయలకు తన మనోగతం నెరింగించును"... అన్న నవలలో చివరి పలుకుల వరకు నవలారచయిత చక్కని శిల్ప సౌందర్యాన్ని ప్రదర్శించాడు. విజయనగర సామ్రాజ్యం అందాలు, వీధులు, సాహితీశాల, భవంతులు అక్కడి ప్రజల సంతోషాలు, పట్టాభిషేకం నాటి నగర వైభవం తెలిపిన సందర్భాలు ఇందుకు నిదర్శనం. అదే విధంగా కథ క్రమంగా ప్రతాపరుద్ర గణపతి రాజ్యానికి చేరి రాయలు మరొక వివాహం చేసుకోవడం, ఆమె అతడిని చంపాలనుకోవడంతో ఇది చారిత్రక నవలే అయినప్పటికీ పాఠకుడు ఊహించని ఆశ్చర్యానికి గురవుతాడు. మొత్తంగా బి.ఎన్.శాస్త్రి గారు ఎక్కడ శిల్పం చెదరకుండా నవల ఆది నుండి అంతం వరకు నేరుగా అందలి వస్తువుని తెలుపుతూనే శిల్పం జారకుండా తన రచనా పటిమను ప్రదర్శించారు.

కృష్ణదేవరాయలు కథానాయకుడిగా అనిపించే ఈ నవల కొంతవరకు యుద్ధాలు రాజ్యకాంక్ష రాజ్యం రాజు వంటి అంశాలతో నిండి ఉన్నప్పటికీ ఇందులో ఎంతో భావుకత ఉంది. స్త్రీ యొక్క ఆర్తి ఉంది. భర్తకి దూరమైన, బిడ్డని కోల్పోయిన స్త్రీల ఆవేదన ఉంది. ఈ సంఘర్షణలన్నీ స్త్రీ పాత్రలతో పలికించడంలో రచయిత మంచి శిల్పరీతిని చూపారు.

## నవలలో భాష

శాస్త్రిగారు ప్రధానంగా పరిశోధకులు కావడంతో వారి పరిశోధనలో తేలిన చారిత్రకాంశాలనే ఈ తుక్కాదేవి నవలగా మలిచారు. ఇది కాలం పరంగా చూస్తే 16వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యంలో జరిగిన కథ. రాయల మూడవ భార్య అయిన తుక్కాదేవిది. ఆంధ్రప్రాంతం. వారిది కన్నడ భాష, ఈమెది ఆంధ్రభాష. ఇరుప్రాంతాల వారికి ఈ కథ తెలియాలన్న ఉద్దేశమో ఏమోగాని శాస్త్రిగారు దీన్ని 'సరళ గ్రాంథికం'లో రాశారు రచనాసమయానికి / కాలానికి సరళ గ్రాంథికానికి ఆనాటి పాఠకులు అలవాటు పడి ఉన్నారు. అయినప్పటికీ రచయిత కొంత గ్రామీణ పదాలను సామెతలను నవలలో స్పృశించారు. 'గోరుచుట్టుపై రోకటిపోటు', 'పులి కడుపున మేక పిల్ల బుట్టునా', 'స్త్రీ బుద్ధి ప్రళయాంతకం', 'పొయ్యిలో నీళ్లు పోసినట్టు', 'జలసేతు బంధనం', 'యదకత్తిలోని పోక చందమై' వంటి సామెతలను జోడించడమే కాక కంటక ప్రాయం. అచ్చెరువు, మహా ప్రసాదం వంటి జాతీయాలు పదబంధాలు ప్రయోగించి సామాన్య పాఠకుడికి సైతం దగ్గరిగా అనిపించేలా సరళంగా రాశారు శాస్త్రి గారు.

## ముగింపు

తుక్కాదేవి చారిత్రక నవలా రచయిత అయిన బి.ఎన్.శాస్త్రిగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. మూసీ పత్రిక వ్యవస్థాపకులన్నా వారే గుర్తొస్తారు, సాహిత్య సంపాదకులు అన్న వారే గుర్తొస్తారు, చరిత్ర పరిశోధకులన్నా, శాసన పరిశోధన, పరిష్కరణ కర్తలన్నా వారే గుర్తొస్తారు. అంతటి గుర్తింపుని సాహితీలోకంలో పొందిన నిత్య సాహితీ కృషీవలుడు బి.ఎన్.శాస్త్రిగారు. ఒకరకంగా శాస్త్రిగారు తెలుగు వారవడం తెలుగు ప్రజలు చేసుకున్న అదృష్టం. లేకుంటే చారిత్రకాంశాలు మరుగున పడి కాలగర్భంలో కలిసిపోయి ఉండేవి.

శాస్త్రిగారు అంటే ఏమిటో నిరూపించడానికి చాలా అంశాలు ఉన్నాయి. అందులో నవలాకారులుగా వారి ప్రతిభ ఏంటో తెలిపింది తుక్కాదేవి నవల. ఇది చారిత్రక నవలే అయినప్పటికీ వారు దీన్ని ఎంతో ఆసక్తిగా మలిచారు అన్నది వాస్తవం. నవలలోని ప్రతి పాత్రకు ప్రాధాన్యత కల్పించారు. ఆ పాత్రల మధ్య సంబంధాన్ని సున్నితంగా చిత్రించారు. సరళ గ్రాంథిక భాషకు తెలుగు వారి వ్యవహారిక సామెతలు జోడించి పఠనాన్ని సులభం చేశారు. స్త్రీల యొక్క ప్రేమని సమపాళ్ళల్లో ప్రదర్శించి తుక్కాదేవి నవలను చారిత్రక నవలలో ఒక చుక్కానిగా నిలిపారు బి.ఎన్.శాస్త్రిగారు.

**ఆచార్య డి. సూర్యా ధనంజయ్**
అధ్యక్షులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 98491 04187



# వాకాటక మహాదేవి

ఆంధ్ర దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన ఆంధ్ర రాజవంశాలు మూడింటికీ తెలంగాణ ప్రాంతం స్వస్థలం కావటం విశేషమైన విషయం. అందులో శాతవాహనులు కరీంనగర్ ప్రాంతం నుంచి ధాన్యకటకానికి, అక్కడి నుంచి ఉత్తర భారతావనికీ విస్తరించగా, విష్ణుకుండినులు మహబూబునగర్ ప్రాంతం నుంచి వెళ్లి నల్లగొండలో మొదటి రాజధానిని నిర్మించుకొని తదనంతర కాలంలో తమ రాజధానిని అమరావతికి మార్చుకున్నారు. విష్ణుకుండినులు గుంటూరు జిల్లా వినుకొండ ప్రాంతం వాళ్లనే అపప్రథను తొలగించి శాసనాధారంగా వారు నల్లగొండ ప్రాంతం వారని నిరూపించిన చారిత్రక పరిశోధకులు శ్రీ బి.ఎన్. శాస్త్రిగారు. చరిత్ర పరిశోధనా సారాన్ని సామాన్యుడికి అందించే అత్యుత్తమ వాహిక చారిత్రక నవల. ఈ వాహికను ఉపయోగించి జన్మభూమి ఔన్నత్యాన్ని పతాక స్థాయిలో నిల్పిన విశిష్ట రచయిత, వాస్తవ చారిత్రక నవలా సృష్టికర్త శాస్త్రిగారు. దాదాపు మూడు శతాబ్దాల విష్ణుకుండినుల చరిత్రలో అతిప్రసిద్ధుడైన మాధవవర్మ చరిత్రను 'వాకాటక మహాదేవి' అనే పేర నవలీకరించారు శాస్త్రిగారు. నవల అంటే కల్పనా ప్రధానమైనది. చారిత్రక నవల అందుకు అతీతమైనది కాదు. మరి వాస్తవ చారిత్రక నవల అంటే ఏమిటి? అంటే ఏది వాస్తవమో, ఏది కల్పనో ఏర్పడనివ్వని రచన. గతం నుంచి వర్తమానానికి వారధి కట్టుకునే పాఠకుడికి టైమ్ మెషీన్‌లా ఉపయోగపడే రచన. పరిశోధకులు నిగ్గుతేల్చిన చారిత్రక సత్యాలకు అనుసంధానంగా కల్పించిన సన్నివేశాలు, పాత్రలు, సంఘటనలు పాలలో నీళ్లలా కలిసిపోయి చరిత్రను పాఠకుని అనుభవంలోకి తెచ్చే రచన. చరిత్ర

గురించిన ప్రాథమిక అవగాహనతో చేసిన రచనలో కాల్పనికత స్పష్టంగా కనబడుతుంది. చరిత్రను లోతుగా అధ్యయనం చేసిన పరిశోధకుని రచనలో వాస్తవికత నిక్కి చూస్తుంటుంది. ఇటువంటి రచన చేయాలంటే చరిత్ర విషయాల పట్ల సాధికారికత ఉండాలి. నవలాంశంగా ఎన్నుకొన్న చరిత్ర అంశంతో మమేకం కావాలి. బి.ఎన్.శాస్త్రి గారు రచించిన 'వాకాటక మహాదేవి' అనే నవలలో ఇది మనకు అడుగడుగునా, అణువణువునా కనబడుతుంది.

శాతవాహనుల తరువాత దక్షిణ భారతదేశంలో మూడు సముద్రాలను తాకునట్లుగా రాజ్యాన్ని విస్తరించి తెలుగు జాతి ఔన్నత్యాన్ని పున: ప్రతిష్ఠించిన వారు విష్ణుకుండినులు. వీరి పరిపాలనా కాలం క్రీ.శ.4వ శతాబ్ది నుంచి క్రీ.శ. 7వ శతాబ్ది దాకా అని చరిత్ర పరిశోధకుల నిర్ణయం. వీరి రాజధానిని వినుకొండగా చరిత్రకారులు నిర్ధారించిన సమయంలో దానిని ఖండించి, వారి రాజధాని ఇంద్రపురి (ఇంద్రపాల నగరం) అనీ, అది నేడు నల్లగొండ జిల్లాలోని భువనగిరికి దగ్గరలో ఉన్న తుమ్మలగూడెంగా చెప్పబడుతోందని శాస్త్రిగారు శాసన ఆధారాలతో నిరూపించి ఉన్నారు. ఆనాడు ముచికుందగా పిలవబడ్డ నేటి మూసీ నది ఒడ్డున ఉన్న ఈ ప్రాంతం శాస్త్రి గారి కలల ఆలయం హరిహర త్రిశక్తి క్షేత్రానికి నెలవైన వలిగొండ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. విష్ణుకుండినుల మొదటి రాజధాని తెలంగాణ ప్రాంతంలో ఉందనీ, చరిత్రకారులు చెప్తున్నట్లు వారందరూ వైదిక మతాభిమానులు కాదనీ, బౌద్ధమతాన్ని ఆదరించి అనేక నిర్మాణాలు చేసి, అంతరిస్తున్న బౌద్ధానికి తెలుగు నేలపై ఊపిరులూదారని నిరూపించిన శాస్త్రిగారు విష్ణుకుండినుల సమగ్ర చరిత్రను సాధికారికంగా ప్రకటించడానికి అనేక వ్యయప్రయాసల కోర్చిన మహా మనిషి. పరిశోధనా ఫలాలను నవలారూపంగా సామాన్యుడికి అందించి జాత్యభిమానాన్ని పెంచడానికి ,తెలంగాణ ప్రాంత ఔన్నత్యాన్ని నలుదిక్కులా పంచడానికి కృషి చేసిన సృజనశీలి.

**చారిత్రక నేపథ్యం**

ఇంద్రపాల నగర శాసనాలుగా చెప్పబడే రెండు తామ్ర శాసనాలు తుమ్మలగూడెం ప్రాంతంలో దొరికాయి. విష్ణుకుండిన రాజు గోవింద వర్మ ఒకటి, విక్రమేంద్ర భట్టారక వర్మ మరొకటి వేయించారు. శాతవాహనుల తరువాత ఇక్ష్వాకుల ఏలుబడి కిందికి వచ్చిన తెలుగు నేల వారి తరువాత ఖండ ఖండాలుగా శాలంకాయనులు, ఆనంద గోత్రీకులు, కదంబులు, బృహత్పలాయనులు, కళింగులు, విష్ణుకుండినులు మొదలైన రాజవంశాల పాలనలోకి వచ్చింది. ఆ సమయంలో ఈ రాజవంశాలన్నింటినీ ఓడించి త్రిసముద్రాధిపత్యంతో పాటు ఉత్తరాన రేవానది వరకు రాజ్యాన్ని విస్తరింప చేసి తెలుగు జాతి ఔన్నత్యాన్ని

పున:స్థాపించిన వాడు విష్ణుకుండిన మాధవవర్మ. అశ్వమేధాది అనేక క్రతువులు ఆచరించిన వాడు, త్రికూట మలయాధిపతిగా పిలువబడినవాడు, చరిత్రకారులచే రెండవ మాధవవర్మగా చెప్పబడిన ఇతని పాలనా కాలమే శాస్త్రిగారి 'వాకాటక మహాదేవి' అనే చారిత్రక నవలా వస్తువు.

చరిత్రను పాఠకుడి అనుభూతిలోకి అందించేది చారిత్రక నవల. చరిత్రలోని ఒక ప్రధాన సంఘటన లేక వ్యక్తిచుట్టూ అల్లబడిన కాల్పనిక, వాస్తవిక సన్నివేశాల సమాహారమే చారిత్రక నవల. కల్పన పెరిగితే నవలలోని చరిత్ర ప్రామాణికతను కోల్పోతుంది. వాస్తవ విషయాలు మాత్రమే వివరిస్తే చరిత్ర గ్రంథమై పోతుంది. అందుకే చారిత్రక నవలా రచన కత్తిమీద సాము లాంటిది. వాస్తవిక సంఘటనలకు అనుసంధానమైన కాల్పనిక సన్నివేశాలు నవలా కాలపు చరిత్రతో పాఠకుడికి తాదాత్మ్యాన్ని భుజింప చేయాలి. చరిత్ర తెలిసిన పాఠకుడు కూడా వేరు చేయలేనంతగా కాల్పనిక విషయాలతో అల్లుకున్న నవల ఉత్తమ స్థాయికి చెందిన చారిత్రక నవల. ఆ కోవకు చెందిన ఈ నవలను విష్ణుకుండినుల చరిత్ర పట్ల ఉన్న అపోహలను తొలగించడానికి, చరిత్రను నవలీకరించడం అత్యుత్తమ మార్గంగా విశ్వసించి రచించారని చెప్పవచ్చు. నవలా పీఠికలో రచయిత 'చారిత్రకులు, పరిశోధకులీ నవలను సమాదరింతురనే విశ్వాసాన్ని ప్రకటించడంలోనే ఈ నవలలో కల్పన కంటే వాస్తవ చరిత్రకే పెద్దపీట వేయబడిందని స్పష్టమౌతోంది.

## ఇతివృత్త నిర్వహణ/ నామౌచిత్యం

ఇంద్రపాల నగరం రాజధానిగా బౌద్ధమతాభిమానియైన విష్ణుకుండిన రాజు గోవిందవర్మ రాజ్య పాలనా కాలంలో ఆతని కుమారుడు యువరాజు మాధవవర్మ అమేయ పరాక్రమంతో శాలంకాయనాది రాజ్యాలను జయించి వాకాటక రాజకుమారిని వివాహం చేసుకొని కళింగులకు వాకాటకుల సాయం అందకుండా చేసి ఓడించడం, వైదిక మతావలంబులైన ఇరుగుపొరుగు రాజవంశాలు, బౌద్ధులైన విష్ణుకుండినుల రాజ్యాక్రమణకు నిరంతరం యత్నించడం విష్ణుకుండిన రాజు వైదిక బౌద్ధమతాల మధ్య సామాన్య వాతావరణం నెలకొల్పే చర్యలు చేపట్టడం, మహారాజైన అనంతరం మాధవవర్మ తన మొదటి భార్య కుమారుడైన దేవవర్మతో కలిసి విజయయాత్రకు వెళ్లడం, ఆనంద గోత్రీక, కందరాది రాజ్యాలను ఆధీనంలో తెచ్చుకోవడం, పల్లవరాజ ప్రతినిధులను జయించి శ్రీశైలక్షేత్ర ప్రాంతాన్ని, కళింగులను ఉత్తరాన రేవానది వరకు తరిమికొట్టి, శాలంకాయన రాజ వంశాన్ని అంతంచేసి వేంగీ సామ్రాజ్యాన్ని ఆక్రమించడం, త్రిలింగ క్షేత్ర సమావృతమైన (ద్రాక్షారామం, శ్రీశైలం, కాళేశ్వరం) భూమండలాధిపత్యాన్ని సాధించడం, పరిపాలనా సౌలభ్యం కోసం

రాజధానిని ఇంద్రపాల నగరం నుంచి అమరావతికి మార్చడం, దేవవర్మకు యువరాజు పట్టాభిషేకం, వాకాటక మహాదేవికి పుట్టిన విక్రమేంద్రవర్మకు గుప్త రాజకుమారితో వివాహ బంధం ఏర్పరచి వాకాటక రాజ్యాభిషిక్తున్ని చేయడం, విజయయాత్ర అనంతరం కీసరలో రామలింగేశ్వర ప్రతిష్ఠ చేయడం వరకు గల చరిత్రకు నవలా రూపమే 'వాకాటక మహాదేవి.'

విష్ణుకుండిన రాజులలో అప్రతిమాన ప్రతిభావంతుడైన మాధవవర్మ ఇతివృత్తాన్ని చెబుతూ ఆయన పేరు కాకుండా ఆయన వివాహం చేసుకున్న స్త్రీ పేరు నవలకు పెట్టడంలో రచయిత ఉద్దేశ్యం పరిశీలనార్హమైన విషయం. చరిత్రలో ప్రతి విషయమూ ప్రధానం కాదు. సాంఘికంగా ప్రభావం చూపించింది, మార్పు తెచ్చింది ప్రధానమౌతుంది. ఆ విషయం జాతి ఔన్నత్యాన్ని, సంప్రదాయాన్ని నిరూపించేది, పరిరక్షించేది అయినపుడు అది మరింత ప్రధానమౌతుంది. 'విష్ణుకుండిన ప్రభువులు వస్తుత: బ్రాహ్మణులు, వేదాధ్యయన సంపన్నులు, ఇక్ష్వాకుల సామంతులు. వీర పురుషదత్తుని కాలమున వైదికము వీడి బౌద్ధమతాన్ని అవలంబించినా' రన్నది రచయిత అభిప్రాయం. (పేజీ 157) ఆ క్రమంలో తల్లిదండ్రులు బౌద్ధ సంప్రదాయాన్ని అనుసరించినా మాధవవర్మ వైదికుడిగా మారటానికి కారణం శివభక్తురాలైన వాకాటక మహాదేవిపై ఆయనకున్న అభిమానం. కాబట్టి ఆమె ప్రాధాన్యతను నిరూపించడానికి రచయిత నవలకు ఆవిడ పేరు పెట్టారనవచ్చు. ప్రజలలో బౌద్ధానికి ఆదరణ తగ్గుతున్న కాలంలో, చుట్టూ ఉన్న రాజ్యాలన్నీ వైదిక మతాన్ని ఆదరిస్తున్న సమయంలో పూర్వ రాజ వంశమైన ఇక్ష్వాకు వంశం. వైదిక మత నిరాదరణ చేసి రాజ్యాధికారాన్ని కోల్పోయిందనే విషయం తెలిసీ బౌద్ధాన్ని అభిమానించిన మాధవవర్మ తండ్రి గోవిందవర్మ భార్య పేరుతో పరమ మహాదేవి విహార నిర్మాణం చేశాడు. కానీ ప్రజలకు మతస్వేచ్ఛ నిచ్చి తాను స్వయంగా అనేక ఆలయాలకు దానధర్మాలు చేసినట్లు, అలాగే మాధవవర్మ, వాకాటక మహాదేవి కూడా శైవ క్షేత్రాలతో పాటు అమరావతీ స్థూపం మొదలైన బౌద్ధ క్షేత్రాలని సందర్శించినట్లు రచయిత కల్పించారు.

## చారిత్రక నవల - కథా సంవిధానం

చారిత్రక నవలకు ఐదు ప్రధాన లక్షణాలుండాలని రా.రా. వివరించారు. 1. చారిత్రకత 2. దేశకాల నిర్దిష్టత 3. చారిత్రక శక్తికీ, సామాజిక ధర్మానికీ మధ్య జరిగే ఘర్షణ 4. చరిత్రను నాటకీకృతం చేయడం 5. గతానికి, వర్తమానానికీ మధ్య కార్యకారణ సంబంధం.

నవలారంభం ముచికుందా నది ఒడ్డున ఉన్న విష్ణుకుండినుల రాజధాని ఇంద్రపాల నగర వర్ణనతో మొదలవటం రచయిత ప్రాంతీయాభిమానానికీ, నేదు మూసీగా

వ్యవహరింపబడుతున్న ముచికుందానదితో ఆయనకున్న గాఢమైన అనుబంధానికి అద్దంపడుతుంది. మాధవవర్మ తమ రాజ్యంపైకి దండెత్తి వచ్చిన కళింగ సేనలకు వారికి సహాయంగా వచ్చిన వాకాటక సైన్యాన్ని కాళేశ్వర ప్రాంతంలో ఎదుర్కొన్నాడనేది చరిత్ర విషయం కాగా, ఆ సమయంలో కాళేశ్వర క్షేత్రంలో శివార్చన కోసం వచ్చిన వాకాటక రాజకుమారి మహాదేవిని చూసి వివాహమాడాలని సంకల్పించడం చరిత్రకు అనుసంధానమైన కల్పన.

బౌద్ధ మత క్షీణతకు విహారాలలో సన్యాసినీ సన్యాసుల అసాంఘిక ప్రవర్తన కూడా ఒక కారణమనే వాస్తవాన్ని బౌద్ధ ఆచార్యులైన దశబలబలి, మహానాగుల సంభాషణ ద్వారా తెలియ చేసి, మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్న ఆనందవర్ధనుడు స్త్రీ మోహంలో చిక్కుకుని బౌద్ధమత చ్యుతికి కారణమైన సన్నివేశాన్ని కల్పించారు రచయిత.

మాధవవర్మ మొదటి భార్య కాంతిమతీ దేవి బౌద్ధమతానుసారి కాగా, ఆమెకు పుట్టిన కుమారుడు వైదిక మతం వైపుకు ఆసక్తుడవుతాడు. రెండవ భార్య వాకాటక మహాదేవి భర్త చేత అనేక యజ్ఞయాగాదులు, పుణ్యక్షేత్ర సందర్శనం చేయించి వైదిక ధర్మాచరణలో మునిగి తేలితే ఆమె కుమారుడు విక్రమేంద్ర వర్మ తథాగతుని బోధలకు ఆకర్షితుడవుతాడు. నవలలోని పాత్రలను ఆనాటి చారిత్రక శక్తులకూ, సామాజిక ధర్మాలకూ ప్రతినిధులుగా చిత్రించి, వాటి మధ్య జరిగే ఘర్షణను పాత్రల మధ్య జరిగే ఘర్షణగా చిత్రించడం చారిత్రక నవలా లక్షణంగా విమర్శకులు వివరిస్తుంటారు. విష్ణుకుండిన రాజుల బౌద్ధ ధర్మాచరణ కారణంగానే వైదికాభిమానులైన రాజులతో ఘర్షణ ఏర్పడినట్లు నవలలో వర్ణించబడింది. అయితే రాజుల అంత:పురంతో సహా రాజ్యమంతటా మత స్వేచ్ఛ ఉండేది. పరమ మహాదేవి వంటి బౌద్ధ సాంఘికురాలు శైవాన్ని, వాకాటక మహాదేవి వంటి శైవారాధకురాలు బౌద్ధాన్ని సమంగానే గౌరవించిన విశాల హృదయం కలిగిన పాత్రలు. తల్లిదండ్రులు, పిల్లలు, భార్యాభర్తలు వేర్వేరు మతాలు అనుసరించడం చారిత్రక పాత్రలకే పరిమితం కాక, కల్పిత పాత్రలకూ అన్వయించబడింది. పరమ మహాదేవి స్నేహితురాలు అరుంధతి వైదిక నిష్ఠాగరిష్ఠురాలు కాగా, ఆమె కుమార్తె శాంత మాధవవర్మకు సోదరి లాగా పెరుగుతూ బౌద్ధాన్ని అనుసరిస్తుంటుంది. ఈమె వివాహం సర్వసైన్యాధ్యక్షుడు, వైదిక మతాభిమాని మార్తాండవర్మతో జరిపించి విష్ణుకుండిన రాజ్యంలో వైదిక, బౌద్ధ సంప్రదాయాలు సుహృద్భావ వాతావరణంలో విలసిల్లినట్లు చిత్రించారు రచయిత.

మాధవ వర్మ మొదటి భార్య కాంతిమతీ దేవి ఆనంద గోత్రిక రాజుల ఆడపడుచు. ఆమె వివాహ సమయంలో ప్రసిద్ధ చైత్యాలయమున్న అమరావతీ ప్రాంతాన్ని బౌద్ధాభిమానులైన

విష్ణుకుండినులకు అరణంగా ఇచ్చారని, వారి పాలనలో చేజెర్ల స్థూపం కపోతేశ్వర ఆలయంగా మార్చబడిందని, భట్టిప్రోలు స్థూపం దిబ్బగా మారిందని పాత్రల ప్రసంగవశాన సూచించబడింది. విస్తృతమైన సామాజిక, రాజకీయ స్థితిగతుల చిత్రణ వల్ల కథాగమనం కుంటుపడకుండా చూడటం కథా కథన శిల్ప నిర్వహణా చాతుర్యానికి తార్కాణం.

అసామాన్యుడైన మాధవవర్మను వెన్నంటి నడిపించిన స్త్రీగా వాకాటక మహాదేవి పాత్ర ప్రత్యేకంగా తీర్చబడింది. ఆమెను వివాహం చేసుకున్న తరువాత కొంతకాలం తల్లిదండ్రుల దర్శనానికి కానీ, మొదటి భార్య కుమారులను చూడటానికి కానీ, మాధవవర్మ వెళ్లలేదని చెప్పడం, రమ్మని కబురు పంపిన తల్లిదండ్రుల దగ్గరికి అతనితో కలిసి మహాదేవి వెళ్లటం, అక్కడ సవతి కుమారుడి మెడలో విలువైన ఆభరణం వేసి ప్రేమను ప్రకటించడం, అలాగే వాకాటక మహాదేవి కోరిక మేరకు శత్రురాజుల అధీనంలో ఉన్న త్రికూటేశ్వరుడిని (ఈనాడు గుంటూరు జిల్లాలో వున్న కోటప్పకొండ) దర్శించడం కోసం మాధవవర్మ, మహాదేవి మారువేషాలలో వెళ్లడం, శ్రీశైల ప్రాంతం విష్ణుకుండినుల అధీనంలోకి వచ్చాకే మల్లికార్జునుడిని సేవిస్తానన్న మహాదేవి అభిమతం నెరవేర్చడం కోసం మాధవవర్మ దండయాత్ర చేయడం మొదలైన సన్నివేశాలు వాకాటక మహాదేవి పాత్ర వ్యక్తిత్వాన్ని, విష్ణుకుండిన రాజ్యాన్ని వైదిక మతం వైపుకు మరల్చడంలో ఆమె పోషించిన భూమికను ఎత్తిచూపిన చారిత్రక కల్పనలు.

మాధవవర్మ క్రీ.శ. 435 మాఘశుద్ధ పంచమి నాడు పట్టాభిషక్తుడైనాడని రచయిత చేసిన నిర్ణయం. కొంతకాలం తర్వాత పెద్ద కొడుకు దేవవర్మ తోడురాగా విజయ యాత్రకు వెళ్లి శాలంకాయనులను తుదముట్టించి వేంగీ సామ్రాజ్యాన్ని విలీనం చేసుకున్నాడు. ఆనంద గోత్రీకుల రాజధాని కందరపురం (గుంటూరు జిల్లాలోని కంతేరు లేక చేబ్రోలు కావచ్చని చరిత్రకారుల అంచనా) ఆక్రమించి గుంటూరు ప్రభువు త్రిపురాంతకుని ఓడిస్తాడు. వీరందరితో కలిసి కందవోలు మండలంలో పల్లవ ప్రతినిధులుగా ఉన్న రేనాటి చోళులను ఓడించి శ్రీశైల ప్రాంతం ఆక్రమించుకుంటాడు. ఈ విధంగా విష్ణుకుండిన సామ్రాజ్య అంతర్భాగాలుగా త్రిలింగ క్షేత్రాలు (ద్రాక్షారామం, శ్రీశైలం, కాళేశ్వరం) ఉండాలన్న వాకాటక మహాదేవి అభిమతాన్ని నెరవేర్చాడని నవల ముగించి కథా చిత్రణ కార్యకారణ సంబంధాన్ని రూపుకట్టించారు రచయిత.

చారిత్రక నవలలో చారిత్రక పరిణామానికి క్లుప్తీకరణా, సాంద్రీకరణా జరిగిన ఫలితంగా చరిత్ర నాటకీకృతం అవుతుంది అంటారు రారా. ఈ నవలలో మాధవవర్మ

కళింగులను ఎదుర్కోడానికి వెళ్లి వాకాటక మహాదేవిని వివాహం చేసుకురావడం, ఆమె అభిమతం తీర్చడానికి త్రిలింగాధిపత్యం సాధించడం మొదలైన సంఘటనలతో కూడిన సుమారు 40 ఏళ్ల చరిత్ర క్లుప్తీకరించబడింది. అలాగే దండయాత్రలు, కోటల్ని ఆక్రమించడం మొదలైన సన్నివేశాలు నాటకీకరింపబడి నవలా కాలానికి పాఠకున్ని తీసుకెళ్తాయి. ఆనాటి సమాజమూ, ఆనాటి జీవనమూ కళ్లముందు ప్రత్యక్షమై చారిత్రక నవలా వస్తువును పాఠకుని అనుభూతికి అందించాయి.

మాధవవర్మ అనంతర పాలకుల వివరాలను అతని వివాహ సమయంలో బౌద్ధ గురువుల ఆశీర్వచన రూపంలోనూ, వాకాటక మహాదేవికి గురువులు చెప్పినట్లుగా సన్నివేశాలను రచయిత కల్పించారు. వాటి ప్రకారం మాధవవర్మ తరువాత దేవవర్మ కొంతకాలం, అతని తరువాత విక్రమేంద్ర వర్మ కొంతకాలం పాలిస్తారనీ దేవవర్మ కొడుకు కాలంలో విష్ణుకుండిన రాజ్యప్రభ ఇంకా వెలుగు లీనుతుందనే చరిత్ర విషయాలు పాఠకునికి తెలుస్తాయి. ఈ విధంగా పాఠకుడికి చరిత్ర కాలానికి సంబంధించిన భూత భవిష్యత్ వర్తమానాలను అందించడం నవలా నిర్మాణంలో విలక్షణత. విష్ణుకుండినుల చరిత్రలో మధ్య కాలానికి చెందిన కథను చెబుతూ, ఆద్యంత చరిత్ర గురించి అవగాహన కల్పించడం చరిత్ర పట్ల రచయితకున్న గాఢమైన అభినివేశాన్ని పట్టి ఇస్తోంది.

మతం అంటే నమ్మకం. ఎవరికి వారు తమ నమ్మకాలని విలువైనవిగా నిరూపించే ప్రయత్నం చేసినపుడు సమాజంలో అరాచకత్వం ఏర్పడుతుంది. ఇటువంటి స్థితి రాకుండా పాలించడమే సమర్థుడైన రాజు కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని తన పరాక్రమంతో అద్వితీయంగా నిర్వహించిన రాజుగా మాధవవర్మ, అతని కర్తవ్య దీక్షలో ప్రేరణగా నిల్చిన వనితగా వాకాటక మహాదేవి ఇద్దరూ నవలలో చారిత్రక వ్యక్తులైన సజీవ పాత్రలు. అలాగే విష్ణుకుండినుల మొదటి రాజధానిగా తెలంగాణ ప్రాంత ఔన్నత్యం సజీవం. చారిత్రక ప్రామాణ్యం కలిగిన చక్కటి నవలను అందించిన బి.ఎన్.శాస్త్రి గారి యశస్సు సజీవం.

**డా. జె. ఉభయ భారతి**
ఉపన్యాసకులు, తెలుగు శాఖ, ఎస్.వి.ఎస్. కళాశాల, హైదరాబాద్.
ఫోన్ : 94404 94409



# బి.ఎన్.శాస్త్రి నాటకాలు

చరిత్ర పరిశోధకులలో బి.ఎన్.శాస్త్రిగారికి విశిష్టమైన స్థానం ఉంది. భూమిలో నిక్షిప్తమైన శాసనాలను వెలికితీసి మన చరిత్రకు కొత్త వ్యాఖ్యాన విశేషాలను అందించడమే శ్వాసగా జీవించిన త్యాగధనులు బి.ఎన్.శాస్త్రి. ఒకవైపు శిథిలమైన చరిత్రను పునర్నిర్మాణం చేస్తూనే సృజనాత్మక రచనలు చేసిన బహుముఖ ప్రజ్ఞావంతులు. వీరు మూసీ పత్రిక సంపాదకులుగా వుంటూనే అనేక నవలలు, నాటకాలు, గేయాలను రచించారు. సృజనాత్మక రచనల్లోనూ తన చారిత్రక దృష్టిని విస్మరించలేదు. ముఖ్యంగా తను రాసిన ఐదు నాటికలు 'గ్రామ జీవనం', 'సహకారం', 'నిర్బంధ విద్య', 'అపోహ', 'కిరాయిదారు' రచనల ద్వారా సమకాలిక సామాజిక అంశాలపై చైతన్యవంతమైన దృక్పథాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావానంతర తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలోని పరిస్థితులను ఈ నాటకాలు ఆవిష్కరిస్తాయి. బి.ఎన్.శాస్త్రిగారు కలలుకన్న ఆదర్శనీయ సమాజమంతా మన కళ్ళముందు కదలాడుతుంది. ఆ తరం ఆశించిన మానవీయ విలువలుగల ప్రపంచం ఈ రచనల్లో దర్శించవచ్చు.

బి.ఎన్.శాస్త్రి రచించిన ఐదు నాటికల్లో 'గ్రామ జీవనం' నాటకం మాత్రమే విషయంలోనూ, పరిమాణంలో కొంత విస్తృతమైనది. 1961లో వచ్చిన 'గ్రామజీవనం' నాటకంలోని గ్రామం తెలంగాణలో అన్ని గ్రామాల ఆనాటి వర్తమాన పరిస్థితులను ప్రతిబింబిస్తుంది. గ్రామాధికారులైన పటేలు, కరణాలు అధికారంతో ప్రజలను, ఉద్యోగులను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని ఏ విధంగా నియంత్రించాలని చూస్తారో ఈ నాటకం ద్వారా తెలుస్తుంది.

బి.ఎన్.శాస్త్రిగారి నాటకాలు గ్రామీణ జీవితం కేంద్రంగా నడుస్తాయి. గ్రామీణ ప్రాంతంలో ఆధిపత్యం చూపించే స్థానిక దొరలు, అగ్రవర్ణాల వారి మనస్తత్వాన్ని వాస్తవికంగా, సహజంగా చిత్రించడంలో గొప్ప నైపుణ్యాన్ని చూపిస్తారు. వారి 'గ్రామజీవనం' నాటకం ఇందుకు బలమైన ఉదాహరణగా చెప్పవచ్చు. వయోజన విద్యా కేంద్రంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోపాల్ ప్రధానపాత్ర చుట్టూ జరిగే అనేక సంఘటనల సమాహారం 'గ్రామజీవనం' నాటకం. రాత్రి పాఠశాలలో పాఠాలు చెబుతూ ఊరివాళ్ళందరిని జ్ఞానవంతులుగా చేస్తున్నందుకు పటేలు గోపాల్‌పై కక్ష పెంచుకుని అనేక విధాలుగా వేధింపులకు గురిచేస్తాడు. వాటన్నింటిని తట్టుకుంటూ గోపాల్ ఆ గ్రామ జీవనాన్ని ఏ విధంగా మెరుగుపరిచే ప్రయత్నాలు చేసాడో ఈ నాటకం వివరిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలోని అనేక వర్గాలవారి జీవన సంక్షోభాలను, సంఘర్షణలను, తిరుగుబాట్లను చర్చిస్తుంది ఈ **'గ్రామ జీవనం'.**

ఆనాటి గ్రామాలలో వుండే పంచాయితీ బోర్డులు, అవకాశవాద రాజకీయాలు, ఓట్లకోసం చేసే కుయుక్తులు, గ్రామీణ రాజకీయాల్లో కులం నిర్వహించే పాత్ర, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, మోసాలు, కుట్రలు మొదలైన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఆర్థిక విషయాలన్నింటిని ఒక మినీయేచర్‌లాగా రూపొందించారు శాస్త్రిగారు.

వయోజనులకు కూడా చదువు ఎంత ముఖ్యమో గోపాల్ పాత్ర ద్వారా ఈ నాటకం తెలియజేస్తుంది. "మాబోట్లకు సదువేమొత్తదండి ఎన్నేండ్లు చదివితే రావాలి చదువు" అని ఒక గ్రామీణ యువకుడి సందేహానికి గోపాల్ ఈ విధంగా జవాబు ఇస్తాడు. "మీకు ఒక నెలలోపల పుస్తకం చదివేట్టు, ఉత్తరం పత్రం వ్రాసేట్టు చదువు నేర్పుతా. దానికనేక పద్ధతులున్నయ్. మీరు వచ్చి చెప్పిన విషయాలు నేర్చుకోండి." అంటూ చదువు నేర్చుకుంటే ఎన్ని విధాలుగా లాభం కల్గుతుందో చెబుతాడు. "ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రణాళికలు విజయవంతం కావాలంటే ముందు మీరంతా విద్యావంతులు కావాలి. చదువు వల్ల మీ కుటుంబాలు బాగుపడతాయి. అట్లే గ్రామమంతా బాగుపగుతుంది." అని వారికి చదువుపట్ల ఆసక్తిని పెంచడంతోబాటు గ్రామ సమస్యలపై అవగాహనను ఏర్పరుస్తాడు. వారిలో రాజకీయ జ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేస్తాడు.

"ఎలక్షన్లు వచ్చినప్పుడు నాయకులు ఎంత ప్రేమను నటిస్తారో ఆనాడే శాస్త్రిగారు ఈ నాటకంలో చూపించారు. "ఈ ఎలక్షన్లు ఏమంటూ వచ్చినయో! ప్రతివాణ్ణి బ్రతిమాలాలి. మర్యాదగా మాట్లాడాలి. లేకుంటే పని జరిగేది కష్టం. ముత్తిగాణ్ణి ముత్తయ్య అనాలి" అని పటేలు వాపోతాడు. మరి ప్రజలు కూడా తక్కువవారా! మామూలప్పుడు,పటేలు వస్తుంటే

దారిలో ఎదురుగా నిలబడేవాళ్ళు కాదు. చుట్టకాల్చేవారు కాదు. ఎలక్షన్లప్పుడు మాత్రం దొర ఎదురుగా నిలబడి సిగరెట్లు తాగుతూ తమకు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించు కునేవారు. నాటకం చివరలో గోపాల్ జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా మాట్లాడుతాడు. ఈ ఉ పన్యాసం మూడు పేజీలుగా నడుస్తుంది. నాటకకర్త తాను ఆశించిన, గాంధీ కలలుగన్న గ్రామీణ స్వరాజ్యం, ఆదర్శనీయ గ్రామరాజ్యం గురించిన ఆశయాలను గోపాల్ ద్వారా చెప్పిస్తారు. అందమైన గ్రామీణ జీవన స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి, చేయడానికి అవసరమైన ఒక మేనిఫెస్టో లాగా ఈ నాటకాన్ని రూపొందించారు నాటకకర్త.

బి.ఎన్.శాస్త్రిగారు జీవితంలో విద్యకువున్న విలువను, ప్రాధాన్యాన్ని బాగా గుర్తించారు. పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడడం వల్ల పూర్తిస్థాయి అభివృద్ధి జరగదనీ బలంగా విశ్వసించారు. రైతులు వ్యవసాయం చేస్తూ అందులో సరైన దిగుబడి లేక అప్పులపాలైపోతున్న దుస్థితిని దగ్గర్నుంచి చూసారు. ఆ రైతుల పిల్లలు ఏ దొరదగ్గరో వెట్టిచాకిరి చేస్తూ నిరక్షరాస్యులుగా, శాశ్వత కూలీలుగా బానిసలుగా మారుతున్న వైనాన్ని పరిశీలించారు. ఆ నేపథ్యంలోంచి 'నిర్బంధ విద్య' నాటకాన్ని రచించారు. ఈ నాటకంలో రామయ్య అనే రైతు వ్యవసాయం చేస్తూ వరదపాలైన పంటతో కష్టాల్లో కూరుకపోయి విలపిస్తుంటాడు. అతని కొడుకు సుధాకర్ పటేలు దగ్గర జీతముంటున్నాడు. తన పిల్లలని చదువుకు పంపిస్తే 'ఇంటికాడ గోదలకు మేత, పసుల పేడ, సేనుకాపల – ఈ పనులన్నీ ఎవరుసుత్తారు?' అని వాదిస్తాడు. ఈ సమయంలో ఆ గ్రామానికి విద్యావిషయక ప్రచారకుడిగా రంగారావు అనే వ్యక్తి వస్తాడు. గ్రామసావడిలో అందరిని పిలిచి చదుకోవడం వలన వచ్చే ప్రయోజనాన్ని వివరిస్తాడు.

"మనం విద్యాశూన్యులమవడం వల్లనే మనను నీచంగా చూస్తూ ఆంగ్లేయులు 200 సంవత్సరములు మన దేశాన్ని పాలించగలిగారు. ఇప్పుడైనా మనకు స్వాతంత్ర్యం వచ్చాక కూడ విద్యకు దూరంగా ఉండిపోవద్దు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇవ్వడమే కాదు 'నిర్బంధ విద్య' విధానాన్ని ప్రవేశపెట్టింది. నిర్బంధ విద్య మనకొక వరము. 'నిర్బంధ విద్య' అను శబ్దము ఉపయోగకరమగు శబ్దము. ప్రభుత్వశాసనం ప్రకారం తల్లిదండ్రులు పిల్లలకు చదువు చెప్పించని యెడల ప్రభుత్వ చట్టం ప్రకారం శిక్షింపబడుతారు. పోలీసు దెబ్బలకు గురియౌతారు. కాబట్టి మీరందరు మీ గ్రామపు పాఠశాలాభివృద్ధిగోరి పిల్లలకు విద్యాభ్యాసము చేయించుచుండిన గ్రామమునకన్ని సౌకర్యములు చేకూరుతాయి. లెండి. మేల్కొండి. నిర్బంధ విద్యకు జైయనండి. జై నిర్బంధ విద్యావిధానానికి జై" అనే కీలక విషయాన్ని బలంగా చెప్పడానికే శాస్త్రిగారు ఈ నాటకాన్ని రచించారు. అందుకు అనుగుణంగానే జీతగాడుగా పనిచేస్తున్న సుధాకర్ బడిలో చేరి ఆ తర్వాత బి.ఏ. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై ఉన్నతస్థాయికి చేరుకుంటాడు. మొదట్లో తన కొడుకుని చదివించడానికి వెనుకాడిన

రామయ్య "జైలుకు తీసికెల్త" అన్న రంగారావు మాటలకు బెదిరిపోతాడు. అలా బెదిరించి ఆనాటి తరాన్ని విద్యావంతులుగా తయారుచేయించాలని నాటకకర్త ఆశించారు.

విద్య వలన సమాజంలో నెలకొన్న దురాచారములు, మూఢవిశ్వాసములు నిర్మూలించ బడతాయనే విశ్వాసం ఈ నాటకంలో కనబడుతుంది. పురుషులకే కాదు స్త్రీలకు కూడా విద్య అవసరమనే గొప్ప అంశాన్ని కూడా బలంగా చెప్పారు నాటకకర్త. బాలబాలికల మధ్య ఐక్యభావనల పెంపుకోసం కూడా విద్య ఎంత అవసరమో సూచిస్తారు.

ఈ నాటకంలో విద్యాధికులైన సుధాకర్, శాంతి పాత్రల ద్వారా కొన్ని కొత్త ఆదర్శాలను అందిస్తారు నాటకకర్త. విజ్ఞానవంతులైనవారు నిరక్షరాస్యతను నిర్మూలించి దేశదారిద్ర్యాన్ని రూపుమాపాలి. సహకార వ్యవసాయ విధానాన్ని అనుసరించాలి. అంతేకాదు నిర్బంధ విద్యాప్రచారం విదేశాలలోనూ ప్రచారం చేయడానికి యువతీయువకులు పూనుకోవాలి అనే ఉత్తమమైన మార్గాలను, ఆలోచనలను అందిస్తుంది ఈ నాటకం.

బి.ఎన్.శాస్త్రిగారు ఈ నాటకంలో కొంత తాత్త్విక సందేశాన్ని కూడా అందిస్తారు. "ఈ మానవ జీవిత మతి విచిత్రము. సముద్రంలో కెరటాలు ఏ విధంగానైతే అసంఖ్యాకముగా ఉద్భవిస్తాయో అదేవిధంగా మానవ జీవితంలో కూడా లెక్కలేనన్ని మార్పులు కలుగుతుంటాయి. ఈ మార్పులు కల్గడం వల్లనే మానవజీవితము మహోన్నతస్థాయికి చేరగలిగే అవకాశం వుంది" అంటారు. మనిషికి స్థాయిని అందించడంలో విద్య ఎంత గొప్ప పాత్ర నిర్వహిస్తుందో తెలుపుతారు. అందుకే ఈ నాటకం చివరి మాటల్ని తప్పక మననం చేసుకోవాలి.

"ప్రజలు విద్యావంతులైతేనే దేశం బాగుపడుతుంది. రాజ్యాలు గావాలంటే రాష్ట్రాలలోని ప్రజలు తెలివిగలవారై యుండాలి. రాజ్యాధిపత్యం వహించాలంటే ముందు గృహాధిపత్యం స్వీకరించాలి. గృహాధిపత్యానికి శరీరమును కట్టుదిట్టము చేయాలి. అట్లు కావాలంటే విజ్ఞానం గావాలి. విజ్ఞానానికి విద్య రావాలి. విద్య రావాలంటే నిర్బంధ విద్యావిధానం అమలులో ఉండాలి" అనే మాటలతో ఈ నాటకం ముగుస్తుంది. దేశ అభివృద్ధిలో గ్రామ భాగస్వామ్యం కూడా చాలా విలువైందనే సందేశం అంతర్లీనంగా చాటిచెపుతుంది ఈ నాటకం. ఈ వరుసలో నడిచే మరో నాటకం **"సహకారం".** ఇది సహకార సంఘాల ఆవశ్యకతను చర్చిస్తుంది.

దేశానికి పల్లెలు ప్రగతిమెట్లు. పల్లెల్లోని రైతులు ఎండనకా వాననకాశ్రమిస్తూ పంటలు పండిస్తేనే మానవాళి ఆకలి తీరుతుంది. దేశాల సౌభాగ్యం పెరుగుతుంది. అలాంటి పల్లెలో రైతులను అవసరాలకు ఆదుకుంటామంటూ అప్పులిచ్చి, అధిక వడ్డీలు వసూలు

చేసే షావుకార్లు ఉంటారు. వారి పీడనను తట్టుకుంటూ షావుకార్ల దోపిడీని అరికట్టడానికి అవసరమైన సహకార సంఘాల ఏర్పాటును ఒక ఉద్యమస్థాయికి తీసుకు వెళ్ళాలనే సంకల్పంతో 'సహకారం' నాటకాన్ని రచించారు.

నిరక్షరాస్యులైన పల్లెల్లోని రైతులు దోపిడీకి గురైన పద్ధతులను విపులీకరిస్తూ కోమటి రాజయ్య దుర్మార్గాలను అరికట్టడానికి చేసిన ప్రయత్నాలను ఈ నాటకం వివరిస్తుంది. అవసరానికి అప్పు ఇచ్చి ఆదుకునే రాజయ్యను దేవుడిలాగా రైతులు భావిస్తుంటారు. నిజానికి రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని తనను నమ్మినవారిని మోసం చేసే రాజయ్య ఆగడాలను అరికట్టడం, సహకార సంఘాల నిర్మాణమే ఈ నాటక ఆశయం. దొంగలెక్కలు, తప్పుడు పద్దులు వ్రాసి, రైతుల్ని మోసం చేస్తున్న రాజయ్యపై తిరుగుబాటు చేయడమే ఈ నాటకంలోని చైతన్యం. కాంతయ్య పాత్ర ద్వారా 'సహకారం' అంటే ఏమిటో ఇలా వివరిస్తాడు. "సహకారం అనేదేమి వస్తువు కాదు. మీలో మీరు ఐకమత్యంగా కలిసివుండి ఒకరికొకరు సహాయపడుతూ ఒకరి ఇబ్బందులను ఒకరు తెలిసికొని, వాటిని పూర్తి చేసుకోవాలి. అదే సహకారం!" వాటిని ఏ విధంగా అమలు చేసుకోవచ్చు అనే కార్యాచరణ ప్రణాళికకు సృజనాత్మక రూపం ఈ నాటకం.

'సహకారం' అనే భావన కేవలం గ్రామీణ ప్రాంతాల ప్రజలకే పరిమితం చేయకుండా దేశవాసులందరికి వర్తించే విధంగా రచయిత ఉద్బోధ చేస్తారు. " 'సహకార సంఘం' అనే పదం గొప్ప అర్థాన్ని సూచిస్తుంది. సహకార భావాలు ఏర్పడాలంటే సహనం కావాలి. అందుకే మహాత్ముడు దేశ ప్రజలను ఐక్యంగా వుండమని ప్రబోధించాడు" అనే సందేశాన్ని మనసులో నాటుకపోయేలా చెపుతుంది ఈ నాటకం.

బి.ఎన్.శాస్త్రిగారు 'అపోహ', 'కిరాయిదారు' అనే రెండు చిన్న నాటకాలు కూడా రాసారు. వీటిలో 'అపోహ' నాటకం కొంత సినిమా కథలా క్రైమ్ ఎలిమెంట్‌తో నడుస్తుంది. వేణు అగ్రకుల ఐశ్వర్యవంతుల దగ్గర పనిచేసే సాధారణ నౌకర్ కొడుకు. డబ్బున్నవారి పిల్లలు మోహన్, విజయలు. మోహన్ స్నేహితుడు గోపాల్. వేణు చదువులో చురుకైనవాడు. విజయ కూడా చదువులోముందుండేది. గోపాల్ సావాసం వల్ల మోహన్ చదువులో దారి తప్పుతాడు. గోపాల్ విజయను పెళ్ళి చేసుకొని ఆమె ఆస్తిని దక్కించుకోవాలనుకుంటాడు. మోహన్ కూడా గోపాల్ దుష్టమనస్తత్వాన్ని అర్థం చేసుకోలేక పోతాడు. వేణు బుద్ధిగా చదువుకుని లండన్ వెళ్ళివస్తాడు. వేణు, విజయలకు ఒకరంటే మరొకరికి ఇష్టం ఉంటుంది. ఈ విషయం అన్న మోహన్‌కు నచ్చదు. విజయను నమ్మించి గోపాల్‌తో పెళ్ళి జరిపించడానికి మోహన్ తీసుకవస్తాడు. గోపాల్ దుష్టస్వభావి కదా. 'ఈ మోహన్‌ను

చంపేస్తే, విజయను పెళ్ళాడుతే ఆస్తి అంతా నాదే అవుతుంది.' అని మోహన్‌ను చంపేస్తాడు. విజయ తప్పించుకుంటుంది. లండన్ నుంచి వచ్చిన వేణుకు విజయనిచ్చి పెళ్ళిచేస్తానంటాడు తండ్రి రంగారావు. దుష్టుడైన రమణయ్య విజయ మనసు గాయపడే విధంగా మాట్లాడుతాడు. విజయ బాధతో విషం తాగుతుంది. డాక్టర్ చికిత్సతో విజయ ప్రమాదం నుండి బయట పడుతుంది. వేణు విజయను పెళ్ళి చేసుకుంటానంటాడు. నాటకం అనేక మలుపులు తిరిగి సుఖాంతమవుతుంది. ఆ నాటి యువతరంలోని ప్రతికూల ఆలోచనల్ని వెల్లడిస్తుంది ఈ నాటకం. బుద్ధిగా చదువుకుంటే ఎన్ని కష్టాలు ఎదురైనా చివరకు అంతా మంచే జరుగుతుందనే విషయాన్ని తెలుపుతుంది **'అపోహ'** నాటకం.

**'కిరాయిదారు'** నాటకం ఇళ్ళు అద్దెకు ఇచ్చి వేధింపులకు గురిచేసే ఇంటి యజమానుల వికృత స్వరూపాన్ని ఆవిష్కరిస్తుంది. రమేష్ తన ఇంటిలో మూడు పోర్షన్లను మూడు కుటుంబాలకు అద్దె ఇస్తాడు. ప్రతీరోజు కిరాయిదార్లనుండి అందవలసిన అద్దె డబ్బుల గురించి లెక్కలు వేస్తుంటాడు. అద్దెడబ్బుల సంపాదన సరిపోలేదంటూ తన ఇంటిలో క్లబ్బు ప్రారంభిస్తాడు. క్లబ్ మెంబర్‌షిప్ పేరిట తెలిసినవాళ్ళను చేర్పించమని కిరాయిదార్లను అడుగుతాడు. రమేష్ ధనాశకు విసిగిపోయిన కిరాయిదారు ప్రతాప్ ఇల్లు ఖాళీ చేస్తానంటాడు. క్లబ్ ప్రారంభం కాలేదని తన మెంబర్‌షిప్ డబ్బులు ఇవ్వమంటాడు. అందుకు రమేష్ ఒప్పుకోడు. ప్రతాప్‌ని తక్షణం ఇల్లు ఖాళీ చేయమని దౌర్జన్యం చేస్తాడు. ఇంటి యజమానులు కిరాయిదార్లను ఎంత అమావీయంగా చూస్తారో ఆ రోజుల్లోనే చూపించారు. ఈ నాటికి ఇలాంటి వేధింపులు, కఠిన నియమాలు, వ్యాపారదృష్టి మరింత పెరిగిపోవడం గమనార్హం.

బి.ఎన్.శాస్త్రి గారి నాటకాలు ఆనాటి సమాజంలోని సమస్యాత్మక విషయాలను చిత్రిస్తాయి. ఉత్తమమైన మార్గంలో నడవడానికి దిశా నిర్దేశాన్ని చూపుతాయి. సహజమైన గ్రామీణ ప్రజల సంభాషణలతో పాత్రలు మనతో మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తుంది. ఆ కాలపు విలువలున్న వ్యక్తుల సంస్కారాన్ని మనకు వారసత్వంగా అందించే ప్రయత్నం చేసారు. తనుకోరుకున్న సమాజ నిర్మాణంలో భాగంగా ఈ నాటకాలను రచించిన ఆదర్శనీయ నాటకకర్త బి.ఎన్.శాస్త్రిగారు.

డా. ఎస్. రఘు
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఫోన్ : 98482 08533



# శ్రీ పులిజాల రంగారావు గారి సంక్షిప్త చరిత్ర

"దేశ చరిత్ర నిర్మాణమునకు ఆ దేశ నాయకుల చరిత్రలు తోడ్పడును" అని బి.ఎన్.శాస్త్రిగారు చెప్పిన మాటలు అక్షరాల సత్యం. ఇక్కడ దేశ నాయకులు అంటే విస్తృతార్థంలో అర్థం చేసుకోవాలి. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, సాహిత్య రంగాలలో కృషి చేసిన మహనీయుల చరిత్రలను చదివినప్పుడు వారి కాలంలోని పరిస్థితులన్నింటి పైన ఖచ్చితమైన అవగాహన సాధించవచ్చు. అవగాహన మాత్రమే కాదు, వారి చరిత్రలన్నింటిని పరిశీలించాక బి.ఎన్.శాస్త్రిగారు చెప్పినట్టు దేశ చరిత్రను నిర్మించవచ్చు.

అయితే దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ రచింపబడ్డ నాయకుల చరిత్రల కన్నా విస్మరింపబడ్డ నాయకుల చరిత్రలే ఎక్కువ. అలా విస్మరింపబడ్డ నాయకుల చరిత్రలు కూడా బయటకు తీసుకురాగలిగితే చరిత్రను సంపూర్ణంగా నిర్మించవచ్చు. అలాంటి గొప్ప కార్యం బి.ఎన్.శాస్త్రిగారు చేశారు.

'శ్రీ పులిజాల రంగారావు గారి సంక్షిప్త చరిత్ర' పేరుతో ఒక మహనీయుడి జీవిత చరిత్రను మనందరికీ అందించి మన అస్తిత్వాన్ని మనకు పరిచయం చేశారు బి.ఎన్.శాస్త్రి గారు. ఈ పుస్తకంలో రంగారావు జీవిత చరిత్రతో పాటు వారి రచనలు, ఉపన్యాసాలు, వారి గురించి పెద్దలు రాసిన వ్యాసాలు, వారు చనిపోయిన తరువాత పత్రికలలో వచ్చిన సమాచారం వంటివి మనకు అందించారు బి.ఎన్.శాస్త్రి గారు. రంగారావు గారి కాలంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని కూడా మనకు కళ్ళకు కట్టినట్లు ఈ పుస్తకంలో చూపించారు బి.ఎన్.శాస్త్రి గారు.

పులిజాల రంగారావు గారి జీవితం ఆదర్శనీయం. స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘ సేవకుడిగా, గొప్ప న్యాయవాదిగా, వైద్య నిపుణుడిగా, నాటక రంగ కళాకారుడిగా, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో మంచి పట్టు సాధించిన బహుభాషా కోవిదుడిగా అనేక రకాలుగా ఆయన మనకు దర్శనమిస్తారు.

పులిజాల రంగారావు గారు నల్గొండ జిల్లాలోని చెరువుమాదారం గ్రామానికి చెందిన వారు. వీరు రామచూడమ్మ, తిరుమల రావు దంపతులకు 1 - 2 - 1901లో జన్మించారు. రంగారావు గారి కుటుంబం చెరువుమాదారంలో జమీందారులు. వీరికి వందల ఎకరాల భూములుండేవి.

రంగారావు గారు ప్రాథమిక విద్యను హన్మకొండలో మొదలు పెట్టి, మాధ్యమిక విద్యను హైద్రాబాద్‌లో అభ్యసించి మళ్ళీ హైస్కూలు విద్యను హన్మకొండలో పూర్తి చేశారు. మాడపాటి హనుమంత రావు గారిచ్చిన సలహా మేరకు రంగారావు గారు వకాలత్ చదువును పూర్తి చేశారు. ఆ రోజుల్లో హైదరాబాదు నగరంలోని లాయర్లలో ఎక్కువ మంది ముస్లింలు మరియు మహారాష్ట్ర, కన్నడ ప్రాంతానికి చెందిన వారు ఉండేవారు. తెలుగు వారి సంఖ్యను పెంచడానికి గానూ మాడపాటి గారి ఈ సలహా ఇతాధికంగా ఉపయోగపడింది.

న్యాయశాస్త్రం చదివే రోజుల్లో రంగారావు గారికి మాడపాటి గారి ద్వారా బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకట రంగారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి లాంటి గొప్ప వ్యక్తులతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఆ పరిచయాలే రంగారావు గారికి తర్వాతి కాలంలో తెలంగాణాంధ్ర మహాసభల్లో కీలక పాత్ర పోషించడానికి ఉపయోగపడ్డాయి.

రంగారావు గారు నల్గొండలో న్యాయవాదిగా స్థిరపడి, అక్కడి ప్రజలకు ఎంతో సేవ చేశారు. న్యాయవాదిగానే కాక, సంఘసేవకుడిగా జిల్లా మొత్తంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. పులిజాల రంగారావు గారు సాహిత్యాభిమాని. మంచి రచయిత కూడా. అప్పటి పత్రికలకు ఎన్నో వ్యాసాలు రాశారు. నీలగిరి పత్రిక వ్యవస్థాపకులైన షబ్నవీసు వెంకట రామనరసింహారావు గారు ఈయనకు బావ. నీలగిరి పత్రిక కోసం షబ్నవీసు గారికి రంగారావు గారు అన్ని విధాలా సహకారం అందించేవారు. రంగారావు గారు రచించిన 'ఆనందమయమగు బాల్యం' వంటి వ్యాసాలు ధారావాహికంగా నీలగిరి పత్రికలో ప్రచురింపబడ్డాయి. రంగారావు గారిని సాహిత్య పిపాసి గానూ, సంగీతాభిమాని గానూ శాస్త్రి గారు పరిచయం చేశారు.

శాస్త్రీయ సంగీతాన్ని అధ్యయనం చేసి, తన శ్రావ్యమైన కంఠంతో త్యాగరాజ కృతులను, క్షేత్రయ్య పదములను, రామదాసు కీర్తనలను ఆలపించేవారని, వీణావాదనం చేస్తూ

శృతిలయలను అవపోసన పట్టి, భక్తిపారవశ్యమున భగవద్భక్తి గీతములను, భాగవత, మహాభారత, రామాయణాది పురాణాలను అందలి పద్యములను తన్మయత్వంతో పాడేవారని ఆయన సంగీతజ్ఞతను శాస్త్రిగారు పరిచయం చేస్తారు.

నాటక రంగంలో స్త్రీల పాత్రను పోషించి తన ప్రతిభను చాటేవారని, నల్గొండ, తిప్పర్తి, మిర్యాలగూడ, దేవరకొండ, సూర్యాపేట లాంటి పట్టణాల్లో 'చింతామణి', 'సత్యహరిశ్చంద్ర' లాంటి నాటకాలను ప్రదర్శించేవారని పేర్కొన్నారు. విద్యార్థి దశలో 'నలదమయంతి' నాటకంలో దమయంతి పాత్రను, 'సారంగధర' నాటకంలో చిత్రాంగి పాత్రను పోషించారు. తెలంగాణా నాటకాలలో స్త్రీల పాత్రలను ధరించి ప్రజల ఆదరాభిమానాలను పొందిన వారిలో రంగారావు గారు ప్రథమ స్థానంలో వుంటారని శాస్త్రిగారు ప్రశంసించారు.

వీరికి రాజకీయ, నీతి, అర్ధశాస్త్ర సంబంధిత గ్రంథాలపై, ఆధ్యాత్మిక గ్రంథాలపై, భక్తుల జీవిత చరిత్రలపై, చరిత్ర, శాసన, పరిశోధన గ్రంథాలపై అపార అవగాహన ఉండేదని, ఖురాన్ కల్మాల అర్థ తాత్పర్యములపై గ్రంథాలను రంగారావు సంపాదించి అపారమైన అన్యభాషా జ్ఞానాన్ని ఆర్జించారని శాస్త్రిగారు తెలిపారు. ఉపనిషత్తుల మీద రంగారావు గారికి చక్కని అవగాహన వుండేదని, బ్రాహ్మణములను, ఉపనిషత్తులను గూర్చిన ప్రశ్నాపత్రాలను రంగారావు గారి పరిశీలనకు మద్రాసు నుంచి పంపబడేవని, ఈ పత్రాలకు సమాధానాలు రాసి పంపుట వల్ల రంగారావు గారికొక సర్టిఫికెటు లభించిందని శాస్త్రిగారు వెల్లడించారు. చైతన్యప్రభువు, భక్తతుకారాం, త్యాగయ్య, క్షేత్రయ్యలకు సంబంధించిన కీర్తనలపై రంగారావు గారికి మంచి పట్టు వుండేదని, వాటి ప్రభావం ఆయన చేసిన సంఘసంస్కరణలపై వుండేదని శాస్త్రి గారు ఈ పుస్తకంలో తెలిపారు.

రంగారావు గారు న్యాయవాద వృత్తిని సాగిస్తూనే, ప్రకృతి, ఆయుర్వేద వైద్యాలలో ప్రావీణ్యం సంపాదించి ప్రజలకు ప్రకృతి వైద్యుడిగా చాలా ఆత్మీయుడయ్యారు. వీరు మెస్మరిజం, హిప్నాటిజంలో ప్రావీణ్యం కలిగి వుండేవారు. తిరునల్వేలి నుండి యోగవిద్యకు చెందిన సాహిత్య గ్రంథాలను తెప్పించి వాటిని క్షుణ్ణంగా చదివి, అర్థం చేసుకొని యోగ విద్యలో కూడా గొప్ప పరిజ్ఞానాన్ని సంపాదించారు.వీరు తర్వాతి కాలంలో అనివార్య పరిస్థితుల్లో ప్రకృతి వైద్యవృత్తిని వదిలి, న్యాయవాద వృత్తిలో స్థిరపడాల్సి వచ్చింది.

నీలగిరి పత్రిక 9-1-1995 టెలిన్యూస్ 'వీరతెలంగాణ స్వాతంత్ర్య యోధుడు "పులి" "జ్వాల" అన్న సంపాదకీయంలో యావద్భారతానికి సెప్టెంబర్ 1948 రోజుల్లో

నైజాం నవాబును గద్దెదింపే సందర్భంలో ఆంధ్రమహాసభల నిర్వహణల్లో పులిజాల రంగారావు గారు తమ సమస్త శక్తులను హైదరాబాదు విముక్తికి ఒడ్డినారని శాస్త్రిగారు గుర్తుచేశారు.

తెలంగాణలో అనేక పరిణామాల మధ్య 1929 లో 'తెలంగాణాంధ్ర మహాసభ ' ఆవిర్భవించి, 1930 లో మెదక్ జిల్లా జోగిపేటలో సురవరం అధ్యక్షతన మొదటి మహాసభ నిర్వహించబడింది. రెండో మహాసభ నల్గొండ జిల్లా దేవరకొండలో బూర్గుల అధ్యక్షతన 1931 లో జరగగా, ఈ మహాసభల ఆహ్వాన సంఘాధ్యక్షుడిగా పులిజాల వారున్నారు. ఇక, మూడో తెలంగాణాంధ్ర మహాసభ 1934 లో డిసెంబర్ 3,4తేదీల్లో ఖమ్మం పట్టణంలో పులిజాల రంగారావు గారి అధ్యక్షతనే జరిగాయి. నిజాం రాష్ట్ర ప్రజలను చైతన్యపరచడంలో ఆంధ్రమహాసభ పాత్ర ఎంతో కీలకం. ఈ సభల వల్ల ఎందరో యువకులు ప్రభావితమై గ్రంథాలయోద్యమం, వర్తకసంఘ సభలు, విద్యావ్యాప్తి, వయోజన విద్యాసంస్థల నిర్వహణ వంటి వాటిల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1934 లో జరిగిన సభల్లో ఆయన అధ్యక్షోపన్యాసం అప్పటి యువకులకు నచ్చలేదు. చాలా సున్నితంగా బతిమిలాడుకున్నట్లు ఉందని, మన గళాన్ని ధైర్యంగా వేరే బాణీలో వినిపించాలని ఆ యువకులు డిమాండ్ చేశారు. కానీ రంగారావు గారి సమగ్ర వివరణ తర్వాత అందరూ వెనక్కి తగ్గారు.

ఆ మహాసభలలో రావి నారాయణ రెడ్డి గారు విద్యార్థి నాయకుడిగా పాల్గొన్నారు. తర్వాతి కాలంలో రావి నారాయణ రెడ్డి గారు మూడు మహాసభలకు అధ్యక్షత వహించారు. కొంతకాలం తర్వాత ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టులుగా, కమ్యూనిస్టేతరులుగా అతివాద, మితవాదులుగా చీలిపోయింది.

ఆ తర్వాత హైదరాబాదు రాష్ట్రంలోని పరిస్థితులు తీవ్ర గందరగోళంగా తయారయ్యాయి. నిజాం సహకారంతో 'ఖాసీం రజ్వీ' నాయకత్వాన రజాకార్లు వేల సంఖ్యలో స్వైరవిహారం చేశారు. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. దోపిడీలు, హత్యలు, హత్యాచారాలు... .ఇలా నిజాం రాష్ట్రం సర్వదరిద్రాలకు నిలయమైంది. ఆ అణచివేతల్లోంచి పుట్టుకొచ్చిందే సాయుధ పోరాటం. ప్రజలు గ్రామ రక్షకదళాలుగా ఏర్పడి గ్రామాలకు, ప్రజలకు రక్షణగా నిలిచేందుకు సాయుధులుగా మారి రజాకార్లను తరిమికొట్టారు. పోలీసు చర్య ద్వారా హైదరాబాదు రాష్ట్రం భారత ప్రభుత్వంలో విలీనమయ్యాక పరిస్థితులు మారిపోయాయి. అప్పటి వరకు రజాకార్లతో పోరాడిన సాయుధ రక్షక దళాలు, తర్వాత పోలీసులతో కూడా పోరాడాల్సి వచ్చింది.

వీటితో పాటు తృతీయ ఆంధ్రమహాసభ అధ్యక్షోపన్యాసాన్ని కూడా శాస్త్రిగారు ఈ పుస్తకంలో పేర్కొన్నారు. రంగారావు గారు మాట్లాడుతూ 'సోదరీ సోదరులారా..." అని

సంబోధించారు. అంటే రంగారావు గారికి స్త్రీలంటే ఎంత గౌరవమో ఈ పద ప్రయోగం ద్వారా ఇట్టే అర్థమవుతుంది. ఈ వ్యాసంలో నిజాం పాలనపై ఆయన ఏవిధంగా తిరుగుబాటు చేశారు, ఏఏ ప్రదేశాల్లో తిరిగి ప్రజలను చైతన్యవంతులను చేశారు, వారు ఎదుర్కొన్న కష్ట నష్టాలతో పాటు, చివరకు యువత ఏవిధంగా పోరాడాలో కూడా పేర్కొన్నారు. ఈ వ్యాసం తర్వాత నల్లగొండ జిల్లాలో గ్రంథాలయోద్యమం ఎలా జరిగిందో వివరించారు.

ఇక చివర పేజీల్లో రంగారావు గారి మరణవార్త విన్న తర్వాత జిల్లా ప్రముఖులు, రాష్ట్రంలోని ప్రముఖులు, వివిధ పత్రికలు, విలేకరులు, పాత్రికేయులతో పాటు పీవీ నరసింహారావు లాంటి ప్రముఖులు కూడా సంతాప సూచకంగా రాసిన లేఖలను శాస్త్రిగారు జతచేశారు.

పోలీసు చర్య తర్వాత సైనికాధికారుల నిర్బంధాల నుండి అమాయక ప్రజలను రక్షించడానికి పులిజాల గారు తన నివాసంలో ఎంతో మందికి ఆశ్రయం కల్పించారు. రంగారావు గారు తన న్యాయవాద వృత్తి జ్ఞానంతో నిరపరాధుల్ని విడిపించాల్సిందిగా సైనికాధికారులకు నచ్చజెప్పి చాలా మందికి బంధవిముక్తి కలిగించారు. రంగారావు గారిని రాజకీయాల్లో పాల్గొనమని ఆత్మీయులు ఎంత వాదించినా, సున్నితంగా తిరస్కరించి ఏ పదవులూ ఆశించక, తన జీవితాన్ని చివరి రోజుల వరకూ సమాజానికి సేవచేస్తూ తన 98 యేట 30-10-1999 న కన్నుమూశారు.

గొప్ప మానవతావాది, స్వాతంత్ర సమరయోధుడు, ప్రముఖ న్యాయవాది, సాహిత్య, వైద్య, యోగ, నాటక రంగాలలో అపార ప్రతిభ కలిగివారు. ఆంధ్రప్రభ విలేకరి యాట సత్యనారాయణ గారు పేర్కొన్నట్టు 'నలగొండ పితామహుడు పులిజాల' గా కీర్తికెక్కిన పులిజాల రంగారావు గారి జీవిత చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ప్రతీ తెలంగాణ పౌరుడికి ఉంది.

చివరగా.... బి.ఎన్.శాస్త్రి గారికి పులిజాల రంగారావు గారంటే ఎంత అభిమానమో.....

**బోల్ల ప్రవీణ్**

పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఫోన్ : 998945899



# తపోభంగం (గేయకావ్యం)

కాలగమనంలో కనుమరుగయ్యే ప్రక్రియలు కొన్ని, నిలద్రొక్కుకొని పరిగెత్తే ప్రక్రియలు మరికొన్ని. ఇది సమకాలీన సమాజానికి చెందిన మనో లక్షణమా? సమాజ - సాహిత్య పరంగా బింబ - ప్రతిబింబ భావంతో అనుకోకుండా జరిగే చర్యనా? పద్యమైనా - గద్యమైనా; ప్రబంధమైనా - పాటైనా; కవిత్వమైనా - కథైనా; నవలైనా - నాటకమైనా అన్నీ కొన్నాళ్ళు వాటి ప్రతాపాన్ని చూపించి చతికిలపడ్డవి కొన్ని, ఇప్పటికీ పారుతున్నవి - ఎప్పటికీ నిండుగా పారేవి మరికొన్ని. ఏదేమైనా ప్రారంభంలో ఉన్న వేద సాహిత్యం, తదనంతరం చాలా మందికి దగ్గరైన పద సాహిత్యం. అలాగే ఇదే వరుసలో కవి, పండితులతో పరిఢవిల్లిన పద్యసాహిత్యం, చంపు సాహిత్యం, గద్య సాహిత్యం కనిపిస్తాయి. ఆంగ్ల సాహిత్య ప్రభావం ఆధునిక తెలుగు సాహిత్యంపై పడడం వల్ల ఛందోనియమాలను తొలిగించుకునే ప్రయత్నం చేసిన విషయం అందరికి తెలిసిందే. ఈ వరుసలో గురజాడ సృష్టించిన ముత్యాలసరాలనే కొత్తఛందస్సు గమనించదగ్గది. ఇది మార్పుకు శ్రీకారం అనుకోవచ్చు. ఈ విషయాన్ని శ్రీశ్రీ "గణబద్ధ ఛందస్సుల ఫ్యూడలిజం నుండి మాత్రాఛందస్సుల ప్రజాస్వామ్య యుగానికి ఆంధ్ర సాహిత్య చరిత్ర గమనాన్ని పరివర్తన చేసినవాడు గురజాడ" (శ్రీశ్రీ; గురజాడ (ముత్యాలసరాలు-వ్యా), పు. 52) క్రమంగా గణబద్ధ ఛందస్సుల స్థానాన్ని మాత్రగణ లయాత్మకమైన గేయం ఆక్రమించింది. దీని ద్వారా యతి, ప్రాస నియమాల కట్టడి, వాడుక పదాల వినియోగం, భావవ్యక్తీకరణకు చెందిన రచనా స్వేచ్ఛకు దోహదపడ్డాయి. తదనంతర కాలంలో ఈ

గణబద్ధమైన గేయాలు కాస్తా ముక్త ఛందో కవిత్వానికి అంటే వచన కవిత్వానికి చేరువైనవి. ఆవంత్స సోమసుందర్ అన్నట్లు "కవితా సింహాసనంపై గీతాన్నీ, గేయాన్నీ అధివసింప జేసి భావకవులు పట్టాభిషేకం చేయగా వాటిస్థానంలో ముక్తచ్ఛంద కవితా ప్రయోగాలను ప్రతిష్టించారు తరువాతి కవులు..." (కవిత్వం కాలాతీత కాంతిరేఖ ; 1984; పు.85). గేయ కవిత్వంలో చారిత్రకతను, సంప్రదాయాన్ని, సాంఘిక సంస్కరణను వస్తువుగా మలిచిన కావ్యాలు విరివగా వచ్చాయి. కథా వస్తుపరంగా సంప్రదాయబలంతో వెలువడిన గేయ కావ్యమే శ్రీ బి.ఎన్.శాస్త్రి గారు రచించిన 'తపోభంగం'. ఇది 1960 మేలో వెలువడింది. కావ్య పాత్రలకు చెందిన పౌరాణిక వ్యక్తులైన మేనకా విశ్వామిత్రులకు అంకితం ఇవ్వడం ఒక ప్రత్యేకత.

'తపోభంగం' అనగానే చాలా మందికి వస్తువు అర్థమౌతుంది. కొంత ప్రాచీన సాహిత్యంతో పరిచయం ఉన్న వారికి చెప్పకుండానే విశ్వామిత్రుడు, మేనకలు గుర్తుకు రావచ్చు. ఈ విశ్వమిత్ర - మేనకల కథ అప్పటికే బాగా ప్రచారంలో ఉన్నప్పటికి బి.ఎన్.శాస్త్రిగారు గేయకావ్యంగా మలచడానికి కారణాలు ఆ కాలంలో గేయ కావ్యానికి ఉన్న ఆదరణ అని భావించవచ్చు. ఆ దశాబ్దానికి అటూ - ఇటుగా తెలుగు సాహిత్యంలో విరివిగా గేయ కావ్యాలు వెలువడ్డాయి. సినారె వంటివాళ్ల నుండి రూపుదిద్దుకున్న చారిత్రక గేయకావ్యాలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. కానీ బి.ఎన్.శాస్త్రి దేశచరిత్రను, రాష్ట్రచరిత్రను, జిల్లాల సర్వస్వాలను, రాజ్యాల చరిత్రలను తవ్విపోసినవారు పౌరాణిక కథను గేయకావ్యంగా ఎందుకు రాసి ఉండవచ్చు? అని చూసినపుడు వారు రాసుకున్న 'మున్నుడి'లో "జీవితానంద సుమసౌరభము నాఘ్రాణించుటకు ప్రకృతిలో ప్రతి ప్రాణి ప్రయత్నించుచుండును..." అనే వాక్యాల ఆధారంగా ప్రకృతిపై తనకున్న ఆరాధ్యభావంతో ఈ కావ్యం రాయడానికి తలపెట్టినట్లు అనిపిస్తుంది. ఆ నాటి సాహతీవేత్తలు చాలా వరకు ప్రాచీన సాహిత్య అధ్యయనపరులే అయి ఉంటారనడంలో సంశయానికి అవకాశం తక్కువగా కనిపిస్తుంది. శాస్త్రిగారు కాశీఖండం మీద మంచి విమర్శ పుస్తకాన్ని కూడా వెలువరించడంతో ప్రాచీన గ్రంథ సౌగంధ్యం కూడా దీనికి ప్రేరణగా చెప్పుకోవచ్చు. శ్రీశ్రీ అన్నట్లు "వెనుకటి గ్రంథాలను చదవని వాడెవ్వడు ఈనాడు సరస సాహిత్య రచన చెయ్యలేడు. గత చరిత్రను ప్రస్తుత ప్రయోజనం కోసమూ, భావన అభివృద్ధి నిమిత్తమూ ఏ విధంగా పఠించక తప్పదో అదే విధంగా పూర్వ సాహిత్యాన్ని సవిమర్శకంగా సాకల్యంగా చదవకపోతే సారస్వత సృష్టికి అవకాశమే వుండదు. ఇదివరకు వేయబడిన గట్టి పునాదుల

మీదనే యీనాటి సాహిత్య సౌధం నిర్మింపబడుతుంది. సారస్వత పరిణామాన్ని శ్రద్ధగా గమనిస్తున్నవారు దీన్ని కాదనలేరు..." (తెలుగు తల్లి; మార్చి-1946. పు.14)

'తపోభంగం' గేయకావ్యం ఖండ, మిశ్రగతుల ఛందస్సులో ఉంది. అక్కడక్కడ కొన్ని నియమాలను దాటినట్లు కూడా కనిపిస్తుంది. ఈ విషయాన్ని స్వయంగా వారే 'మున్నుడి'లో "సాధ్యమైనంత వరకు మాత్రా ఛ్ఛందస్సును పాటించితిని." అంటారు. కావ్యం మొత్తం ఐదు భాగాలుగా అమర్చినారు. మొదటి భాగం హిమాలయ వర్ణనలతో ప్రారంభమైంది. ఇందులో హిమాలయాలకు తపస్సుకోసం వెళ్ళే మునుల గొప్పతనాలను వర్ణించడంతో పాటు హిమాలయంలో గల ప్రత్యేకతలను, పశుసంతతిని, వృక్ష జాతిని, మంచుకొండలను ప్రబంధాల స్థాయిలో వర్ణించారు. ఆ పవిత్రమైన హిమాలయ ప్రదేశంలో విశ్వామిత్రుడు తపస్సు చేసిన విధానాన్ని, నిశ్చలతను, తపస్సు ప్రభావంతో అక్కడ స్తంభించిన వాతావరణాన్ని, తదనంతరం అక్కడి ప్రాంత పరిణామాన్ని వివరిస్తూ రాజర్షి తపమునకు ఎవరు సాటిరారని మొదటి విభాగాన్ని ముగిస్తారు.

మహర్షి తపోజ్వాలలు దిక్కులు, దిక్పాలకులు, సూర్యచంద్రులు, దేవతలు, దేవలోకము వరకు చేరినట్లు వివరిస్తారు. ఆ సమయంలోనే అక్కడికి నారదుడు చేరుకుంటాడు. విశ్వామిత్రుని తపస్సును చూసిన నారదుడు దేవతలకు అతని తపస్సు తీవ్రతను తెలుపుతూ "ఆ మహామహుని తప / మా మహామహు చరిత / ఆ మహర్షి దీక్ష / ఏ మహా తాపసికి / ఈ పృథ్వి సాటియే ! / ఈ పుడమి సాధ్యమే !..." (పు.15) అనడంలో రాజార్షి తపో తీవ్రత అర్థమౌతుంది. విశ్వామిత్రుని తపస్సుకు గిరులు చలించాయి, శిలలు ద్రవించాయి. వనాలు వణుకుతున్నాయి అంటూ దేవేంద్రుడికి తెలిపి, మీరు ఈ విషయాన్ని పట్టించుకోకుంటే మునుముందు ఏమి జరుగుతుందో ఎవరు ఊహించలేరని నారదుడు చెప్తాడు. వెంటనే ఇంద్రుడు ముఖ్యదేవతలను పిల్చుకుని సభను ఏర్పాటు చేసి సంభాషణ ప్రారంభించడంతో రెండవ భాగం ముగుస్తుంది.

మూడవ భాగంలో ఇంద్రుడు ఏర్పాటు చేసిన సభలో విశ్వామిత్రుని తపస్సు భంగ విషయం గురించి చర్చ ప్రారంభించారు. తక్షణమే వారి తపోభంగం చేయాలని సభలో ఉన్న వారికి ఇంద్రుడు తెలియచేస్తాడు. దీనికి వరుణుడు, యముడు మొదలైన వారు స్పందించగా అగ్ని ఆవేశంతో వెంటనే వెళ్ళి మాన్పిస్తానంటాడు. కార్యసాధనకు సరైన పథకం వేయాలని ఇంద్రుడు చెప్తూ ఆలోచించగ అతని మనసులో అప్సరసలు తలపుకు వచ్చారు. వెంటనే అప్సరసలు సభకు వచ్చి నాట్యం చేయగా వారిలో మేనక

నాట్యం, గానం, వయ్యారం అందరినీ అలరించింది. ఆ మేనకనే విశ్వామిత్రుడి తపోభంగానికి పంపాలని నిశ్చయించుకుని, ఆమెకు చెప్పగా మేనక కొంత భయపడినప్పటికి ఒప్పుకుంటుంది. మేనకను దీవించి దేవేంద్రుడు తన భవనానికి బయలుదేరడంతో మూడవ భాగం ముగుస్తుంది.

మేనక ఇంద్రుడి ఆజ్ఞమేరకు విశ్వామిత్రుడు తపస్సు చేస్తున్న వనానికి చేరుకుంది. ఆ మునిని గుర్తించడం ఎలా? అని అనుకొని ఒకటి వెంట మరొకటిగా వరుసగా ఏడు ప్రశ్నలు వేసుకుంటుంది. ఏదేమైనా నేను ఈ పనిని విజయవంతం చేయకపోతే అప్సరసలలో తనకున్న మేటితనం పోతుందని అనుకుంటుంది. కష్టపడి విశ్వామిత్రుని గుర్తించింది. ఆమె తనకు తోడుగా వచ్చిన వసంతుడిని చూసి ధైర్యం తెచ్చుకుంటుంది. నాట్యం మొదలు పెట్టి చిత్ర విచిత్రమైన భంగిమలతో అందరిని ఆశ్చర్య చకితులను చేస్తుంది. ఆమే ప్రదర్శించిన “భంగిమలకు / దివి నాధుడు / దిగ్భ్రమ...” చెందినాడని వర్ణించినారు. విశ్వామిత్రుడు కూడా చలించాడు. కామ, క్రోధ, మోహాలతో మోహినికై చూడడం మొదలు పెట్టాడు అని చెప్తూ నాల్గవ భాగాన్ని ముగించారు.

తపస్వియైన విశ్వమిత్రుడు తానుగా మేనక చెంతకు చేరి ఆమెతో సుఖించాలని కాంక్షిస్తాడు. వెంటబడుతాడు. ఇందులో ఒక సరసమైన సంభాషణ ఉంటుంది. మేనక “ తపోశక్తి గల మీకిది / తగునా ఇది ! ధర్మమా / చాలింపుడి సరసమ్ములు / పాలింపుడు బ్రహ్మచర్య...” అంటుంది. విశ్వామిత్రుడు “ రమ్ము నాదరి జేరి / రమణి ముద్దుల నిమ్ము...” అంటూ కామిస్తాడు. ఇద్దరు మైమరచి మోహంలో తేలియాడుతుంటారు. చివరగా మేనక విశ్వామిత్రుని తపోశక్తిని అతణ్ణి భంగపరచడంతో కావ్య కథముగుస్తుంది.

సాహిత్య ప్రపంచంలో కావ్య నాయికా నాయకులకు ఆ గ్రంథాన్ని అంకితం ఇవ్వడం నిజంగా విశేషమైన విషయమే. కావ్యం పూర్తికాకముందే అంకిత స్వీకర్తలను సిద్ధపరుచుకుంటున్న రోజులు. కాని ఈ రచయిత కావ్య నాయికా నాయకులైన మేనక – విశ్వామిత్రులకు అంకితం ఇవ్వడమనేది వారి నిరాడంబరతకు, పాత్ర చిత్రణా పరమైన సహానుభూతికి నిదర్శనంగా, తార్కాణంగా నిలుస్తుంది. తపస్సుకు సంబంధించిన చాలా విషయాలను తత్త్వ, సాంఖ్యశాస్త్రాల లోతులలో నుండి తీసుకొన్నారు. “కామక్రోధ మోహ లోభ / మద మాత్సర్యముల వీడి / నిష్కామ విరాగి మనో / నిశ్చయమున తపము సేయు...” (పు.40) ఆలాంటి వాక్యాలు దర్శనమిస్తాయి. కవితా సంప్రదాయాన్ని ఇముడ్చుకున్న కవికి వాక్య ప్రయోగ శక్తి తెలియకుండా సంక్రమించి తనలోలోతుల్లో

రంగరిచుకొని పోతుంది. తదనంతరం కావ్య రచన సమయాల్లో వ్యక్తిగత రసావేశము, కాల్పనిక శక్తి, ఇంద్రియ సంబంధిత వాసనా సంపద వంటివన్నీ కవిశక్తిని ప్రస్ఫుటం చేయడానికి బహిర్గతమవుతాయి. అందుకు నిదర్శనం ఈ వాక్యాలు.

తపస్సు గురించి చెప్తూ శాస్త్రిగారు "సంసారమను స్వర్గ / సౌఖ్యమ్ములను వీడి / దివి సభా సౌఖ్య సుం / దర కామినుల వీడి / నవయౌవనానంద / నాకమ్ము త్యజియించి..." (పు. 1) అంటారు. ఇక్కడ స్వర్గం వంటి సంసారమున్నప్పటికి, సుందర కామినిలున్నప్పటికి, మంచి యవ్వనం ఉన్నప్పటికి వీటన్నిటిని త్యజించి, వాటి మీదికి మనసును పోనివ్వకుండా తదేక నిష్ఠతో చేసేది తపస్సు అంటారు. ఈ తపస్సు విషయాన్ని భగవద్గీత మూడు రకాలుగా చెప్తుంది. ఒకటి "శారీరం తప ఉచ్యతే", "వాఙ్మయం తప ఉచ్యతే", "తపో మానస ముచ్యతే" (భగవద్గీత అ. 17, శ్లో. 14,15,16) ఇక్కడ శరీరానికి సంబంధించిన తపస్సు, వాక్కుకు సంబంధించిన తపస్సు, మనసుకు సంబంధించి తపస్సులు మూడు విధాములని తెలుస్తుంది. అంటే త్రికరణ శుద్ధితో ఒక్కక్క దానిని అదుపులో ఉంచడం ఒక తపస్సు అన్నమాట. కాని మనవారు చాలా సులువుగా త్రికరణ శుద్ధి అనే పదాలను వాడుతుంటారు. నిలకడగా ఆలోచిస్తే అది అంత సులభమైన విషయం కాదని అర్థమౌతుంది. ఇప్పుడు ఇక్కడ తపస్సు చేసుకుంటున్న విశ్వామిత్రుడు మాత్రం త్రికరణ శుద్ధిగానే చేయ నిశ్చయించుకున్నాడని, చేస్తున్నాడని స్పష్టమౌతుంది.

ఈ గేయ కావ్యంలో వర్ణనలు అన్నీ కూడా ఒకదానిని మించి ఒకటి కనిపిస్తాయి. అందులో ముఖ్యంగా హిమాలయ వర్ణన మహాద్భుతం. "ఉత్తుంగ శిఖరాల / ఉవ్వెత్తు ధారలకు / వజ్రవైడూర్య ప్ర / వాళ మరకతములకు / నీలిమేఘాల సం / దెలవీవ్రశక్తులకు / మత్తగజయూధముల / చిత్త చాంచల్యతకు / ఏచి కాచిన మధుర / మౌచిన్ని తరువలకు / పూచి రాలిన సుంద / రాకార సుమములకు / ఆలవాలమ్మైన / ఆ హిమాలయ పంక్తి..." (పు. 3) అనడంలో ప్రాచీన కావ్యాలలో, వివిధ ప్రబంధాలలోని పద్యాల వర్ణన దృశ్యాలు, గమకాలు గుర్తుకు వస్తాయి. ముఖ్యంగా నన్నయ ఆరణ్య పర్వంలో వర్ణించిన వచనం శాస్త్రిగారి పదాలకు అతి దగ్గరగా ఉంది. "బహు విధాకార ధాతు మంతంబులైన యుత్తంగ శృంగబులను, జలధర వినమ్ర ప్రబల బలాహ వ్యూహసంఛాదిత శ్యామాయ..." (భారతం; ఆరణ్యపర్వం, తృ. 77) ఇలాంటి వర్ణనలు నన్నెచోదుని 'కుమార సంభవము'లో "హాటక రుచియ కాకమరేంద్ర గిరికింత / పరమౌషదీ ప్రభాభాతి యెత్తి..." (తృ. 3), పెద్దన మనుచరిత్రలో "అటజని కాంచె భూమి సురుడంబర చుంబి..." (ద్వితీ. 3), కొఱవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశక'లో "హిమవత్ప్రాంతము జేరి శీతలములౌ

నీరంబులు స్నిద్ధసం..." (అష్టమాశ్వాసం.96) ఇలాచెప్పుకుంటూ పోతే హిమాలయ వర్ణన పద్యాలు గల కావ్యాలన్నీ మననం చేసుకోవలిసిందే.

శాస్త్రిగారి ఈ గేయ కావ్యంలో మనోహరమైన భావచిత్రణం కనిపిస్తుంది. పదాల కలయికతో కనులకింపయిన బొమ్మలను సృష్టించారు, అక్షర విన్యాసాలతో కూడిన ఆకృతులను అందించారు. "ఆకొన్న సింహంబు / ఆహారమును గాంచి / అప్రయత్నముగానే / అలగి లంఘించు విధ / మా మహాఋషి..." (పు.45) విశ్వామిత్రుని మనస్స్వభావాన్ని అందంగా వర్ణిస్తారు. "మేనక అందము / కానగ చందము... ఆయప్సర కా / మిని కాయమ్మున / గల సర్వావయవ / ముల లావణ్యము..." అనే పాదాలలో శాస్త్రిగారు యతిలోక తపోభంగిని యైన మేనక యొక్క అతిలోక సౌందర్య పరమైన సర్వావయాల తారుణ్య లావణ్యాన్ని ప్రస్తుతించినారు. ఇది కథా కథనోచితమైన వర్ణనం. ఈ వరుసలో మేనక విశ్వామిత్రుని కనుగొనడానికి అరణ్యానికి వెళ్ళింది. అక్కడ ఎందరో మునులు, తపస్వులు కనబడుతున్నారు. అందులో విశ్వామిత్రుని గుర్తించడం ఎలా అనుకున్నపుడు మేనక మనస్స్వభావ చిత్రణను కూడా లావణ్యంబుగా వర్ణిస్తాడు "మునినాథునే రీతి / కనుగొనగ వలయునో / కనుగొన్న నే రీతి / కరుణ పొందగ వలయు / కరుణ పొందిన మనసు / కరగింప శక్యమా ! / కాఠిన్య మానిసిని / కఠిన నిష్ఠా పరుని / కోపించు తాపసిని / కోరి ప్రేమించుటెటు / ప్రేమించి కామించి / ప్రియురాలినై యతని / తపము చాలింపనా / తరమె !..." (పు.38) అనుకున్న అనుమానస్పదపూరితమైన ఆలోచనను వివరించారు.

కార్యసిద్ధి ప్రయత్నం అనేది ఏ స్థాయిలో ఉండాలో ఈ కావ్యం ఆధారంగా తెలుసుకోవచ్చు. ప్రతివ్యక్తి ఒక ప్రత్యేక కార్యాన్ని ఫలవంతం చేసుకోవాలంటే తీవ్రమైన తపోదీక్ష ఉండాలి. మనం మంచి పని ప్రారంభించాము అంటే దానికి ఆటంకాలు కల్పించడానికి చాలా రకాలవారు సిద్ధమౌతారు అనే విషయం తెలుస్తుంది. మనిషి దేనికి ఎక్కువ ప్రలోభపడుతాడో దానిని మాత్రమే ముందుకు పంపిస్తారు. అందులో ఎంతటి వారులైనా కాంతదాసులే అనే విషయాన్ని గమనించక, నమ్మక తప్పదు. ఈ విషయాన్ని శాస్త్రిగారు 'మున్నుడి' అనే ముందుమాటలో "ఒక్కొక మారు ఈర్ష్యాసూయలు, రాగద్వేషములు, మానవుని పట్టుదల గలవానిగా జేసి పంతగింపజేసి, పరితపింప జేయును. పరితాపానంతర మాతని మన: ప్రవృత్తి వినూత్న భావ సంచయ సమన్వితమై మహోన్నత స్థాన మాక్రమించి కార్యసాధనకు బూనుకొనును" అంటాడు. ప్రతికూలాన్ని కూడా అనుకూలంగా మలచుకోవచ్చును అనే సందేశాన్ని అందిస్తున్నారు.

ఈ కావ్యంలో సంభాషణలు మంచి సరసంగా, సందేశాత్మకంగా కనిపిస్తాయి. ఇంద్రుడు మేనకను విశ్వామిత్రుని తపస్సు భంగం చేయడానికి వెళ్ళమని చెప్తాడు. అప్పుడు మేనక రాజర్షి కోపాన్ని, పౌరుషాన్ని గుర్తుకు చేసుకుని అతన్ని లోబర్చుకోవడం కష్టం అని లోలోపల మధన పడినప్పటికి రాజాజ్ఞను పాటించడం ధర్మంగా మేనకతో ఈ మాటలు పలికిస్తాడు రచయిత "లోకాధిప ! నాకము నీయదికద ! / లోకేశ్వర ! నే నీ దాననుగద !..." "నాయోపిన కొలదిని నా /తని తపమును భం /గము సేయ నే / యత్నింతును..." (పు.36) అను మాటలు పలికించడంలో బాధ్యతను ప్రయత్న పూర్వకంగా చేయవలసిన విధానాన్ని ఆదర్శంగా కవిత్వీకరించారు. విశ్వామిత్రుడు మేనకకు జరిగిన సంభాషణలు రసవత్తరంగా ఉంటాయి. పనిగట్టుకుని తపస్సు భంగం చేయడానికి స్వర్గము నుండి వచ్చిన మేనక విశ్వామిత్రుడు వెంబడించినపుడు స్త్రీ మనోభావాన్ని మేనక మాటల్లో "వన సీమలవిహరించెడి / వన జాక్షుల గాంచగనే / వలపుమీరు మునివర్యుల / కలలు దివాస్వప్నములగు / ఇది యేమిటి? గాధిసుతా / ఇదియేమిటి ఘోరమా / కామిని గన్పట్టగానె / కామము జనియించునా?..." రచయిత ఇట్లా పలికిస్తాడు. ఈ వాక్యాలు చదివినపుడు మనుచరిత్రలో ప్రవరుడు – వరూధిని సంభాషణలు గుర్తుకు రాకమానవు. ఇలా ఇంచు మించు అన్ని సంఘటనలలో వివిధ ప్రాచీన కావ్యాలలో గల గుభాళింపు మనకు కనిపిస్తుంటుంది. సాహితీ ప్రపంచంలో కొన్ని మంచి కావ్యాలు, కొన్ని మంచి వర్ణనలు, కొన్ని మంచి వాక్యాలు ఎంతమంది ఎన్నిసార్లు తిప్పి తిప్పి చెప్పిన చదవాలనే ఊరటపుడుతుంది. సాహిత్య వాహికలు ఎన్ని మారిన పాతలోగల మంచిని కొత్తపద్ధతులలో చెప్పుకోక పోతే మన వారసత్వ భావజాలాన్ని కోల్పోతున్నట్లే. 'పైలా పచ్చీసు'లో ఆరుద్రగారు అన్నట్లు "ప్రాతలోగల మంచినంతా / చేతులారా సేకరింతును / గతములోపల గరళముండి / గళములోనే దాచుకుందును" అనేవి నిరంతరం పాటించ వలసిన పాదాలుగా కనిపిస్తాయి.

శాస్త్రిగారు విశ్వమిత్రుడు తపస్సు తీరును చెప్తూ వివిధ "దివి నాధ దిక్పాల / త్రిదశు లెల్లర కన్న / ధర నిల్చినట్టి కొం / డల భీకరము కన్న / కాల మేఘాల గర్జ / నల రావము కన్న / శితికంఠు కంఠమున / నతిభయంకర రూపు / కల్గి చలియించు నా / గమువీక్షణము కన్న ..." (పు.4) అంటూ కొనసాగిన తులనాత్మక పోలికలు పదాహారున్నాయి. ఒక పోలిక వెనుక ఒక దీక్ష పరమైన తీక్షణత కనిపిస్తుంది. దిక్కులను పాలించు దేవతలు వీరిని శాస్త్రిగారు త్రిదశులు అని వాడారు. త్రిదశులు అంటే ఎప్పుడు మూడుపదుల వయస్సులో ఉండేవారిని అర్థం. వీరి ఏకాగ్రతకన్నా కూడా విశ్వామిత్రుడి తపస్సు తీవ్రత ఎక్కువుంది. భూమి మీదున్న కొండల నిశ్చలత కన్నా రాజర్షి తపస్సు

సాగుతుంది. శివుని మెడలో ఉన్న పాముల చూపులకన్న తీక్షణంగా ఉందంటు ఇలా చెప్పుకుంటూ లోతైన అందరినీ ఆలోచింపచేసే ఉపమానాలతో వివరించిన తీరు మరువలేనిది.

రచయిత చెప్పుకున్నట్లు "కవి హృదయమ్మున / కలిగెడి భావన / కనజాలదు కద!" (పు.19) వీరు రచనలోని పూర్తి భావాన్ని మనం అందుకోవడం కొంత కష్టమైనప్పటికి చక్కని సంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ గేయ కావ్యం వినోదాన్ని, సందేశాన్ని అందిస్తుంది. "శృంగార మయ ప్రపంచ / భృంగగాన మజరమ్మై / నాగీతాలాపన కొక / నవ్య శ్రుతిని సృష్టించును / నా గీతి విలాస వల్లి / నా గీతి ఫలాశమల్లి / నవచైతన్యమ్ము గల్గి / ననలు నెపుడు నీ పృథ్విన...' (పు.32) సామాజిక చైతన్య ధోరణిలో గీతాలు అందరిలో నిలుస్తాయని ఆశించిన శాస్త్రిగారి కాంక్ష సఫలమైనందుకు సంతోషం.

వాస్తవాన్ని శోధించి చరిత్రగా రాసిన కలం, రాళ్ళపై ఇగురించిన గీతలకు అక్షరరూపం కలిగించిన జీవన పయనం, కొన్నిజిల్లాల ప్రతి గల్లీల విషయాలను గ్రంథస్థం చేసిన ఆలోచనలు, రాజుల రాజ్యాలను రంగరించి పుస్తకాల రూపంలో పురుడు పోసిన శాస్త్రిగారు పౌరాణిక కథ ఆధారంగా చేసుకుని ఛందోబద్ధంగా గేయకావ్యం రాయడం హర్షణీయం. ఇది శాస్త్రిగారి బహుముఖీన ప్రజ్ఞా పాటవాలకు నిదర్శనం.

**అట్టెం దత్తయ్య**
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 94947 15445



# పాపాయి పతకము

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అప్పటిదాకా విస్మృతికి గురైన ప్రతి రంగంపట్ల ఒక కొత్త సోయి మొదలైంది. ప్రాథమిక పాఠశాల పాఠ్యపుస్తకం నుంచి ప్రాచీన చరిత్ర దాకా, బాల సాహిత్య చరిత్ర నుండి భారతీయ చరిత్రలో మన స్థానం వరకు తిరిగి మూల్యాంకనం చేసి రాసుకోవడం ప్రారంభమైంది. సరిగ్గా ఇరవై యేండ్ల క్రితం స్వర్గీయ ప్రముఖ చరిత్రకారులు బి.ఎన్.శాస్త్రిగారిని ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధం కోసం నేను ఇంటర్వ్యూ చేసినప్పుడు వారు నాతో అన్నమాటలు ఇప్పటికీ నా చెవుల్లో రింగుమంటూనే ఉన్నాయి. ఎంతో ఆవేదనతో "చరిత్ర రచనలోనూ తెలంగాణాకు దగా" అంటారాయన. ఆ ఇంటర్వ్యూ కూడా ఇదే శీర్షికతో అచ్చయ్యింది. చరిత్ర రచనలో మనకు జరిగిన అన్యాయం శాస్త్రిగారు నిరంతరం ఆవేదన చెందేవారు. తాను జీవించి ఉన్నంత కాలం తెలంగాణా చరిత్రను వెలికితెచ్చే భగీరథ ప్రయత్నం చేసారు. బి.ఎన్.శాస్త్రి తెలంగాణా చరిత్రకు కొత్త చరిత్రను లిఖించిన చేవ్రాలు. ఒక్క చేతిమీదుగా వేలాది పుటలను రాశి పోసిన డాక్టరేటు లేని పరిశోధకులు.

ఉమ్మడి రాష్ట్రంలోని దాదాపు నాలుగువేల గ్రామాలు పర్యటించి, వందలాది శాసనాలు, తాళపత్రాలను సేకరించిన శాస్త్రి త్రిపురాంతకానికి చెందిన 105 శాసనాలు, ముఖలింగానికి చెందిన 147 శాసనాలను పరిష్కరించి ప్రచురించారు. వారే ఒక ఇంటర్వ్యూలో ప్రస్తావించినట్టు తన రచనల్లో ప్రస్తావించిన రెండువేల శాసనాల్లో వేయి శాసనాలు వారే స్వయంగా పరిష్కరించినవి. దాదాపు 75కు పైగా గ్రంథాలను రచించిన

శాస్త్రిగారు విష్ణుకుండినుల చరిత్ర ద్వారా తెలంగాణా చరిత్రకు మరో అయిదు వందల సంవత్సరాల ఆయుష్షును పోసారు. శాసన సంపుటి, కందూరి చోదుల శాసనాలు, ముఖలింగ దేవాలయ చరిత్ర–శాసనాలు, బెజవాడ దుర్గా మల్లీశ్వరాలయ శాసనాలు, గోల్కొండ చరిత్ర–సంస్కృతి–శాసనాలు, చెఱకురెడ్డి వంశ చరిత్ర–శాసనాలు, రేచర్ల రెడ్డి వంశ చరిత్ర–శాసనాలు, కాయస్థరాజులు, వేములవాడ చరిత్ర–శాసనాలు, రేచర్ల పద్మనాయకులు, మల్యాల వంశ చరిత్ర–శాసనాలు వీరి ప్రముఖమైన శాసన రచనలు. ఇవేకాక శాస్త్రిగారు రచించి, కూర్చిన జిల్లా, మండల సర్వస్వాలు విజ్ఞాన భాండాగారాలు. ఈ సర్వస్వాలు తెలంగాణా సమగ్ర స్వరూపాన్ని తెలుసుకునేందుకు సాధనాలుగా నిలుస్తున్నాయి. మొదటగా నల్లగొండ మండల సర్వస్వంతో మొదలైన జిల్లా సర్వస్వాల రచన అటు తర్వాత ఆదిలాబాద్, మహబూబ్‌నగర సర్వస్వాల రచనకు దారి చూపింది.

పరిశోధకులుగా, చరిత్రకారులుగా 'కొత్త చరిత్ర' లిఖించిన బి.ఎన్.శాస్త్రి తొలినాళ్ళనుండి సృజనశీలి. 1954లో రచనకు శ్రీకారం చుట్టి రెండు నాటికలు, తొమ్మిది నవలలు రాసారు. తెలంగాణ వైతాళికుడు పులిజాల రంగారావుగారి జీవిత చరిత్ర రాసారు. ఆంధ్రదేశ చరిత్ర మూడు సంపుటాలు, భారతదేశ చరిత్ర 21 సంపుటాలు శాస్త్రిగారి చేతుల్లో రూపుదిద్దుకున్నాయి. ఇవేకాక బ్రాహ్మణ రాజ్య సర్వస్వం, రెడ్డి రాజ్య సర్వస్వం వంటివి వీరి పరిశోధనకు నిదర్శనాలు. ఈ దశలోనే చారిత్రక పరిశోధకుల కోసం శాస్త్రిగారే స్వయంగా పూనుకుని 'మూసీ' పత్రికను ప్రారంభించారు. రచయితగా ఎన్నో విలువైన రచనలు చేసిన బి.ఎన్.శాస్త్రి కూడా తొలి తరం సాహితీవేత్తలలాగే నవలలు, నాటికలతో పాటు తమవంతు బాధ్యతగా పిల్లల కోసం 'పాపాయి పతకం' అనే బాలల గేయ కావ్యం రాసారు.

తెలంగాణాలో స్వాతంత్ర్యానికి ముందే బాల సాహితీవేత్తలు ఉన్నప్పటికీ వారి గురించి ఎక్కడా రికార్డు కాలేదు. బాలల కోసం రచన, అనువాదాలుచేసి, పుస్తకాలను అచ్చువేసి చరిత్రలో నమోదు కాని రచయిత పొట్లపల్లి రామారావు. వీరి 'ముల్లా కథలు' 1945లో 'ఆనందవాణి' పత్రికలో వచ్చాయి. ఈ కథలన్నీ హాస్య వ్యంగ్య కథలు. వీరు రాసిన ఇంకో కథా శీర్షిక 'ఆచార్లు కథలు'. తెలుగులో ఆచార్యుల కథల కాన్సెప్ట్‌తో కథలు వచ్చిన ఉదాహరణలు లేవు. జి.సురమౌళి పిల్లల కోసం రాసిన నవల 'కలిసి బ్రతుకుదాం'. దీనికి 1958లో భారత ప్రభుత్వ ఉత్తమ రచన బహుమతి లభించింది. 1960లో డా.సి.నారాయణరెడ్డి, డా.దాశరథిలు రాసిన 'బాలల బొమ్మల భాగవతము',

డా.పి.యశోదారెడ్డి 'నక్కబావ', 'పేదరాసి పెద్దమ్మ కథలు', జి.రాములు 'గాంధీ సూక్తులు', 'బాలబాట' అర్థ శతకం వచ్చాయి. విద్వత్కవి వేముగంటి నరసింహాచార్యులు, గూడూరి సీతారాం కూడా బాల సాహిత్యాన్ని రాశారు. 1955 నుండి రచనా వ్యాసంగం ప్రారంభించిన డా.గూడూరి రాఘవేంద్ర ప్రధానంగా పిల్లల కోసం రాసారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఇల్లందల సరస్వతీదేవి పిల్లల కోసం రచనలు చేసారు. ఆంధ్ర ప్రదేశ్ బాలల అకాడమి 1976లో 'బాలబంధు' పురస్కారాలను ఇచ్చి సత్కరించగా మొదటగా అందుకున్న ఆరుగురిలో సరస్వతీదేవి ఒకరు. కామారెడ్డికి చెందిన తిగుళ్ళ వెంకటేశ్వరశర్మ 1959లో 'వానకారు' వీరి బాల గేయాల సంపుటి ప్రచురించారు (వీరు జీవించి ఉన్నారు). నేను పేర్కొన్న వీళ్ళేకాక ఎక్కడా నమోదుకాని బాలల రచయితలు తెలంగాణలో ఎందరో ఉన్నారు. ఈ కోవలోనే 1964లో పిల్లల కోసం రచన చేసి ఎక్కడా రికార్డుకాని బాలసాహితీమూర్తి స్వర్గీయ భిన్నూరి నరసింహశాస్త్రిగారు.

ఈ వ్యాసాన్ని రాస్తున్న క్రమంలో నాకు శాస్త్రిగారి 'పాపాయి పతకం' లభించింది. సాహిత్య చరిత్రను చదువుతున్న క్రమంలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారివంటి ఒకరిద్దరు తప్ప ప్రతి సాహిత్య చరిత్రలో తెలంగాణలో సాహిత్య వికాసం పెద్దగా జరగలేదని, తౌరక్యాంధ్రము తప్ప తెలుగు రాయడం రాదని చెబుతూ వచ్చారు. దీనికి తోడు చరిత్ర రచనలో చేర్చాల్సిన చాలా పేర్లను వివోతోనో, ఇతర కారణాలతోనూ చేర్చలేదు. బాల సాహిత్య విషయంలోనూ అదే జరిగింది. పైన చెప్పినట్టు స్వాతంత్ర్యానికి పూర్వమే రచనలు చేసి పుస్తకాలు తెచ్చిన పొట్లపల్లి రామరావు గారిలాగే 1963లో రచనలు చేసిన బి.ఎన్.శాస్త్రిగారు కూడా చరిత్రలోకి ఎక్కలేదు.

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే తన పరిశోధనతో తెలుగువారికి నాలుగువందల యేండ్ల విష్ణుకుండినుల చరిత్రను చేర్చిపెట్టిన చరిత్రకారుని చరిత్ర బాలసాహిత్య రచనల్లో లేకపోవడం.

ఇక ఈ పాపాయి పతకం చక్కని గేయకథాకావ్యం. బాల్యాన్ని, బాల్యంలోని స్నేహాన్ని, దాని మాధుర్యాన్ని వివరించడమే కాక ఆటలు, పాటలు, పిల్లలు వాళ్ళ వాళ్ళ మనస్తత్వాలకు అందమైన చిత్రపటంగా నిలిచింది.

పిల్లలు ఎక్కడైనా పిల్లలే. బాల్యం ఎక్కడైనా ఒకేవిధంగా ఉంటుంది. భాషల్లో, పరిసరాల్లో తేడా ఉండవచ్చేమో కాని మిగతా అన్నీ ఒకేవిధంగా ఉంటాయి. అది ఈ రచనలో కనబడుతుంది.

ఇది ఇద్దరు అన్నాచెల్లెళ్ళ కథ. ఆనందు, అతని చెల్లెలు పాపాయి. అందాల పాపాయి అంటే ఇంటిల్లిపాదికే కాక ఆనంద్ మిత్రులందరికీ కూడా ముద్దే. అటువంటి పాపాయికి ఎంతో ప్రేమతో అమ్మానాన్నలు బంగారు గొలుసు, దానికో పతకం చేయించి మెడలో వేస్తారు. ఒకనాడు ఆటలాడుకునేటప్పుడు అది ఎక్కడో జారి పడిపోతుంది. ఆ తరువాత జరిగిన సంఘటనలు, పరిణామాలు గేయకథగా చెప్పారు శాస్త్రిగారు.

శాసనాలు, చరిత్రపైన ఎంతో సాధికారికమైన పట్టున్న శాస్త్రిగారు అలతి అలతి పదాలతో బాలల స్థాయికి ఎదిగి గేయాన్ని చెప్పడం వారి పరిణతికి నిదర్శనం. గేయకథ ఆరంభాలలోని ఎత్తుగడే పాఠకులను ఆకర్శింపజేస్తుంది.

**"అనగనగా ఒక ఊరు**
**ఆ వూరిలోన**
**ఆనందు అనియేటి**
**అబ్బాయి కలడు"**

అంటూ నానమ్మ, అమ్మమ్మలు తాతలు, మనవలు - మనుమరాండ్రకు 'ఏడు చేపల కథ' చెప్పినట్లు చెప్పే ఆకర్షణీయమైన విధానాన్ని శాస్త్రిగారు ఇందులో సాధించారు. అది మనకు తెలియని మన చరిత్రను మనకు ఎలా చెప్పారో అంతే నిబద్ధతతో పిల్లలకు కథను కూడా చెబుతారు. ఈ గేయకథలో ఇదేవిధంగా ఒకేరకమైన లయలో, గతిలో తూగుతో నడిపించడం చూడవచ్చు. కవి ప్రతిభకు తార్కాణంగా నిలుస్తుందిది. ఉదాహరణకు

**"ఓ పాప మా పాప**
**ఓ చిన్ని పాప**
**ఆడుకోబోదాము**
**అందరితొ మనము**
**"భయమేల చెల్లిరో!**
**బాబాయి లేడా!**
**అమ్మ మననేమన్న**
**అతనడ్డు రాడా!"**

చదవగానే పిల్లలకే కాదు పెద్దలు సైతం ఆకర్షించే శైలి, నడక శా5స్త్రిగారి గేయానిది.

పిల్లలను చాలా దగ్గరగా చూసి, వారి మనస్తత్వాన్ని గమనించి గేయం ప్రారంభంలోనే

ఇంట్లోని పెద్దవారు, ముసలివారు 'చంటి పాపలకు కథలు చెప్పుచు నెపుదు" అని కాలం గడుపుతారని అంటారు. అటువంటి వాతావరణం నుండి వచ్చిన ఆనాటి పాపాయిల కథ యిది.

ఒకనాడు ఆనందు తన మిత్రులతో ఆడుకోవడానికి ఒక్కడే బయటకు వెళ్తాడు. తిరిగివచ్చి తన చెల్లెలితో తన ఆటల విశేషాలు చెప్పడంతో ఆమె అలుగుతుంది. నానమ్మకు షికాయతు చేస్తుంది. చెల్లెల్ని బుజ్జగించేందుకు బయటకు వెళ్ళి ఆడుకుందామని సముదాయించి తీసుకెళ్తాడు. ఈ సందర్భంగా బాలల సహజమైన ఆసక్తుల్ని, భయాల్ని శాస్త్రిగారు గొప్పగా చూపిస్తారు.

**"పిట్ట గూళ్ళను గట్టు / పిల్లలను జూచి**
**బావి గుంటలను / బాలలను చూచి...!"**

బయటకు వెళ్ళి ఆడుకుందామని ఉన్నా పెద్దవాళ్ళ భయం పాపాయిది. 'అమ్మేమనునో! ఆటాడబోతే' అని భయాన్ని వ్యక్తం చేస్తుంది.

**"భయమేల చెల్లిరో! / బాబాయి లేడా!**
**అమ్మ మననేమన్న/ అతనడ్డు రాడా!"**

అనడం ఇక్కడ కొసమెరుపు. ఉమ్మడి కుటుంబం, ప్రేమలు, ఒక తరం నుండి మరో తరానికి అనురాగాలు, విలువలు, బాల్యం నుండే పిల్లలకు ఎలా అలవడుతాయో తెలుస్తుందిక్కడ.

పాపాయికి కొందరు నచ్చకున్నా పక్కన రాంబాబు, గోపాలు, వాసంతి, కమల, గోపాలకృష్ణ, శాంతమ్మ, విమల, కాంతమ్మ, పాలరామన్న, బుజ్జాయి అందరు కలిసి ఆడుకుంటారు. ఆడాక వెళ్ళి వాగులో దూకుతాడు. ఇసుకలో ఆడుతూ, పాడుతూ ఉ ంటారు. ఈ సందర్భంగా బాల్యంలో బాలల చేష్టలను చెప్పిన తీరు బాగుంది. రేపటి తరానికి స్ఫూర్తిదాయంగా కూడా ఉంది. అది

**"ఇండ్లెన్నొ కట్టారు / ఇంపుగా వారు**
**బావులు త్రవ్వారు / బాటలేశారు**
**కాల్వలు తవ్వారు / కట్టలేశారు**
**చెట్లను నాటారు / గట్లు పోశారు"**

అలా పిల్లలంతా ఆడుకుంటున్న క్రమంలో ఆటలో మైమరచి ఉన్న పాలరాముడు నీళ్ళలో పడిపోయి తడిసిపోతాడు. అది చూసి పాపాయి నవ్వుతుంది. కోపంలో తన కుక్కను తీసుకొని వచ్చి పాపాయి మీదికి ఉసి గొల్పుతాడు భయంతో పాపాయి, బుజ్జాయి పరుగెడతారు. అలా పరిగెడుతున్నప్పుడు పాపాయి మెడలోని పతకం ఇసుకలో పడిపోతుంది. తిరిగి వెళ్ళేప్పుడు

"రాంబాబు కగుపడెను / రామన్న జూచె" అలా దానిని ఇద్దరూ జేబులో వేసుకుంటారు. పాల రాముడు, రాంబాబు పతకాన్ని ఏం చేద్దామని ఆలోచిస్తారు. పాల రాముడు పాపయి పతకం పాపాయికిద్దాం' అంటాడు. 'పతకమిచ్చుట మంచి / పనికాదు చూడ' అంటాడు రాంబాబు. చివరికి పాలరాముడు కూడ రాంబాబు మాటలకు తలొగ్గి పతకాన్ని ఊరిలోని కోమటికి ఇచ్చి వచ్చిన ధనంతో 'నీటైన బట్టలును / ఆట వస్తువులు / కొనితెచ్చి యాదుదము" అని నిర్ణయించుకుంటారు.

పిల్లలు ఇంటికి చేరినాక పాపాయి మెడలో పతకం లేదని అమ్మమ్మ గ్రహించి అడుగుతుంది. పతకం ఆడుకునేప్పుడు పోయినదని గ్రహించారు. 'వెదికి వచ్చెదనమ్మ! వెదికి వచ్చెదను" అంటూ వెతకుటకు వెళ్లారు.

**"గట్ల పొదుగున చూచె / చెట్లలో చూచె**
**ఏటి పొదుగు చూచె / నీటిలో చూచె**
**వాగు పొదుగున చూచె / వాదలో చూచె"**

అలా కాళ్ళు అరిగేలా తిరిగినా ఫలితం కనిపించదు. వేగంగా తిరిగి వెళుతున్న ఆనందుకు గోవిందు, గోపాలు, గోపాలకృష్ణ కలుస్తారు. పతకము పోయిన ముచ్చల తెలిసిన మిత్రులు అది రాంబాబు – రామన్నల పనే అని గ్రహించి, దూరంగా వెళుతున్న ఆ ఇద్దరిని నెమ్మదిగా వెంబడిస్తారు. గతంలో వాళ్ళు చేసిన దొంగతనాల గురించి కూడా చర్చించి నిర్భయంగా ఇది వాళ్ళు తీసారని నిర్ణయానికి వస్తారు.

మరోవైపు పతకాన్ని అమ్మి వచ్చిన పైకంతో

**"బొంగరము కొంటాను / బంతి కొంటాను**
**పటిక బెల్లము కొందు / పుట్నాలు కొందు**
**ఎవ్వరడిగిన గాని / ఇవ్వనేనందు"**

అంటూ కలలు కంటాడు పాలరాముడు.

**"చిన్న కత్తి కొందు / పొస్తోలు కొందు**
**ఆనందు గోపాలు / గోవిందు కపుడు**
**పిస్తోలు చూపించి / హడలు పుట్టింతు"**

అని రాంబాబు అనుకుంటాడు.

చివరికి పాపాయి పతకం పాపాయికి అందింది. అది చూసి పాపాయి ఎంతగానో సంతోషపడుతుంది. మళ్ళీ బాలలంతా కలిసి మెలిసి అన్నీ మరచిపోయి ఆటలాడుకుంటూ పాటలు పాడుకుంటారు. ఇదీ "పాపాయి పతకం" గేయ కథ. బి.ఎన్.శాస్త్రిగారి పరిశీలనా శక్తికి బాలల స్థాయికి  తగినట్లు రాసినారు. కేవలం పిల్ల గురించి చెప్పి ఊరుకోలేక కవి బాలల నేపథ్యంగా ఆనాడు ప్రచారంలో ఉన్న ఆటలను గురించి చెప్పారు. క్యాడ్‌బరీస్ వంటివి ఇంకా తెలంగాణాను పూర్తిగా కమ్మివేయని కాలంలో 'కోమట్ల' దుకాణాల్లో దొరికే పటిక బెల్లం, పుట్నాలను గురించి, చిరుతిండ్లను గురించి చెప్పారు. వాటిలో పిల్లలంతా ఆటాడుకుంటూ ఇంటికి చేరుతున్న క్రమంలో నిజానికి కథాగమనంలో అవసరం లేకున్నా పిల్లలకు మన కళలు, కళారూపాలను పరిచయం చేయాలన్న ఒక పవిత్ర తలంపుతో "బహురూపుల" వేషగాళ్ళను పరిచయం చేయడం శాస్త్రిగారి గొప్ప ఆలోచన.

మన తుపాకీ రాముని గురించి చెబుతూ ఇందులో...

**"పదిలక్షల  పది / పెంకాసులతో..."**
**"ఏమి రాగంబు / కూనిరాగాములు**
**కొంటె రాగములు / గూని రాగములు"**
**"పెండ్లికి వచ్చిన / పెద్దలందరికి**
**గాడిద రాగము / గమ్మత్తు గుండెను"**
**"పెండ్లానికి బంగారం పెడితే**
**మోయలేక పడె / మోకాలిరిగే"**

వంటి 'భలే సొంపు' మాటలు పిల్లలచే గంతులు వేయిస్తాయి. చప్పట్లు చరిపిస్తాయి. శాస్త్రిగారు ఇందులో అది చేయించారు.


**డా. పత్తిపాక మోహన్**
అసిస్టెంట్ ఎడిటర్ మరియు ప్రోగ్రామ్ ఆఫీసర్, నేషనల్ బుక్ ట్రస్ట్.
ఫోన్ : 996622 9548



# మూసీ మాస పత్రిక - అనుశీలన

మూసీ సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక మాస పత్రిక. ఈ పత్రికను 1980 ఆగస్టు 15 వ తేదీన భిన్నూరి నరసింహ శాస్త్రి (బి.ఎన్.శాస్త్రి) ప్రారంభించారు. బి.ఎన్.శాస్త్రి శాసన పరిశోధకుడు, చరిత్ర నిర్మాత, తెలుగు విశ్వవిద్యాలయ విశిష్ట పురస్కార గ్రహీత. ఈయన సంపాదకత్వంలో మూసీ పత్రికలో ఎన్నో వినూత్న అంశాలు వెలువడ్డాయి. మూసీ పత్రిక ప్రారంభమైన కొద్ది కాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందింది. సాహితీ లోకాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన పత్రిక ఇది.

మూసీ పత్రిక ఎన్నో, మరెన్నో సాహిత్య పత్రికలకు మార్గదర్శకమైంది. మూసీ 'రత్నగర్భ' గా సాహితీవేత్తల చేత అభివర్ణింపబడింది. సాగరంలో అంతులేని రత్నరాశులు ఉన్నట్లుగానే మూసీలో కూడా ఎన్నో రకాలైన విషయ పరిజ్ఞానముంది. సముద్రమంత మూసీ లోని ఆణిముత్యాలను శక్త్యానుసారంగా సేకరించి, అలసిసొలసిన వారే కానీ, నిరాశతో వెనుదిరిగిన వారు మాత్రం లేరంటే అతిశయోక్తి కాదు.

ఈ పత్రికను స్థాపించిన శాస్త్రి గారు తన కూతురైన 'మనోహరి' తో పాటు మూసీ అనే కన్యకను కూడా తన అల్లుడైన సాగి కమలాకర శర్మకు అప్పగించారు. బి.ఎన్.శాస్త్రి ఆశయ సాధన కోసం ఆ దంపతులు అహర్నిశలూ పత్రిక కోసం శ్రమిస్తున్నారు. సాహిత్య, సాంస్కృతిక విలువలను, అంతరించిపోతున్న చరిత్ర ఉద్దేశాలను సామాన్యుల వరకు తీసుకెళ్లాలనే తపన మూసీ పత్రిక సంపాదకులలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ఈ పత్రిక ప్రారంభం నుంచి నేటి వరకు క్రమవికాసం చెంది ఉన్నత శిఖరాలను అధిరోహించింది. ఇందులోని అంశాల గురించి ఒకసారి పరిశీలిద్దాం.

సకల శాస్త్ర విషయాలతో కూడుకున్నదే సాహిత్యం. సమాజానికి మేలు చేకూర్చేది కూడా ఇదే. అటువంటి సాహిత్యంలో భాగమైందే కవిత్వం. మూసీపత్రికలో ఎన్నో కవితలు పుట్టుకొచ్చాయి. వాటిలో ప్రాచీన కవిత్వంలో సంస్కృత పద్యకవిత్వం, తెలుగు పద్యకవిత్వం ఉన్నాయి. ఆధునిక కవిత్వానికి సంబంధించి వచన కవిత్వంలో భావ, అభ్యుదయ, మినీ కవిత్వం, హైకూలు, నానీలు, గజల్స్, పేరడీలు, రుబాయి, గేయ కవిత్వాలున్నాయి. ఏ పత్రికలు ప్రచురించడానికి సాహసించని సంస్కృత పద్య కవిత్వం సైతం మూసీ ప్రచురించింది.

మూసీ పత్రికలోని తెలుగు పద్యకవిత్వాన్ని గమనిద్దాం.

శ్రీరంగం గోపాలాచార్యులు రచించిన 'గాంధీ తిరిగి వస్తే' అనే కవితలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, అనంత లోకాలకు వెళ్ళిన మహాత్ముడు సత్యధర్మ ప్రవర్తనా గుణాలను కలిగిన కారుణ్య మూర్తులను కన్న భారతదేశం ఇప్పుడెలా వుందో చూడాలని ఆత్మరూపంలో వస్తారు. ఆ సమయంలో జరిగే పరిణామాలను ఈ కవితలో వివరించబడింది.

రాతి ఇళ్ల స్థానంలో నింగినంటే మేడలు, పూరి గుడిసెల తావులో ఫ్యాక్టరీలు, ఎక్కడ చూసినా బారు షాపులు, ఏ పత్రిక చదివినా మానభంగాల రాతలు, స్వార్థపరులైన పాలితులే వున్నారు. తన దేశం వికృతి రూపం చూసిన గాంధీ హితవు చెప్పబోతే, తమకు ఎక్కడ కీడు జరుగుతుందోనని గాంధీని చంపబోయారని ఈ పద్యంలో తెలుపబడింది. అది

**"నరుడు గాంధి రాక నలుగురిలో జెప్పె**
**తమ తమ గతులన్నీ దప్పుననుచు**
**ధన, కనక, వధు, మధు దాసులంతట చేరి**
**చంపబోవ గాంధి చనియె దివికి"** అని కవి తన ఆవేదనను వ్యక్తం చేశారు.

'విద్య' అనే కవితలో విద్య గొప్పతనాన్ని, దాని వల్ల కలిగే లాభాలను వెలుదండ సత్యనారాయణ వివరించారు. విద్యలేని వాడు వింత పశువున్న చందాన విద్యలేని వాడు అజ్ఞానంతో తాను చేస్తున్న పనిలోని మంచి చెడ్డల్ని తెలుసుకోలేడు. విద్య కలిగిన వాడు తన జ్ఞానంతో ప్రపంచంలో ఎక్కడైనా గౌరవింపబడతాడని, విద్యతో వ్యథలన్నీ తొలిగిపోతాయని ఈ కవితలో తెలుపబడింది.

సం.వి. వెంకటేశ్వరాచార్యులు సేకరించిన 'పుస్తక తస్కరులకు మనవి' అనే కవితలో పుస్తకాలు పదిమందికి ఉపయోగపడాలనే సదుద్దేశంతో లైబ్రరీలకు దాతలు విరాళంగా

ఇస్తారు. వాటిని చదివి, అందులోని భావాన్ని మాత్రం తీసుకొని ఆ పుస్తకాన్ని స్వార్థ బుద్ధితో దొంగిలించి, ఇంట దాచుకోవడం పాపమని చెబుతూ...

**"బుక్కులు తీసుకుపోయిన**
**మక్కువతో చదివి మీరు మరి యివ్వవలెన్**
**చిక్కెనని యింట దాచిన**
**మిక్కిలి పాపంబు మీకు మితిమీరి యగున్"** అని హెచ్చరించారు రచయిత.

'కృషీవలా' అనే మరో పద్య కవితలో కాలమెంత మారినా రైతు బతుకు మారడం లేదని, ప్రకృతి వైపరీత్యాలకు తల ఒగ్గకుండా, భార్యాబిడ్డలతో సహా నిత్యం కష్టపడే రైతు కన్నా గొప్పవాడు ఈ భూమిపై లేదు. ప్రజలకు ఆకలి తీర్చే రైతు నేలతల్లి గారాల బిడ్డ అని అంటూ రైతుల కష్టమయ జీవితాన్ని కవి 'తిరునగరి' వివరించారు.

'తెలుగు తల్లి' అనే పద్య కవితలో అపూర్వ చారిత్రక నేపథ్యం వున్న తెలుగు తల్లికోసం సాగర గర్భాన ఉన్న అమృతాన్ని పొందినట్లు మహనీయుల కృషితో తెలుగు వారంతా ఒక్కటై తెలుగును వర్ధిల్లజేశారు. పరభాష, పరస్త్రీ వంటిదని చెబుతూ...

**"పర వనితా వ్యామోహము**
**కరణిన్ పరభాషలెపుడు కదువాదుచునిన్**
**మరతురు లజ్జాహీనత**
**ధరజననీ సేవకంటె ధన్యతకలదే?"** అంటూ, తెలుగు భాష హెూదాను, మాతృభాషా ప్రాశస్త్యాన్ని ప్రతిఒక్కరూ మాతృభాషను ఉపయోగించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ సృష్టి ఉన్నంత వరకూ తెలుగుతల్లి వర్ధిల్లుతుందని అందె వెంకటరాజం ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

'వృక్షకావ్యం' అనే పద్య కవితలో ఫణీంద్ర అనే రచయిత చెట్ల ఉపయోగాలను, వాటి త్యాగమయ జీవితం గూర్చి వివరించారు. మనిషి పుట్టినపుడు ఊయలగా మారి, చనిపోయినపుడు పాడెగా కూడా చెట్టు తోడ్పడుతుందని తెలిపారు. పచ్చని చేలతో కంటికి ఇంపుగా కవికి, కవితలు రాసే స్ఫూర్తినిస్తూ చెట్టు కాగితంగా కూడా మారిందని, చెట్ల జాతిని పెంచడానికి ప్రతీ మనిషి చేయాల్సిన పని గురించి చెప్పబడింది. అది –

**"నాట వలయు ప్రతి నరుడొక్క చిరుమొక్క**
**వృక్షజాతి పెరుగ విరివిగాను"** అంటూ ప్రతి మొక్క పెరిగి ఈ మానవాళికి లాభాలను చేకూర్చుతుందని పేర్కొనబడింది.

పంపన రచించిన 'ఆకలి' అనే పద్య కవితలో బిడ్డ పుట్టినపుడే ఆకలి పుడుతుందని, ఎలాంటి నిప్పు లేకుండానే పుట్టే ఆకలనే అగ్నిని అన్నమే శాంతింపజేస్తుందని తెలిపారు. పురాణాల్లో విశ్వామిత్ర మహర్షి ఆకలికి తట్టుకోలేక కుక్క మాంసాన్ని తిన్నాడని చెప్తారు. ఆకలి బాధను ఓర్చుకోలేని మహాకవి, పండితుడైన వ్యాసుడు కాశీ పట్టణాన్నే నాశనం చేయడానికి పూనుకొన్నాడు. ఆకలి బాధకు ఎంతటి వారైనా విచక్షణ కోల్పోతారని, దానిని అనుభవిస్తే తప్ప వివరించడానికి వీలుకాదని కవి ఆకలి విశ్వరూపాన్ని ఆవిష్కరించారు.

"నా జాతి చరిత్ర పుటల్లో" అనే పద్య కవితలో ఈ దేశంలో ఉపనిషత్తులు, పురాణాలు వెలిశాయి కానీ, వాటిని చదివి అందులోని పరమార్థాన్ని గ్రహించడానికి వీలులేనంతగా ప్రజలు హైరానా పడుతున్నారు. నిరంకుశ రాచరికానికి ఎదురు నిలిచిన భారతం, శ్రీరాముడు, ధర్మజులంతటి ధర్మ పాలకులు మన చరిత్రలో వున్నారు. ఈ దేశంలో జన్మించడం పూర్వజన్మల పుణ్యంగా కవి కనపర్తి రామచంద్రాచార్యులు కొనియాడారు.

చెన్నయ్య రచించిన 'నేనొక తెల్గుపండితుడ..." అనే పద్య కవితలో కలమనే కత్తిని పట్టి కర్తవ్యంతో యుద్ధం చేయగలను. కానీ కల్తీల ఫ్యాషన్లకు కరగనని, వ్యాపార ధోరణిని అలవర్చుకోలేనని, ఎన్ని అవస్థలైనా ఓర్చి, తెలుగు కమ్మని గీతాలను గొంతెత్తి పాడగలనని చెప్పారు. భారతమాతను మనసులో నిలిపి, సరస్వతీ దేవి ధ్యానాన్ని చేస్తానని, నేడు భ్రష్టుపట్టిన సామాజిక పరిస్థితులకు చలించిన కవిత తన ఆవేదనను వ్యక్తం చేశారు.

'వద్దు మత మార్పిడి' అనే కవితలో లోకంలో మంచి మనిషికి పెట్టిన పేరే హిందువని, కవి మసన చెన్నప్ప తెలిపారు. ఒక మతాన్ని కాదని మరో మతం మంచిదని, మరోమతం ఆకర్షిస్తే, ఆ మతానికి మారుతూ వెళ్ళడం వల్ల ఫలితం ఉండదని తెలిపారు. ధర్మాన్ని ఆచరిస్తూ, సత్యమార్గంలో ప్రయాణిస్తూ, పురుషార్థాలను పాటించే వాడికి మతంతో పనిలేదు. అన్ని దు:ఖాలకు కారణం అధర్మమని, లోకానికి మంచి తెలియజేసేదే మతమని, మానవత్వాన్ని మించిన మతం మరొకటి లేదని వివరించారు.

మాడుగుల నారాయణమూర్తి రచించిన 'స్నేహము' అనే పద్య కవితలో మిత్రుత్వం గురించి వివరించబడింది. 'గతి తప్పిన మానవత్వం' అనే పద్య కవితను సముద్రాల వేణు గోపాలాచార్య రచించారు. ఇటువంటి విలువైన మానవత్వపు విలువలను తెలిపే పద్యాలను మూసీ పత్రికలో ప్రచురించబడింది.

**ఆధునిక కవిత్వంలో** వచన కవిత్వం ప్రాధాన్యతను సంతరించుకుంది. వచన కవిత్వంలో భావకవిత్వం మనిషిని ఊహాలోకంలో విహరింప జేసింది. మూసీ పత్రికలో

భావకవిత్వంలో ఎన్నో ఆణిముత్యాల్లాంటి కవితలున్నాయి. ఈ కవితల్లో కొన్ని మనసును గిలిగింతలు పెట్టేవైతే, మనసును బాధతో మెలిపెట్టేవి కొన్ని. ఆలోచనలు రేకెత్తించేవి మరికొన్ని మనల్ని రసజగత్తులో విహరింప చేసేవిగా ఉన్నాయి. వీటితోపాటు అభ్యుదయ కవితలు, వివిధ వాదాలకు సంబంధించిన కవితలన్నిటికి సమ ప్రాధాన్యాన్ని ఇచ్చి ప్రచురించడం సంపాదకుల సమదృష్టికి నిదర్శనం. మూసీ పత్రికలో ఇవేకాక, గజల్స్, పేరడీలు, రుబాయిలు వంటి కవితాప్రక్రియలు కూడా కోకొల్లలుగా వస్తుంటాయి.

**కథలకు కూడా మూసీలో ఒక ప్రత్యేకస్థానం ఉంది.** ఒకటి రెండు సంచికలు మొత్తం కథలకు సంబంధించిన వాటిని వెలువరించిన ప్రత్యేకత మూసీ పత్రికకు దక్కుతుంది. ఇక నవలల విషయానికి వస్తే మూసీ పత్రికలో ముందుగా మూసీ పత్రిక వ్యవస్థాపకులు బి.ఎన్.శాస్త్రిగారు రచించిన నవలల్లో **'వాకాటక మహాదేవి', 'విప్లవజ్వాల'** అనే నవలలను ప్రచురించారు. మరో నవల **'నాగమణి'** దీనిని కపిలవాయి లింగమూర్తి రచించారు. **'మహాదర్శనం'** అనే అనువాద నవలను కూడా మూసీ పత్రిక ప్రచురించింది. ఇది తాత్త్విక నవల. కన్నడ మూలం కీ.శే. దేవుడు నరసింహశాస్త్రి, అనువాదం శ్రీమతి లలితా శాస్త్రి.

మూసీ పత్రికలో వ్యాసాలు అన్ని అంశాలకు సంబంధించినవి ఉన్నాయి. ప్రాచీన సాహిత్యానికి ఆధునిక, జానపద విజ్ఞానానికి, శాసనాలకు, చరిత్రకు, గిరిజన సాహిత్యానికి, భారతీయ సంస్కృతికి, సంస్కృత సాహిత్యానికి, శాస్త్ర విశేషాలకు, సంగీతానికి, సంగీత వేత్తలకు సంబంధించిన అనేక వ్యాసాలు ప్రచురించారు. ప్రచురిస్తున్నారు. వేరు వేరు సందర్భాలలో ప్రత్యేక వ్యాసాలు, సాహిత్యంలోని వేరు వేరు వాద వివాదాలపై ప్రత్యేక వ్యాసాలు సమాజంలోని అందరు ప్రముఖులతో వ్రాయించి ప్రచురించింది. సంప్రదాయ, నవ్యసంప్రదాయ, అభ్యుదయ, విప్లవ, చేతనావర్త కవిత్వ, దిగంబర, ఆధునిక, అత్యాధునిక కవిత్వాలకు సంబంధించిన ఎన్నో ప్రత్యేక వ్యాసాలు మూసీ మాసపత్రిక ప్రచురించింది. సాహిత్యం, సంస్కృతి, చరిత్రలకు సంబంధించిన ఎన్నో అంశాలు, వందలాది పరిశోధనాత్మక వ్యాసాలు మూసీ పత్రికలో వెలువడ్డాయంటే ఆశ్చర్యం లేదు.

ఇటీవల ప్రతి మాసం నిర్వహిస్తున్న 'మూసీ సాహిత్య ధార'లోని ప్రధాన ప్రత్యేక ప్రసంగాలను కూడా ఎన్నింటినో ప్రచురించి సాహితీవేత్తల దాహార్తిని తీరుస్తున్నది మూసీ మాసపత్రిక.

ఈ పత్రిక ఆధ్వర్యంలో ప్రత్యేక సంచికలు కూడా ప్రచురించారు. మొదట **ద్వైవార్షిక ప్రత్యేక సంచికను** వెలువరించింది. ఇందులో కవితలు, కథలు, వ్యాసాలతోపాటు 'లోచూపు'

అనే ప్రముఖ వ్యక్తుల ఇంటర్వ్యూలను కూడా ప్రచురించింది. మరో ప్రత్యేక సంచిక **'తెలుగు సంస్కృతి'** పేరుతో త్రైవార్షిక పత్రికను ప్రచురించింది. ఇందులో తెలుగు సంస్కృతికి సంబంధించిన అనేక కవితలు, కథలు, వ్యాసాలతో పాటు ప్రముఖులతో ముఖాముఖీలను కూడా వెలువరించారు. **'సుచరిత'** అనేది మరో ప్రత్యేక సంచిక. ఈ సంచికను మూసీ పత్రిక వ్యవస్థాపకులైన శ్రీ భిన్నూరి నరసింహశాస్త్రి సంస్మరణ మరియు చరిత్ర పరిశోధనా విధానాలపై ప్రత్యేక వ్యాసాలను, చారిత్రక వ్యాసాలను ప్రచురించింది. **'మన తెలుగు'** అనే మరో ప్రత్యేక సంచికలో తెలుగు భాషపై ప్రత్యేక కవితలు, వ్యాసాలు వెలువడ్డాయి. సాహితీ ప్రక్రియలతో కూడుకున్న **'కదంబం'** అనే ప్రత్యేక గ్రంథం, తెలంగాణ 31 జిల్లాల ప్రత్యేక సమాచార సమాహారంతో కూడుకున్న **'ఆలోకనం'** అనే ప్రత్యేక గ్రంథం ప్రచురించింది.

ప్రత్యేక సంచికలలో ఆరుద్ర, రాళ్ళబండి కవితా ప్రసాద్, సి.నారాయణరెడ్డి, కపిలవాయి లింగమూర్తి మొదలగు వ్యక్తులపై పూర్తి ప్రత్యేక స్మారక సంచికలనే ప్రచురించగా, జి.వి.సుబ్రహ్మణ్యం, పాకాల యశోదారెడ్డి, వి.వి.కృష్ణశాస్త్రి వంటి ప్రముఖుల మరణానంతరం కొన్ని ప్రత్యేక వ్యాసాలతో కూడుకున్న సంచికలను మూసీ ప్రచురించింది.

బూర్గుల రామకృష్ణారావుపై శతజయంతి సంచిక, వందేళ్ళ చారిత్రక నవల, తెలుగులో పరిశోధన పై ప్రత్యేక సంచికలను కూడా మూసీ పత్రిక ప్రచురణ చేసింది.

ప్రముఖులతో ముఖాముఖి కేవలం ప్రత్యేక సంచికలలోనే కాకుండా సాధారణ సంచికలలోనూ వెలువరించింది. కాళోజీ, కోవెల సుప్రసన్నాచార్య, అంపశయ్య నవీన్, జానమద్ది హనుమచ్ఛాస్త్రి, గుంటూరు శేషేంద్ర శర్మ, రవ్వా శ్రీహరి, శలాక రఘునాథ శర్మ, శ్రీభాష్యం విజయసారథి, ఆశావాది ప్రకాశరావు, కూరెళ్ళ విఠలాచార్య, వై. రెడ్డి శ్యామల, గడ్డం మోహన్ రావు, మార్గరేట్, సీతారాం, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మణ చక్రవర్తి వంటి ప్రముఖులు, వేరు వేరు పురస్కార గ్రహీతల ఇంటర్వ్యూలను ఎన్నో ప్రచురించింది.

మూసీ పత్రిక ఆధ్వర్యంలో కొన్ని పుస్తకాలను మూసీ పబ్లికేషన్స్ కింద ప్రచురించింది. అందులో చెప్పుకోదగ్గ గ్రంథాలు కొన్ని ఉన్నాయి. అవి **'జి.వి.యస్. విమర్శ దర్శనం', సంపత్కుమార విమర్శ – దేశీయతా భూమిక' 'సుప్రసన్న సమన్విత విమర్శ' 'నవల – నవలా విమర్శకులు'** అనే విమర్శనా గ్రంథాలు. వీని రచయిత ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య రాసారు.

ఈ పత్రిక అనే పుస్తక సమీక్షలను కూడా ప్రచురించింది. పద్య, శతక, కవిత్వం,

సిద్ధాంత గ్రంథాలు, జీవిత చరిత్రలు, గ్రంథసమీక్షలు వెలువడ్డాయి. అంతేకాక అరుదైన సంస్కృత సాహిత్యానికి సంబంధించిన పుస్తక సమీక్షలు ఉన్నాయి. సాహిత్య విమర్శ, తులనాత్మక సాహిత్యం, నాటకం, నాటిక, పీఠికలు, ఫీచర్స్, శీర్షికలు, నవలలు, కథలు వ్యాసాలు, సమీక్షలున్నాయి. ఒకే పుస్తకంపై ఇద్దరు రాసిన సమీక్షలు కూడా కొన్నిసార్లు ప్రచురించినట్లు కనిపిస్తుంది. 'ఆనంద నందిని' అనే డా. మూలంపల్లి చంద్రశేఖర శర్మ సంస్కృత మాతృస్తుతి కావ్యం, ఉత్పల సత్యనారాయణ కావ్యాలు, వద్దూరి ఆంజనేయ రాజు, కనపర్తి రామచంద్రా చార్యులు రాసిన 'ఈ మట్టినే ప్రేమిస్తాను' వంటి వచన కవిత గ్రంథాల సమీక్షలు కనిపిస్తాయి. వీటితో పాటు మినీకవిత్వ పుస్తకసమీక్షలు, నానీ పుస్తక సమీక్షలు, హైకూ పుస్తక సమీక్షలు, గేయ గ్రంథ సమీక్షలు, కథా సంపుటి, సంకలనాల సమీక్షలు, నవలల సమీక్షలు ఈ విధంగా అన్ని రకాల పుస్తక సమీక్షలు కనిపిస్తాయి. జానపద సాహిత్యానికి ఏమాత్రం తక్కువ చూడకుండా అనేక జానపద వ్యాసాలను, జానపద గ్రంథ సమీక్షలను, వివిధ గిరిజన భాష, సంస్కృతులకు సంబంధించిన వ్యాసాలను మూసీ పత్రిక ఇప్పటికీ ప్రచురిస్తుంది.

ఈ విధంగా మూసీ పత్రిక అన్ని వర్గాలకు, విభిన్న అంశాలకు, పలు ప్రక్రియలకు సంబంధించిన విషయాలు ప్రచురిస్తోంది. ఇందులోని విషయాలు మేధావులకే కాక, ఇప్పుడిప్పుడే పరిశోధనా రంగంలో అడుగిడుతున్న పరిశోధకులకు, రచయితలకు, కళాకారులకు, భాషావేత్తలకు, చరిత్ర పరిశోధకులకు, శాసన పరిశోధకులకు ఉపయోగ పడుతోంది.

సాహిత్య ప్రియులను అలరించడానికి సాహిత్య పత్రిక పేరును ప్రస్తావించాలంటే మొదటగా 'మూసీ' పత్రికను గూర్చి చెప్పడం అతిశయోక్తి కాదు. ఆంగ్ల భాషాభిమానంతో కొట్టుకుపోతున్న తెలుగు ప్రజల ఆలోచనల్లో మార్పు తెచ్చి, సాహిత్యాభిలాషను పెంపొందించడానికి మూసీ పత్రిక సంపాదకులు విశేషంగా కృషి చేస్తున్నారు. మూసీ పత్రిక జన్మించి ఐదు దశాబ్దాలకు చేరువవుతున్నా, సాహితీ విలువల స్థానం మాత్రం చెక్కు చెదరలేదు.

**డా. ఆర్. అనూరాధ**

మూసీ మాసపత్రికపై శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పిహెచ్. డి. పరిశోధన చేసిన వారు

ఫోన్ : 99639 18288



# శ్రీనాథ భారతము (సంపాదకత్వం)

తెలుగు వాఙ్మయ భారతిని తన కవిత్వముతో కమనీయము చేసి, బ్రాహ్మీ దత్త వరప్రసాదుడిగా వరలిన కవి సార్వభౌముడు శ్రీనాథుడు. అట్టి కవీంద్రుని కవిత్వ వ్యవసాయములో వెలువడిన రచనల సమాహారాన్ని ఒక పూల దండగా గుచ్చి తెలుగు శాఖ ఉస్మానియా విశ్వ విద్యాలయము మెడలో వేసిన గ్రంథము "శ్రీనాథ భారతము". ఈ గ్రంథము 1960 – 61వ సంవత్సరములో తెలుగు శాఖ స్నాతకోత్తర విద్యార్థులచే ఏర్పాటు చేయబడిన సదస్సులో సమర్పింపబడిన పరిశోధనాత్మక పత్రాల సమాహారము. వ్యాస సంపుటిగా వెలువడిన ఈ గ్రంథానికి ప్రముఖ శాసన పరిశోధకులు, జిల్లా సర్వస్వముల రూపశిల్పి, అనేక సాహితీ ప్రక్రియల్లో తనదైన శైలితో రచనలు చేసిన సాహితీ దురంధరులు, ఆ సదస్సు నాటి స్నాతకోత్తర విద్యార్థి శ్రీ బి.ఎస్.శాస్త్రి గారు సంపాదకత్వం వహించారు.

ఈ విషయాన్ని రూఢీ చేస్తూ ఈ గ్రంథపు భూమికలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం తన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సు పత్రాలను ఎలా వెలుగులోకి తీసుకురావాలోనని మథన పడుతున్న సందర్భంలో ఉత్సాహ సంపన్నులు, కార్యదక్షులు అయిన శ్రీ బి.ఎస్.శాస్త్రిగారే ప్రచురణ కార్య భారమంతా తనపై వేసుకుని గోలకొండ పత్రిక వారి సహాయంతో ముద్రించారని, అందుకు శ్రీ శాస్త్రిగారిని హృదయ పూర్వకంగా ఆశీర్వదించిన విషయాన్ని మనం గమనించవచ్చు.

ఈ గ్రంథమును పాక సంసిద్ధి చరిత్రగా పేర్కొంటూ తినబోవునప్పుడు కూరల రుచియేల అన్నట్టు పన్నెండు మంది రచయితలను ప్రశంసిస్తూ బంగారు కొండను మోసుకువచ్చి

సామాన్య పాఠక లోకము నడుమ నిలిపినారని, కవి సార్వభౌముని స్మృతికి విద్యార్థులు చేసిన అమోఘ సేవ అని, ఈ గ్రంథ శైలి ప్రాతరున్మిషిత పద్మము వలె నునుసిగ్గు, నునుమెత్తందనము, నునువిప్పు కలిగి సౌరభము వలె విరాజిల్లుచున్నదన్న ఖండవల్లి వారి సహృదయతను బి.ఎన్.శాస్త్రి గారు పాఠకుల ముందుంచారు.

ఈ గ్రంథము ఆరంభంలో నవోదయ సమితి అధ్యక్షులు ఎమ్.శ్రీనివాసరావు, కార్యదర్శి పాండురంగయ్య గారి కృతజ్ఞతలు, విశ్వ విద్యాలయ ఉప కులపతి డి.ఎస్.రెడ్డి గారి ఆశీరభినందనలు పొందుపరుస్తూనే, నాటి సదస్సు నిర్వహణా ప్రణాళికను ప్రారంభ సమావేశం నుండి అంతిమ సమావేశం వరకు అధ్యక్షత వహించిన ప్రముఖుల పేర్లు, పత్ర సమర్పణాంశాలు, పత్ర సమర్పకుల వివరాలు పొందుపరచారు. ఈ సమావేశాలకు అధ్యక్షత వహించిన అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం, డా॥ పల్లా దుర్గయ్య గారు, ఈయుణ్ణి వీరరాఘవాచార్యులు, ఆచార్య రాయప్రోలు సుబ్బారావు గారు, శ్రీనాయిని సుబ్బారావు గారు, పి.ఎస్.ఆర్.అప్పారావు గారు, మహాకవి దాశరథి గారు, యల్లాప్రగడ సీతాకుమారి గారు, శ్రీమాన్ చెలమచెర్ల రంగాచార్యులు గారు, డా॥ గిడుగు సీతాపతి గారు, కల్లూరి రామచంద్ర మౌళి గార్లు ఉన్నారు. ఈ సదస్సు ప్రారంభకులుగా కవివరేణ్యులు, విమర్శకావసంతులు శ్రీ తాపి ధర్మారావు గారు హాజరు కాగా, ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులు శ్రీ అబ్దుల్ ఖాదర్ గారు శుభాకాంక్షలు తెలుపగా, శ్రీనాథుని జీవితము – కాలము అన్న అంశంపై శ్రీ డి.వి.కృష్ణారావు గారు మొదటి పత్రం సమర్పించారు.

ఈ పత్రములో శ్రీనాథుని జన్మ స్థానమును గూర్చి, అతని కాలమును గూర్చి అనేక వాదోపవాదాలు జరిగి సర్వ జనాంగీకృతమైన సిద్ధాంతమేదీ తేలలేదన్న విషయం తెలుస్తుంది. శ్రీనాథుడు పాకనాటి నియోగి బ్రాహ్మణుడని, భారద్వాజ గోత్రుడని, మారయామాత్య భీమాంబల తనయుడని పేర్కొంటూ అతని నివాస నగరమైన కాల్పట్టణమును గూర్చి వివిధ రచయితలు పేర్కొన్న అభిప్రాయాలను గమనించవచ్చు. కాల్పట్టణము కాదు క్రాల పట్టణమని ఇది నెల్లూరి దగ్గరి సముద్ర తీర నగరమన్న వీరేశలింగం పంతులు గారి వాదనను, కాల అంటే నల్లనిదని కావున కృష్ణ పట్టణమన్న చిలుకూరి వీరభద్ర రావు గారు తెలిపిన విధానాన్ని, మచిలీ పట్టణం దగ్గరి సముద్ర తీరంలో గల కాళీ పట్టణమన్న కొమర్రాజు లక్ష్మణరావు గారి అభిప్రాయాన్ని ఈ వ్యాసంలో దర్శిస్తాం. ఈ వాదనకు ప్రతిగా "కర్ణాట కటక పద్మవన హేళి శ్రీనాథ భట్టకవిని" అన్న కాశీ ఖండములోని శ్రీనాథుని లేఖనాన్ని బట్టి అతడు కన్నడ దేశీయుడని అక్కిరాజు ఉమాకాంతం గారి వాదనను మనం చూడవచ్చు.

శ్రీనాథుని బాల్యం, విద్యాభ్యాసం, అతని గ్రంథములు, 1323 నాటి కాకతీయ సామ్రాజ్య విచ్ఛిన్నముతో తురుష్క రాజుల అకృత్యాలను సహించక స్థానిక రాజులు వారినెదిరించి స్వతంత్ర్య రాజ్యాలను ఏర్పరచుకున్న తీరును ఈ వ్యాసంలో చూస్తాము.

రెండవ వ్యాసం శ్రీనాథుని కాలపు మత, సాంఘిక, రాజకీయ పరిస్థితులు శీర్షికన కుమారి బి.విజయ భారతి గారు సమర్పించగా ఈ వ్యాసం శ్రీనాథుని కాలంలో ఉన్న విజయ నగర, రాచకొండ వెలమ, బహుమణీ, వద్దె రాజులు, గోలకొండ పాలకుల మధ్యగల రాజకీయ పరిస్థితులను తెలుపుతుంది. నాటి రెడ్డి రాజుల విజయ పరంపరను, ఇతర రాజ వంశాలతో గల మైత్రి సంబంధాలను కళ్ళకు కడుతూనే శ్రీనాథుడు కొండవీటి ప్రభువుల ఆరాధ్య ఖడ్గం "నందికంత పోతరాజు కఠారి"ని వెలమ దొరలు స్వాధీనం చేసుకోగా తన ప్రజ్ఞా విశేషాలతో విడిపించి తిరిగి రెడ్డి రాజులకు ఇప్పించినట్లు ఈ వ్యాసం చెబుతుంది. ఆనాటి రెడ్డి ప్రభువులు రాజ్యమును విభాగములుగా చేసి పాలించారని, అడవులు నరికి వ్యవసాయము చేయించారని, పరిశ్రమలు, వ్యాపారములను అభివృద్ధి చేసిరని, వీటిపై పన్నును వసూలు చేసేవారని, ఇంటి పన్నును ఇల్లరి పన్ను అని అనేవారని, నాడు భూమి మొత్తం రాజుకు చెందినదేనని గ్రామీణులకు సేద్యముకిచ్చేవారని తెలుస్తుంది.

శ్రీనాథుని శృంగార నైషధము అన్న మూడవ పత్రం శ్రీ పెండ్యాల లక్ష్మీ నరసింహ శాస్త్రి గారిచే సమర్పించబడి గ్రంథ రచనా కాలం, సంస్కృత నైషధ విశేషములు, కృతిభర్త వంశాది క్రమము, కృతి ప్రారంభ స్తుతిన తనను తాను బ్రాహ్మీ దత్త వర ప్రసాదునిగా, ఈశ్వరార్చన కళా శీలునిగా, బ్రహ్మజ్ఞాన కళా నిధానునిగా పేర్కొన్నట్టు గమనించవచ్చు. కృతిపతి వంశావతారికను గమనిస్తూనే కావ్యంలో దమయంతిని వర్ణించిన తీరును, హంస పాత్రకున్న లోకజ్ఞతను మనం పట్టుకుంటాం.

శ్రీనాథుడు భాషార్ణవ సుధాకరుడని, అతని పద్య కవనంలో వాడిన పదజాలాన్ని వ్యాస కర్త సోదాహరణంగా వివరించారు. ఇంద్రుడు, అగ్ని, యమ, వరుణ, నల మహారాజును గూర్చి చేసిన వర్ణనలో దొర్లిన పద సంపద అమోఘమైనదని అది శ్రీనాథునికి మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు. ఉదా॥ అపవ్యపాయునిన్ = వజ్రాయుధమును ఎల్లప్పుడూ కలవాడు, అనల్ప విలోచన పంకజాతున్ = పెక్కులైన నేత్ర పద్మములు కలవాడు, ఇటువంటి వర్ణనా చాతుర్యం శ్రీనాథునికే చెల్లును. నైషధమునకు తెలుగువారి హృదయంలో గల స్థానాన్ని, శ్రీనాథుని గద్య రచనా విధానాన్ని, అతనికి గల రసపోషణాభిలాషిత్వాన్ని గమనించవచ్చు.

శ్రీనాథుని హర విలాసము అన్న పత్రం కె.విజయలక్ష్మి గారు సమర్పిస్తూ ప్రపంచమున

ప్రోచిన కవుల్లో శ్రీనాథ కవీంద్రుడి హరవిలాసము అత్యున్నతమైనదని, హరవిలాస గ్రంథము కుమారగిరి రెడ్డి కాలమున వసంతోత్సవంలో కీర్తింపబడిందని, కావున ఈ గ్రంథము ఆ కాలానికి సంబంధించినదని చెప్తూ, అవచి తిప్పయ్య శెట్టిని సామాన్య వైశ్యునిగా తలపోయరాదని అతడు ఎంతటి ఐశ్వర్యవంతుడో అంతటి దైవభక్తి పరాయణుడని, వితరణశీలి అని, విద్యావంతుడని తెలిపారు వ్యాసకర్త. రసిక శేఖరుడైన శ్రీనాథుని ఈ కావ్యంలో చిరుతొండనంబి కథలో సిరియాలుని వధ ఘట్టం, పార్వతి పరమేశ్వరున్ని లీలారవిందములో వేయు ఘట్టం, గౌరీ కళ్యాణం, దారుకావన విహారం, సముద్ర మథన కథలో దూర్వాస శాప ఘట్టం మొ॥ వాటిలో పోషించిన నవ రసములను దర్శిస్తాము.

శ్రీనాథుని భీమఖండం అనే పత్రంలో తోపల్లి సుశీల గారు శ్రీనాథుడు తన ప్రౌఢ నిర్భర వయ:పరిపాకమున భీమ నాయకుని మహిమలు లోకమునకు తెలియపరుస్తూ చేసిన భీమఖండం, ఈ గ్రంథ రచనా కాలం 1423 నుంచి 1434 వరకు రాజ్యమేలిన రాజ్య శాసనాల ఆధారంగా నిరూపణ చేసేందుకు ఈ వ్యాసం తోడ్పడుతుంది. బెండంపూడి అన్నయామాత్యునికి సంబంధించిన వివరాలను, అతడు ఆలయానికి నిర్మించిన ప్రాకారాది నిర్మాణ విశేషాలను ఈ వ్యాసం తెల్పుతుంది. స్కాంద పురాణాంతర్గత గోదావరి ఖండం యొక్క సారమే ఈ భీమఖండమని, భీమఖండంలో కాశీ నగర వర్ణన, వ్యాసుడు కాశీని యెడబాయుట, దక్షిణా పథానికి రాక, అగస్త్యమునిని కలియుట వంటి ఘట్టాలను, శ్రీనాథుడు వాడిన ప్రౌఢ సమాసములను ఈ వ్యాసంలో మనం గమనిస్తాం.

భీమఖండమున తెలుగునాటి క్షేత్ర ప్రాశస్త్యములు భీమేశ్వరునితో సంబంధం కలిగిన వాటిని గురించి ప్రస్తావించడం జరిగింది. పట్టిస్థానము, పుండరీకాద్రి, కుక్కుటేశ్వరము, పల్వలపురము, సర్పవరము, భీమమండలములకు సంబంధించిన ప్రాశస్త్యమును పౌరాణిక గాథలతో వివరిస్తుందీ వ్యాసం.

శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు తమ పత్రం శ్రీనాథుని కాశీఖండమున అష్టాదశ పురాణములలో 11వ పురాణము అయిన స్కాంద పురాణంలో కుమారస్వామి తన తండ్రి మహాత్మ్యములను అగస్త్యాది మహర్షులకు చెప్పిన కాశీ ఖండమును శ్రీనాథుడు తెలుగులోకి అనువాదము చేసి, రాజమహేంద్రవర రాజ్యాధిపతి వీరభద్రా రెడ్డికి అంకితము చేసిన విధము, శ్రీనాథుడు పోషించిన భక్తిరస పోషణము, ధర్మ సూక్ష్మములు, నీతి దాయకమైన బోధలతో మనోజ్ఞంగా రచించారని శాస్త్రిగారు తెలిపారు. అయ:పిండమైన కాశీఖండంలో మయూరుని సూర్యశతక శ్లోకానువాదములు, వాల్మీకి రామాయణము, భవభూతి ఉత్తర రామచరిత్ర, విశాఖదత్తుని

ముద్రా రాక్షసం, భట్ట గోపాలుని సాహిత్య చింతామణి వంటి గ్రంథాల ఛాయలున్నాయని శ్రీ శాస్త్రి గారు పేర్కొన్నారు. వీరభద్రా రెడ్డికాలం 1395 తరువాత కుమారగిరిరెడ్డి, అల్లాడరెడ్డి, కుమారగిరిరెడ్డి (iii), అనవోతారెడ్డి(iii) వంటి రాజుల నాటి రాజకీయ పరిస్థితులను వివరించారు. కొండవీటి రాజైన పెద కోమటి వేమారెడ్డి కాశీయాత్ర పోయేటప్పుడు శ్రీనాథుని తన వెంట తీసుకెళ్ళాడట. అతడు కాశీ క్షేత్రమును చూసి, అచటి మహిమలను గని, తన్మయమున కాశీఖండమును రచింపుమని కోరినాడని తెల్పుతూ వీరు కాశీయాత్ర చేసినట్టు గల

**"కాంచీ శ్రీగిరి కాశీ పంచారామాది దేవ భవనంబుల వ్రా**
**యించెన్ చేమ మహీధవు, దంచిత భూదాన శాసనాక్షర పంక్తుల్"**

ఈ పద్యము రూఢీ చేస్తుందని ఆధారాలతో చూపించారు.

కాశీఖండము రచనా కాలం 1430 – 1440 వరకు గల కాలమని గ్రంథ రచనా విధానములో "వచియింతు వేములవాడ భీమన" అంటూ వ్రాసిన పద్యంలో శ్రీనాథుని రచనా విధానాన్ని, శ్రీనాథుని ప్రజాహిత దృష్టిని పేర్కొంటూ "శాస్త్రమాచార్య సన్నిధి జదువదేని" అన్న పద్యంలో ఆచార్యుల వద్ద శాస్త్రములను చదువలేని వాడు, సద్బోధలు గ్రహించని వాడు, తెగువతో ప్రతిజ్ఞను సాధించని వాడు జయము పొందలేడని, "చెదలు నీర్పెను మశకంబు చీమనల్లి" అను పద్యంలో సమస్త జీవులలో సర్వేశ్వరున్ని చూడాలని, హానికి మనసులో కూడా తావివ్వరాదన్న శ్రీనాథుడిలోని కారుణ్యమును శాస్త్రిగారు వెలిబుచ్చినారు.

గ్రంథమందలి అలంకారికతను, శాస్త్రజ్ఞతను, ప్రకృతి వర్ణనను, కావ్యంలో వ్యాసుని అన్నపూర్ణేశ్వరి పరీక్షించిన తీరులో శ్రీనాథుడు పాటించిన లోకజ్ఞతను పరిపూర్ణంగా శాస్త్రిగారు పాఠకుల మందుంచారు.

మిగిలిన ఆరు పత్రములలో జె. హేమలత శ్రీనాథుని పల్నాటి వీర చరిత్ర కథా వాఙ్మయమునకు చెందిన వీర గీతములన్నింటియందు ఉత్తమమైనదని పల్లెటూళ్ళలో వెన్నెల రాత్రుల్లో పిచ్చుక కుంట్ల వారు ఈ కథల్ని పాడుచుందురని, పంబజోడు, తిత్తి, ఖడ్గము సహాయముతో హావభావాలు ప్రకటిస్తూ తాదాత్మం చెందుతారన్న విషయాల్ని, నాటి సమాజంలో గ్రామీణుల పరిస్థితులను ఇక్కడ మనం గమనించవచ్చని ప్రస్తావించారు. బాల చంద్రుడు, మగువ మాంచాల, ఆమె తల్లి రేఖాంబలు నేటి స్త్రీలకు ఆదర్శమన్నారు.

శ్రీనాథుని శివరాత్రి మహాత్మ్యము అనల్ప కల్పనా సామర్థ్యము, నిరర్గళ కవితా ధార గల్గినదన్న వీరేశలింగం పంతులుగారి అభిప్రాయము, ఈ కావ్యమును ముమ్మడి శాంతయ్యకు

అంకితం ఇచ్చాదన్న శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి "శృంగార శ్రీనాథము" గ్రంథ వాదనము, కల్రా సాంబమూర్తి గారికి, బందారు తమ్మయ్య గారికి అంకితం విషయంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు పత్రిక, ఆంధ్ర పత్రికలోనూ జరిగిన వాదోపవాదాలను మనం గమనించవచ్చు.

**మైనాకం, మంధరం, మేరుం**

**శ్రీశైలం గంధమాదనం**

**పంచశైలాన్ పఠేన్నిత్యం**

**మహాపాతక నాశనం**

అన్న శ్లోకాన్ని నిజం చేస్తూ పంచ పర్వత దర్శనంలో ఒకటైన శ్రీశైల పర్వతం, మల్లికార్జునుని మహిమలను, క్షేత్ర ప్రాచీనతను వర్ణించిన తీరును మన కళ్ళముందుంచారు టి.విజయలక్ష్మి గారు.

శ్రీనాథుని క్రీడాభిరామంలోని వీధి రూపకాల ప్రస్తావన, లక్షణాలు, ప్రదర్శనా విధానమును, శ్రీనాథునికి వల్లభామాత్యునికి గల సంబంధమును ప్రస్తావించారు శ్రీ పేర్వాల సూర్యనారాయణ ప్రసాద్. మైపూరు భైరవుని తిరునాళ్ళలో ద్వారసముద్రపు నటులచే ప్రదర్శింపబడిన వీధి రూపకంలో ఓరుగల్లు నగర విశేషాలను, ఆనాటి రాజకీయ, సాంఘిక, మత, ఆర్థిక పరిస్థితులను పఠితలకు అందించారు.

శ్రీ రామలిగి మాధవరావు గారి శ్రీనాథుని శాసనములు – చాటువులు అన్న ఈ పత్రం శ్రీనాథుడు వేయించిన శాసనములు పన్నెండని అవి: పొన్నుపల్లి, కుసుకుర్రు, కల్వ పాముల, పినపాడు, పొన్నుపల్లి, పొట్లపాటి, ఫిరంగిపురం, నందమూరు, ఆలపాడు, పుల్లరిబోడు, రుద్రవరం, మూలగూరమ్మ కొండ మొ॥వి పేర్కొని అవి చరిత్ర నిర్మాణానికి దోహదం చేసాయని తెలుపుతుంది. ప్రతి శాసనం చివర "విద్యాధికారి శ్రీనాథో వీర శ్రీ వేమభూపతే:" అన్న శ్రీనాథుని శాసన కర్తృత్వము కనబడుతుంది. చాటువులంటే ప్రియమైన మాటలని ఆయా భావావేశాల్ని వ్యక్తపరచడానికి, పరిస్థితుల ప్రభావాన్ని తెలపడానికి చక్కని వాహకములను వ్యాసకర్త ప్రస్తావించి ఉదాహరణలతో చూపారు.

శ్రీనాథుని సమకాలిక కవులు అన్న శ్రీ జె.మురళీధరన్ గారి పత్రం శ్రీనాథుని సమకాలీకులైన జక్కన, అనంతామాత్యుడు, నిశ్శంక కొమ్మన, గౌరన వంటి కవులను వారి రచనా విశేషాలను ప్రస్తావించింది. కడపటి పత్రమును శ్రీమతి కె.సీత బమ్మెర పోతనామాత్యుడు అన్న శీర్షికన సమర్పించారు. అలతి అలతి మాటలతో దుంతె తేనెల

వంటి సాహిత్యాన్ని సృష్టించిన అకుంఠిత దీక్షా తత్పరుడు, వినయశీలి, సహజ పాండిత్య బిరుదు కలుగువాడైన పోతన కాలాన్ని, నివాస స్థలాన్ని పేర్కొంటూ పోతన 1480 - 1520 ప్రాంతానికి చెందిన వాడని కవి నివాసము ఏకశిలా నగరమని భాగవతములో పేర్కొన్న తీరును బమ్మెర గ్రామము జన్మస్థానమని పేర్కొంటున్న ఆధారాలను ధృఢపరుస్తారు.

శ్రీనాథుడు, పోతనలిద్దరి సమకాలికత్వంపై గల చర్చను మనముందు ఉంచుతాడు. శ్రీనాథుడు 14వ శతాబ్ది ఉత్తరార్థమున 15వ శతాబ్ధి పూర్వార్థము మధ్య జీవించాడని, అదే సమయంలో రాచకొండ పద్మనాయక రాజు సర్వజ్ఞ సింగ భూపాలుని సందర్శించెనని తెలిపి వీరిద్దరు సమకాలికులేనని తెలిపినారు. పోతన శ్రీనాథుని కంటే చిన్నవాడన్న వాస్తవాన్ని కళ్ళకు కట్టారు. భాగవత రచనకు ఉపక్రమించు పోతన స్థితిని, భాగవత ప్రాశస్త్యాన్ని, పోతన గుణశీలములను, పోతన రచనాశైలిని, రసపోషణను గూర్చి సోదాహరణంగా వివరించారు.

మొత్తంగా బి.ఎన్.శాస్త్రిగారి చేతుల మీదుగా "శ్రీనాథ భారతము" అన్న పేరున తెలుగు శాఖ స్నాతకోత్తర విద్యార్థుల సాహితీ సదస్సు పత్రాలు శ్రీనాథునికి సంబంధించి ఒక విజ్ఞాన సర్వస్వముగా ఉండి పాఠకులకు శ్రీనాథుడిని గూర్చి, అతని కాలం నాటి దేశకాల పరిస్థితులను, ఆయన రచనా విధానాన్ని, రచనలోని వైవిధ్యతను తెలుపుతూ శ్రీనాథుని బ్రాహ్మీ దత్త వరప్రసాదాన్ని పంచుతున్నాయన్న వాస్తవాన్ని బి.ఎన్.శాస్త్రిగారు లోకానికి అందించినారు. ఈ గ్రంథాన్ని చదివిన వారు మనసులో తన్మయత్వంతోనే ఆయనకు నమస్కరించుకుందురు.

**మంత్రి శ్రీనివాస్**
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 83283 33720



# శాస్త్రిగారి అజ్ఞాత సంపాదకత్వాలు

కొందరు ఎదుటి వారి జీవితాల నుంచి స్ఫూర్తి పొందుతారు. మరి కొందరు తమ జీవితాలనే ఇతరులకు స్ఫూర్తిగా నిలిచేలా మలచుకుంటారు. ఇందులో రెండో వర్గానికి చెందినవారే బి.ఎన్.శాస్త్రి గా సుపరిచితమైన శ్రీ భిన్నూరి నరసింహ శాస్త్రి. శాసన పరిశోధకుడిగా, చరిత్రకారుడిగా, పత్రికా సంపాదకుడిగా, సాహితీకారుడిగా లోక విదితమైన బహుముఖ ప్రజ్ఞాశాలి నరసింహశాస్త్రిగారి మరొక కోణం గ్రంథ సంపాదకత్వం. దీనికై వారు ఏర్పరచిన మూసి సాహిత్య సంస్థ ఎంతగానో ఉపయోగపడింది. ఈ సంస్థ 1980 లో మొదలైన నాటినుండి ఎంతోమంది సాహితీకారుల సాహిత్యాన్ని ప్రపంచానికి అందించింది. తొలినాళ్లలో ఈ సంస్థ సహకారంతో వెలువడిన గ్రంథాలు నా జీవన యానంలో రావి నారాయణరెడ్డి ఆత్మకథ వంటివి ఉన్నాయి. మూసీ పబ్లికేషన్స్ ప్రారంభించడానికి ముందే 'అష్టదిగ్గజములు' (1960), 'శ్రీనాథభారతము' (1961) పరిశోధనాత్మక వ్యాసం సంపుటాలకు అనేక విధాల సహకారాలను అందించడమే కాక అజ్ఞాత సంపాదకుడిగాను వ్యవహరించారు శాస్త్రిగారు. ఈ రెండు సంపుటాలు గ్రంథ రూపం ధరించడంలో శాస్త్రి గారి కృషి ఎటువంటిది? ఆ గ్రంథాలలోని విశేషాలేమిటో తెలిజేయడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

**1. అష్టదిగ్గజములు**

ఈ గ్రంథం అష్టదిగ్గజ వర్ధంతోత్సవోపన్యాస సంపుటి. ఇది 1960 వ సంవత్సరంలో అష్టదిగ్గజ వర్ధంతోత్సవ సమితి వారిచే అజంతా ప్రింటర్స్ సికింద్రాబాద్ నుండి వెలువడింది.

ప్రథమ ముద్రణలోనే 1000 ప్రతులతో వెలువడడం ఆ రోజుల్లో విశేషమనే చెప్పాలి. దీనికి ముందుమాటను "తొలి పలుకు" పేరుతో నాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు మాన్యశ్రీ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి వ్రాయగా కృతజ్ఞతలను అప్పటి తెలుగు సారస్వత సమితి అధ్యక్షుడు శివరామకృష్ణ శాస్త్రి తెలిపారు. ఈ వ్యాసాలన్నీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా అష్టదిగ్గజ వర్ధంతి ఉత్సవంలో ప్రసంగించబడినవి. ఈ సదస్సుకు హితవరిగా ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం వ్యవహరించగా, అధ్యక్షులుగా కవితా శివరామకృష్ణ శాస్త్రి, ఉపాధ్యక్షులుగా సుబ్బరాజులు ఉన్నారు. సదస్సు సంచాలకులుగా హరిగోపాల్ కోవెల (కార్యదర్శి తెలుగు సారస్వత సమితి) గారు బాధ్యత వహించారు.

సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా పేరుగాంచిన శ్రీకృష్ణదేవరాయలు భోజరాజు వలె కృషి సలిపి ఆంధ్రభోజుడుగా కీర్తి కెక్కినాడు. భోజరాజు సభవలె తన పాలనలోనూ అటువంటి అద్భుత సభ నడిపించాలని భువన విజయం నిర్మించాడు. అందులో అష్టదిగ్గజ కవులతో చక్కని సారస్వతాన్ని వెలువరింప చేస్తూ, నిరంతరం కావ్య పద్య పఠనాలు, ఆలాపనలు, పద్యాల క్రీడలతో ఆ సభను నడిపించి అష్టదిగ్గజముల సాహితీ చరిత్రకు వేదికను చేశాడు రాయలు. అంతటి ప్రతిభావంతులైన అష్టదిగ్గజ కవుల కావ్యాలను రచనా పాటవాన్ని ఆనాటి తరానికి తెలియజేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగినదే అష్ట దిగ్గజ వర్ధంతి ఉత్సవ ఉపన్యాస సదస్సు. ఇందులో పదిమంది ఉపన్యాసకులు పాల్గొని పత్ర సమర్పణ చేయగా, ఒక్కొక్క పత్ర సమర్పణకు ఒక్కొక్కరు అధ్యక్షులుగా వ్యవహరించడం ఆరోజుల్లో పరిశోధనలకు, పత్ర సమర్పణలకు ఉన్న ప్రత్యేకతని తెలియజేస్తుంది. అందలి ఉపన్యాసకులు, అధ్యక్షులు సదస్సును విజయవంతం చేయడమే కాక నాటి చరిత్రకు సాక్షీభూతంగా నిలిచారు. ఆ సదస్సునందు గల అంశం, అధ్యక్షులు, ఉపన్యాసకుల వివరాలు మీ ముందుంచుతున్నాను. డాక్టర్ దివాకర్ల వెంకటావధాని శ్రీకృష్ణదేవరాయలపై ఉపన్యసించారు. అధ్యక్షులుగా డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ఉన్నారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అల్లసాని పెద్దనపై ఉపన్యాస సించగా, కళా వెంకట్రావు అధ్యక్షులుగా ఉన్నారు . డాక్టర్ బిరుదురాజు రామరాజు నంది తిమ్మనపై చేసిన ప్రసంగానికి అధ్యక్షులు డాక్టర్ డి.వి. సుబ్బారెడ్డి. శ్రీమాన్ చలమచర్ల రంగాచార్యులు ధూర్జటిపై చేసిన పత్ర సమర్పణకి అధ్యక్షులు పర్సా వెంకటేశ్వరావు. ఆచార్య కురుగంటి సీతారామయ్య భట్టాచార్యులు అయ్యలరాజు రామభద్రుడుపై చేసిన ఉపన్యాసానికి అధ్యక్షులు జి.సి.వి.సుబ్బారావు. శ్రీపోనంగి శ్రీరామ

అప్పారావు మాదయ్యగారి మల్లనపై చేసిన ప్రసంగానికి గ్రంథి వెంకటరెడ్డి నాయుడు అధ్యక్షులు. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పింగళి సూరనపై ప్రసంగించగా, ఎస్ బి.వి. పట్టాభిరామారావు అధ్యక్షత వహించారు. శిరోమణి శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి భట్టుమూర్తిపై చేసిన ప్రసంగానికి జస్టిస్ కంద భీమశంకరం అధ్యక్షులు. శ్రీమాన్ వేదాల తిరువేంగలాచార్యులు తెనాలి రామకృష్ణుడిపై ఉపన్యాసం ఇవ్వగా, దువ్వూరి నరసరాజు అధ్యక్షులుగా ఉన్నారు. ఇక చివరగా డాక్టర్ నేలటూరి వెంకట రమణయ్య అష్టదిగ్గజములపై ప్రసంగించగా, డాక్టర్ పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు అధ్యక్షత వహించారు. ఇట్లా ఉత్తమ పరిశోధనా పత్రాలతో రూపొందిన సదస్సు ద్వారా ఉపన్యాసకులు అష్టదిగ్గజ కవుల కవితా రీతుల్ని, ప్రతిధ్వని సృజనాత్మకత శక్తిని తన వ్యాసాల ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపారు.

1957 నవంబర్ 23 నుండి డిసెంబర్ 2 వరకు జరిగిన ఈ సదస్సులోని వ్యాసాలు గ్రంథ రూపంలో మాత్రం 1960లో వచ్చాయి. అట్ల రావడానికి శాస్త్రిగారు ఎంతో శ్రమించి అచంచలమైన సాహిత్యాభిలాషతో అనేకమంది దగ్గరకు తిరిగి, చందాలు అడిగి, ఆ దాతల సహాయంతో అష్టదిగ్గజ వర్ధంతి ఉత్సవ సమితి తోడుగా, అజంతా ప్రింటర్స్ ద్వారా ఈ గ్రంథాన్ని వెలువరించారు. దీనివెనుక శాస్త్రిగారి కృషి కొనియాడదగినది. అయినప్పటికీ వారు ఎక్కడ పేరు కోసం తాపత్రయ పడలేదు. చివరకు అన్ని తానై కార్యాన్ని నెరవేర్చినా అజ్ఞాత సంపాదకుడిగా మిగిలారు. ఉస్మానియాలో విద్యార్థిగా ఉన్నప్పటి నుండే శాస్త్రిగారికి పుస్తక ముద్రణ మీద ఆసక్తి ఉండేది. ఆ కారణంగానే వారు ఈ సంపుటిని వెలువరించేందుకు తెలుగు సారస్వత సమితి, అష్టదిగ్గజ వర్ధంత్యోత్సవ సమితితో కలిసి 106 మంది దాతల దగ్గరనుంచి విరాళాలు సేకరించారని ఈ గ్రంథం వల్ల తెలుస్తుంది. ఈ సంపుటిలోని పుట 12 నుండి పుట 13 వరకు గల పేజీలలో ఆ దాతల వివరాలు పొందుపరచబడ్డాయి. వీరిలో ప్రీవియస్ విద్యార్థులు, ఫైనల్ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులతో పాటు ప్రొఫెసర్స్ వివిధ రకాల ఉద్యోగాలు చేసేవారు ఉన్నారు. ఇందులో ఎక్కువ మంది హైదరాబాద్‌కు చెందిన వారు కాగా గుంటూరు, విజయవాడ, హనుమకొండ, వరంగల్, ఖమ్మం, మద్రాస్ ప్రాంతాలకు చెందినవారు కూడా ఉండటం విశేషం. ఇక బి.ఎన్.శాస్త్రి గారి సహాయ సహకారాలను కొనియాడుతూ పుట 8లో కవితా రామకృష్ణశాస్త్రిగారు నాటి తెలుగు సారస్వత సమితి అధ్యక్షులు ఇలా అన్నారు "కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించుటకు మాకు సర్వవిధముల సహకరించి, చందాలు వసూలు చేయడంలో సహకరించిన,

సారస్వతాభిమానులెల్లరకునూ మా కృతజ్ఞతలు" అని రాశారు. ఆనాటి రచనా విధానం ప్రభావమో పరిస్థితుల ప్రభావమో, ఇతర కారణాలేమో కానీ ఎం.ఏ. విద్యార్థుల పేర్లు ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. కానీ అప్పుడు బి.ఎన్.శాస్త్రిగారి సహ విద్యార్థి అయిన కోవెల సుప్రసన్నాచార్య ఈ గ్రంథం ముద్రణకు చందాలు వసూలు చేసి ముద్రించి వెలవరించే వరకు శాస్త్రిగారే కీలక పాత్ర పోషించారని పలుమార్లు నాటి అనుభవాలను సాహితీ మిత్రులతో పంచుకున్నట్టు తెలుస్తుంది. దీనిని బట్టి అష్టదిగ్గజములు అనే ఈ వ్యాస సంపుటికి శాస్త్రి గారే అజ్ఞాత సంపాదకులని చెప్పవచ్చు.

### 2. నా జీవన పథంలో

శాస్త్రిగారి కృషి, ప్రోత్సాహం కారణంగా వెలువడిన మరొక అద్భుత గ్రంథం రావి నారాయణరెడ్డి 'నా జీవన పథంలో' అనే ఆత్మకథ. దీనికోసం శాస్త్రిగారు అహర్నిశలు శ్రమించడమే కాక, నారాయణరెడ్డి గారిని కలిసి "మీ జీవితం అందలి ఘట్టాలు నేటి తరానికే కాక తరువాత తరాలకు తెలియాలని దాని నుండి వారు ప్రేరణ పొందుతారని చెప్పి ఒప్పించారని, దగ్గరుండి రాపించి ముద్రించారని" ప్రముఖ సాహితీవేత్త శ్రీరంగాచార్య 8డిసెంబర్ 2019న వారితో జరిపిన ఇంటర్వ్యూలో నాతో ప్రస్తావించారు. ఈ పుస్తకానికి శ్రీరంగాచార్యులు సైతం హితోధికంగా సహాయసహకారాలు అందించారు.

మూసీ చారిత్రక సాంస్కృతిక మాసపత్రిక ద్వారా తెలుగు ప్రాంతాల్లోని కవులను /కవయిత్రులను, రచయితలను / రచయిత్రులను ప్రోత్సహించారు శాస్త్రిగారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక గోల్కొండ పత్రిక వలె మూసీ పత్రిక ఈ ప్రాంత ప్రాచీన సాహిత్య సంపదని కుప్పగా పోసింది. అదే సందర్భంలో పుస్తక ప్రచురణలోనూ ప్రవేశించిన శాస్త్రిగారు మూసీ పబ్లికేషన్స్ పేరుతో అజరామరమైన గ్రంథాలను వెలువరించారు. అట్లా తొలినాళ్లలో మూసీ పబ్లికేషన్స్ నుండి వెలువడినదే రావి నారాయణరెడ్డి ఆత్మకథ 'నా జీవన పథంలో'. ఇది లక్ష్మీ గణపతి ప్రింటింగ్ ప్రెస్ లో ముద్రించబడింది. మొదటి ముద్రణలోనే 1000 ప్రతులు అచ్చువేయడం చెప్పుకోదగ్గ విషయం. సెప్టెంబర్ 7, 1992లో డాక్టర్ రావి భారతి ప్రధాన సంపాదకురాలిగా ఇది సాహితీ జగత్తులోకి వచ్చింది. దీనికి 'ఆణిముత్యం' పేరుతో సిహెచ్. రాజేశ్వరరావు 7 పుటల ముందుమాటను రాశారు. ఆ ముందు మాటలో రావి నారాయణరెడ్డి గారిని ఆవిష్కరించడమే గాక వారికి గల దూరదృష్టిని, ముందుచూపుని చాటి చెప్పారు. స్వాతంత్రానంతరం రెడ్డిగారి ఆలోచన విధానాన్ని తెలుపుతూ "విజయాలను రక్షించుకుంటూ విలువైన ప్రాణాలుతో కూడిన సభ్యులందరినీ సాధారణ జీవన స్రవంతిలోకి తేవడానికి, కేసుల ఉపసంహరణకు

నూతన పరిస్థితులకు అనుగుణంగా నూతన ప్రజా ఉద్యమ నిర్మాణానికి ఆనాటి సాయుధ పోరాట విరమణ ఏకైక మార్గమని పార్టీ లోపల వాదించారు".(పు.13) అన్నారు. ఏదేమైనా తెలంగాణ సాయుధ పోరాటాన్ని భారత స్వతంత్ర సంగ్రామంలో భాగంగా గుర్తించడానికి రెడ్డిగారు చేసిన కృషి ఇంకా బయటకు రాలేదని నా అభిప్రాయం. అట్లనే 'తొలిపలుకు' పేరుతో దేవులపల్లి రామానుజరావు, 'అభినందన' పేరుతో డాక్టర్ సి.నారాయణరెడ్డి 'కళాప్రపూర్ణ శ్రీ రావి నారాయణరెడ్డితో పెరిగిన నా అనుబంధం' గా ఆచార్య పేర్వారం జగన్నాథం ముందుమాటలు రాసారు. 'ఇంట్రడక్షన్' శీర్షికతో బిపిన్‌చంద్ర, 'రవి ఏ ఫ్లవర్ ఆఫ్ సర్వీస్ అండ్ సాక్రిఫైస్' గా వి. మధుసూదన రెడ్డి ఆంగ్లంలో ఇంట్రోగా వ్రాశారు. ఇంత ప్రఖ్యాతులు సైతం ఈ ఆత్మకథకు ముందుమాట రాయడాన్ని గౌరవంగా భావిస్తున్నామని వారి స్పందనలలో తెలియజేశారు . 486 పుటలు గల ఈ గ్రంథంలో రావి నారాయణరెడ్డి జననము, బాల్యము నుండి జీవిత చరమాంకం వరకు సవివరంగా తెలిపారు. ఇది కేవలం ఒక వ్యక్తి ఆత్మ కథ మాత్రమే అంటే నేను ఒప్పుకోను. ఇది ఒకనాటి వాస్తవ సంఘటనలను అక్షర రూపంలో గంపకెత్తిన చరిత్ర గ్రంథం. ఒక వైపు భారత స్వాతంత్ర ఉద్యమ పరిస్థితులు మరొకవైపు నిజాం రాష్ట్రం (తెలంగాణ)లోని సాయుధపోరాటాలు జతగా గ్రంథ రూపం ధరించిన అనుభవాల రూపమే ఈ గ్రంథం. ఇందులో తెలంగాణ సమాజం ఎదుర్కొన్న నిర్బంధాలు, అనుభవించిన బాధలు, జనించిన విప్లవ పోరాటాలు, అవి నింపిన స్ఫూర్తి పాఠకులను ఆనాటి కాలానికి ప్రయాణం చేస్తాయి. భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టుక, నిజాం పరిపాలన, సాయిధ ప్రతిఘటన, పోలీస్ చర్య, కాంగ్రెస్ కమ్యూనిస్టు ఐక్య సంఘటనలు క్విట్ ఇండియా ఉద్యమం, ప్రజానాట్యమండలి పార్టీ, విశాలాంధ్ర ఉద్దేశాలు, సిపాయిల తిరుగుబాటు, నిజాం వ్యతిరేక పోరాటాలు సోవియట్ యూనియన్ అస్తమయంతో పాటు రావి నారాయణరెడ్డి గారితో ఉన్న అనుభవాలు ఈ గ్రంథంలో ఉన్నాయి.

వ్యక్తిగా మొదలై వ్యవస్థగా మారిన భిన్నూరి నరసింహశాస్త్రి తెలుగు సాహితీవనంలో చెరిగిపోని సంతకంగా వెలిగారు. జీవితాంతం శ్రమనే నమ్ముకున్న అక్షర శ్రామికుడాయన. సాహిత్యాన్ని వ్యవసాయ క్షేత్రంగా భావించి శాసన పరిష్కరణ, నాటకాలు, నవలలు, గ్రంథాల సంపాదకత్వాలనే మధుర ఫలాలను పండించిన రైతు ఆయన. వారు డాక్టరేట్లు, బిరుదులు ఏమీ ఆశించలేదు. పనినే గౌరవంగా భావించారు. కాబట్టే 1960 ల్లోనే అష్టదిగ్గజ వర్ధంత్యోత్సవ సమితి, తెలుగు సారస్వత సమితి, సహకారంతో అష్టదిగ్గజములనే 262 పుటల గ్రంథాన్ని వెలువరించారు. గోల్కొండ సంచిక వారి సహకారంతో 1961లో

శ్రీనాథ భారతం అనే గ్రంథాన్ని నవోదయ సమితినుండి తీసుకురాగా, మూసీ పబ్లికేషన్స్ నుండి 'నా జీవన పథంలో' 1992 కానీ ఈ గ్రంథాన్ని వెలువరించి వాటికి అజ్ఞాత సంపాదకులుగా ఉన్నారు.

గత చరిత్ర నుండి పాఠాలు నేర్చుకోవడం కొత్త ఉత్సాహంతో ముందుకు నడవడం సమాజ ప్రయాణంలో భాగమే. ఈ క్రమంలో శ్రీ బి.ఎన్. శాస్త్రి గారి సాహిత్య అభిరుచి, పరిశోధన కృషిని గుర్తు చేసుకుంటూ సాగటం నేటి మన వికాసానికి ఎంతో అవసరం. ఈ సందర్భంగా సాహిత్య చరిత్రలోని నిక్షిప్తం కాని సత్యాలు ఇప్పటికైనా వెలుగుచూపే ప్రయత్నం సఫలికృతం అయిందని విశ్వసిస్తూ పై గ్రంథాలకు అసలైన సంపాదకులు శాస్త్రిగారే అని నా భావన.

**యడవల్లి సైదులు**
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 70321 88578



# 'మూసీ' సంపాదకీయాలు

పత్రికా నిర్వహణలో తిలకం వంటిది 'సంపాదకీయం'. వేరు వేరు పత్రికలలో వేరు వేరు సంపాదకీయాలు ఉండవచ్చు. సంపాదకుడు, పత్రిక యొక్క వ్యక్తిగత, సంస్థాగత విధానాలకు ఇది ప్రతీకగా ఉంటుంది. కొన్ని చోట్ల పత్రికలోని విషయానికి, సంపాదకీయానికి అనుబంధం ఉండి తీరాల్సిన అవసరం లేదు. ఏదైనా గ్రంథ సంకలనానికి కూడా సంపాదకీయం ఉంటుంది. దానిలో ఆ గ్రంథ సంకలనానికి గల అవసరం, ఆవశ్యకతలను ప్రత్యేకంగా చెప్పడం ఉంటుంది. ఇదే సాధారణ గ్రంథాలలో రచయిత ముందుమాటలుగా కూడా కనిపిస్తున్నాయి.

సంపాదకుడు తన మనోభావాన్ని వ్యక్తీకరించడానికి వినియోగించుకునే పుట సంపాదకీయం. సమకాలీన సమాజాన్ని, జరుగుతున్న మార్పులను, ఏది అందరికీ అవసరమో నొక్కి చెప్పాల్సిన అవసరాలను, ఆ యా పర్వదినాలలో అందించాల్సిన శుభాకాంక్షలను అన్నింటినీ పత్రికా సంపాదకుడు నొక్కి చెప్పే అవకాశం సంపాదకీయంలోనే. ఇది సూటిగానూ ఉండవచ్చు, నర్మగర్భితంగా, ధ్వన్యాత్మకంగానూ ఉండవచ్చు. అది సంపాదకుని ప్రతిభ మీద ఆధారపడి ఉంటుంది. కొన్ని ప్రత్యేక వర్గ పత్రికల విషయంలో వారి వారి మనోభావాలు ప్రత్యక్షంగానే తెలుపబడతాయి. కొన్ని ఆధ్యాత్మిక పత్రికల విషయంలో దైవభావాన్ని అనుసరించే మార్గాలను చెపుతూ ఉపదేశాత్మకంగా ఉంటాయి. మరికొన్నింటిలో వారి వారి మతాలు, దైవాలకు సంబంధించిన విశేషాలను తెలియజేసేవిగా ఉంటాయి. సంపాదకీయాలకు ఇట్లా ఉంటేనే సరియైనది అనే సూచన ఏదీ లేదు.

'మూసీ' మాస పత్రిక ఆగస్టు 1980 న స్వర్గీయ బి.ఎన్.శాస్త్రిగారు ప్రారంభించారు. అది ఆనాటి చారిత్రక అవసరం. 'భారతి' పత్రిక చివరి దశలో ఉన్నప్పటికీ తెలంగాణలో సరియైన సాహిత్య పత్రిక లేకపోవడం వల్ల ఇక్కడి పరిశోధకుల, రచయితల మనోభావాలను పూర్ణంగా వ్యక్తం చేయవలసిన అవసరాన్ని శ్రీ శాస్త్రి గారు గుర్తించారు. ఇది ఆర్థిక, సామాజిక ఇబ్బందులతో కూడుకున్న కార్యక్రమమని అందరికీ తెలిసిందే. అయినా అందరికన్నా విభిన్నంగా, అందరికోసం ఆలోచించే శాస్త్రిగారి మనస్తత్వం నూతన పత్రికా స్థాపనకే మొగ్గు చూపింది. తమ వ్యాసాలు, రచనలు ప్రచురింపబడితే చాలు అనుకునే సమాజంలో అందరి వ్యాసాలకు, రచనలకు తాను వెలుగైనవారు బి.ఎన్.శాస్త్రిగారు.

ఇతర పత్రికల నిర్వహణలో ధనవంతులు ప్రచురణ కర్తగా ఉంటే, ఆలోచనాపరులు సంపాదకులుగా వ్యవహరిస్తుంటారు. ప్రొడ్యూసర్, డైరక్టర్‌ల లేదా కరెస్పాండెట్, ప్రిన్సిపాల్స్‌ల వంటి అనుబంధమే ఇది. కాని ప్రారంభించింది సాహిత్య మాస పత్రిక కావడం వల్ల మరొకరెవ్వరూ తెలిసి చేతులు కాల్చుకోవడానికి సిద్ధపడరు. అందులోనూ ఏదో సాహిత్యం అయితే ఆర్థిక పుష్టి కూడా ఉంటే అవకాశం ఉంటుంది. కాని ఇది తెలుగు సాహిత్యానికి సంబంధించిన పరిశోధనాత్మకమైన పత్రిక. పరిశోధనా వ్యాసాల అవసరం అందరికీ ఉ ండదు. ఇది కేవలం ఈ కందూతి ఉన్న కొద్ది సామాజిక వర్గానికి మాత్రమే. దీనిలోనూ ఎన్నో వర్గ విభేదాలు. వాటన్నింటినీ అధిగమించి, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం ఏర్పరచుకోవాల్సిన అవసరం కూడా సంపాదకునిదే.

మూసీ మాసపత్రిక ప్రారంభించే ముందు శాస్త్రిగారు మూసీ, కాకతి, మునేరు అనే మూడు పేర్లను రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పంపిన ఫైల్‌లో కనిపిస్తుంది. దీనిని బట్టి శాస్త్రిగారి చారిత్రక ప్రీతి, తెలంగాణ ప్రీతి స్పష్టంగా కనిపిస్తుంది. మూసీ మాసపత్రిక గూర్చి ఆయన చాలాసార్లు 'చేతులు కాల్చుకునే పత్రిక' అని చెప్తూండేవారు. అయినా తన చేతులు కాల్చుకున్నా ఎందరో విద్యార్థులు, పరిశోధకులు, రచయితలు, పదోన్నతుల కోసం వ్యాసాలు రాశేవారికి తాను కల్పవృక్షంగా మారారు. వారు స్థాపించిన ఈ పత్రిక ఈనాటికీ అదేవిధంగా కొనసాగడం వారి పూర్వపుణ్య విశేషమే. మరణం తర్వాత కూడా వారి పుణ్యసంపద వల్లనే వారు మనందరి చేతుల్లో ప్రతి మాసం పుస్తక రూపంలో దర్శనం ఇస్తూనే ఉన్నారు.

మూసీ పున: ప్రారంభింపబడినప్పటి (నవంబర్ 1997) నుండి నేను చూసే అవకాశం ఉండడం వల్ల సంపాదకీయాలు కూడా వారు ఎక్కువగా రాయలేదు. నాకే ఆ అవకాశం

ఇచ్చేవారు. కాని 1980 నుండి 1986 మధ్యలో వారే పూర్ణంగా నిర్వహించిన సమయంలో వారి అభిప్రాయాలను సంపాదకీయాల రూపంలో స్పష్టంగా తెలియజేసినారు. వాటిలోని కొన్ని మణులను గూర్చి ప్రస్తావించడం ఈ వ్యాసోద్దేశం.

1980 ఆగస్టు 15లో మూసీ పత్రిక ప్రారంభంలో పత్రిక ప్రారంభోద్దేశ్యాలను తెలియజేశారు శాస్త్రిగారు. 'మూసీ' నదీ వైశిష్ట్యాన్ని తెలియజెప్పిన ఈ సంపాదకీయంలో మూసీ నది వికారాబాద్ అనంతగిరి కొండలలో ప్రారంభమై, ప్రవహించిన మార్గాన్ని, దానిపైన కట్టిన వేరు వేరు వంతెనలను, రిజర్వాయర్లను చెప్తూ చివరకు వాడపల్లిలో కృష్ణానదిలో కలిసిన విధానాన్ని వర్ణించారు. ఈ నది హైదరాబాదునే కాకుండా రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలను పరిపుష్టం చేసినట్లుగా ఇక్కడ ప్రారంభమైన ఈ పత్రిక తెలుగు సాహిత్యాన్ని, సంస్కృతిని, చరిత్రను కూడా పరిపుష్టం చేయాలని వారు ఆకాంక్షించారు.

ఈ ఆకాంక్షలతో కూడుకొని మొదటి సంపాదకీయంలోనే వారి భావాలను స్పష్టంగా వ్యక్తీకరించారు. వారి భావ స్పష్టతకు వారి సంపాదకీయాలు ప్రధాన సాక్ష్యాలు.

"ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి ఋగ్వేద కాలమందే ప్రశస్తి కెక్కినది. ఐతరేయ బ్రాహ్మణములందాంధ్రులు ప్రశంసింపబడినారు. 'ఆంధ్ర ప్రదేశ్' ఆవిర్భవించి ఇరువది నాలుగు సంవత్సరములు గడచినవి. వజ్రోత్సవములు జరుపుటకు మన ప్రభుత్వ మాయత్త మగుచున్నది. కాని ఆంధ్ర ప్రదేశ్‌లోని వివిధ ప్రాంతము లందున్న ప్రజల భావ ప్రపూర్ణ సమైక్యతను, పటిష్టతను పెంపొందించు ప్రయత్నములు, సాహిత్య పరముగా, సాంస్కృతికముగ, సాంఘికముగ సాగినట్లు తోచదు.

చరిత్ర జిజ్ఞాసువులకు తెలంగాణము బంగారు గని వంటిది. ఇచట గల అపూర్వ శిల్ప కళా నిలయములైన దేవాలయములు, తెలుగు జాతికి గర్వకారణము. తెలుగు సరస్వతికి అపూర్వాలంకార శోభితములైన పురాణేతిహాస కావ్య నాటకాలంకార శాస్త్ర గ్రంథములు ప్రచురణ భాగ్యమునకు నోచుకోలేని పరిస్థితిలో నుండి తాళపత్ర గ్రంథ రూపమున దర్శనమిచ్చును. క్రిమికీటకాదుల కాహారముగా నిలిచి యున్నవి.

ఐదుకోట్ల తెలుగువారి సంస్కృతి – చరిత్రలకు సంబంధించిన వివిధ వ్యాసములు, కవితలు, భౌగోళిక చరిత్ర, పుణ్య క్షేత్రములు, ఆధునిక విద్యా వైజ్ఞానిక ప్రగతిని, సాతవాహన, విష్ణుకుండిన, కాకతీయ, గోలకొండ, మహా సామ్రాజ్యములకు పుట్టినిల్లైన తెలంగాణ మండలము సమగ్ర చరిత్ర సంస్కృతి ప్రతిబింబించుచు రచనలను, ప్రకటించుటయే ముఖ్యోద్దేశముగా ఈ పత్రిక ప్రకటింపబడుచున్నది." (మనవి – ఆగస్టు 1980)

తెలుగు సాహిత్య సంబంధమైన అంశాలను తెలియజేయడంతో పాటు తెలంగాణలో పత్రికావసరాన్ని తెలియజేస్తున్న మాటలవి. శాస్త్రిగారి సంపాదకీయాలు తూటాల్లా ఉంటాయి. వారు అన్ని సంచికలలోనూ సంపాదకీయాలు రాయలేదు. కాని రాసిన ప్రతి సంపాదకీయంలోనూ ఏదో ప్రత్యేక విషయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వాన్ని, సాహిత్య అకాడమీలు, భాషా సాంస్కృతిక శాఖలను దేనినీ వదలలేదు. అదేవిధంగా సందర్భోచితంగా గణపతి ఉత్సవాలు, విజయదశమి, దీపావళి వంటి ఉత్సవాలను, వాని విశేషాలను, వాని చారిత్రక, పౌరాణిక ప్రతిపత్తిని కొనియాడారు. శుభాకాంక్షలను అందజేశారు.

శాస్త్రిగారి సంపాదకీయాలలో అక్కడక్కడ ప్రస్తావించిన కొన్ని భావాలను బట్టి వారి భావ తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. వాటిని కొన్నింటిని ఇక్కడ గమనిద్దాం.

"సాహిత్యము ఒక రసవాహిని. ఇది నిరంతరం రస హృదయుల సైకత సీమలను ప్రభావితం చేస్తూ, ప్రజా జీవనాంతర్గత కాలుష్య నివారిణియై, కాలగమనంలో ప్రవహిస్తూనే ఉంటుంది. దానిలోని రసాస్వాదన సాహితీకారుల సమయ స్ఫూర్తిపై, విజ్ఞతపై, సమకాలీన సమ సమాజము లోని మంచి చెడుల, సుఖదు:ఖాల, కలిమిలేముల పరస్పరావగాహనపై ఆధారపడి యుండునని గుర్తింపవలయును." (సాహితీ రసజ్ఞుల ప్రస్తుత కర్తవ్యము - మే 1981)

"పలు విధముల రచనలుత్పత్తి యగుచు, నేటి కాలములో ఏది ప్రోత్సహించదగిన రచనో, ఏది ఆదరణీయమో, ఏది ప్రజాజీవన శ్రేయస్సు నభిలషించు రచనయో, ఏది ప్రాచీనమో, ఏది అర్వాచీనమో తెలియని విధముగా పరిణమించినది. నేడు సాహితీ వేత్తలలో నధిక సంఖ్యాకులు, తాము సృజించు సాహిత్యములో ప్రజల స్థానము ఎంతవరకు గలదని ఆలోచించక ప్రజలలో తమ పేరు ప్రఖ్యాతుల స్థాన మెటువంటిదో అను దృష్టితో నున్నారు. ఇది శోచనీయమైన విషయము" (సాహితీ రసజ్ఞుల ప్రస్తుత కర్తవ్యము - మే, 1981)

"సాంస్కృతికంగా ఆంధ్రదేశము సుసంపన్నమైనది. సాంస్కృతిక సంఘాలు, ప్రభుత్వ సాంస్కృతిక సంఘాలు, ప్రభుత్వ సాంస్కృతిక శాఖలు ఆశ్రిత పక్షపాతానికి నిలయాలు. వాటిని సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నది. తెలుగుదేశం ప్రభుత్వం ఈ సాంస్కృతిక సంస్థలకు స్వస్తివాచకం పలికింది. ఆస్థాన విద్వాంస పదవులను రద్దు పరచింది. ఆస్థాన కవి పదవికి తిలోదకాలిచ్చినది. ఇది తెలుగు సంస్కృతికి మాయని మచ్చ." (రెండు మాటలు - ఆగస్టు 1983.)

"ఆంధ్ర దేశమున పల్లెపల్లెకు ఒక గుడి, చిన్న కోట లేక బురుజు కనిపించును. వివిధ కాలములందు వివిధ వంశపు రాజులు పాలించిన ప్రాంతములందలి శిథిల దేవాలయముల, కోటల, గిరి, స్థల, జల దుర్గముల చరిత్రలను సేకరించి, సమగ్రాంధ్ర చరిత్ర సంస్కృతి రచన గావించవలెను. ఇందుకు గాను గ్రామ సర్పంచు మొదలు రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు శ్రద్ధగా పనిచేసిన రెండు మూడు సంవత్సరములలోను కార్యక్రమము నిర్విఘ్నముగ పరిసమూర్తమగును. గ్రామాభివృద్ధితో పాటు ప్రజలకు దైవభక్తి, సంస్కృతి, నీతి, న్యాయము, విద్య, పురాచరిత్ర విషయములు తెలియునట్లు జేయుట పంచాయితీ పరిపాలకుల కర్తవ్యము. అధికార దుర్వినియోగము, ఆశ్రిత పక్షపాతము, కులతత్వ మీనాడు ప్రబలముగ కనిపించుచున్నది. ప్రాచీన కాలపు పంచాయితీ వ్యవస్థకు నేటి పంచాయితీ పరిపాలనా వ్యవస్థకు హస్తిమశకాంతరమున్నది. నేటి సామాజిక స్థితి గతుల కనుగుణ్యముగ ప్రాచీన పద్ధతులను సంస్కృతిని, విద్యలను మలచుకొని భవిష్యత్తు నుజ్జ్వల మొనర్చుకొనుట ధర్మము" (పంచాయితీ సంస్థల బాధ్యత – జూన్ 1982)

"ఒక కవి కవిత మరియొక కవికి నచ్చదు. ప్రతి కవి తన కవిత నితరులు చదివి తన్నభినందించవలెనని కోరును. పిల్లకవులు పెద్దకవుల ననుకరింతురు. అనాది నుండి సృష్టిలో కవిత్వ మావిర్భవించినదాది ఈ పద్ధతి కొనసాగుచున్నది." (కవులు – ఆర్థిక సహాయము – జులై 19)

"ఆరుకోట్ల జనాభా గల మన రాష్ట్రమున సాహిత్యము సర్వజనామోద మగునట్లుండ వలెను. మాటల వరకు, ఉపన్యాసముల వరకే పరిమితమైన మన పురోగతి కార్యరూపము దాల్చి ప్రజా బాహుళ్యమున కత్యంతోపయుక్త మగునట్లు చూచుట పాలకుల కర్తవ్యము.

కవులకు, రచయితలకు తగిన సహాయ సహకారము లందజేయుట, పదవులందున్న వారి ప్రథమ కర్తవ్యము. ఏ కొందరికో గాక అందరికీ ఆర్థిక సహకార మందించుట మానవత్వమను దానికి సార్థకత చేకూర్చుట వంటిది. అది ఆలోచించదగినది." (కవులు – ఆర్థిక సహాయము – జులై 19)

"ఈ ఇరువది యారేండ్లలో రెండు వేర్పాటు ఉద్యమాలు వచ్చినవి. ప్రత్యేక తెలంగాణ – ఆంధ్ర ఉద్యములు. రాజకీయ నాయకుల స్వార్థపరత్వానికి మచ్చుతునకలు. ప్రజల మారణహోమము ఉద్యమాల ఫలము. సువిశాల భావములు లేని ప్రజాపరిపానము, ప్రజాస్వామ్య పాలన మనబడదు. భావసమైక్యత లేని ప్రజలు కలిసి మనలేరు. ప్రపంచ తెలుగు మహాసభలు జరిపి తెలుగువారి నొకే వేదిక నలంకరింపజేసిన ఫలితమేమిటో

తెలియదు. అంతర్జాతీయ తెలుగుసంస్థ సాధించుకున్న ఘనకార్య మేమిటో అంతుబట్టదు. ఆంధ్ర తెలంగాణ ప్రజలలో ప్రాంతీయ దురభిమాన మంతరించలేదు. ప్రభుత్వ పరిపాలనా లోప మిందులకు కారణము.

ఉద్యోగములు, మంత్రిమండలి, ప్రాంతీయ అభివృద్ధి బోర్డులు, ముఖ్యమంత్రిత్వము, ప్రాంతీయ అసనమానతలు, ఆంధ్ర, తెలంగాణ ఉద్యోగుల సంఘాలు, ద్వేషములు, ఈసడింపులు, వేషభాషలు, ఆచార వ్యవహారములు, పండుగలు, సంపద, అధికారము, గర్వము ప్రాంతీయ దురభిమానమంతరించ కుండుటకు ముఖ్య కారణములు.

అసమానతలకు తావీయక, తెలుగువారు భావ సమైక్యము కలిగి దేశ సంపదను సమానముగా వినియోగించుకొని ప్రాచీన వైభవమును ఔన్నత్యమును తిరిగి పొందుటకు కృషి సలుపుదురని ఆశించుచున్నాను. (ఆంధ్రప్రదేశ్ అవతరణ దినము - నవంబర్ 1982)

"ఆంధ్ర భాష తేనెలొలుకు తీయని భాష. క్రీస్తు శకారంభము నాటికే వాడుక భాష, ప్రజల భాష, దేశ భాష.

హాలుని 'గాధాసప్తశతి' రచనాకాలము నాటికే తెనుగు ప్రాకృత కవితలో స్థాన మాక్రమించినది. క్రీ.వ. 10వ శతాబ్దము నాటికి చోడవంశపు రాజైన నన్నెచోడ మహాకవి 'కుమార సంభవ' మను మహాకావ్య రచన గావించి, ఆంధ్ర భాష కెనలేని మహోపకార మొనర్చిన ధన్యుడు. ఇదే మన సాహితీ చరిత్రలో ప్రథమాంధ్ర కావ్యము. జాను తెనుగులో శివ పార్వతుల చరిత్ర నతి మనోజ్ఞముగా, సుందర తరముగా రసభావ స్ఫోరకముగా రచించి, తెలుగు జాతికి, భాష ఔన్నత్యానికి తరతరాల వరకూ శాశ్వతత్వాన్ని ఆపాదించిన మహాకావ్యము. ఇట్టి మహాకావ్య రచన గావించిన నన్నచోడ మహాకవి మహిమాన్వితుడు. అజరామరుడు." (తెనుగు వాఙ్మయ వికాసము - పునరుద్ధరణ - ఫిబ్రవరి 1981)

"వివాదస్పదమైన గ్రంథములను, కాలగర్భంలో మరగుపడిన వెలికిరాని రచయితల గ్రంథములను, సమగ్ర చారిత్రక పరిశోధనా గ్రంథములను వెలుగులోకి తెచ్చి, వ్రాయించి, పరిష్కరించి, నేటి సాహితీవేత్తలకు గాని, సాహితీ విద్యాసక్తులకు గాని, పరిశోధకులకు గాని, మార్గదర్శక మగునట్లుగా తీర్చి దిద్ది, ప్రచురించవలసిన ఆవశ్యకత, కర్తవ్యము, మరియు నట్టి గ్రంథములను సులభముగా నందరికీ లభ్యమగునట్లు చేయవలసిన బాధ్యత యిట్టి ప్రచురణ సంస్థల, ఎకాడమీల సక్రమ నిర్వహణపై యాధారపడి యున్నదని, యీ బృహత్పథకమునకు సాహితీ ప్రియంభావుకులు యితోధిక సహాయ సహకార సంపత్తుల నందించ వలసిన బాధ్యతను గుర్తించగలరని మనవి. (తెనుగు వాఙ్మయ వికాసము - పునరుద్ధరణ - ఫిబ్రవరి 1981)

ఆలయముల వింత శోభ నేడు మాసిపోయినది. పురాతత్వ శాఖవారు, దేవాదాయ శాఖవారు, ఆధిపత్యము వహించుచున్న ప్రాచీన దేవాలయముల ఉనికి ఊహాతీతము. లక్షల ఆదాయమున్న దేవాలయములను స్వాధీన పఱచుకొని, ఆధిపత్యము వహించి, అధికారము చెలాయించుట, కమిటీలు వేయుట, సభ్యులను నియమించుట, అట్టి ఆదాయము లభించు దేవాలయములనే యుద్ధరింపబూనుట దేవాదాయ శాఖవారి పని. నిధులను జీర్ణ దేవాలయములకు కేటాయించుట వాటి జీర్ణోద్ధరణకు భారీయెత్తున ద్రవ్య సహాయ మొనరించుట కొంతైన శ్రేయస్కరం. ఐనను వెచ్చించిన ధనమునకు తగిన పనితనముగాని, కార్యక్రమ నిర్వహణ గాని, జరిగినదని భావించుట, జరుగుతున్నదని యనుకొనుట ఆకాశ హర్మ్యము. అట్లే పురాతత్వశాఖ వారి మ్యూజియములు, శాసన సేకరణ – ప్రచురణ పద్ధతి తాబేటి నడక కన్న కదు దయనీయముగా నుండుట శోచనీయము. (శిల్ప సంపద – జూన్ 1981)

... ఇంకను మరుగునపడి, చీడపురుగులకు, చెద పురుగుల కాహారము గాక యున్న తాళపత్ర గ్రంథములను, సాహిత్యాభిమానులు, సాంస్కృతిక, సాహిత్య సంస్థలు, ప్రభుత్వ యాజమాన్య సంస్థల నిర్వహణాధికారులు సేకరించి, పరిష్కరించి, ప్రకటించుటకు పూనుకొనిన, శిథిలమగు ఉత్తమ సాహిత్య సంపదను కాపాడి, రక్షించిన వారగుదురు. ప్రతి యాంధ్రుడీ మహత్తర కార్యనిర్వహణమునకు చేయూత నొసంగుట తన విధియని నమ్మి, తాళపత్ర గ్రంథ సేకరణకు, పరిష్కారమునకు, ప్రకటనకు సహకరించుట అవసరము. (తాళపత్ర గ్రంథములు – జులై 1981)

పై సంపాదకీయాలను బట్టి వారి నిశిత దృష్టి, విమర్శ స్పష్టంగా అవగతమవుతుంది. రాసిన సంపాదకీయాలు కొన్ని అయినప్పటికీ వారి అక్షర బాణాలకు పదును ఎక్కువే. కవులకు ఆర్థిక సహాయం కావాలని, ఆస్థాన కవి వంటి పదవుల కొనసాగింపు కావాలని, సరియైన సాహిత్యం సమాజానికి కావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నవారు శాస్త్రిగారు. ప్రాచీన సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక సంపదను ఇటు ప్రజలు, అటు ప్రభుత్వం అందరూ కాపాడవలసిన అవసరాలను నొక్కి వక్కాణిస్తున్నారు.

కౌలాలంపూర్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలను ఆహ్వానిస్తూనే నిర్వహణ లోపాలను ఎత్తి చూపారు. శిల్ప సంపదను కాపాడుకోవలసిన అవసరాలను రెండు మూడు సంపాదకీయాలలో తెలియజేశారు. అంతర్జాతీయ తెలుగు సంస్థ సరిగా పనిచేయడం లేదనే భావాన్ని స్పష్టంగా తెలియజేశారు. కవులు, రచయితల పక్షంలో తాను వాదించారు.

తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, చరిత్ర మహోన్నతమైనవని చాలా సంపాదకీయాల్లో ప్రత్యేకంగా తెలియజేశారు. వాటిని కోల్పోకుండా రక్షించుకోవాలని మరీమరీ తెలియజేసిన విధానం వారి సంపాదకీయాల్లో తెలుస్తున్నది.

ఆంధ్ర ప్రదేశ్‌ను సమర్థిస్తూనే భావ సమైక్యత లేనివారు ఒక దగ్గర ఉండడం వల్ల వచ్చే కష్ట నష్టాలను స్పష్టంగా తెలియజేసిన తెలంగాణవాది శ్రీ శాస్త్రి గారు. పరిశోధనలో వారు ఎల్లలు పెట్టుకోలేదు. శ్రీముఖలింగం, బెజవాడ దుర్గామల్లీశ్వరాలయం, త్రిపురాంతకం మొదలైన దేవాలయ శాసనాలమీద ప్రత్యేక సంపుటాలను వెలువరించారు. ఆంధ్రదేశ చరిత్రలో పూర్తి రాష్ట్ర వివరాలను సమగ్రంగా పొందుపరిచినారు. కాని నిజాం వ్యతిరేక పోరాటాన్ని కూడా చేసినవారు కావడం వల్ల తెలంగాణ భావాన్ని వారెప్పుడూ వీడిపోలేదు. అన్ని ప్రాంతాల నుండి వారికి స్నేహితులు, ఆప్తులున్నారు. అంతేకాదు నిజాం వ్యతిరేక పోరాటంలో అజ్ఞాతంలో ఉన్నప్పుడు వారు పల్నాడు ప్రాంతంలో కొంతకాలం ఉన్నారు.

తెలంగాణ పోరాటాన్ని గూర్చి చెప్పినప్పుడల్లా 40 శాతం వాటా ఇవ్వకపోతే మా ప్రత్యేక తెలంగాణ మాకు కావల్సిందే అని అంటూండేవారు. వారిల్లే చాలావిషయాలకు కార్యశాలగా ఉండేది.

తాను నమ్మిన సిద్ధాంతాన్ని, తాను అనుభవించిన వేదనను, తన జీవిత గమనంలో పరిశీలించిన అంశాలను వేరు వేరు రూపాల్లో వ్యక్తీకరించే అవకాశం రచయితలకు ఉంటుంది. శాస్త్రిగారు సృజనాత్మక రచయిత అయినా ముఖ్యంగా చరిత్ర రచయిత కావడం వల్ల సాధారణ భావాలను చెప్పడానికి అనువైన ప్రదేశం అంతగా వారికి దొరకలేదు. అందువల్ల తను స్థాపించి, నిర్వహించిన పత్రికలో సంపాదకీయాల రూపంలో ఎన్నో విషయాలను తెలియజేశారు. ఇవి రాశిలో తక్కువ అయినా, వాసిలో అత్యంత ప్రామాణికమైనవే. ప్రస్తుత సమాజానికి కూడా అవి స్ఫూర్తిదాయకమనడంలో సందేహం లేదు. వారి భావ స్పష్టతకు నమస్సులర్పిస్తున్నాను.

**డా. సాగి కమలాకర శర్మ**
సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9704 22 77 44



# అనుశాసనం (ఆత్మకథ)

"ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల పట్ల, సహెూద్యోగుల పట్ల, తన కార్యక్షేత్రంలో కృషి చేసేవారి పట్ల, తాను నివసించే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉన్నవారు, స్వార్థపరత్వం లేనివారు, సమాజంలో అందరి శ్రేయస్సు కోరుకునువాడే స్వీయ చరిత్ర రాసుకోడానికి అర్హుడని" – డా. పోరంకి దక్షిణామూర్తి గారి అభిప్రాయం.

జీవిత చరిత్రలు ఎవరి గురించి ఎవరైనా రాయవచ్చు. వాటిలో అతిశయోక్తులకు కూడా అవకాశం ఉంటుంది. కానీ, స్వీయ చరిత్రలు రాసుకునే వ్యక్తులు సాధారణంగా ప్రముఖ వ్యక్తి అయివుండి, సమాజంలో మార్గనిర్దేశం చేసేవారిగా, నలుగురికీ ఆదర్శంగా, మరణించినా జీవించే విధంగా ఉండాలి.

ఒక వ్యక్తి స్వీయ చరిత్రను చదివితే అతడు జీవించి ఉన్న కాలంలో ఉన్న పరిస్థితులు, ఆ వ్యక్తి ఏ రంగానికి చెందుతారో ఆ రంగం యొక్క జ్ఞానం కొంతైనా మనకు కలుగుతుంది. స్వీయచరిత్రలు భావితరాల వారికి పూర్వకాలపు సమాచారాన్నిచ్చే విశేషాల సమాహారంగా చెప్పవచ్చు.

సాహిత్య, రాజకీయ, సాంస్కృతిక, కళా రంగాల్లో విశేషంగా కృషిచేసి, భావితరానికి ఆదర్శంగా నిలిచిన ఎందరో పెద్దలు స్వీయచరిత్రలు రచించి, ప్రచురించారు. కానీ, శాసన, చరిత్ర పరిశోధనా రంగాల్లో స్వీయచరిత్ర రాసుకున్న వారిలో నేను గమనించినంత వరకు శ్రీ గడియారం రామకృష్ణ శర్మ గారిని ప్రథములుగా పేర్కొనవచ్చు. వారి 'శతపత్రం' ఎంతో స్ఫూర్తిదాయకంగా వుండి, అనేక రాజకీయ, చారిత్రక, సామాజిక, ఆధ్యాత్మిక అంశాల అవగాహనకు ప్రమాణంగా నిలుస్తుంది.

ప్రముఖ చరిత్ర శాసనపరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులైన బి.ఎన్.శాస్త్రి గారు వారి జీవితంలో జరిగిన అనుభవాలు, అనుభూతులు, సంఘటనలు, కుటుంబ పరిస్థితులు, బాల్యంలో వారి జీవన విధానం, పరిశోధనా రంగంలో వారు చేసిన పరిశ్రమ, ఎదుర్కొన్న సవాళ్లు, ఆర్థిక ఒడిదుడుకులు, ప్రముఖులతో పరిచయాలు, సాహిత్య, చరిత్ర మిత్రులతో జరిపిన చర్చలు – ఈ అంశాలన్నింటినీ స్పృశిస్తూ, "ఐదు లాంగ్ నోటు పుస్తకాల్లో" ఆత్మకథగా రాసుకున్నారు. వాటి ఆధారంగానే శాస్త్రిగారు పేర్కొన్న ముఖ్య సంఘనలు, విశేషాలను స్పృశిస్తూ నా వ్యాసాన్ని కొనసాగిస్తాను.

శాస్త్రిగారు 1932లో జన్మించారు. అప్పటి నుంచి వారికి గుండె సంబంధ వ్యాధి వచ్చేంత వరకు (1994 జనవరి) సుమారు 62 సంవత్సరాల స్వీయ జీవితచరిత్రను రాసుకున్నారు.

వీరి ఆత్మకథ 'ఇంద్రపాల నగర' వర్ణన తో ప్రారంభమైంది. విష్ణుకుండినులు అంటే తనువెల్లా పులకరించే శాస్త్రి గారు తెలంగాణలో వారి తొలి రాజధాని అయిన ఇంద్రపాల నగరానికి చరిత్రలో అగ్రస్థానం కల్పించారు. కాకతాళీయంగా ఆ గ్రామం శాస్త్రిగారి మాతామహుల ఊరు.

ఆంగీరస సంవత్సర మార్గశిర శుద్ధ త్రయోదశి స్థిరవారం కృత్తికా నక్షత్ర ప్రథమ పాదంలో మాతామహుల ఇంట్లో జన్మించినట్లు పేర్కొని మాతామహుల రెండు తరాలు (పల్లి,గోటూరి), పితామహుల రెండు తరాలు (భిన్నూరి) వంశావళిని రాసుకున్నారు. శు ద్ధ శ్రోత్రీయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన వీరి పెద్దతాత వేంకటప్పయ్య గారు మంత్రశాస్త్రవేత్త. ఊళ్లో వైద్యం చేస్తూ, శుభకార్యాలు చేయిస్తూ అందరికీ అండగా నిలిచేవారని పేర్కొన్నారు.

ఆర్థికంగా చాలా ఉన్నత స్థితిలో వున్న వీరి కుటుంబం ఆస్తి వ్యవహారాల పంపకాల్లో సర్వం కోల్పోవాల్సి వచ్చింది. ఆ కాలంలో వారికి రెండు 'ఖాదం' గుర్రాలు, ఒక 'ఫోర్డ్' కారుండేవని రాసుకున్నారు. పరివారానికి జీతాలివ్వడానికి ఈ కారును అమ్మాల్సి వచ్చిందని ఆత్మకథలో పేర్కొన్నారు.

వీరి వీధిబడి విద్య వెలువర్తిలో బుచ్చిరంగయ్య పంతులు గారు నిర్వహించే బడిలో సాగింది. తర్వాత వెల్వర్తిలో కొంతకాలం ఇంటివద్ద ఖాళీగా వుండాల్సి వచ్చింది. ఆ సమయంలో వారి తాతగారి వద్ద సంధ్యావందనం, నిత్యకర్మానుష్ఠానాలు నేర్చుకొని, వాటిని శ్రద్ధగా ఆచరించేవారు. ఒక ఆరు మాసాలు సుంకిశాలలో చదువుకున్నారు. ఈ

సమయంలోనే వారికి ఎనిమిదవ యేట ఉపనయన సంస్కారం అంగరంగ వైభవంగా జరిగినట్లు పేర్కొన్నారు.

సెలవు రోజులు, పండుగ రోజుల్లో స్నేహితులతో కలిసి గ్రామం బయట వున్న వేంకటేశ్వరాలయ ఆవరణలో కబడ్డీ, చిర్రగోనె, చెండాట వంటి ఆటలాడేవారు. ఆ సమయంలో ఆలయంలోని కోనేరులో పడిన బంతిని తేవడానికి వెళ్లి అక్కడ వున్న శిలా ఫలకాన్ని చూసి, దానిమీదున్న అక్షరాలను చదవడానికి ప్రయత్నించి, విఫలమై, ఈ సంఘటన మనసులో చెరగని ముద్ర వేసినట్లు వారి రచన ద్వారా తెలుస్తుంది.

**ఈ సంఘటనే శాస్త్రి గారిని శాసనపరిశోధనాసక్తుడిగా మలచింది.**

**ఈ సంఘటనే చరిత్రలో మహోన్నత విష్ణుకుండిన ఖ్యాతిని వెలికి తీయడానికి కారణమైంది.**

**ఈ సంఘటనే వేల గ్రామాలు తిరిగి, వందల శాసనాలకు ఊపిరిపోసింది.**

**ఈ సంఘటనే శాస్త్రి గారి పరిశోధనా స్థాయిని నిర్ణయించింది.**

**ఈ సంఘటనే కొన్ని వేల పుటలు రచించడానికి ప్రేరకమైంది.**

**ఈ సంఘటనే శాస్త్రి గారి జీవన పోరాటానికి శ్వాస అయ్యింది.**

**ఈ పరిశోధనా పోరాట పటిమ వారి ఆరోగ్య నిర్లక్ష్యానికి కారణమై, నూతన విషయావిష్కరణల ముందు చిన్నబోయింది.**

శాస్త్రిగారు భువనగిరిలో మిడిల్ హైస్కూల్ విద్య పూర్తి చేసుకున్నారు. అయితే ఆరో తరగతి పరీక్షల్లో ఫేయిల్ కావడంతో బంధువులందరి మధ్యలో చదువురాని వారిగా గుర్తింపబడి, చిన్నబోయి, కుమిలి పోయినట్లు రాసుకున్నారు. ఆయుర్వేద విద్యను చదువుకోవాలనే ఆసక్తి వున్నా, స్వగ్రామం విడిచి వెళ్లడానికి శాస్త్రి గారి అమ్మగారు సుతారమూ ఒప్పుకోలేదు. తర్వాత భువనగిరిలో ఆరో తరగతి పూర్తి చేసిన తర్వాత సెలవుల్లో వీరి వివాహం మేనమామ నారాయణ శాస్త్రి గారి కూతురు, అనంతలక్ష్మితో జరిగింది. వివాహ సమయంలో మామ గారు కట్నం ఇవ్వలేదు కానీ, మెట్రిక్ వరకూ చదివిపిస్తానని ఒప్పుకున్నారట. అంతేకాకుండా నెలకు 15 కిలోల బియ్యాన్ని పంపేవారని తెలుస్తుంది. ఏడో తరగతి మూడు మాసాలు గడిచిన తర్వాత భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. రెండు వందల యేండ్ల ఆంగ్లేయ పాలన నుండి విముక్తి లభించింది. కానీ, నిజాం రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛ కరువైందని ఆవేదన కనిపిస్తుంది.

శాస్త్రి గారు ఆత్మకథ రాసుకున్న ఈ క్రమంలో అప్పటికి అంటే 1947 కు పూర్వం నిజాం రాష్ట్ర పరిస్థితులు, ఆ ప్రజల స్థితిగతులు, పక్క రాష్ట్రాల పాలకులతో ఉన్న అనుబంధం, భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి ఈ ప్రాంతంలో జరిగిన కృషి, ఉద్యమానికి అణగదొక్కడానికి నిజాం ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు వంటివి విపులంగా కళ్లకు కట్టినట్లుగా ఆత్మకథలో నిక్షిప్తమైనాయి.

ప్రజలకు ఉద్యమ స్ఫూర్తిని కలిగించడానికి, వారిని ఉద్యమంలో భాగస్వాములను చేయడానికి షబ్నవీసు వెంకట రామారావు గారు తెలంగాణలో మొట్టమొదటి పత్రిక 'నీలగిరి'ని 24-8-1922 లో స్థాపించినట్లు, అదేవిధంగా సురవరం ప్రతాపరెడ్డి గారు గోలకొండ పత్రికను 10-5-1926లో ప్రారంభించిన విషయాలను పేర్కొన్నారు. అయితే ఆ కాలానికి శాస్త్రి గారు ఇంకా జన్మించలేదు. కానీ, ప్రాంతీయ అస్తిత్వం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై జరిగే పోరాటంలో భాగస్వామి కావాలన్న ప్రగాఢ సంకల్పం వారిని పూర్వ చరిత్రను స్మరించుకునేట్లు చేసింది.

రావి నారాయణ రెడ్డి గారి అధ్యక్షతన 1944 లో జరిగిన ఆంధ్ర మహాసభలో 11 సంవత్సరాల ప్రాయంలో పాల్గొన్నట్లు. ఆ తర్వాతి కాలంలో వారి నేతృత్వంలోనే ఉద్యమంలో చురుగ్గా పాలుపంచుకున్నట్లు తన రచనలో పేర్కొన్నారు. శాస్త్రి గారి పెద్దబావ (అక్క భర్త) వర్కుడ్‌పల్లిలో ఉండేవారు. ఆయన కమ్యూనిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాలుపంచుకునేవారు. వారికి తోడుగా ప్రత్యక్షోద్యమంలో శాస్త్రి గారు కొంతకాలం పనిచేశారు. కార్యక్షేత్రంలో వడిశెలు తిప్పడం, తుపాకీలు గురితప్పకుండా పేల్చడం, వాటికి కావల్సిన తూటాలను రూపొందించడం వంటివి నేర్చుకున్నారు. ఒక్క గంటలో రావి నారాయణరెడ్డి గారి రివాల్వరుకు సరిపోవునట్లు నున్నటి బండ మీద తూటాలను అరగదీసి ఇచ్చినట్లు రాసుకున్నారు.

రావి నారాయణరెడ్డి గారికి నాయకుల నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఆదేశాలొచ్చాయి. ఆ ఆదేశాలను అనుసరించి **"మేము 17-10-1947 న గుండ్రాంపల్లి క్యాంపును ముట్టడించాం. గాఢ నిద్రలో వున్న రజాకార్లను, మా రాకను గమనించిన కాపలాదారు మేల్కొలిపినాడు. వారందరూ లేచి ఆయుధాలు చేపట్టు లోపల మేమంతా చుట్టుముట్టినాం. ఇద్దర్ని నారాయణ రెడ్డి రివాల్వరుతో కాల్చి చంపినాడు. ఆయుధాలు ధరించిన నలుగురు రజాకార్ల నుండి తుపాకులు, ఛోటేమియా బావమరిది రసూల్ నుండి రివాల్వర్ గ్రహించినాము. కత్తులు, తల్వార్లు స్వాధీనపరుచుకొని అచటి నుండి ముందుకు బయల్దేరినాము."** అని ఉ ద్యమంలో వారి ప్రత్యక్ష అనుభవాలకు అక్షరరూపం ఇచ్చారు.

ఈ విధంగా నిజాం వ్యతిరేకోద్యమంలో భాగంగా అనేక కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ఒకటి రెండు సార్లు జైలు జీవితాన్ని కూడా చవిచూడాల్సి వచ్చింది. ఈ విధంగా చదువు మాని ఉద్యమంలో ఉండటం వల్ల వారి అమ్మగారికి నచ్చక వారి పుట్టింటి తరపు ఆంధ్రప్రాంతం పల్నాడులోని తక్కెళ్లపాడులో బంధువుల వివాహ నెపంతో శాస్త్రి గారిని తీసుకొని వెళ్లారు. ఈ సమయంలో శాస్త్రిగారు ఎంతో ఉక్రోశం చెందినట్లు రాసుకున్నారు.

నిజాం రాష్ట్రంలో జరుగుతున్న పోరాటాలను, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఏవిధంగా జనరల్ చౌదరి ఆధ్వర్యంలో హైదరాబాదుపై పోలీసు చర్యను నిర్వహించారో, నిజాం ఏవిధంగా భారత సైన్యాలకు లొంగిపోయాడో తదితర సంఘటనలను ప్రత్యక్షంగా వీక్షించి, వాటిని ఆత్మకథ ద్వారా మనకు దృశ్యమానం చేశారు. 1948 లో నిజాం రాష్ట్రం భారతదేశంలో విలీనమైన తర్వాత తిరిగి సొంతూరికి వచ్చారు. అప్పుడు వారి అసలైన జీవన పోరాట పయనం ప్రారంభమైంది. ఈ పోరాట సమయంలో వారు చూసిన సంఘటనలు, ఆయా రంగాలకు చెందిన వ్యక్తులు వారి వారి క్షేత్రాల్లో, వారి వారి పరిధుల్లో జరిపిన పోరాట విధానం, ప్రజల ఆకాంక్ష పోరాట యోధులకు వారందించిన సహకారం సందర్భానుసారంగా రాసుకున్నారు.

నిజాం వ్యతిరేక పోరాట సమయంలో కమ్యూనిస్టు నాయకులపై ప్రజలకున్న విశ్వాసం, దేశ్‌ముఖ్, దేశ్‌పాండే, జాగీర్దార్లపై ఉన్న వ్యతిరేకతలను ప్రత్యక్షంగా గమనించి, తరువాతి కాలంలో శాస్త్రి గారు 'విప్లవ జ్వాల' నవల రూపంలో చిత్రీకరించారు. ఈ నవలలోని సంఘటనలు వారి స్వీయానుభావాలుగా చెప్పుకోవచ్చు.

9, 10 తరగతులు చదవడానికి హైదరాబాదు వచ్చి పరిచయస్థుల సహాయంతో చిన్న రూం కిరాయికి తీసుకొని 9 పాసైనారు. 10వ తరగతి చదివించడానికి మామగారు సహకరించలేదు. తండ్రిగారు కూడా స్వగ్రామం రమ్మని ఒత్తిడి చేసినారు. కానీ పైసలు లేకున్నా, ట్యూషన్‌లు చెప్పి స్కూలు ఫీజు కట్టి పట్టుదలతో 10వ తరగతి పాసైనారు. కాచీగూడలోని ఎగ్బోటేగారి సహాయంతో స్కూలులో ఉద్యోగం సంపాదించినారు. ఆ విధంగా కొన్నినాళ్ళు ప్రశాంతంగా ఉద్యోగజీవితం గడిపినారు. కానీ ఉన్నత చదువులు చదవాలనే కోరిక మనసులో బలంగా ఉంది. తోటి ఉపాధ్యాయుల సలహాతో ఎఫ్.ఏ. ఉర్దూ మీడియంలో చదివినారు. ఆంధ్ర గర్ల్స్ హైస్కూల్‌లో 1954-55లో టీచర్ ట్రైనింగ్ పూర్తయినట్లు తెలుస్తుంది.

ఈ సమయంలోనే శాస్త్రిగారిలో ఉన్న సృజనాత్మక రచయిత మేలుకొన్నారు. ట్రైనింగ్ కాలంలో రెండునాటికలు పుస్తకం పేరుతో అపోహ, రెండునాటికలు ప్రింటు చేశారు.

పుస్తకావిష్కరణ కూడా చాలామంది పెద్దల సమక్షంలో జరిగింది. విశేషమేమంటే ఈ రెండు పుస్తకాలను శాస్త్రిగారి గురువుగారైన ఖండవల్లి లక్ష్మీరంజనంగారు సమీక్షించారు. అది శాస్త్రిగారికి ఒక ప్రత్యేక సంఘటనగా గుర్తుండిపోయినట్లు రాసుకున్నారు.

రచయితగా తరువాత నీరాజనం, రాధ, సంధ్యారాగం, తీరిన కోరిక వరుసగా ఇంకా కొన్ని నవలలు, నాటికలు, గేయ నాటికలు, గేయ కావ్యాలు రచించినట్లు సందర్భానుసారంగా పేర్కొన్నారు. బి.ఎ. పాసైన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగులో చేరి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఆ రెండు సంవత్సరాల్లో వీరు ఖండవల్లివారి పర్యవేక్షణలో రెండు పుస్తకాలకు సంపాదకులుగా ఉండి 'మన చరిత్ర – సంస్కృతి', 'శ్రీనాథభారతం' ప్రచురించినట్లు ఆ సమయంలో తోటి విద్యార్థులు, జూనియర్లు వారి సహకారం, వారిమధ్య ఉండే పోటీతత్త్వం, ఆచార్యుల ప్రోత్సాహం, వారి సూచనలు తదితర విద్యాసంబంధమైన అంశాలను ఎంతో ప్రత్యేకంగా పేర్కొన్నారు.

శాస్త్రిగారి విద్యా సంబంధమైన వ్యాపకం ఒకవైపు, కుటుంబ జీవన విధానం ఒకవైపు రెండూ సమాంతరంగా జరుగుతూ ఇరువైపులా ఒత్తిడిని ఎదుర్కొన్నారు. హైద్రాబాదులో నివాసం ఉండడం వల్ల ఊర్లనుండి ఆరోగ్య సమస్యలతో వచ్చే బంధువులు ఎక్కువగా శాస్త్రిగారి ఇంటికే వచ్చేవారు. వారికి కావలసిన భోజన సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ఆర్థికపరంగా పటిష్టంగా లేరు. అయినా వచ్చినవారిని ఏమాత్రం చిన్నబుచ్చేవారు కాదు. కొన్నిసార్లు వారిని దగ్గరుండి డాక్టరు వద్దకు తీసుకువెళ్ళ వలసి వచ్చేది. అంతేకాక ఇంట్లో సంతానం కూడా చిన్నపిల్లలు వారికి మొదటగా ఒక అమ్మాయి పుట్టి అనారోగ్యంతో మరణించింది. తర్వాత ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు 1956 –71 మధ్య జన్మించినట్లు రాసుకున్నారు.

ఎం.ఏ. పూర్తయిన తర్వాత శాసనాల మీద వున్న ఆసక్తితో డా. పల్లా దుర్గయ్య గారి పర్యవేక్షణలో 'శాసనాలలో తెలుగు భాషా పరిణామం' అన్న అంశం మీద పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించారు. కారణాంతరాల వల్ల వారి సిద్ధాంత వ్యాసం అంగీకరించబడలేదు. తిరిగి రాయమంటే సైద్ధాంతిక విలువలను తగ్గించలేక శాస్త్రిగారు సిద్ధాంత వ్యాసాన్ని తిరిగి సమర్పించలేదు. ఇక్కడితో వారి పేరుకు ముందు డాక్టరేట్ లేక డాక్టర్ కాని పరిశోధక శాస్త్రి అయ్యారు.

కుటుంబ పోషణ కొరకు పది సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పనిచేశారు. తెలుగు శాఖలో పరిశోధన చేస్తున్న సమయంలోనే పూర్తి స్థాయిలో శాసనాల పరిశోధనకే పూర్తి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇల్లు గడవడానికి ఆర్థిక వనరులు

ఎంతో అవసరం. అందుకే, వారు అనేక రకాల వ్యాపకాలను ఏర్పర్చుకున్నారు. నాగార్జున బుక్‌డిపో, ప్రింటింగ్ ప్రెస్ నిర్వహణ, గ్రామపంచాయతీలకు స్టేషనరీ పంపిణీ వంటి కార్యకలాపాలతో తమ కుటుంబ పోషణను సాగించేవారు. ఆర్థిక స్థితి కొంత మెరుగుపడిన తర్వాత బుక్‌షాప్ ప్రారంభించి, నిర్వహించినారు. ఈ క్రమంలోనే శాసన పరిశోధన రంగంలో శాస్త్రి గారి పేరు చిరస్థాయిగా నిలిపిన రెండు ముఖ్య తామ్ర శాసనాలు లభించాయి. 'భారతి'లో వారు ప్రచురించిన శాసనాలకు సంబంధించిన వ్యాసం శాసన పరిశోధకులను కుదిపివేసింది. శాస్త్రి గారి పరిశోధనా ఫలాలను ఎవరూ అంగీకరించలేదు. అనేక వాదోపవాదాల తర్వాత వారి పరిశోధనలోని సత్యసంధతను గుర్తించి, అంగీకరించారు.

డాక్టర్ మట్టి చెన్నారెడ్డి గారి పరిచయంతో గ్రామ పంచాయతీలకు స్టేషనరీ పంపిణీ చేసే క్రమంలో తెలంగాణలోని వేల గ్రామాలు తిరిగే అవకాశం లభించింది. అలా తిరుగుతున్నప్పుడే కొన్ని వందల శాసనాలు వారి కంట పడినాయి. వాటిమీద వారికి వున్న ఆసక్తితో ఆయా ప్రాంతాలలో లభించిన శాసనాల ఆధారంగా సమగ్ర చరిత్ర నిర్మాణానికి ఓ ప్రణాళికను వేసుకున్నారు. ఒక శాసనం ఏవిధంగా తీసేవారో వారి మాటల్లోనే...

**"ఆ ఆలయాల ఆవరణలో ఒక నల్లని శిలా స్తంభంపై మూడు వైపులా తెలుగు శాసనములు ఒకవైపు, మహా సర్పం చెక్కబడి వున్నది. ఆ శాసన శిలను కడిగి, బ్రష్‌లతో మురికిని తొలగించి పరిశుభ్రం కావించి, చాక్‌పీసులను తడిపి, శాసన శిలపై రుద్ది తడిబట్టతో తుడిచినాము. అక్షరములలో నిండిన చాక్‌పీసు పొడిని, పచ్చి బట్టతో తుడిచినాము. శాసనాక్షరంలో స్పష్టంగా కనిపించినవి. ఆ మూడు శాసనముల ఛాయాచిత్రాలను తీసినాము. మహానాగ చిత్రమును ప్రతిబింబముగా గ్రహించినాము".**

ఈవిధంగా వారు శిలాశాసనాలను వెలికితీసేవారు. ఒక శాసనం తీయడానికి ప్రతిసారీ వారివెంట ఒక బకెట్, రెండు బ్రష్‌లు, కొబ్బరి చీపుర్లు, బట్టలు, చాక్‌పీసులు, తట్ట, పార, ఫొటోగ్రాఫర్, సహాయకులు, కారు, డ్రైవరు.... ఉండేవారు. ఇట్లా వారి జీవితంలో సింహభాగం శాసన పరిశోధనలోనే గడిపినారు. శాసన ప్రతిబింబం తీసుకొచ్చిన తర్వాత వాటి పరిష్కరణ ముఖ్య ఘట్టం. శాసన ప్రతిబింబాన్ని భూతద్దంలో చూసి, ఆ శాసనం ఎన్ని పంక్తుల్లో వుందో పరిశీలించి, ప్రతి పంక్తిలోని అక్షరాలను రాసుకునేవారు. ఒక్కో శాసనాన్ని పరిశీలించేటప్పుడు చారిత్రకంగా బేరీజు వేసుకునేవారు. ఇదంతా వారి ఆత్మకథలో విపులంగా రాసుకున్నారు.

పొద్దునంతా... ఇతర కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండటం వల్ల వీరి రచనా వ్యాసంగం అంతా రాత్రిపూటే ఎక్కువగా జరిగేది. ఈ క్రమంలోనే వారు అనేక విలువైన పుస్తకాలను

ఒంటిచేత్తో రచించి, 'వాకింగ్ ఎన్‌సైక్లోపీడియా'గా గుర్తింపబడ్డారు. ఈ రచనా వ్యాసంగం, శాసనాల సేకరణ, అందులో ఎదుర్కొన్న తీవ్రమైన ఇబ్బందులు, పుస్తకాల ముద్రణకు పడ్డ ఆర్థిక కష్టాలు తత్సమానంగా ఇంట్లో పిల్లల పెళ్లిళ్లు, సొంత ఇంటికై చేసిన అప్పులు అన్నీ కూడా వారి శాసన పరిశోధనా యజ్ఞానికి ఏమాత్రం ఆటంకంగా భావించేవారు కాదు.

కుటుంబంలో నలుగురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు ఉన్న కారణంగా సంపాదనా భారం మొత్తం వారి మీదే ఉండేది. ఎవరు ఏది అడిగినా కాదనకుండా, ఎందుకు అని ప్రశ్నించకుండా వారి అవసరాలను తీర్చేవారు. ఎక్కడి నుంచి డబ్బు తెచ్చేవారో ఎవ్వరికీ తెలియనిచ్చేవారు కాదు. సాహిత్యాభిమానులు, రచయితలు, చిన్నచిన్న పుస్తకాలు ప్రచురించుకుంటే వారికి ఇతోధికంగా ఆర్థిక సాయం చేసేవారు.

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గారితో వీరికున్న గాఢమైన అనుబంధం గురించి పేర్కొంటూ... చెన్నారెడ్డి గారు మద్రాసు గవర్నరుగా ఉన్న సమయంలో వారి ఆరోగ్యం క్షీణించింది. ఆ సమయంలో వారి ఇంటిలో రెడ్డి గారి పేరుమీద వారం రోజుల పాటు క్రమం తప్పకుండా ఏకాదశ రుద్రాభిషేకం చేయించి, ఆ తీర్థాన్ని ప్రతిరోజూ వారికి కొరియర్‌లో పంపించేవారు. ఇంతటి గౌరవానికి ఒక బలమైన కారణం వుంది. అదేమంటే... చెన్నారెడ్డి ఆదేశాల మేరకే తెలంగాణ జిల్లాలోని మొత్తం గ్రామ పంచాయతీలకు మెటీరియల్ పంపిణీ చేసే అవకాశం శాస్త్రి గారికి లభించింది. ఆ పనిమీద తిరుగుతున్న సమయంలోనే తనకు ఇష్టమైన శాసన శిలలు కంటబడి, వాటిని పరిశీలించి, పరిశోధించే అవకాశం లభించినట్లు రాసుకున్నారు.

శాస్త్రి గారి వ్యక్తిత్వం వారి ఆత్మకథలో మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. చిన్నవారిని కూడా 'గారు' అని సంబోధించేవారు. ఇంటికి ఎవరొచ్చినా ఛాయ్, కాఫీ, టిఫిన్స్, భోజనాలు... ఇలా వారి అవసరాలను తీర్చిన తర్వాత మాత్రమే వారిని సాగనంపేవారు. అన్నిటికంటే ముఖ్యంగా పరిశోధక విద్యార్థులు విషయపరంగా సందేహ నివృత్తికి వచ్చినపుడు, వారి సందేహాలను తీర్చేవారు. ఆక్రమంలో పరిశోధక విద్యార్థులు శాస్త్రి గారి పుస్తకాలను కొనుక్కుంటామంటే మాత్రం వారికి పుస్తకాల సెట్టును మారు ఆలోచించకుండా ఉచితంగా ప్రేమతో ఇచ్చేవారు.

తాను పరిశోధించిన అంశాలను పుస్తక రూపంలో ప్రచురించి, లోకానికి అందించి **"వాటిని విక్రయించి తద్వారా వచ్చిన సొమ్ము సరస్వతి దేవీ కటాక్షం వల్లనే"** కాబట్టి ఆ సొమ్ము సద్వినియోగం కావాలన్న తలంపుతో వారి స్వగ్రామమైన వలిగొండలో 'హరిహర త్రిశక్తి క్షేత్రం' నిర్మించాలని సంకల్పించుకున్నారు. ప్రత్యేకంగా ఒక ఎకరం స్థలం కొని,

1980లో పుష్పగిరి పీఠాధిపతి గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. క్షేత్ర నిర్మాణానికి తగిన వనరులను సమకూర్చుకునే క్రమంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎవరి నుండీ ఆర్థిక సహాయాన్ని కోరనట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రాంతంలో సాహిత్య, చారిత్రక, సాంస్కృతిక అంశాల నూతన ఆవిష్కరణలకు సరైన మాధ్యమం లేదన్న భావం వారిలో బలంగా వుండేది. 'భారతి' సాహిత్య మాసపత్రిక కూడా క్రమంగా కనుమరుగయ్యే స్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో 'మూసీ' అనే మాస పత్రికకు బీజావాపనం జరిగింది. 1980 ఆగస్టు 15 న మొదటి సంచిక వెలువడింది. నిర్విఘ్నంగా ఆరు సంవత్సరాలు కొనసాగించారు. శాస్త్రి గారు పరిశోధనా రచనలో వ్యస్తులైన కారణంగా పత్రిక ప్రచురణ నిలిచిపోయినట్లుగా తెలుస్తుంది.

అనేక చారిత్రక గ్రంథాలు, శాసన సంపుటులు, జిల్లా సర్వస్వాలు రచనా నిర్మాణ క్రమంలో, వయస్సు పైబడటంతో అలసిన శరీరం, పనిభారాన్ని తట్టుకునే శక్తి సన్నగిల్లింది. అయినా, లెక్క చేయకుండా పనిభారాన్ని తగ్గించుకోకుండా శ్రమించడం వల్ల షుగర్, కిడ్నీ సమస్యలు, హృదయ సంబంధ వ్యాధులకు గురికావాల్సి వచ్చింది. హార్ట్ స్పెషలిస్ట్ డా. దయాసాగర్ రావు గారిని బి.ఎన్.శాస్త్రి గారు సంప్రదించినంత వరకూ వారి ఆత్మకథను రాసుకున్నారు. ఆ తర్వాత వారు రాయగలిగే స్థితిలో లేని కారణంగా వారి జీవిత కాలంలోని చివరి ఆరు సంవత్సరాల జీవన స్థితిగతులు ఆత్మకథలో చేరలేదు.

భవిష్యత్తులో ఒకవేళ వీరి ఆత్మకథను ప్రచురిస్తే వారిని ప్రత్యక్షంగా గమనించిన కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సహకారంతో ఆ ఆరు సంవత్సరాల సంఘటనలు ఆత్మకథలో చేర్చే ప్రయత్నం చేస్తాం.

పిల్లల పెళ్లిళ్ల బాధ్యతలు పూర్తయిన తర్వాత 1997లో మూసీ పత్రిక పునః ప్రారంభమైంది. శాస్త్రి గారి స్నేహితుడు నిర్వహిస్తానని అన్నవారు నాలుగైదు నెలలు మాత్రమే పత్రికను బయటికి తీశారు. తరువాత తమవల్ల కాదన్నారు. ఆ సమయంలో పత్రిక నిర్వహణ బాధ్యతను చిన్నల్లుడు, చిన్న కూతురుకు అప్పగించారు. అప్పటి నుంచి వారి సంకల్ప బలంతో 2019 డిసెంబర్ 10 వరకూ మధ్యలో ఒకటి రెండు సంవత్సరాలు మినహాయించి నిరాటంకంగా సాహిత్య పాఠక లోకానికి 'మూసీ' ప్రవహిస్తూనే వుంది.

**డా. భిన్నూరి మనోహరి**

ప్రస్తుత గ్రంథ సంపాదకులు, శాస్త్రి గారి కుమార్తె.

ఫోన్ : 934 797 1177

## శ్రీ బి.ఎన్. శాస్త్రి గ్రంథ సూచి

### సర్వస్వములు

1. నల్లగొండ మండల సర్వస్వము - 1986
2. ఆదిలాబాదు జిల్లా సర్వస్వము - 1990
3. మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వము - 1993
4. రెడ్డిరాజ్య సర్వస్వము - 1998
5. బ్రాహ్మణరాజ్య సర్వస్వము - 2000

### శాసన సంపుటములు

1. శాసన సంపుటి - 1974
2. త్రిపురాంతక దేవాలయ శాసనములు - 1984
3. కందూరి చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతి - 1984
4. బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసనములు - 1985
5. ముఖలింగ దేవాలయ చరిత్ర - శాసనములు - 1985
6. చెఱకురెడ్డి వంశ చరిత్ర - శాసనములు - 1989
7. గోలకొండ చరిత్ర - సంస్కృతి - శాసనములు - 1989
8. రేచర్ల రెడ్డివంశ చరిత్ర - శాసనములు - 1989
9. రేచర్ల పద్మనాయకులు 1991
10. కాయస్థరాజులు - 1991
11. వేములవాడ చరిత్ర - శాసనములు 1994
12. మల్యాల వంశ చరిత్ర - శాసనములు 1994

### చరిత్ర

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - 1975
2. ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి - 1వ భాగం - 1990
3. ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి - 2వ భాగం - 1990
4. ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి - 3వ భాగం - 1990

భారతదేశ చరిత్ర - సంస్కృతి (1-21 భాగాలు)

1. వేద యుగం - 1992
2. మౌర్య యుగం - 1992
3. గుప్త యుగం - 1992
4. చాళుక్య యుగం - 1992
5. ప్రతీహార యుగం - 1992
6. కాకతీయ యుగం - 1992
7. ఢిల్లీ సుల్తానుల యుగం - 1 - 1994
8. ఢిల్లీ సుల్తానుల యుగం - 2 - 1994
9. విజయ నగర యుగం - 1994
10. దక్కన్ సుల్తానుల యుగం - 1995
11. మొగలు యుగం - 1 - 1999
12. మొగలు యుగం - 2 -1999
13. రాజపుత్ర యుగం - 1999
14. మరాఠా యుగం - 1999
15. బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ యుగం - 1 -1999
16. బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ యుగం -2 - 1999
17. మహా విప్లవ యుగం - 1999
18. వైస్రాయ్‌ల యుగం - 1, 1999
19. వైస్రాయ్‌ల యుగం - 2, 1999
20. సాంస్కృతిక పునరుజ్జీవన యుగం - 1999
21. సంస్థానాలయుగం - మొదటి భాగం - 1999

విమర్శ గ్రంథాలు

1. కాశీఖండం - దాని ప్రాశస్త్యము - 1974
2. శాసనములలో తెలుగు భాషా పరిణామము (అముద్రిత సిద్ధాంత ప్రతి)

## సృజనాత్మక సాహిత్యం

**నవలలు :**

1. రాధ 2. తీరిన కోరిక - 1962 3. జీవనపథం 4. పరివర్తన 5. జీవితం - గమనం 6. సంధ్యారాగం 7. విప్లవజ్వాల - 1986 8. తుక్కాదేవి 9. వాకాటక మహాదేవి - 1986

**నాటికలు / గేయనాటిక**

1. సహకారం - 1970 2. గ్రామజీవనం - 1961 3. కిరాయిదారు 4. రెండు నాటికలు - 1961 5. నీరాజనం (గేయనాటిక)


**గేయకావ్యం / బాలగేయకావ్యం**

1. తపోభంగం - 1960 2. పాపాయి పతకం - 1963

**జీవిత చరిత్ర**

1. పులిజాల రంగారావు జీవిత చరిత్ర - 1999

జయంతి తే సుకృతినో రససిద్ధా: కవీశ్వరా:
నాస్తి తేషాం యశ: కాయే జరామరణజం భయం



# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.

**ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....**

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

**State Bank of India, Nallakunta Branch,**

**A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083**

**రండి ... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.**

## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

**సెల్ : 9160797933, 9347971177, 9704227744**

**Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com**

# మూసీ

సాహిత్య, సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక

**2-2-1109/బికె, ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్-500 013.**

Email : editormusi@gmail.com

## చందా వివరాలు

| | | |
|---|---|---|
| విడిప్రతి | - | 20-00 |
| సంవత్సర సభ్యత్వం | - | 250-00 |
| శాశ్వత సభ్యత్వం | - | 2500-00 |

State Bank of India, Nallakunta Branch,

A/c. No. 52019740642, IFSC Code : SBIN0020083

Telangana Tourism



**Sri K.Chandrashekar Rao**
Hon'ble Chief Minister
Govt. of Telanagana



**Dr. V.Srinivas Goud**
Hon'ble Minister for Prohibition & Excise, Sports & Youth Services, Tourism & Culture & Archaeology
Govt. of Telanagana







## TARIFFS :

- Hyderabad - Somasila - Srisailam - Hyderabad : **Rs. 2900/-** (Adult) and **Rs. 2320/-** (Child) which includes transportation by Non-AC Hitech Coach from Hyderabad to Somasila & Srisailam to Hyderabad, Boating from Somasila to Srisailam, Veg. Lunch on Boat, non-AC accommodation at Srisailam.
- Somasila to Srisailam and back to Somasila by Cruise (Boat) : **Rs. 2100/-** (Adult) and **Rs. 1680/-** (Child). Fare includes Veg. Lunch on Cruise and non-AC accommodation at Srisailam.
- Somasila to Srisailam by Cruise (one-way) or Srisailam to Somasila (one-way) by Cruise: **Rs.900/-** (Adult) and **Rs. 720/-** (Child). Fare includes Veg. Lunch on Cruise







**PROPOSED VIEW OF IT INCUBATION TOWER, MAHABUBNAGAR.**

ISBN : 978-81-937842-7-3
9 788193 784273

378